Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాస ప్రభాకరము

(వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్యాసాలు)

ఆంధ్ర సారస్వతపరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Samaj Foundation Chenn

omain. Gurukul Kangri Co

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

गुरुकुल कांगड़ी विश्वविद्यालय, हरिद्वार
कृपया पुस्तक के ऊपर कोई निशान आदि
न लगायें।

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri D6836.

पुस्तकालय
गुरुकुल काँगड़ी विश्वविद्यालय, हरिद्वार

वर्ग संख्या.........आगत संख्या...............

पुस्तक-वितरण की तिथि नीचे अंकित है। इस तिथि सहित २० वें दिन तक यह पुस्तक पुस्तकालय में वापिस आ जानी चाहिए। अन्यथा १० पैसे के हिसाब से विलम्ब-दण्ड लगेगा।

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాస ప్రభాకరము

(వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్యాసాలు)

DONATION

पुस्तकालय

6836

ఆంధ్ర సారస్వతపరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Vyasaprabhakaramu— A Collection of literary essays by Sri Veturi Prabhakara Sastri

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : 1990

వెల : రూ. 36

ముద్రణ :-
యస్.వి.ప్రింటర్స్,
గాంధీనగర్, హైదరాబాద్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తొలి పలుకు

తెలుగు పరిశోధన రంగంలో వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అగ్రేసరులు. వారు కావించిన పరిశోధన బహుముఖీనమైనది. మార్గ సాహిత్యం, జానపదదేశి సాహిత్యాలు, భాషాశాస్త్రం, ప్రాచీన శాసనాలు, ప్రాచీన గ్రంథ పరిష్కరణ, సంకలన గ్రంథ ప్రచురణ మొదలైన వివిధ ప్రక్రియల్లో శాస్త్రిగారు శాస్త్రీయపద్ధతితో మౌలికమైన పరిశోధన చేసి ఎన్నో వినూత్న విషయాలను సాహిత్య లోకానికి తెలియజేసినారు. నలభై ఐదు సంవత్సరాల తమ వాఙ్మయ జీవితంలో శాస్త్రిగారు వివిధ విషయాలపై అమూల్యమైన ఎన్నో విమర్శ వ్యాసాలు రచించినారు. ఈ వ్యాసాలన్నీ ఆనాటి భారతి, శారద, ఆంధ్రపత్రిక (ఉగాది సంచికలు, సారస్వతాను బంధం), గృహలక్ష్మి, త్రిలింగ, శశిరేఖ, కృష్ణాపత్రిక, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక మొదలైన ప్రసిద్ధ పత్రికలను అలంకరించినవి. శాస్త్రిగారు రాసిన విమర్శ వ్యాసాలు సాహిత్యానికేకాక శాసనాలు, చరిత్ర, భాషమొదలైన వివిధ విషయాలకు సంబంధించినవి. ఇన్ని విభిన్న ప్రక్రియల్లో ప్రామాణికమైన విమర్శను వెలయించిన ఖ్యాతి ప్రభాకరశాస్త్రిగారికే దక్కుతుందనడం సత్యోక్తి. శాస్త్రిగారికే దక్కుతుందనడం సత్యోక్తి. శాస్త్రిగారుఆంధ్ర కల్పవృక్షాన్ని గురించి రాసినా, ఆంధ్ర మహాభారతాన్ని గురించిరాసినా వారి మౌలిక పరిశోధనప్రతిభ వ్యక్తమౌతుంది.

ప్రభాకరశాస్త్రిగారు తెలుగు సాహిత్యంపై రచించిన విమర్శ వ్యాసాలలో కొన్నింటిని గ్రంథరూపంగా ముద్రించవలెనని ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్ణయించి, శాస్త్రిగారి సాహిత్యాన్నంతా వెలుగులోకి తేవడానికి కృషి చేస్తున్న వారి కుమారులు ఆచార్యవేటూరి ఆనందమూర్తిగారిని ప్రచురింపవలసిన వ్యాసాలనన్నీ కూర్చి ఈయవలసిందిగా కోరడమైనది. వారు ఏరికూర్చి ఇచ్చిన వ్యాసాల సంకలనమే ఈ 'వ్యాస ప్రభాకరం! వారికి పరిషత్తు పక్షాన కృతజ్ఞతలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ గ్రంథంలో మొత్తం ముప్పై రెండు విమర్శ వ్యాసాలు ఉన్నాయి. "ప్రాచీన సంస్కృత రూపకములు" (పుట 236-244) అన్న ఒక్కవ్యాసం సంస్కృత సాహిత్యానికి సంబంధించింది. తక్కినవన్నీ- ఒకటి రెండు మినహాయిస్తే- ప్రాచీన తెలుగు సాహిత్యానికి సంబంధించినవే. ఇంచు మించుగా ప్రాచీన తెలుగు సాహిత్యంలోని అన్ని యుగాలకు సంబంధిచిన అంశాలు ఈ వ్యాసాల్లో పరిశీలింపబడ్డవి. ప్రతి వ్యాసంలోను శాస్త్రిగారి ప్రతిభ ద్యోతితమౌతుంది.

ప్రభాకరశాస్త్రిగారి వ్యాసాలను ఈ గ్రంథరూపంలో ముద్రించడానికి అవకాశం కలిగించిన 'ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు' వారికి- ముఖ్యంగా ఆచార్య వేటూరిఆనందమూర్తిగారికి పరిషత్తు పక్షాన కృతజ్ఞతలు.

ఈ గ్రంథ ముద్రణకు మూడువేల రూపాయల ఆర్థిక సాహాయ్యాన్ని అందించి సహకరించిన శ్రీ మధుసూదనరావుగారికి పరిషత్తు పక్షాన కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని సాహితీ ప్రియులు, పరిశోధకులు, భాషాభిమానులు ఆదరిస్తారని ఆశిస్తాను.

ఆర్. శ్రీహరి.

9.3.1990

కార్యదర్శి

ఆంధ్రసారస్వత పరిషత్తు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయసూచిక

ఆంధ్రవాఙ్మయము-పురాణయుగము	1-8
ఆంధ్రమహాభారతప్రశంస- భావగాంభీర్యము	1-15
ఆంధ్రమహాభారత ప్రశంస-నీతినిధి	16-22
వినోదవిమర్శనము	23-35
మహనీయ కవిత్రయము-నన్నయ	36-43
ఆంధ్రమహాభారత ప్రశంస-తిక్కన	44-51
ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము	52-68
పండితారాధ్య చరిత్రము	70-77
వేములవాడ భీమకవి	77-82
శివకవులు	83-82
నన్నిచోడుడు	93-117
పండితారాధ్య చరిత్రము	118-129
రంగనాథుని శివకవిత్వము	130-153
వశియోగసారము-అవతరణిక	154-160
అధ్యక్షోపన్యాసము	160-181
భృంగపంచకము	182-186
అన్నమయ్య	186-189
కృష్ణరాయల విద్యాగోష్ఠులు	190-197
ఆంధ్రప్రబంధ కవితా ప్రశంస	198-207
పెద్దన మనుచరిత్ర కథారసౌచిత్యము	208-216
ప్రాచీనాంధ్ర వచన కావ్యములు	217-235

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రాచీన సంస్కృత రూపకములు	236-244
భాగవతము	245-255
నారాయణ తీర్థులు	256-259
త్యాగరాజు	260-268
శతావధాని వెంకటశాస్త్రి	269-275
కవితాపారమ్యము	276-280
ఆంధ్రకవిత-పురాణయుగము	281-304
ఆంధ్రకవిత-ప్రబంధయుగము	305-314
వేములవాడ భీమకవి	315-321
మను చరిత్ర	322-330
రెడ్డిరాజులు-ఆంధ్రభాషా సేవ	336-355

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రవాఙ్మయము–పురాణయుగము

వేటూరి ప్రభాకరశాస్త్రి

పురాణముల రచనమూ, ఆ రచనముల చెల్లుబడీ, ప్రబలముగా సాగిన కాలఖండమును పురాణయుగమని వర్తమానులు వ్యవహరించుచున్నారు. అటువంటి కాలఖండములను యుగములనుటకంటె శకములనుట వ్యవహారార్థానుగుణమనుకొంటాను. ఇట్లు మార్చితే పురాణశకము, ప్రబంధశకము అని కానీ, మఱొకవిధమున కవులనుబట్టి పేర్కొంటే నన్నయశకము తిక్కనశకము అని కానీ అనడ మవుతుంది. అందఱూ ఇప్పుడు 'యుగ'మనే వ్యవహరిస్తున్నారు గాన నేనూ అలాగే అంటున్నాను. ఆంధ్ర పురాణ రచన సంస్కృత పురాణ రచనానుసారిగా సాగినది గాన ఆంధ్ర రచనా పద్ధతిని వివరించడానికి ముందు సంస్కృత సంప్రదాయానుస్మరణము కొంత ఆవశ్యకమే అవుతుంది. సంస్కృత పురాణములు తద్రచనాకాలము నాటి విద్వద్విజ్ఞానమునకు సర్వస్వములు. వేదములలో సర్వవిద్యలూ అంకురప్రాయములుగా ఉండగా పురాణములలో అవి కొంత కొంత విరివిగా వెలసెననవచ్చును. "సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ, వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్" అని సృష్టివిధము, ప్రళయముల తీరు, రాజవంశముల చరిత్రలు, మన్వంతర కథలు మహర్షుల చరిత్రలు మొదలగు వానితో పురాణములుండునని లక్షణము ఉన్నా పురాణములలో ఇంకాయెన్నో దేశచరిత్రలు వైద్యము, జ్యోతిషము, నీతి, ధర్మ కామశాస్త్రములు, వ్యాకరణాలంకారసాహిత్యాది శాస్త్ర సంప్రదాయములు మొదలయినవి కొంత కొంత సంగ్రహముగానూ, కొన్నిచోట్ల విరివిగానూ కూడా వర్ణితములై ఉన్నవి. అగ్ని పురాణములో వ్యాకరణము, వైద్యము, జ్యోతిషము మొదలయిన వెన్నో ఉన్నవి.

ఇట్టి పురాణములు సంస్కృతభాషాసూత్ర పరిజ్ఞానముగల జన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సామాన్యమునకు కూడా అర్థము కాదగినట్లు సులభ భాషలో ప్రాయికముగా సులభమైన అనుష్టుప్ఛందస్సులో తేలిక వాక్యాన్వయములతో తేటగా ఉండును. వ్యాసుల వారి రచనలలో తఱచుగా 'చ, వై, తు, హి' అని పాద పూరణపు పొల్లు పదములున్నవి అనికూడా పండిత పరిహాస మున్నది. పురాణ సామాన్యరచన ఇట్లా ఉంటుందనడము సంగతమేకాని, కొన్నిపట్లు పురాణము లలోనివే, సంప్రదాయ పరిజ్ఞానము లేనిచో ప్రౌఢ పండితులకు కూడా కొఱకరాని కొయ్యలు, ఉక్కు సెనగలు, అనదగినవిగా ఉన్నవి. పురాణము లలోనికెల్లా భారత భాగవతములు, రామాయణము ప్రధానమయినవి. రామా యణ భారతములు కావ్యేతిహాసములనబడినను, పురాణములని కూడా సామాన్య వ్యవహారమున్నది. తెలుగున అవి పురాణములే అంటున్నాము. ఉక్కు సెనగలు పై మూడు గ్రంథములలోనూ, అందులో మఱీ భారత మునా, ఉన్నవి. భారతములోని ఉక్కుసెనగలకు వ్యాసఘట్టములని పేరు. మచ్చు చూపుతున్నాను.

పశ్యః పశ్యతి పశ్యన్త మపశ్యన్తం చపశ్యతి.
అపశ్యస్తావ (త్వాద?) చక్షుష్టావ్ పశ్యా పశ్యా నపశ్యతః.
చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవచ,
హూయతేచ పునర్ద్వాభ్యాం సమే విష్ణుః ప్రసీదతు.

ఈవిధముగా పురాణములు వివిధ విషయములతో వివిధ రచనలతో అరణ్యములవంటివై ఉండును. అర్వాచీనములయిన కావ్యనాటక ప్రబంధాది రచనలు పురాణారణ్యములనుండి ఉద్ధరించి సేకరించి తీర్చిదిద్ది నాటిన యుద్యానములవంటి వనదగును. పురాణములలో కావ్యనాటక ప్రబంధాది రచనల పొలుపులు సుకుమారదృశ్యములై ఉండునుగాని, కావ్య నాటకాదు లలో పురాణ రచనములలోని శాస్త్రాంశ భీకర దృశ్యములుండవు. ఇటు వంటి సంస్కృత పురాణ ఫక్కి ననుసరించి తెలుగు పురాణ రచన వెలసి నది. నన్నయ మొదలుకొని శ్రీనాథునిదాక గల కవుల యాంధ్రగ్రంథ రచన పురాణయుగ రచన యనదగినది. ఆ కాలమున ప్రాయికముగా ఆంధ్ర మున పురాణ రచనలే వెలసినవి. కవిత్రయము, మారన, పాల్కురికి సోమ నాథుడు, భాస్కరాదులు, నాచనసోమన శ్రీనాథుడు, పోతన పురాణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవులలో ప్రధానులు.పురాణకవి రచనల గూర్చి ప్రసంగించేటప్పు డీ యందర విషయమూ రావలసినదే అయినాముందు ముఖ్యులయిన భారత కవిత్రయము వారిని గూర్చి మాత్రమే యిప్పుడు ప్రసంగించుచున్నాను.

నన్నయరచన :—వ్యాసకృతిని మహాభారతమును నన్నయ యిన్ని లక్షణములు గలదానినిగా వర్ణించినాడు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని కవివృషభులు మహా కావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని యైతిహాసికు లితిహాసమనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని మహిఁగొనియాడుచుండ
వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁడాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండఁజేసె భారతంబు.

ఇట్టి సంస్కృత భారతమును,

సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుడయ్యె జగద్ధితంబుగాన్.

నన్నయపై తీరున సర్వశాస్త్రార్థ కలితముగానే కాక భారతమును ప్రసన్న రచనతో మహాకావ్య లక్ష్యముగాఁగూడ తెనిగించిన ట్లేర్పడును. కనుకనే యాతనికి వాగనుశాసన బిరుదము కల్గెను. సంస్కృతమున పురాణములూ, కావ్యనాటకాదులూ అన్నీ వెలసినపిదప, ఉపక్రమించినది కావడము చేత తెలుఁగు పురాణ రచన, తనలోనే సంస్కృత సర్వకావ్య రచనాచమత్కారములూ ఇముడ్చుకోవలెననే యత్నముతో సాగినది. ప్రాచీనుడు గణపతి దేవుడనే కవి "ఆంధ్ర కావ్యపథము దీర్చిన నన్నయభట్టుఁగొలుతు" నన్నాడు. నన్నయ భారతము చదివితే అందులో భాషాకవితా లక్షణ పరిష్కారములను ప్రయత్న పూర్వకముగా నన్నయ లక్ష్యీకరించినట్లు కాననగును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణు నట్లు వాణసధరామర వంశ విభూషణంబు నా
రాయణభట్టు వాఙ్మయ ధురంధరుఁ డీ కృతి కిష్టుఁడున్ సహా
ధ్యాయుఁడునైన వాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగాన్.

ఈ పద్యము ద్వితీయ తృతీయ చరణములందు నారాయణపదము "ర" యతి ఖండాఖండములుగా స్వరవ్యంజనములతో రెండు దెఱగుల నుంచుట లక్షణ విశేష నిరూపణార్థముగదా! ఇట్టివెన్నేని విశేషాంశములను నన్నయ రచనలో చూపవచ్చును.

శరత్సమయమున సరాళముగా సమప్రదేశమున ప్రవహించు తెలినీటి తేటవాకవలె నన్నయ రచన సుప్రసన్నమై చాటుమాటులు లేనిదై కరతలామలకముగా తనలోగల సర్వార్థములను ప్రవ్యక్తముగా గుర్తింపనిచ్చునదై సుఖప్రవేశమై సుస్వాద్యమై నిర్వక్రగతితో నెగడుచుండును. వ్యాసభారత రచనలో 'చ, వై, తు, హ,' లున్నట్టు అక్కడక్కడ నన్నయ రచనలో 'మానుగ, పాయక, పర్వగ, ఇమ్ముల' మొదలగు పాదపూరణపు పొల్లు పదము లుండును. గ్రంథగ్రంథులు నన్నయ్య రచనలో నుండవు. నన్నయ్య శయ్యవంటి పురాణశయ్య, కావ్యగౌరవము గలది, భాగవతకర్త కొక్కనికే తక్క మఱి యితర పురాణ యుగాంధ్ర కవుల కెవ్వరికిని దక్కలేదు. నన్నయ్య పురాణ శయ్యా సౌభాగ్యమునకు లక్ష్యము నొక్క గీతపద్యమును వినిపింతును.

ఎల్లవారు నెఱుఁగ నొల్లని ధర్మువు
బేల నీకుఁ దెలుపనేల వలసె ?
చిఱుతవానికింత చఱువంటి పలుకులు
వన్నె వృద్ధజనము లున్న చోట

నన్నయ్య తర్వాత భారత రచనమును బూరించిన తిక్కన సోమయాజి నన్నయ రచనమును దిన్నగా నెఱిగినవాడే అయినా నన్నయ్య శయ్యాసౌభాగ్యమును ప్రసన్నతను, పాటింపక, సంస్కృత భారతపు వ్యాస ఘట్టములను బోలిన గ్రంథగ్రంథుల నధికముగాఁ గూర్చి కవితామర్మముల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నధికముగా జొప్పించి పురాణరచనా సౌలభ్యమును గోల్పడినాడు. వర్షా సమయమున నొడుదుడుకు నేలలనుండి సుడులు దిరుగుచు మడుగులు మాటులు గలిగి లోతు తెలియనీయని కలక నీటి పోటుతో ప్రతి పదమును జాగ్రత్తవహించిన గాని దాట వీలుగొల్పని వక్రగతులతో సాగు గంభీర నదీప్రవాహమువలె తిక్కన రచన మప్రసన్నమై వెనుకకు ముందుకు దిరుగు వాక్యోపవాక్యములయు, కారకాన్వయములయు కౌటిల్యముతో ఇంక నిందేమి విశేషము గలదో యని సహృదయులు ప్రతిపదము సందేహముతో ఆచి యాచి చూచి చూచి మఱీ చదువవలసిన తీరున చిక్కులు గొల్పుచు జిగిబిగితో నుండును. ఇది పురాణ ఫక్కికాదు. మఱి దివ్యకావ్యఫక్కి. కవితామర్మ మిం దెక్కువ. వక్రోక్తులు, అర్థాలంకారములు, వ్యంగ్యము నిం దధికముగా నుండును. ఇందుకు లక్ష్యము నొక్క గీతపద్యమును జదువుచున్నాను. విరాటపర్వ ద్వితీయాశ్వాసమున కీచకుడు ద్రౌపదిపై తమక మాపుకొనలేక నీచవాంఛను వావిడిచి వెల్లడించినాడు. అప్పు "డబ్బోటి కలుషించియు దుర్వారంబైన పరిభవవికారంబు దోపనీయక వెరవుతోడన తప్పించుకొనవలయునని" యిట్లన్నది.

చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడుఁ
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ
వట్లు గాకయు హీనవంశాభిజాత
నైన పతిపత్ని నగు నన్ను నడుగఁదగునె.

అన్నా! కీచకా! సత్పురుషులు పరస్త్రీల నిట్లు కోరవచ్చునా? అంతే కాక ఆడుతోడుగలవాడు మఱీ జాగ్రత్తగా నుండవలెనుగదా! నీవు సజ్జనుడవు సుదేష్ణవంటి యాడుతోడుగలవాడవు నీవిట్టి చెట్టవలుకులు వలుకరాదే! ఇట్లు కోరగూడమికి నీ యోగ్యతాంశము లివి రెండేకాదు. మఱి నా యయోగ్య తాంశములును రెండున్నవి, నేను హీనవంశ సంజాతను, మగనాలను; ఉన్నత వంశముగర్హించుననీ, ఆడుతోడు చెడనాడుననీ అక్కడకూడ నీగతి పట్టవచ్చుననీ, నీ విషయమున నీవు వెఱవవలెను. నా విషయమున గూడ, నీచజాతిదనీ, మగ డెఱిగిన దండించుననీ నీవు వెఱవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వలెను. అని సామాన్యముగా తోచు బాహ్యార్థము. ఇక్కడ లోతయిన యర్థాంతరము నున్నది. మరల పద్యము చదివి యీ యర్థము వివరింతును.

చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడుఁ
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ
వట్లుఁగాకయు హీన ! వంశాభిజాత
నయిన పతివత్ని నగు నన్ను నడుగఁదగునె ?

సజ్జనుడు ఆడుతోడుగలవాడు, ఇట్టి మాటలాడడు. ఇట్టి చెట్టలాడు చున్నావుగాన నీవట్లుగాక దుర్జనుడవు, ఆడుతోడు లేనివాడవు నయితివి ! నాకు సజ్జనతాపేక్షలేదు ఆడుతోడు కలిమి నేను పాటించువాడనుగాను ! అందువేమో ! (సుదేష్ణ వీనికిఁ దగిన యాడుతోడే తన పాడునడత కామెను గూడ తోడు పఱచుకొన్నాడుగదా !) అయితే నీవట్లగుదువుగాక ! హీన! ఓరి నీచుడా ! వంశాభిజాతను ! పవిత్ర క్షత్త్రియవంశజాతను ! యజ్ఞాగ్ని సంభూతను ! అయిన పతివత్నిని అఖండపరాక్రము లయిన భర్తలుగల దానను నన్ను నటరా నీవు కోరునది ! నావంశపు యోగ్యతను, భర్తల యోగ్యతను దెలియక వదరుచున్నావు. యీ రెండు యోగ్యతలు నిన్ను నాశ పఱుపగలవురా ! అని యర్థాంతరము ! పాఠకులు పై రెండర్థములలో కీచక సైరంధ్రీ పాత్రములను జూచి సాధారణముగా తొలి సువ్యక్తార్థమును సైరంధ్రిలోదాగియున్న ద్రౌపదీపాత్రను గుర్తించి లోతుగారెండవ యంత రార్థమునుగ్రహింపగల్గుదురు. లోతుగాయోచింపజాలనివారు తొలియర్థమునే గ్రహింతురు. కీచకుడు మదన పిశాచగ్రస్తుడై యాత్రపాటుతోనున్నాడుగాన ద్రౌపది నెఱుఁగడు గాన తొలియర్థమునే గ్రహింపగల్గెను. సైరంధ్రిలో దాగియున్న ద్రౌపది తాను భావించునది రెండవ గంభీరార్థమునే ! తిక్కన యీ రెండర్థముల ననుగతపఱిచి శ్లేష ధ్వన్యర్థ చమత్కారముతో పద్యము గూర్చినాడు. పయిపద్యమున 'అయిన పతివత్ని' ననుచోటను, 'అడుగఁదగునె' అనుచోటను, అర్థ విశేషములున్నవి. (అయిన యింటివారు, ఇత్యాదులు చూచునది) అయిన = చెల్లివచ్చిన, ప్రఖ్యాతిగాంచిన-భర్తలుగలదాననీ,- (అటువంటి వారి విషయమై అడిగేదేమిటి - ఇత్యాదులుచూచునది.) ప్రశ్న స్మరణమే చేయరాని దాననని- అర్థవిశేషములు. ముద్రణములం దీపద్య మిట్లున్నదిగాని యిందు తిక్కన కూర్పు కొంత మార్పు చెంది ఉంటుందను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొంటున్నాను. 'అట్లుఁగాకయు' అనుచోట, అట్లు తర్వాతి సముచ్చయపుట రనున్న - 'కాకయు' అనుచోటి 'యు' స్వారస్యమును సంపాదింపగల్గియే యున్నది. ఇక 'యు' వ్యర్థము. తిక్కన "అట్లుఁగాక యోహీన" అని రచన చేసియుండును. తొలి యర్థమును-అట్లుఁగాక-అయో-హీనవంశాభిజాతను, అనీ, రెండవయర్థమున-అట్లుఁగాక-ఓహీన ! అనీ భేదము నసిపడుతుంది.

క. అని వీడఁగఁ బల్కిన న
మ్మనుజాధముఁ డంతఁబోక మదనోన్మాదం
బునఁ దన్ను నెదిరి నెఱుఁకక
వనితకు నిట్లనియెఁ గౌరవంపుఁ బలుకుల౯.

తర్వాతి యీపద్యములో దన్ను నెదిరిని-పాదప్రహారము చేయుదానిని ద్రౌపదిని అనియు కవి పొసగించినాడు. ఇట్లు తిక్కన భారత పురాణ రచనమున ప్రబంధ ఫక్కితో వక్రోక్తి చమత్కృతులు శ్లేషభంగులు, అనన్వయాభాసములు గడుసు పొసగింపు కూర్పుతీర్పులు లెక్కకు మిక్కిలి యయి యున్నవి. అత్యంతశ్రద్ధతో పరిశీలింపగా ఒక్క విరాటపర్వ ద్వితీయాశ్వాసముననే ఎన్నో శబ్దార్థచమత్కారములు ప్రస్తుతపు ముద్రణములలో వ్రాతలలో అపరిశీలితములుగా చెడిపోయినవి చక్కబఱుపవలసినవని, గానవచ్చినవి. వాటినన్నిటిని వేఱొకచో వెల్లడింపపలెను.

ఎఱ్ఱాప్రెగ్గడ రచన.

కవిత్రయములో మూడవవాడగు నెఱ్ఱాప్రెగ్గడరచన భారతరచనలో మాత్రము నన్నయ తీరునే వెన్నాడినది. హరివంశమును నన్నయప్రసాద గుణమును, స్వీకరించి దేసి తెలుగుపలుకు పొలుపులు వెలయగా చక్కని పురాణ శయ్యతో రచించినాడు. పూర్వ హరివంశము అయిదవ యాశ్వాసమున నుండి తుదిదాక నున్న పట్టు ఆంధ్రపురాణయుగ వాఙ్మయమున ముచ్చట్లమూట. అందు శ్రీకృష్ణుని బాల్య క్రీడ లతిమనోజ్ఞముగా వర్ణితములయినవి. దానిని జదువునపుడు శ్రీకృష్ణునితో మనముగూడ నాటలాడుదుము. చల్దు లారగింతుము. రెండు గీతపద్యములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముదముతోఁ గడుసునకుఁబెట్టి మూతి జిడ్డు
మోమునను మేనఁజమరి యమ్ముదిత యక్కు-
గలయ నివిరి 'యేనఁగుదిన్న వెలఁగపండు'
నాఁగ నొప్పఁ గృష్ణుఁడు చారునయనుఁ డగుచు.
వెన్నవెట్టెర మాడు మాయన్నయన్న
మువ్వలును మొలగంటలు మొరయనాడు
నచ్యుతుడు గోపికలు తమయాత్మ భ్రమసి
పెరుగు దరువను మఱచి సంప్రీతిఁజూడ.

ఈతని కాలముననే నాచనసోమనకూడ నుత్తర హరివంశమును రచించెను గాని యది పురాణశయ్యగలదిగాదు. తిక్కన మర్మకవితకంటె మఱీ ముదురుపాకమున వెలయించిన ప్రౌఢప్రబంధ ఫక్కి గలదియది. నన్నయ తిక్కనాదులు ఆశ్వాసాది పద్యములను జక్కని కందపద్యములతో గూర్పగా నీతడుక్కుగుండ్లనదగిన కందపద్యముల నతిగూఢ మర్మ కవితతో కూర్చినాడు. ఈతడు పురాణ యుగకాల కవియైనను దివ్యకావ్యకర్త యనదగినవాడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రమహాభారత ప్రశంస-
భావగాంభీర్యము

ఆంధ్ర మహాభారతపు కవిత్రయమువారిలో తొల్తిటివాడు నన్నయ, తాను—

భాసుర భారతార్థముల భంగుల నిక్కమెఱుంగ నేరమిం
గానట బీసటే చదివి గాథలు త్రవ్వు తెలుంగు వారికిన్
వ్యాసముని ప్రణీత పరమార్థ మెఱుంగగ-

జేయ వలెనన్న పూన్కితో

సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తిలో

నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింప....గాదన రచనము నిర్వర్తించినాడు అక్షర రమ్యత, శయ్యా సౌభాగ్యము, ప్రసన్న కథా కవితార్థయుక్తి అతని రచనలో కుదుర్కొన్నవి. ఎంత లోతయిన భావము నయినను, ఎంత గంభీరమయిన యర్థము నయినను, నాతడు అక్షర రమ్యత గల తన ప్రసన్న కవితలో ప్రవ్యక్తముగా సుగోచరమగునట్లు చేయగలిగి నాడు. శరత్సమయమున సరాళముగా సమ ప్రదేశమున ప్రవహించు తెలినీటి తేటవాకవలె నన్నయ రచన సుప్రసన్నమై, చాటు మాటులు లేనిదై, కరతలామలకముగా తనలోగల సర్వార్థములను ప్రవ్యక్తముగా గుర్తింప నిచ్చునదై సుఖప్రవేశమై సుస్వాద్యమై నిర్వక్రగతిలో నెగడుచుండును. గ్రంథగ్రంథులు నన్నయ రచనలో నుండవు. నన్నయ శయ్యవంటి పురాణ శయ్య, కావ్యగౌరవము కలది. భాగవత కర్త కొక్కనికేతక్క మఱి యితర పురాణయుగాంధ్ర కవుల కెవ్వరికిని దక్కలేదు.

సంస్కృతమున పురాణరచన ప్రాయికముగా కారకాన్వయ కౌటిల్యము లేక, సామాన్యమయిన సంస్కృత భాషాజ్ఞానము గలవారికి గూడ సులువుగా నర్థము చేసికోదగిన తీరులో నుండున గాన నన్నపార్యుని రచ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నము తదనుసారిగానే సాగినది. అతని రచనలో కథాప్రసన్నత ప్రధానము. కవితా శిల్ప వైచిత్ర్య మప్రధానము. సంస్కృతమున, పురాణకావ్య నాటక గద్య గేయాది రూపమున సాహిత్య వికాసము సంపూర్ణముగా సాగిన పిదప నారంభమయిన దగుటచే నాంధ్రపురాణరచన తనలో శక్యమయినంత వఱకు సర్వసాహిత్య వికాసమును సమకూర్చుకోవలె నన్న కుతూహలముతో గూడ గొనసాగినది. కాని నన్నయాంధ్రీకరణమున కవితాశిల్పకల్పనలునున్నను వానికంటె ప్రసన్న కథా కవితార్థయుక్తికే ప్రాధాన్యము గానవచ్చును. అర్థము గంభీరము, చమత్కార కలితము నయినను ప్రవ్యక్తముగా నుండుట నన్నయకవితలోని సౌభాగ్య విశేషము. ఇందుకు తార్కాణగా రెండు మూడు పద్యములు వినిపింతును.

రాజసూయ మహాధ్వరము జరుగునపుడు భీష్ముడు ధర్మరాజుతో అఖిలలోక పూజ్యు నచ్యుతు పూజింపు మనగా శిశుపాలుం డుపాలంభనపరుం డయి యధోక్షజు నాక్షేపించుచు ధర్మరాజున కిట్లనుచున్నాడు—

అవనీనాథు లనేకులుండగ విశిష్టాచార్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వురుండగ ధరిత్రీనాథ! గాంగేయ దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుడే.

ఈ పద్యమున ననుప్రాసము, నక్షరసౌభాగ్యము, శయ్య యొయ్యార మును మాత్రమేకాక దాశార్హుడు - పల్లెలు బోయలు మొదలగు వారికి దగినవాడు, వారితో విహరింపదగినవాడు లేక భృత్యతకు, నౌకరీకి, తగిన వాడు శ్రీకృష్ణుడు పూజార్హుడగునా యనియు నాక్షేపము. దాశార్హ పదము నకు రెండర్థములున్నవి. పల్లెకారీలకు దగినవాడనియు, నౌకరీకి తగినవాడ నియు చెడ్డ యర్థము. దశార్హ దేశభవుండని మంచి యర్థము.

ఇతనికిఁ గూర్తురేని ధనమిత్తు రభీష్టములైన కార్యముల్
మతి నొనరింతు రిష్టుఁడని మంతురుగాక మహాత్ములైన భూ
పతులయు విప్రముఖ్యుల సభన్ విధిదృష్ట విశిష్ట పూజనా
యతికి ననర్హు నర్హుఁడని యచ్యుతు నర్చితుఁజేయఁ బాడియే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక్కడ ధర్మరాజుతో భీష్ముడు, అచ్యుతు బూజింపు మనునప్పు డుపయోగించిన యచ్యుత పదమునే శిశుపాలుడు వెక్కిరింపుగా నర్థాంతరమునఁ బునః ప్రయోగముచేసినట్టు నన్నయభట్టు రచించి గంభీర భావము గల్పించి నాడు అతడు విధిదృష్ట విశిష్టపూజనాయతికి అనర్హుడు. ఇట్టి యచ్యుతుని, అర్చితునిచేయుట పాడిగాదు - అని శిశుపాలుని భావము. భీష్ముని పలుకుల లోనె అచ్యుత పదమునకు ఆ చ్యుతుఁడు, ఆ పతితుడు అని యర్థాంతరము గల్పించి శిశుపాలుడు గర్హించి నాడు. ఈ పద్యమున గూడ నక్షరరమ్యత, యనుప్రాస చమత్కృతి దైవారియున్నవి. ఈ శిశుపాల కథా ఘట్టమెల్ల శబ్దార్థ గాంభీర్య కలితమై రసోత్తరమైయున్నది.

అవమాన్యున్ సభలోన మాన్యుఁడని సౌహార్దంబునం గౌరవ
స్థవిరప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదులైన పాండవులు మోహాంధుండు భీష్ముండుఁ గే
శవ నీవుం గడగుండు నాకు నెదురై సంగ్రామరంగంబునన్.

ఇందు నాల్గవ చరణమున కే యనికేక శవ నీవుం గడగుండు అని నింద. ఇట్టి చోట్ల నెల్లఁ బలుకుబడిలోనే యర్థవిశేషములు పదచ్ఛేద భేదముచే గల్పించి, గంభీర భావభేదములకు ఝుడితి స్ఫూర్తి గూర్చుట నన్నయ నై పుణ్యము. కారకాన్వయ కౌటిల్యముతో నర్థవిశేషములను సాధించుట నన్నయ తీరుకాదు.

నన్నయ భావగాంభీర్యమునకు మఱి యొక తార్కాణ—

మదమాతంగ తురంగ కాంచనలసన్మాణిక్యగాణిక్య సం
పదలోలిం గొని వచ్చి యిచ్చి ముదమొప్పం గాంచి సేవించి ర
య్యుదయాస్తాచల సేతుశీతనగ మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణప్రతాపోదయున్.

ఆదిపురాణ రచనమును నన్నయ పెక్కుపట్టుల ననుకరించినట్లు గుర్తింపనగును. నన్నయ ప్రసన్నార్థ ప్రధానముగా శయ్యాసౌభాగ్యముతో కవితా శిల్పమును గావింపగా, తిక్కన సోమయాజి తద్విరుద్ధముగా, కవితా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శిల్ప కల్పనా ప్రధానముగా, కారకాన్వయ కౌటిల్యములతో తెలుగు మఱుగుల నధికముగా జొప్పించి, ప్రౌఢాంధ్రపండితైక వేద్య మయిన దివ్యకావ్యశయ్యతో దన భారత భాగమును రచించినాడు. వర్షా సమయమున నొడుదుడుకు నేలల నుండి సుడులు దిరుగుచు మడుగులు మాటులు గలిగి లోతు తెలియ నీయని కలకనీటి పోటుతో ప్రతి పదమును జాగ్రత్త వహించినగాని దాట వీలుగొల్పని వక్రగతులతో సాగు గంభీరనదీ ప్రవాహమువలె తిక్కన రచన మప్రసన్నమై వెనుకకు ముందుకు దిరుగు వాక్యోపవాక్యములయు, కారకాన్వయములయు కౌటిల్యముతో ఇంక నిందేమి విశేషము గలదోయని సహృదయులు ప్రతి పదము సందేహముతో అచియాచి చూచి చూచి మఱీ చదువవలసిన తీరున చిక్కులు గొల్పుచు జిగిబిగితోనుండును. ఇది పురాణ ఫక్కికాదు. మఱి దివ్యకావ్య ఫక్కి. కవితా మర్మమిందెక్కువ. వక్రోక్తులు, అర్థాలంకారములు, వ్యంగ్యము నిందధికముగా నుండును. ఇందుకు లక్ష్యము నొక్క గీత పద్యమును జదువుచున్నాను. విరాటపర్వ ద్వితీయా శ్వాసమున కీచకుడు ద్రౌపదిపై తమక మాపుకొనలేక నీచవాంఛను వావిడిచి వెల్లడించినాడు. అప్పు డబ్బోటి కలుషించియు దుర్వారంబైన పరిభవ విచారంబు దోపనీయక వెరవుతోడన తప్పించుకొనవలయునని యిట్లన్నది-

చనునె యిమ్మాట లాడ సజ్జనుల, కాడుఁ
బుట్టువులతో నీవును బుట్టినాడ
వట్లుఁగాకయు హీనవంశాభిజాత
నైన పతివత్ని నగు నన్ను నడుగఁదగునె.

అన్నా, కీచకా, సత్పురుషులు పరస్త్రీల నిట్లు కోరవచ్చునా? అంతే కాక, ఆడతోడు గలవాడు మఱీ జాగ్రత్తగా నుండవలెను గదా. నీవు సజ్జనుడవు, సుదేష్ణవంటి యాడుతోడు గలవాడవు, నీవిట్టి చెట్టవలుకులు పలుకరాదే. ఇట్టు కోరగూడమికి నీ యోగ్యతాంశములివి రెండేకాదు. మఱి నా యయోగ్యతాంశములు రెండున్నవి. నేను హీనవంశ సంజాతను, మగనాలను ఉన్నత వంశము గర్హించుననీ, ఆడుతోడు చెడనాడుననీ, అక్కడ కూడ నీగతి పట్టవచ్చుననీ నీ విషయమున నీవు వెఱవవలెను. నా విషయమున గూడ, నీచజాతిదనీ, మగడెఱిగిన దండించుననీ నీవు వెఱవవలెను - అని సామాన్యముగా తోచు బాహ్యార్థము. ఇక్కడ లోతయిన యర్థాంతరము నున్నది. మరల పద్యము చదివి యీ యర్థము వివరింతును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చనునె యిమ్మాట లాడ సజ్జనుల కాడుఁ
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ
వట్లుఁగాకయు హీన, వంశాభిజాత
నయిన పతివత్నినగు నన్ను నడుగఁదగునె ?

సజ్జనుడు, ఆడుతోడుగలవాడు, ఇట్టి మాటలాడడు. ఇట్టి చెట్టలాడు చున్నావుగాన నీవట్లుగాక దుర్జనుడవు, ఆడుతోడులేనివాడవు నయితివి. నాకు సజ్జనతాపేక్ష లేదు, ఆడుతోడుకలిమి నేను పాటించువాడను గాను, అందువేమో.-సుదేష్ణ వీనికి తగిన యాడుతోడే. తన పాడునడత కామెను గూడ తోడు వఱచుకొన్నాడు గదా - అయితే నీవట్లగుదువుగాక. హీన, ఓరి నీచుడా, వంశాభిజాతను, పవిత్ర క్షత్రియ వంశసంజాతను, యజ్ఞాగ్ని సంభూతను అయిన పతివత్నిని, అఖండ పరాక్రములయిన భర్తలు గల దానను. నన్ను నటరా నీవు కోరునది ? నా వంశవు యోగ్యతను, భర్తల యోగ్యతను దెలియక వదఱుచున్నావు. ఈ రెండు యోగ్యతలు నిన్ను నాశ వఱువగలవురా, అని యర్థాంతరము. పాఠకులుపై రెండర్థములలో కీచక సైరంధ్రీ పాత్రములను జూచి, సాధారణముగా తొలి సువ్యక్తార్థమును సైరంధ్రిలో దాగియున్న ద్రౌపదీపాత్రమును గుర్తించి లోతుగా రెండవ యర్థాంతరమును గ్రహింపగల్గుదురు లోతుగా యోచింపజాలనివారు బాహ్యార్థ మునే గ్రహింతురు. కీచకుడు మదనపిశాచగ్రస్తుడై యాత్రపాటుతో నున్నాడు గాన తొలియర్థమునే గ్రహింపగల్గెను ద్రౌపది తాను భావించునది రెండవ గంభీరార్థమునే తిక్కన యీ రెండర్థముల ననుగతపఱచి శ్లేషధ్వన్యర్థ చమత్కారముతో పద్యము గూర్చినాడు. పయి పద్యమున అయిన పతివత్ని ననుచోటను, అడుగఁదగునె అను చోటను అర్థవిశేషములున్నవి. - అయిన యింటివారు, ఇత్యాదులు చూచునది-అయిన-చెల్లివచ్చిన, ప్రఖ్యాతిగాంచిన-భర్తలుగలదానననీ-అటువంటివారి విషయమై అడిగేదేమిటి-ఇత్యాదులు చూచునది, ప్రశ్న స్మరణమే చేయరానిదానననీ-అర్థవిశేషములు. ముద్రణ ములం దీ పద్యమిట్లున్నది గాని, యిందు తిక్కన కూర్పు కొంత మార్పు చెంది ఉంటుందనుకొంటున్నాను. అట్లుఁగాకయు అనుచోట, అట్లు తర్వాతి సముచ్చయపుటరసున్న-కాకయు అనుచోటియు స్వారస్యమును సంపాదింప గల్గియే యున్నది. ఇక యు వ్యర్థము తిక్కన అట్లుగాక యో హీన అని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచనజేసి యుండును. తొలియర్థమున అట్లుగాక అయో ! హీనవంశాభి జాతను అనీ రెండవ యర్థమున అట్లగాక ఓ హీన అనీ భేదము నసిపడు తుంది.

క. అని వీడఁగఁ బల్కిన న
మ్మనుజాధముఁ డంతఁ బోక మదనోన్మాదం
బునఁ దన్ను నెదిరి నెఱుఁగక
వనితకు నిట్లనియె గారవంపుఁ బలుకులన్.

తర్వాతి యీ పద్యములో దన్ను నెదిరిని — పాదప్రహారము చేయుదానిని ద్రౌపదిని అనియు, కవి పొసగించినాడు.

వలదని యెంత సెప్పినను వావిరిపై కడువేగపాటు మైఁ
బలుమఱు నెల్లెడం దొడరఁ బాఱెదు నీ హృదయంబు నట్లకాఁ
దలఁపు మనోజుతూపులకుఁ దక్కటి చిత్తములుం గడంగి వి
చ్చల విడి సేఁత కర్జమె ? విచారము కోర్కికిఁ గాని వావియే.

పై పద్యములందు వలెనే యీ పద్యమునను భావగాంభీర్యము గడలు కొన్నది. ఎన్ని మారులు వలదు నీకిది తగదు అని చెవినిల్లుగట్టుకొని చెప్పి నను వినకనన్ను వెంబడించుచున్నావు. తొందరపాటు తగదు. మన్మథుని బాణములకు నీవెట్లు లక్ష్యమైతివో తక్కినవారును నట్లే లక్ష్యములయిరని తెలియుము. నాకు నీ యెడల ప్రేమము కలదే యనుకొమ్ము. కాని మగ వాడవు నీవు విచ్చలవిడి వర్తించినట్లు, ఆడుదానను నేను వర్తింపవచ్చునా ? కోర్కికి యుక్తాయుక్త విచారము నింత జతపఱుపవలదా ? అని సైరంధ్రి కీచకు నెడ తాను దగులము గొన్నట్లే తోచునట్లు చెప్పినది. కాని సైరంధ్రి యందు దాగియున్న ద్రౌపదీ పాత్రమును మనమున నిడుకొన్నపుడీ యర్థ మిట పొసగదు. మనోజు తూపులకు నీ హృదయమువలె నా పతుల హృద యములును నాపై దగులుకొనియున్నవి. నీవలె వారు విచ్చలవిడి వర్తించిరా? రహస్యముగనే రాత్రి వచ్చి నిన్ను మట్టుపెట్టగలవారనియు నర్థాంతరము. నీకు, పరకాంతనగు నన్ను గోరుట కానివావిగాని కోర్కికి విచారము కాని వావికాదు. నా యెడలను, ఈ యెడలను గూడ నీవు వావి తప్పియే వర్తించు వాడవైతివి అని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాహ్యార్థమున సైరంధ్రీ భాషితమును, నంతరార్థమున ద్రౌపది గంభీర భాషితమును ఈ ఘట్టమందెల్ల దైవారి యున్నది. ఇక్కడ మచ్చు ముక్కలు చూపితినిగాని. తిక్కన రచనమెల్ల యిట్టి భావగాంభీర్యముతోనే వెలయు చున్నది. మనుమసిద్ధి మహీపాలుడు తిక్కనను మహాభారతములోని రసవం తములయిన కండపట్టులను వినిపింపుమనగా నాతడు తన రచన మామూ లాగ్రము వినిపించెనట కదా !

[- రేడియో ప్రసంగము :
8-7-1944

- విస్తృత పాఠము : తెలుగు మెఱుగులు
1948 ప్ర. ము.
1960 తృ. ము.]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రమహాభారత ప్రశంస - నీతినిధి

అసలు నీతి అనే పదము ప్రాచీన భాషలో, శాస్త్రకారుల పరిభాషలో, రాజనీతిశాస్త్రమనే యర్థముననే ఉన్నది. మహాభారతము ఇతిహాస మాత్రమే కాక, ధర్మశాస్త్రము, వేదాంతశాస్త్రము, నీతిశాస్త్రము, మహాకావ్యము, లక్షణ గ్రంథము, పురాణము కూడా అవుతుందని వ్యాస మహర్షి చెప్పినాడు. దానిని నన్నయభట్టారకుడూ అనువదించినాడు.

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని,
యధ్యాత్మవిదులు వేదాంత మనియు,
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రం బని,
కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని,
యైతిహాసికు లితిహాస మనియు,
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని, మహిఁ గొనియాడుచుండ దగియున్నదని

నన్నయభట్టు భారతమును ప్రస్తుతించెను. పయి పద్యము ధర్మశాస్త్రము వేఱని, నీతిశాస్త్రము వేఱని, నీతిశాస్త్రమనగా రాజనీతిశాస్త్రమే అని స్పష్ట పఱచుచున్నది. నీతిశాస్త్రమునే నయశాస్త్రమని అంటారు. ఈ నీతి శాస్త్రమున సామదానభేదదండ మాయోపేక్షేంద్రజాలములు, సంధివిగ్రహయానాసన ద్వైధీభావసమాశ్రయములు, సప్తవ్యసనములు ఇత్యాదివిషయములుంటవి. మహాభారతము పంచమ వేదమనబడుచున్నది గాన వేదములో సర్వశాస్త్రా ర్థములు సంగ్రహములుగా ఉన్నట్లే మహాభారతమున కూడా అనేక విషయ ములున్నవి. మహాభారతములో కణికనీతి, విదురనీతి, ధృతరాష్ట్రనీతి. భీష్మనీతి, సంజయనీతి ఇత్యాది నామములతో నీతి శాస్త్రగ్రంథభాగములు సంగ్రహీతములయి ఉన్నవి. 'మహాభారతము' నీతినిధి అనుటలో నీతిపదము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిప్పుడు సామాన్యముగా లోకములోని వాడుకలో నుండే తీరునకు కులాచారాదిలోకధర్మముల ననుసరించిన ప్రవర్తన అని ఉద్దేశము.

భారతము, కథేతిహాసమాత్ర ప్రధానమే అనుకుంటే అందు భగవద్గీతలు, సనత్సుజాతీయము, అణుగీత మొదలగు వేదాంత గ్రంథభాగములు, అంతేకాక అరణ్య పర్వాదులందింక నెన్నో భాగములు, శాంత్యానుశాసనికములనేవి పర్వములకు పర్వములే కూడా అన్యావశ్యకములగును. ప్రాజ్ఞులు భారతేతిహాసము అంతరించినా చింతపడక పోవచ్చును గాని అందులోని భగవద్గీతాది శాస్త్రగ్రంథ భాగములు, శాంత్యానుశాసనికాది పర్వముల ధర్మోద్బోధములు అంతరిలచుట కోర్వరు. ఆ భాగము లనేకశాస్త్రార్థ వివరణములతో ధర్మ సరూప నిరూపణఏ:లతో నిండియున్నవి. భారతమును దెలిగించుటలో నన్నయ, యీ ధర్మ సూక్తులను చక్కగా సంకలనము చేసెను. ధర్మ నిర్వచనమేదిగాని, జీవిత యాత్రలో నేదేని ఘట్టమున, విపరీత స్థితిలోనో, మానవుని సరియైన త్రోవ కల్లంతలో త్రిప్పగల్గెనా దాని వైభవము మహనీయమై యా జీవితము స్మరణీయ మగుచుండును. నన్నయాది కవీశ్వరుల భారతనీతి పద్యములు నా యనుభూతిలో, కొన్ని సందర్భములందు నా జీవిత నౌకను త్రోవకు త్రిప్పిన తీరులు కొన్ని తెలుపుతాను.

ఇరువది యేండ్ల వయసువాడను మదరాసు నుండి వేసవి సెలవులకు స్వగ్రామమేగుచు బందరులో ఆప్తమిత్రులింట దిగితిని. ఆ గృహపతి పేరెన్నిక గన్న పెక్కిలు. వారు దంపతులు అనుకరణీయ సౌశీల్యసంపన్నులు. నేను మద్రాసు వెళ్ళునపుడా గృహపతి, వేసగి సెలవుల కింటికి రావలదనియు, మద్రాసులోనే సెలవులలో విద్యాభివృద్ధికై పాటుపడుచుండుమనియు ప్రయోజకుడవై కొన్ని వేలు సంపాదించిగాని పెండ్లాడవలదనియు, ఐరోపియనులట్లే చేయుదురనియు నుద్బోధించుట కలదు. ఆయన యుద్బోధనకు విరుద్ధముగా నేనపుడు వివాహమునకై యింటికేగుచుంటిని ఇది యనుమానించి యా గృహపతి తీవ్రముగా నన్ను మందలింపసాగెను. చన్నీటి హాయిగా స్నానము చేసి భోజనమునకు గూర్చుంటిమి. గృహపతి యుద్ధత

(2)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాదమునకు పార్వతీ సమానురాలు గృహపత్ని సమాధానములు చెప్పుచుండెను. ఐరోపీయ బ్రహ్మచర్యము మనకు వలదనియు. ధనార్జనానంతము వివాహమాడుట గతజలసేతుబంధనము కావచ్చుననియు వాదించుచుండెను. నేను తలవంచుకొని భుజించుచుంటిని. ఆ సమయమున భర్తచెంత వినన కళ్లతో వినరుచున్న యాగృహిణి వంటవానివల్ల మీకీ సుఖము లభింపగలదా? ఇంత రుచ్యముగా ప్రియముగా మీ హితమును గుర్తించి, నావలె, వంటవాడు మీకు భోజనము కూర్చునా? ఈ వేసంగిలో నిపుడు చల్లని గాలి, నా వల్లగాక మీ కితరులవల్ల లభింపగలదా? మీరు సంపన్నులయియే నన్ను వివాహమాడితిరా? రోడ్డుపై సంజదాక మట్టితట్టలు మోసిన యువ్వరివానిని, రోడ్డు చెట్టుక్రింద, చెట్టుకొమ్మకు గుడ్డయుయ్యాలగట్టి యిందు శిశువునుంచి, వంటచేసి ఉడుకునీటినిగాచి, భర్తకు వీపు తోమి, స్నానమాడించి, వెచ్చనన్నము పెట్టి, సుఖశయితుని గావించు నిల్లాలితీరు చూచి నపుడు భారతీయ గార్హస్థ్య గౌరవము తెలియగలదు. నన్నయభట్టారకుని భారత భాగములోని పద్యమిదని చదివెను.

"అఖిలదుఃఖరోగార్తున కౌషధంబు
సురుచిరంబుగ భార్యయ చూవె యెందు,
నొనర భార్యాసమేతుడై యున్నవాని
కెంతలాపదలయ్యును నెఱక పడవు."

భర్త నవ్వి 'శాస్త్రీ, పరాజితుడనయితిని. సుఖముగా, శీఘ్రముగా వివాహితుడవయి సుఖింపుము' అనెను; నన్నయ సూక్తి క్షణములో, నాలోని ధర్మసంశయాందోళనము తొలగించి త్రోవత్రొక్కించెను. ఆ సందర్భము, నా జీవితమున మఱువరానిది.

పదునాల్గేండ్ల వయసువాడను. సోదరికి వివాహము జరుగుచుండెను. వియ్యాలవారేదో తగవు పెట్టిరి. చర్చ పెరుగసాగెను. మా తరపువారు మెత్త మెత్తగా వారి ననునయించుచుండిరి. వారు కొమ్మెక్కుచుండిరి; నాకది యసహ్యముకాగా చుఱుకుగా సూటిగా వారి నధిక్షేపించి యడ్డగింప నుపక్రమించితిని. నా యపక్రమ మప్పటి తగవును మరింత యపక్రమము నకు దించుననియు, పెండ్లి కుమారుని తరపువారిదిపైచేయుగా నుండు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ననియు, వెరచి మా నాయనగారు నన్ను వారించుటలో నీ పద్యమును జదివిరి:

"ఎల్లవారు నెఱుంగ నొల్లని ధర్మువు
బేల నీకుఁ దెలుప నేలవలసె?
చిఱుతవాని కింత దఱుసంటిపలుకులు
చన్నె? వృద్ధజనము నున్నచోట-"

నన్నయ భారతములోని యీ పద్యమును చక్కగా చదివి, యర్థవివరణము చేయుటవలన వియ్యాలవారు కయ్యముడిగి నెయ్యమునకు దిగిరి. నేను పద్యార్థమునకు మురిసితిని, మా నాయనగారు వ్యవహార సౌరళ్యమునకు దనిసిరి. నన్నయ రచనమున నిట్టి ధర్మోద్బోధపుఁ బద్యము లెన్నేని కలవు. పాండవ కౌరవుల యవతారమునసుండి కథావసానముదాకా ననేకాసందర్భ చరిత్రాంశములతో గజిబిజిగానుండు మహాభారతకథలో ధర్మోపాఖ్యానము లనేకములు కలసి యుండుటచేతనే దాని కంత పూజ్యత కలిగినది.

తిక్కన సోమయాజి, ప్రత్యేక మహాగ్రంథము లనఁనగినవానిని, భగవద్గీతా సనత్సుజాతీయములను విడసాడినను శాంత్యానుశాసనిక పర్వము లందును, నింక ననేక ఘట్టములందును, ధర్మోఖ్యానములను, మనోజ్ఞముగా తెలుగు చేసెను. ఒక పద్యము.........

క. జ్ఞాతుల పోరితమును గో
వ్రాతమునాక్రమము విప్రవర్గము చనవున్
నాతులకారించుటయును
బ్రీతిం జననిచ్చు నతని పెంపొప్పు నృపా!

ఈ తిక్కన పద్యమునకర్థమును గూర్చి పలువురు తికమకలు పడుదురు. జ్ఞాతులు, ఆస్తి పంపకము వగైరాలలో వివాదము సాగించినపుడు, గోవులు చొరబడి కూరమళ్లు వగైరాలు తిని చెఱువు చేసినపుడు, బ్రాహ్మణులు ఎక్కువ చనువుగాని మాటాడినపుడు; స్త్రీలు అది కావలెను. ఇది కావలెను' అని గోజాడినపుడు మంచితనముతో తప్పించుకొని, వ్యవహార

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున, "ఫోక్తు" పఱచుకోవలెగాని, రచ్చకెక్కించి రద్దు చేసికోరాదు. దాని వల్ల వంశనాశము, గో బ్రాహ్మణ హింస, స్త్రీహింస యేర్పడును. తక్కిన వెట్లున్నను నిందు తుది వ్యవహారమును గూర్చియైన నెల్లవారు జాగ్రత్తపడ వలసినదే కదా!

ఒక మిత్రు డీ క్రింద కథ చెప్పగా విని పగలఁబడి నవ్వితిమి. ఒక తూరి యాతడొక మిత్రునింటికి వెళ్ళగా, ఆ గృహపతి యాదరించి మంచి చిఱుచాప పఱచి కూర్చుండబెట్టి సంతోషింపసాగెనట. ఈ మిత్రుడు సంభాషణోత్సాహమయుడై యా చిరుచాపలోని యీ నెలను చేతికందిన పట్టుల నుండి యెత్తి యెరుక లేకుండనే త్రుంచిపోయసాగెనట. గృహపతి లోని కరిగి, మంచివి, అచ్ఛిన్నాగ్రములు నగు దర్భములను గొన్నింటిని, ఇంకను క్రొత్తవి, పూచికపుల్లలు గొన్నింటిని దెచ్చి దగ్గఱబెట్టి, మీరిప్పుడు చేయుచున్న పనివలన,

> "గురుని మాట సరకు గొనమి, దుశ్శీలత,
> పిట్టబుడుక, గోరుఁ బిసుకఁ, ద్రుంపఁ
> గఱవ, మరుగు. టుదయకాలాస్తమయ సమ
> యముల భానుఁ జూచు, టాయువడఁచు"

అను భారతానుశాసనిక పర్వపద్యమున గానవచ్చు ననర్థము కల్గునో కల్గదో కాని, నా చాప చెడుట యను ననర్థము ప్రత్యక్షదృష్టముగాన, చాపను విడనాడి, యీ దర్భలు, పుల్లలు త్రుంపుడని కోరెనట ఆ మాటలతో తలవాచి, తల వంచుకొని యతడు యతడు క్షమాపణము కోరుకొనెనట; పైభారత పద్యమున తిక్కన కవితామర్మముంచినాడు - పిట్టను - అంటే - మట్టి బెడ్డను పిసుకుట, పుడుకను త్రుంచుట, గోటిని కరచుట కూడని పనులని దాని తాత్పర్యార్థము.

*　　*　　*

శాంతిపర్వమున భీష్మోపదేశములు, అందును కపోతోపాఖ్యానాదులు, నీతి ధర్మనిర్ణయమయములయిన దివ్య లఘుకావ్యములు. అందొక్క యుపాఖ్యానమునేని నీతిధర్మ విశేషములతో ఎవరించుటకిక్కడ కాలము చాలదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్ర మహాభారతములో నీతి ధర్మనిరూపకములగు పద్యములను బెక్కిం టిని గుర్తించి శ్రీ కట్టమంచి సుబ్రహ్మణ్యరెడ్డిగారు, గట్టుపల్లి శేషాచార్యులు గారు గ్రంథ రూపముగ బ్రకటించిరి. తిక్కన చక్కని పద్యము లిక్కడ గొన్ని వినిపింతును:

CC6836

'ఒకటి గోరి దాని కుల్లంబు గందంగ
జాలిఁబడమి, యేమిసంభవించె
నేని దానఁ దృప్తి యనుట [illegible]
పనికి వగవకునికి, భావ్యగుణము'

गुरुकुल कांगड़ी विश्वविद्यालय पुस्तकालय

'జరయ మృతియులేని జ[illegible]
ధనము విద్యఁ గూర్పఁ దలఁప[illegible]
ధర్మమాచరింపఁదగు మృత్యుచేఁ దల
పట్టియీడ్వఁబడినఁవాడు వోలె'

'చెలిమియుఁ బగయును, దెలివియుఁ
గలకయు, ధర్మంబు, బాపగతియును, బెంపుం,
దులువతనంబును, వచ్చును
బలుకుబడిన; కొనపొసుగఁ బలుకఁగవలయున్'

'తనువున విఱిగినయలుగుల
ననువునఁ బుచ్చంగ వచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటినమాటలు
విను మెన్నియుపాయములను వెడలునె యధిపా!'

నన్నయ తిక్కనల బుజములపై చేతులు వైచుకొని, వారి నడుమ, కవితా మార్గముననేకాక, నీతిధర్మ నిర్ణయ మార్గమునను, నెట్టాడ నడచిగ్గ నాడు. అతని రచనలోనివి సత్యాద్రౌపదీ సంవాదాదులు ధర్మార్థైక మయములు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'ఆలస్యం బొకయింతలేదు శుచియాహారంబు నిత్యక్రియా
జాలంబేమఱ, మర్త్యనీయులతిథుల్, సత్యంబ పల్కంబడున్,
మేలౌ శాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిందాల్తు, మట్లౌటనె
క్కాలంబున్ బటు మృత్యురోగ భయశంకంబొందమేమమ్మలన్-'

'ఎడపక వాఙ్మనః క్రియల నేరికి హింస యొనర్పఁబూన, రె
య్యెడలను దీనులంగరుణ యేర్పడఁ బ్రోవనజాతు, రిచ్చచోఁ
గడమవడంగనీ కెదిరికాంక్షితముల్ తుఱిముట్టఁదీర్తు, రె
క్కుడు మదిఁగూర్తు రాశ్రితులకున్, విను, మిన్నియు,
నార్యధర్మముల్'—

ఆంధ్ర మహాభారతమున గానవచ్చు నీనీతిధర్మ రచనావిశేషములెల్ల సంస్కృత భారతమున నున్నవేకాని తెలుఁగున క్రొత్తగా వెలసినవికావు. ఆంధ్ర మహాభారతము సంస్కృత గ్రంథమునకు సంగ్రహానువాదమే కాని, సరియయిన తెలుగు కాదుగాన, యింకగొన్నేని నీతివిశేషములు సంస్కృతమున మిగిలియున్నవని చెప్పవలెను. భారతకథా తత్త్వమును గాని, అందలి ధర్మ నీత్యాది శాస్త్రార్థ విశేషములనుగాని, పర్యాప్తముగా తెలియగోరువారు సంస్కృత భారతము తోడ్పాటుతో తెలుగున పరిశీలింతురేని, ఆంధ్రీకరణ చమత్కారములు, సంస్కృత మూలవిశేషార్థములు స్పష్టముగా గుర్తింపననువు పడును సంగ్రహాంధ్రీకృతియయినను ఆంధ్రభారతమున నిండారియున్న నీతి ధర్మ విశేషములను పరిగణించుట నీలాకాశమున నక్షత్రముల గణించుట వంటిది. దానిగూర్చి యీ ప్రసంగము దిఙ్మాత్రము.

[-రేడియో ప్రసంగము :
29-8-1944
-విస్తృత పాఠము : తెలుగు మెఱుగులు
1948 ప్ర. ము.
1960 తృ. ము.]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వినోద విమర్శము

శ్రీ వేటూరి - ప్రభాకరశాస్త్రి

నన్నయ తిక్కన, నన్నిచోడకవుల రచనలలో కొన్ని పద్యములఁగూర్చి :—

అక్షరరమ్యత, శయ్యాసౌభాగ్యము, ప్రసన్న కథా కలితార్థయుక్తి నన్నయ రచనలోఁ గుదురుకొన్నవి. ఎంతలోఁతైన భావమునయినను నాతఁడక్షరరమ్యతగల తన ప్రసన్న కవితలోఁ బ్రవ్యక్తముగా సుగోచరమగునట్లు చేయఁ గలిగినాఁడు. గ్రంథగ్రంథులు నన్నయ రచనలో నుండవు. నన్నయ శయ్యవంటి పురాణశయ్య కావ్యగౌరవముకలది, భాగవతకర్త కొక్కనికే తక్కమఱి యితర పురాణయుగాంధ్రకవుల కెవ్వరికిని దక్కలేదు. ఇందుకుఁ దారకాణగా రెండు మూఁడు పద్యములు.

రాజసూయ మహాధ్వరము జరుగునపుడు భీష్ముఁడు ధర్మరాజుతో 'నఖిలలోక పూజ్యు నచ్యుతుఁ బూజింపు' మనఁగా శిశుపాలుఁ డుపాలంభన పరుండయి యథోక్షజు నాక్షేపించుచు ధర్మరాజునకిట్లనుచున్నాఁడు.

అవనీనాథు లనేకులుండఁగ విశిష్టాచార్య లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వురుండఁగ ధరిత్రీనాథ ! గాంగేయదు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితుఁ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే.

ఈ పద్యమున నినుప్రాసము, నక్షరసౌభాగ్యము, శయ్యయొయ్యారమును మాత్రమే కాక దాకార్హుఁడు = పల్లెలు బోయలు మొదలగువారికిఁ దగినవాఁడు, వారిలో విహరింపఁ దగినవాఁడు లేక భృత్యతకు, నౌకరీకి తగినవాఁడు, శ్రీకృష్ణుఁడు పూజార్హుఁడగునా? యనియు నాక్షేపము. దాశార్హ పదమునకు రెండర్థము లున్నవి. పల్లెకారీలకుఁ దగినవాఁడనియు, నౌకరీకిఁ దగిన వాఁడనియుఁ జెడ్డయర్థము. దశార్ణదేశభవుఁడని మంచి యర్థము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇతనికిఁ గూర్తురేని ధనమిత్తు రభీష్టములైన కార్యముల్
మతి నొనరింతు రిష్టుఁడని మంతురు గాక మహాత్ములైన భూ
పతులయు విప్రముఖ్యులసభ౯ విధిదృష్ట విశిష్టపూజనా
యతికి ననర్హు నర్హుఁడని యచ్యుతు నర్చితుఁ జేయఁబాడియే,

ఇక్కడ ధర్మరాజుతో భీష్ముఁడు అచ్యుతుఁబూజింపు మనునప్పు డుప యోగించిన యచ్యుతపదమునే శిశుపాలుఁడు వెక్కిరింపుగా నర్థాంతర మునఁబునః ప్రయోగముచేసి నట్లు నన్నయభట్టు రచించి గంభీరభావము గల్పించినాఁడు. అతండు విధిదృష్టవిశిష్ట పూజనాయతికి ననర్హుఁడు. ఇట్టి యా చ్యుతుని నర్చితుని జేయుట పాడిగాదు అని శిశుపాలుని భావము. భీష్ముని పలుకులలోని యచ్యుత పదమునకు అచ్యుతుఁడు అని యర్థాంత రము గలుగుట ప్రాచీనవ్యాకరణ సంప్రదాయసమ్మతము. ఈ పద్యమునఁ గూడ నక్షరరమ్యత, యనుప్రాస చమత్కృతి, దైవాటియున్నవి. ఈ శిశుపాల కథాఘట్టమెల్ల శబ్దార్థగాంభీర్య కలితమై రసోత్తరమై యున్నది.

అవమాన్యు౯ సభలోన మాన్యుఁడని సౌహార్దంబునం గౌరవ
స్థవిరప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదులైన పాండవులు మోహాంధుండు భీష్ముండుఁ గే
శవ ! నీవుం గడగుండు నాకు నెదురై సంగ్రామరంగంబున౯

ఇందు నాల్గవచరణమున 'కే' యని కేక, 'శవ నీవుం గడగుండు' అని నింద. ఇట్టి చోట్లనెల్లఁ బలుకుబడిలోనే యర్థ విశేషములు పదచ్ఛేద భేదముచేఁ గల్పించి గంభీర భావభేదములకు ఝుడితిస్ఫూర్తి గూర్చుట నన్నయనై పుణ్యము. కారకాన్వయ కౌటిల్యముతో నర్థవిశేషములను సాధిం చుట నన్నయ తీరుకాదు.

తిక్కన.

తిక్కన స్వయము కవీశ్వరుఁడగుటే కాక పలువురు కవులతో సరస కవితా వినోదములు కూడ జరిపినాఁడు. తన యాస్థానిలో నొక కవీశ్వ రునికీ సమస్య నిచ్చినాఁడట!

ఆకులు పోకలుంగలిచె నంతియచాలును సున్నమేఁటికి౯.
ఆ కవి ఇట్లు పూరించినాఁడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీకరమూర్తి హారిగుణశేఖర కొమ్మయమంత్రి తిక్క! నీ
రాకలుగోరు ముగ్ధ కనురాగమునన్ బెనుమన్మథాగ్నిచేఁ
బ్రాకటమైన ముత్తెములు భస్మములైనవి, వేగరావనా!
యాకులుఁ బోకలుం గలిగె నంతియచాలును నున్నమేఁటికిన్.

నన్నయ సంస్కృత పదబహుళమై, ప్రసన్నార్థమయి, సర్వసులభమైన రచనమును చేయఁగాఁ దిక్కన దేశిపలుకుల మెలపులతోఁ గవితామర్మములతో సంస్కృతమున వ్యాసుఁడు చెప్పించినట్లు పెక్కుచోట్ల గ్రంథగ్రంథులను చేర్చి చెప్పించి తనగ్రంథమును ప్రౌఢరసికాంధ్ర పండితైకవేద్యముగా దివ్యకావ్య శయ్యతో నిర్వహించినాఁడు. తిక్కన గ్రంథగ్రంథులను గొన్నిటిని జూపుచున్నాను.

'గురుని మాట నరకు గొనమి దుశ్శీలత
పిట్టఁ బుడుక గోరుఁ బిసుకఁ ద్రుంపఁ
గరవ మరుగు టుదయ కాలాస్తమయ సమ
యముల భానుఁ జూచుటాయువడఁచు'.

ఈ పద్యమునఁ గవితామర్మమున్నది. క్రొత్తవా రీపద్యము నర్థమును గుర్తింపఁజాలరు. వృద్ధ విద్వాంసుల మూలముననో, సంస్కృతమూలము మూలముననో గుర్తింపవలసినది దీనియర్థము. 'లోష్టమర్దీ తృణచ్ఛేదీ నఖఖాదీ చ యో నరః' అనుమూలమున కిది తెనుఁగు. పిట్ట, పుడుక, గోరు అనగా లోష్టము, తృణము, నఖము అనువానిని పిసుకుటకును, త్రుంపుటకును, కఱచుటకును అలవాటు పడుట ఆయువును హరించునని యర్థము. తిక్కన దీనిని 'బెడ్డ చిదుప, పుడుక విరుప, గోరురగవ, మరుగుటుదయ' అని సులువుగాఁ గూర్పవచ్చును. అయినను నిందు యథాసంఖ్యాలంకారము చేర్చి పిట్ట పుడుక గోరు అనుచోఁ బిట్టను బట్టుకొనగోరునట్టి యని యనన్వితార్థాభాసచిత్రమును గల్పించి పాఠకులను లోఁతు యోచనకుఁ బాల్పఱచినాఁడు. మఱియు,

అనిన నలుగాలివాన గోవును నశేష
శబ్దముల మంత్రమును లోహజాతిఁ గాంచ
నమును మనుజుల విప్రుండు సమధికత్వ
భాజనము లండ్రు వేదప్రపంచవిదులు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుఁగు కూర్పుమఱుఁగు లెఱుఁగని వారైనచోఁ బ్రౌఢ సంస్కృత పండితులు సైతము ఈ పద్యమున నలుఁడేమిటి? గాలివాన యేమిటి ? అనన్వితముగా నున్నవే యని యంగలార్తురు. తిక్కన యిక్కడఁ జతుష్పాత్తులనికాని, నాలుగుకాళ్ళ జంతువులని కాని సులువుగా ననలేఁడా? అనఁగలఁడు కాని నలుఁడు గాలివాన అన్న ప్రసిద్ధ పదముల ఝడితిస్ఫూర్తి కలిగి పాఠకుల కనన్వయము తోచి లోఁతైన యోచనతోతదాభాసచిత్రము గోచరించునట్లు కవితామర్మ మిక్కడఁ గల్పించినాఁడు.

సంస్కృత భాగవతమును బలుతూరులు పురాణము చెప్పిన యొక ప్రౌఢ సంస్కృతపండితుఁడు ఆంధ్ర భాగవతమును గూడఁ బురాణము చెప్పుచు 'ఓదముత్రవ్వి జీవనపుటోలమునంబడి' అన్న పోతన్న పద్యమున కర్థము చెప్పఁగుదురక యిక్కడఁ బుటోల శబ్దమునకర్థము తెలియలేదు. సంస్కృతాంధ్ర నిఘంటువులలోఁ బటోల పదమున్నదికాని పుటోలపదము లేదు. ఇందేదో తప్పున్నది అని చెప్పెనట! తెలుఁగు మఱుఁగులెఱిఁగిన సహృదయుఁ డొకఁడు మదపుటేనుఁగు వంటిదీపదము. మదము, ఏనుఁగు సమసించినట్లు జీవనము, ఓలము అను పదములు సమసించినవి. ఓలమనఁగా నర్థమిదియనిచెప్పి యా సంస్కృతపండితునకు సహాయపడెనట! ఇది యెనుబది యేండ్లక్రిందట నిజముగా జరిగిన కథ! మా నాయనగారు చెప్పఁగా విన్నాను.

విరాటోద్యోగ పర్వములలోఁ దిక్కనకవితామర్మములు మఱీ ఉన్నవి.

నీతలపేను గంటి నొకనేర్పున శారికి లంచమిచ్చి సం
ప్రీతునిజేసి కార్యగతి భేదము సేయఁగఁ జూచె, దింత బే
లైతిగదే సుమేరు సదృశార్థముఁ జూచియుఁబార్థుఁ బాయునే
యాతఁడు క్రీడి భక్తియును నచ్యుతుపెంపును నీవెఱుంగవే.

శ్రీకృష్ణుఁడు రాయబారము వచ్చినపుడు విదురుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించు సందర్భములోని పద్యమిది. ఇచ్చట నీతలఁపును నేనెఱుఁగుదును. అను ముఖ్యార్థమేకాక అది నీతలలోని పేనువంటిదిసుమా ! అను నర్థాంతరము కూడనున్నది. ఇక్కడఁ దిక్కన యెఱిఁగియే తలపేను శబ్ద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిత్రమునుగూర్చినాఁడు. ఇటువంటి శబ్దార్థ చిత్రములను దిక్కన్న రచనమున నెన్నింటినేని లెక్కింపవచ్చును. నిరుడు నెల్లూరు తిక్కన వర్ధంతి సభలోఁ దిక్కన రచనా విశేషముల గూర్చి చర్చజరిగినట్లు పత్రికలలోఁ జదివితిని. విరాట ద్వితీయాశ్వాసమున సైరంధ్రిని గూర్చి కీచకుని ప్రలాపములలోఁ దిక్కన యశ్లీలార్థ దూషితముగా 'దీనిఁబొందఁగాంచు తెలుఁగునాకెయ్యది యొక్కొ' అని కూర్చెననియు నది కీచక పాత్రోచితమని యొకరును, 'దీనిఁబొంద' యనుచో నశ్లీలార్థము పరిగణింప నక్కరలేదని మఱికొందఱు ననిరట! ఇప్పుడు ప్రచారములోనున్న తిక్కన విరాటపర్వముద్రణము లాఁటేడింటిలోఁ బాఠమిట్లే ముద్రితమై యుండుటచే నీయనర్థము వచ్చినది. తిక్కన రచనమిట్లుండదు. ఈ పద్యముపై నాలుగు సీసచరణములందును దీని జన్మంబున, దీనివల్లభుఁడు, దీని నామాకృతి, దీని వసించుట యని సైరంధ్రీవాచక సర్వనామము షష్ఠీసమాసగతమైయుండఁ గూర్చి గీతిలో మాత్రము 'దీనింబొ౦ఁద' అని వ్యస్తముగా, నపక్రమముగా, నశ్లీలస్ఫోరకముగా దిక్కన కూర్పడు. కాన యిక్కడఁగూడ 'దీనిపొందుఁగాంచు తెలుఁగునాకెయ్యది యొక్కొ' అనియేయుండవలెను. విరాట పర్వముద్రాపకులెల్లరును "దీనిఁబొంద" యనియే గ్రహించుట యనుశోచనీయము. తిక్కన బొందను బ్రయోగింపలేదు. లేఖకులు, ముద్రాపకులు ప్రమాదపుబొందఁబడిరి. విరాటపర్వ ద్వితీయాశ్వాసముననే తిక్కన కవితా మర్మములును, బదలాలిత్యములును, గడుసరికూర్పునేర్పులును నెన్నో యప్రౌఢులైన లేఖకపాఠకముద్రాపకుల మూలమునఁ దార్మారై కానవచ్చినవి. దేశి తెలుఁగు మఱుఁగులెఱింగిన ప్రౌఢాంధ్ర పండితులుగాని గుర్తింపరానివగుటచే ననేకపాఠములు తిక్కన రచనలో నట్లు తార్మారైనవి.

సీ॥ తన్వంగి మవ్వంపుఁ దనులత నెనగెడు
నునుగాంతి వెల్లువ మునుఁగఁబాఱఁ
గిసలయహస్తకెంగేల నేపారుక్రా
మ్మిం చనులేయెండ మిగులఁ బర్వఁ
కమలాస్య ముద్దు మొగంబు లేమెఱుఁగుల
మొత్తంబుపరి చుట్టు ముట్టికొనఁగ
ధవళాక్షితొంగలి తఱచుఱెప్పల చెన్ను
కప్పనుచీకటి గవియుదేర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ॥ బెగ్గలం బంతకంతకు నగ్గలించి,
యొదవి చెమ్మట, చిత్తంబు సెదరి, యెందు
మెలఁగఁ దలఁపేది, యాసింహబలుఁడనంగు
పట్టియాడెడు జంత్రంబుపగిది నుండె.

ఈ పద్యమునెత్తు గీతియందుగల యసమాపక క్రియలనాల్గింటిని, సీసవు నాలుగు పాదములకు యథాసంఖ్యముగాఁ గూర్చుకొని యర్థ మెఱుఁగఁదగును. కాంతి వెల్లువ కీచకుఁడు మునుఁగునట్లు ప్రవహింపగాఁ వానికి బెగ్గలమంతకంతకు నగ్గలమైనది. లేయెండ మిగులఁ బర్వఁగాఁ వానికిజెమ) టయొదవినది. లేమెఱుఁగుల మొత్తమను సైన్యము చుట్టుముట్టుకొనఁగ్మా జిత్తము సెదరినది. కనుఱెప్పల కప్పను చీకటి క్రమ్ముకొనఁగా నెందును మెలఁగలేక పోయినాఁడు. ఇందు, ఎత్తుగీతి పైయర్థమున కనుగుణముగా ముద్రణములందుఁగానరాదు. మఱియు నింకొకపద్యమున,

'కేలిమై నొక్కట లీలఁ గ్రేళ్ళుఱికెడు
వాలుగుసోగల నేలుదెంచి' అనియున్నది

ఏలుదెంచియనుట తిక్కన ప్రయోగముకాదు. ఏఁ గు దెం చు, చనుదెంచు, పుత్తెంచు, తోతెంచు ఇత్యాదిగా గత్యర్థసంబంధములగు ధాతువుల మీఁదనే 'తెంచు' ధాతు వనుప్రయుక్తమగుట భాషలోఁగానవచ్చును. తిక్కన మూఁడు చరణములలోను తెగడి, తూలంద్రోలి, ఉక్కడంచి యున్నవి గనుక యిక్కడఁగూడఁ దదనుగుణముగా 'నేలిదించి' యని యుండఁదగును. ఎల్లిదించు, రూపాంతరము ఏలిదించు. అవహేళనము చేసి యని యర్థము. ఇంకొకటి,

సీ॥ సమదవాఠణము జంగమలత వెనుకొని
నరభసంబునఁ బట్టఁ జనువిధమున
క్రూరదానవుఁడు భూచారి నిర్జరకాంతఁ
బొదువ రయమ్మునఁ బోవుభంగి
ఘోరగృధ్రము సుకుమార నాగాంగనఁ
బటుగతి నొడియంగఁ బాఱుకరణిఁ
బ్రబలబిడాలంబు బాలశారికమీఁద
నడరి సత్వరమున నరుగుమాడ్కి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ॥ సింహబలుఁ డత్యుదగ్రతఁ జిగురుబోఁడి
పజ్జఁ గడువడిఁ దగిలి కోపంబు గదుర
నొడిచి తలపట్టి తిగిచి మహోగ్రవృత్తిఁ
గొంకు కొసరించుకయు లేక కూలఁదాఁచె.

ఈ పద్యమున ద్రౌపది కుపమానములుగా మూఁడు చరణములలో జంగమలత, భూచారి నిర్జరకాంత, సుకుమార నాగాంగన యనునవి భూలోక దుర్లభములున్నవి. నాల్గవ చరణమునఁగూడ నట్లేకదా యుండ వలెను. మఱియు మూఁడు చరణములలోను ద్రౌపద్యుపమాన పదములు ద్వితీయాంతములుగా నున్నవి. నాల్గవచరణమునఁగూడ నట్లేకదాయుండవ లెను. ఈ తీరునఁజూడఁగా

'ప్రబల బిడాలంబు భారతీ శారిక
నడఁప సత్వరమున నరుగుమాడ్కి'

అని యుండుట బాగు. "ఈ భారతీశారిక" పదము "భారతీదేవిముంజేతి పలుకుఁజిలుక" వంటిది. కీచకుఁడు ద్రౌపదిఁగూర్చి చేయు ననందర్భా లాపములలో నీక్రిందిది యొకటి.

చిత్తము మెచ్చినావలనఁజిక్కఁగ వెండియునాలతాంగి య
చ్చొత్తినయట్లు నాకుఁదనయుల్లము తెల్లము సేయకున్కి దా
నత్తఱిఁ గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గు పెంపు న
న్నుత్తలమందఁ జేయుటకునో తలపోసి యెఱుంగనయ్యెడుఁ.

ముద్రణములో నీపద్యమిట్లున్నది. తిక్కన పలుకుబడిగాని, యర్థపుసొంపు గాని యిందుఁ బొందుపడకున్నది. ఇది యిట్లుండఁగాఁదగునని నాతలంపు.

చిత్తముమెచ్చి నావలనఁ జిక్కఁగ వెండియు నాలతాంగి య
చ్చొత్తినయట్లు నాకుఁదనయుల్లము తెల్లము సేయకున్కిదా
నత్తఱిఁగ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గు పెంపొ ? న
న్నుత్తలమందఁ జేయుటగునో ? తలపోసి యెఱుంగనయ్యెదఁ.

రాయబార మరుగునప్పుడు కృష్ణునితో ద్రౌపది తనభంగపాటును జెప్పు పలుకులలో,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంతలు సేసి పోనడిచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె ? యిట్టి యూఱటమదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళు లేవురకునైదు సుయోధనుఁడిచ్చు నొక్కొ ? ఈ
కంతకృపావిహీనమతి నాతఁడు నేఁచునె యన్నదమ్ముల౯.

ఇందు 'ఈకంత' అనుచోఁ గొందఱు వికటార్థములనుగూడఁజెప్పుదురు. ఇక్కడ 'ఒక్కంత కృపావిహీనమతి నాతఁడు నేచునె యన్నదమ్ముల౯' అన్న పాఠము సుందరము. ఇంతవఱకు నేనిప్పుడు వెల్లడించిన సంస్కరణములలోనిది యొక్కటి తక్కఁదక్కిన వెల్లను తిక్కన హృదయము నూహించి నేనే చేసినవికాని వ్రాఁతప్రతులఁజూచి చేసినవికావు. ఈ తీరునఁజూడఁగా దేశి తెలుఁగు మఱుఁగులలో సాటిలేని నేర్పుతో మెలఁగ నేర్చిన తిక్కన సారస్వత భాండారమగు భారత భాగమును నసిగా నుపయోగించుకొనుటకు సమర్థమైన సహృదయ పండితగోష్ఠి జరుగవలెను. ఇట్టి పరిశీలనము జరుగనిచోఁ దిక్కన పదప్రయోగ లాలిత్యము సరిగాఁ బరిజ్ఞాతము కాఁజాలదు.

తిక్కన రచనలో నింకొక వింతతీరు కూర్పును వివరించుచున్నాను. ఆంధ్ర కవితారచనమున వాక్యముల నసమాపకములుగా పద్యమునుండి పద్యమునకు సాగునట్లు కూర్చుటకలదు. అనఁగా నొక వాక్యము రెండు భిన్న పద్యములలో ననుగతమై యుండునన్నమాట. పద్యావసానమునకుఁ బద్యోపక్రమమునకు నడుమఁ గొంతవిశ్రాంతి యుండును. ఒక వాక్యముచ్చరించునపుడుగూడ నడుమ విశ్రాంతి యుండఁదగును గనుక ఆకూర్పు అసందర్భముగాఁదోపదు. కాని రెండు భిన్నజాతివియగు పద్యములలో నొక సమాసపదమునే సంధించి కూర్చుట చాల విడ్డూరముగా నుండును. ద్విపదములు, రగడలు, మొదలగువానిలోను, మాలికావృత్తములలోను నాల్గు చరణములకుఁ బద్యము ముగియదు కాన వానిలోనట్లుండవచ్చునుగాక, భిన్నజాతిపద్యముల యవసానారంభములలోనే ప్రధానముగా సంహిత పాటింపవలసిన సమాసపదము, తిక్కన రచనలోనున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్ప
వలయు మీరు మాయింటికి వచ్చియొక్క
ప్రక్కక్రిందుగ నిరువదియొక్క దినము
లనఘ ! నిద్రించి తదిమొదలైన నీదు—

క॥ చరితం బద్భుతము మునీ
శ్వర ! దీనికిఁ గారణము విచారమున కగో
చరమెఱిఁగింపు మనుడు నా
ధరణీవల్లభునితో నతం డిట్లనియెన్.

'నీదు-చరితము' అన్న సమాసపదము రెండు భిన్న జాతిపద్యముల యంతాదులలోనున్నది. నన్నిచోడ మహాకవికూడ నిట్లొకచోఁ బ్రయోగించినాఁడు. నన్నిచోడకవి పద్యములు కొన్ని :—

గీ॥ రవి పదాహతిఁ జెడియుండు రాజువోలె
నని సరోజములొందఁ జక్రాహ్వయములఁ
జెట్ట లాడుటకని వికసిల్లుటకును
వెల్లనైనట్లు చుక్కలు వెలరువాఱె.

నన్ని - కుమా. ౮ అ.

ముద్రణకై దిద్దవలెను. అర్థము కుదరక గ్రుడ్డుమిటకరించి కొట్టుకొని యెట్టకేల కిట్టు కవి పాఠము కనిపెట్టఁగలిగినాను.

గీ॥ రవిపదాహతిఁ జెడి యుడురాజు వోయె
నని సరోజములొద్దఁ జక్రాహ్వయములు
చెట్టలాడుట, కవి వికసిల్లుటకును,
వెల్లనైనట్లు చుక్కలు వెలరువాఱె.

ఉడురాజు = నక్షత్రాధిపతి, చంద్రుఁడు. ఉడిగిపోవు, ముగిసిపోవు రాజు అనికూడ; ఉడుఁబోతపిందె వంటిది. విరోధియైన యుడురాజు పడిపోవుట నాకసమున కెగసి చక్రవాక పక్షులుచూచి యా సంతోషవార్తను మిత్రములైన సరోజముల యొద్దికివచ్చి, చెట్టలాడుటకును = పడిపోయిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జంద్రుని నిందించుటకును, మఱియు నుత్సాహముతో ఱెక్కలల్లాడు(ర్చు)టకును ననియు, అవి = మిత్రములయిన యానరోజములు, వికసిల్లుటకును = వాని చెట్టలాటకుప్పొంగుటకును, వికాసము చెందుటకును, నవమానము చెంది తెల్లపోయినట్లు చంద్రుని మిత్రములైన నక్షత్రములు కాంతి హీనములై వెలవెలఁ బోయినవి.

కవిహృదయము పైయట్లు గోచరింపఁగా నాకవి నాకుఁ గనకాభిషేకము చేసినాఁ డన్నంత సంతోషమునఁ దోఁగినాఁడను. మఱికొన్ని;

ఆయవనీరుహోద్గతలతాంతవినిర్గత సౌరభప్రవా
హాయతసాంద్రమై ఫలితమై యెుగిఁబర్విన డాయఁబోవనం
బాయను రాకచుట్ట మధుపవ్రజమాలికలుండె నొప్పిపు
ష్పాయుధుకాలఁజుట్టు మరుఁడాయన వప్రము వెట్టినట్టిదై.

నవమాశ్వాసము 208 ప.

దీనికి నా సంస్కరణము.

ఆయవనీరుహోద్గతలతాంత వినిర్గత సౌరభప్రవా
హాయతి సాంద్రమై ఫలితమై మొగిఁబర్విన డాయఁబోవనం
బాయను రాక చుట్టి మధుపవ్రజమాలికలుండె నొప్పి పు
ష్పాయుధుశాలచుట్టు మధుఁ డాయనవప్రము వెట్టినట్లుగా.

పుష్పాయుధశాల కధికారియైన వసంతుఁ డాయాయుధశాలలోని కెవరికిని రాకపోకల వీలులేకుండుటకు చుట్టును నినుపకోట పెట్టినట్లు భృంగమాలికలు పూలచెట్లను జుట్టియున్నవి. పూచినచెట్లు పుష్పాయుధశాలలు. మధుఁడు తదధినేత. ఇందులోఁ బుష్పాయుధుకాళ, మరుఁడు ఉండుట యసంగతము.

సుజనజనైక భూషణము శోరత దుర్జన దూషణంబు న
ద్విజ విబుధాశ్రితప్రతతివేడుకఁబ్రోపును రాజ్యచిహ్నగా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులక కాక యిన్నియును బుట్టికినైనను లేవె చూడఁగ౯.

దీనికి నా సంస్కరణము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సుజనజనైక భూషణము శూరత దుర్జనదూషణంబు స
ద్ద్విజ విబుధాశ్రితవ్రతతి వేడుకఁ బ్రోవును రాజ్యచిహ్నగా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులక కాక యిన్నియును బుంటికినైనను లేవెచూడఁగ॥.

వనధి నీరెల్లఁగొనిపోవఁగని సహింప
కబ్దతతి గిట్టపట్టిన నరుగ నోప
కోలి దొంతులు గొనిపడియున్నకారు
మొగుళులనఁ జూచి తటభూమి మొగళులమరె.

(౧. ఆ. ౧౨౦ ప.)

దీనికి నా సంస్కరణము.

వనధినీ రల్ల గొనిపోవఁ గని సహింప
కబ్ధితటి గిట్ట వట్టిన నరుగ నోప
కోలి దొంతులు గొనిపడియున్న కారు
మొగుళులనఁ బూచి తటభూమి మొగళు లమరె.

అబ్ధికిఁ జుట్టు నబ్ధితటి కాపలా కాయుచున్నట్లును సముద్రములోని నీటిని మెల్లఁగా బైపైకి మేఘము లెత్తుకొనిపోవుటను జూచి యా యబ్ధితటి యా మేఘముల గిట్టలను (వానకాళ్ళను) బట్టి యీడ్చ్రిక్రిందఁ బడవేయఁగా నవి దొంతులు గొనిపడియున్న వన్నట్లును సముద్రతటమున మొగలి చెట్లున్నవి. ఆ మేఘములలోని మెఱువులా యనునట్లు మొగలి పూవులున్నవి.

తనువసితాంబుదంబు సితదంతయుగం బచిరాంశు లాత్మగ
ర్జన ముఱు గర్జనంబు గరసద్రుచి శక్రశరాస నంబునై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రవేల నాఁ
జను గణనాథుఁ గొల్తు ననిశంబు నభీష్ట ఫలప్రదాతగా॥.

(౧ఆ.౭ప.)

దీనికి నా సంస్కరణము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తనువసితాంబుదంబు సితదంతముఖం బచిరాంశు వాత్మగ
ర్జన మురుగర్జనంబు గరసద్రుచి శక్ర శరాస నంబునై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రవేళ నాఁ
జను గణనాథుఁ గొల్తు ననిశంబు నభీష్ట ఫలప్రదాతగాఁ.

(౭ ఆ. ౭ ప.)

విఘ్నేశ్వరుఁ డేకదంతుఁడు కాన సితదంతయుగంబని యుండరాదు. అచిరాంశువు = మెఱుపు. అది ఉపమానముకాన యప్పుడప్పుడు మాత్రమే కన్పడునదిగా నుండవలెను. సితదంతముఖంబనుటలో నోరు తెఱచినప్పు డగపడుట, మూసినప్పుడగపడకుండుట దంతాగ్రమునకు కలిగి యచిరాంశు సామ్యము సిద్ధించును.

ముదమున సత్కవి కావ్యము
నదరఁగ విలుకానిపట్టినమ్మును బరహృ
ద్భిదమై తలయూపింపని
యది కావ్యమె మలరి పట్టినదియును శరమే. (౧ ఆ. ४౧ ప.)

వ్రాఁతప్రతిలో నీ పద్య మిట్లున్నది.

మదమున .... కావ్యము
నదరంగ విలుకాని పట్టినమ్మునుం బరహృ
ద్భిదమై తలయూపింపని
యదిగావ్యమె మరి పట్టినదియుఁ శరమే.

దీనికి నా సంస్కరణము.

ముదమునఁ గవికృతి కావ్యము
నదరున విలుకాని పట్టినమ్మును బరహృ
ద్భిదమై తలయూపును, బెఱ
యది కావ్యమె చెప్పఁ, బట్ట నదియుఁ శరమే.

ముదముతోఁ గవిరచించిన కావ్యమును- అదరుతో విలుకానిపట్టిన యమ్మును ఒరుని హృదయ భేదనము గావించి తలయూపించును. అట్లు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కానిచో, రచించినంతమాత్రముచే నది కావ్యముకాదు. చేతఁబట్టినంత మాత్రముచే నది శరమునుగాదు. కావ్యమును, శరమును రెండును బర హృదయ భేదనముచేసి తల యూపించునవే కాని కావ్యము దానిని ముద ముతోఁజేయును. బాణమదరుతో జేయును. ముద్రితప్రతిలోని, వ్రాఁతప్రతి లోని పాఠములకు సరసాన్వయము కుదురలేదు.

జా నటీ పశుపతి నుఱక వి
ధాన మహారంభుఁడైన దక్షుండను న
జ్ఞానికిమునుకొని వచ్చున
మానంబన సమర సతివిమానము వచ్చెన్. (౨ అ. ౧౫ వ.)

దీనికి నా సంస్కరణము.

జా నటీ పశుపతి నుఱక వి
తానమహారంభుఁడైన దక్షుండను న
జ్ఞానికి మునుకొని వచ్చువి
మానంబన సమర సతివిమానము వచ్చెన్. (౨ అ. ౧౫ వ.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మహనీయ కవిత్రయము

నన్నయ

మదమాతంగ తురంగ ముఖ్య పరసంపన్నుండు నన్నయ తొ
మ్మిది నూరేండ్లకుముందు జూపె కవితోన్మేషంబు సర్వాంధ్ర సం
పద పెంపొంద చళుక్యవల్లభుఁడు సామ్రాజ్యాభిషిక్తుండుగా
నది నాబోటికి నేటి కబ్బునలె వ్యాఖ్యానింప నాఖ్యానమున్.

ఇది రాజరాజు తొమ్మనూరేండ్ల పట్టాభిషేకోత్సవము రాజమహేంద్ర వరములో జరిగినప్పుడు నన్నయనుగూర్చి నేను చెప్పినది.

గోదావరీ, కృష్ణా, పినాకినీ నామక జీవనదీ త్రయము ఆనకట్టలాకట్టగా శాఖోపశాఖలతో కాల్వలై చిరుకాల్వలై పాయలై పారి బహుళాంధ్రదేశమును పాడిపంటలతో సుక్షేత్ర పఱచినట్లు నన్నయ తిక్కన యెఱ్ఱన నామక జీవ కవిత్రయము తమ వాగ్ధారలను భారత గ్రంథ సదస్సులో ప్రతిష్ఠించి తర్వాతి సర్వాంధ్ర కవుల హృదయ క్షేత్రములందును రసధారలు పాఱించి దివ్య కావ్య సస్యములను పండించుచున్నది.

కవిత్రయమువారు దైవభక్తులు. సదాచారులు. ఉత్తమ పండితులు.

కవితా తపస్సుచేసి వారు కాంక్షితార్థములను అంతర్వాణి యుద్బోధములతో నందుకొని కావ్య రచన కావించినారు.

తర్వాతి సర్వాంధ్ర కవి కుటుంబములకు వారి పవిత్ర వాక్కులు నిక్షేపముగా లభించిన బంగారునక్కులు.

ఆ ముప్పుర రచనలు జడవాఱీ వెలసిన మహా గ్రంథము ఆంధ్ర మహాభారతము.

సంస్కృత భారతము అయిదు వేలేండ్లనాటి పాత కాలపు గ్రంథమైనా నేటిదాకా సర్వ ప్రపంచముదాకా, దాని పలుకుబడి, చెల్లుతూనే ఉన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అట్టి మహాభారతమును సర్వాంధ్ర గ్రంథ కర్తలకు తొట్టతొలుతటి వారై తెలుగున పుట్టింపబూనిన కవితా జనకుడు నన్నయభట్టు.

ఆతని యాద్య కవిత్వమునుగూర్చి, భాషాచ్ఛందోవ్యాకరణ లక్షణ కల్పనా ప్రౌఢిమనుగూర్చి ఇతరవాదములనుగూర్చి పైవారం* ప్రసంగిస్తాను.

ఈనాటి ప్రసంగము నన్నయ రచనా వైశారద్యమునకు మాత్రమే సంబంధించినది.

భారతేతిహాసములోని పాత్రముల భావములు సంభాషణములు కొన్ని కొన్ని చాలా పాతకాలపువి గనుక అమాయికములూ వ్యంగ్యవక్రోక్త్యాది కవితా కౌటిల్యములు లేనివిగా ఉంటవి. అట్టి వాటిని తెలుగు చేయడంలో నన్నయ తిక్కనలు విభిన్నరీతుల నాశ్రయించినారు.

నన్నయ తననాటికి విపుల వ్యాప్తి చెందిన కావ్యాలంకారశాస్త్ర సంప్రదాయములను అంతగా తన పరివర్తనమున చాటింపక మూలగ్రంథపు ముగ్ధతా మాధుర్యములనే కాపాడినాడు.

తిక్కన తన పరివర్తమున తననాటి కావ్యాలంకారశాస్త్ర సంప్రదాయములను చొప్పించి ఔచితీ నిర్వహణార్థమై పురాణ కథార్థములను కొన్నింటిని తననాటి వాటినిగా మార్చుకొన్నాడు.

తిక్కన చేసిన మార్పు కావ్యవైదగ్ధ్యస్ఫోరకమును నవ్యరసికాహ్లాదకమును అగునుగాని నన్నయ తీరు తద్దేశతత్కాల తత్కథాపాత్ర స్వభావానుగుణమై మౌగ్ధ్య మాధుర్యమహితమై ఆర్షమైయున్నది.

నన్నయ శకుంతలోపాఖ్యానరచన కావ్యోచిత రీతిని చూడగా గ్రామ్యతాదోషజుష్టముగా ఉంటుంది. వ్యాసుడే ఈ ఘట్టమునట్లు రచించినాడు.

వ్యాసునికి పూర్వము భామహదండ్యాదుల కావ్యానుశాసనములు లేకపోవడముచేతనో కాళిదాసాదులవంటి కవుల శృంగార రసకల్పనా శిల్పము లప్పటికి వెలయకపోవడముచేతనో, అమాయికమైన సత్యకాలపు మునివాటికా బాలికలముగ్ధభావములను సంభాషణములను పాటించడమే బాగనుకోవడము

* ఈనెలం 30 వ తేదీనాడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేతనో వ్యాసుడట్లు చేసినాడు. నన్నయ దానినట్లే ఉంచి తెలిగించినాడు. తిక్కనయగుచో ఆపట్టును వ్యంగ్యవక్రోక్తికల్పనా శిల్పములనెట్టుకొల్పి క్రొత్తతీరుగా పుట్టించి ఉండేవాడేమో....

నాటకరూపమున కాళిదాసు దానినట్లే మార్చివేసినాడుగదా....

నన్నయరచన ఆకథాకాలమునకూ, ఆకథాపాత్రములకూ అచ్చముగా అత్తిపోతుంది.

నన్నయదొాక ఋషిమార్గము
తిక్కనదొాక రసమార్గము

ఇందుకొాక సంగ్రహోదాహరణ ...

'ఏనుకచుండనువాశ మహానియమ సమన్వితుడ బృహస్పతి సుతుడన్' అని చెప్పి శుక్రుని శుశ్రూషించిన కచుణ్ణి శుక్రుని కూతురు పరమ దయాశాలిని, పవిత్రశీల అయిన దేవయాని ఇట్లు కోరినది.

"నీవును బ్రహ్మచారివి వినీతుడవేనును గన్యకన్ మహీ
దేవకులావతంస! రవితేజ! వివాహము నీకునాకు మున్
భావజశక్తినైనయది పన్నుగనన్ను బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రుదయజేయుము నాకు బ్రియంబునావుడున్...'

కచునిచే దేవయాని నిరాకృతయైనది. పిదప దైవకృతముగా నాపుణ్యశీల యయాతి మహారాజు పాణిగ్రహణము పడిసినది. ఆ పాణిగ్రహణపు తీరు యయాతికి తెలియక ఆకస్మికముగా జరిగినది. అది దేవయాని కాంక్షించినది కానేకాదు. ఆకస్మికముగా జరిగిన యా పాణిగ్రహణమును, దైవకృతమునుగా గుర్తించి కొంతకు తర్వాత దేవయాని యయాతితో ఇట్లనుచున్నది.

నిగ్రహమేది నన్ను ధరణీవర, కూపమువెల్వరించునాఁ
డుగ్రమయూఖ సాక్ష్యముగనున్న తదక్షిణపాణిజేసి భూ
పాగ్రణి నాదుదక్షిణ కరాబ్జమువట్టితి కానమున్ను పా
ణిగ్రహణంబు సేసితది నీ యెడ విస్మృతిబొాందబాతియే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై సందర్భములు ఏకత్రైవిానురాగశ్చేత్, అనీకన్యేకామయమానయాం, నత్వంకామయసేకథం, 'ఇతిగ్రామ్యోయమర్థాత్మా వైరస్యాయైవకల్పతే' అనీ ఉన్న అర్వాచీనాలంకారిక నిందలకులక్ష్యములేకాని, అవి సత్యకాలపు కన్యకల తీరులే. మౌగ్ధ్యమాధుర్యభాసురములే కనుక ఆయా పట్టుల నన్నయ రచన నాకు మహా మనోహరముగా ఉంటుంది.

నన్నయ ఛాయననుసరించి శ్రీనాథుడు కూడా హరవిలాసములో పార్వతిని మాయావటుడు పెండ్లాడగోరు పట్టున ఇట్లు చెప్పినాడు.

"ఏనును బ్రహ్మచారిఁదరళేక్షణ! నీవునుగన్యవింతకా
లానకునీకుఁబెండ్లియె ఫలంబగునేని, విచారమేల ? స
న్మానముతోడ నన్ను ముని మాన్య వివాహముగమ్ము, లెమ్ము, కా
దేని తపంబులోని సగమిచ్చెద మాను తపోభిమానమున్"

ఈ పద్యము నన్నయ తీరున మన్నింపదగినదేకాని కాళిదాసు తీరున గ్రామ్యతాదోషజుష్టమే. కాళిదాసు.

"కియచ్చిరం శ్రామ్యసిగౌరివిద్యతే
మమాపిపూర్వాశ్రమసంచితంతపః
తదర్థభాగేనలభస్వకాంక్షితం
వరంతమిచ్ఛామి చసాధువేదితుమ్"

అని తన రసభావశ్లేషధ్వని చమత్కారములను మాయావటునిపై చొప్పించి శ్లోకము చెప్పినాడు. శ్రీనాథుడీ శ్లోకమును తెలిగించక నన్నయనే వెన్నాడినాడు. నన్నయ మార్గమే అతనికి నచ్చి ఉంటుంది.

కవుల కవితను విమర్శించేటప్పుడు విమర్శకుడు తనకాలపు భాషా కవితా సందర్భములనే చూచుకొంటే తంటా వస్తుంది. ఇందుకొక ఉదాహరణ :-

"పలుతెఱంగుల పిండివంటలు బప్పుకూడును నేతికుం
డలుగుడంబుదధిప్రపూర్ణ ఘటంబులుంగొనివచ్చి యా
నలఘునత్త్వుడు మారుతాత్మజుఁడన్నిటన్ గతఖేదుడై
బలముగల్గి కడంగెనప్పుడు బ్రాహ్మణార్థము సేయగాన్"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పిండివంటలు, పప్పు, నెయ్యి, పెరుగు, అన్నము ఉన్నవి గనుక పద్యములోని బ్రాహ్మణార్థమును నేటి తద్దినపు బ్రాహ్మణార్థముగా ఇప్పటి వారర్థము చెప్పుట తప్పిదమవుతుంది. భీముడు పిండివంటలు మొదలగు వాని నారగించి, ఆకలి నకనక తీరినవాడై బలముచెందినవాడై బ్రాహ్మణార్థములను బ్రాహ్మణ ప్రయోజనము అయిన బకాసురవధను అప్పుడు చేయగా గడగెను.... అని పద్యార్థము.

రీతియే కావ్యాత్మ అన్న వామనోక్తిమీద వలపో కర్ణాటక పంపకవి కవితతోడి పరిచయపు బలుపో, అది యొక అదృష్ట విశేషమోయేమో, కాని మధురాక్షరవిన్యాసముతో గమకయమకచమత్కారగతితో ప్రసన్నార్థముతో పాలగచ్చుపై ముత్యాలు పర్వెత్తించినట్లు పద్యాలు నిర్వర్తించడంలో నన్నయ ఆనాటికీ యీనాటికీ కూడా ఆది కవియే. పద్య విద్యాగురుడే.

తర్వాతి సర్వాంధ్రకవులూ ఆయన చరణాలందుకొని వందనములు చేసినవారే.

'విలువిద్యనొరులునీక, గ్గలముగ లేకుండ నిన్ను గఱపుదునని మున్
పలికితిరి నాకకాదిత్రిలోకముల కధికుజూచితిమియొకయెఱుకున్'

ఈ పద్యమున నాలుగోచరణము తొల్త జగణపు టుయ్యాల యూపులో తర్వాతి కవు లనేకులు హాయిగా ఊగుతూవస్తున్నారు.

ఈ ఊపులో పింగళిసూరన్న ఎట్లా ఊగినాడో గుర్తించండి.

'అపుడించుక తడవన్యో, నృపాణి సంస్పర్శ సంభృతానంద స్తం
భవరీతాత్మతనుండిరి; ప్రపంచమంతయును మఱచి పతియున్
సతియున్'

నన్నయజగణపుటూపుత్రిలోకములకూ అంటగల్గినది.
సూరన్నజగణపుటూపు ప్రపంచమంతయు మరపించజాలినది.

శ్రీనాథపెద్దనాదికవీశ్వరులు చంపకోత్పలాది పద్యములలో మూడు నాల్గు చరణములను ఒక సంస్కృత సమాసపు జాడింపున జాడించి హాయి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హాయి మనిపించడం ఉంటుంది. ఈ హృద్యపద్యవిద్యకుకూడా నన్నయయే ఆద్యగురువు. ఈ పద్యాలు వినండి.

"అలయక ధర్మశాస్త్రములయందు బురాణములందు జెప్పను
త్పలదళనేత్ర విందుమయపత్యము మేలని కావునన్ యశో
నిలయుల బుత్త్రిలంబడయు నీ కొనరించెద సంగతాంగుళీ
దళవిలసన్మదీయకరతామరసద్వయయోజితాంజలిన్"

"అనుపమకార్ముకాదివివిధాయుధవిద్యలయందుగోవిదుం
డనగనజయ్యుడై పరగునర్జుని బోలగనన్యులెందులే
రను జనఘోషముచ్చరితమయ్యెమరుచ్చలితోచ్చవీచిని
స్వనముఖరాబ్ధివేష్టిత విశాలమహీవల యాంతరంబునన్"

"అతులవిభూతితో మణిమయాభరణద్యుతులొప్పగా శత
క్రతుడుశచీసమేతుడయికాంచనచారువిమానమాలికా
గతదివిజోత్తముల్ గొలువగా గొలువుండువరాప్సరోంగనా
యతవిలసత్కటాక్షకుసుమార్చిత సుందరవక్త్రచంద్రుడై"

రసము, భావము, రీతి, అనేవి మూడూ ముప్పిరిగొని జిగిబిగులతో ముచ్చట్లుగొల్పే పద్యములు ఇవి మూడువినండి.

"ప్రకటితకోపవేగమున బద్మదళాయతనేత్రముల్ భయా
నకతరలీలదాల్చెనరుణద్యుతినుద్యతమైత్రిశాఖమై
భ్రుకుటిలలాటదేశమున బొల్చెద్రికూటతటిత్రిమార్గగా
సుకృతి ప్రభంజనప్రియతనూజునకంతకమూర్తికచ్చటన్."

"ధారుణిరాజ్యసంపదమదంబునగోమలిగృష్ణజూచి రం
భోరునిజోరుదేశముననుండగబిల్చిన యిద్దురాత్ముదు
ర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాతభ
గ్నోరుతరోరుజేయుదు సుయోధనునుగ్రరణాంతరంబునన్"

(4)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ క్రింది పద్యపు గడపటి చరణములో విశేషణములు విశేష్యమునకు తర్వాతనుండి ఒకదానికంటె ఒకటిగా గుణిత్తరములై అవిమృష్టవిధేయాంశ మనీ, పతత్ప్రకర్ష మనీ.... అనబడే కావ్యదోషములకు వ్యతిరేకముగా కావ్య గుణముల కుదాహరణతను గల్పిస్తున్నవి.

'సుతజననోత్సవంబునవిశుద్ధయశుండుయుధిష్ఠిరుండు సం
భృతహృదయ ప్రమోదుడయిపెంపుననిచ్చెసువర్ణభూషణ
ప్రతతులుగోధనాయతము బ్రాహ్మణముఖ్యులకున్ నిరంతర
వ్రతులకు వేదవేదులకు వారిజసంభవునట్టివారికిన్."

ఈ విధముగా నన్నయ రచనలలో పలుపోకడల గుణవిశేషములను పరి గణింపవచ్చును. ఆయన రచన రసధారల యూటపట్టు. ఆంధ్రకవులకాతడు 'మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః'

నన్నిచోడాది కవీశ్వరులాయన రచనలను ఎన్నిటినో పుణికిపుచ్చు కొన్నారు. నన్నయనన్నిచోడుల పద్యములివిరెండు వినండి.

"తడబడబడియెదురవమును
బడికాలెదురవముగాలిపలుదెరగులవ్ర
స్సెదురవమునుదిగ్వలయము
గడుకొన్ని మ్రోయించెనురగకాయోత్థితమై" - నన్నయ

'గిరిసుతమైకామాగ్నియు
హరుమైరోషాగ్నియుందదంగజుమైను
ద్ధురకాలాగ్నియురతిమై
సురుశోకాగ్నియునుదగిలినొక్కటనెగసెన్.... నన్నెచోడుడు.

తిక్కన శ్రీనాథుడు పోతన పెద్దన మొదలగు మహాకవులు నన్నయ రచనములలోని పలుకు పొలుపులను పెక్కింటిని బరిగ్రహించినారు. వాటిలో కొన్నింటినైనా ఎత్తిచూపుటకు సమయముచాలదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నన్నయరచన ధర్మోదాత్తము. కర్ణాటకములోని జైనభారతపుటలజడి తెలిసినవాడుగనుక తెలుగునాటిలో వ్యాసభారత ధర్మవిశేషములను వెలయింపగోరి అతడు కావ్యరచనకు కడగినాడు.

భారతము నీతిశాస్త్రగ్రంథమని ప్రఖ్యాతిగన్నది. నన్నయ భారత భాగములోని నీతిపద్యములు రీతిహృద్యములు, సౌలభ్యసుందరములు.

తెలుగు కవులందరిలో వచన రచన నన్నయచేసినట్లు మరియేకవీ చేయలేకపోయినాడు. ఆ వచన రచనలో పలుకుబడి బహుమనోహరము. వాక్యములు సులభమయినవి. అనుప్రాసపు ధట్టింపులందుండవు. వచనఖండముల పరిమాణము మితమై పులకండముల బోలియుండును. ప్రపంచ భాషలలో ఆంధ్రభాషకు, ప్రపంచ కవితలలో ఆంధ్రకవితకు ఏదైనా అగ్రస్థానము అబ్బదగిన యోగ్యత ఉంటే ఆ యోగ్యతా భారమంతా నన్నయ భారతభాగమే మో యనవలసినదవుతుంది. ఆ పుణ్యమూర్తికి వందనము. ఆయనకాశ్రయమిచ్చి పోషించిన చాళుక్య రాజరాజుకీర్తి పతాక చిరస్థాయిగా వెలయును.

'మదమాతంగతురంగముఖ్యపదసంపన్నుండు నన్నయ్య తొ
మ్మిది నూరేండ్లకు ముందు జూపెకవితోన్మేషంబు సర్వాంధ్ర సం
పద పెంపొందచళుక్యవల్లభుడు సామ్రాజ్యాభిషిక్తుండుగా
నదినాబోటికినేటికబ్బునటె వ్యాఖ్యానింపనాఖ్యానమున్"....

గం.సూ.

రేడియో ప్రసంగము
మదరాసు : 23-11-1946
విస్తృత పాఠము
తెలుఁగు మెఱుగులు
1948 - ప్ర. ము.
1960 - తృ. ము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్ర మహాభారత ప్రశంస

తిక్కన

పదలాలిత్యము విషయంలో 'ఆంధ్రమహాభారత' రచయితలలో, అధిక గ్రంథకర్తయైన తిక్కన సోమయాజుల రచనమును మాత్రమే పురస్కరించుకుని యిప్పుడు ప్రసంగిస్తున్నాను. తిక్కన స్వయము కవీశ్వరుఁడగుటేకాక పలువురు కవులతో సరసకవితా వినోదములు కూడా జరిపినవాడు. తన యాస్థానిలో నొక కవీశ్వరునికీ సమస్య నిచ్చినాఁడట;

ఆకులు పోకలుంగలుగునంతియ చాలును సున్నమేటికిన్-ఆ కవి యిట్లు పూరించినాఁడు.

శ్రీకరమూర్తి హరి గుణశేఖర కొమ్మయ మంత్రి తిక్క నీ
రాకలు వార్చు ముగ్ధకనురాగమునన్ బెనుమన్మథాగ్నిచేఁ
బ్రాకటమైన ముత్యములు భస్మములాయెను వేగరావనా
ఆకులు పోకలుంగలుగు నంతయుచాలును సున్నమేటికిన్-ఇట్లు

సరసకవితా వినోదగోష్ఠియు, లౌకిక వైదిక మహాతంత్ర నిర్వహణ శక్తియు గల్గిన తిక్కన సోమయాజు లభిమానించు కావ్య రచనావిధానమిట్టిది.

కం. లలిత పదహృద్యపద్యం, బులనకథార్థంబు ఘటితపూర్వాపరమై
యలఁతి యలఁతి తునియలగాహల సంధించిన విధంబునమరగ
వలయున్॥

చిన్ని చిన్నివిగా రాగిగొట్టపు (దునుకలను రచించి వానిని వాటముగా బిగియనపికించి, బాకాచేసి, దానినూది మనోహర ధ్వనిని వెలువరించినట్లు లలిత పదములతో హృద్యములనుగఁ బద్యములను రచించి వానితోఁ బూర్వాపర కథార్థములననుసంధించి కవిత కూర్చితేఆకావ్య శ్రవణము శ్రోతలకు హృద్యముగా ఉంటుంది. అని దీని తాత్పర్యార్థము. ఇంకా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పలుకుల పొందులేక రసభంగముసేయుచుఁ బ్రాంతవడ్డ మా
టలుగొని నేర్పు సూపి యొకటన్ హృదయం బలరింప లేకయే
పొలమును గానియట్టి క్రమమున్ దమమెచ్చుగ లోకమెల్ల న
వ్వులఁబొదయన్ జరించు కుకవుల్ ధరదుర్విటులట్లచూడఁగాన్॥

దీనినివ్యాఖ్యానిస్తేచాలాఅవుతుంది.పలుకుబడిపొందికతోరసభంగములేకుండా పలువురు రసజ్ఞుల వ్యవహారములోఁబరిపాటింయయిపోయిన పలుకుబళ్ళనే పాడినదే పాటగాగూర్పక, లేక, యుపయోగము తప్పిన, పాతబడిపోయిన, పలుకులను వాడక, సత్కవిత రచింపవలెను" అని యా పద్యము తాత్ప ర్యము. నన్నయ సంస్కృతపదబహుళమై, ప్రసన్నార్థమయి, సర్వసులభమైన రచనమును చేయగా తిక్కన దేసిపలుకులమెలపులతో కవితామర్మములతో, సంస్కృతమున వ్యాసుఁడు చొప్పించినట్లు పెక్కు చోట్ల గ్రంథగ్రంథులను జొప్పించి, తన గ్రంథమును ప్రౌఢరసికాంధ్ర పండితైక వేద్యముగా దివ్య కావ్య శయ్యతో నిర్వహించినాఁడు. తిక్కన గ్రంథ గ్రంథులను గొన్నిటిని జూపుచున్నాను.

గురునిమాట సరకుగొనమి దుశ్శీలత, పిట్టఁబడుకఁగోరుఁ బిసుకఁదుౘింపఁ
గరవమరుగుటుదయకాలాస్తమయ, సమయములభానుజూచుటాయుపడచు.

ఈ పద్యమునఁగవితామర్మమున్నది. కొౘిత్తవారీపద్యమునర్థమును గుర్తింపఁ జాలరు. వృద్ధవిద్వాంసులమూలముననో, సంస్కృతమూలము మూలముననో గుర్తింపవలసినది దీని యర్థము.

"లోష్టమర్దీ తృణచ్ఛేదీ నఖఖాదీచయోనరః నిత్యోచ్ఛిష్టః" — అనుమూలమునకిది తెనుగు. పిట్ట, పుడుక, గోరు అనగా లోష్టము, తృణము, నఖము అనువానిని పిసుకుటకును, త్రుంపుటకును, కఱచుటకును అలవాటు పడుట ఆయువును హరించునని యర్థము. తిక్కన దీనిని "బెడ్డ పిసుక = బిదుప = " పుడుక విరువ గోరు గరవ, మరుగుటుదయ అని సులువుగా కూర్పవచ్చును. అయినను నిందు యథాసంఖ్యాలంకారముచేర్చి, పిట్టపుడుక గోరుఅనుచో పిట్టను పట్టుకోగోరు నట్టియని పదార్థాంతరాభా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సచిత్రమును కల్పించి పాఠకులను లోఁతు యోచనకుఁబాల్పఱుపఁజూచి నాఁడు. మరియు,

క. అనిననలుగాలివాన గోవునునశేష
శబ్దములమంత్రమును లోహజాతిఁగాంచ
నమునుమనుజుల విప్రుండు సమధికత్వ
భాజనములండ్రు వేద ప్రపంచ విదులు॥

తెలుగుకూర్పు మెఱుగులెఱుగని వారైనచో ప్రౌఢ సంస్కృత పండితులు సైతము ఈ పద్యమున నలుగేమిటి? గాలివాన యేమిటి? అనన్వితముగా నున్నవేయని యంగలార్తురు. తిక్కన యిక్కడ చతుష్పాత్తులనికాని, నాలుగు కాళ్ళ జంతువులని కాని సులువుగా అనలేడా? అనగలడుగాని నలుడు, గాలి వాన అన్న ప్రసిద్ధ పదముల ఝడితస్ఫూర్తి కలిగి పాఠకుల కనన్వయము తోచి లోతైన యోచనతో తదాభాసచిత్రము గోచరించునట్లు కవితావిమర్శ మిక్కడ కల్పించినాడు. సంస్కృతభాగవతమును బలుతూరులు పురాణము చెప్పిన యొక ప్రౌఢ పండితుడు ఆంధ్రభాగవతమును గూడపురాణము చెప్పుచూ ఓదముత్రవ్వి జీవనపుటోలమునంబడి అన్నపోతన పద్యమునర్థము చెప్పఁగుదురక యిక్కడ పుటోల శబ్దమునకర్థము తెలియలేదు. సంస్కృతాంధ్రనిఘంటువులలో పటోలపదమున్నదిగాని పుటోలపదములేదు. ఇందేదో తప్పున్నది అని చెప్పెనట; తెలుగు మఱుగులెరిగిన సహృదయుడొకడు "మదపుటేనుగు" వంటిదీ పదము. మదము ఏనుగు సమసించినట్లు జీవనము, ఓలము అను పదములు సమసించినవి. ఓలమనగా అర్థమిదియని చెప్పి యా సంస్కృత పండితునకు సహాయపడెనట, ఇది యెనుబదియేండ్ల క్రిందట నిజముగా జరిగిన కథ. మా నాయనగారు చెప్పగా విన్నాను—

విరాటోద్యోగపర్వములలో తిక్కన కవితా మర్మములు మఱీ ఉన్నవి.

నీ తలపేనుగంటి నొక నేర్పున శౌరికిలంచమిచ్చి, సం
ప్రీతుని జేసి కార్యగతిభేదము సేయఁగ జూచె, దింత బే
లైతిగదే సుమేరు సదృశార్థము జూచియు బార్థుబాయునే
యాతడు, క్రీడి భక్తియును నచ్యుతు పెంపును నీవెఱుంగవే,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీకృష్ణుడు రాయబారము వచ్చినప్పుడు విదురుడు ధృతరాష్ట్రునితో సంభాషించు సందర్భములోని పద్యమిది. ఇచ్చట "నీతలపును నేనెఱుగుదును" అనుముఖ్యార్థమేకాక అది నీ తలలోని పేనువంటిది సుమా అనువ్యంగార్థము కూడా నున్నది. ఇక్కడ తిక్కన యెరిగియే తలపేను శబ్దచిత్రమును గూర్చినాడు. ఇటువంటి శబ్దార్థచిత్రములను తిక్కన రచనముననెన్నింటినేని లెక్కింపవచ్చును. ఈ నడుమ నెల్లూర తిక్కన వర్ధంతి సభలో తిక్కన రచనా విశేషములగూర్పి చర్చ జరిగినట్లు పత్రికలలో చదివితిని. విరాట ద్వితీయాశ్వాసమున సైరంధ్రిని గూర్చి కీచకుని ప్రలాపములలో తిక్కన యశ్లీలార్థదూషితముగా "దీనిబొందగాంచు తెఱగు నాకెయ్యది యొక్కొ" అని కూర్చెననియు, నది కీచక పాత్రోచితమని, యొకరును, దీనిబొంద అనుచో నశ్లీలార్థము పరిగణింప నక్కరలేదని మఱి కొందరు ననిరట. ఇప్పుడు ప్రచారములోనున్న తిక్కన విరాటపర్వ ముద్రణములాతేడింటిలో పాఠమిట్లే ముద్రితమై యుండుటచే నీ యనర్థము వచ్చినది. తిక్కన రచనమిట్లుకాదు. ఈ పద్యము పై నాలుగు సీస చరణములందును దీని జన్మంబున, దీనివల్లభుడు, దీనినామాకృతి, దీనివసించుట, యని సైరంధ్రీవాచక సర్వనామము షష్ఠీ సమానగతమై యుండగా గీతిలో మాత్రము "దీనిబొంద" యనివ్యస్తముగా, సపక్రమముగా, సశ్లీలస్ఫోరకముగా తిక్కన ప్రయోగింపడు. కాన యిక్కడ కూడ "దీని పొందుగాంచు తెఱగు నాకెయ్యది యొక్క" అని యేయుండవలెను. విరాట పర్వముద్రాపకులెల్లరును విమర్శకులెల్లరును "దీనిబొంద" యనియే గ్రహించుట యనుశోచనీయము. తిక్కన "బొందను ప్రయోగింపలేదు. లేఖకులు, ముద్రాపకులు "ప్రమాదపు బొంద(బడిరి. విరాట పర్వద్వితీయాశ్వాసముననే తిక్కన కవితా మర్మములును, పదలాలిత్యములును, గడుసరి కూర్పునేర్పులునునెన్నో యప్రౌఢులైన లేఖక. పాఠక ముద్రాపకుల మూలమున తార్మారై కాన వచ్చినవి. దేశి తెలుగు మఱుగులనెదిగిన ప్రౌఢాంధ్ర పండితులుగాని గుర్తింపరానివగుటచే ననేక పాఠములు తిక్కన రచనల్లో నట్లు తార్మారైనవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తన్వంగి మవ్వంపుఁ దనులతనెసఁగెడు నునుగాంతి వెల్లువమునుగఁ బాలఁ
గిసలయ హస్త కెంగేలనేపారుక్రొమ్మించనులేయెండమిగులఁ బర్వఁ
గమలాస్యముద్దుమొగంబు లేమెఱుగుల మొత్తంబు పరిచుట్టుముట్టికొనగ
ధవళాక్షి తొంగలి తఱచు ఱెప్పలచెన్ను కప్పను చీకటి గవియుదేర
బెగ్గలంబంతకంతకు నగ్గలించి, యొదవిచెమ్మట, జిత్తంబు సెదరి, యెందు
మెలగఁ దలపేది యా సింహబలుడనంగు పట్టి యాడెడు జంత్రంబు
పగిదినుండె.

ఈపద్యమునెత్తు గీతియందు గల యసమాపక క్రియల నాల్గింటిని, సీసపు నాలుగు పాదములకు యథాసంఖ్యముగాఁ గూర్చుకొని యర్థమెఱుగఁ దగును. కాంతి వెల్లువ కీచకుడు మునుగునట్లు ప్రవహింపగా బెగ్గలమంత కంతకగ్గలమైనది. లేయెండమిగుల బర్వగా చెమటయొదవినది. లేమెఱుగుల మొత్తమును సైన్యము చుట్టుముట్టికొనగా చిత్తము చెదరినది. కనుఱెప్పల కప్పను చీకటి క్రమ్ముకొనగా నెందును మెలగలేకపోయినాడు. ఇందు ఎత్తు గీతి, పైయర్థమున కనుగుణముగా ముద్రణములందుఁ గానరాదు. మఱియు:

'కేలమై నొక్కట లీలఁగ్రేళ్ళుఱికెడు నాలుగు సోగలనేలుదెంచి' ఇంచు ఏలుదెంచి యనుట తిక్కన ప్రయోగముకాదు. ఏగుదెంచు. చనుదెంచు, పుత్తెంచు, తోతెంచు, పఱతెంచు ఇత్యాదిగా గత్యర్థసంబంధము అగు ధాతువులమీదనే తెంచు ధాతువను ప్రయుక్తమగుట భాషలోఁగానవచ్చును. తక్కిన మూడు చరణములలోను తెగడి, తూలద్రోలి, ఉక్కడంచి యున్నవి గనుక యిక్కడకూడ తదనుగుణముగా నేలిదించి యని యుండఁదగును. ఎల్లిదించు, ఏలిదించు రూపాంతరములు. అవహేళనము చేసి యని యర్థము. ఇంకొకటి.

సమదవారణము జంగమలత వెనుకొని సరభసంబునఁ బట్టఁ జనువిధమునఁ
గ్రూరదానవుఁడు భూచారినిర్జరకాంతఁ బొదువరయమ్మునఁ బోవుభంగి
ఘోరగృధ్రము సుకుమార నాగాంగనఁ బటుగతి నొడియంగఁ బాఱుకరణిఁ
బ్రబలబిడాలంబు బాలశారిక మీద నడరిసత్వరముగ నరుగుమాడ్కి —
సింహబలుఁడత్యుదగ్రతఁ జిగురుబోడి పజ్జఁగడువడిఁ దగిలి కోపంబుగదుర
నొడిచి తలపట్టి తిగిచి మహోగ్రవృత్తిఁ గొంకు కొసరించుకయులేక
కూలఁవైచె!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈపద్యమున ద్రౌపది కుపమానములుగా మూడు చరణములలో జంగమలత భూచారినిర్జరకాంత, సుకుమారనాగాంగిన యనునవి భూలోక దుర్లభములున్నవి. నాల్గవచరణమున గూడ నట్లేకదా యుండవలెను. మఱియుమూడుచరణములలోనూ ద్రౌపద్యుపమానపదములు ద్వితీయాంతములుగా నున్నవి; నాల్గవ చరణమునఁ గూడ నట్లేకదా యుండవలెను. ఈ తీరునఁజూడగా ప్రబలబిడాలంబు భారతీశారిక నడరి సత్వరముగ నంము మాడ్కి యనియుండుట బాగు. కీచకుడు ద్రౌపదిగూర్చి చేయు ననందర్భాలాపములలోనిది యొకటి.

చిత్తముమెచ్చి నావలనఁ జిక్కగవెండియునాలతాంగి య
చ్చొత్తినయట్లు నాకుఁదనయుల్లము దెల్లముసేయకున్కి దా
నత్తఱిఁ గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గు పెంపున
న్నుత్తలమందఁ జేయుటకునో తలపోసి యెఱుంగ నయ్యెడున్॥

ముద్రణములో నీపద్యమిట్లున్నది. తిక్కన పలుకుబడిగాని, యర్థపు సొంపుగాని యిందుఁ బొందుపడకున్నది. ఇది యిట్లుండఁ దగునని నా తలఁపు.

చిత్తము మెచ్చి నావలనఁజిక్కగ వెండియు నాలతాంగి య
చ్చొత్తినయట్లునాకుఁదనయుల్లముఁ దెల్లము సేయకున్కిదా
నత్తఱిఁ గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గుపెంపొన
న్నుత్తలమందఁ జేయుటగునోతలపోసి యెఱుంగనయ్యెడన్.

రాయబారమరుగునప్పుడు కృష్ణునితో ద్రౌపది తన భంగపాటును జెప్పు పలుకులలో

అంతలుసేసి పోనడచి యక్కట, సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె? ఇట్టి యూఱట మంపిం(బ్రియమందె యుధిష్ఠిరుండుఁ దా
నంతన యూళులేవురకునై దుసుయోధనుఁడిచ్చునొక్కొ? ఈ
కంత కృపావిహీనమతినాతడు నేఁచునె యన్నదమ్ములన్.

ఇందు 'ఈ కంత' యనుచో కొందరు వికటార్థములనుగూడ చెప్పుదురు. ఇక్కడ 'ఒక్కంత కృపా విహీనమతి నాతడునేచునె యన్నదమ్ములన్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యన్న పాఠము సుందరము. ఇంతవఱకునేనిప్పుడు వెల్లడించిన సంస్కర ణములెల్లను తిక్కన హృదయము నూహించి నేనే చేసినవికాని ప్రత్యంత రములలో చూచి చేసినవికావు. ఈ తీరున జూడగా దేశితెలుగు మఱుగు లలో సాటిలేని నేర్పుతో వెలుగనేర్చిన తిక్కన సారస్వత భాండారమగు భారత భాగమును సరిగా నుపయోగించుకొనుటకు సమర్థమైన సహృదయ పండితగోష్ఠి జరగవలెను. అట్టి పరిశీలనము జరుగనిచో తిక్కన పద ప్రయోగ లాలిత్యము సరిగా పరిజ్ఞాతముకాజాలదు. తిక్కన సులువుగా వచనమును గూర్చినట్లు పద్యములను గూడ జిలిబిలి చినిచిన్ని పలుకులు పొంకముతో నత్తుకొని చరణమునుండి చరణమునకు వాటముగా ప్రాలునట్లు కూర్చును. పద్యము సుఖతరముగా చదువదగినదై యుండును. కాని యర్థము దుర్లభతమమే యగును. అందేదో కారకాన్వయ కౌటిల్య చమ త్కార ముండియే తీరును. దీని కుదాహరణముగా రెండు పద్యములు చదువుదును.

పగయడగించు టెంతయు శుభంబది లెస్స అడంగునే పగం
బగ వగ గొన్న మార్కొనక, పల్కక యుండగ వచ్చునే కడుం
దెగమొదలెత్తి పోవఁ బగదీర్పగ వచ్చినఁ గ్రౌర్యమొందునే
మిగతిఁ దలంచినం బగకుమేలిమిలేమి ధ్రువంబు కేశవా?
తుదిరాజ్యమ్మునగమ్ము గొమ్మడవియందుంబేరువంచించి యుం
బదుమూడేడులు నీవునుందిరిగి రాఁబాలీకపోవచ్చునే?
అదిగాదేఁ దెగిబంటవై యఱుము; మాయల్ పన్ను నేర్పింక జె
ల్లదునూనీకని యానుయోధనుని యుల్లంబుచ్చిపోనాడు మీ.

ఇందు సంస్కృతపదములు లేవు సమాసములే లేవు. దేశి పలుకులే యయి నను యవి మారుమూల పలుకులు కావు. అయినను పద్యార్థము దుగవ బోధమే. పండితులు తలకొక తీరుగా నీపద్యముల కర్థము చెప్పుదురు. వాక్యాన్వయ విభాగములు పలుతీరుల నిందుచేయవచ్చును. పాఠకుల రసజ్ఞత ననుసరించి గుణ భేదములతో నర్థమిందు గుర్తింపదగియున్నది. ఇట్టివే విరాటోద్యోగపర్వములలో నెన్నోయున్నవి. తిక్కన రచనలో నింకొకవింత తీరుకూర్పును వివరిస్తున్నాను. వినండీ: ఆంధ్ర కవితారచనలలో వాక్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముల ససమాపకములుగానే పద్యమునసుండి పద్యమునకు సాగునట్లు కూర్చుట కలదు. అనగా నొకవాక్యము రెండు భిన్న పద్యములలోననుగతమై యుండునన్నమాట: పద్యావసానమునకు, పద్యోపక్రమమునకు నడుమ కొంత విశ్రాంతి ఉంటుంది. ఒకవాక్య ముచ్చరించునప్పుడు గూడ నడుమ విశ్రాంతియుండఁదగును గనుక ఆకూర్పు అసందర్భముగా తోచదు. కాని రెండు భిన్నజాతివి, యగు పద్యములలో ఒక సమాస పదమునే సంధించి కూర్చుట చాల విడ్డూరముగా నుండును. ద్విపదములు, రగడలు మొదలగు వానిలోను, మాలికావృత్తములలోను నాల్గు చరణములకు పద్యము ముగి యదుకాన అట్లుండవచ్చునుగాక; భిన్నజాతి పద్యముల యవసానారంభముల లోనే సమాసపదము, ప్రధానముగా సంహితపాటింపవలసినది, తిక్కన రచనలోనున్నది.

ఒకటియడిగెదఁ గృపచిగురొత్తఁజెప్ప,
వలయు మీరు మాయింటికివచ్చి యొక్క
ప్రక్క క్రిందుగ నిరువది యొక్కదినము
లనఘ నిద్రించి తదిమొదలైన నీదు,

క॥ చరితంబ ద్భుతము మునీ, శ్వరదీనికిఁ గారణము విచారమున కగో
చరమెటిఁగింపుమనుడునా ధరణీవల్లభునితో నతండిట్లనియెన్.

నీదుచరితము అన్న సమానపదము రెండు భిన్నజాతి పద్యముల సంధిలో నున్నది. నన్ని చోడమహాకవి కూడ నిట్లొకచోఁ ప్రయోగించినాడు.

తిక్కన పదలాలిత్యమును గూర్చి ప్రసంగించవలసినప్పుడు ఇంత వఱకు నేను చెప్పిన ప్రయోగ విశేషములెల్ల గుర్తింపవలసినవేయగును. ఎంతో వింత వింతగా తిక్కన పలుకుబళ్ళను ప్రయోగించును. తిక్కన పదలాలిత్యమునే పెక్కు విషయములుగా విభాగించి వేఱువేఱుగా విపుల ప్రసంగములు పెక్కులు జరుపవచ్చును. ఇది దిక్ప్రదర్శనము.

రేడియో ప్రసంగము
మదరాసు : 3-11-1946
విస్తృతపాఠము :
తెలుఁగు మెఱుగులు -
1948 వ ము
1960. తృ. ము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము

౧

చదులువాడ యెఱ్ఱాప్రెగ్గడ భారతారణ్యపర్వ శేషమును, రామాయణమును, నృసింహపురాణమును, హరివంశమును రచియించెను. హరివంశమున నిట్లున్నది.

"శా. నాతమ్ముండు ఘనుండు మల్లరథినీ నాథుండు నిన్నాతత
శ్రీ తోడ౯ సము పేతుఁజేసి యెలమి౯ జేపట్టి మా కిచ్చుటన్
జేతోమోద మెలర్ప రామకథ ము౯ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం జెందితి నింకనుం దనియ నేఁ గావ్యామృతాస్వాదన౯.

దీనినిఁబట్టి రామాయణము హరివంశమునకుఁ బూర్వకృతి యనియు, నది ప్రోలయ వేమారెడ్డిగారి ప్రేరణముననే రచితమయ్యెననియుఁ దెలియనగును.

"వల్మీకభవు వచోవైఖరి రామాయణంబు నాంధ్రప్రబంధంబుఁ జేసే"నని యెఱ్ఱాప్రెగ్గడ వంశమువాఁడిటీవలివాఁడు చదలువాఁడ మల్లయకవి చెప్పినాఁడు. దీనిఁబట్టి యారామాయణము సంగ్రహ రూపమయినదిగాక సకల వర్ణనాపూర్ణమయిన సంస్కృత రామాయణానుసారియయిన, ప్రశస్త ప్రబంధముగాఁ దెలియనగును.

ఇట్టి యెఱ్ఱాప్రెగ్గడ రామాయణమిప్పుడు గానరాదు. లక్షణ గ్రంథములలో నెఱ్ఱాప్రెగ్గడ రామాయణ పద్యములు పెక్కు లుదాహృతములయి యున్నవి.

• ఈ వ్యాసము రెడ్డిరాజ్యవర్ధంత్యుత్సవమునాడు చదువుటకు వ్రాయఁబడినది. భారతి" పత్రికలో కూడ ప్రకటింపఁబడినది. (1-6-1939) - సంపాదకుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

౨

కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహమున ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోనివని యీ క్రింది పద్యముల నుదాహరించినాఁడు.

ఉ. “అంగముతోడఁ గట్టు మిట యజ్ఞవిఘాతక చోరు నెందు వో
వంగలవాఁడ వింక నిటు వైళమ తాపసవేషధారివై.

ఉ. “సందడి యధ్వరక్రియ కసంగతమేని బలంబుతోడఁ బెఱ
గ్రం దదియేల యేన తగఁ గార్ముక హస్తుఁడనై కడంగిమీ
ముందఱ నిల్చెదఱ గ్రతువు ముట్టకయుండఁ బ్రచండదైత్యరా
జిందగ దవ్వుదోల వెసఁ జించెదఁ బెంచెద మీకు మోదమున్.

చ. అనుటయు మంత్రిమాటకుఁ బ్రియంబడి యాతని నాదరించి య
మ్మనుజ కులేంద్రుఁడు.... ....

ఉ. నూర్వురు నొక్కచందము మనోగతి సైరణవేసి నన్ను నా
సర్వకులంబు నుత్తమ యశంబున నుంచితి రమ్మలార, మీ.
కుర్విని సాటి యే యబల లొండొరు దేవతలున్ బటుక్షమా
నిర్వహణం బొనర్చుటకు నేరరు మర్త్యులఁ జెప్పనేటికిన్.

చ. అనఘ యకంపమై విమలమై పరిపూర్తియు లోఁతుఁ దియ్యమున్
ఘనతయుఁ గల్గి సజ్జనమ నస్సదృశస్థితిఁ జాల నొప్పు మీ
జినయది యన్నదీజలము తేపును మంచిది.... ....

ఉ. కోఱలు నుగ్గునుగ్గయిన క్రూర ఫణీంద్రు గతిన్ దరంగముల్
మాఱిన భూరివారిధి క్రమంబున రాహుకరాళవక్త్రిమున్
దూఱిన తీవ్రభానుక్రియ దుర్బలసైన్యతఁ బుత్త్రిహీనతన్
గీఱి పరాభవాభిగతిఁ గీడ్పడి భూపతి నెమ్మనంబునన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శా. తాఱంగ్రాఁగిన నేల తంపఱఱఁ బాతాళంబు దాఁకన్ జనం
దూఱం జల్మ్రరి మిన్ను దాఁకి తరఁగల్ తోరంబులై నల్గడల్
పాఱం బెల్లుగ నేఱు లుబ్బుఱముగాఁ బై పైన నీరెక్కి దై
వాఱన్ జెర్వులు చెన్నుమీఱె నఖిల ప్రాఱుల్ ముదంబందఁగాన్.

క. నూఱు చెఱంగుల నెఱసులు
మీఱఁగ నీవిభ్రమములు మెఱయించి మునిం
గాఱఁగఁ జేయుము మేనక
చూఱకొనదె యతని తెలివి సొమ్ములు మున్నున్.

మ. చెఱకుందోఁటలఁ బెంచి శాలిమయ సుక్షేత్రస్థలుల్ నించి య
క్కఱలేకుండఁగఁ బూగనాగలతికా కాంతారముల్ ప్రోచి యే
డ్తెఱ నంతం గుముదోత్పలాళివనవాటీకోటిఁ బాటించి పె
న్జెఱువుల్ వ్రాల్చెఁ బురంబునల్దెసలఁ బ్రస్ఫీతాంబు పూర్ణస్థితిన్.

కూచిమంచి తిమ్మకవి గోదావరిమండలమున పిఠాపురమునకు చేరువను 'కందరాడ, చంద్రమపాలెము' అను గ్రామముల వసించెను. ఈ గ్రంథమును క్రీ.శ. ౧౭౫౦ సంవత్సర ప్రాంతమున రచించెను. అతఁ డుదాహరించిన యెఱ్ఱాప్రెగ్గడ రామాయణ పద్యములు ఇతర లక్షణ గ్రంథముల నుండి సేకరింపఁబడినవికావు. అతఁడు స్వయము గ్రంథమును బరిశీలించి యుద్ధరించినవే. ఇన్ని పద్యముల నితరలాక్షణికు లెవరు నుదాహరింపలేదు. ఇప్పటికి ౧౫౦ ఏండ్ల నాఁడు గోదావరిమండలమున కూచిమంచి తిమ్మకవి యింట ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము సురక్షితమైన యుండెనని దీనివలనఁ దెలియఁగలదు.

చదలువాడ యెఱ్ఱాప్రెగ్గడ రచనముతో నీ కవిస్తుతిపద్య మొక ప్రాచీన పద్య సంకలనమునఁ గానవచ్చినది.

శా. సౌ రోదార సమంచిత స్ఫుర దురుస్ఫాయ ల్లస ల్లాలిత
(స్ఫారంబుల్ వె?) సఁ ద్రిప్పి పెట్టుచును శబ్దద్రవ్యహీనుల్ సదా
తారుం జెప్పితి మంచుఁ జెప్పికొనుటల్ తప్పే నిరాఘాటవా
క్సౌరభ్యప్రతిభా విజృంభితులు మెచ్చర్ గాక యానందముల్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇది యెఱ్ఱాప్రెగ్గడ రామాయణ కృత్యవతరణికలోనిది గావలెను.

క్రిందిపద్యమును, 'ఎఱ్ఱన రామాయణములోనిదా?' అని యెప్పుడో నోటు బుక్కులో వ్రాసికొంటిని. ఎక్కడనుండి యుద్ధరించితినో యిప్పుడు గుర్తింపజాలను.

ఉ. చువ్వన మేను వంచి రవి సోఁకఁగఁ దోఁక విదల్చి పాదముల్
వివ్వఁగఁ బట్టి బాహువులు వీచి మొగంబు బిగించి కొండ జౌ
జవ్వన నూఁగి ముందటికిఁ జాఁగి పిఱిందిఁ దూఁగి వార్ధిపై
ఱివ్వన దాఁటె వాయుజుఁడు ఱెక్కలతోడి సురాద్రియో యనన్.

కూచిమంచి తిమ్మకవిగాక మఱికొందఱు లాక్షణికులును ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోని పద్యములను తమ లక్షణగ్రంథములం దుదాహరించినారు. అట్టివి మఱికొన్ని యీ క్రిందివి :

గణపవరపు - వేంకటకవి ప్రయోగరత్నాకరము :

క. ధాత్రీ సురసేవారతి
భ్రాతృ భృతి గురూక్తి పాలబంధురమతి దు
శ్చాత్రవహరణ చణస్థితి
మిత్రానందకర విహృతి మీయం దమరున్.

"బాలసుధాంశునిటాలుని నవసుధా లాపముల్ వినవలె ననెడునాన."

క. అదశరథ సూనుండు ప
యోధిజలం బింకనేసి యొక శరమునఁ గ్ర
వ్యాద విభుఁ దునిమి సీతను
మోదంబునఁ జేకొని కపిపుంగవుతోడన్.

—ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేపరామాయణము

గణపవరపు వేంకటకవి ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేపరాయణము లోనివిగా నుదాహరించిన పద్యములు ప్రశస్తరచనము కలవికావు. అతఁడు ప్రబంధ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రత్నాకరమున కొన్ని లక్షణములను గల్పించి వానికి లక్ష్యపద్యములను ప్రసిద్ధకవుల గ్రంథములలోనివిగాఁ గొన్నింటిఁ గల్పించి యుదాహరించి నట్లున్నాఁడు. ఈత డుదాహరించిన ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణపద్యములు కల్పితములై నను గావచ్చును; లేక, ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములో గ్రంథారంభభాగమగు సంక్షేమరామాయణములోని వయినను కావచ్చును. అంతే కాని ఎఱ్ఱాప్రెగ్గడ సంక్షేమరామాయణమని వేఱొక గ్రంథమును రచియించి యుండఁడనుకొందును, ఎఱ్ఱాప్రెగ్గడ తనతండ్రి సంస్కృతాంధ్ర కవితా విశారదుఁడు సూర్యసుకవి యని తన గ్రంథములఁ జెప్పికొన్నాఁడు. సూర్య కవి కృతము సంస్కృతమున సంక్షేపరామాయణ మొకటి యముద్రితము కలదు. ఆ సూర్యసుకవి మన ఎఱ్ఱాప్రెగ్గడ తండ్రియగు నేమో! ఆ సంస్కృత సంక్షేపరామాయణమునకు ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణమునకు సంబంధమేమైనఁ గలదేమో-ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము దొరకినప్పుడు తెలియవలెను.

3

ఇపుడు సముద్రితమై వెలసియున్న భాస్కరరామాయణమునఁ గూడ ఎఱ్ఱాప్రెగ్గడరామాయణ పద్యములనేకములు చేరియున్నట్లు తెలియవచ్చు చున్నది. పెక్కేండ్లకు పూర్వము ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున తెలుఁగు గ్రంథములకు డిస్క్రిప్టివ్ క్యాటలాగు (Descriptive Catalogue) వ్రాయునపుడు భాస్కరరామాయణమును సామాన్యదృష్టిని పరిశీలింపంగా పాఠభేదములు చాలఁగాఁ గానవచ్చినవి. ఆ విషయమప్పు డంప వెల్లడించి తిని. ఆనందముద్రణాలయమువారి భాస్కరరామాయణ ముద్రణముకొఱకు వారియొద్దపండితులుగా నుండిన కీ॥ శే॥ తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య గారు అరణ్యకాండమున ప్రధాన పాఠముగా గ్రహింపఁబడిన పద్యము లనేకములు ఏ తాళపత్త్రప్రతిలోను గానరాకుండెను, పాఠాంతరములుగా పుటలయడుగున చిన్నటైపుతో ముద్రింపఁబడిన పాఠములే తాళపత్త్రప్రతులలో నున్నవి. తొలుఁదొలుత భాస్కరరామాయణమును ముద్రించినవారు కరాల పాటి రంగయ్యగారో, నిశ్చింత తేవప్పెరుమాళ్ళయ్యగారోయని మేమప్పుడు గుర్తించితిమి. వా రేప్రతులను చూచి ముద్రించిరో యెఱుఁగరాదు. కరాల పాటి రంగయ్యగారు గొప్పకవి. ఆయన కొన్ని ప్రౌఢ గ్రంథములను రచిం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెను. అరణ్యకాండమున ప్రధాన పాఠముగా గ్రహించిన పద్యముల నాతఁడు రచించి చేర్చెనేమోయని కూడ మే మప్పు డనుకొంటిమి-తాళపత్రప్రతులలో నా పద్యములు కానరాలేదు గాన.

ఇటీవల భాస్కరరామాయణమును పరిశీలించుచుండగా వావిళ్ళవారి ముద్రణమున యుద్ధకాండములోని ఈ క్రింది పద్యము 'ఎఱ్ఱాప్రెగ్గడవారి పద్యమని ప్రతీతి' అను అధోజ్ఞాపికతో కానవచ్చెను.

ఉ. త్రవ్వెడు గంటులం గురువు దేఱెడు నెత్తురు రాకమున్న యే
నొవ్వియు నేవికారము మనోగతిఁ జెందకమున్న సాయకం
బవ్వలఁ బోకమున్న మకుటాట్టవిఘట్టనరావ మొప్పఁగా
నువ్వన నుప్పతిల్లె నసురోద్వహ మూర్ధచయంబు గ్రక్కునన్

—వ. ౧౧౪౪.

అది చూచి వ్రాఁత ప్రతులను పరిశీలింతునుగదా ఉదాహృతమైన యీ పద్యము ఎఱ్ఱాప్రెగ్గడ వారిదని యుండుట మాత్రమేకాక దీని పూర్వపద్యము

ఉ. ఉన్నవి యున్నయట్ల తల లుర్వికి డిగ్గె శిరఃప్రవాహముల్
మొన్నొకసారె నిండురెగ మోపినసాయక మల్లె యుండజాఁ
గె న్నెటిఁదూవు వెల్లియని ఖేచరకోటినుతించె సంచితో
త్పన్న దశాస్యరాఘవ తపఃకరలాఘవ చిత్రసంపదల్.

అను పద్యము 'భాస్కరుని వారి' దనికూడఁగలదు. ఈ పద్యములు పెక్కు ప్రతులలోఁగాన రావు. కొన్ని ప్రతులలోనే కలవు. ఇవి రాముఁడు రావణుని తలలు తెగఁగొట్టు ప్రకరణము నందలివి. యుద్ధకాండములోని యీభాగము పెదవేదగిరి నాయనింగారి ప్రేరణమున అయ్యలార్యుఁడు పూరించినది. ఈ భాగమునకు భాస్కరరచనము నేఁడు కానరాదు. భాస్కరుఁడు కడముట్ట నారణ్యకాండము రచించినట్టు ప్రతీతియు లేదు. ఇందు భాస్కరరచనముగ పద్యముండుటనుబట్టి చూడఁగా భాస్కరుఁడు యుద్ధకాండమును కడముట్ట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచించెనని యేర్పడుచున్నది. ఇవేకాక, యుద్ధకాండమున మఱికొన్ని పద్యములు కొన్ని ప్రతులలో మాత్రమే యధికముగాఁ గానవచ్చుచున్నవి. దొరకిన యుద్ధకాండ ప్రతులనెల్ల పరిశీలించినయెడల నట్టివి మఱికొన్ని పద్యములు గూడ భాస్కరునివిగనో, ఎఱ్ఱాప్రెగ్గడివిగనో వేర్పడఁగల వనుకొందును. యుద్ధకాండవిషయమిట్లుండెను.

అరణ్యకాండమున ముద్రణములందు ప్రధాన పాఠముగ గ్రహింపఁబడిన గ్రంథ భాగములు తాళపత్రప్రతులలో సాధారణముగా దొరకుచున్నవియు, పాఠాంతరముగా నధఃకరింపఁబడిననియు నగు గ్రంథభాగముల కంటెఁ బ్రశస్త రచనము కలవి. ఒకవేళ నవియెల్ల ఎఱ్ఱాప్రెగ్గడ రచనమే మోయని యొక పెద్ద సందేహము నాకుఁ గలిగెను. ఆ గ్రంథభాగములలో వాల్మీకి రామాయణానుసారులు కానివి కొన్ని రచనములు కలవు.

చ. "తపనుఁడు వేఁపఁజొచ్చెనను దమ్ముఁడ, వృక్షముక్రిందఁ బెట్టునాఁ
దవనుఁడు రేయి లేఁడు వసుధావర, చంద్రుఁడుగాని, చంద్రునిన్
నృపసుత, యెట్లెఱింగితిని నీవు, మృగాంకముచూడ నున్కిహా
చపలమృగాక్షి, చంద్రముఖి, జానకి, యెక్కడ నున్నదానవే."
"సౌమిత్రే, నను సేవ్యతాం తరుతలం చండాంశు రుజ్జృంభతే
చండాంశో ర్నిశి కాకథా రఘుపతే, చంద్రోఽయ మున్మీలతి,
వత్సైతద్విదితం కథన్ను భవతా ధత్తే కురంగం యతః
క్వాసి ప్రేయసి, హా కురంగనయనే, చంద్రాననే, జానకి."

—ప్రసన్న రాఘవము,

ఇత్యాదులు,

ఇట్టి యీ ప్రధానపాఠరచనము కూడ ప్రాచీనకవికృతమే కావలెను. కాని, యిది భాస్కరరామాయణమను పేర లభ్యమగుచున్న గ్రంథములోనిది కాదు—భాస్కర రామాయణ తాళపత్రప్రతులలోఁ గానరాదుకాన. ఇట్టి సందేహములతో నేను చీకాకు పడుచుండఁగా డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు తమ కానెగొందిలో నాక భాస్కరరామాయణపుఁ దాళ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పత్రప్రతి దొరకెననియు, అం దారణ్యకాండమున ఎఱ్ఱాప్రెగ్గడ కృతములుగా కొన్ని పద్యములు గానవచ్చె ననియు తెలిపి ఈ క్రింది పద్యములను నాకుఁ జూపిరి.

ఉ. ఆనెఱజోదు కేలు దొనఁకై నిగుడించుట యమ్ము మౌర్వి సం
ధానము సేత నిండఁ దెగఁ దార్కొని లక్ష్యము సేయు డేయుడుఁ
గాన నజస్ర మండలిత కార్ముక మొక్కటి గంటిఁ గంటి న
ద్దానవదీర్ఘ దేహనము దాయ నిరంతరపాతవేగముల్.

స్రగ్ధర. కరిణీయానంబు నవ్వుఁ గతి నవలతికాకార మంగంబు చంద్రున్
బురుణించున్ ముద్దుమో మంబురుహదళములంబోలు, గన్నుల్వివంచీ
స్వర సంకాశంబు పల్కుఁ జలదకనిచయ స్పర్ధియై యుండు వేణీ
భర మాతన్వంగి క్రింద ప్రముఖ నిఖిల దిక్పాలకాఖీలశౌర్యా.

చ. అలినిభవేణి చంద్రసదృశానన యుత్పలపత్ర నేత్ర కో
మల లతికాభిరామభుజ మంజులవృత్తలసత్కుచద్వయీ
కలిత సుమధ్య హృద్యకటి కామ్యతరోరువు రమ్యజంఘ యు
జ్జ్వల చరణాబ్జ తద్వనిత జానకినా విలసిల్లు రావణా.

వా రిందుకై మదరాసులోని యితర తాళపత్రప్రతుల నెల్లఁ బరిశీలిం చిరట! ఆ విషయము నిట్లు చీటిలో వ్రాసి పంపిరి.

"ఈపద్యాలు నేను ఆనెగొంది నుంచి తెచ్చిన ప్రతిలోనివి. అందు 'ఎఱ్ఱాప్రగ్గడ పద్యాలు' అను శీర్షికతో గూడియున్నవి. ఇదిగాక అడయారు లైబ్రరి G.No.XXXII. T.13G. 'యెఱ్ఱాప్రగడవారి పద్యం' (తాళ.ప ౧౬ పం. ౧)అనుమాటకు తరువాత పైమూడు పద్యాలు కలవు. ఇంకను మద్రాసు యూనివర్సిటీ కలెక్షన్ (ఎఱ్ఱాప్రగ్గడ పేరులేకున్నను) ౧/౧౩౦ నంబరు ప్రతియందు మూడు పద్యములును గానవచ్చుచున్నవి, అట్లే౧/౪౨౬ లో కూడా పద్యాలు పేరులేకుండా కాన్పించుచున్నవి. G.Or. Mss. Madras 14-10.7 దీనిలో 'ఎఱ్ఱాప్రగడ పద్యాలు, అన్నమాటలేదు కాని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ పద్యాలలో "కరిణీయానంబు", "అలినిభవేణి" అను పద్యాలు కాన్పించు చున్నవి."

ఈ మూఁడు పద్యములతోపాటు తక్కిన ఆరణ్యకాండ రచనభేదము లెల్లఁగూడ ఎఱ్ఱాప్రెగ్గడ రచనములు కావచ్చునేమో యనికూడ నే ననుమానించుచున్నాను.

అయోధ్యాకాండమునఁగూడ రచనాభేదములు చాలఁగాఁ గలవు. అందుఁగూడ గొన్ని యెఱ్ఱాప్రెగ్గడ పద్యము లుండునేమో ! ఇట్లు భాస్కర రామాయణ గ్రంథ భాగము లెన్నో చిక్కులతో నున్నవి. అవి యెల్ల జాగ్రత్తగాఁ బరిశీలించి యిదమిత్థమని నిర్ణయింపవలసి యున్నవి. భాస్కర రామాయణమున ఎఱ్ఱాప్రెగ్గడ రచనములు గొన్ని చేరియుండుట తథ్యము.

౪

ఈ నడుమ నేను ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని యొక సంకీర్ణ పద్యముల తాళపత్రి సంపుటమును పరిశీలించుచుండగా అందు రామాయణ యుద్ధకాండమున పద్యములు ముప్పది కానవచ్చినవి. చదువఁగా నవి ప్రసిద్ధములైన భాస్కర రామాయణాది గ్రంథములలోనివిగా తోఁచలేదు. భాస్కర రామాయణమును, భారతారణ్యసర్వాంతర్గత రామాయణమును, భాగవతాంతర్గత రామాయణమును, మొల్లరామాయణమును, రామాభ్యుదయమును, ఘనగిరి రామకవి సకలవర్ణనాపూర్ణ రామాయణమును పరిశీలించి చూచితిని. ఈ కానవచ్చిన ముప్పది పద్యములు నందెందును గానరాలేదు. ఈ పద్యములు గూడ ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణములోనివి కావచ్చు ననుకొనుచున్నాను. అవి యీక్రింద చూపుచున్నాను :

చ. అనిలజ రావణానుజులు హస్తములన్ గయిదండ గొంచుఁ గ్ర
   క్కునఁ జనుదెంచి, భానుజుఁడు గొల్వ సుఖంబున నున్న రామచం
   ద్రునిఁ గని పాదముల్ శిరముతో నొఅయన్ బ్రణమిల్లి లేచి ని
   ల్చిన యెడ నెమ్మొగమ్ము వికసిల్లి విభీషణుడుం బ్రియంబునన్. ౧

*   *   *   *

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. తమ్ముఁడ! నేఁడు నాకుఁ బ్రమదంబు ఘటిల్లె దశాస్యనందనుం
డిమ్మెయిఁ గూలుటన్ మనకు నింక జయం బగునంచు సిగ్గు లోఁ
గ్రమ్మఁగ నున్న లక్ష్మణుని గ్రక్కున నంకమునందు నుంచి వ
క్షమ్మునఁ జేర్చుచున్ శిరము సారెకు మూర్కొనుచుం
గ్రమంబునన్. ౨

* * * *

చ. కరముల నవ్విభుం డతని గాయము లంటుంచు నూర్పు పుచ్చుచున్
బురఁబురఁ బొక్కుచున్ శిరము మూర్కొని యెంతయు
నూఱడింపుచున్
దురమున లెస్స గూల్చితివి దుర్దముఁ డైన విరోధిఁ భక్తికం
ధరుఁడును నింకఁ గూలునని నామది నిశ్చయబుద్ధి నొందెదన్. ౩

* * * *

చ. • మనలక రామరావణులు మార్కొని యుద్ధము సేయుచుండఁగా
నిసిత శరంబులు లొండొకటి నేర్పునఁ ద్రుంచుచు నుగ్రశక్తిమై
దశశిరుమస్తక ప్రతతి దాఁకినఁ జిత్రమ డుల్లు నూపుమై
నుసిరిక ప్రానిమీఁదఁ బిడు గూనినఁ గాయలు డుల్లునాకృతిన్. ౪

* * * *

ఉ. అక్కట ధూళిఁ బ్రుంగుడయి యంగము నెత్తుటఁ దోఁగి వేదనన్
స్రుక్కుచు ధాత్రిపైఁ బొరలుచున్ బడి లక్ష్మణుఁ డిట్టులుండ నా
కెక్కడియుద్ధకాంక్ష యిఁక నెక్కడివిక్రమగౌరవక్రమం
బెక్కడిప్రాణ మెక్కడిమహీసుత యెక్కడి రాజ్యసంపదల్. ౫

* * * *

ఉ. కందక గాజువాఱక మొగంబు వికాసముఁ జెందెఁ జేతు లీ
యందములైనకాళ్ళు నరుణాంబురుహంబులలీలఁ జూడఁ జె
న్నొందెడు జీవహీను లిటు లుండరు ప్రాణముతోడ నున్నవాఁ
డిందు సహోదరుండు ధరణీశ్వర, నీకు విషాద మేటికిన్. ౬

• ఇట్టి పద్య మొకటి బాలబోధ మనులక్షణ గ్రంథమునను ఉదాహృతమయి యున్నది. అది యిది :

చ. దశరథరాజ సూనునకు దానవనాయకుఁ దేపుమాపినన్
బిసరుహమిత్రనకదనుఁడు భీతి యొకింతయు లేక యుగ్రుఁడై
పెస గద ద్రేనె ద్రేసినను వేగము రాలెఁ గిరీట రత్నముల్
ఉసిరిక ప్రానిమీఁదఁ బిడుగూనినఁ గాయలు డుల్లు నాకృతిన్
ఈ పద్య మెవ్వరిదో?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చ. మనమున నిశ్చయించి పవమానతనూజుఁడు మూఁడుమాఱు లే
వునఁ గదలించి యంశుధర ముంబలె నీలరుచిం జెలంగుత
ద్వనగిరిశృంగమున్ బిడిచి కైకొని పై కెగురంగవైచి యా
చి నిలువఁ బట్టుచున్ వెస సుషేణునిఁ జేరఁగ వచ్చి యచ్చటన్. ౭

* * * *

ఉ. అతని రౌద్రరేఖ గని యబ్ధి గలంగెఁ జలించె శైల మౌ
త్పాతిక వారిదంబు లతి దారుణరావములై జనించె ధా
త్రీతలమెల్ల బిట్టదరె దిక్కులు వ్రీలె సమస్తభూతముల్
భీతి వహించె డెంద మగలెఁ రజనీచరలోకభర్తకున్. ౮

* * * *

చ. అనయము సర్వభూతముల యందును గోద్విజులందు శైలకా
ననగగనాఖిలానల ఘనత్వము మించ సహస్రపాదలో
చవశతశీర్ష మూర్తివయి సారగతిన్ వసియించి సాద్రికా
వనియు సమస్తభూతముల వారి వహింతువు నీవె రాఘవా ! ౯

* * * *

మ. తరుణాదిత్యనిభద్యుతిఁ మెఱసి రక్త శ్రీచ్ఛటాశాటికా
ధరియుం దప్తసువర్ణభూషణయు నుద్యన్నీలధూమాభ్రబం
ధురధమ్మిల్లయు నౌ విదేహతనయన్ దోర్దోత్తల బెన్మంటలోఁ
జూరనేతెంచిన రూపుతోన జగముల్ సోద్యంబునన్ జూచినన్. ౧౦

* * * *

చ. అవనిజనంబులెల్లను దశానను నంతిపురంబునందుఁ బె
క్కువు దివసంబులున్న జనకాత్మజ శోధితఁజేయ కీ యనా
ర్యవిహితవృత్తిఁ దెచ్చె రఘురాముఁడు బాలిశుఁ డంచు నెంచ రా
భువనములెల్ల నమ్మటకుఁ బో యిటు సేసితి హవ్యవాహనా. ౧

• • •

చ. ప్రకటత రాత్మతేజమున రక్షితయా మిథిలాధిరాజక
న్యకను బయోధివేలఁబలె నాశరుఁ డెందు నతిక్రమింపఁ డె
న్నికకును నిప్పువంటి మహనీయచరిత్రము గల్గు నిట్టి జా
నకిని దరంబె వానికి మనంబున నేనియుఁ జుల్కఁ జూడఁగాన్ ౧౨

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. వైరిజయంబు గాంచి బలవంతుల మిత్రులఁ గూడి తేజమున్
సారయశంబునున్ గనిన నాదు సమాగమనంబు నీని సొం
పారఁగ జెప్పుచో నతని యానవవర్ణవిలోకనేంగితా
కార వచోవిశేషముల కైవడి నేర్పునఁ జూడు మేర్పడన్. ౧౩

* * * *

మ. అతులంబై వశవర్తియై రథతురంగానేక పాకీర్ణమై
పితృపైతామహమైన రాజ్యము మదిన్ భేదింపఁగాఁ జేయు సం
తత మెవ్వానికినైన రాజ్యఫల మాత్మన్ గోరినన్ గైకయీ
సుతుఁడే యేలుచునుండుఁగాక విపుల క్షోణీతలం బంతయున్. ౧౪

* * * *

చ. అతఁ డడరించుశస్త్రముల యారవముల్ శరపుంఖజాతమా
రుతములు గ్రమ్మినన్ గులగిరుల్ గదలెన్ గలఁగెన్ బయోనిధుల్
క్షితి వడఁకెన్ మనంబునఁ జలించిరి పన్నగలోకవాసు లు
న్నత రుచిఁ బాసి మాసె దిన నాథుఁడు మందటిలెన్ సమీరుఁడున్.
౧౫

* * * *

చ. వడి నమరేంద్రముక్తమగు వజ్రములీల యుగాంతకాలుకై
వడిఁ బరతెంచి రావణుని వక్షముగాఁడి ధరిత్రిఁదూలెఁ బ
ల్విడి దశకంఠుఁ ద్రుంచి రఘువీరుఁడు నేఁడని మేలువార్త యే
ర్పడ ఫణిలోకవాసు లలరన్ వివరింపఁగ నేగెఁనో యనన్. ౧౬

* * * *

శా. ఆపుణ్యవ్రతఁ బట్టినప్పుడె తదీయంబై యనిర్వార్యమౌ
కోపాగ్నిన్ మసిగాక నీవునికి రక్షోనాథ లోకంబునన్.
బాపాత్ముండగువాఁడు పాపఫలమున్ బ్రాప్తవ్యకాలంబునన్
బ్రాపించెన్ నిజ పాపకర్మఫల మిబ్భంగిన్ నినుం జెందుటన్. ౧౭

* * * *

చ. సవితృఁడు చంద్రుఁడున్ దిశలు సంధ్యలు రేలుఁ బఁళ్ళు గాలియున్
భువియును నాదిగా సకలమున్ గను సాక్షులు వీ రెఱుంగ నేఁ
బ్రవిమల సద్గుణోత్తర ధురాపరిభూషిత నైతినేని హ
వ్యవహుఁడు నన్ను నిప్పుడు దయాయత చిత్తతఁ బ్రోచుఁగావుతన్. ౧౮

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శా. అరీతిన్ భువనత్రయిం గలుగువా రత్యంతశోకార్తులై
ధీరత్వంబు పరిత్యజించి యలధాత్రీనందనం జెందుదు
ర్వారాపన్నత యెంచుచున్ బలుకఁ ద ద్వాక్యంబు లాలించుచున్
ధారాశాశ్రులతో మనం బెరియఁ జింతన్ రాముఁ డున్నత్తఱిన్. ౧౯

* * * *

చ. ఖలునిఁ గబంధునిన్ నిశిత కాండములన్ దునుమాడి వాని ప
ల్కులు విని ఋశ్యమూకమునకున్ జని భానుజుఁగూడి వాలి ను
జ్జ్వలబలుఁ గూల్చి యర్కసుతు వానరరాజ్యమునందు నుంచి య
య్యలఘుఁడు వంపె భూమితనయన్ వెదకన్ గపివీరకోటులన్. ౨౦

\+ * * +

చ. నిరుపమమూర్తి రామధరణీపతి శోభనవేళ నాడి ర
చ్చరపువుఁ బోండ్లు కిన్నరులు సారెకుఁ బాడిరి దేవదుంభుల్
మొరసెను ధాత్రి సస్యములు మోహనలీల వహించె వృక్షముల్
వరసురభిప్రసూన ఫలవర్గములన్ విలసిల్లె నెంతయున్. ౨౧

• • •

చ. అని కొనియాడుచున్ జలరుహాక్షులు సేనలు మీఁదఁ జల్లఁగా
ననఘచరిత్ర ! రామ ! సుగుణాకర ! వర్ధిలుమంచుఁ బౌరు లె
ల్లను దనచుట్టుఁగొల్వఁ గ నలంకృతమైన రథంబుపై ముదం
బున భరతాగ్రజుండు రఘుపుంగవుఁ డీగతి వైభవంబులన్. ౨౨

• • •

చ. జలనిధిగట్టి మించుకపిసైన్యముతో వనరాశి దాఁటి దో
ర్బలమున లంకపై విడిసి రావణముఖ్యనిశాటకోటులన్
గలన జయించి భూతనయ గ్రమ్మఱఁ గైకొని నిత్యకీర్తులన్
వెలసినవాఁడు రాముఁ డిటు వింటిమె కంటిమె యిట్టి చిత్రముల్. ౨౩

• • •

శా. భేరీకాహళశంఖతూర్యములు గంభీరంబులై మ్రోయఁగాఁ
దారామార్గమునందు దేవఋషిగంధర్వస్తుతుల్ మీఱ సే
వారూఢిం దగ వందిమాగధులు కైవారంబు గావించుచున్
సారోదారవిచిత్రవైఖరుల నానందంబు గల్పింపఁగన్. ౨౪

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ. రావణుఁ గూల్చి క్రమ్మఱ ధరాసుతఁ జేకొనివచ్చుచున్నవాఁ
డావసుధాకళత్రుఁ డిదె యాప్తులతోడ మహేంద్రుతో శచీ
దేవియుఁబోలె సీత జగతీతలనాథునిఁ గూడి సంతత
శ్రీవిలసిల్లు నున్నయది చేరినవాఁడు సుమిత్రపట్టియున్. ౨౫

• • •

చ. అలికుల వేణులన్ జలరుహాక్షులఁ జంద్రనిభాస్యలన్ విని
ర్మలమణీహేమభూషణ సమగ్రల భార్యలఁగా వరింపు గ
న్యల గుణజాతియుక్తలఁ బదార్గుర గ్రామశతంబుఁ జూడఁ జె
న్నలరెడు లక్షగోవులఁ బ్రియం బెఱిఁగించిన నీకు నిచ్చెదన్. ౨౬

• • •

ఉ. కొంచక కోటపై నిలిచి కొందఱు భీమబలాఢ్యులైన
క్తంచరు లుగ్రతోమరగదాపటుశక్తుల వానరాళి మె
ప్పించిరి వానరేంద్రులును బేర్చి రణంబునఁ గోటపైకి లం
ఘించి నిశాటులన్ ధరణికిం బడనీడిచి నొంచి రుద్ధతిన్. ౨౭

• • •

మ. నిను సేవించినఁ గల్గు మానవులకున్ వీటీవధూటీఘటీ
ఘనకోటీశకటీకటీతటివటీ గంధేభవాటీపటీ
రనటీహరిపటీ సువర్ణమకుటీ ప్రచ్ఛోటికా పేటికల్
కనదామ్నాయ మహాతురంగ శివలింగా నీలకంఠేశ్వరా! ౨౮

• • •

ఈ ౨౮-వ పద్యము, నీలకంఠేశ్వరస్తుతి రూపమయినది. అది వేఱొక గ్రంథము లోనిది యయినను గావచ్చును. కాని, యీ సంకీర్ణ పద్య సంపుటమున నుదాహృత రామాయణ పద్యములతో నున్నది. కాన రామాయణములోనిది గావచ్చుననుట సంగతమగును. ఎఱ్ఱాప్రెగ్గడ నెల్లూరు మండలమందలి గుడ్లూరి నీలకంఠేశ్వరస్వామి భక్తుఁడు ప్రోలయ వేమా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రెడ్డిగారి ప్రేరణమున నాతడు రామాయణము నా నీలకంఠేశ్వర స్వామి కంకితముగా రచించెనేమో! ఈ పద్యము గుడ్లూరి నీలకంఠస్వామి స్తుతి సందర్భములోనిదిగావచ్చును!

ఈ పై పద్యములలో ఎఱ్ఱాప్రెగ్గడ రచనాగౌరవము కానవచ్చుచున్నదా యని సందేహముతోఁచును. పద్యము లన్నియు సలక్షణములై యున్నవి. గొప్ప రచనా ప్రౌఢిమ కానరాకున్న దనవచ్చును కాని యెఱ్ఱాప్రెగ్గడ తొలుతటికూర్పుకాన యిందు రచనమునఁ గొంత వెన్పాటు గలదేమో!

శ్రీనాథుఁడు 'పరిఢవింతుఁ ప్రబంధ పరమేశ్వరునిఁదేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు' అని తన యెఱ్ఱాప్రెగ్గడ రచనానుకరణాభిమానమును వెల్లడించుకొన్నాఁడు. ఈక్రిందిపద్యద్వయమున ఎఱ్ఱాప్రెగ్గడ సూక్తివైచిత్రియు, శ్రీనాథుని తదనుకరణమును గానవగును.

ఉ. కందక గాజువాఱక మొగంబు వికాసమునొందెఁ జేతు లీ
యందములైనకాళ్ళ నరుణాంబురుహంబులలీలఁ గాంతిఁ జె
న్నొందెడు జీవహీనులిటు లుండరు ప్రాణముతోడనున్నవాఁ
డిందు సహోదరుండు ధరణీశ్వర నీకు విషాద మేటికిన్.

ఉ. కందక గాజువాఱక వికాసము డిందక మందహాసని
ష్యందము చెక్కుటద్దముల నాఱక నెమ్మది నిద్రవోవున
ట్లందమునొందె ధాత్రి సిరియాలకుమారకు వక్త్రచంద్రుఁడా
నందమునొందె నప్డు డెలనాఁగమనంబును భర్తచిత్తముఁ.

--శ్రీనాథుని హరవిలాసము.

ఎఱ్ఱాప్రెగ్గడ "సూక్తివైచిత్రి" నిశ్రీనాథుని సమకాలపుఁ బ్రసిద్ధకవి జక్కన కూడ,

"ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము ...."

అని ప్రశంసించెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంస్కృత వాల్మీకి రామాయణమునకును ప్రాచీనాంధ్ర రచనములగు రంగనాథ భాస్కర రామాయణములకును జాల భేదములుగలవు. రంగనాథ భాస్కరరామాయణములుగూడఁ గొన్ని కాండములందుఁ బోలికలు గలిగి, కొన్ని కాండములందు లేకయున్నవి. రంగనాథ రామాయణమున విశిష్టాద్వైత విషయములు గొన్ని యధికముగాఁ జేరినవి. కొన్ని కథాభేదము లున్నవి; అధికకథలున్నవి. అందుఁ గొన్నిటికి సంస్కృతమూలము గానరాదు. దేశి కథాసంప్రదాయముల ననుసరించి వానిని కవి చేర్చియుండవచ్చును. ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణాంధ్రీకరణము హరివంశాంధ్రీకరణమును బోలియుండు ననఁదగును. ఇప్పుడుపలబ్ధములయిన పద్యములు సంస్కృతానుసారులుగా నున్నవి. ఆయాపద్యముల పట్టులను సంస్కృత వాల్మీకి రచనముల తోను, తెలుఁగు రంగనాథ భాస్కరరామాయణ రచనాభాగములతోను బోల్చి చూచిన నీ యెఱ్ఱాప్రెగ్గడ పద్యములు సరిగా సంస్కృతానుసారులుగా నుండుట వ్యక్తమగును.

రంగనాథ భాస్కరరామాయణములు ఎఱ్ఱాప్రెగ్గడ రచనమునకంటెఁ బూర్వము వెలసిన వనఁదగినవి. ఎఱ్ఱాప్రెగ్గడ కించుక తర్వాతి కాలమువాఁడగును భాస్కరరామాయణ యుద్ధ కాండ శేషమును బూర్తిసేసిన అయ్యలార్యుఁడు. ఇంచుమించుగ నాతని కాలముననే తెలుఁగున మఱొక రామాయణాంధ్రీకరణము వెలసినది.

క. రామాయణకృతికృతియై
తా మెఱయుచు నాంధ్రకవిపితామహుఁ డనఁగా
భూమిం బినభీమన యను
నామంబున వెలసె సత్యనారన ఘనుఁడై.

—సింహాసనద్వాత్రింశిక.

'పిన్నభీమన్న' యని 'ఆంధ్రకవిపితామహు' డని పేరందిన, రామాయణకృతికర్తయైన యీ సత్యనారన అనపోతకుమార సింగభూపతి (వెలుగోటి వెలమరాజు) కాలమువాఁడు. అయ్యలార్యున కీతఁ డించుమించుగా సమకాలమువాఁడగును. ఈ రామాయణముగూడ నిపుడు గానరాదు. ప్రాచీనలక్షణగ్రంథకారులుగాని, యితర ప్రాచీనకవులుగాని యీ సత్యనారనను స్మరించినట్లు గానరాదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము ఎఱ్ఱాప్రెగ్గడ నాఁటనుండి కూచిమంచి తిమ్మకవి నాఁటిదాఁక సుప్రచారము గలదిగాఁ దెలియవచ్చుచున్నది. నూట యెనుబదియేండ్ల క్రిందటిదాఁక సురక్షితమై యున్న యీ గ్రంథ మీనాఁడు గూడ నెక్కడనేని అపరిజ్ఞాతముగా నుండవచ్చును. గోదావరీమండలమున కందరాడ, చంద్రమపాలెముల (కూచిమంచి తిమ్మకవి యూళ్ళు) చుట్టుపట్టులఁగాని, కృష్ణా గుంటూరు నెల్లూరు కడప కర్నూలు మండలములలోఁ గాని అది దొరకఁదగు ననుకొనుదును. నెల్లూరు కర్నూలు కడప మండలములలో ప్రాచీనగ్రంథపరిశీలన మింకనుసరిగా జరుగవలసియున్నది. అయాచోట్ల నపరిచితముగా నున్న తాటియాకుకట్టలను పరిశీలించి యెఱ్ఱాప్రెగ్గడ రామాయణము నే పుణ్యాత్ముఁడేని యుద్ధరింపఁ గల్గునని విశ్వసించుచున్నాను. ఎఱ్ఱాప్రెగ్గడ నృసింహపురాణము తప్పులతో నొక్క ప్రతిమాత్రమే ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ గలదు. దానికిని మంచిప్రత్యంతరము కావలెను. ఆంధ్ర విశ్వవిద్యాలయాధ్యక్షులగు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణమును సంపాదింపగల్గితిమేని యది మన కొకభాగ్యవిశేషమనియు, దాని నార్జింపఁగలవారికెంత సహాయ్యమేని చేయ నుత్సహింతు మనియు రాజమహేంద్రవరమున జరిగిన రెడ్డి సామ్రాజ్యవర్ధంత్యుత్సవమునఁ జెప్పిరి. శ్రీ రామలింగారెడ్డిగారి పవిత్రాశయము సఫలముగుట కపేక్షించుచున్నాను.

[రెడ్డిరాజ్య వర్థంత్యుత్సవ సమావేశము
ప్రసంగపత్రము : 1939
భారతి, ప్రమాది. జ్యేష్ఠము. 1-6-1939
రెడ్డి సంచిక : అగస్టు 1947]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పండితారాధ్య చరిత్రము

శ్రీమల్లికార్జున పండితారాధ్యుని

జన్మాదిక వృత్తాంతములు- గ్రంథరచనా విశేషములు

శ్రీమల్లికార్జున పండితారాధ్యుఁడు ఆంధ్రశైవాచార్యులలో పండితత్రయ మని యెన్నికగన్న శ్రీపతి, మంచెన, మల్లికార్జున పండితులలో మూఁడవవాఁడు.

జన్మాదికము

గోదావరి మండలమందలి దాక్షారామ మీయన జన్మస్థలము. ఆయూర వెలసియుండు భీమేశ్వరస్వామివారి కీతనివంశమువారు పూజారులు. పురోహితులని సోమనాథుఁడు చెప్పినాఁడు. అర్చకులు, ఒండె స్థానపతులుకాఁదగుదురు. శివతత్త్వసారమును బట్టిచూడఁగా నర్చకులే యగుదురనితోఁచును. అనాఁడు కర్ణాటాంధ్రదేశములందుఁ బేరెన్నికగన్న వాణసవంశమున నీఁతడు జన్మించెను. చాళుక్యరాజులకు మంత్రులు, ఆస్థానకవులు నయి వన్నెకెక్కినవారు వాణసవంశమువారు. శాసనములలోఁ బలుచోట్ల తద్వంశ్య ప్రశంసయుండును. ఆంధ్రభారతకర్తయగు నన్నయభట్టారకుని సహాధ్యాయుఁడు నారాయణభట్టు వాణసవంశమువాఁడు. మడికిసింగన పాద్మోత్తర ఖండకృతికిఁ బతి కందనామాత్యుఁడు వాణసవంశమువాఁడు.

తే॥ కశ్యపబ్రహ్మ యన జగత్కర్త పుట్టె
నతని తనువున నుదయించె నఖిలజగము
నతనిగోత్రజులందుఁ బెం పతిశయింప
వాణసాన్వయ మొప్పారె వసుధమీఁద.

అని మడికిసింగన చెప్పినాఁడు. పండితారాధ్యుని చరిత్రము రచించిన సోమనాథుఁడు వాకొనలేదుగాని, వాణసవంశ్యులు కాశ్యపగోత్రులు గాన నారాధ్యదేవరకూడఁ గాశ్యపగోత్రుఁడే యనవలెను. 'చతుర్మతనిర్ణయ'మని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యిటీవల ఓరుగంట ముద్రితమయిన యొక చిన్నిపుస్తకమున నాతఁడు గౌతమగోత్రజుఁడని కలదు. గౌరాంబా, భీమనపండితు లీతని తలిదండ్రులు. భీమనపండితుఁడు తాను శ్రీశైలమునఁ బంచాక్షరీమంత్రము జపముచేసి పడసిన సంతానముగాన, యాపుత్రునికి మల్లికార్జునుఁడని పేరుపెట్టెను. దాక్షారామము చేరువనే కోటిపల్లిలో నున్న యారాధ్యదేవరదగ్గఱ నీతఁడు శైవమంత్రదీక్షఁబడసినాడు. సంద్రెండవశతాబ్దియుత్తరార్ధమున, 1150 నుండి 1180దాఁక నీమహనీయుఁ డాంధ్రదేశమునఁ బ్రఖ్యాతుఁడై యుండెను. గుంటూరు మండలమందలి ధనదుపురమున (నేఁటి చందవోలు) వెలనాటి చోడని యాస్థానమున నీతఁడు బౌద్ధాచార్యులతో మతవివాదము నెఱపెను.

బౌద్ధాచార్యులపై కక్ష

శ్రీకాకుళక్షేత్రమునఁ* గలమల్లేశ్వరాలయమునఁ(ఈయాలయము నేఁడును శ్రీకాకుళమునఁగలదు) గల 'దివియకంబమును' (దీపములువెలిగించు లోహస్తంభమును) బౌద్ధాచార్యులు పెల్లగించి కొనివచ్చి వెలనాటి చోడని వివాద సభలో నిలిపిరఁట. మల్లికార్జున పండితారాధ్యునితో వాదము లందు శివనింద చేసిన దోషమును, దీపార్చనాసాధనమును హరించిన దోషమును సైపఁజాలక పండితారాధ్యులశిష్యులాబౌద్ధాచార్యులను జంపిరి. ఆబౌద్ధాచార్యులు ప్రతిదినము సముద్రమధ్యద్వీపమునఁగల బుద్ధ ప్రతిమను

---

*శ్రీకాకుళక్షేత్రమును గూర్చి యింతకుముందు నేను గొన్నివ్యాసములు వ్రాసితిని. శ్రీముఖశాతకర్ణి పేరఁగాని, 'సిరిక' యన్న బౌద్ధోపాసిక పేరఁగాని అయూరు వెలసియుండవచ్చును. సిరిక - పేరు బౌద్ధప్రాకృత శాసనములలోఁ గాననగును. కాఖంది, కాకతేయ, కాకాంది- కావూరు, కావలి- పేళ్ళు బౌద్ధశాసనములలోని "సిరిక" పేర వెలసియుండవచ్చుననుట సంగతతరము. కాకతీయులు కూడ ఈ పేర వెలసినవారేయని నాతలంపు. బౌద్ధశాసనములలోని కాకతేయులే యిటీవలి కాకతీయులయి యుందురు. సిరికపేర కొలనితో వెలసిన యూరుగాన 'సిరికాకొలను' శ్రీకాకొలను, కాకొలను, అను పేళ్ళు పుట్టి, క్రమముగా వైష్ణవము ప్రబలిన తర్వాత కొలను, 'కొళమ్' అయి శ్రీకాకొళము, కొళము, కాకుళము రూపములు పుట్టినవి. ఈ శ్రీకాకుళము తర్వాత ఉత్తర శ్రీకాకుళము, దక్షిణ శ్రీకాకుళము గ్రామములు వెలసినట్టున్నవి. దక్షిణశ్రీకాకుళము నందివర్మపల్లవుని శాసనమునఁ గాననగును. అది యెక్కడిదో గుర్తింపవలెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బూజింప నరుగుచుండువారఁట! ధనదుపురమునకు సమీపమునఁగల సముద్ర ద్వీపము నేఁటి దీవిఖండము. అక్కడ బౌద్ధస్తూప ముండెడిది గాఁబోలును. కాదేని ధనదుపురమునకుఁ జేరువనే కల బుద్ధాము మొదలగు గ్రామములు గావచ్చును. కాని యవి సముద్ర ద్వీపస్థములుగావు. బౌద్ధాచార్యులా సముద్రద్వీపమునకు బుద్ధపూజ జరపనేఁగినపుడే పండితారాధ్యుల శిష్యులు వారిని జంపిరి. అట్లు వారిని జంపుటకుఁ బండితారాధ్యుఁడాశిష్యుల కనుజ్ఞ యిచ్చెనఁట. శివదూషకులను జంపుట పాపముగాదని పండితారాధ్యుఁడు శివయోగసారమునఁ జెప్పినాఁడు.

క॥ శివనిందావిషయం బగు
నవమానము సెప్పునట్టి యప్పుస్తకముల్
అవిచారంబునఁ గాల్పఁగ
నవుఁ జెమ్పెడివానిఁ జంపనగు నీశానా !

క॥ శివనిందారతుఁ జంపిన
జవమటి తత్కారణమునఁ జచ్చిన నిరెం
డువిధంబుల నీకారు
ణ్యవశంబున ముక్తిఁ బొందు నరుఁడీశానా !

రాజుగారి ఆగ్రహము

ఈ ఘోరకార్యమునకుఁ గోపించి రాజు పండితారాధ్యుల వారికనులు దోడించెను. శివానుగ్రహమున నారాధ్యులవారికి మరలఁ గనులు వచ్చినవఁట! రాజును, దద్రాజ్యమును నాశమగునట్లు శపించి యారాధ్యులవారక్కడనుండి సశిష్యులై, కల్యాణ కటకమున వీరశైవమత ప్రతిష్ఠాపనాచార్యుఁడై ప్రఖ్యాతిఁగనుచున్న బసవేశ్వరుని దర్శింపఁ బయనమయిరి. బసవేశ్వరుని శివభక్తిపరాకాష్ఠకుఁ బరమాదరమును, వైదికవర్ణధర్మపరిత్యాగమునకు సప్రీతియుఁ గలవారై యాయనతోఁ జర్చించుటకే పండితారాధ్యులట్లు వెడలిరందురు. 'భక్తిమీఁదివలపు బ్రాహ్మ్యంబుతోఁ బొత్తు పాయలేను నేను బసవలింగ' యని బసవేశ్వరున కారాధ్యులవారు వార్త వంపిరఁట!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అమరావతి, నడుగుడుములు (నేఁటి నడుగూడెము - మునగాల పరగణా లోనిది) పానగల్లు పురముల మీఁదుగాఁగల్యాణమునకుఁ బోవుచు వనిపుర మను గ్రామమున నుండఁగా బసవేశ్వరుఁ డప్పటి కెనిమిదిదినములకు ముందు లింగైక్యమందుట పండితారాధ్యులకు తెలియనచ్చెను పండితుఁడు చాల విలపించి యక్కడనుండి శ్రీశైలమునకు వెడలి యల్పకాలముననే యక్కడఁ దాను లింగైక్యమందెను. ఇది పండితారాధ్యుల చరిత్రసారము. దీనిని బెంచి పెద్దచేసి పాల్కురికిసోమనాథుఁడయిదు ప్రకరణముల ద్విపద గ్రంథముగా బండితారాధ్యచరిత్రము రచియించెను. సోమనాథుని ద్విపద గ్రంథమున పండితారాధ్యుల శివతత్త్వసారము చాలగాఁ ననువాదమ్ముఁ బడసినది. సోమనాథునిద్విపదపండితారాధ్య చరిత్రముననరించి కవి సార్వభౌముఁడు శ్రీనాథుఁడు పద్యకావ్యముగా బండితారాధ్య చరిత్రమును శృంగారనైషధకృతిపతి యగు మామిడి సింగమంత్రి యన్నకు ప్రెగ్గడ య్యకుఁ గృతిగా రచించినాఁడట ! అది యిప్పుడు గానరాదు.

పండితారాధ్యుని గ్రంథములు

శివతత్త్వసారము, శతకము, రుద్రమహిమ, భీమేశ్వర గద్యము లింగోద్భవదేవగద్యము, స్తుతిశ్లోకపంచకము' అమరేశ్వరాష్టకము, పర్వత వర్ణన అన్న గ్రంథములు పండితారాధ్య రచితములుగా సోమనాథుఁడు పేర్కొన్నాఁడు. ఇందు భీమేశ్వర గద్యము 'యత్సంవిత్తి' అని యారంభ శ్లోకము గలదిగాను, స్తుతిశ్లోకపంచకము 'తస్మైనమ శ్రీగిరివల్లభాయ అని మకుటము గలదిగాను సోమనాథుడు పేర్కొన్నాడు. పై గ్రంథములలో శివతత్త్వసారము, శతకము తెల్గుగ్రంథములు. తక్కిన వెల్ల సంస్కృతగ్రంథములే కాఁబోలును. ఇవిగాక, సంసారమాయాస్తవము, శంకరగీతము అని పదములు, ఆనందగీతము అని పదములు కూడ మల్లికార్జున పండితారాధ్యరచితము లనుకొనఁదగినట్లు సోమనాథుఁడు పేర్కొన్నాఁడు. ఈగ్రంథములు గాక మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో మల్లికార్జున పండిలారాధ్య కృతి 'శ్రీముఖదర్శనగద్య' మని సంస్కృత గ్రంథ మొకటి గలదు. బసవపురాణపీఠికలో దాని నేను వెల్లడించితిని. ఆరాధ్య దేవర మల్లికార్జున శతకములోనిదిగా నీక్రిందిపద్యము లక్షణ గ్రంథము లందుఁ గలదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ॥ లోకములెల్ల సీతనువులోనివ, నీవట యెంత కల్గుదో
నాకపపద్మసంభవ జనార్దను లాదిగ నెల్లపెద్దలుఁ
నీకొలఁ దింతయంత యననేరక మ్రొక్కఁ దొడంగి రన్నని
న్నేకరణిఁ నుతింతుఁ బరమేశ్వర శ్రీగిరి మల్లికార్జునా.

సోమనాథుఁడు పేర్కొన్న శతక మీశ్రీగిరి మల్లికార్జున శతకము గాఁబోలును. ఇది సమగ్రముగా దొరకవలసియున్నది. సోమనాథుఁడు తన పండితారాధ్యచరిత్రమునఁ జాలఁగాఁదన ద్విపదకృతిలోనికి మార్చుకొన్నది, ఆంధ్రకందపద్యాత్మకము, తిక్కనసోమయాజులవారి కింకను నూతేండ్ల ప్రాఁతకాలపు దగుటచే భాషాచరిత్రాదిపరిశీలకుల కత్యంతోపకారకము, తత్కాలపు టాంధ్రదేశపు టారాధ్యశైవమతసంప్రదాయనిరూపకము నగుటచే, పండితారాధ్యునిగ్రంథములలో శివతత్త్వసారముముఖ్యమయినదని వచ్చును ఇర్వదియేండ్లకు ముందు నరసాపురమున నొకజంగముదేవర యింట దాని నేఁ గనుఁగొంటిని. చెన్నపురిప్రాచ్యలిఖితపుస్తకశాలకు సేకరింతితిని. కీర్తిశేషులు శ్రీలక్ష్మణరావుగారు దాని నప్పుడు సాహిత్యపరిషత్పత్రికలోఁ బ్రకటించిరి. తర్వాతఁ బుస్తకముగాను బ్రకటించిరి. కాని యిప్పుడా దొరకిన పుస్తకముగూడ నసమగ్రమే. అందు నన్నూటయెనుబది తొమ్మిదిపద్యములు మాత్రమే కలవు. అందింక నెన్నిపద్యము లుండవలెనో అప్పుడు తెలియ నశక్యమయ్యెను. లక్షణగ్రంథములందు పండితారాధ్యదేవర శివతత్త్వసారములోనివిగా నుదాహృతము లయిన పద్యములు గొన్ని యీముద్రిత గ్రంథమునఁ గానరావు. ఆపద్యము లివి-

క॥ జడ లల్లి భూతి పూయని
పొడవులఁ బొడగాన మాదిపురుషులలోనఁ
నడుమంత్రపు సమయంబులు
జడమతు లలరించుకొనిరి చంద్రాభరణా!

క॥ ఆయెడఁ ద్రిపురాంతకదే
వా యని పిలుచుటయుఁ గటకమంతయు వినఁగాఁ
బాయక కిన్నర బ్రహ్మయ
కోయని యెలుఁగీవె తొల్లి యురగాభరణా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ పతి ! సదృశాధికతాప
త్రితయ, గుణత్రితయు, జన్మమృతి సుఖదుఃఖ
క్షతివృద్ధిబంధమోక్ష
స్తుతినిందాదులును లేవు ధూర్జటి నీకుఁ

క॥ అంచితమతి నెవ్వరు ని
ర్మించిరి వంచితులు సురలు కృత్యాదికళా
భ్యంచితమై తనరారు ప్ర
పంచము నీయట్ల వరద పరమానందా !

ఈ పద్యములఁ బట్టిచూడఁగా నింక నెంతో గ్రంథము దొరకవలసి యున్నట్లేర్పడును. ఈపద్యము లిప్పుడు దొరకకున్న గ్రంథభాగములోని వగుననఁదగును.

కన్నడ గ్రంథము

ఆంధ్రపద్యాత్మకమగు శివతత్త్వసారము విషయ మిట్లుండఁగా నాకు కన్నడమున గూడ నీకృతి గనుగొన నయ్యెను. చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నేదో కర్ణాటక గ్రంథముతోపాటు, ఆద్యంతశూన్యమై యనామధేయమై కన్నడకందపద్యముల గ్రంథభాగ మొకటి కానవచ్చెను. కన్నడపండితులాపద్యములఁ జదువుచుండఁగా వింటిని. తెలుఁగు శివతత్త్వసారపద్యములే యనిపించెను. ఆనుపూర్వితోఁ బరిశీలించితిని. తెలుఁగుపద్యముల వరుసనే కన్నడపద్యము లున్నవి. తెల్గుకృతిలో మల్లికార్జునపండితారాధ్యుఁడు తనపేర నీక్రిందిపద్యము చెప్పికొన్నాఁడు-

క॥ ఒందేమి మల్లికార్జున
పండితుఁ డననుండుకంబెఁ బ్రమథులలో నె
న్నండొకో నీయాజ్ఞోన్నతి
నుండం గాంతు నని కోరుచుండుదు రుద్రా !

ఇట్లే పండితారాధ్యుని పేరనే కన్నడ పద్యము నున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ ధరయొళగె మల్లికార్జున
వర పండిత సెనిసుతి హుదటిం నిన్నాజ్ఞా
భరమె సెయల్ ప్రమథరొళా
నిరతెం దీక్షిసువెనిమ్మబయసువె నీశా !

ఈ కన్నడకృతినిగూడ పండితారాధ్యుఁడే రచించెనో, మఱి యిటీవలివారెవరైన కన్నడీకరించిరో గుర్తింపవలెను. పండితారాధ్యుఁడు కన్నడమునఁ గూడఁ బండితుఁడయినట్లు పండితారాధ్య చరిత్రమునఁ గలదు. కాన యాతఁడును రచించియుండవచ్చును. ఈ కన్నడగ్రంథమున గ్రంథాదిపద్యములు 183 లోపించినవి. 184 నుండి 491 దాఁక సరిగాఁ బద్యములున్నవి.

తర్వాత 725-వ పద్యమునుండి 740-వపద్యముదాఁక గ్రంథము గలదు. ఈ పద్య సంఖ్యను బట్టి చూడఁగా శివతత్త్వసారము వేయిపద్యముల గ్రంథమయియుండునని తోఁచుచున్నది. సంస్కృతమున నుద్భటుఁడు 'హరలీల' యని వేయి శ్లోకముల స్తుతి గ్రంథమును రచియించెనఁట. మన పండితారాధ్యుఁడు గూడ నీవిషయము చెప్పినాఁడు.

క॥ హరలీలాస్తవరచనా
స్థిరనిరుపమభక్తిఁ దనదు దేహముతోడన్
సురుచిరవిమానమున నీ
పురమున కుద్భటుఁడు ప్రీతిఁబోవఁడె రుద్రా !

మఱియు బ్రహ్మదేవకవియని కర్ణాటకవియు, పాల్కురికి సోమనాథుఁడును నీ హరలీలఁ బేర్కొనిరి. ఇవి మూకపంచశతి, పాదుకా సహస్రము, లక్ష్మీ సహస్రము మొదలగు స్తుతి గ్రంథములఁ బోలినది కాఁబోలును. ఉద్భట గ్రంథచ్ఛాయను మన పండితారాధ్యుఁడు శివస్తుతిరూపముగా వేయి యాంధ్రపద్యములతో నీ శివతత్త్వసారము రచించియుండును. కన్నడ గ్రంథమును పండితారాధ్యుఁడో, మఱి యింకొకఁడో రచించినను, తొలుతటి గ్రంథము తెలుఁగు గ్రంథమే యనఁదగినట్లున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ మానిసిపైఁ దోల్గప్పిన
యీనెపమున నున్న రుద్రు లీశ్వరభక్తుల్
మానుసులె వారు లోకహి.
తానేకాచారు లీశ్వరాజ్ఞాధారుల్.

క॥ మానుషచర్మం వుదుగి
ర్దీ సెవదిందిప్ప రుద్ర రీశ్వరభక్తర్
మానుషరె యివరు లోకహి
తానేకాచార రీశ్వరాజ్ఞాధారర్.

క॥ స్ఫుటశివతాంత్రికుఁ డపగత
కుటిలాత్మకుఁ డుద్ధరించు గోత్రము వెల్లన్
బటుగతి "రజ్జుః కూపాత్
ఘటం యథా" యనినసూక్తి కారణమగుటన్.

క॥ స్ఫుటశివతాంత్రిక నపగత
కుటిలాత్మక నుద్ధరిపసు గోత్రమ నెల్లం
వటుగతి "రజ్జుః కూపాత్
ఘటం యథా" యెంబసూక్తితథ్యమహుదఱిం.

క॥ నిర్మలపదార్థ మగుటను
నిర్మాల్యంబనఁగ నెగడు నీ నిర్మాల్యం
బర్మిలిఁ గుడుతురు భక్తులు
కర్మక్షయమగుట మోక్షకాంక్షులు రుద్రా.

క॥ నిర్మలవస్తువహుదఱిం
నిర్మాల్య మెనల్కె నెగళు నిర్మాల్యమదం
కూర్మెమి నుంబర్ భక్తరు.
కర్మక్షయమహుదఱిం ముముక్షుగళభవా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ పురుషప్రతికూలత్వ
స్థిర దోషము సతికి దుర్గతం జేయదు ద
త్పురుషుఁ డభక్తుఁడ యేనిన్
బురుషుని మీఱియును శివునిఁబూజించు నెడన్.

క॥ పురుష ప్రతికూలత్వం
స్థిరదోషం సతిగె దుర్గతియ నీయదు త
త్పురుషన భక్త నెయాగళ్
పురుషననం మీఱి శివన నోల్తై పడియో.

ఆంధ్ర కర్ణాట పద్యములఁ బరిశీలింతు మేని యతిప్రాసములు రెండునుగల తెలుఁగు రచనము తొలుతటి దగుట తెలియనగును. కర్ణాటక పద్యములకు యతినియమము తెలుఁగున కున్నట్టిది లేదు. కాని యిందుఁ నేను జూపిన కర్ణాట పద్యములు ప్రాయికముగా నాంధ్రయతి సంగతి గలవే. యతిసంగతి గల తెలుఁగు పద్యములు ముందు రచించిన వగుటచే, నది కన్నడ పద్యములకుఁగూడఁ బరివర్తనమునఁ బొందుపడినది. ఈ యాంధ్ర కర్ణాట పద్యముల జోడించి శివతత్త్వసారమును నేను మరలఁ బ్రకటింపనున్నాఁడను.

[ఆంధ్రపత్రిక : 29-5-1940
విభూతి : (2-4)
మీగడతఱకలు : 1951]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేములవాడ భీమకవి

వేములవాడ భీమకవి శాపానుగ్రహశక్తిమంతుఁడనీ, ఉద్దండ కవి అని ప్రాచీనకవులు ప్రశంసించినారు. శ్రీనాథుడు "వచియింతు వేములవాడ భీమనభంగి నుద్దండలీలనొక్కొక్కమాటు" అన్నాడు

క॥ భీమకవి రామలింగని
శ్రీమన్మథుడై చెలంగు శ్రీనాథకవిన్
రామకవిముఖ్యులను బ్రో
ద్దామతిన్ భక్తిమీఱఁదలఁచికడంకన్. అన్నాడు కూచిమంచి జగ్గన.

క. వేములవాడక సుధియై
లేమలవాడన్ జనించి లేమలవాఁడన్
నామంబునఁబరగిననుత
భీమున్ గవిభీముసుకవిభీముఁదలంతున్ఁ అన్నాడుగోపరాజు.

ఈ భీమకవిగోదావరీమండల దాక్షారామపు లేములవాడవాస్తవ్యుఁడని కొందఱును, నైజాం రాష్ట్రిమందలి వేములవాడ వాస్తవ్యుఁడని కొందఱును, తలఁచుచున్నారు. ఉభయవాదములకూ సాధకబాధకములున్నవి. ఈతడు పై రెండు స్థలములలోనెక్కడివాడేని కావచ్చును. ఈ భీమకవి కూడ శ్రీనాథుని వలె తెలుంగాధీశుని గస్తూరీ ఘనసారాదిసుగంధవస్తువులు యాచించినట్లే యీచాటు పద్యము చెప్పుచున్నది.

ఘనుడన్ వేములవాడవంశజుడ, దాక్షారామ భీమేశనం
దనుడన్ దివ్యవిషామృత ప్రకటనానాకావ్యధుర్యుండభీ
మననాపేరునెఱుంగఁజెప్పితిఁదెలుంగాధీశ, కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగందెచ్చిలాలింపురా

వృద్ధపారంపర్యమున యీ పద్యమీవిధముగా వినికిడికలదిగాని ప్రాత వ్రాఁతలలో తెలుంగాధీశ అనికాక కళింగాధీశ అని పాఠము కానవచ్చు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చున్నది. మన భీమకవి కళింగాధీశుడయిన, యనంతవర్మచోడగంగదేవుని దర్శించినట్లింకను గాన్ని చాటు పద్యములు చాటుచున్నవిగాన యీ పద్యమున కళింగాధీశ అన్న పాఠమే పరిగ్రాహ్యమనవచ్చును.

పయి పద్యమున భీమకవి విషామృతము మొదలగు గ్రంథముల రచించినట్లున్నవి. కాని యాగ్రంథములేవీ యిప్పుడు కానరాకుండుటశోచనీయము. 'విషామృతము' అని జ్యోతిష గ్రంథమొకటి అడయారు లైబ్రరిలో వ్రాతప్రతి కలదుగాని అది యితనిదై యుండదు. ప్రసిద్ధమయిన కవిజనాశ్రయము యీ భీమకవి రచించినదిగా లోకప్రతీతి. గ్రంథమున కవిజనాశ్రయుడు శ్రావకాధరకాంకుడు అగు రేచన రచించినట్లున్నది. అతఁడు గోమటియట. అనంత వర్మచోడగంగదేవుని సంధివిగ్రహి 'రేచన' యొకడు కలడు. అతని శాసనము గోదావరీమండల ద్రాక్షారామ భీమేశ్వరస్వామి గుడిలోనున్నది. మనభీమకవి యీరేచనపేర కవిజనాశ్రయము రచించి యుండునేమో. కవిజనాశ్రయమిప్పుడు చాలా అపపాఠములతో ప్రక్షిప్త గ్రంథభాగములతోనిండియున్నది. దానిని జాగ్రత్తగా సంస్కరించి యుద్ధరింపవలసియున్నది. 'చిత్రపుభీమన'యను కవిరచించిన ఛందస్సు ఉత్తమ గంధచ్ఛందస్సు' అను పేరిట వేరొకటి కలదు. అదీ, కవిజనాశ్రయమూ, ఒకటేయని కొందరు భ్రమపడిరి. అదియట్లుకాదు. ఉత్తమ గంధచ్ఛందస్సు వేఱు. కవిజనాశ్రయము వేఱు. ఉత్తమ గండఛ్ఛందస్సు చిత్రపు భీమన రచించినది. కవిజనాశ్రయచ్ఛందస్సు వేములవాడభీమకవి రచించినదని ప్రతీతి కలది. రెండూ ప్రాచీనతర ఛ్ఛందోగ్రంథములే. మన ఆంధ్రప్రయోగ రత్నాకరమున వేములవాడ భీమకవి కృతి నృసింహపురాణమను పేరుతో కొన్ని పద్యములుదాహృతములయియున్నవి. పింగళిసూరన్న రాఘవపాండవీయములో, భీమకవి తొల్లి శ్లేషకావ్యమేదో రచించినట్లు ప్రతీతియనీ, అది కానరాదనీ చెప్పినాడు. వేములవాడభీమకవి గ్రంథములేవీ దొరకకపోయినా లక్షణగ్రంథములందాతని చాటుపద్యములు చాలా ఉదాహృతములై దొరకుచున్నవి. సాహిణిమారన, చాళుక్యచొక్కభూపతి, సాగిపోతరాజు, (అనంతవర్మ) కళింగగంగదేవుడు, చోడగంగడు, మైలమభీమడు, నల్లసిద్ధి, యను వారిమీద నీతడు చాటు పద్యములు చాలా చెప్పినాడు. పైవారిలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మైలమభీమనికే ఏఱువభీమడనీ, చిక్కభీమడనీ నామాంతరములు. ఈతనిపై భీమకవి ప్రశస్తమైన ప్రశంసా పద్యములు చెప్పినాడు. అవి యెల్ల చాటు పద్యమణిమంజరిలో జూడనగును. మచ్చునకు రెండు పద్యములు.

క. అరివరులేఱువభీమని
పొరువునమనలేరు చిచ్చుపొంతను వెన్నై
తెరువున పెసరై జూదరి
సిరియై రేన్చెట్టుక్రింద జిల్లెడు చెట్టై.

ఉ. యాచకఖేచరుండు సుగుణాంబుధి మైలమభీముడల్గినన్
జూచివరించెరంభయెడఁజొచ్చెఁదిలోత్తమ దారినిద్దఱన్
ద్రోచెఘృతాచిముగ్గురకు దొద్దడికయ్యముపుట్టెనంతలో
నాఁచుకుపోయెముక్తిసలినవ్విరియద్దశజూచినిర్జరుల్
నోఁచినవారిసొమ్ములవినోమనివారికివచ్చునేధరన్.

ఈ పద్యపు తుదిచరణముగల పద్యము నాచన సోమనాథుని యుత్తరహరివంశముననుగలదు. భీమకవిచాటుపద్యములపోలిక పద్యములు నాచనసోమనాథుని యుత్తరహరివంశమున నింకను గలవు. శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు ప్రకటించిన తాళ్ళప్రొద్దుటూరి శాసనముఁ వేములవాడ భీమకవి రచన ననుసరించిన నాచనసోము రచనము కావచ్చునని నా తలపు. ఏలనఁగాఅందులో వేములవాడ భీమకవిపేర ప్రసిద్ధిగన్నచాటుపద్య మిదికూడ ఉన్నది.

పన్నితురంగమంబునకుఁబక్కెరవెట్టినవార్తచారుచే
విన్నభయంబునన్ గలఁగె వేనరనాడును జిక్రగోట్టమున్
మన్నియపడ్డెతెక్కలియు మంథెనవేంగి కళింగలాదిగా
నిన్నియునొక్కపెట్టెగసెనేఱువభీమనృపాలుధాటికిన్.

మఱిన్నీ ఆశాసనపుఁబద్యములయనుకరణములు కూడ నాచన సోమన గ్రంథములో ఉన్నవి. పయి చాటుపద్యముల నన్నిటినీ పర్యాలోచింపగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భీమకవి క్రీ.౧౨వ శతాబ్ది మధ్యముననో ఉత్తరార్థముననో, అనగా ఇప్పటి కెనిమిది వందలయేండ్ల కించుమించుగా పూర్వమున్నవాడగును.

వేములవాడభీమకవి శాపానుగ్రహశక్తిమంతుడనుటకు తార్కాణగా పెక్కుచాటుధారలున్నవి. సాగిపోతరాజును శపించినపద్యము.

హయమదిసీత పోతవసుధాధిపుడారయరావణుండని
శ్చయముగనేనురాఘవుడసహ్యజవారిధిమారుఁడంజనా
ప్రియతనయుండు లర్చన విభీషణుఁడాగుడిమెట్టలంక నా
జయమును బోతరక్కసునిచావును నేడవనాఁడుచూడుఁడీ.

గోమటివారినినిందించినట్టు భీమకవి పద్యములు కొన్ని లక్షణగ్రంథము లందుదాహరింపబడయున్నవి. కవిజనాశ్రయమును కోమటి రేచన పేర రచించిన కవియేయట్లు కోమటి వారినిగర్హించునాయని సంశయము. ఆపద్య ములు చాటు పద్యమణి మంజరిలోఁజూడదగును. మఱిన్నీ చాళుక్య చొక్క భూపతిపై ప్రయోగించిన శాపానుగ్రహశక్తుల పద్యములఁగూడ నక్కడనే చూఁడఁదగును. అనుగ్రహించి భీమకవి జన్నమాంజయనునామెకు గండ మాలావ్యాధిని పద్యరచనచేకుదిర్చెను.

క। ఘనరోగంబులబలమా
కనుఁగొనఁగా జన్నమాంబకర్మపుఫలమా
నినుఁబ్రార్థించెదవినుమా
మునుకొనియోగండమాల! మునుగకుఁజనుమా !

కొన్నాళ్ళకామెమీద పెడదిరిగి గోపించి శపించి మరల నావ్యాధి నామెకేవచ్చునట్లు చేసెనట.

ఒక బ్రాహ్మణుని దొడ్డిలోని పేరాముదసాకులు భీమకవి తాలూకు నౌకరొకడు మందుకనికోసికొనఁబోగా నాయింటి బ్రాహ్మణుడా నౌకరును పారతో గొట్టెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ బ్రాహ్మణుడడఁగారునట్లు భీమకవి శపించెను.

క. కూరడుగము, నారడుగుము,
నారయగానుల్లి, బచ్చ, లల్లి, మడుగ, మా
పేరాముదపాకడిగినఁ
బారమ్మునఁగొట్టెనట్టె బాపడు వ్రేళ్ళన్

భీమకవి తనశాపానుగ్రహశక్తిమత్త్వమును బ్రశంగించుకొన్న పద్య మిది.

సీ. గడియలోపలఁ దాడి గడఁగి ముత్తునీయగా
దిట్టిన మేధావిభట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండిముం డ్లన్నియు
డుల్లం దిట్టిన కవిమల్లుకంటె
మూఁడుకడెలకుఁ దా మొనసి యత్తినగండి
పగులఁ దిట్టిన కవిభానుకంటె
అఱజాములోపలఁ జెఱువునీ ళ్ళింకంగఁ
దిట్టిన డబాగ్నిభట్టుకంటె

గీ॥ నుగ్రకోపినినేను నోపునుశపియింపఁ
గ్రమ్మరింపశక్తికలదునాకు
వట్టిమ్రానఁజిగురుఁబుట్టింపగిట్టింప
బిరుదువేములాడభీమకవిని.

[రేడియో ప్రసంగము
మదరాసు : 20-9-1941
మీగడ తఱకలు : 195]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శివకవులు

వీరశైవులు నాస్తికులనఁబడు జైనబౌద్ధమతముల వారినేకాక శ్రౌత స్మార్త కర్మములాచరించు వైదికమతముల వారిని గూడ గర్హించిరి. వారు వీరవ్రతులు. భవులతో దర్శనస్పర్శన సంభాషణాది సాంగత్యము వారికి దగదు (భవులనగా శైవేతరులు) శైవులలోఁ గవీశ్వరులగువారు శివుని మీదను దద్భక్తులమీదను దక్క నితరులగు భవులమీద నెప్పుడును గృతులు చెప్పెడివారు కారు. కావున వారికి శివకవులని పేరు కల్గెను. కర్ణాటకాంధ్ర గ్రంథములలో శివకవుల ప్రశంస పెక్కుచోట్లఁ గలదు శివకవులు భవికవులను గర్హించిరి. కవితలో గూడ శివకవులు వేఱుమతము వారైరి.

శివకవుల గ్రంథములు

మల్లికార్జున పండితారాధ్యుని శివతత్త్వసారమును, పాల్కురికి సోమనాథుని బసవపురాణాది గ్రంథములును, నన్నిచోడని కుమారసంభవమును నిప్పుడు మన కుపలబ్ధము లయిన శివకవుల గ్రంథములలోఁ బ్రాచీనములు. మల్లికార్జున పండితుని కృతులు మఱికొన్ని దొరకవలసియున్నవి. మల్లికార్జున పండితునికంటెఁ బూర్వుఁడు శ్రీపతిపండితుఁడుకూడఁ గవియఁట! ఆయన బెజవాడలో నున్నవాఁడు. ఆయన తెనుగుకృతు లేమేని రచించెనేమో యెఱుఁగరాదు. పండితారాధ్యచరిత్రలో నీక్రింది గ్రంథములు పేర్కొనఁబడినవి.

"అంచితబాణగద్యా క్షరగద్య
పంచగద్యాదులు పటుగణాడంబ
రంబు వర్ణాడంబరంబు వ్యాసాష్ట
కంబును శ్రీనీలకంఠ స్తవంబు
శ్రీరుద్రకవచంబు శారభంబునుమ
యూర స్తవము హలాయుధ మనామయము
మలహణమును మహిమం బను స్తవము
మలయరాజీయంబు మౌనిదండకము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్తుతిమూలమగు మహాస్తోత్ర సూత్రములు
శతకంబు శివతత్త్వసారంబు దీప
కళిక మహానాటకము నుదాహరణ
ములు రుద్రమహిమయు ముక్తకావళులు
గీతసూక్తములు భృంగిస్తవంబులు పు
రాతనముని ముఖ్యరచితాష్టకములు
హరలేల—"

శివతత్త్వసారము తెలుఁగుకృతిగాన పై వానిలో నింక నొకటి రెండే వయినఁ దెలుఁగుకృతులయి యుండవచ్చునేమో కాని తక్కినవన్నియు సంస్కృత గ్రంథములే. సోమనాథు డింకను దుమ్మెదపదములు, ఆనంద పదములు, నివాళిపదములు, దండనాయకగీతములు, మొదలగు పదకృతు లను తెలుఁగువానిని బేర్కొన్నాడు. దీనిని బట్టి చూడగా నాశివకవుల తెలుగు కృతులు పద్యరచనముగలవి మల్లికార్జునపండితారాధ్యునికంటెఁ బూర్వకాల మున లేవేమోయని సంశయము కలుగుచున్నది. ఉన్నచో సోమనాథుడు పేర్కొనియుండును గదా! సోమనాథునికంటె నర్వాచీనులగు శివకవుల కృతులనేకము లున్నవి. శివకవుల రచనా రీతులను పరిశోధింపఁగా వీరి గ్రంథములకును, నన్నయ తిక్కనాదులగు (భవి) కవుల గ్రంథములకును బెక్కు భేదములు గానవచ్చుచున్నవి ఈవిషయ మించుక వివరించి తెల్పెదను.

రచనాభేదములు

ఛందస్సు:— ద్విపదరచనలో శివకవుల విధము వేఱు. తాళ్ళపాక తిరువేంగళనాథుఁడు ద్విపదలక్షణము నిట్లు నిర్వచించినాడు.

"వాసవుల్ ముప్వురు వనజాప్తు డొకడు
భాసిల్లనది యొక్కపదము శ్రీకాంత
క్రమమున నవినాల్గు గుణములనడచుఁ
గ్రమదూరముగఁ బ్రయోగము సేయరాదు
ఆపాదమునకు మూఁడవగుణంబాది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దీపించుయతి యంబుధిప్రియతనయ
యుపమింపనవి ప్రాసయుతములై రెండు
ద్విపదనా విలసిల్లె వికచాబ్జపాణి
ద్విపదకుఁ ద్విపదకుఁదెగజెప్పవలయు
నెపుడు సంస్కృతమున నితరభాషలను
యతులలోపలఁ బ్రాసయతి దక్కనకల
యతులుఁ జెల్లును బ్రయోగానుసారమున
ద్విపదతో ద్విపద సంధిల నేకశబ్ద
మపుడు ప్రయోగింప నది యయుక్తంబు
మఱియు సంస్కృతపు సమానరూపమున
నెఱయ నెన్నిటినైన నిర్మింపఁదగును
....
అను లక్షణమ్ముల ననువొంది సుకవి
జన సుప్రయోగైక శరణమై—"

అష్టమహిషీకళ్యాణము.

రంగనాథుని రామాయణము, గౌరనహరిశ్చంద్ర చరిత్ర మొదలగు ద్విపదలందుఁగాన వచ్చు విధమునే యీ లక్షణము చెప్పుచున్నది. శివకవుల ద్విపదరచన మిందులకు విరుద్ధముగానున్నది. రంగనాథ రామాయణాదులందుఁ గానరాని ప్రాసయతి బసవపురాణము మొదలగు శివకవుల గ్రంథములందున్నది. మఱియు, ద్విపదయు ద్విపదయుఁ గలయునప్పుడొక్కపదమే యిటుకొంత యటుకొంత యగునట్లు రంగనాథాదు లెక్కడను గూర్పరయిరి. పాల్కురికి సోమనాథాదులగు శివకవులు వద మధ్యమందే ద్విపదము ముగియునట్లు పెక్కుచోట్ల రచనము నెఱపిరి సోమనాథుఁడు "జాతులు మాత్రానుసంధానగణవి, నీతులు గాన 'యనియ' తగజెర, నియును 'బ్రాసోవా' యనియు 'యతిర్వా'య, నియుఁ జెప్ప ఛందో వినిహితో క్తిగాన, ప్రాసమైనను యతిపై వడియైన, దేసిగానిలిపి యాదిప్రాసనియతి, తప్పకుండఁగ ద్విపదలు రచియింతు" నని మాత్రాగణ ఘటిత మగుటచే ద్విపదలో ప్రాసయతి చెల్లుననుటను సంస్కృత మాత్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ములను గూడ సుదహరించి చెప్పినాడు. ద్విపదము ప్రాసయతి గలిగి యుండుటయు, రెండేసిచరణములకుఁ దునుకలుగాక ద్విపదమునుండి ద్విపదమునకు దూఁకునట్లు పదమధ్య సంధిగలిగి జడవాఱి యుండుటయు శివకవుల కృతులలోనే కానవచ్చును.

మఱియు నన్నయాదుల కృతులలోఁ బ్రాసములందు హల్సామ్యము దప్పక కానవచ్చును. అనఁగా మొదటిచరణము ద్వితీయాక్షరమున నెన్ని హల్లులు సంయుక్తములుగా నున్నవోయన్ని సంయుక్త హల్లులును, దక్కిన మూఁడు చరణములందును గూడఁ బ్రాసస్థానమున నుండును. శివకవులీ నియమము నంతగాఁ బాటింపరైరి. కతిపయ హల్సామ్యమున్నఁ జాలునని వీరుతలంచిరి. ఒక్కహల్లు హెచ్చోతక్కువో యయినను బ్రాసమును వీరు పరిగ్రహించిరి.

క॥ నమ్మినభక్తుఁడు గన్నడ
బమ్మయ సద్భక్తిమహిమ పరికింపఁగ లో
కమ్ములఁ జోద్యముగాదె య
ధర్మంబును ధర్మమయ్యెఁ దత్త్వాతీతా! —శివతత్త్వసారము.

ప్రాఁత ప్రాఁతలలో "ధమ్మన్" యని యుండును.

"మర్త్యలోకమునకు మఱివేఱె యొకఁడు,
కర్తయున్నాఁడె లోకత్రయవరద,—
తత్త్రిపురాంతక స్థానవాస్తవ్యుఁ
డై త్రిపురాంతకుఁ డభినుతి చేర్చు. —బసవపురాణము.

ఇత్యాదులు లెక్కలున్నవి.

మఱియు, నన్నయాది కవీశ్వరులు ప్రాసములం దెక్కడను బూర్ణబిందువును నర్థబిందువును బొందింపరయిరి. శివకవుల గ్రంథములలో నది కానవచ్చుచున్నది.

క॥ పోఁడిగి నగజతపశ్శిఖి
మూఁడు జగమ్ములను దీవ్రముగఁ బర్విపఁ బ్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హేమండము గాఁచిన కాంచన
భాండము క్రియదాల్చెఁ దత్ప్రభాభాసితమై. —కుమారసంభవము.
పాండురాంగంబైన పడఁతిగర్భమునఁ
బోఁడిగా వెలుఁగుచుఁ బుత్త్రిఁడీ క్రియను. —బసవపురాణము.
ఇత్యాదులు పెక్కులున్నవి.

ఇట్టి ఛందోలక్షణ విశేషములుగాక, శబ్దప్రయోగములందునుగూడ శివకవులకు నితరకవులకుఁ బెక్కుభేదము లున్నవి.

శబ్దప్రయోగములు

తెఱఁగువోలె, వడువువోలె, - ఇట్టిప్రయోగములు శివకవుల గ్రంథములందే నాకుఁ గానవచ్చినవి.

"తెరువుదాఁ దీర్చిచూపెడు తెఱఁగువోలె—
బలసికొాలువున్న సురగిరి భంగివోలె—
నందనవనము గాపు వచ్చు వడువువోలె—
పాలకడలిలో నిల్చిన భంగివోలె" — —కుమారసంభవము.
"వచ్చువహిత్రంము వడువునుబోలె—
కరమర్థినందిచ్చు కరణియుఁబోలె —" —బసవపురాణము.

హొంచు, పూన్చు,— ఈధాతువు నన్నయాది కవీశ్వరుల గ్రంథములందుఁ బెక్కుచోట్లఁ బ్రయోగింపఁబడియున్నది. అది పూను ధాతువు ప్రేరణరూపము. పూనఁజేయుట దాని యర్థము. 'అరదము పూంచి' ఇత్యాది ప్రయోగములున్నవి. శివకవుల గ్రంథములందెల్ల నీధాతు వింకొక యర్థమునఁ బ్రఖ్యాతముగాఁ గానవచ్చుచున్నది. పూన్చు = పూడించు. ఈధాతువు నీయర్థమున నన్నయాదులు ప్రయోగించినట్లు కానరాదు.

క॥ కన్నువడిఁబుచ్చి పూన్చిన
నెన్నుని భక్తికి వరంబు వెదచల్లుక్రియన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ మొఱటద వంకయ దనతల
లఱిమెల్పడ(దఱిగి నీపదాంబుజములఁ గ్ర
చ్చఱిఁ బూన్చిమగుడఁ బడయఁడె.

క॥ ఉన్నత భక్తిశిరంబుల
బన్నుగ శివుఁబూన్చి కరుణఁబడసిన భంగిన్
మున్నే విధులం గొలిచియుఁ
జన్న దశాననుఁడు వడయఁ జాలెనె చెపుమా. —శివతత్త్వసారము.

చ॥ హరి వికచామలాంబుజ సహస్రము పూన్చి- —కుమారసంభవము

—ద్విపదాంబు రుహములధృతిఁ బనవేళ
ద్విపదాంబురుహము లతిప్రీతిఁ బూన్తు
ఈపద్మములఁ గాదె యింతియాకుంతి
పాపారిఁబూజించి బడసెబాండవుల
చెండి యీపద్మముల్ శివుఁబూన్చి కాదె
సుందరి భృగుపత్ని శుక్రునిఁబడసె
అదిగాక యీపూల హరుఁబూన్చి కాదె
సుదతి కౌసల్య సత్సుతు రాముఁబడసె. —పండితారాధ్యచరిత్ర.

పూజించుట యందుఁ బూన్చు ప్రయోగము శివకవుల గ్రంథము లలోఁ బెక్కు చోట్లఁ గలదు.

మఱియు సమూహి, దాసి (దానుఁడనుటకు) ముల్లోకనాథుఁడు, పుడమీశ్వరుఁడు, సర్వాంగకచ్చడము, దీపగంభములు, తపనిధి, మొదలగు ప్రయోగములెన్నో శివకవులు తఱచుగాఁ బ్రయోగించినవి కలవు. ఇట్టి పదములు కొన్ని యితరకవుల కృతులలోఁ గూడఁ గ్వాచిత్కముగాఁ గానవచ్చును. గావి శివకవులే వీనిని తఱచుగాఁ బ్రయోగించిరి. ఇటీవలి లాక్షణికులు కరకంటుఁడు, ప్రాణగొడ్డము, దినవెచ్చము మొదలగు పదములను గొన్నింటినిమాత్రము త్రోసిపుచఁజాలక యనింద్య గ్రామములని పేరుపెట్టి ప్రయోగార్హములనిరి. శివకవుల కృతులలో లాక్షణికు లనుగ్రహింపనివి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యిట్టివి కుప్ప తెప్పలుగానున్నవి. మఱియు నిప్పటివ్యాకరణమును దలక్రిందు లొనర్చు ప్రయోగము లనేకములున్నవి. మఱియు నపూర్వశబ్దములు శబ్ద రత్నాకరమందుఁ గానరానివి యనేకములున్నవి. శివకవుల కృతులలోని వింతప్రయోగములను వేఱొకచోట వివరించి తెల్పుదును.

ఇతరకవులు వీరిని గర్హించిరి

ఇట్టి రచనావిధానము లితరాంధ్రకవులకు సమ్మతములు కావయ్యెను. వారుపాటించిన ఛందోనియమములను భాషానయమములను వీరు సరకు సేయక కొంతసడలింపఁజాగిరి. పాల్కురికి సోమనాథుని కాలముననే దీనిఁ గూర్చి యోరుఁగంటిలోఁ దగవు నడచినది.

సీ॥ ఒకనాడు శివభక్తులోఁరుగంటను స్వయం
    భూదేవుమంటపంబున వసించి
బసవపురాణంబు పాటించి వినువేళ
    హరునిఁగొల్వఁ బ్రతాపుఁ డచటికేఁగి
యాసంభ్రమంబేమి యనుడు భక్తులు బస
    వనిపురాణంబు బర్థివినెద రనిన
విన వాపురాణంబు విధమెట్లొకోయన్న
    భూర్తివిప్రుఁ డొకండు భర్తఁజేరి
గీ॥ పాలకుర్కి సోమపతితుఁ డీనడుమను
    బెనచె మధ్య (ప్రాస ?)వళ్ళు వెట్టిద్విపద
    నప్రమాణమిది యవాద్యంబు వదమున్న
    నరిగెరాజు___"

తర్వాత సోమనాథుఁడోరుగంటికి వచ్చి యద్భుత చర్యలచే, స్వరచ నమును సమర్థించుకొన్నట్టు పద్యబసవపురాణమందున్నది. ఈకారణము చేతనే యీశివకవులకావ్యములనుండి ప్రాచీనలాక్షణికులు ప్రయుగముల నంతగాఁ గయికొనరయిరి. గ్రంథారంభమయిన దుష్టగణ ప్రయోగముచేసి యుద్ధములోఁ జచ్చెనని నన్నిచోడని నథర్వణుఁ డాక్షేపించెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ మగణమ్మ గదియ రగణము
వగవక కృతిమొదట నిలుపువానికి మరణం
బగు నిక్కమంద్రుమడియఁడె
యగువని యిడి తొల్లి వెంకణాదిత్యుఁడనిన్.

బమ్మెరపోతరాజుగారి గ్రంథములనుగూడ లాక్షణికులు కైకొనమికిది కారణముగావచ్చును. ఆయన వీరభద్ర విజయ రచనమును శివకవి సంప్రదాయము ననుసరించియేయున్నది. (వీరభద్రవిజయము భాగవతకర్త యగుపోతరాజగారు రచించినది కావచ్చునని నాతలపు.)

ఒక శివకవి యిట్లు చెప్పుచున్నాడు:-

ఇలఁబాలకురికి సోమేశుండు మున్ను
తొలఁగక ప్రాసయతుల్ ద్విపదలను
లలి రచించుట యది లక్ష్యంబుగాను
అలమి రేఫ రకారములు శివకావ్య
ములయందుఁ జెల్లుఁ దప్పులుగావు, గాన
అపాల్కురికిసోము ననుమతినేను
దీపితప్రాస యతిచ్చద సరణి
నామహాగురుదేవు ననుమతియట్లు
శ్రీ మెఱయంగ రచించితినిట్లు:- —మఱి బసవపురాణము.

ఇతరకవులు గర్హించినను దర్వాతి శివకవులు సోమనాథాదుల మార్గమును వెన్నాడిరి. ఇప్పటికి రెండువందల యేండ్లకు ముందున్న కవులు, అత్తలూరి పాపకవి మొదలగు వారుకూడ నా సంప్రదాయమునే పాటించిరి. పాల్కురికి సోమనాథుని గ్రంథములలో నితరకవులకు విరుద్ధములన ప్రయోగము లేవికలవో యవి పాపకవి మొదలగువారి గ్రంథములలోఁ గూడ నున్నవి. మఱియుఁ బాల్కురికి సోమనాథుఁడు చూపిన త్రోవయగుటచేఁ గాఁబోలును శివకవులనేకులు ద్విపదకృతులను రచియించిరి.

* ఈ పద్యమును శ్రీరామకృష్ణకవిగారు, కుమారసంభవ పీఠికలో నుదాహరించిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీరు తెనుఁగునే ప్రేమించిరి

ద్రవిడదేశమున శైవులును వైష్ణవులును సంస్కృతభాష కంటెఁ దమ తమిళభాషనే పూజ్యమయిన మతభాషగాఁ జేసికొన్నట్టుగా నీ తెనుఁగు దేశమునఁగూడ వీరశైవులు తెలుఁగు భాషనే మతభాషగాఁ జేసికొనఁదలంచిరి. మల్లికార్జున పండితారాధ్యుఁడు శాస్త్రార్థములతోఁ గూడిన మతగ్రంథమును శివతత్త్వసారమును దెనుఁగుననే రచియించెను. పాల్కురికి సోమనాథుఁడు కూడఁ దానుగ్రొత్తగా వెలయించిన బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, చతుర్వేదసారము మొదలగు గ్రంథములను దెనుఁగుననే రచియించెను. వీరు సంస్కృతమునఁ గూడ గొప్పవిద్వాంసులే. బసవపురాణమును, బండితారాధ్య చరిత్రమును సోమనాథుఁడు తెనుఁగుననే రచింయింపఁగాఁ దర్వాతి వారు వానిని గర్ణాటమునకును, సంస్కృతమునకును బరివర్తించుకొనిరి. బసవపురాణ పండితారాధ్య చరిత్రాది గ్రంథములను శైవులు భారత రామాయణాదులవలెఁ బవిత్ర గ్రంథములుగాఁ బూజించుచుందురు. ఇది తెనుఁగున కొక గొప్పగౌరవము. తన గ్రంథములు సర్వ సామాన్యములుగా నుండవలె ననియు, నట్లుండుటకుఁ దెనుఁగు ద్విపదమే తగినదనియు, గద్య పద్యాది పూరితమయిన సంస్కృత ప్రాయరచన సర్వసామాన్యము కాదనియు సోమనాథుఁడు చెప్పినాడు.

"తప్పకుండఁగ ద్విపదలు రచియింతు
నొప్పదు ద్విపద కావ్యోక్తినావలదు
అరూఢగద్య పద్యాది ప్రబంధ
పూరితసంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వ సామాన్యంబుగామి
జానుదెనుఁగు విశేషము ప్రసన్నతకు. —పండితారాధ్య చరితము

మఱియు:-

ఉరుతర గద్యపద్యోక్తులకంటె
సరసమై పరఁగిన జానుదెనుంగు
చర్చింపఁగా సర్వ సామాన్యమగుట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గూర్చెద ద్విపదలు కోర్కి చైవాఱ
దెలుఁగుమాట లనంగవలదు వేదముల
కొలఁదియ కాఁజూడుఁ డిలసెట్టలనిన— -బసవపురాణము
తెలుగు మాటలుగదాయని తేలఁదలఁపవలదు. వేదములవలెఁ జూడుఁ డని చెప్పినాడు.

జాను దెనుఁగు

మఱియుజాను దెనుఁగు మిక్కలిప్రసన్నమయిన దనియు, సర్వసామాన్యమయిన దనియుఁ జెప్పినాఁడు. నన్నిచోడఁడు కూడ నీ జాను దెనుఁగును బ్రశంసించినాఁడు.

చ॥ బలుపొడతోలు సీరయును పాపసరుల్ గిలుపారుకన్ను వె
న్నెలతల సేఁదు కుత్తుకయు నిండిన వేలుపుటేఱు వల్గుపూ
సలుగల తేనిలెంక వని జానుఁ దెనుంగున విన్నవించెదఁ
వలపుమదిఁ దలిర్ప బసవా! బసవా! వృషాధిపా!
—వృషాధిప శతకము.

చ॥ సరళము గాఁగ భావములు జానుదెనుంగున నింపు పెంపుతో—
—కుమారసంభవము

అకాలమున నీ జాను దెనుఁగు మిక్కలి ప్రసన్నమై సర్వసామాన్యమై యుండెను. తర్వాతి మన కవీశ్వరులు సంస్కృత ప్రాయమైన రచనను దెనుఁగున జొప్పించి జాను దెనుఁగును సన్న గిలఁజేసిరి. ఇటీవలఁ దెనుఁగు రచనలలో రుచ్యములయిన తెలుఁగు పలుకుబళ్ళు మిక్కలి తక్కువ కాఁ జొచ్చెను. పాల్కురికి సోమనాథుని గ్రంథములలోను, నన్నిచోడని కుమార సంభవములోను మనకిప్పుడర్థముకాని తెలుగు పలుకు లనేకములున్నవి. సంస్కృత ప్రాయమగు రచనకు మనమలవడుటయే దీనికిగారణము.

ఆంధ్రకవిత శివకవులమూలమున గొప్పయభ్యుదయముగాంచిన దన్నవాస్తవ విషయము వారి గ్రంథముల జాగ్రత్తగ చదివినప్పుడే మనకు వ్యక్తముకాఁగలదు.

[భారతి: 1924
రుధిరోద్గారి-పుష్యము
సం.1 సంచి 1
మీగడ తఱకలు 1951]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నన్నిచోడుఁడు

ఉ. దేసి తెలుంగుఁ బల్కులను దీరిచి దిద్ది ప్రబంధశయ్యఁ గై
సేసెఁ గుమారసంభవము శ్రీ గురునింగ్రుతినాథుఁ జేసి పే
ర్వాసి నెసంగె నట్టి కవిరాజు శిఖామణి నన్నిచోడుఁడన్
కైనరుఁ డాంధ్ర భూమిఁ గలకాలము సంస్మరణీయుడేకదా !

బ్రహ్మశ్రీ నడుకుదిటి వీరరాజు పంతులుగారు "నన్నిచోడ కవిరాజు శిఖామణి కాలనిర్ణయ విమర్శ" అను పేరితో శారదా పత్రికలోఁ గడచిన వత్సరమునఁ బ్రకటించిన వ్యాసమును (దానిని బుస్తకముగాఁ గూడ వేర్ప ఱిచి వీరరాజు పంతులుగారు నాకును బంపిరి) దానిపై మొన్నటి సాహిత్య పరిషత్పత్రికలో బ్ర॥ రామయ్య పంతులుగారును వీరరాజు పంతులుగారును వేర్వేరుగా మరల వ్రాసిన వ్యాసములును జూచితిని. నాలుగు సంవత్సరముల నుండి నన్నిచోడ కవి కాలమును గూర్చియు గవితను గూర్చియు నాకుఁ దోఁచిన క్రొత్త విషయములఁ గొన్నింటిఁ బ్రకటింప నేనును గుతూహల బడుచుంటిని. ఈ విషయమును గ్రంథము ప్రకటించిన బ్ర॥ రామకృష్ణ కవి గారు గూడ నెఱుఁగుదురు. వీరరాజుగారి పంతులుగారి తొలి వ్యాసమును జూచిన పిదప నా కుతూహలము మెండయ్యెను. ఇట్లుండగా రామయ్య పంతులుగారిపుడు నన్నిచోడ కవి, కాల నిర్ణయమును గూర్చి యొకశాసన మును పరిషత్పత్రిక వ్యాసమున బ్రకటించినారు. ఆ శాసనమునే ప్రధాన ముగా నన్నిచోడ కవి కాలనిర్ణయమునకై నేనుం బ్రకటింపఁ జూచుచుంటిని. నేను బ్రకటింప నుద్దేశించి యుండుట రామయ్యగారుగాని, వారు బ్రక టింప బూనియుండుట నేను గాని తొలుత నెఱుఁగము ఆ శాసనము గూర్చి పలుదడవలు శ్రీ రామకృష్ణకవిగారును నేనును జర్చించుకొని యుంటిమి. కవిగారు కుమార సంభవము ద్వితీయ భాగము పీఠికలో దానిని స్మరించియు నుండిరి. ఈ నడుమ రామయ్య పంతులుగారు మద్రాసు వచ్చినపుడీ శాసన మును దాము ప్రకటించుచున్నట్టు నాతోఁ జెప్పిరి. వారు నిర్ణయించిన కాలమే నేనను, కొన్నదియగుటచే వారి సిద్ధాంతమునకు నా సిద్ధాంతమునకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నంతగా భేదముండదు. కాని శాసన సమన్వయమున నేను వారితోఁ గొంత వేర్పడుచున్నాఁడను. ఇక వీరరాజు పంతులుగారి వాదమునకు నేను బ్రతికూలుఁడనుగానే యున్నాఁడను ప్రధానము నిందులకే యిప్పుడు నేనీ వ్యాసమునముగా నిందులకే యిప్పుడు నేనీవ్యాము వ్రాయనుద్యోగింపవలసిను వీరరాజు పంతులుగారి వాదమునెడ నాకు గల ప్రాతికూల్యమును ముందు దెలిపి పిదప శాసన సమన్వయమునెడ రామయ్యపంతులుగారితో నాకుఁ గల వేర్పాటును వివరింతును.

వీరరాజు పంతులుగారు తమ తొలి వ్యాసమున నన్నిచోడఁడు నన్నియకుఁ దర్వాతి వాఁడని వ్రాసిన వారి వాదములను గొన్నింటిని జక్కఁగానే ఖండించిరి. కాని యాతఁడు నన్నియకంటెఁ బ్రాచీనుఁడని సమర్థించుటకుఁ గాఁ దాము ఖండించిన వాదములకంటె దుర్బలములైన వాదములను గొన్నింటినందుఁ గొని తెచ్చినారు. వారిట్లు వ్రాయుచున్నారు:-

"ఒక కవి కాలమును నిశ్చయించుటకు నిరాక్షేపములైన శాసనాది దృష్టాంతము వెల్వియు లభింపనినాఁడు అతని కవిత్వమును బట్టి యతని కాలమును నిర్ణయింపవలసి యుండుననుట చారిత్రవేత్తలకు నూత్న విషయముగాదు. ఇప్పుడద్దాని బట్టి యాతఁడెప్పటి వాడై యుండునో కనుఁగొందము". అని యాతనికాలము నిర్ణయించుటకుఁ బండ్రెండు సాధనములఁ జూపిరి. అవి యేవో యొక్కటొక్కటిగా ముందు జూపుచు దానిపై నాయాక్షేపము లెఱింగింతును.

1. కవిగారు, వీరభద్రరావుగారు నందలి కవిత్వము మిక్కిలి ప్రాచీనమని తోఁచుననుట.

ప్రాచీనము కాదని యెవ్వరుననుటలేదు. నన్నియ కింకను బ్రాచీనమనుట కాధారము లేదని పలువురమనుచున్నాము.

2. కుమార సంభవ గ్రంథారంభమున మూర్తిత్రయ, భాస్కర, గజానన, షణ్ముఖ, మార గౌరీ సరస్వతి స్తోత్రములు వేర్వేరు పద్యములఁ గావింపబడినవి. ఆంధ్రభారతము మొరట శ్లోకరూపమున నున్న త్రిమూర్తి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్తుతి రాజనరేంద్రున కన్వయించున ట్లొనర్చిన నన్నియభట్టు చిరకాలము నుండి పరంపరగా వచ్చుచున్న యీ పూర్వస్తోత్ర పద్ధతిని విడిచి పెట్టలేక దానిని సంగ్రహించి యవతారిక నడుమ-

"హరిహరాజ గజాననార్క షడాస్యమార సరస్వతీ గిరి సుతాదిక దేవతాతతికి న్నమస్కృతిఁజేసి ..."

అని సగము పద్యములో నందఱి దేవతలను జేర్చివారి కందఱకు నొకటే నమస్కారము గావించినట్లును, పిమ్మట నది క్రమక్రమముగా మాఱిపోయినట్లును గాననయ్యెడి"

ఇది బలాత్కల్పితమయ్యును బొందకున్నది. నన్నిచోడని స్తోత్రరీతిని నన్నియ యనుకరించె ననుటకై నన్నియ పద్యమునే వీరరాజు పంతులుగారు మార్చుటకు సాహసించినారు. "హరిహరాజ గజాననార్క షడాస్యమాతృ సరస్వతీ" యని నన్నియ రచనముండగా (వీరరాజుపంతులుగారును 'మార' అని పాఠము వ్రాఁత ప్రతులలోఁ జూడలే దనుచునేయున్నారు. ఇందులకై పనిఁబూని నేనును వెదకితిని. సర్వత్ర "మాతృ" అనియేకలదు. అయినను) "షడాస్యమార సరస్వతీ" యని మార్చిరి. ఇట్లు మార్పు జరిపినను వారి యభీష్టము నెఱవేఱకపోఁగాఁ బ్రతికూల సిద్ధాంతమే పైపెచ్చు వచ్చుచున్నది.

ఎట్లనగా :-

నన్నియ పద్యమున 'మార' పాఠము నంగీకరించేనను ఒకరినింకొక రనుకరించిరనుట నంగీకరించినను ప్రాచీనుఁడైన నన్నియ "హరిరాజ గజాననే" త్యాదివిధమున దేవతలనందఱను నొక్క పద్యమున స్తుతింపగా దాని జూచి కుమారసంభవకథను బ్రపంచించి ప్రబంధశయ్యతో రచించుచున్న నన్నిచోడఁడు ఒక్కొక్కరి ఒక్కొక్కపద్యము చొప్పునఁ బెంచి స్తుతి నెఱపినాడనుట సంగతమైయుండునుగాని వీరరాజుపంతులుగారు చెప్పినట్లనుట సంగతముగాదు. నాతలపేమనగా :- 'మార' పాఠము సరిగాదు. ఒకరి నింకొకరనుకరించిరని కూడ నిర్ణయింపగాదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చోడకవి తన కావ్యము షట్త్రింశదలంకారాలంకృతం బనుట- "పదివశతాబ్దివాఁడైన దండివకు నీయలంకారముల సంఖ్య నిలిచియుండి తరువాతఁ గ్రమముగాఁ బెరుఁగుఁచూ, పంద్రెండవ శతాబ్దివాఁడైన మమ్మటుని నాఁటికఱువది దాఁక వృద్ధియైనట్లుగానబడుచున్నది. కావున నిదియు నాతాఁడు పూర్వుఁడనుటకుఁ గొంత తోడుపడుచన్నది."

దండి పదియవ శతాబ్దివాఁడుగాడు. బదియవ శతాబ్దికింకను బూర్వమే యలంకారముల షట్త్రింశత్త్వము పెరిగినది. నన్నిచోడఁ డొక ప్రాచీనాలంకారికుని మతమునుబట్టి యట్టు చెప్పినాఁడనఁదగునుగాని యలంకారముల సంఖ్య షట్త్రింశత్తుగానుండిన కాలముననే యాతఁడున్నాఁడని తలంపరాదు. అట్లయిన నాకాలమింకను బూర్వమునకుఁబోయి నన్నిచోడని గందరగోళమునఁ జేర్చును.

4. "అట్లువోలె, పగిదివోలె, కీరణివోలె, మాడ్కివోలె భంగివోలె ఇత్యాది (పురాతన) ప్రయోగము తిక్కవి గ్రంథమున "అట్లవోలె" అనున దొక్కటియు, తిక్కన దానియందు "ఇట్లువోలె" అనునదియు గానబడు చున్నది. నన్నియనాఁటినుండియే వీనికిఁ బ్రచారము విరళమైనట్లు తోచెడిని. పాల్కురికి సోమన మాత్రము శివభక్తుఁడగు నీతనయడలఁ గల భక్తిగౌరవాదులచే "కరణియుతిబోలె" "భంగియుబోలె" నిత్యాదిగనచ్చట చ్చటఁ బ్రయోగించెను."

ఈవాదమెంతో వింతగానున్నది. పయిప్రయోగములు నన్నియ, తిక్కన కృతులలోఁగూడఁజూచితిని వీరరాజుపంతులుగారు వ్రాయుచున్నారు. నేనిటీవల నితరకృతులలోఁగూడఁ జూచితిని. ఇట్లుండగా నిదిపురాతనమని కుండలీకరించి పంతులుగారు వ్రాయుట వింత. మఱియు దీని ప్రచారము నన్నియ నాటినుండియే విరళమైన్నదని వ్రాసిరి!! అంతకు బూర్వము బహుళగా నుండుటను వీరెఱిగిరా ? ఎట్లు ? సోమనమాత్రము నన్నిచోడని మీది గౌరవముచే నా ప్రయోగములను చాటించెననుట మఱియు వింత! సోమన నన్నిచోడనికంటె నర్వాచీనుడని వీరెట్లు నిరూపింపగల్గిరి ? పంద్రెండవ శతాబ్దిలోనివాడు సోమన బహుళముగా నీ ప్రయోగమును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాటింపగా నిది నన్నియకు బూర్వపుదనియు నన్నియ నాఁటికిది విరళమయిన దనియు నసుట సంగతమా ? నాతలంపేమనగా :- శివకవులు దీనిని బహుళముగాఁ బ్రయోగించిరి. ఇతరుల కృతులలోఁ గ్వాచిత్కముగానున్నవి.

5. "ఇక్కవిగ్రంథమున సంస్కృతాంధ్ర కర్ణాటాది వివిధ భాషావి మిశ్రములైన సమాసములు గానవచ్చుచున్నవి. ఇవి యాతని ప్రాచీనతను జాటుచున్నవి."

అని కొన్ని ప్రయోగములను వీరరాజుపంతులుగారు చూపిరి. అవి ప్రాచీనతను జాటుచుండెననుట సంగతమే కాని నన్నియ కంటెను బ్రాచీన తను జాటుచున్నవనఁగాదు. ఉపక్రమమున పంతులుగారిట్లు సామాన్యముగాఁ ప్రాచీనతను జాటుచున్నవన్నను మీద నన్నియ కంటెఁ బ్రాచీనత జాటుచున్నట్లే నిర్వహింపఁ బూనినారు. ఇక్కడ వీరు చూపిన పదములలో "విగుర్వణము కర్ణాట భాషా సంబంధి యగుపదము" అని కలదు. దీనిని గూర్చి శ్రీసాంబ మూర్తి శాస్త్రిలగారు, కవిరాజు నీలాద్రిరాజుగారు నిదివఱకుఁ గొంతచర్చ నెఱపినారు. వారితో పాటు నేనును దీని సంస్కృత భాషా సంబంధియగు పదమునుగాఁ దలఁచుచున్నాఁడను. పాల్కురికి సోమనాథుని రచనలోను క్రీ - పంద్రెండవ శతాబ్దిలోని దగు గుంటూరి జిల్లా శాసనము సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్సు వాల్యుం IV నెం 672 పు. 205 శక 1061 లోను గూడ నీపదము కలదు. దీని విషయమింకొకప్పుడెత్తుకొందును. వీరిప్పుడు చూపిన ప్రయోగముల వంటి ప్రయోగములు పాల్కురికి సోమ నాథుని గ్రంథములోఁ గుప్పతెప్పలుగా నున్నవి.' ఇట్టివి శివకవులచే బహుళ ముగాఁ బ్రయోగింపఁ బడుచు వచ్చినవి. ఈ విషయము విపులముగా వేఱొక ప్పుడు దెలుపనున్నాఁడను. వీనిఁ బట్టి చోడఁడు నన్నియకంటెఁ బ్రాచీను డని సాధింపగాదు.

---

* దీనిని గూర్చి శాసనవిశేషములు అను పుస్తకములో నేనిట్లు వ్రాసితిని-- నెం 672 పు 205 శక 1061

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

6. ఉ. వీఁగు నపారసత్త్వగుణ విస్ఫురణం బరమేశ్వరోరువా
మాంగమునందు మున్నుదయమై నియమస్థితిఁగొల్చి....
........కుమార ప్ర. 4

క॥ వీఁడేమి సేయుఁబంచిన, వాడుండఁగ నిక్కమునకు వధ్యుఁడుగానా
ఖండలుడు గాక యేలిన, వాడు............ ద్విభా. 520

ఈ పూర్ణా పూర్ణ బిందు ప్రాసమును నన్నియాదు లెవ్వరును గూర్చి యుండలేదు. నాచనసోముఁ డిట్టి ప్రాసమును గూర్చెనని సంపాదకులు

ఉ. హారతుషారశంఖ విమలాభ్ర మహోజ్వల కీర్తిఁజాలచాలిఁ
ల్వారిన బుద్ధమండలికు నగ్రసుతుండగు మన్మమండఁడా
చార పరుండు నాదెం డ్లఁ (?) జారుతరంబగు వెండికొండనా
గౌరి శశాంక మౌళికి విగుర్వనతో గుడినిల్పె భక్తునన్."

ఉ. మేరు గుణావతారుఁ డగు మేడ అనికింగలు హారగంధిం
భోరుహనేత్రి అవ్వయ విభూషణి నాఁదగు మేడ మాంబకున్
గారవలీలఁ బుట్టి గుణ గౌరవ సంపద విస్తరిల్లి గాం
ధారికి సీతకున్ శచికిఁ దానధికం బని ప్రస్తుతింపగాన్".

ఇందు మొదటి పద్యము నాల్గవ చరణమున శాసనాక్షరములఁ జదివిన వారు తప్పుగాఁ జదివి యుందు రనుకొనెదను. గౌరియను చోట "గ్ౌరి" యుండును. "విగుర్వనతో" అను చోట "విగుర్వణతో" అని యుండెనేమో? "భక్తునన్" అని యుండునా? "విగుర్వణ" అనియే యగునేని, నన్నయ, నన్నిచోడఁడు, పాల్కురికి సోమనాథుడు ప్రయోగించిన పదమిది. రెండవ పద్యములో 'కలుహార గంధి' యని కలదు, 'కల్హార' పదము సంస్కృత భాషలోఁ బ్రఖ్యాతముగా నున్నది. 'కహ్లార' మని కొందరందురు. కలహారమని గాని కలుహారమని గాని సంస్కృత భాషలో గానరాదు తెలుగునను గానరాదు గాని నన్నిచోడదొక్కడుఁ మాత్రము కుమార సంభవమున "జలజాత కైరవోత్పల కలహారాది గంధంబు లోలి సద్గంధములుగా" అని కలహార పదము ప్రయోగించెను. ఇందు కలుహార పదమున్నది. నన్నిచోడఁడు గూడ 'కలుహారగంధి' యనియే వచించి యుండవచ్చును. మఱియు "అంభోరుహనేత్రి" యని కలదు. నేత్రాంతముకంటె జీషును పలువురు తెనుగు కవులు పాటించిరి. నన్నిచోడఁడును 'నేత్రి' యనెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్రాసి యున్నారు. గాని యది సెల్లదు. దీనిం గూర్చి బరిషత్పత్రికలోఁ బ్రకటింపఁబడు "సోముని హరివంశము అను శీర్షిక గల విమర్శ గ్రంథమున విస్తరించి చర్చించి యున్నాను. కావున, నిచ్చట మరలఁ జర్చింపక విడిచితిని. రామకృష్ణ కవిగారు భీమకవి ప్రయోగమును గూడ నిచ్చిరి. భీమనకాలమిప్పటికి దేలలేదు. అతడెప్పటి వాడైనను శివభక్తుడే కావున పాల్కురికి సోమనాథుని వలెనే యాతఁడును శైవుఁడైన చోడకవి వ్రాఁత యందుఁ గల ప్రమాణ బుద్ధిచే నీప్రాసము నంగీకరించి ఇట్లు వ్రాసి యుండును."

దీనిం గూర్చి చెప్పవలసినది చాలఁగలదు. సంక్షిప్తముగా నించుక మాత్రమే యిక్కడ చెప్పచున్నాడను. పాల్కురికి సోమనాథుని కృతిలో నిట్టి ప్రాసము గలదని "శివకవులు అను వ్యాసములోనే నిదివఱకుఁ జూపి యున్నాడను. శివకవుల సంప్రదాయములో నిట్టివి సాధువులని నాయుద్దేశము. నన్నియకిది సమ్మతము గాదు. ఇట్టి పనుల చేతనే నన్నియ వాగనుశాసనుఁడై యుండునని నా తలంపు. నన్నియ భారతమున నీ ప్రాసములు కానరాకున్నను నాతని సమకాలముననే రాజరాజు చనిపోయిన పిదప రెండు మూఁడేండ్లకే (శక 987) చెక్కింపబడిన పద్యశాసనములో నీప్రాసము గానవచ్చుచున్నది. నన్నియ నాఁటికా సంప్రదాయ ముత్పన్నముగా లేదు.

ఇది చూచునది.

"నిజభుజప్రధాని బెజయితదేవని కూఁతుసరియె పోల్పఁగాంతలెందు"

ఈ ప్రాసము నన్నిచోడని ప్రాసము వంటిదే కదా! నన్నియ త్రోవ నంగీకరింపక శివకవులు పూర్ణార్ధాను స్వారప్రాసమును బాటించిరి. దీనిచే నన్నిచోడఁడు నన్నియకంటెఁ బ్రాచీనుఁ డనుట సాధితముగాదు, నన్నియకు సమకాలమునను, దర్వాతి కాలముననుగూడఁబ్రాసమున వచ్చుచున్నది గదా!

7. అథర్వణాచార్యుఁడు నన్నియభట్టునకుఁ బూర్వుఁడని కొందఱు ను వ్రాసియున్నారు. ఈతఁడు తన ఛందమున—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. మగణమ్ముగదియ రగణము, వగవక కృతిమొదట
నిలుపువానికి మరణం
బగునిక్కమంద్రు మడియఁడె, యగుననియిడి "తొల్లి
బెంకణాదిత్యుఁడనిన్.

అని వ్రాసినాడని మా రామకృష్ణకవిగారు కుమారసంభవ గ్రంథ పీఠిక యందుదహరించినారు. వీరేశలింగము పంతులుగారు నయితము కవి చరిత్రమునఁ బైపద్య మథర్వణుఁడు వ్రాసెనని వ్రాసియున్నారు. పైపద్య మున "తొల్లి" అనుపదము గాననగుచున్నది. ఇది కొన్నివందల యేండ్లకు ముందున్న కాలమును దెలుపు పదముగా మనవారు ప్రయోగింతురు.

క. నరసుతుఁడు తొల్లినలుఁడను, ధరణీశుడు-నన్నియ
(ఇది యుగములనాటి కాలమును దెలుపుపదము)

గీ. తొల్లినాలాయనియనంగ దొరయు సింద్ర। సేనపాం
చాలి-- (ఇదియు నించుమించుగ నట్టిదే).

ఇవ్వడువునఁ బ్రాచీన చారిత్రములఁ దెలుపు నీ' తొల్లి' అనుపదము ప్రయోగించిన యథర్వణుడు తిక్కనకు సమకాలికుఁడనుకొనకున్నను బెంక ణాదిత్య (నన్నిచోడ) కవియథర్వణునకు నాలుగైదువందల యేండ్లకుఁ బూర్వుఁడనైన నుండకుండ నాతఁడాపదమును బ్రయోగించిఁడనియు, కావు ననే చోడకవి నన్నియకు మిక్కిలియుఁ బూర్వుఁడై యుండుననియుఁదలంపఁ దగును."

ఇందసందర్భము లనేకములున్నవి. భీమకవికాలమెట్లు తేలలేదో యథర్వణునికాలమునట్లే తేలలేదు. అథర్వణకారికలను త్రిలింగ శబ్దానుశాసన మును జూడగా నాతడు ప్రాచీనుఁడుగాఁ దోపకున్నాడు. అనిశ్చితమైనయాతని విషయము నాధారముగాఁ గొనుటయు క్తముగాదు. మఱియు రామకృష్ణ కవి గారుదహరించిన పైపద్యము నేనెఱిఁగినంతవఱకు లక్షణ గ్రంథములలో నెక్కడను గానరాలేదు. నేను దీనిఁగూర్చి శ్రీకవిగారిని బలుదడవలడిగితిని. తమ దగ్గఱ నథర్వణచ్ఛందస్సు కలదనియు దానినుండి యీ పద్యమును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దాహరించితిమనియు వారనిరి. ఆగ్రంథము వెల్వడిన తర్వాత నాయథర్వ ణుని గూర్చి విశేషము తెలియఁగఁగలమేమో కాని యిప్పుడేమియు నిర్ణయింపఁ జాలము. కం. వీ గారుకవిగారి పేరు చెప్పకుండ దానినుదాహరించిరి; కాని వారు వేఱొకచోట దానిఁజూచి యెఱుగరు. ఆపద్యమథర్వణుని కృతిలో గానవచ్చినను నందుగల "తొల్లి" యుగములనాఁటి ప్రాచీనకాలమును దెలుపునదిగాదు. వీరరాజుపంతులుగా రాపదము యుగములనాఁటి కాలమును దెలుపునది యని వ్రాసియుఁ దదనుగుణముగాఁ బ్రయోగములఁ జూపియు నన్నిచోఁడనియెడఁ గొన్ని వందల యేండ్ల ప్రాచీనతకే తృప్తి చెందినారు. "తొల్లి" పదము భూతకాలసామాన్యమును దెలుపునదే కాని, యుగముల నాఁటియో వందలనాఁటియో భూతకాలమును మాత్రమే తెలుపునదిగాదు. "వెండియుఁ, దొల్లిటి, యిప్పటి" ఇత్యాదులు పెక్కులు ప్రయోగములు 'తొల్లిటి' భూతకాల సామాన్యవాచిత్వమును తెలుపునవి కలవు. నన్నియనాటి శాసనపద్యమిది చదువఁదగును.

సీ॥ శ్రీవిష్ణువర్ధన బూవిభుదయఁ భూమిదేవిబోల్ రేవలదేవికనిన
సోమలదేవి గుణారామ జగదేకసున్దరి మత్తేభ మందగమన
దొల్లి భీమేశ్వరవల్లభునకు సితమణి [బన్ధమి]
చ్చె నన్మణియుతముగ
నురు విచ్చె గంగనాం బరువడి వినివారిం బురుడిం
[చున] ట్ల [యీ] నరసిజాస్య
గనక రచితరుచిర కల్పావనీరుహ, కుసుమమిచ్చెఁరనకు
ననము వెరుగ
వెణ్డిమణ్డతోనఖణ్డిత ద్యుతిదీప, మమరనిచ్చె విమలకమలనేత్రి.

ఇందు 'తొల్లి' యుగములనాఁటి యొండె వందలనాటి యొండెఁ బ్రాచీనకాలమును దెలుపునదిగాదు. పూర్వకాలమును మాత్రమే(ఈ పూర్వత ఎంతయెక్కువైనను నలువది యేబది యేండ్ల కంటెమించదు కొన్నిమాన ములయినను గావచ్చును) దెలుపుచున్నది. ఏవిధమునను బయి పద్యము వీరరాజుపంతులుగారి వాదమునకుఁ దోడ్పడఁ జాలకున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

8. "నిరుబుతి వారిమాయల కనిం[బతిమాయలొానర్చి" ఇందు నిర్‌బుతి అనుపదము నాలుగు లఘు వర్ణములుగాఁగవి [ప్రయోగించినాడు. ఇదివేదోచ్చారణమునననుసరించి కాళిదాసుఁడు త్రియంబకం అని ప్రయోగించినట్లే మనకవీంద్రుఁడును బ్రయోగించెనని తోఁచుచున్నది. "ఇది యాతనిపురాతనత్వమును ఘోషించుచున్నది.

అని పంతులుగారు వ్రాసిరి. కాని యందేమరల వారు వ్రాతప్రతి యందు నిర్ృతి అని యున్నది. ఇట్లున్నను నిబురుతియను నుచ్చారణమునే కవి గ్రహించి యుండునని తోఁచెడి. నిర్ృతియు అని యుండ గూడదా యని కొందఱందురు. కాని నన్నియ నన్నిచోడుల "యు" వర్ణప్రయోగములు సామాన్యములు గావు అని వ్రాసిరి. నన్నిచోడఁడు నిబురుతి అని ప్రయోగించిననది నన్నియకంటె నాతఁడు ప్రాచీనుడని తెలుప జాలదు. అది యాతడు వైదిక రూపమును గ్రహించెనని మాత్రమెఱిఁగించును. ఇంతకును మనకుఁప్రమాణమైనవ్రాఁత ప్రతిలో నిర్ృతి అని యేయుండఁగా వీరరాజు పంతులు గారు 'నిబురుతి' అను కల్పిత పాఠమును గైకొనుటయు నదియే కవి ప్రయుక్తమైయుండుననుటయు సంగతముగా నాకుదోపకున్నది. నిర్ృతియు అనుటయే సముచితము. పూర్వపద్యము చూడదగును.

క॥ అయిరువురు బహురాక్షస, మాయావిదులగు
డెఱింగి మార్కొనుమనిర
మ్మాయనుచుఁబంచె నిరు (ర్ృ?) తిను, పాయజ్ఞన
నేకసమర పరిణతునజితున్.

చ॥ నిర్ృతి (యు?) వారి మాయల కనిం[బతిమాయలొానర్చి.......

వ॥ అంత నారణి దుర్వారులు నిరు (ర్ృ?)తితో.... ...

ఇక్కడ ముందు వెనుకల నిర్ృతి పదమే ప్రయుక్తమైనది. నడుమనున్నది గూడనట్టిదే యగుననుట సమంజసము. నిర్ృతియు, అనుట యర్థానుగుణము. తత్కాలరచనానుగుణమును. 'నిర్ృతివారి మాయల' యని వ్రాఁతలోనుండఁగా నక్షరలోపము (యు?) అని యొక యక్షరము చేర్చి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నంతనే చక్కఁగా సరిపడుచుండఁగా దానినిఁ విడిచి నిర్రులి'ని 'నిబురుతి' యని యెక్కువ మార్పుచేయుట యుక్తముగాదు. ఆ పదము జతకూర్చినను నది భాషలోనప్రతీతమైనది. ఇట్టివానిచే నన్నిచోడఁడు నన్నియకంటె ప్రాచీనుఁడని సాధించుట సాహసము.

9. నన్నిచోడఁ డెడ్డియే నొక విషయమును వర్ణించి వర్ణించి "అని యనేక ప్రకారంబుల వర్ణింపఁ దగిన వర్ణనలకెక్కి" అని యనేక ప్రకారంబుల——నమరి" ఇత్యాదిగ వ్రాయుచుండును. ఇవ్వచనముల ఫక్కిఁ జూడ, పురాతన యక్షగానాదుల యందుఁబోలె దీనియందును ప్రాచీనత గోచరించుచున్నది."

ఇట్టి రచన పాల్కురికి సోమనాథుని కృతులలోఁ బెక్కుచోట్ల నున్నది. నన్నియకును బురాతనములైన యక్షగానములు గాన వచ్చినవా? మున్నూటేండ్లకుఁ బూర్వమునఁ దెనుఁగున యక్షగానము లేవిగలవో నేనెఱుంగఁ జాలకున్నాను!

10. సంఖ్యగలది బహుకవి సాధారణమగుటచే దానిఁగూర్చి చర్చ యనావశ్యకము.

11. సీ॥ కాలంబుగూడ జగంబు లేర్చుట యెంత యలవని హోరులోచ
నాగ్ని "నుఱడు"
వనరాశిఁదగు మెత్తదన మెర్గియేచుడే బలమని బాడ బానలము
"దెగడు"
మార్వెట్టనోపని మ్రాఁకు లేర్చుటయెంత వాంగునని వనవహ్ని
"నవ్వు"
గలితనం చెఱుఁగని కులగిరు లేర్చుడే వాఁడిమి యనిపనివలని
"బలుకు"
నెలమిఁ గోమలమగు తోవలేర్చుడెంత, తనదు తోమత్యవది
ఠీమె దాము "నెత్తు"
దనకుఁ బ్రతిలేక దిక్కులు దాఁకి వెలుగుఁ, దారకాసుర ఘోర
ప్రతాపవహ్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందు మొదటి పాదములోని 'ఉఱడు' అనునది తక్కిన పాదముల లోని తెగడు, నవ్వు మొదలగు వానివలెఁ గేవలధాతు రూపము. పద్యమునఁ గర్త ప్రతాపవహ్ని. నన్నియభట్టు "ఉఱఁడు (డు?) సురేంద్రుఁడైన బలి యుండు హిడింబుఁడు వాని ఘాతికిఁ, వెఱవని వారలుంగలరె-" అని ప్రయోగించినాడు. కాని యతఁడే నన్నిచోడని యితరములగు 'ఉఱరు ఉఱక ఇత్యాది రూపములం బట్టి దీనిని సయితము 'ఉఱు' ధాతు వ్యతిరే కార్థముగా గ్రహించెనో లేక ప్రత్యేక ధాతువుగానే ప్రయోగించెనో, నిర్ణ యింపరాని సందిగ్ధ స్థలమున దీనిని బెట్టినాఁడు. ఎట్లయిననేమి? తరువాతి కవులు దీనిని 'ఉఱడు' అని కేవలధాతువుగాఁ బ్రయోగింపమి నీధాతువు మన నన్నిచోడ కవి నుండి నన్నియ కడకు సందిగ్ధ రూపముతో వచ్చి పిమ్మట ముచ్చుముడిగెనని తోచుచున్నది.

పై ఉఱడు శబ్దము వలెనే నన్నిచోడని వలన నుండి నన్నియచే వేఱు విధముగ గ్రహింపఁబడినట్లు దోపించు విచిత్ర ప్రయోగము నింకొక దానిని మాత్ర మిచ్చుట నిచ్చెదను.

కాంచుడరుదయ్యెఁ = కాంచుట + అరుదయ్యె ఇచ్చుడాజి = ఇచ్చుట + ఆజి, ఒదవుడిదేమి = ఒదవుట + ఇదేమి"

ఉఱడును గూర్చి పంతులుగారు వ్రాసినది సంగతముగాదు. నన్నియ నన్నిచోడనిఁ జూచి సందిగ్ధముగాఁ బ్రయోగించెనను పంతులుగారి మాటలు దలక్రిందుచేసి నన్నిచోడఁడే నన్నియను జూచి ప్రయోగించెనని యింకొకఁడు ననవచ్చును. అట్లుగా దనుట కేమియాధారము వారు చూప గలరు? ఆ పదమప్పటి వాఙ్మయమున సాధారణముగా నుండుటచే నా యా కవులట్లట్లు ప్రయోగించిరనుట బాగు నన్నిచోడని నాఁట స్పష్టముగా నున్న పదము నన్నియ నాఁటికి సందిగ్ధ రూపముతో వచ్చిన దనుట సాహసము. అది ఉఱుధాతువేయని నన్నియ నన్నిచోడాదుల ప్రయోగములు, ఉఱడు, ఉఱరు, ఉఱక, ఇత్యాదు లెఱిఁగించుచున్నవి. పంతులుగారుదహరించిన పద్యమున ఉఱ (?)డు కూడ వ్యతరేక ధాతు రూపమయి యుండునని నా తలంపు. "ఉఱడు" అని కేవల ధాతురూపముండె ననుటకు దానిమీఁద నిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రూపము లెక్కడను గానరాకున్నవి. ఉఱడక, ఉఱడిన, ఇత్యాదులు గాన రావుగదా ! కుమార సంభవముద్రిత ప్రతిలో "లోచనాగ్ని నుఱడు" అని సోర్ధాను స్వారముగానే యున్నది. పంతులుగారు నిరనుస్వారముగా నుదహరించినారు.

ఇక - కాంచుడరుదయ్యె - నిత్యాది రూపములఁ గూర్చి పంతులు గారు సాహసపు సిద్ధాంతముల నెలకొల్పఁబూనినారు. భావార్థకపుటకు బదులుడు పెక్కుచోట్లఁ గానవచ్చుచున్నది. పెక్కులిప్పటికి నున్నవి. దూఁకుడు, అర్దుడు, ఇత్యాదులు నేటి వ్యవహారమునఁ గూడఁ గాననగును. డమురూపము గూడ క్వాచిత్కముగ నిట్లే కలదు. ఒత్తడము, అర్దడము మొదలగునవి. ప్రాచీన కవులలో డము, అసాధారణముగాను టడు సాధారణముగను గానవచ్చుచున్నవి. సందర్భానుగుణముగా నన్నియ నన్నిచోడ మంచన కేతన తిక్కనాదులాయా రూపములను బ్రయోగించిరి. "నన్నిచోడని గ్రంథమున భావార్థక టకారము తనకుఁ బరమైన యచ్చుతో సంబంధింపఁబడినపుడే యిట్టిడత్వముఁ జెందుచున్నట్లు గాన్పించుచున్నది. (గ్రంథమంతయుఁ జూడుఁడు) అని పంతులుగారు వ్రాసిరిగాని గ్రంథమంతయుఁ జూడఁగా బంతులుగారి వ్రాఁతకుఁ బ్రతికూలములగు ప్రయోగములు పెక్కులు గానవచ్చు చున్నవి. ఈ క్రింది వానిని జూడుఁడు.

పావకో, త్కరశిఖలం బురాంగ భవకాల హరంబగుటేమి పెద్ద
కుమా ప్ర.భా. 862 ప.

మఱచితొ కాలకాలు నజమ స్తక సంహరునిట్లు పల్కుటే, ప్ర 171 పద్యము

నిగ్రహంబు వడుటేమి పనియని - ప్ర 214 వచనము
నీ, వప్పరమేశు నేయుట నయంబు - ప్ర 554 పద్యము
రజ్జునె, ప్పుడునది- ద్వి- 516

అచ్చులో నిట్లున్నవి వ్రాఁతప్రతిలో నిట్లులేవని పంతులుగారు నిరూపింపగలరేమో ! వ్రాఁత ప్రతిలో వేఱు విధముగా నుండుటను వారు చూచి యున్నచోనది తెలిపి యుండవలయును గదా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాలంబుగూడ ఇత్యాది పద్యములో, అచ్చులో "యేచుటే బలమని - కులగిరులేర్చుటేవాఁడిమి" అని యుండఁగాఁ బంతులుగారు "యేచుడే బల మని" కులగిరు లేర్చుడే వాఁడిమి, యని మార్చి యుదాహరించినారు. మఱియు 'రజ్జు చెప్పఁడునది' యుండగా రజ్జు చెప్పడదియునని యుదా హరించిరి. వ్రాతప్రతిని బట్టియే వారట్టు మార్చిరేమో కదా! తెలుపరయిరి!

నన్నిచోడఁడొకవేళ హల్లు పరమైనపుడు చేయుడు, ఇత్యాది విధ ముల డుతో భావార్థకములఁ (బయోగింపకున్నను (పంతులుగారన్నట్లే లేఖక మహాశయులు మార్చివేయుటచేఁ గానరాకుండెనేమో) నది యాతని కస మ్మత మనుట హృద్యముగాదు. అట్లయినను నాతఁడు నన్నియ ప్రయోగ రీతిని గుర్తింపఁజాలక దానిని విడిచిపెట్టెనని పంతులుగారి వలెనే యింకొ కరు ననవచ్చును. అట్లు కాదనుటకు కాధారమేమి? నన్నియకంటె నన్ని చోడఁడు ప్రాచీనుఁడని నిరూపించుటకిట్టివితోడ్పడునా? ఇట్టి ప్రయోగములు తిక్కనకూడఁ బ్రయోగించెనని పంతులుగారు చూపుటచేనది యాతిక్క ననాఁటిదాఁక సాధారణమైయున్నదని యేర్పడుచుండెఁగదా! దీనినాధా రముగాఁ గొని నన్నిచోడఁడు సాధుప్రయోగ కర్తయని తద్రహస్యము గుర్తింప నేర్చినవాఁడు తిక్కనయని వారి నిర్వ్వరను సంభావించి యారహస్యమెఱుఁగఁ జాలమువోలె నన్నియ కుఁజెప్పి యాతని జిన్నవుచ్చుచు నిక్కడ పంతులుగారు వ్రాసిన వ్రాఁత హృద్యముగా నాకుఁదోఁపకున్నది.

మఱియుఁబంతులుగారు "నన్నియభట్టారకుని సంస్కారమునకుఁ దర్వాతఁ బైకవిత్వము వంటి కవిత్వమును జెప్పిన యాంధ్రకవి యొక్కఁ డును గానరాడు. కావున నితఁడు నన్నియకుఁదరువాతివాఁడై యుండఁడు" అని వ్రాసిరి. నన్నియకుఁబూర్వ మిట్టి కవితఁ జెప్పినవారు పెక్కురు గాన వచ్చిరా ? ఇది వింతగదా ? పాల్కురికి సోమనాథుఁడెప్పటివాఁడు ?-

12. వక్రము — "ఇది నన్నియకుఁబూర్వము వ్యవహారములోనున్న శబ్దమనియు, తత్పూర్వ శాసనములందు మాత్రమే కానవచ్చుచున్నదనియు శాసన పరిశోధకుల యభిప్రాయమైయున్నది. ఇప్పుడను మన ప్రాచీన కవిరాజు గ్రంథమునఁ గానవచ్చుచున్నది. శుక్రుండు "వక్రంబై" ఇప్పద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మీ యర్థమున నన్నియాదుల గ్రంథమునఁగానరాక మనరాజకవి, నన్నియ భట్టారకునకు మిక్కిలిఁ బూర్వుఁడై యుండెనని వేనోళ్ళఁ జాటి చెప్పుచున్నది."

పంతులుగారీక్రింది ప్రయోగమును స్మరింప గోరుచున్నాను' 'అకార్యము నిర్వక్రముగా నెఱవేఱెను.' అతఁ డవక్రముఁడు— ఇత్యాది విధములనేఁటి రచనలలోఁ గూడ వక్రపదము నన్నిచోడఁ డేయర్థమునఁ బ్రయోగించెనోయాయర్థమునసే ప్రయుక్తమగుచున్నది. వక్రంబు వచ్చు వారు, 'వక్రంబు వచ్చిన అనుపలుకుబడినేఁడు గానరాదుగాని వక్రమను పదము నేఁడు నున్నది. శాసనములలోని 'వక్రంబువచ్చు' మిక్కిలి ప్రాచీన మైనదే. దానిని నన్నిచోడఁడు ప్రయోగింపలేదు ఈపదము నన్నియకంటె. నన్నిచోడఁడు మిక్కిలి ప్రాచీనుఁడని వేయినోళ్ళఁ జాటుచున్న దనుట యచ్చెరువు గొల్పుచున్నది.

శ్రీనడుకుదుటి. వీరరాజు పంతులుగారు నన్నిచోడఁడు నన్నియకంటెఁ బ్రాచీనుఁడనుటకు వెలయించిన సాధనముల దౌర్బల్యమునులఘుతరముగా నిక్కడ వివరించితిని. శ్రీరామయ పంతులుగారిప్పుడు ప్రకటించిన శాసన విషయమునెత్తుకొనకయే యున్నను గూడ నేనిప్పుడు విమర్శించిన విధముగ వీరరాజు పంతులుగారు చూపిన యాధారములు నన్నిచోడని నన్నియకంటెఁ బ్రాచీనునిగా నిలువరింపనేరని వగుచున్నవని నా నమ్మకము, ఇఁక సహృదయులు ప్రమాణము.

ఇట్లయి యున్నను వీరరాజు పంతులుగారు రక్తాక్షి శ్రావణ-కార్తిక మాసముల పరిషత్పత్రికలో ప్రకటించిన వ్యాసమున నిట్లు వ్రాసినారు.

"భట్టారక మహాశయునికి బూర్వము తెనుఁగునఁ గవిత్వమే లేదని విశ్వసించియున్న యాంధ్రుల హృదయ క్షేత్రముల యందు 'అతనికి మున్ను తెనుఁగు కవిత గలదు' అను వాక్య బీజముల నావాపించుటయే మొదట దుర్ఘటమయ్యెను. ఎట్టకేలకుఁ బరిశోధనములు వెల్లివిరిసిన కొలఁది నవి నాటుకొన అతనికి బూర్వముద్గ్రంథములు లేవు గాని స్వల్పముగఁ బాటలు పద్యములునుండినవి' అనుభావాంకురములు క్రమముగాఁ దలసూపెను. ఇట్టిచో 'నన్నియకు మున్నుప్రబంధములుండెడివి' అను పలుకుఁదీవలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రేకెత్తుటకుఁ గాలచక్రమింకను దొరల వలయునేమో ------ నేఁటివఱకును నన్నిచోడకవికాలమును గూర్చి కావింపబడిన విమర్శనములయం దొక్కటియు నిర్బాధకమగు నొక్క యాధారములోనైనఁ గూడినదిగా నుండలేదనియు నాతఁడు నన్నియకుఁ బూర్వుఁడయి యే యుండుననియు నిరూపించుచునేనొక విమర్శమును వ్రాసితిని."

ఇక్కడ నన్నియభట్టారకునకుఁ బూర్వ మాంధ్రకవిత్వము లేదను కొనుచున్న సామాన్యలోకమును వీరరాజు పంతులుగారు గేలిగొనుచున్నారు. వాస్తవమునకిక్కడ నమాయికమగు లోకముగాదధిక్షేపింపఁదగినది! నన్నియకుఁ బూర్వ మాంధ్రకవితయున్నదనుట కాధారము లేమియు గోచరింపకున్నపుడు లోకమంతకు ముందాంధ్రకవితలేదేమోయనుకొనెను. యుద్ధమల్లునని శాసనము దొరకొన్నపిదపఁ బద్యరచనము కలదనుకొనెను. మఱికొన్నియాధారములచేఁ బాటలు పదములు మొదలయిన రచనలుండె ననుకొనెను, స్పష్టముగా బ్రాచీన గ్రంథములు దొరకెనేని యవియుఁగల వనుకొనును. ఇది యుక్తమేకదా! కాలచక్రమింకను దొరలఁగా బంతులుగారు మొదలగువారిప్పుడాంధ్రుల హృదయక్షేత్రములందు రేకెత్తింపఁ జూచుచున్న "నన్నియకుమున్ను ప్రబంధములుండెడివి" అను పలుకుఁ దీవలు ఐంద్రజాలి కవిభ్రమములై యంతరింపఁగలవేమోయని నేననుమానపడుచున్నాను. ఐంద్రజాలి కులందఱముందు బాటలో మావివిత్తునాటగలరు. మొలకెత్తిం పగలరు. చిగురెత్తింపగలరు. పూవులుఁ బిందెలును బుట్టింపగలరు. కాని మాయికమయిన యామావిమొక్క యెందాఁక నిలువఁగల్గును. చిత్తగించి నలువురుఁజూడబోయిన రిత్తయగునుగాదా!

క. మునుమార్గ కవిక లోకంబునవెలయఁగ
దేశికవితఁబుట్టించి తెనుం
గునిలిపి రంధ్ర విషయమునఁ, జనసత్యాశ్ర
యునిదొట్టి చాళుక్య నృపుల్.

అనుపద్యమను నింద్రజాలపుఁ గుంచె విసరుతో మొలకెత్తిన "నన్నియకుఁ బూర్వమంధ్ర ప్రబంధములున్నవి" అను భావాంకురమా కుంచె కూలిపోయిన పిదప మావిపోయినట్టేయయ్యెను. ఇట్టిచో.—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. మును మార్గ కవిత లోకంబున వెలయఁగ
దేశి కవితఁబుట్టించి తెనుం
గును నిలిపి రంధ్ర విషయం, బునఁజనఁజా
ళుక్యరాజు మొదలుగఁబలువుర్.

అని బయల్పడిన యమాయిక పద్యమునకు సముచితముగాఁ జెప్పఁదగిన యర్థమును పంతులుగారు సన్నగా జాఱవిడిచినారు. నన్నియభట్టున కాశ్రయమైన రాజరాజు మొదలగువారి నీపద్యము చెప్పుచున్నదని నేను భావించితిని. (రాజరాజనరేంద్ర నవమ శతాబ్ద సంచిక చూచునది) రామలింగారెడ్డిగారు నట్లే భావించిరి. పంతులుగారు దానిని పరిభావింపకున్నారు. మఱి వారు నర్థమేమో!

ఈపద్యము నన్నియ కాశ్రయమయిన రాజరాజు మొదలగు వారినే పేర్కొనుచున్నదని యిప్పుడు రామయ్యపంతులుగారు ప్రకటించిన శాసనము వలన మఱింతసుదృఢముగాఁ జెప్పనొప్పుచున్నది. ఏలయనఁగా నాశాసనమును బట్టి నన్నిచోడఁడు రాజరాజునకు నూఱేండ్లకాలమున నంధ్రమున 'పలువుర్' కవులు తెలియవచ్చుచున్నారు.

వీరరాజు పంతులుగారు ద్వితీయాశ్వాసమున నన్నిచోడని శబ్ద పరికర సంపత్తిని గూర్చి వ్రాసిన గ్రంథమునకు నేమ మిక్కిలియుఁ బరితోషము చెందుచున్నాను. అది వారి భాషా వరిశ్రమను వేనోళ్ళఁ జాటుచున్నది. అందు గొన్నింట నేను భిన్నాభిప్రాయము గల వాడను. కొన్నింట వారి యభిప్రాయమును బలపఱుచు వాడఁను. మఱియొకపుడు నేనును నన్నిచోడని కావ్య విశేషములఁ గూర్చి కొంత వ్రాయనుద్యోగించి యున్నాఁడను గాన యాయా విషయములందు బేర్కొందును.

ఇక రామయ్య పంతులుగారు ప్రకటించిన శాసనమును గూర్చి నేను జెప్పఁదలఁచినది సంగ్రహముగాఁ జెప్పుచున్నాడను.—రామయ్య పంతులుగారు శాసనము వంశవృక్షము నించుక తప్పుగాఁ జెప్పిరని నేననుకొనుచున్నాఁడను. వారిట్లు వంశవృక్షముంజూపిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చోడబల్లి
|
నన్నిచోడఁడు
|

సూరరాజు — ఘంటకారుడు
|
మల్లిదేవుడు
|
నన్నిచోడఁడు
|
మల్లిదేవుడు

శాసన శ్లోకమును గూడఁ జూపుచున్నాడను.

తత్ర సూర్యాన్మను- స్తస్మాదిక్ష్వాకు- స్తత్కు వేన్నృపః
అదే వీక్కరి కాలాఖ్యచోడ- స్తస్యాన్వయే జని
చోడబల్లినృప- స్తస్మాన్నన్నిచోడ- స్తదాత్మజః
సూరభూప-స్తుత స్త స్యరాజరాజ మహీపతిః
తస్యానుజో ఘటంకార నృపోహంకార శంకరః-
తస్యచోడ మహదేవీప్రియా-త త్తనయోనయీ
మల్లిదేవ నృపోయత్రక్షాత్రథ (ర్మో?) ర్మాన్యలీయ
తస్యకాంతా మహాదేవీ-నన్నిచోడ స్తయేస్సుతః
న్యగ్రహీదుగ్ర వీరారి న్య (న?) గ్రహీద్విజయశ్రీ
గంగాదేవీ ప్రియాతస్య యాదేశ మతిచక్రమే
తాభ్యాం భూచక్ర శక్రోభూన్మల్లి దేవమహీశ్వరః

పై శ్లోకములందు నేను జేసిన యన్వయమున కనుగుణముగాఁ
డిర్యగ్రేఖలుంచితిని. ఈ విధముగాఁ జూడఁగా వంశవృక్ష మీ క్రింది విధ
మున నేర్పడుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చోడబల్లి
|
నన్నిచోడఁడు
|
సూరభూపతి

రాజరాజు	ఘంటకారనృపతి (చోడమహాదేవి) భార్య
	|
	మల్లిదేవుడు (మహాదేవి భార్య.)
	|
	నన్నిచోడఁడు (గంగాదేవి) భార్య
	|
	మల్లిదేవుడు

రామయ్య పంతులుగారు చూపిన వంశవృక్షమున రాజరాజు లేఁడు. శ్లోకములఁ జూడగా నేను జూపిన వంశవృక్షమే సరియైనదని యేర్పడఁగలదు దీనిఁబట్టి వంశవృక్షమున నొకతర మెక్కువ యగుచున్నది.

రామయ్య పంతులుగారు, వంశమునఁ గడపటి వాఁడును, శాసనము నెలకొల్పిన వాఁడును, నగు మల్లిదేపుడు (శాసనమునఁ గాలనిర్దేశము లేకున్నను) శ. 1140 సంవత్సర ప్రాంతము వాడగునని వ్రాసిరి. కాకతీయ గణపతి దేవునకుఁ బుణ్యముగా నాశాసనము నెలకొల్పఁబడినది కావునను గణపతిదేవుడు శక. 1140 సంవత్సర ప్రాంతకాలమున వెలనాడు జయించి శక. 1182 సం॥ దాకఁ రాజ్యమేలినాఁడు గావునను, ప్రస్తుత శాసన కాలమును గణపతి వెలనాఁడు జయించినప్పటి కాలముగానే (శక. 1140) సామాన్య దృష్టిని రామయ్య పంతులుగారట్లు వ్రాసిరి. ఈ శాసనము గణపతి వెలనాడు జయించిన కాలముననే వెలయింపఁ బడిన దగునేని ద్వయ్యాంలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రేవూరి శాసనము వలె నిదిగూడ గణపతి పేరనే యుండదగి యుండును. కావున నిది యంతకుఁగొంత తర్వాతి కాలమున వెలయింపఁ బడినదయి యుండుననవచ్చును. ఆ తర్వాతి కాలము గణపతి యవసానకాలమగు శక. 1182 కు లోఁగా నెప్పుడేని కావచ్చునుగదా !

పెద చెఱకూరిలోనే దొరకిన శాసనాంతరమును బట్టి యాకాలము శక 1170-1180 సం॥ దగ్గఱిదిగానే నిర్ణయింపఁదగిన దగుచున్నది.

ఇది చదువుడు:— ఓరియంటల్ లైబ్రరీలోని శాసనముల వాల్యుం, నెం 1,792 పేజీ పెద చెఱకూరి కరణం నోరి కృష్ణయ్యగారి యింట్లో ఉన్న తామ్రశాసనమున. ప్రసక్తమయిన భాగమే ఉదహరించుచున్నాఁడను.

జాతశ్రీ కరికాల పార్థివకులే రత్నాకరే చంద్రవత్
శ్రీమద్రాజ సమాజ భూషణమణి శ్రీ మల్లిదేవాహ్వయః
నిస్త్రింశ త్రుటితారి ఘోటక భటస్తం బేరమగ్రామణీ
ర్మస్తిష్కాసి పిశాచ భూతనికర శ్లాఘ్య ప్రతాపోదయః
న్యగ్రహీదరి చతుర్విధసైన్యా
మల్లిదేవ జగతీపతిశక్రి
శ్మక్రమూనురివ చక్రిసహాయః.

తారా రోట్కరపద్మినీహితమితే (1221) శాకాబ్దజాలేగతే సాక్షాదీశ్వర వత్సరేశుభకరే మాఘూస్యమాసేసితే, పక్షేపర్వణి సోమవార సహితే సోమగ్రహోపక్రమే, కృత్వాస్నాన మనూన మంత్రవిధినాపాథోనిధేస్సన్ని ధౌ.... పంచోత్తరశతఖారీ పరిమేయమహీమగస్త్య నాథాయ, శ్రీమల్లిదేవనృపతిః ప్రాదాదిహనం (పం) దికుంటనామదిశి........

రామయ్యపంతులుగారు ప్రకటించిన శాసనము నెలకొల్పిన మల్లిదేవుఁడే యీ శాసనము నెలకొల్పిన మల్లిదేవుఁడగును.

"న్యగ్రహీదుగ్రవీరాణక్ అగ్రహీద్విజయశ్రియమ్,........ తాభ్యాం భూచక్రశక్రో భూన్మల్లిదేవ మహీశ్వరః, (రామయ్యపంతులుగారు ప్రకటించిన శాసనము).

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

“న్యగ్రహీ దరిచతుర్విధసైన్యా న్యగ్రహీ-దిత్యాదికమగు నీరెండవ శాసనము శ్లోకమును జూడఁదగును. మఱియు రెండు శాసనములు నొక్కచోటివే. గణపతి చనిపోయిన తర్వాతిది గాన యీరెండవ శాసనమున గణపతిదేవునికిఁ బుణ్యము గాననిలేదు. గణపతి చనిపోయిన తర్వాత నామల్లిదేవుఁడు తలయెత్తి స్వతంత్రుఁడై యుండును. ఈశాసనమునఁ దలితండ్రులపేళ్ళులేవుగావున నీవిధమున నీమల్లి దేవుఁడే యామల్లిదేవుఁ డగుట గుర్తింపవలసెను.

శక 1221 సంవత్సరమున శాసనము నెలకొల్పిన యీ మల్లిదేవుఁడు గణపతిదేవుని జీవితకాలమున నెలకొల్పిన శాసనాంతరము (మన ప్రస్తుత శాసనము) శక 1170-1180 సంవత్సరముల సమీపకాలపుదగుననుట యసంగతముకానేరదుగదా! దీనిచే రామయ్యపంతులుగారు చెప్పిన కాలము కంటె మన ప్రస్తుత శాసనము మఱియుప్పదియేండ్ల తర్వాతి దగుచున్నది. ఇట్లు ముప్పదియేండ్ల తర్వాతికివచ్చినను, వారు వంశవృక్షమున నొకపురుషుని విడుచుటచేత నాముప్పదియేండ్లు నాతని తరము కాలము క్రిందఁగొట్టివేయఁగా రామయ్యపంతులుగారన్నట్టే ఘట్టకుటికాప్రభాత న్యాయమున మొదటి నన్నిచోడని కాలము శక 1040 ప్రాంతవుదే యగుచున్నది.

రామయ్యపంతులుగారు ప్రకటించిన శాసనములోని మొదటి నన్నిచోడఁడే కుమారసంభవకర్తయని నేనును నమ్ముచున్నాను. ఇందులకై యింకను శ్రీ సోమశేఖరశర్మగారి తోడ్పాటుతోఁదెలుఁగుచోడుల శాసనము లెన్నికలవోవానిలో నెందఱు నన్నిచోడులు గలరో యెందరు చోడబల్లులు గలరో, యెందరుమల్లిదేవులుగలరో వారినందరను, ఆ శాసనములను శోధించి శోధించి చర్చించి చర్చించి చివరకిదమిత్థమని యిట్లు నిర్ణయించుకొన్నాను. ఇంతవరకుఁ జేకూరిన శాసనములలో వీరుగాక వేఱొకరు మనకు సరివచ్చువారు కానరాలేదు. ఇంకనొక్క విశేషము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మన నన్నిచోడఁడు కుమారసంభవమును దనగురుడగు మల్లికార్జునునకు సమర్పించెను. ఆ మల్లికార్జునుఁడు శైవులలోనొక తెగయగు కాలాముఖులలోఁ జేరినవాఁడని శ్రీరామకృష్ణకవిగారు నిరూపించిరి. అతడు బసవమల్లికార్జున పండితారాధ్యులవంటి వీరశైవుఁడు గాఁడని కుమారసంభవముఁ జదివినవారెల్లరు నంగీకరింతురు. అందుశక్తిపూజమండలార్చన, మొదలగునాచారములు వీరశైవగర్హితములు కాలాముఖసమ్మతములు గాన పచ్చుచున్నవి. కావునఁ గవిగారు నిరూపించినట్టులామల్లికార్జునుఁడు గాలాముఖుఁడని నిశ్చయంపవచ్చును. ఇప్పుడిందు ముందు నిరూపించిన నన్నిచోడని కాలముననే (శక 1040 చేరువ) పెద్దచెఱకూరికిఁ జేరికంగం గ్రామముననే (కొప్పరమున) ఒక మల్లికార్జునయోగి కాలాముఖుఁడుగలఁడు. అతనిని వీరేశలింగము పంతులుగారించుక స్మరించినారు. కాని వారు చెప్పినచొప్పున నన్నిచోడని విషయమక్కడఁ జక్కఁబడకుండుటచేనది యాదృతముగాదయ్యెను. ఆమల్లికార్జునుఁడు తెలుగుచోడులచేనారాధితుఁడయినాడు.

ఇది చదువుఁడు - కొప్పరపుశాసనము. 1915 సం॥ గవర్నమెంటు శాసన సంచయముననున్నది.

'స్వస్తి శ్రీ....కావేరీతీర కరికాలకుల రత్నప్రదీపాహితకుమారాంకుశ శ్రీమన్మహామండలేశ్వర కన్నరదేవచోడ మహీపాల స్సకలభూపాలతిలకః।

శ్లో॥ శ్రీకామచోడక్షితిపాలపుత్రః, ప్రత్యర్థి
కాంతాగళసూత్రదాత్రః
రామాంబరీషాదిలసచ్చరిత్రః, సూర్యాన్వయాం
భోరుహషండమిత్రః॥

ఆసీత్తస్యకులప్రధాన పదవీ విభ్రాజిత శ్రీనిధి
ర్భాండాగారమహాధికారమహితః ప్రత్యక్షధర్మాత్మజః।
ధీమానీశ్వరనాయకస్యతనయోమారభి ధానకృతీ
నిత్యం ధర్మనిబద్ధబుద్ధి రసకృత్పుణ్యక్రియాపన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీశైల ప్రాగ్భాగే కమ్మక్షితి మహిత కొప్పరగ్రామే
ద్వాఖానితౌ తటాకౌ తేన స్వేతూపమాన ఘనసేతూ।
గిరిరామఖేందు గణితే శకభూపాబ్దే జయాబ్దకే చైత్రే
సూర్యగ్రహణ నిమిత్తే కృతవాన్ తాన్ మహాధర్మాన్॥

అథనిజ ప్రధానినః పౌరుషమాదృత్య రాజకన్నర దేవస్సమాగత్య అస్మిన్ పుణ్యతీర్థే సుప్రతిష్ఠితం సోమేశ్వరం నత్వాభక్తి ప్రేరితమనా దేవా యైనం కొప్పర గ్రామం దత్తవాన్ తదైవ తదను జన్మా చోడబల్లి దేవః పూర్వదిశి క్రోశమాత్రే బీదేపల్లి నామ గ్రామంప్రాదాత్.........

దాప యిత్వాతటా కౌద్వౌ దేవాయ తదనంతరం
పాలూర్పుర సముత్పన్నం ధ్రుతకాలా ముఖవ్రతమ్
మల్లికార్జున మభ్యర్థ్య తస్మై తత్త్వార్థ భావినే
సోమేశ్వరవరం స్థానం ప్రాదాదా చంద్ర తారకమ్॥

శక 1037 సంవత్సరమునఁ గామదేవ చోడభూపాలుని కొడుకులగు కన్నర దేవచోడ, చోడబల్లి దేవులు చేసిన ధర్మముల నీశాసనము చెప్పు చున్నది. కన్నర దేవుని భాండాగారికుఁడు కొప్పర గ్రామమున రెండు చెఱువుం ద్రవ్వించెనట! కన్నర దేవుఁడందుల కానందించి యక్కడఁ బ్రతిష్ఠితుఁడగు సోమేశ్వర దేవునకుఁ గొప్పర గ్రామము నొసగెనట, మఱియు నాతఁ డక్కడఁ ద్రవ్వించిన రెండు తటాకములను దేవున కిప్పించి యటుపయి పాలూరు పురమందు జన్మించిన వాఁడును కాలాముఖవ్రతమును బూనిన వాఁడును నగుమల్లికార్జునుని బ్రార్థించి తత్త్వార్థ భావియగు పాయనకొఱకు సోమేశ్వరవరమను స్థానము నాచంద్రార్కముగా నొసఁగెను.

పెద చెఱకూరి శాసనమున లెక్కింపఁబడిన విధమునఁ జోడబల్లి కొడుకగు నన్నిచోడనిఁ (మన నన్నిచోడకవి) కాలమున కీశాసన కాలము సరివచ్చు చున్నది. నన్నిచోడకవి గురువగు మల్లికార్జునుఁడీతఁడు కావచ్చు ననుట మిక్కిలి సంగతముగా నుండును. మఱియు నీశాసనములో కాలాముఖ మల్లికార్జుననకు సోమేశ్వర వరము నిప్పించిన చోడబల్లియు, పెద చెఱకూరి శాసనములో మొదటి వాఁడుగఁ జెప్పబడిన చోడబల్లియు (నన్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చోడ కవి తండ్రి) నొక్కఁడయినను గావచ్చును. పెద చెఱకూరి శాసన మునఁ జోడబల్లి తండ్రిపేరు గానరాదు. ఈ కొప్పుర శాసనమునఁ జోడ బల్లి సంతానము తెలియరాదు. చోడబల్లి, కామదేవచోడ, కన్నర దేవచోడ, నన్నిచోడాదులు, వేర్వేరుగాఁ బెక్కు శాసనములలోఁ గానవత్తురుగాని ఈ కొప్పురపు శాసనములోని వారితో వారెవ్వరు నేకీభవింపకున్నారు. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్ 4 వాల్యుం 467 పేజీలో నొక చోడశాసనము కలదు. అది యొక్కటి మాత్రమీ కొప్పుర శాసనమునఁ గల కన్నరదేవ చోడ, చోడబల్లి దేవులదే. దాని కాలము కూడ శక 1043 అగును.

కొప్పురపు శాసనమునఁ గానవచ్చు చోడబల్లి నన్నిచోడకవి తండ్రి గాకపోవచ్చును. వారిద్దరు వేఱు పురుషులు గాకపోవుట వలన వచ్చు విశేష మంతగా లేదు. పెద చెఱకూరి శాసనమున పాకనాఁడిరువది యొక్క వేయిటికధీశుఁడు చోడబల్లి కుమారుఁడు నగు నన్నిచోడఁడు దొరకినాఁడు. కొప్పరపు శాసనమునఁ దెలుఁగు చోడులచే నారాధితుఁడు, కాలాముఖ దీక్ష గొన్నవాఁడునగు మల్లికార్జున గురువు దొరకినాఁడు. ఈ నన్నిచోడ మల్లి కార్జున గురువు లేక కాలము వారగుట స్పష్టమయినది. కుమార సంభవ మున నన్నిచోడనిఁ గూర్చి తెలియవచుచ్చున్న విషయము లంతకంటె నెక్కువలేవు. అందు నన్నిచోడని తల్లిపేరు శ్రీసతియని యున్నది. పై శాసనము నందది కానరాలేదు గాన నాతడేఁ యీతఁడనరాదని యాక్షేపింప రాదు. ఇట్లాక్షేపింపఁ బూనినచోఁ గల్గెడు ననర్థములకు మితిలేదు.

నన్నియకంటె నన్నిచోడఁడు, నూఱేండ్ల తర్వాతి కాలము వాఁడని పయి చర్చవలన నిర్ధారితమగు చున్నది. నన్నిచోడని కవితా రచనను గూర్చి వేఱొకప్పుడు విస్తరించి వ్రాయనున్నాఁడను. ఇక్కడ నొక్కా పదమును గూర్చి యించుక యుగ్గడించు చున్నాఁడను. రామయ్య పంతులుగారు కుమార సంభవము ముద్రిత ప్రతిలోని దోషముల నెఱింగించుటకై తాళ పత్ర ప్రతిలోని పద్యములఁ గొన్నింటిని జూపినారు అందొక పద్యము:--

క. వలిమొగ్గల విరిపువ్వుల, సలలితమయి చూడ
నొప్పెఁ జనుపకఁ (జంపక) మత్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జ్వల రుచి, రేవగలారక, వెలిగెడు నుద్దీప
దీప వృక్షము వోలె.

తంజావూరి ప్రతి పాఠము ఇందు 'చనుపక' మని యుండఁగా నది తప్పని తలఁచి రామయ్య పంతులుగారు (చంపక) అని కుండలీకరించి సంస్కారము చూపినారు. అట్టి సంస్కారమనావశ్యకము. చనుపకమను పదము కలదు.

చనుపకములఁ గొనఁ జనునే మాటికి, ననవి
ల్తుని మన్నగ గల మేటికి

యయాతి చరిత్రము శబ్దరత్నాకరమున నీప్రయోగము చూపబడినది. దీనిచే నా పదము వైకృతమని యెఱుఁగఁదగును. ఇది కూడఁ జదువదగినది.

సీ॥ ధూర్జటి కోపాగ్ని ధూళిగాఁగ్రాఁగిన నాఁడేల
నీయమ్మ వాఁడిలేదు.
వాఁడి కొఱల రాహువడిఁదోలి కఱచిన నాఁడేల
నీరశ్మి వేఁడిలేదు.
శాపంబు శ్రీరామ భూపాలుఁ డిచ్చిననాఁడేల
కూయవో వోఁడిగాను.
చనుపకముల కల్గి కనుకనిడుల్లిన నాఁడేల
మ్రోయరో నేఁడు మీరు
మగువఁచా యుఱెఱిఁగి మగఁటిమి పాటించి
యేయఁగ్రాయఁ గూయ మ్రోయ
మదన ! చంద్ర ! పికమ ! కొదమతుమ్మెదలార
నాఁడు నాఁడు నాఁడు నాఁడులేరే

భావన పెమ్మనయని బుద్ధచరిత్ర - ప్రబంధ రత్నావళిలోఁ జూచునది

వేటూరి ప్రభాకరశాస్త్రి

[ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక
క్రోధన-చైత్ర, వైశాఖములు.
సంపు. 14 సంచి. 11925
మణిమంజరి : సంపు 10-1985]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పండితారాధ్య చరిత్రము

విమర్శము

పండితారాధ్య చరిత్రము, చరిత్రమే యేమి, సోమనాథుని గ్రంథములెల్లను భాషాచ్ఛందో వ్యాకరణాది రీతులందు వింతతీరులు గలవి. బసవపురాణ ప్రకటనమునకుఁ బూర్వము వర్తమానాంధ్ర పండితు లెవ్వరుగాని వాని నంతగాఁ బరిశీలించి యెఱుఁగరు. శబ్దరత్నాకరకారులు సోమనాథుని గ్రంథములఁ బరిశీలింపనేలేదు. ప్రౌఢ్యమునఁ గల తప్పుప్రయోగములనే వారు గయికొనిరి. ప్రౌఢ్యమున సోమనాథ ద్విపద లన్యదీయములుగా నుదాహరింపఁబడినవి.

1910 నుండి 1914 దాఁక నే నదేపనిగా ప్రాచ్యలిఖితపుస్తకశాలలోని యముద్రిత గ్రంథములనెల్లఁ జదువుట, పరిశీలించుట, విశేష విషయములనెత్తి వ్రాసి యుంచుకొనుట, మొదలగు కార్యముల జరపుచుంటిని, 1914 సంవత్సరమున నేను పండితారాధ్య చరిత్రమున విశేష విషయముల గుర్తించి నోటు బుక్కులో వ్రాసికొనుచుఁ జదువుచు నుండగా భయంకరమయిన వ్యాధికిఁబాల్పడితిని. 1916లో నా జబ్బు కుదిరినది. జబ్బు కుదురఁగానే మరల పాల్కురికి సోమనాథుని గ్రంథముల పరిశీలనశేషము ముగించితిని. 1914 సం॥ నాఁడు వ్రాసిన యా నోటుబుక్కులు నేఁడు నా దగ్గఱ నున్నవి. మద్రాసులో శ్రీ. తం. తేవప్పెరుమాళ్ళయ్యగారు నాకు మిత్రులు. వారికి సోమనాథుని గ్రంథముల యోగ్యతా విశేషము లెఱిఁగించి ఆనంద ముద్రణాలయము వారిచేఁ బ్రకటింపఁ జేయఁగోరితిని. శైవగ్రంథములను మా సెట్టిగారు ప్రకటింప నంగీకరింపరని వారనిరి. "అభిమానకర్త" అన్న సోమనాథుని ప్రయోగమును దెలుపఁగా తేవప్పెరుమాళ్ళయ్యగారు "ఇది సర్వాంధ్రకవి ప్రయోగ విరుద్ధముగా నున్నదే" యనిరి. కోపగాఁడు కోపగత్తె యన్న శ్రీనాథుని ప్రయోగము లేతదనుసారులుగదా యంటిని. అటుపైఁ గౌన్నాళ్ళకు మిత్రులు శ్రీ కె.వి. లక్ష్మణరావుగారును నేనును ప్రోత్సహింపఁగా శ్రీ నాగేశ్వరరావుగారు బసవపురాణ ప్రకటనమున కంగీకరిం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

చిరి. ఆనాఁడు ఓరియంటల్ లైబ్రరి వ్రాఁతపుస్తకముల నితరుల కిండ్ల కెరవిచ్చు సంప్రదాయము లేదు. లైబ్రరికి వచ్చియే వానిఁ బరిశీలింపవలెను. అందువలన బసవపురాణపాఠముల సేకరింపించుట కెక్కువకాలము పట్టెను. నేను దేశాటనము చేయవలసి యుండుటచే చాల జాగయ్యెను. మఱియు నా జబ్బు కుదిరినది మొదలు నా చిత్తవృత్తులు వాఙ్మయ పరిశీలనాది విషయములందు మెలమెల్లఁగా విముఖములు కాఁజొచ్చెను. ఎట్లో బసవపురాణ ముద్రణము ముగిసినది. గ్రంథ పరిష్కరణ పీఠికారచనాదులందు నా కనేక విధములయిన క్లేశములు కలిగినవి.

ఆ కాలమున ఆంధ్రదేశమున శైవ వాఙ్మయమును గూర్చి పరిశ్రమ చేసినవారు లేరు. కవులలో "శివకవులు" అన్న విభేదమునే యెవ్వరు నెఱుఁగరు. పాల్కురికి సోమనాథుని గ్రంథములఁ బట్టియు మఱికొన్ని శైవ గ్రంథములఁ బట్టియు కర్ణాట శైవగ్రంథములఁ బట్టియు దొలుత దానిగుర్తించితిని. పరిశీలింపఁగాఁ గ్రొత్తలు గోచరించెను.

క. "శివకవులకు నవకవులకు
శివలోక ప్రమథులకును జింతామణిగ"

అన్న వేమనపద్యము తొలుత నాకు శివకవు లాంధ్రమునం దాదికవు లగుదు రనుటకు స్ఫోరకమయ్యెను. శివకవుల రచనావిభేదము లెన్నో యప్పుడు నేను గుర్తించితిని. బసవపురాణ పీఠికారచనమున భాషావిషయమునను, చరిత్ర విషయమునను నా పరిశీలనమును గూర్చి వివాదములు సాగునని నేను వెఱవలేదు గాని, మతవిషయమున, అందును ఆంధ్రదేశీయారాధ్య శైవ సంప్రదాయ విషయమును నాకు గోచరించిన విషయములు సప్రమాణములని నేను నమ్మిన విషయములు వివాదగ్రస్తము లగునేమో యని వెఱచితిని. నా యంతరాత్మ నాకు సరియని తోపించినది, నేను పరిశీలించిన శైవమతగ్రంథములఁ బట్టి నిర్ణయింప ననువుపడినది, నేను వ్రాసితిని. ఆనాఁడు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నుపలభ్యమానమగు శైవగ్రంథ సంచయమునెల్ల నెంతో కష్టపడి చదివితిని. నేను బసవపురాణ పీఠికలోఁ జేర్కొన్న శైవమతగ్రంథముల నానాఁడు కర్ణాట శైవులే పలువు రెఱుఁగరు.

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri
CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మైసూరనుండి, ధార్వారునుండి, ఇంక గొందఱు శైవమతాధిపతులదగ్గఱ నుండి ఆయాగ్రంథముల యెఱుకకొఱకు నాకుఁ బెక్కులు జాబులు వచ్చి నవి. మైసూరు శైవ విద్వాంసులకు గొందఱకా గ్రంథముల యానుపూర్వ్యా దుల నేఁ దెలిపితిని. కొందఱికా గ్రంథముల ప్రతులు ప్రాచ్యలిఖిత పుస్తకా లయమున నుండి వ్రాయించి పంపితిమి. ఆనాఁడు నా యెఱుక కందిన సన్నిహితులయిన యాంధ్ర ద్రవిడ కర్ణాట శైవ పండితులతో మతవిషయ ములఁ జర్చించి కొన్ని విశేషములు తెలిసికొంటిని. తిరుత్తొండర్ తుఫై యన్న ద్రవిడ శైవస్తుతి గ్రంథమును సోమనాథుఁడు బసవపురాణమునఁ దెలిఁగించి నాఁడు. తా నా గ్రంథమును దెలిఁగించుటను బసవపురాణమున నాతఁడు తెలుపలేదు. ద్రవిడ శైవ పండితులతో సంప్రతించుటలో దానిఁ గుర్తింప గల్గితిని. అఱువత్తుమూవుర చరిత్ర పరిశీలనమున నెంతో క్లేశపడితిని. వీర శైవమత స్వరూపమును గుర్తించుట కెంతో పరిశ్రమించితిని. నాకు శక్య మయినంత చేయఁగల్గితిని. ఎవరినిగాని కొంచెపఱుపవలెనన్న పాపబుద్ధి నాకు పొడమఁ గారణము లేదు.

బసవపురాణ పీఠిక యచ్చు సాగుచుండెను. మతవిషయపు రచన మచ్చుపడవలసి యున్నది. శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి యింటికేఁగితిని. నాఁడు వారు తీవ్రజ్వరముతో నుండిరి. వారి దర్శనమున కెవ్వరిని బోనిచ్చుట లేదు. నారాక నెట్లో తెలిసికొని శ్రీవారు నన్ను రప్పించుకొని రాకకుఁ గారణమడిగిరి. బసవపురాణ పీఠికలో మతవిషయ మచ్చు కానున్నది. మీరు గాని మీకును నాకును నాప్తమిత్రులు శ్రీ మల్లమపల్లి మల్లికార్జునశాస్త్రులు గారుగాని, మీరు పలుమాఱు నాతోఁ బ్రశంసించుచుండు పూజ్యులు శ్రీ అమృతలింగము అయ్యవార్లంగారు గాని నాయీ పీఠికాభాగమును జదివి యుక్తాయుక్తములఁ జర్చించిన పిదప మార్పులేవేని చేయవలసిన ట్లేర్పడి నచోఁ జేసి మఱి ప్రకటింపఁదగు ననుకొందును. ఇది మీకు నివేదింప వచ్చితి నంటిని. వారు నవ్వి "అక్కఱలేదు, మీరు వ్రాసినది ప్రకటింపుఁడు." ఇత్యాదిగా నొక కొంత చెప్పిరి. విడువక నే నాంధ్రారాధ్య సంప్రదాయ మును గూర్చి వ్రాసినదాని సంగ్రహము వారి కెఱిఁగించితిని. జ్వరితులుగా నుండియు సావధానముగా నా యుపన్యాసము విని, మీకు సత్యమని తోచి నది ప్రకటించుట యుచితమే యనిరి. వారి సమ్మతితోనే నేనది ప్రకటించితిని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాకు సత్యముగా సప్రమాణముగా గోచరించినది నేఁ బ్రకటించితిని. ఇందాక్షేపార్హ విషయములు గోచరించినచో నితర విద్వాంసులు వానిని ప్రకటింప నర్హులు. సహృదయలోకము వానిలో యుక్తాయుక్తములు చర్చించి తత్త్వనిర్ణయము చేసికొనును. నేను ప్రత్యుత్తరింపఁ దగినదిగాని సముచిత మయి యంగీకరింపఁ దగినదిగాని యుండిన నట్లే చేయుదును.

నా పీఠికలో వీరశైవము బసవేశ్వరాద్యుపజ్ఞమని వ్రాసితిని. నిజముగా నేనట్లు నమ్మి వ్రాసితిని. కర్ణాట వాఙ్మయము, సంస్కృత శైవమత వాఙ్మయము, శాసనములు, నా కీ యర్థమునే నిరూపించినవిగాఁ గానవచ్చినవి. దీని వల్ల నా మతమున కవనతి గల్గు ననుకొనను. నే నెవ్వరిని దూఱలేదు.

బసవపురాణము ప్రకటితమయిన పిదపఁ గొన్నాళ్ళకు శ్రీ నాగేశ్వర రావుగారు పండితారాధ్య చరిత్రముఁ గూడఁ బ్రకటింపఁ దలపోసి దీనిని గూడ మీరు పరిష్కరించి యిత్తురా యని నన్ను హెచ్చరించిరి. బసవపురాణ పరిష్కరణాది కార్యములఁబట్టి నేను బిట్టు సంక్షోభము పాలయితిని. క్షమింపుఁడు. నేఁడు నా మనఃప్రవృత్తి వాఙ్మయ విషయ పరిశీలనమునఁ జాల విముఖముగా నున్నది. బసవపురాణ పీఠికపై నాక్షేపము లెన్నో వెలసియున్నను వానికి నేను జెప్పదగిన సమాధానము లున్ననుఁ గూడ నేఁజెప్ప నుత్సహింపఁ జాలకున్నాను. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు దాని నసిగా సంస్కరించి ప్రకటింప సమర్థులు. మీ రిష్టపడుదురేని వారిని గోరవచ్చునంటిని. వారు నెంతో సంతోషించిరి. తొలిపుస్తకమును నేను పరిష్కరించితిని గాన దీని నాతోఁ జెప్పక యితరులచేఁ బరిష్కరింపించుట బాగుకాదన్న తలఁపుతో నేని శ్రీ నాగేశ్వరరావుగారు నాతో నట్లు ముచ్చటించియుండవచ్చును. శ్రీరామమూర్తి పంతులుగారు శ్రీ నాగేశ్వరరావుగారి కోరికపై పండితారాధ్య చరిత్ర పరిష్కరణమున కనుమతించిరి. శ్రీరామమూర్తి పంతులుగారి కూలంకష ప్రజ్ఞా ప్రయోగ మీ పరిష్కరణమునఁ గాననగునని పండితారాధ్య చరిత్రము ప్రశస్తతరముగాఁ బ్రకటితము గాఁగలదని పరితోషించితిని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెక్కేండ్లు గడచినవి. అప్పుడు పండితారాధ్యచరిత్ర పరిష్కరణాది కార్యమును డాక్టరు శ్రీ చిలకూరి నారాయణరావుగారుజరపుచున్నారనివింటిని. అయినను నందుఁ దద్గురువర్యులగు శ్రీ రామమూర్తి పంతులుగారి యుపరి పరిశీలన ముండుననియే విశ్వసించితిని.

గ్రంథ మీ నడుమ ప్రకటితమయినది. ప్రకటితముకాఁగానే ప్రకాశకులునొకొక ప్రతి పంపిరి. ఆదరముతో నందుకొంటిని. ఆ కృతి యాకృతి మహత్తరముగాఁ గానవచ్చినది. విశేషవిషయ జిజ్ఞాసోత్సాహముతో విచ్చి చూచితిని.పీఠిక, ఉపోద్ఘాతము, మూలము రెండనుబంధములుగలిగి యనఁటి మొవ్వులవంటి కాగితములపైఁ జాల నందముగా నదిముద్రితమై యానందము గొల్పుచున్నది. శ్రీనాగేశ్వరరావుగారు శ్రీరామమూర్తి పంతులుగారు సజీవులయియుండఁగా వారు పరిశీలించి పరితోషింపఁ దగినట్లిది ప్రకటితము కాకపోయెఁగదాయని వగచితిని. శ్రీ నారాయణరావుగారు పట్టుదలతో బిట్టు పరిశ్రమించి దీని సంధానించిరి. గ్రంథాంతమున సంజ్ఞావాచకముల పట్టిక అచ్చిక పదముల పట్టిక యని రెండనుబంధములు గూర్చిరి. తుదిపట్టిక యారాధ్యచరిత్రలోని యచ్చ తెలుఁగు పలుకులకెల్ల జాబితా. గ్రంథమునందలి యచ్చ తెలుఁగు పలుకులనెల్లఁ బుటసంఖ్యలతో నుద్ధరించి యకారాది క్రమమునకుఁ దార్చి యిట్లు ప్రకటించిరి. ఇది భాషా జిజ్ఞాసువులకుఁ బరమోపకారకము. చాలనోపికతో దీనిని సమకూర్చినందుకు శ్రీనారాయణరావుగారి నభినందించుచున్నాఁడను. కాని యిందింతకు ముందు నేను విలువగలపదములని యారాధ్యచరిత్రముననుండి యుద్ధరించి యుంచుకొన్న పదములు కొన్ని గానరాలేదు. ఇట్లేల కానరాకపోవలెనని పరిశీలింతును గదా మూలగ్రంథమున నా పట్టులు నేను సరియనుకొన్న పాఠములతోఁగాక యన్యవిధములఁగానవచ్చెను. అంతట దాని నాపి శ్రీనారాయణరావుగారి పీఠికను మహత్తరమైన యుపోద్ఘాతమును జదివితిని. బసవపురాణ పీఠికలో నేనెంతో కష్టపడియిదమిత్థమని నిర్ణయించుకొని సూత్రప్రాయముగా వెల్లడించిన సిద్ధాంతముల నెన్నిటినో శ్రీనారాయణరావుగా రుపోద్ఘాతమునఁ బూర్వపక్షముచేసిరి. నేను వ్రాసినదానిని సరిగా వారు పర్యాలోచించినట్లు తోపదయ్యెను. శ్రీరామమూర్తి పంతులుగారి యుపరిపరిశీలనమున్నచో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాయావిషయములట్లట్లు విపరీతస్థితిని బొరసియుండకపోవు ననుకొంటిని. కాని పీఠికలో నారాయణరావుగారిట్లు వ్రాసిరి. "శ్రీరామమూర్తి పంతులుగారు (పెక్కుప్రతులు) దగ్గఱ పెట్టుకొని తమ కుమారులు శ్రీ వేంకటసీతాపతిగారి సహాయముతో వివిధ పాఠములగుర్తిస్తూ ఉండిరి. 1932 సం॥ ఎండకాలపు సెలవులలో నేను పర్లాకిమిడిపోయినపుడు శ్రీరామమూర్తి పంతులుగారితో ఒక నెల్లాళ్ళుండడము తటస్థించినది. అప్పుడు మేము ముగ్గురమున్ను కలిసి వాదప్రకరణములో కొంత సరిచూచినాము. నేనింటికి రావలసిన తొందరకలగడముచేతను, మా గురువుగారికి నామీద నమ్మకముండడముచేతను పండితారాధ్య చరిత్రమును పరిష్కరించి అచ్చుకు సిద్ధము చేసేభారము నామీఁదవేసి తామప్పటికిచేసిన కృషికి ఫలితముగా తేలిన సమస్త సామగ్రిని తమవద్దనుండిన వ్రాఁతప్రతులను నాకిచ్చివేసిరి.................... నేను సరిచేసిన మహిమ పర్వత ప్రకరణములను ఈలోగా శ్రీరామమూర్తి పంతులుగారు చూస్తేబాగుంటుందని వారికి పంపినాను." దీనిఁ బట్టివాదప్రకరణమునఁ గొంతభాగము శ్రీరామమూర్తి పంతులుగారి సమ్యక్పరిశీలనమునను దక్కిన భాగములు వారు సేకరించిన సాధన సామగ్రితో శ్రీనారాయణరావుగారి పరిశీలనమునను బరిష్కృతమైనట్లు స్పష్టపడినది. తక్కిన గ్రంథభాగముల కేమిగాని వాదప్రకరణమునఁ గొంతయేని ససిగా శ్రీరామమూర్తి పంతులుగారి పరిష్కరణముఁ బడసినదిగాన చక్కఁగా నుండునన్న కుతూహలముతో దానిఁదెఱచితిని. దాని తీరును జూడఁగా నందు శ్రీ రామమూర్తిగారి ప్రతిభాప్రయోగమున్నదన్న పీఠికావాక్యము విశ్వాస్యముగాఁ దోపదయ్యెను. శ్రీరామమూర్తిగారి వైదుష్యము నెఱిఁగిన వారీవాద ప్రకరణమును జదువుదురేని నా మాట నిజ మనఁగలరు. ఇది నిజమని నిరూపింపఁ దగ్గపట్టులఁ గొన్నింటి నిక్కడ చూపుచున్నాఁడను. ప్రకరణారంభ ద్విపదమే యిట్లున్నది.

1. శ్రీ గురులింగ! సంచిత దయాపాంగ !
   భాగమహోదార ! పాల్కుర్కి సూర !

ఈ ద్విపదమున సంబోధనాంత పదములు రెండే. నాల్గుకావు. శ్రీ గురులింగ సంచిత దయాపాంగ భాగమహోదార ! పాల్కుర్కి సూర!—అని,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

2. తొలఁగని భేదవాదుల కెక్కుఁగొఱ్ఱు,

ఇక్కడ "అక్కుఁగొఱ్ఱు" ఉండవలెను. పూర్వోత్తరములందు వీపు గోల, తలగుండు' హృదయశల్యము, రొమ్ముగూటము, కంటికసువు ఇత్యాదులున్నవి. పయి సమాసములందుఁ బ్రథమపదము శరీరావయవ వాచకము. కాన యిందుఁగూడ 'అక్కు' ఉండును. ప్రాచీనకవుల పలుకుబడి 'అక్కుఁ గొఱ్ఱు' అనియే. మారన మార్కండేయ పురాణమున ప్రయోగమిదిగో "అమరాదులకు నెల్ల నక్కుఁగొఱ్ఱై"—మార్కం. 7-279.

3. అత్తఱి భట్లు కైవారంబుసేయ, — యతిభ్రంశము.

4. గొబ్బి । పదములు వెన్నెల పదములు సంజ । వర్ణనమటి గణ వర్ణన పదము । లు

సజ్జ వర్ణనకాని సంజవర్ణనకాదు. పెక్కు ప్రతులలో సజ్జవర్ణనమనియే కలదు.

5. "ఆశ్వ । లాయని మొదలు నాయాయి శాఖలును
న్యాయసూత్రంబు లామ్నాయభాగములు
మానిత తదుపశాఖాది సూత్రప్ర
తానంబులును బవమానకైవల్య"

శ్యామమాధ్యందిన.................... కాత్యాయనీయాశ్వ
లాయనీయములాదియైన శాఖలు స
మాయతతదుపశాఖాది సూత్రప్ర
తానంబులును బవమానకైవల్య............

అని యుండవలెను. ఈ పట్టునఁ బెక్కుద్విపదలు సరిగాలేవు.

6. అలరారు పంచమహా వాద్యవితతు
లొలయంగఁ గాహళలొక్కటమ్రోయ
'ఘలియంగ' ఉండఁదగును,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

7. ప్రణుత వాఙ్మణులు నీరాజనదీప

మణులును భక్తదృఙ్మణులు సంధిల్ల

నందగ వివిధపు ష్పాంజలులిచ్చి

మంగళారతులెత్తి మహిమ్రొక్కిచనఁగ

అధోరేఖాంకిత స్థలములు "ప్రణుతివాఙ్మణులు," "భక్తికృఙ్మణులు" "అంగనల్" ఉండఁదగును. 'చనఁగ' కు-కర్త అంగనల్ - పూర్వోత్తరములు చదివి చూడఁదగును.

8. నినుపారభత్రోఽతి నిర్మలంబనుచు

"భత్రంతు" ఉండవలెను. ఇక్కడరెండు చరణములు సాధు పాఠములు గలవిగావు.

9. చాకులకును మఱి సంగవులకును

నేకత్వమున్నదే లోకంబునందు

సత్కవులకును - ఉండవలెను. "సంగవులకును" అన్న నర్థమేమి ?

10. రురువర్ణ దేహంబు ఋగ్వేదమునకు - యతి ?

11. శ్రుతి శివోఽమేవ మేపితరావనంగ

శ్రుతులకుఁ దండ్రి యీశుండయియుండ

శ్రుతి "శివావేవ మే పితరా" వనంగ అని యుండవలెనేమో? 'శివోఽమేప' అని యుండదు. ఇందు, శ్రుతి—అనునది పయి సంస్కృత గ్రంథభాగము శ్రుతి వాక్యమనుటకుఁ జేర్చినదిగా నాకుఁదోచదు. శ్రుతి = వేదము, పార్వతీ పరమేశ్వరులే నాకు జనకులు అనుచున్నది. అని యర్థము వచ్చునట్లు 'అనంగ' అన్నపదమునకు 'శ్రుతి' కర్తృపదముగాఁ జేర్పబడినది. ఈ వాక్యమె శ్రీకరభాష్యమున శాస్త్రయోనిత్వాధికరణమున రెండుచోట్ల నుదాహరింపఁబడినది. కాని యక్కడ "శివోమామేవ పితరః అని కలదు. అది శ్రీహయవదన రావుగారి పరిష్కరణము గాన యెట్లయిన నుండఁగలదు. గ్రంథప్రస్తావనలో రావుగా రిట్లు వ్రాసిరి "భాష్యేస్మిన్న నర్గృహీత బహ్వాభిః

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిశిష్టైః అన్య గ్రన్థస్య పరిశీలనే, పరనేచ తేషా మతన్తోపకారికాం భవితు మర్హతీతి సంప్రత్యాశావిష్టామః. కేచిచ్ఛి ర్వ్యాఖ్యాతృభి" రిత్యాది. ఈ భాష్యమును తెల్గక్షరములతో మరల విభూతి పత్రికలో శ్రీ వీరభద్ర శర్మగారు ప్రకటించుచున్నారు. వారును "శివోమామేవ పితరః అనియే ప్రకటించిరి. "శివావేవమే పితరౌ" అని కాని "శివోమే ఏవ పితరౌ" అని కాని యుండఁ బోలును.

12. మితిఁదవోన్మేష నిమేషేభ్య యనఁగ— దీనికి ఫుట్ నోటులో:- "'తదో (వో ?) న్మేష నిమేషాభ్యాం' అని యుండవలెను. కాని యది ద్విపదపాదమున నిముడకపోవుటచే నిమేషేభ్య యని కవి సరిపెట్టినాఁడు. అట్లు చేయుట సంస్కృతభాషా విరుద్ధమైనను ప్రాకృత సంప్రదాయానురోధియై యున్నది." అని శ్రీనారాయణ రావుగారు వ్రాసిరి.

ఉన్మేషాశ్చ నిమేషాశ్చ ఉన్మేష నిమేషాః తేభ్యః అని కాఁగూడదా? ఇట్టిచోట్ల బహుత్వము వివక్షయత్తము కాదా? ఇది సంస్కృత భాషా విరుద్ధమా ?

13. "భవుని మహిమఁ జదువు పాఠకుల్ వొగడు"

గణభంగము. ఇట్లు గణభంగములు యతిభంగములు పెక్కుచోట్ల నున్నవి. ఇందు 'ని' తీసివేయవలెను.

14. చనుజీవ ఘటకర్మ చక్రసూర్యేందు
వినుత బలీవర్ద విభ్రమణమునఁ
గూడంగ భవములం గొఱలు రావటన
మాడించు కర్త విశ్వాధికుం డుండ.

ఇందు "రావటనమా" కు "రావటమునా" అని పాఠాంతరము చూపఁబడినది. పాఠము తప్పు పాఠాంతరమూ తప్పు. "రాటనము నాడించు" ఉండవలెను. జీవు లనుఘటములను కర్మచక్రమునఁ దగిలించి సూర్య చంద్రులను నెద్దులచే లాగించుచు సంసారమను రాట్నము (జలయంత్రము) శివుఁ డాడించుచున్నాఁడు. అని పై ద్విపదల యర్థము. పోలికగల నన్నిచోడని పద్యము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క. ఎగయు శిరంబులు నభమున
కొగిఁ గ్రమ్మెడు రక్తజలము లొలుకుచు భువిపై
మగుడఁబడుఁ జూడఁ గడు రం
గుగ నోలిన రాటనమున గుంగ్ర (డ?) లు వోలెఁ. అశ్వా.

'గుండ్రలు' రూపమును సాధువే.

15. గోపతిచేతఁ బాశోపేతమయిన
యా పశువుల యట్ల యవికల జీవు
లాశావిరహితులై యీశుని యంద
పాశమోక్షము నొందు బంధముల్ వాసి

ఇందు "పాశాపేతులయిన" "ఈశునిచేత" అన్న పాఠము లుండఁ దగును. దీనికి మూలము.

క. గోపతి కృతమున భువి పా
శాపేతము లయిన జీవులట్టులు భవపా
శోపేతులయిన జీవులు
ప్రాపింతురు మోక్షపదము పశుపతి నీచేఁ.

శివతత్వసారము.

16. ప్రమితి పండిత మభేద మదర్శనంబు
ఇక్కడ 'ప్రమితి పీడితము' ఉండును.

17. కలుగదానుత్పత్తి కర్తయ్యునొక్కఁ
డలరునొకనిచే నిఖిలాండములును
ఇక్కడ గణము తప్పిపోయినది యతితప్పి పోయినది.
"అలరారు నొకనిచే నఖిలాండములును" అనియుండవలెను.

18. భావజాంతకు భక్తవరుఁ డువెండియును.
ఇది సరియయిన పాఠముగానేరదు.
భావజాంతకుభక్తి పరుఁడు వెండియును—ఉండవలెను.
విశాఖపట్టణముద్రణ పాఠ మిట్లే కలదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

19. వావిరి జినలేఖ వఱతి పాలయ్యె
వఱితిపాలయ్యెనని యుండవలెను.

20. అంగుష్ఠతర్జనీభ్యాం సభస్మా య
నంగ నీశుఁడు జటాసంగతభూతి.

ఇక్కడ శ్రీనారాయణరావుగారు ఫుట్ నోటులో సభస్మాయన్నచోట స్మాకు గణముకోసము దీర్ఘము వచ్చినదని వ్రాసిరి. గణముకోసము దీర్ఘము రాలేదు. అది బహువ్రీహి సమాసపదము పుంలింగముగాన దీర్ఘము వచ్చినదని తెలియఁదగును.

21. తలఁప నెచ్చటనైనఁ దానూరులేక
పొలమేరగల్గునే భువిఁబురాణోక్తిఁ
జనఁగ గ్రామోనాస్తి యనఁగఁదత్సీమ
యనఁగాలులేకనీరది యెట్లుగలుగు.

ఇక్కడ—

చనఁగ 'గ్రామోనాస్తి' యనఁ "దుతస్సీమ"
యనఁగాలులేక—అనియుండవలెను.

ఈ కవియే యనుభవసారమున నిట్లుచెప్పినాఁడు

క. ప్రస్తుతకీర్తి గ్రామో
నాస్తి కుతస్సీమ యనినయార్యోక్తియ,
గ్రామోనాస్తి కుతస్సీమా = ఊరు లేదుపొలమేర యెట్లుండును!

22. ధృతి హర ఇత్యుచ్యనేతతోయనఁగ,

పాఠాంతరముగా 'ఉచ్యతే' ఫుట్ నోటులో నున్నది. ఉండనేకూడనిది. 'ఉచ్యసే, ప్రధానపాఠమా? ఉండవలసిన 'ఉచ్యతే' ఫుట్ నోట్ పాఠమా?

23. 'లక్షింపహరి హరునకుఁగానిలేవా'
'హరిహరులకు' అనియుండవలెను గదా?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

24. యాగయోగ్యుండుగాఁ డని ధిఃకరింప.
'ధిక్కరింప' అని యుండవలెనుగదా ?

25. చాలు-నే వ్యాజమేల యజ్ఞేశ్వరోహవ్య
కవ్యసమస్త భోక్తవ్య మాత్మాయ-నంగ అని యున్నది.
యజ్ఞేశ్వరోహవ్య సమస్తకవ్య
భోక్తా వ్యయాత్మా హరి రీశ్వరోత్ర

అనికదా శ్లోకపాఠము. భోక్తవ్యమాత్మా యనుచోట 'భోక్తావ్య యాత్మా' ఉండవలెను.

26. మానుగా శ్రీ రుద్రమహిమ యజ్ఞశ్రుతి స
దానందుఁడగు శ్రీ మహాదేవు మహిమ
నారూఢముగమల్లి కార్జునపండి
తారాధ్యులాద్యులౌనన బ్రతిష్ఠించె.

'రుద్రమహిమయన్కృతి' నని యుండవలెను. పండితారాధ్యులవారు 'రుద్రమహిమ' యన్నకృతిని రచించిరి. అది శ్రుతికాదు.

స్థూలదృష్టిని జూఁడగా నీ వాదప్రకరణమున నిన్ని యసందర్భములు గానవచ్చినవి. తక్కిన ప్రకరణములలో నసందర్భములు త్రవ్వితండములు. వాదప్రకరణమును శ్రీ రామమూర్తి పంతులుగారు పరిష్కరించిరనుట నే విశ్వసింపఁజాలను. వారి వైదుష్యమున కపప్రథ కలుగకుండుఁగాక ! తక్కిన ప్రకరణములలోని తప్పులఁజూపుట నా కక్కఱలేనిపని. కాని యుపోద్ఘాత ములో చరిత్ర విషయమునందు వాఙ్మయ విషయమునందు మత విషయము నందు శ్రీ నారాయణరావుగారెన్నో యపసిద్ధాంతములఁ గల్పించిరి. నా తలఁపుల నెన్నింటినోవారు తారుమారుచేసిరి. యుక్తమని నేను నమ్మిన విష యములను వ్యక్తపఱచుటకై వాఙ్మయము, చరిత్రము, మతమునను, నను క్రమమునఁగ్రమముగా శ్రీ నారాయణరావుగారి యుపోద్ఘాత గ్రంథమును మాత్రమే నేనిఁక విమర్శింపఁజూతును.

[J.S.V.O.I ?
మణిమంజరి, ఫిబ్రవరి, 1985]

(10)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగనాథుని శివకవిత్వము

రంగనాథుఁడను కవీశ్వరునిఁగూర్చి ఇటీవల చెలరేగిన వాద దావాగ్నిలోఁ జిక్కువడి నే నొడలు కాల్చుకొనఁజాలను. ప్రాచీనకావ్య లక్షణశాస్త్ర కవిచరిత్రాది పరిజ్ఞానము గొల్పుటలో నాకుఁ బ్రాచీన లక్షణ గ్రంథకర్తలు పితృతుల్యులు. ఉపాధ్యాయులు ... ఉహ్వాని యుద్వేత్తున వారి పరిజ్ఞానము నుత్తుత్తిదానిఁ గానే నూదివేయఁజాలను. వారు భ్రమ ప్రమాదములు లేనివారనఁగాదు. ప్రబలప్రమాణములచే నట్టి వట్టిసరకును నిరూపించి కొట్టివేయుటలగ్గు. రంగనాథునిగూర్చి యుపలబ్ధాంశముల నెత్తి చూపుటకే నాయీ యుపక్రమము. ఇందు ప్రామాణ్యాప్రామాణ్య చర్చను ప్రాజ్ఞులు కావింపఁగలరు గాక !

i

కర్ణాటక కవియగు తొంటెదార్యకవి 'పాల్కురికి సోమేశ్వరపురాణము'న రంగనాథుని విషయము నిట్లు చెప్పినాఁడు. చక్రపాణి రంగనాథుఁడను వైష్ణవునితో సోమనాథునకు మతవిషయమునఁ దగవు వాటిల్లెను. ఆ శైవుని దర్శింపఁడుగాన సోమనాథుఁడు తెరచాటుననుండి వాదముచేయ నంగీకరించెను. కాని యావైష్ణవుని జయించుటకు సోమనాథుని పుత్రుఁడగు చతుర్ముఖ బసవేశ్వరుఁడే తలపడెను. వారిర్వురకును గొప్పవాదముజరిగెను. రంగనాథుఁ డోడిపోయెను. పరాజయదుఃఖముతో నారంగనాథుఁడు శ్రీశైల మార్గముననే తిరిగి పోయెను. శ్రీశైల మల్లికార్జునునిఁజూడక ద్వేషబుద్ధితోనే యరిగెను. ఆ శివ ద్వేషముచే నాతనికిఁ గన్నులు గ్రుడ్డి పయ్యెను. అహోబలమున కరిగి యాతఁడు నరసింహ స్వామిని బ్రార్థించెను. ఆస్వామి వలన స్వప్నమున శివాధిక్యబోధమును బడసి లజ్జితుఁడై తిరిగి శ్రీశైలమునకు వచ్చి మల్లికార్జునుని బహువిధములఁ బ్రస్తుతించెను. ఒకకన్ను వచ్చెను. పదపడి పాలుకురికి వచ్చి సోమనాథుని దర్శించి యపచారము క్షమింపఁ బ్రార్థించెను. సోమనాథుఁడనుగ్రహించెను. రెండవ కన్నును వచ్చెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగనాథుఁడు శైవదీక్ష నొసఁగుమని సోమనాథునిఁ బ్రార్థించెను. పుత్త్రిఁ డగు చతుర్ముఖ బసవేశ్వరునిచేత సోమనాథుఁడాతని శివదీక్షితుని జేయించెను. రంగనాథుఁడప్పుడు వీరభద్రవిజయ శరభ చరిత్రాదులను రచియించి గురు పాదముల కర్పించెను."

ii

పాల్కురికి సోమనాథపురాణమే కాక కర్ణాటకకృతి యగు గురురాజ చరిత్రముగూడ నీ చక్రపాణి రంగనాథుని చరిత్రమును జెప్పుచున్నది. తోంటెదార్యకవి చెప్పినట్టే యా గురురాజ చరిత్రకర్త సిద్ధసంజేశకవియు రంగనాథుని యోటమిని జెప్పినాఁడు. 'వీరభద్ర విజయము' 'శరభలీల' యనుగ్రంథములనే కాక యాతఁడు శ్రీగిరినాథవిక్రమ మని యేనూఱు సీస పద్యముల తెలుఁగు గ్రంథమునుగూడ రచించెనట! దానినే సంస్కృత మునఁగూడ రచించెనట! ఆకవి యిట్లు చెప్పుచున్నాఁడు.

'శ్రీశైలభర్తకును సీసంబు లేనూఱు
లే నప్ప పద్యంగ ళెంటు సావిరగళం
భానురద దండకం సాహస్ర తారావళియు నాల్కులయగ్రాహియు
అశతక వృత్తగళు దోధకం సావిరవు
భాసురద తోటకం నూఱు రగళెగ ళేడు
భాషిసిద మత్తకోకిల మూఱు సాసిరం గీతియం తాఱునూఱు
సరస మంజెర వెంటు కందంగళై నూఱు
విరచిసిద కృతియు మూవత్తాఱు గద్యగళు
నిరువ మూవత్తాఱు వుభయశతకం వొప్ప మిగిలు సర్వేశనిమగె.'

ఇందు 'శ్రీగిరినాథ విక్రమము' అనుపేర శ్రీశైల మల్లికార్జునిపై నైదువందల సీసపద్యములను, నెనిమిదివేల పద్యములుగల మఱొకగ్రంథ మును, వేయిపాదములు గల దండకమును, నొక తారావళిని, నాలుగు లయ గ్రాహులను, నొకవృత్త శతకమును, వేయి దోదక వృత్తములను, నూరు తోటక వృత్తములను, నేఁడు రగడలను, మూఁడువేల మత్తకోకిలలను, నాఱు వందల గీతపద్యములను, నెనిమిది మంజరులను, నై నూరు కందములను,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముప్పదియారుగద్యములను, ముప్పదియారు ఉభయశతకములను చెప్పినట్లు ఈపద్యమునందున్నది. ఇతని యాకృతులెల్ల నిప్పుడు మనకుఁ గానరావు.

iii

కాని శివదూషణచేఁ గన్నులుపోఁగా శివస్తుతిచేఁ గన్నులు తెచ్చికొన్న ట్లుగా రంగనకవి రచించినట్లుగా శ్రీగిరి మల్లికార్జునిమీఁద రగడ యొకటి యున్నది. 'శివభక్తిదీపిక' యని దానికిఁబేరు. దానికి 'నయనరగడ' యని నామాంతరము.

iv

నేఁడు శివమంత్రవర్ణనము అనుపేర మఱియొక రగడ రంగ నాథుఁడు రచించినదిగానే దొరకినది. నమశ్శివాయరగడయని దీనికి నామాం తరము. దీని కడపట నీక్రింది పద్యమున్నది.

'అని మన ? (మను ?) రంగనాథుఁడు దయానిధి శ్రీగిరినాథు మీఁదఁ జె
ప్పిన శివమంత్రవర్ణనము చిత్తసముద్గత భక్తియుక్తి వ్రా
సినఁ గొనియాడినన్ వినినఁ జెల్వెసలారఁ బఠించినన్ జగ
జ్జనులకుఁ బుణ్యసంపద లసంఖ్యములై నమకూరు నిమ్మహిన్.

ఈ పద్యమును రంగనాథుఁడే రచించెనో లేక తర్వాతికాలమున నిత రుఁడే రచించెనో! ఈ రెండు రగడల నిప్పుడిక్కడఁ బ్రకటించు చున్నాను. సిద్ధనంజేశ కవి పద్యములో లెక్కింపఁబడిన రంగనాథుని రగడ లేడింటిలో నిప్పటికి రెండు రగడలు దొరకినవనవచ్చును. 1. శివభక్తిదీపిక యను నయనరగడ 2. శివమంత్రవర్ణనమనునీ నమశ్శివాయరగడ.

v

శివభక్తి దీపిక వ్రాఁతప్రతిలో కడపట నిట్లున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'వైష్ణవ చక్రపాణి రంగనాథుడు శైవ దీక్షధారణమైన తర్వాతను చేసిన నయనరగళ'

vi

'ఏకశిలానగర వృత్తాంతము' లో రంగనాథునిగూర్చి యిట్లున్నది.

'రంగనాథుడు ఆందోళికపై నెక్కి చనుదెంచునప్పుడు త్రిపురాంతక దేవుని గోపురంబుజూచి 'అదియేమి?' యని యడిగిన నావివరాలు త్రిపురాంతక గోపురంబని పలుకుటయు నాశివభవనంబు జూడ నొల్లక మైనపు జల్లు కప్పించుకొనియె. అప్పుడు రంగనాథుని నేత్రంబులు గానరాక జాత్యంధుని వలెనే మగిడి శ్రీరంగానకుపోయి యద్దేవుని బ్రనస్నుని జేసికొని నేత్రంబులు పోయెనని మొఱయాడుటయు, నద్దేవుండు కరుణించి త్రిపురాంతక దేవుణ్ణి వేడుకొమ్మనుటయు రంగనాథుండు మళ్ళీ త్రిపురాంతకమున కేతెంచి యద్దేవునకు నమస్కరించి తనయెత్తుకృతులు నమర్పింతు నని వ్రతంబు చేసి భక్తిమయంబగు రగడ చెప్పిన నద్దేవుండు ప్రసన్నుండై రంగనాథునకు నిరుకన్నుల నొసగుటయు రంగనాథుడు పాలకూర్తికిం జని సోమనాథునిచే శివదీక్షగైకొనియె. ఆయయ్యవద్ద శైవరహస్యంబులు తెలిసి కొనుచుండె. అంత నిక్కడ ప్రతాపరుద్రుండు రంగనాథుని ప్రభావంబువిని యాశ్చర్యంబు నొందెను.' రంగనాథుని గూర్చిన పైకథ నిన్ననో నేఁడో యెవరో సృష్టించి రని యుజ్జగింప వీలులేనిది.

vii

శ్రీనాథుని నమకాలవువాఁడగు కొలని గణపతిదేవుఁడు తన 'శివయోగ సారము' న చక్రపాణి రంగనకవి నిట్లు స్తుతించినాఁడు.

'అసమ శివభక్తి రసమా
నసునిం బాల్కురికి సోమనాథుని, గవిరా
జసమున్నతయశు సద్యః
ప్రసాది యగు చక్రపాణి రంగనఁ గొలుతుఁ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

viii

గురురాజకవి పద్యమున రంగనాథుఁడు నూరు తోటక వృత్తములను గూడ రచించినట్లు కలదు. ఛందో గ్రంథములలో రంగనాథుని తోటకము లివి రెండు కానవచ్చినవి.

బాలబోధచ్ఛందస్సులో

తోటకము ఉపవాసము లెల్లను నుండుట నీ

కృప వచ్చుట కా యది రిత్త సుమీ
యపవిత్రునిఁ బుల్లని యంబలికై
నుపవిత్రునిఁజేయుట సుద్ది గదే.

హనుమచ్ఛందస్సులో

తోటకము చెలువార గజాజినచేలముతో

గళనీలిమతో నహికంకణుఁడై
తలఁ జంద్రకళం గల దైవము మా
కులదైవము దైవతకోటులలోఁ

వీనిని బట్టి సిద్ధనంజేశకవి చెప్పిన తోటకవృత్తములను రంగనాథుఁడు రచించుట సమర్థిత మగుచున్నది.

రంగనాథుని యనుకరణము కావచ్చును. కాశీఖండమున శ్రీనాథుఁడు కూడ తోటకవృత్తరచనము చేసినాఁడు.

ix

బాలబోధచ్ఛందమున రంగనాథునిదిగా నీక్రింది కందపద్యముకలదు.

క॥ ఫాల తలభస్మ రేఖలు -

ఇది సమగ్రముగా లేదు. ఇది సిద్ధ నంజేశకవి పేర్కొన్న నూఱు కందములలోఁ జేరినదేమో!

x

ప్రయోగరత్నాకరములో రంగనాథుని మిత్రవిందాపరిణయములోని దిగా నీక్రింది పద్యభాగమున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"వనమాలి గొలుచు నందుననె యెల్లప్పుడు"

xi

పలువురు శివకవులు కవిస్తుతిలో రంగనాథుని శివకవినిగా స్తుతించినారు. మచ్చుకు ఒకటి.

భద్రకవి లింగకవి రంగనాథ ప్రశంస.

'దండితోఁ బండితత్రయముఁగీర్తించి
సకలవేదపురాణ శాస్త్రేతిహాస
నికరార్థములు ప్రమాణించి సద్భక్తి
శ్రీమతి నుద్ధరించిన పాలకుఱికి
సోమనాథేశ్వరు సొంపుతోఁ గొలిచి
రంగద్విశాలాంతరంగంబునందు
రంగనాథునిఁ గవిరాజ్యున్యుఁ దలఁచి
యసమానచరితుఁ బ్రత్యగ కల్యాణ
బసవేశుఁ బిడువర్తి బసవేశుఁ గొలిచి'

(సానందోపాఖ్యానము)

xii

వైష్ణవుఁడైన చక్రపాణి రంగనాథుఁడు శైవుఁడై రంగకవి యయినాడు. ఇట్లే శైవుడైన తెనాలిరామలింగకవి వైష్ణవుఁడై రామకృష్ణుఁడయినాఁడు.

xiii

రంగనాథుని పద్యములుగా ప్రబంధ రత్నావళిలో నీపద్యము లున్నవి. ఇవికూడ (శ్రీశైల మల్లికార్జున) శివ స్తవపరములేకాన, పయి రంగనాథుని రచనము లేయగుట సుస్పష్ట మయినది.

అదలనితేరు తేరునకు నాదరువై తగు విల్లు వింటికిం
గుదురగు నారి నారిపయిఁ గూన్కు శరంబు శరంబు బొడ్డునం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బొదలిన యంత యంతముఖముల్ నిజవాసములైన గుబ్బముల్
చెదరక నీకు నెట్టి పని సేయు నయా ! గిరిజాధినాయకా !

ఓజు చేముట్టక యెగ్గానఁ బట్టక
చక్కఁగా దివిఁబాఱు చక్రములును
లాయానఁ గట్టక లలి మేఁత వెట్టక
వర్ణహీనంబైన వారువములు
తవన వెట్టక జీవితము కాసు ముట్టక
సత్త్వ సంపదఁ జూపు సారథియును
కడచీలఁదట్టక ఘనముగా మెట్టక
గంభీర సంపద గలుగు నిరుసుఁ
గలిగి తనరారునరదంబుఁ గడఁక నెక్కి
త్రిపురవిజయంబుఁ జేకొన్న దేవదేవుఁ
డిందు శేఖరుఁడానంద మందిరుండు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత !
గోశత పంచవార్ధులును గోయుగవార్ధులు గోత్రివార్ధులుం
గోశరవార్ధులుం విదితగోశర (వార్ధులు) పంచవార్ధులా
కేశవతల్ప పద్మభవ కేకిపవాహన దానవేశ దే
వేశుల కిచ్చునట్టి పరమేశ్వరుఁడీవుత మాకభీష్టముల్.

xiv

పొత్తపి వెంకటరమణకవి రచించిన లక్షణశిరోమణి యను లక్షణ గ్రంథములో 'అచ్చవెల్లి రంగన్నగారు' అనుపేర రంగనాథ రామాయణ ద్విపదలుదాహరింపఁబడినవి.

* శివభక్తి దీపిక
(నయనరగడ)

శ్రీ పార్వతీశుఁజూడక
పాపాత్ముఁడ నగుచుఁ బోవఁ బథమునఁ జక్షుల్

* దీనికి మాతృక మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁగలదు. "ప్రవాళం వీరసంగయ్య వ్రాసిన నయనరగళె" అని గ్రంథాంతమునఁ గలదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

దీపించు దృష్టి తొలఁగిన
శ్రీపతి నడుగంగఁ గర్త శివుఁడని చెప్పెన్

రగడ

శ్రీశైలవల్లభుని శిఖరంబుఁ బొడగంటి
కాశీపురాధీశు గౌరీశుఁ బొడగంటి
సర్వలోకేశ్వరుని సర్వేశుఁ బొడగంటి
సర్వసంరక్షకుని సర్వంబుఁ బొడగంటి
పరమాత్ము నీశానుఁ బరమేశుఁ బొడగంటి
పరమ యోగీంద్ర హృత్పదనిలయుఁ బొడగంటి
చంద్రార్క శతకోటి సంకాశుఁ బొడగంటి
చంద్రార్క శిఖినేత్రు శంకరునిఁ బొడగంటి
రూపింపఁ బ్రకటస్వరూపంబుఁ బొడగంటి
నాపరంజ్యోతియై యమరుదేవునిఁ గంటి
వేదంబు లీశ్వరుని వినుతింపఁ బొడగంటి
నాదిదేవుఁడు రుద్రుఁడని శ్రుతులఁ బొడగంటి
శ్రుతి 'యేక ఏవ రుద్రో' యనఁగఁ బొడగంటి
శ్రుతి 'పరంబ్రహ్మ' మని ఘూలిఁబల్కుటఁగంటి
ముక్కంటికై శ్రుతుల్ మ్రొక్కఁగాఁ బొడగంటి
ముక్కంటిలీలచే మ్రోయుచుండఁగఁ గంటి
భర్గుఁడే తత్పరాత్పరుఁడనఁగఁ బొడగంటి
భర్గుఁ డర్కునిలోనఁ బ్రభ వెలుంగుటఁగంటి
బ్రహ్మాండములకోట్లు భర్గులోఁ బొడగంటి
బ్రహ్మాండమాలికా భరణ భూషితుఁగంటి
విశ్వరూపంబైన విశ్వేశుఁ బొడగంటి
విశ్వచక్షుని విశ్వవేద్యు నభవునిఁ గంటి
మూఁడు మూర్తుల కాదిమూర్తి దేవునిఁగంటి
మూఁడు మూర్తులలోన ముక్కంటిఁ బొడగంటి
నష్టమూర్తుల కీర్తు లమరంగఁ బొడగంటి

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri
CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిష్టభోగములెల్ల నిచ్చు వేల్పనికంటి
నజ్ఞానతిమిర సంహారసూర్యునిఁ గంటి
సుజ్ఞాన సంశీల సులభ మోక్షముఁ గంటి
నక్షరత్రయరూప మక్షయునిఁ బొడగంటి
దక్షాధ్వరధ్వంసధన్య వేషునిఁ గంటి
విమలాత్ము నాద్యంత విరహితునిఁ బొడగంటి
గమలలోచన నయనకమల పూజితుఁ గంటి
వృషభేంద్రవాహనుని విషకంఠుఁ బొడగంటి
వృషభధ్వజుండైన వేదవేద్యునిఁ గంటి
ధవళసంకాశంబు దశబాహుఁ బొడగంటి
భవదుఃఖ సంహారుఁ బంచవదనునిఁ గంటి
పురవైరి నంధకాసురవైరిఁ బొడగంటి
కరివైరిఁగంకాళ కరధాముఁ బొడగంటి
గారుణ్య సాగరునిఁ గల్యాణుఁ బొడగంటి
నారాయణప్రియుని నాగకంకణుఁ గంటి
మహినొప్పు శ్రీశైల మహిమ నేఁ బొడగంటి
బహువేద శాస్త్రముల్ ప్రణుతి సేయుటఁగంటి
భూలోకకైలాస పుర మనఁగఁ బొడగంటి
ఫాలాక్షుఁడచ్చోటఁ బాయకుండుటఁగంటి
ధృతిఁ బూర్వ మొగసాల త్రిపురాంతకముఁ గంటి
నతులజ్యోతిర్లింగ మట యామ్యమునఁ గంటి
బలు పశ్చిమద్వార బ్రహ్మేశ్వరముఁ గంటి
జెలువొందు నుత్తర శ్రీమహేశ్వరుఁ గంటి
క్షితి లక్షకోట్లకును శివతీర్థములు గంటి
చతురొప్పఁ బదికోట్ల శక్తిరూపులఁ గంటి
దివ్యస్థళంబులను దివ్యులను బొడగంటి
దివ్య యోగీంద్రులను దివ్యమహిమలఁ గంటి
రంగొందు పాతాళగంగ నేఁ బొడగంటి
గంగ పాతాళంబు గంగఁ గలియుటఁ గంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గంగలోఁ ద్రిజగముల్ గదలకుండుటఁ గంటి
గంగలో సురమునులు గదలకుండుటఁగంటి
బుణ్య కుండము లెల్లఁ బొలుపారు నని కంటిఁ
బుణ్యజలములతోడఁ బొసఁగఁ ధారలు గంటి
నరి నొప్పు బంగారు శైలంబుఁ బొడనంటిఁ
బరికింప నవరత్న పర్వతంబులు గంటి
నెనసి యోగస్థలము లెల్లచోఁ బొడగంటి
ఘనబిలంబులు గుహలు గహ్వరంబులు గంటి
కామరూపుల గిరులఁ గణఁకతోఁ బొడగంటి
కామ రూపులనున్న కల్పతరువులఁ గంటిఁ
జరపర్వతంబులును జరవృక్షములు గంటి
ధరణిఁ బ్రొద్దాకచాయ తరులు గిరులును గంటి
గిరులు నీడలులేక క్రిక్కిఱియఁ బొడగంటి
తరులు నీడలులేక తనరుచుండుటఁ గంటి
నీడ దిరుగని శైలనికరంబుఁ బొడగంటి
వృక్షమొక్కటి సర్వ వృక్ష ఫలములు గంటి
వృక్షమొక్కటి సర్వ వృక్ష జాతులు గంటి
నగపక్షి మృగతరులు నాట్యమాడుటఁ గంటి
నగపక్షి మృగతరులు నాథుఁ గొల్చుటఁ గంటి
నరసురాసురు లుమానాథుఁ గొల్చుటఁ గంటి
హరివిధీంద్రాదు లట నభవుఁ గొల్చుటఁ గంటి
రుద్రుఁ గొల్చినపెక్కు రుద్రులను బొడగంటి
రుద్రగణముల వివిధరూపధారులఁ గంటి
రూడి తపములు సేయు ఋషులనేఁ బొడగంటి
కూడి మ్రోసెడు వేదఘోషంబుఁ బొడగంటి
సురదుందుభుల మ్రోఁత సొంపారఁ బొడగంటి
సురసతులు నాట్యంబు సొరిది నాడుటఁ గంటి
నాంగికమ్ముగ నాడు భృంగీశుఁ బొడగంటి
సంగీతనాదములు సకలదిక్కులఁ గంటిఁ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బరగ శ్రీశైలంబు భావమునఁ బొడగంటి
దురితంబు లన్నియును దొలఁగి పోవుటఁ గంటి
శ్రీపర్వతేంద్రంబు శిఖరంబుఁ బొడగంటి
శ్రీపార్వతీనాథుఁ జేరికొల్చుటఁ గంటి
నాదివ్యలింగంబు నర్చింపఁ బొడగంటి
మోదమున సాయుజ్య ముక్తి నీయఁగ గంటిఁ
బర్వతలింగంబుఁ బ్రాణేశుఁడని కంటిఁ
బర్వతేశ్వరుహృదయ పద్మనిలయునిఁ గంటి
శ్రీకంఠు శ్రుతివచ శ్శితికంఠుఁ బొడగంటి
లోకేశు నిజభక్త లోకేశుఁ బొడగంటి
నజు నజరు నమరు నవ్యయు నీశుఁ బొడగంటి
గజకృత్తిధరు దయాకరు జగద్గురుఁ గంటిఁ
గ్రతువైరిఁ బురవైరిఁ గామారిఁ బొడగంటిఁ
బతి నుమాపతి నాదిపతి లోకపతిఁ గంటిఁ
బతి సర్వపతి దేవపతి యీశుఁడని కంటిఁ
బతిభక్తులకు నాదిపతి శంభుఁడని కంటి
నతికాముఁ బ్రతికాము నవిలోముఁ బొడగంటి
నతిశుద్ధు నతిబుద్ధు నతిబౌద్ధు బొడఁగంటి
శివకథామర్మములు శివధర్మములు గంటి
శివమూల మంత్రములు శివతంత్రములు గంటి
తారకబ్రహ్మంబు తత్త్వంబుఁ బొడగంటి
హార కర్పూర నీహారాద్రి విభుఁ గంటి
నిర్వాణ నిస్సీమ నిష్పాపరుచిఁ గంటి
దుర్వార దుస్పార దుర్భేదహరుఁ గంటి
ప్రణవాది మంత్రప్రపంచంబుఁ బొడగంటి
నణిమాది గుణదూర మగువీథిఁ బొడగంటి
షట్తర్క షట్కర్మ షట్చక్ర గతిఁ గంటి
షట్త్రింశ దుత్తర స్థలలక్షణముఁ గంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అక్షరత్రయరూప మగునబ్ధిఁ బొడగంటి
నక్షరాంబుధిలోన నమృతంబుఁ బొడగంటి
నక్షరగ్రామంబు లందైదు పొడగంటి
నక్షరపు లక్షణములన్నియు బీడగంటి
నమితశబ్దబ్రహ్మ మంతయును బొడగంటి
విమలశబ్దబ్రహ్మ విభవమేర్పడఁ గంటి
చోర నవసరములేక శ్రుతు లున్కిఁ బొడగంటి
హరతత్త్వ నిరతులై యతులున్కిఁ బొడగంటిఁ
గర్మంబు లందు డగ్గఱరామిఁ బొడగంటి
ధర్మముల్ తమత్రోవ తలపింపఁ బొడగంటి
శివభక్తి సంసార సీమదాఁటుటఁ గంటి
నవివేకులకు భక్తి యలవికాదని కంటి
నొగి నభవులో లోక ముదయింపఁబొడగంటి
నగణిత క్రతుశైవ మది దైవమని కంటి
నిర వొప్పు హరతత్త్వమే యంద మని కంటి
హరతత్త్వ మక్షీణ మానంద మని కంటి
రుసులెల్ల శైవస్వరూపులని పొడగంటి
విస మమృతమునుజేయు విమలచిత్తులఁ గంటి
బసవన్న నన్నేలుభర్తగాఁ బొడగంటి
బసవన్న మాపాలిపరమేశుఁ డని కంటి
బసవాక్షరత్రయము పావనం బని కంటి
బసవన్న భక్తులగఁ బరుసవే దని కంటి
బసవా యనినఁ బాయుఁ బాపంబు లని కంటి
బసవా యనిన మోక్షపద మబ్బు నని కంటి
కడఁగి కన్నపఁ డీశుఁ గాలఁ దన్నుటఁ గంటి
జడలతో గండూషజలము లుమియుటఁ గంటి
మిఱుమిండఁ డెంతయును మేటియని పొడగంటి
గఱకఁఠుపై గినిసి గంటివేయుట గంటి
ధరణి వేశ్యయు నంబి తర్కింపఁ బొడగంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిరువురకుఁ బరమేశుఁ డెదుర నిల్చుటఁ గంటి
గొడుకుఁ జంపినఁ గాని కుడువ నను పతిఁ గంటి
నెడరు దిరిగిన కంచి యేడు వాడలు గంటిఁ
గొడుకుతోడనె కూడి కొని పోవఁ బొడగంటి
భల్లాణుపత్నిఁ దాపసుఁడు వేఁడుటఁ గంటి
నిల్లాలి భల్లాణుఁ డిచ్చి మ్రొక్కుటఁ గంటి
గళకంఠునకు నక్కగారు దక్కుటఁ గంటి
నెళుకయై శ్రీశైల మెక్కుడిగ్గమిఁ గంటి
మతిమంతు మడివాలు మాచధీమణిఁ గంటిఁ
జతురుఁడై యేనుఁగును జావ నుదుకుటఁ గంటి
భక్తు లప్రతిహత్య ప్రథిత మతులని కంటి
భక్తులకుఁ బ్రత్యర్థిపరులు లేరని కంటి
భక్తు లాపదలచేఁ బట్టువడ రని కంటి
భక్తులకు నెందు నాపదలు లేవని కంటి
భక్తు లహికేయూర పద బద్ధు లని కంటి
భక్తు లతి నిర్వాణ పదసిద్ధు లని కంటి
భక్తులు జగత్త్రాణ పదలోలు రని కంటి
భక్తులు సదానంద పదశీలు రని కంటి
భక్తు లే పదవులును బడయ నొల్లమిఁ గంటి
భక్తులకు నేరుచుల్ భక్తిఁ బోలమిఁ గంటి
భక్తు లద్భుతకర్మ పారీణు లని కంటి
భక్తు లద్భుత పుణ్యఫలభాగులని కంటి
భక్తుల కుమాభర్త ప్రాణంబులని కంటి
భక్తు లుద్భట దోషభవ ముక్తు లని కంటి
భక్తు లసదృశభోగ భాగ్యైకు లని కంటి
భక్తు లిహపరభోగ భాగ్యైకు లని కంటి
శివభక్తు లక్షర శ్రీకరము లని కంటి
శివభక్తు లాచారశేఖరము లని కంటి
శివభక్తి దూషకులు చిరపాపు లని కంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శివభక్తి దూషకులు చెడిపోదు రని కంటి
శివభక్తి కల్యాణసీమ దాఁటుట గంటి
శివభక్తి యభిమత స్థితికర్త యని కంటి
శివభక్తి శత్రులకు శివము లేదని కంటి
శివభక్తి మిత్రులకు శివసౌఖ్య మని కంటి
నిశ్చలము భక్తులకు నెఱయఁ జేకుఱఁ గంటి
దుశ్చరిత భక్తులకుఁ దొలఁగించు నని కంటి
త్రిభువనము భక్తులకుఁ దృణకణము లని కంటి
సభలందు భక్తులకు జయవాద మని కంటి
భక్తియే వేదములు పడయలే వని కంటి
భక్తియే వాదముల్ పడయలేవని కంటి
భక్తి యింద్రాదులును బడయలేరని కంటి
భక్తి సూర్యాదులును బడయలేరని కంటి
భక్తి బ్రహ్మాదులును బడయలేరని కంటి
భక్తి విష్ణ్వాదులును బడయలేరని కంటి
భక్తి సత్యముచేతఁ బ్రభవించు నని కంటి
భక్తిరుచి సద్ గుణప్రారంభ మని కంటి
భక్తి గురుకారుణ్య ఫలమూల మని కంటి
భక్తి చాతుర్వర్గ ఫలదాయి యని కంటి
భస్మధారికిఁగాని భక్తి లేదని కంటి
భస్మంబు భక్తియును బావనం బని కంటి
భస్మ ముత్తమలోక పాథేయ మని కంటి
భస్మ త్రిపుండ్రంబు పరమార్థ మని కంటి
భస్మంబు శ్రుతులెల్లఁ బాటించు నని కంటి
భస్మంబు యోగసంపద మూలమని కంటి
భస్మంబు సర్వసంపత్కరం బని కంటి
భస్మంబు శివయోగ ఫలవృక్ష మని కంటి
భస్మ మిహపరములకుఁ బట్టుఁగొమ్మని కంటి
భస్మంబు మాపాలి పరమేశుఁ డని కంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భస్మంబు త్రైలోక్య పావనం బని కంటి
భస్మంబు కర్మాబ్ధి బాడబం బని కంటి
భస్మంబు ఋషులెల్ల భక్తిఁ దాల్చుటఁ గంటి
భస్మంబు హర్యజులు భక్తిఁ దాల్చుటఁ గంటి
రుద్రాక్ష రుద్రనేత్రోద్భవంబని కంటి
రుద్రాక్ష రుద్రస్వరూప మని పొడగంటి
రుద్రాక్ష వేదముల రూపుబల్కుటఁ గంటి
రుద్రాక్ష బ్రహ్మాది రుసులు గట్టుటఁ గంటి
రుద్రాక్ష భవగజముద్రుంచునని పొడ గంటి
రుద్రాక్ష పాపములు రోలఁ దోలుటఁ గంటి
రుద్రాక్ష పుణ్యములు రొక్క మిచ్చుటఁ గంటి
రుద్రాక్ష జపమునకు రుద్రుఁ డౌననఁ గంటి
రుద్రాక్ష ధరుఁడు శ్రీరుద్రుఁ డౌనని కంటి
రుద్రాక్ష ఫలమహిమ రుద్రుఁ డిచ్చుటఁ గంటి
సకల నిష్కళమంత్ర సంబంధ మని కంటి
సకలంక మగుమంత్ర మపవర్గ మని కంటి
పాదతీర్థముఁ ద్రావఁ బాపహర మని కంటి
పాదతీర్థముఁ ద్రావ ఫల మెక్కుడని కంటి
పాదతీర్థము వేద భక్తిరస మని కంటిఁ
పాదతీర్థము తీర్థ ఫలసార మని కంటిఁ
పాదతీర్థముఁ ద్రావ భవహరంబని కంటి
ధరఁ బ్రసాదస్థలము తలఁపలేనని కంటి
సరిఁ బ్రసాదస్థలము చవి యెఱుంగుటఁ గంటి
సెలకొని ప్రసాదంబు నిలువ రాదని కంటి
మలసి ప్రసాదంబు మలహరం బని కంటి
గొనకొని ప్రసాదంబు కుడువవలె నని కంటి
పనిగొని ప్రసాదంబు భవహరంబని కంటి
గుమతి ప్రసాదంబు కుడువరాదని కంటిఁ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విమల ప్రసాదంబు విడువరాదని కంటిఁ
దెలియరు ప్రసాదంబు తెఱఁగజ్ఞులని కంటి
మలదేహికిఁ బ్రసాద మలవి కాదని కంటి
మునుకొని ప్రసాదంబు ముట్టరా దని కంటి
దనియరు ప్రసాదంబు తత్వజ్ఞు లని కంటి
నెనయ రుచు లీశునకు నీవలయు నని కంటిఁ
గొనకొనక నిల్చి మఱి కొనవలయు నని కంటి
ననువినము నర్పించు నాతఁ డతఁడని కంటిఁ
బెనఁగి ప్రసాదంబుఁ బెట్టరా దని కంటి
భర్గోపకృతులు సద్భక్తులని పొడగంటి
స్వర్గాది భోగముల్ సరకుగావని కంటిఁ
గలదులే దనరాదు కైవల్య మని కంటిఁ
గల దన్న చోటనే కలఁ డీశుఁ డనికంటి
తత్త్వంబు లారుద్రుఁ దడవలే వని కంటి
సత్త్వాది గుణకోటి సంఖ్య కేమని కంటి
నఖిలేశునకు నాది యరయరాదని కంటి
నఖిలైక్యునకు నంత్య మరయరా దని కంటి
నఖిలేశునకు నెక్కు డరయలే దని కంటి
నఖిలాండ నాయకుం డాది యని పొడగంటి
నఖిలంబు బుట్టించు నభవుఁ డని పొడగంటి
నఖిలంబు హరునందు నణఁగునని పొడగంటి
సంసార హరమైన సర్వేశుఁ బొడగంటి
హింసకులు వడయలే రిహపరము లని కంటి
నచరాచరానేక జగదుద్భవముఁ గంటి
నచరంబున జగమ్ము లన్నియును బొడగంటి
కాదహంకారమమకారంబుఁ బొడగంటి
లేదితర పరతత్త్వ లేశంబుఁ బొడగంటి
నత్యద్భుతాకారం మాకార మని కంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రత్యక్ష మానంద పాకంబుఁ బొడగంటిఁ
బుణ్యపాపము లీశుఁ బొందనేరమిఁ గంటి
గణ్యముల్ శ్రుతు లీశుఁ గాననేరమిఁ గంటి
వేదము లుమానాథు వెదకి కానమిఁ గంటి
నాదిదేవుఁడు శంభుఁడని శ్రుతులఁ బొడగంటిఁ
బంచవింశతిమీఁదఁ బతి రుద్రుఁడని కంటిఁ
బంచాశదక్షర ప్రభవంబుఁ బొడగంటి
నీలోకనిర్వాహ మీశానుఁ డని కంటి
నీలోకసన్నాహ మీశానుఁడని కంటి
నీలోకనిస్తార మీశానుఁ డని కంటి
నీలోకనిర్వాణ మీశానుఁ డని కంటి
బ్రహ్మాది సురలెల్లఁ బశువులని పొడగంటి
బ్రహ్మ విష్ణ్వాదులకుఁ బతి రుద్రుఁడని కంటి
బ్రహ్మ విష్ణువుల కౌ వాదంబుఁ బొడగంటి
బ్రహ్మపద మిద్దఱునుబడసి కానమిఁ గంటి
నంత లోకప్రభువు నరచేతిలోఁ గంటి
జింతించు భక్తులకు శివుఁడు లోనని కంటి
శివభక్తి తుదముట్టఁ జేరఁగాదని కంటి
శివభక్తి తుదిముట్టఁ జేరలేనని కంటి
శివభక్తి శ్రుతులకాశ్రిత మగుట పొడగంటి
శివభక్తి నతులకాశీర్వాదమని కంటి
నాసనన్యాస కరణాతీతుఁ బొడగంటి
దాసోహ మనుత్రోవ తల నున్న శివుఁ గంటి
ద్రోహు లద్వైతులకుఁ దొలఁగి పోవుటఁ గంటి
దేహ దోషాతీత దివ్యభోగముఁ గంటి
సుఖదుఃఖములు శివుని సోఁకనేరమిఁ గంటి
నఖిలబీజములు సోమాదిత్యులని కంటి
నారెండు వెలుఁగులే హరుకన్నులని కంటి
గౌరీశుఁడే సర్వ కర్త యనఁగాఁ గంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గారుణ్యమున శివుఁడు కనుపించె నని కంటి
కఱకుమాటల భక్తిగలుగ నేరమిఁ గంటి
నెఱుఁగరా దెవ్వరికి నీశాను నని కంటి
మనదధీచుని దక్ష మఖమునను బొడగంటి
బెనుపొంద శ్రుతుల శాపించి విడుచుటఁ గంటి
బరగ శివమంత్రంబు ప్రబలిపొందుటఁ గంటిఁ
బరికింప శివభక్తి పదమెక్కు డని కంటి
శరధిఁ దరువఁగ సద్విషాగ్ని పొంగుటఁ గంటి
సురలెల్ల గరళంబుఁ జూచి పాఱుటఁ గంటి
గరళ మప్పుడు లోకకర్త మ్రింగుటఁ గంటి
గరకంఠనామంబు గణుతి కెక్కఁగఁ గంటి
క్షేమదస్ఫుట సౌఖ్యఖేటంబుఁ బొడగంటి
సోమ ఖండాఖండ జూటంబుఁ బొడగంటి
భరిత నయనాభీల ఫాలంబుఁ బొడగంటి
సురుచిర స్ఫుటజైత్ర శూలంబుఁ బొడగంటి
క్రతుహరుని శుద్ధ సంకాశంబుఁ బొడగంటి
జితగజాజిన మహాచేలంబుఁ బొడగంటి
గురుమౌళి సురసరిత్కూలంబుఁ బొడగంటి
గిరిసుతా తనుభాగకీలంబుఁ బొడగంటి
నతిసుందరాకార మాది వృషభునిఁ గంటిఁ
రతిరాగ భస్మాంగరాగంబుఁ బొడగంటి
గురుకుచము కచము ననుకూలంబుఁ బొడగంటి
హరినేత్ర పూజితుని నాదిమూలముఁ గంటిఁ
బరికింప నాలోని పాపంబు కడ గంటి
నరసిపాపము నన్ను నంటరాదని కంటి
బహుపాపధరుఁ డేల భక్తుఁడౌనని కంటి
బహుపాపములు నన్నుఁ బట్టి విడుచుటఁ గంటి
నయముగా నయనములు నాకీయఁ బొడగంటి
భయభక్తి నీభర్గు పాదములు పొడగంటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిది పుణ్య మనికంటి నిది గణ్యమని కంటి
నిది యోగ మనికంటి నిది భోగమని కంటి
నిది ధర్మ మనికంటి నిది మర్మ మని కంటి
నిది నిత్య మనికంటి నిది సత్య మనికంటి
నిది పుణ్యములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది గణ్యముల కెల్ల నెక్కుడని పొడగంటి
నిది యోగముల కెల్ల నెక్కుడని పొడగంటి
నిది భోగముల కెల్ల నెక్కుడని పొడగంటి
నిది ధర్మముల కెల్ల నెక్కుడని పొడగగంటి
నిది మర్మముల కెల్ల నెక్కుడని పొడగంటి
నిది నిత్యముల కెల్ల నెక్కుడని పొడగంటి
నిది సత్యముల కెల్ల నెక్కుడని పొడగంటి
కణఁగి సంసారంబు కడగంటి నని గంటి
గణఁగి శ్రీగిరి చెన్ను కారుణ్య మని కంటి
ఘనుఁడు రంగన దూషకర గండఁడని కంటి
జనకల్ప తరులతో జయశాలి యని కంటిఁ
దవిలి రంగనమంత్రి ధన్యకృతి యని కంటి
భువిలోనఁ బ్రోలాంబ పుణ్యవతి యని కంటి
నింక శ్రీగిరిఁ జేర నేఁ గందు నని కంటి
శంకరుని కృప వడయ సమయమిది యని కంటి
నిఁకను నాయెత్తు కృతు లిత్తు నని పొడగంటి
నిఁకఁగృతుల్ చెప్ప నా కేమి భరమని కంటి
వడిఁగృతుల్ నాయెత్తు వచ్చునని పొడగంటి
మృడుఁ డింక నాకృతుల్ మెచ్చునని పొడగంటి
దనర శ్రీరంగకవి దాత యని పొడగంటి
భువిలోపలఁ బ్రసిద్ధ పుణ్యుఁ డనఁగాఁ గంటి
శివభక్తి దీపి కాశితాంశువని కంటి
శ్రీగిరీశునకు నర్పింతు నని పొడగంటి
శ్రీగిరీశ్వరునికృప చెన్నలరు నని కంటి.

మంగళ మహాశ్రీ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

*శివమంత్ర వర్ణనము.

(నమశ్శివాయరగడ)

క॥ శ్రీకాము లతుల కీర్తి
శ్రీకాము లుమాధినాథచిత్తానంద
శ్రీకాములు సద్భక్తిం
జేకొనుఁడు 'నమశ్శివాయ' చెప్పెద మీకున్.

నమశ్శివాయ

శ్రీగిరీశ వశ్యమంత్ర శేఖరము నమశ్శివాయ
అగ మోపదిష్ట విధి మహాఖరము నమశ్శివాయ
పంచవర్ణ పంచరూప భాసురము నమశ్శివాయ
అంచి తానురక్త జిత గజాసురము నమశ్శివాయ
సునిశితోపనిష దధీత సుస్వరము నమశ్శివాయ
కన దనూన భక్తిరస వికస్వరము నమశ్శివాయ
పాతలౌకికప్రధాన భాషణము నమశ్శివాయ
భూరిపుణ్య హేతుభూత భూషణము నమశ్శివాయ
సతత జన్మ దాహ దగ్ధ చందనము నమశ్శివాయ
నత విశిష్ట భక్తబృంద నందనము నమశ్శివాయ
శ్రుతిశిర స్సహస్ర రత్న సుందరము నమశ్శివాయ
మత కుతర్క శరధి మథన మందరము నమశ్శివాయ
దారువన మునీంద్ర ముఖ్యధర్మదము నమశ్శివాయ
దూర దూర హత నికృష్ట దుర్మదము నమశ్శివాయ
తరుణ చంద్ర జూట దర్ప దర్పణము నమశ్శివాయ
హరణ భరణ శక్తి కృత సమర్పణము నమశ్శివాయ
పరమభక్త మహిత హిత విభావనము నమశ్శివాయ
చిరతరప్రభావ భావ జీవనము నమశ్శివాయ

---

* శ్రీకాళహస్తి రాజాగారి తాటాకు గ్రంథములలో కాళహస్తి మహాత్మ్య (ధూర్జటిముద్దియాకులలోనున్న గ్రంథము. ఈ తాటాకువ్రాతప్రతి. శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన పుస్తకాలకాలయమున నున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వామదేవ తత్త్వ లేశ వాచకము నమశ్శివాయ
సోమపాన ఫల సహస్ర సూచకము నమశ్శివాయ
నరకహర విశిష్టమంత్ర నాయకము నమశ్శివాయ
ధరణీసుర సుధీ విధా విధాయకము నమశ్శివాయ
దారుణాధి జలధిమగ్న తారకము నమశ్శివాయ
కారణ ప్రధాన వస్తు కారకము నమశ్శివాయ
బాఢపాప ఘోరకృత్య పాచకము నమశ్శివాయ
మూఢ గూఢ మోహబంధ మోచకము నమశ్శివాయ
కర్మదోష హరవిచార కారణము నమశ్శివాయ
ధర్మ మర్మ మూలమంత్ర ధారణము నమశ్శివాయ
ప్రస్తవ ప్రశస్త భరణ పండితము నమశ్శివాయ
మస్తకాయమాన విభవ మండితము నమశ్శివాయ
రక్త భక్త నిత్య సత్య రక్షణము నమశ్శివాయ
భక్త లోక హృదయశోక భక్షణము నమశ్శివాయ
భజనధన్య సుజన వజ్రపంజరము నమశ్శివాయ
కుజనదృష్టి దోషకంజ కుంజరము నమశ్శివాయ
సర్గదుష్ట దుష్టచిత్త శాసకము నమశ్శివాయ
భర్గరూప దుర్గలసదుపాసకము నమశ్శివాయ
పురభి దభిమతానురక్త పోషకము నమశ్శివాయ
సురభవన కళంకపంక శోషకము నమశ్శివాయ
పాశుపత పథ ప్రవృద్ధ పాలనము నమశ్శివాయ
క్లేశ పాశ వలన దళన ఖేలనము నమశ్శివాయ
యోగిహృదయ సదయ జల పయోధరము నమశ్శివాయ
భోగిభూష పక్షవిభవ భూధరము నమశ్శివాయ
దురితహత నికృష్టదుష్ట దుర్భరము నమశ్శివాయ
నిరతిశయ దయాశమాది నిర్భరము నమశ్శివాయ
భవవిపినాపౌక్ష దహన పాటవము నమశ్శివాయ
కవిముఖప్రసిద్ధ నియమ కౌటవము నమశ్శివాయ
నికటపుణ్య తంత్రనిచయ. నిశ్చయము నమశ్శివాయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రకటధీర భావభర తపశ్చయము నమశ్శివాయ
భూతనాథ చరణకమల పూజనము నమశ్శివాయ
ప్రాతతప్రశస్తవస్తు భాజనము నమశ్శివాయ
శోషణాది శుద్ధికరణ శోధితము నమశ్శివాయ
పోషితాగమ ప్రమేయ బోధితము నమశ్శివాయ
ప్రసవశరవికార భావభంజనము నమశ్శివాయ
రసికభక్త రాజలోకరంజనము నమశ్శివాయ
కలుషగజనికాయ సింహగర్జనము నమశ్శివాయ
వలభిదాది చపలభజన వర్జనము నమశ్శివాయ
శరణగణ గణాధినాథ శాతనము నమశ్శివాయ
నరసురేశవినుతనత పనాతనము నమశ్శివాయ
ఘనఘనాఘచండ విపినఖండనము నమశ్శివాయ
మననమథిత శివరహస్యమండనము నమశ్శివాయ
కుతలజాత భర్గరూప గురువనము నమశ్శివాయ
తతఫలప్రదాన కల్పతరువనము నమశ్శివాయ
మారమథన పరులలోని మంతనము నమశ్శివాయ
చేరిశివుని(గొలుచువారి చింతనము నమశ్శివాయ
కలయ వెదకి శ్రుతులు దొలుత(గన్నయది నమశ్శివాయ
ఒలసి మంత్రకోటి గొలువ నున్నయది నమశ్శివాయ
నరకలోకవాసికైన నాకదము నమశ్శివాయ
నిరసమతికి నైన నురువివేకదము నమశ్శివాయ
అల్పపుణ్యమతుల కెందు నందనిది నమశ్శివాయ
కల్పకోటి శతపఃలందు(గందనిది నమశ్శివాయ
పురహరునకు మొదల(మొదల(బుట్టినది నమశ్శివాయ
పరమధర్మ నిరతు లర్థి(బట్టినది నమశ్శివాయ
శివు(డజాది సురలకెల్ల(జెప్పినది నమశ్శివాయ
కవసి వాసవాది సతుల(గప్పినది నమశ్శివాయ
దురితహరు(డు దొడవుగా(గ(దొడిగెడిది నమశ్శివాయ
కరణదుఃఖ మలిన హతుల(గడిగెడిది నమశ్శివాయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఓరవోక సర్వసమితి నుండెడిది నమశ్శివాయ
పారిజాతఫల సమృద్ధిఁ బండెడిది నమశ్శివాయ
దురితవితతిఁ దూరుపాఱఁ దోలెడిది నమశ్శివాయ
వరము లోలి నిచ్చుచోట వ్రాలెడిది నమశ్శివాయ
మునుల ఘనులు మించితలఁచి మ్రొక్కెడిది నమశ్శివాయ
ఇనశశిశిఖినయనవీధి నెక్కెడిది నమశ్శివాయ
ఓటలేక పుణ్యపథము లూటెడిది నమశ్శివాయ
మేటిసుకృతకోటి నెల్ల మీటెడిది నమశ్శివాయ
తిర మిడుకొని విబుధవరులఁద్రిప్పెడిది నమశ్శివాయ
గురుముఖప్రదత్తమగుచుఁ గ్రొప్పెడిది నమశ్శివాయ
బహువిధప్రమాదములను బాపెడిది నమశ్శివాయ
సుహితపుణ్య భోగపంక్తిఁ జూపెడిది నమశ్శివాయ
మూల మీనమశ్శివాయ ముఖ్య మీనమశ్శివాయ
శీల మీనమశ్శివాయ శిఖర మీనమశ్శివాయ
సుపథ మీనమశ్శివాయ శుద్ధ మీనమశ్శివాయ
నిపుణ మీనమశ్శివాయ నిత్య మీనమశ్శివాయ
గగన మీనమశ్శివాయ గర్త మీనమశ్శివాయ
నిగమ మీనమశ్శివాయ నిఖిల మీనమశ్శివాయ
వీర మీనమశ్శివాయ విమల మీనమశ్శివాయ
సార మీనమశ్శివాయ సౌఖ్య మీనమశ్శివాయ
ధనద మీనమశ్శివాయ ధన్య మీనమశ్శివాయ
జనన మీనమశ్శివాయ జన్య మీనమశ్శివాయ
యోగ మీనమశ్శివాయ యోగ్య మీనమశ్శివాయ
భోగ మీనమశ్శివాయ భోగ్య మీనమశ్శివాయ
సరస మీనమశ్శివాయ సత్య మీనమశ్శివాయ
పరమ మీనమశ్శివాయ బ్రహ్మ మీనమశ్శివాయ

కందము

ఈయష్టోత్తరశతము
బాయక పఠియించునతఁడు పరమానంద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీయుక్తుఁడు రైయుక్తుఁడు
ధీయుక్తుఁడు నైతనర్చు దివ్యమహత్తా.

చంపకము

నిమనరంగనాథుఁడు దయానిధి శ్రీగిరినాథుమీఁదఁ జె
ప్పిన శివమంత్రవర్ణనము చిత్తసముద్గత భక్తియుక్తి వ్రా
సినఁ గొనియాడినన్ వినినఁ జెల్వెసలారఁ బఠించినన్ జగ
ములకుఁబుణ్యసంపద లసంఖ్యములై సమకూరు నిమ్మహిన్.

[J. S. v.o.l Vol. VIII No.1
Jan-June, 1947
చాటుపద్య మణిమంజరి 1951
సింహావలోకనము : 1955]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శివయోగసారము - అవతరణిక

ఈ 'యవతరణిక' యింతవఱకు నేఁటిగ్రంథపరిశోధకు లెవ్వరు గానితడవి చూచినట్లగాఁ దోఁపదు. ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నీయవ తరణిక లేదు. బ్రౌను దొరగారు 'అనియాదిగణపతిదేవుఁడని' వ్రాసినదానినే శ్రీవీరేశలింగము పంతులుగారు కవులచరిత్రమున ననువదించిరి; గాని యస్వాసాంతగద్యములను వారు సరిగా బరిశీలింపరయిరి. మఱియుఁ బంతులుగారు దానిని మిక్కిలియర్వాచీనమైన కృతినిగాఁ గూడఁదలఁచిరి. కవులచరిత్రము తృతీయభాగమున దాని విషయముఁ జెప్పిరి. వారి వ్రాఁతను నమ్మి యాగ్రంథ మందాదరములేనివాఁడనై నేనును నక్కడక్కడఁ గాన వచ్చిన వ్రాఁతప్రతులను సేకరింపనయితిని! ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నాలుగుపుస్తకములున్నను నవి భిన్నప్రతులుగావు; సమగ్రములునుగావు. ఈ గ్రంథము వ్రాతఁప్రతులున్న స్థలములు కొన్ని నాకు జ్ఞప్తిలోఁ గలవు గాన వాని నిఁక సేకరింపఁబ్రయత్నింతును. ఈయవతరణికను దొలుత సేకరించి నందుకు మా మిత్రులు శ్రీవిశ్వనాథశర్మగారిని సంభావించుచున్నాఁడను.

శ్రీవీరభద్రరావుగా రీయవతరణికలోని ముఖ్యవిషయములను బెక్కం టిని బరిగణించిరి. నాకుఁ గానవచ్చిన విశేషవిషయములఁ గొన్నింటిని గూడఁ దెలుపుకొనుచున్నాఁడను.

౧

ఇందు వర్ణితులయిన కృతికర్తవంశమువారును, గృతిపతివంశము వారును ఆంధ్రారాధ్యబ్రాహ్మణులు. 'నూకనారాధ్యవరా' ఇత్యాదిసంబో ధనములు పెక్కులు గలవు. వీరు లింగధారులుగారు. కృతిపతియగు నూక రాధ్యుఁడును, దత్పితయగు నాగయయుఁ బాశుపతవ్రతులు. నాగయను గూర్చి "కాశిలోఁ గదలక పాశుపతవ్రతశీలుఁడై మోక్షమార్జించి మించె" ననియు, నూకయనుగూర్చి "కాశికాదేశముఖ్యప్రదేశములఁ జరించి కులకోటు లను నుద్ధరించెనట్టె" అనియు గలదు శివయోగసారము కడముట్టఁ జదివి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నను గూడ నెక్కడను లింగధారణము, కరపీఠార్చనము మొదలగువీర శైవాచారములు కానరావు. అంతరలింగార్చనము, పీఠలింగార్చనము నందుఁ జెప్పఁబడినవి. ఆంధ్రారాధ్యసంప్రదాయము వీరశైవసంప్రదాయముకంటె వేఱయినది యనియు, ఆంధ్రారాధ్యులు పాశుపతసంప్రదాయమువారనియు దీనివలనఁ గూడనిరూపితమగుచున్నది. మఱియు నేతత్కృతికర్తృ కృతిభర్తృ వంశములవారి కేలికలయిన కాకతీయగణపతిచక్రవర్తికి, రుద్రాంబికకుఁ, బ్రతాపరుద్రునకు విశ్వేశ్వరశివాచార్యుఁడును, దత్పుత్రుఁడు కాశీశ్వరశివాచార్యుఁడును ననువారు గోళకీమఠాచార్య పట్టాభిషిక్తులు దీక్షాగురువులు. తత్తద్విషయములుగొన్ని బసవపురాణపీఠికలో వివరించితిని. వారు మందర గ్రామమున నెలకొల్పిన మహావిద్యాపీఠమనఁ దగినపీఠమున

విద్యార్థిభ్యోఽ పరంభాగం శుద్ధశైవమఠాయచ
ప్రసూత్యారోగ్యశాలాభ్యాం విప్రసత్త్రాయచేతరమ్
ప్రాదాద్వి శ్వేశ్వర శివశ్శివసిద్ధాంతపారగః
ఋగ్యజుస్సామవేదానాం సమ్యగధ్యాపకాస్త్రయః
పదవాక్యప్రమాణానాం సాహిత్యస్యాగమస్యచ.

—ఇత్యాది.

పై శ్లోకములందు 'శుద్ధశైవమఠ' మని కలదు. శుద్ధశైవమనఁగా:

మిశ్రశైవ మితిప్రోక్తం శుద్ధశైవ మథశ్రుణు
సింహాసనస్థితంలింగ మర్చయేద్దేశికోత్తమః
నిత్యంత్రికాలం భక్త్యా యః లింగార్చనరతస్సదా
ఆగమార్థానుసంధాతా మదమోహాదివర్జితః
ధ్యేయజ్ఞానసమాయుక్త ఆరాధ్యస్తేన కథ్యతే
భూతిరుద్రాక్షసంయుక్తో భజకాస్త్రయే శివమ్
శుద్ధశైవమితిప్రోక్తం శ్రౌతశైవ మథోచ్యతే.

మీఁది శ్లోకములలో నిర్వచింపఁ బడిన పద్ధతియే యాంధ్రారాధ్య సంప్రదాయము వారిది. కాకతీయ చక్రవర్తులు వారి గురువులగు విశ్వేశ్వర శివాచార్యాదులు ఆంధ్రదేశమున ఱెంపొందించిన శైవసంప్రదాయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మిదియే. నేఁటి యాంధ్రారాధ్యవర్యులు వీరశైవసంప్రదాయము వారని తలఁచుట సరిగాదనియే నానిశ్చయము. బసవపురాణపీఠిక చూడఁగోరెదను.

౨

మఱియు, నీయవతరణికలో రుద్రమదేవి కూఁతురగు రుయ్యంబను నారాధ్యబ్రాహ్మణుఁడగు నన్నయదేవుఁడు పెండ్లాడినట్లు స్పష్టముగాఁ గలదు. దీనిని జూచిన తరువాత దీనికి సంవాదిగా నింకొక విషయము నాకుఁ గానవచ్చినది. మల్కాపుర శాసనమున

శ్రీచోళేశ్వరమాళవక్షితిపతీ రాజన్యచూడామణీ
యచ్ఛిష్యౌ; కిమతః పరం గణపతిక్షోణీపతిర్యత్సుతః
నస్యాత్కస్య ముదేసదేశికవరశ్శైవాగమాంభోనిధి
శ్శ్రీవిశ్వేశ్వరదేశికః కలచురిక్ష్మాపాల దీక్షాగురుః

అని శ్లోకమున్నది. "చోళరాజును మాళవరాజును విశ్వేశ్వరశివాచార్యునికి శిష్యులు. ఇఁకఁ జెప్పెడి దేమి? కాకతీయగణపతిచక్రవర్తి యావిశ్వేశ్వర శివాచార్యునికిఁ గుమారుఁడే" యని దీని కర్థము. శిష్యమాత్రత్వమే యగుచో చోళమాళవరాజులతో పాటుగానే గణపతిపేరును జెప్పఁ దగి యుండును. గణపతి చక్రవర్తికి విశిష్టశిష్యత్వమును దెలుపునదో లేక నిజముగాఁ బుత్త్రిమునే తెలుపునదో పైశ్లోకము! శివయోగసారావతరణికలో రుయ్యాంబ విషయము గానరాకున్నచో నిక్కడ విశిష్టశిష్యత్వము మాత్రమే యర్థమని తలఁతుము. ఇప్పుడు ఈయర్థముకూడఁ గలదేమో యని సంశయము పొడమినది.

3

కవిస్తుతిలో "మఱియును నంధ్రకావ్యపథము దీర్చిన నన్నయభట్టుగారి...." నని కలదు. ఈగణపతిదేవకవినాఁట నన్నియభట్టారకునిఁ గూర్చి యెట్టి భావముకలదో యిది స్పష్టముగాఁ దెలుపు చున్నది! రాజనరేంద్ర నంచికలో నేను వ్రాసిన వ్యాసమున కిది బలము నొసఁగుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

౪

మఱియు

క. అసమ శివభక్తిరసమా
నసునిం బాల్కురికి సోమనాథునిఁ గవిరా
జసమున్నతయశు, సద్యః
ప్రసాదియగు చక్రపాణి రంగనఁగొలుతుఁ.

అనియుఁ గవిస్తుతిలోఁగలదు. ఈపద్యమెంతయు నాకు సంతోషము గొల్పినది. పాల్కురికి సోమనాథునితో స్పర్థించి చక్రపాణి రంగనాథుఁడను వైష్ణవుఁడు (తెలుగుదేశమువాఁడు) శివనిందచేయఁగా నాతని కన్నులు రెండును బోయె ననియు, అహోబలనృసింహస్వామి కలలో శివనిందచే నీ కన్నులు పోయిన వని తెలుపఁగా నాతఁడు శ్రీగిరికిఁ బోయి మల్లికార్జును నారాధించి యా స్వామిమీఁద సంస్కృతాంధ్రములోఁ గొన్ని కృతులను జెప్పి పాల్కురికి సోమనాథునికి శిష్యుడై మరల రెండు కన్నులను బడసె ననియుఁ బెక్కుకర్ణాటక కృతులలోఁ గలదు. పైకథార్థమును రూపించుచు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో "రంగన" కృతిగా నయనరగడ యని యొక గ్రంథముకలదు.

క. శ్రీపార్వతీశుఁ జూడక
పాపాత్ముఁడనగుచుఁ బోవఁ బథమునఁ జక్షుల్
దీపించుదృష్టి తొలఁగిన
శ్రీపతినడుగంగఁ జెప్పె శివుఁ గర్తనుగాఁ

అని దానియారంభమునఁ బద్యము గలదు. బసవపురాణపీఠికలో నీ గ్రంథమును గూర్చి హెచ్చుగా వ్రాసితిని. నాల్గుచరణము లిక్కడ:

శ్రీశైలవల్లభుని శిఖరంబు పొడగంటి—
నభలందు భక్తులకు జయవాదమనికంటి
గౌరీశుఁడే సర్వకర్తగాఁ బొడగంటి---

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బహుపాపములు ట్టువిన్నను బడుచుట గంటి
నయముగా నయనములు నాకీయ! బొడగంటి---
ఇంక శ్రీగిరిఁజేరనేఁ గందు నని కంటి---
తనరశ్రీరంగకవి దాత యని పొడగలటి

---ఇత్యాదులు.

వైష్ణవమప్పుడు రంగనాథుడే శైవుఁడై రంగకవియయ్యెను. "ఘనుఁడు రంగన దూషకరగండఁ డనికంటి" ననియుఁ గలదు. పైవిషయములు నీగణపతిదేవకవి కృత్యవతరణిక యథార్థపఱుచుచున్నది. నే వెల్లడించిన 'నయనరగడ' చక్రపాణి రంగనదే యగుననుట కిఁక సందేహింపరాదు.

౫

కొలనిరుద్రదేవుని వర్ణనమున "నరులెల్ల వ్యాకరణబ్రహ్మయన నకలాగమవిదుఁడయ్యె నట్టెయితడు"-- అని కలదు. ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ 'రాజరుద్రీయ' మని యొక సంస్కృతవ్యాకరణ గ్రంథము కలదు. దానిఁ గూర్చి తెలుగుదేశపు సంస్కృతకవుల చరిత్రమున నే నిట్లువ్రాసితిని-- "కాశిక యని పేరుగల పాణినవ్యాకరణసూత్రవృత్తిలో నున్న కారికల నన్నింటిని శ్లోకవార్తికమను పేర నుద్ధరించి దానికి రాజరుద్రీయమను పేరఁ బ్రతాపరుద్రదేవుడు వ్యాఖ్య రచించినాఁడు. గద్యమిట్లున్నది. 'ఇతి రాజరుద్రవిరచితే శ్లోకవార్తిక వ్యాఖ్యానే ప్రథమస్యాధ్యాయస్య ప్రథమః పాదః' కొన్నిగద్యలు: 'ఇతిరాజరుద్రీయే కాశికావృత్తిశ్లోకవ్యాఖ్యానే' అని కలవు. మఱియు నొక్క చోట నిట్లున్నది. "అది రాజకాకతీయప్రతాపరుద్రప్రధానవర్యస్య ముద్రాకగన్నయసూను రచితంవార్తికవ్యాఖ్యానమ్"--- కావున నిదికాకతీయప్రతాపరుద్రుని కృతికానేరదు. ఆ కాకతీయప్రతాపరుద్ర దేవుని ప్రధానవర్యుఁడును, గన్నయకుఁ గుమారుఁడును నయిన రుద్రరాజు రచియించినది. ఇది వఱకు నే నీగన్నయ మార్కండేయ కృతిపతి యగు నేమో యనుకొంటిని. ఈశివయోగసారావతరణికవలన నీగ్రంథకర్తృవిషయము విస్పష్టమయినది' కొలనిరుద్రదేవుడేఁ యేతద్గ్రంథకర్త యగును. ఈతనికి 'వ్యాకరణ బ్రహ్మ' యని బిరుదనామముండుట, కాకతీయ ప్రతాపరుద్ర దేవుని ప్రధానవర్యత్వ ముండుట, గన్నయ పుత్త్రిత్వముండుట యట్టి నిశ్చయమునకు సాధకములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

౬

భీమఖండకృత్య వతరణికలో 'అరియేటియన్న మంత్రి కొలనిప్రతాప రుద్ర నృపాలునిచే 'అరేడు' గ్రామము దానము గొన్నట్టుకలదు. భీమఖండపు రెండు ముద్రణము లందును నీవిషయమును దెలుపు పద్యము చెఱుపఁబడినది. ముద్రణములందిట్లున్నది:

కొలనుఁబ్రతాపరుద్రనృపకుంజరుచేత నరేంద్రసారణీ
సలిలవివర్ధమానబహుసస్యసమాకుల మగ్రహారమై
వెలయ విభాకరగ్రహణవేళఁదగంగఁ బరిగ్రహించి బం
ధుల భరియించె నన్నవిభుతో సరియెట్లు ప్రధానులెవ్వరు॥

ఈ పద్య మిట్లుండవలెను:

కొలనిప్రతాపరుద్ర నృపకుంజరుచేత నరేడు సారణీ
సలిల వివర్ధమానబహుసస్యసమాకుల మగ్రహారమై

కొలనిప్రతాపరుద్రరాజు వేఱుఁగా గలఁడని యెఱుఁగముచే ద్వితీయ ముద్రణమున కొలను తర్వాత నరసున్న చేర్పఁబడినది. ఇది సహ్యమే కావచ్చును గాని—రెండుముద్రణములందును 'కుంజరుచేత నరేడు' గ్రామ నామమని గుర్తింపక నఱేఁడు, నరఱేఁడు అని యేదోస్ఫురింపఁగా నవి తప్పు లనుకొని కాఁబోలును! వానిని సంస్కృతీకరించి 'నరేంద్ర' యని దిద్దివై చినారు. 'నరేంద్ర సారణీసలిల' మనఁగా నర్థమేమనుకొనిరో! ఈయ రేడుగ్రామమును బ్రతిగ్రహించుటచేతనే వారు 'అరియేటి, అరేటి' యింటి పేరి వారయిరి! భీమఖండముద్రణమున నిట్టియ ఘోరసంస్కారము లనేకములు కలవు. గ్రంథారంభమున రెండవ పద్యములోనే 'ఎలుక నెక్కిన రావుతురాచవారు సేనానియనుంగు బెద్దన' అను సరసపాఠమును 'రావుతురాజు సౌరసేనాని యనుంగుఁబెద్దన' యనియు,—మూఁడవపద్య మున 'వాలికమోముమత్తవనబర్హికిశోరకలాస్యలీల' ననియున్న మనోహర పాఠమును 'బాలికమోవు మత్తవనబర్హికిశోరకలాస్యలీల' అనియు మార్చినారు రసప్రసక్తములయిన పాఠములిట్టివి యెటేనిఁ బోవుఁగాక.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చరిత్రప్రసక్తములయిన పాఠములుగూడఁ జాలఁ దప్పులుగాఁ బడినవి! ౬౯-వ పద్యమున

యవనకర్ణాటకటక భూధవులతోడఁ
జెలివివాటించి యేలించెఁ దెలుఁగుభూమి—

అని యుండవలసి యుండఁగా 'బలిమివాటించి' యని పడెను. ౭౮-వ పద్యమున

పంచారామములందుఁ బల్వెలపురిం బ్రౌఢేందుబింబాననల్
అని యుండవలసి యుండఁగా

పంచారామములందుఁ బల్లెలఁ బురిణ బ్రౌఢేందుబింబాననల్

అనిపడినది. ౭౪-వ పద్యమున

అన్నయమంత్రి శేఖరుఁ దహమ్మదుసేను వదాన్యభూమిభృ

త్తనిపడినది. ముద్రాపకుల తలఁపులోబుట్టిన 'మహమ్మదుహుస్సేన్' ఆ కాలపుఁజరిత్రలోఁగానఁరాఁడుగదా! భీమఖండపాఠవిశేషములను గూర్చి విపులముగా వేఱొకప్పుడు వ్రాయుదును. ఇది యిక్కడ నంతగాఁ బ్రసక్తము కాదు.

శివయోగసారపీఠిక కాకతీయరాజచరిత్రమునను, కృష్ణాగోదావరీ మండలముల చరిత్రమునకు గ్రొత్తవిశేషముల నెత్తిచూపియిచ్చుచున్నది. పెక్కు గ్రామముల విషయమిందు గలదు.

[సుభాషి
నవంబరు 1927
కాకతీయ సంచిక
మణిమంజరి ఫిబ్రవరి, 1984....19....]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అధ్యక్షోపన్యాసము

సహృదయవర్యులారా !

ఆంధ్రపరిశోధకమండలి వారింతకుముందు చాళుక్య కాకతీయ రాజ్య వర్ధంతుల జరపిరి. రాజమహేంద్రవరమున గోదావరీతరంగ డోలావిహార వినోదముల నాలమైత్రైలోక్య విజయసౌధ విశాల మహానంద చంద్ర శాలాధిరూఢులై సర్వవిద్యాగోష్ఠులు నెఱపిన రెడ్డిరాజుల రాజ్య వర్ధంతికూడ వారు నెఱపుట, అందును రాజమహేంద్రవరమున నెరపుట పరమానంద విషయము. ముప్పదియేండ్లనుండి యాంధ్రులలో చరిత్ర పరిశోధన కుతూహలము వెల్లివిరియుచున్నది. దానిఫలితమే రాజమహేంద్రవరమున పరిశోధక సమితి నిర్మాణము. ఇందు మిత్రులు శ్రీ రాళ్ళబండి సుబ్బారావు గారు, భావరాజు వెంకటకృష్ణారావుగారు, వడ్డాది అప్పారావుగారు మొదలగు వారు మంచిపరిశ్రమల నెఱపుచు, పరిశోధకపత్రిక నాంగ్లమున వెల్లడించుచు, నెన్నో యపూర్వాంశరత్నముల ద్రవ్వియెత్తి యిచ్చుచున్నారు. ఇట్టిమిత్రుల యాదరానురాగమే నన్నీనాడీ యాధ్యక్షమున నిర్బంధించినది. పెక్కేండ్లనుండి సారస్వత చరిత్ర వ్యవహారములకు దూరస్థుడనై ముక్కు మూసికొని యేకతమున కాలము గడపుకొనుచున్న నేను పయిమిత్రుల యాదరము నిర్బంధింపకున్నచో నేదో యిందదుకుల యాధ్యక్షోపన్యాసము కావించుటకుగాని, యిక్కడికివచ్చుటకుగాని పూనుకొనియుండను. మిత్రుల నిర్బంధమొకప్రక్క, మహనీయమైన రెడ్డిరాజ్యమునుగూర్చి తలచినపుడెల్ల నాలో బొడము నానందోద్బోధమొకప్రక్క రెక్కలుపట్టి నన్నిక్కడికి లాగికొనివచ్చినది.

ఆదికాలమునుండియు ఆంధ్రవాఙ్మయ భాగ్య భాండాగారమున రెడ్డిఱేండ్లు గొప్ప భాగస్వాములయి ప్రఖ్యాతి గాంచుచున్నారు. వారి మహనీయతను పదింవదిగా నేను ప్రశంసించుచునేయున్నాను.

ఇప్పటికి ముప్పదియైదేండ్లకు ముందు నే . నిర్వదియేండ్ల ప్రాయమువాడనయియుండగా చెన్నపురికరిగితిని. నాడు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో గ్రంథసామగ్రిని బరిశీలింప జొచ్చినప్పుడందు 'మెకంజీ లోకల్ రికార్డ్సు' అనుపేర మున్నూటదాక గల దేశచరిత్ర సంపుటములలో ఎక్కడబట్టినను రెడ్డిరాజుల దానధర్మములయు, శాసనములయు ప్రశంసలు పుష్కలముగా గానవచ్చును. మధ్యాంధ్రదేశము - అనగా నేటి గోదావరి కృష్ణ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప మండలములు. ఆనాడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేదవేదాంగాది విద్యలు నేర్చిన బ్రాహ్మణులతో నిండియుండుటకును, అం దనేకులు అగ్రహారికులై సంపత్సమృద్ధు లగుటకును. దుర్గములు, చెఱువులు, కాలువలు, ధర్మవనములు, పాడిపంటలు, గలిగి దేశము సుభిక్ష మగుటకును' దేవాలయములు నిత్యోత్సవములతో దేజరిల్లుటకును, వేయేల ! నేటి తెలుగు నాటివారి తెలివి తేటలకు, నాగరకతకును గూడపదునాలుగు పదునైదు శతాబ్దులలో నూటయేబదియేండ్లే అయినను పెంపొందియున్న రెడ్డిమహా రాజ్యము నొకప్రధానకారణమన్న చరిత్రాంశ మాచరిత్రాంశపు సంపుటము లలోకరతలామలకముగాగోచరించెను. నేడు మధ్యాంధ్రదేశమున-బ్రాహ్మ ణులు అన్నవస్త్రములుగలిగి విద్యావిభవములు గలిగి పలువురున్నారనగా దీనికి గొప్పకారణమానాడు రెడ్డిరాజులు, వీరి పూర్వుల విద్యావిశేషముల నాదరించి చేసిన యగ్రహారాదినత్కారములగుననుట యథార్థకథనము కొడంవీటి రెడ్డిరాజులయు, రాజమహేంద్రవర రెడ్డిరాజులయు, శాసనముల గొన్నింటినేని జూచినను నీవిషయము వెల్లడికాగలదు. శ్రీనాథు డిట్లు చెప్పినాడు.

సీ॥ ధరియింపనేర్చిరి దర్భ వెట్టెడువ్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీఁదఁ
గస్తూరి కాపుండ్రకములు నొసల
సవరింపనేర్చిరి జన్నిదంబుల ప్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చెఱువంగ నేర్చితి శిఖల నెన్నడుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వవిరులు
ధామముల వెండియును బైఁడి దడబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములలోన
వేమభూపాలుఁడను జన్మ వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీతటమునందు.

భీమఖండము'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీశైలము అహోబలము, పంచారామములు, మొదలగు పుణ్యస్థలముల వైభవమును రెడ్డిరాజు లెంతో పెంపొందించిరి. మధ్యాంధ్రదేశమున వేద, శ్రౌత, స్మార్తోభయమీమాంసా, తర్క, వ్యాకరణ, సంగీత, సాహిత్య, వైద్య, జ్యోతిషాది శాస్త్రములకు వారు చాల నభ్యుదయము గూర్చిరి. వారు షట్కాలశివపూజాధురంధరులయి ఆముష్మిక పరాయణులయి వెలసిరి. నేడును రెడ్డికులమువారిలో పలువురు భాగ్యభరితులు, శీలశోభితులు, త్యాగులు, భోగులు, ప్రతిభాశాలులు, విద్వాంసులు, కవులు వెలయుచున్నారనగా దానికి ఆనాటి రెడ్డిరాజేంద్రుల వంశపారంపర్యపు సంస్కారమే ప్రధానకారణ మనుట యసంగతము గాదు ముప్పదియేండ్లనుండియు నాకీ రెడ్డిరాజ్య వైభవానుస్మరణమున నభిమానము మెండు. ఇట్టి యభిమానము నానాడే 'శ్రీనాథ చరిత్ర' రచనాసందర్భమున గొంత తీర్చుకొంటిని.

నేడిక్కడ రెడ్డిరాజుల విద్యావిలాసములగూర్చి మాత్రమే కొంతవివరింతును.

మ. మహనీయంబుగ నంధ్రభూవలయముం బాలించుచుం బ్రాజ్ఞులై
బహుకావ్యంబులు చెప్పుచున్ మఱియుఁ జెప్పంజేయు చాముష్మిక
స్పృహతో ధర్మములాచరించుచు జగజ్జేగీయమానంబుగా
నహముల్ పుచ్చిన రెడ్డిరాజుల సముద్యత్కీర్తిఁ గీర్తించెదన్.

గోనబుద్ధారెడ్డిగారు తత్పుత్రులు.

పాల్కురికి సోమనాథుని మూలమున తెలుగున ద్విపదరచనకు విలువ హెచ్చెను. ద్విపదరామాయణమున దత్కర్తలు బుద్ధయ. తత్పుత్రులు కాచయ విఠ్ఠయులనియే కలదు. కాని వారికులమేదో యందు దెలియరాదు. వారియింటి పేరుమాత్రము 'గోనయని యనేకప్రతులలోను కోన యని కొలది ప్రతులలోను గలదు. వారు రాజ్యము నేలినయేలికలగుట గ్రంథమున స్పష్టముగా నున్నది. పశ్చిమాంధ్రదేశమున 13, 14 శతాబ్దులలో రాచూరుదుర్గనిర్మాతలై రాజ్యమేలినవారు 'గోన' వంశమువారు రెడ్లును ప్రఖ్యాతులు. వారియింటిపేరు 'కోన' యనుట సరికాదు. ఆనాటి శాసనములందెల్ల వారి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యింటిపేరు 'గోన' యనియే కలదు. ఆనాడు 'కోన' యింటిపేరువారు క్షత్రియులు. కోనసీమ (గోదావరీమండలము) పాలకులు వేఱుగా నున్నారు. గోనపదసంగతి, బుద్ధకాట, విత్తనామసంగతి[1] రాచూరుదుర్గ నిర్మాతలగు రెడ్డిరాజులకే కలదు. కావున రంగనాథ రామాయణ ప్రసక్తులు రెడ్లేకాని క్షత్రియులు గారని నిశ్చయింపవలెను. ఐతిహ్యమును, ఆప్తవాక్యమును బ్రమాణముగా గొనకున్నచో బ్రాచీనచరిత్రనిర్మాణమును దుష్కరమగును. రంగనాథుఁడను కవియే లేడని అతడు కల్పిత పురుషుడని నే ననజాలను, బుద్ధారెడ్డిగారును తత్పుత్రులును వాల్మీకి రామాయణమును దెలుగున ద్విపద రచనలలో వెలయించిరంటిని. గ్రంథమున గ్రంథకర్తలు బుద్ధభూవిభుడును దత్పుత్రులును అనియే కలదు కాని దానిని రంగనాథుడను కవి రచించినట్లు ప్రతీతి. తదనుగుణగాథలు ప్రాచీనములగు వెలుగోటివారి వంశ చరిత్రైక శిలానగర చరిత్రాదులలో గూడ నున్నవి. రంగనాథుడు కల్పితుడు కాకున్నను ఆతనితోడ్పాటు గ్రంథరచనమునందున్నను గ్రంథోత్పత్తికి బైప్రభువులు కారణమగుట స్పష్టముగదా! పూర్వోత్తరరామాయణములు వేర్వేఱు వురుషుల రచనములుగా నాకు దోపవు. తెలుగుననీరెడ్డిరాజులు వెలయించిన ద్విపదరామాయణము ప్రౌఢకవితా రసికులకేగాక పామరజనులకుగూడ సాహిత్యానందము సమకూర్చుచు నత్యధిక ప్రచారము కలదిగా నున్నది. ఆంధ్రరామాయణములలో రసపారవశ్యమును గలగించు రచన మిట్టిది వేఱొకటి లేదు. ప్రాచీనలాక్షణిక కవులందఱును నీ రామాయణప్రయోగములను బరమప్రమాణముగా బరిగ్రహించిరి. ఆంధ్రప్రజాసామాన్యమును రామాయణకథామాధురిని నాస్వాదింపజేసిన రామాయణ మిదియే.

ప్రోలయవేమారెడ్డిగారు

వీరు కృష్ణ, గోదావరి, పినాకిని అను నదీత్రయముచే రక్షితమయిన మధ్యాంధ్ర దేశము నేలిన రెడ్డిరాజవంశమునకు మూలపురుషులు. కవిత్రయములోని యెఱ్ఱాప్రెగ్గడ కవీశ్వరుని ఆస్థానకవిగా నాదరించి పోషించిన మహనీయులు. కవిత్రయములోని వాడు యెఱ్ఱాప్రెగ్గడ భారతారణ్య పర్వ

1. రాచూరు దుర్గ నిర్మాణము రెడ్డిరాజులు కావించినదనుట శాసనములట్టియే కాక వింతగా "గోనకోటారెడ్డిగారికథ" యన్న పదకవితా రచనవల్లను దెలియనగును. ఆ కథను రేడియోప్రసంగము నేను వెల్లడించితిని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శేషమున గొన్నిపట్టుల నన్నయరచనకు మెఱుగుగూర్చియు, హరివంశమున గొన్నిపట్టుల దిక్కన రచనకు జక్కవ గూర్చియు నిర్వహించినాడు. అరణ్య పర్వశేష పూరణమున షష్ఠాశ్వాసమున సైంధవావమాన ఘట్టమును, హరి వంశమున శ్రీకృష్ణ బాల్యవిలాసఘట్టమును నా కభిమానగ్రంథభాగములు. అనాగరికులయిన వ్రేపల్లె గొల్లవారియిళ్ళలో జగన్మోహనమూర్తి శ్రీకృష్ణ మూర్తి యవతరించి బాలక్రీడలు, దివ్యానుభూతులును వెలయించుట, అక్కడి పామరజనుల కందుచే గలిగిన యానందాశ్చర్య సంరంభములు ఎఱ్ఱాప్రెగ్గడ వారు చాల చక్కని తీరునదేసి తెలుగు మఱుగులు వెలయగా వ్రేతల యిళ్ళలో శ్రీకృష్ణు డారగించిన వెన్నామీగడ రుచుల దలపించు మించు రచనతో వెలయించినారు. ఆంధ్రప్రబంధ వాఙ్మయమున నిట్టి రసవద్ ఘట్టము మఱి యన్యత్ర కానరాదని నా నమ్మకము. ప్రోలయ వేమారెడ్డి గారు రామాయణమును, హరిశంశమును నత్యాదరముతో నాలకించు వారట.

క. రామాయణహరివంశ
   శ్రీమన్మధుర ప్రబంధ సేవ, చిరయశ
   స్సామర్థ్య, నిత్యనిపుణ
   శ్రీమల్ల చమూవరేణ్య సేవిత హృదయా.

ఇందు పేర్కొనబడిన రామాయణ హరివంశములు ఎఱ్ఱాప్రెగ్గడగారు రచియించిన యాంధ్రప్రబంధములే కావచ్చును.

హరివంశరచనకు బూర్వము ప్రోలయవేమారెడ్డిగారికే అంకితముగా మన ప్రబంధ పరమేశ్వరుడు రచియించిన రామాయణ మహాప్రబంధ మీనాడు గానరాకుండుట శోచనీయవిషయము.

ప్రోలయ వేమారెడ్డిగారు సాహిత్యమునసేగాక సంగీతమునను జాల రసికులు. హరివంశమున నిట్లున్నది.

కం. కేళాదిరాయ వితరణ। కేళీనిరపాయ నృత్యగీత కథా లీ
   లాలలితోత్సవ నిశితశ। యాలంకృత భాగ్య నుస్థిరాయుర్భాగ్యా!

వారి యాస్థానమున లొల్లమహాదేవకవియని యొక విద్వాంసు డుండెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆయనను గూర్చి యావంశమున నేడవతరమువాడు లొల్ల లక్ష్మీధరుడిట్లు చెప్పెను.

యః కర్ణాట వసుంధరాధిప మహాస్థానే సువర్ణాయితో
యో విద్వన్నికషాయితో నృపగృహే వేమాఖ్య పృథ్వీశితుః
శ్రీమల్లొల్లటభట్టశిష్యఇతి యోలొల్లాఖ్యయా శ్రూయతే
శ్రీ శేషాన్వయ శేఖర స్సహిమ హాదేవో విపశ్చిన్మహాన్॥

ఈ మహాదేవకవికి లొల్లవారని యింటి పేరు. భరతమహాముని రచియించిన నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానము రచియించిన లొల్లటభట్టునకు శిష్యుడగుటచే వచ్చినదట. ఇది నిజమేని నాట్యశాస్త్రవ్యాఖ్యాత లొల్లటభట్టు ఆంధ్రుడగుట ఆతడుగూడ రెడ్డిగారి ప్రాపుగలవాడగుట అనుమానింపదగినదగును. ఈ లొల్లమహాదేవకవి వంశమున తర్వాతి వారెల్లరుగూడ మహావిద్వాంసులు. వీరు క్రమముగా రెడ్డిరాజుల యాస్థానమున విద్వాంసులుగా నుండి, తర్వాత వచ్చిన గజపతుల యాస్థానమునను విద్వాంసులుగా నుండి వారి తర్వాతవచ్చిన కృష్ణ దేవరాయలవారి యాస్థానమునను విద్వాంసులుగా నుండిరి. ఈ గజపతులయు కృష్ణరాయలయు నాస్థానమునన్న లొల్ల లక్ష్మీధరపండితునకును, మహాదేవకవికిని నడుమనున్న విద్వాంసులు: మహాదేవాచార్యుడు లక్ష్మీధరార్యుడు, విరించి మిశ్రుడు, పురుషోత్తమమహోపాధ్యాయుడు, లక్ష్మణార్యుడు, విశ్వనాథభట్టు అనువారు రెడ్డిరాజుల యాస్థానముననే ఉన్నవారగుదురు. వారు సంగీత సాహిత్య పూర్వోత్తర మీమాంసాది శాస్త్రములందు గొప్పగ్రంథములు రచియించిరి. వానిపేళ్ళివి: భట్టలొల్లటగ్రంథవివరణము, సాహిత్య పారిజాతము, స్మృతికల్పతరువు, భరతార్ణవపోతము, సాహిత్యమీమాంస, మీమాంసాజీవాతువు, ప్రాభాకరామృతవాహిని ప్రభావళీ ఖండనము, నయవివేకదీపిక--అనునవి. ఈవంశమువారిప్పటికిని సంవన్మహితులై కొల్లూరవెలయుచున్నారు.

హరివంశమున నీప్రోలయవేమారెడ్డిగారిని యెఱ్ఱాప్రెగడ యిట్లు ప్రస్తుతించినాడు.

సీ. అగ్రహారములు విద్యాతపోవృద్ధ విప్రులకిచ్చి యజ్ఞకర్తలుగమనిచె
గోమఠారామ(?)జెఱువులు గుళ్ళుప్రతిష్ఠించి లోకసంభావ్యంబులుగ
నొనర్చె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిధులనల్లిండ్లు నునిలిపెఁ దోఁటలు సత్రములు చలువపందిరుల్ వెలయఁబెట్టె
హేమాద్రి పరికీర్తి తామితవ్రతదాన నివహంబులన్నియు నిర్వహించె

జేసె జేయుచు నున్నాఁడు సేయనున్న
వాఁడు పునరుక్తకృతి శుభావలులనెల్ల
ననఁగ శ్రీ వేమ విభున కయ్యలరు పేర్మి
వశమెవర్ణింపఁ దద్భాగ్య వైభవంబు.

సీ. కేయూరకంకణా కృతిఁ బరాక్రమ వితరణములు బాహుభూషణత నొంద
ననుకూలగృహిణి చాడ్పున నృపశ్రీయొద్ద గదలక సకలసౌఖ్యములనొసగ
నమృత సేవనము చందమునను సద్ధర్మ తాత్పర్య మధికమోదంబు బెనుప
గరతలామలక విఖ్యాతి నాతతనీతి గరిమంబు నిజవివేకమున వెలయ
జాహ్నవీ ప్రవాహముభంగిఁ, జరితమఖిల, భువనపావన పరిపూర్తిఁబొలుపుమిగుల
బరగు వేమక్షమానాథు పాటినృపులు, గలరెయెవ్వారు ధారుణీ తలమందు.

ఎఱ్ఱాప్రెగడగారిదిట యీక్రింది పద్యము. చాటువుకాబోలును.

ఉ. వీపునమోసెఁ గచ్ఛపము వెండిభుజంగమరాజు మస్తక
స్థాపితఁజేసెఁ నీవు వసుధారమణిన్ బెదకోమటీంద్ర! బా
హాపరి రంభగుంభ సముదంచితఁ జేసితి వింతయొప్పునే
మోవరుతే మెఱుంగుదురు ముగ్ధలతోడి విహారసౌఖ్యముల్.

ఈయనకాలమున 'మోటుపల్లి' యను ప్రాక్సముద్రతీరగ్రామము రేవుపట్ట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ణముగానుండెడిది. అక్కడి సముద్రపు టవలియొడ్డుననుండి తవాయి (నేడు తవాయియే) తరువాయి (నేడు తెన్నాసిరమ్) మొదలగు ద్వీపాంతరప్రదేశములనుండి యోడవ్యాపారములు చాల జరుగుచుండెడివి. ఎఱ్ఱాప్రెగ్గడ యిట్లు చెప్పినాడు.

శా. "బాహాదర్పమునన్ బ్రతీపధరణీ పాలావలిందోలి యు
త్సాహోదగ్రుడు మోటుపల్లిగొని సప్తద్వీప సద్వస్తు సం
దోహంబున్ దనకిచ్చు నెచ్చెలి సముద్రుం బ్రీతిగావించుచున్
మాహాత్మ్యంబు వహించె మల్లరథినీనాథుండు గాఢోద్ధతిన్".

ఈ ప్రోలయవేమారెడ్డిగారు బంధుసముద్రులు. ఎనుబదినాలుగు స్థలములలో దుర్గములను నిర్మించి తన బంధువుల నాయాదుర్గములందు నెలకొల్పిరి. ముప్పదియాఅగ్రహార దానముల దానముచేసిరి. శ్రీశైలమునకు నహోబలమునకు మెట్లుకట్టించిరి.

అన్నపోతారెడ్డిగారు.

ఈయన తనతండ్రికాలమున రాజధానిగానున్న యద్దంకిని విడిచి కొండవీటిని రాజధానిగా జేసికొని దానిని చాల బెంపొందించినాడు.

"కొండవీడుం రాజధానీం సవిచిత్రామకల్పయత్
దృష్ట్వాత్వష్టాపి వైచిత్ర్యమ భూద్యస్యాస్సవిస్మయః

* * *

సోఽన్నపోత నృపస్స్వేన నిర్మితాయాం పురిస్థితః;
కుర్వన్ హేమాద్రి దానాని చిరంభువ మపాలయత్.

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశమును రచించుకాలమున ననపోతారెడ్డిగారు యువరాజుగా నుండిరి. ఈయన రాజ్యమునకు వచ్చునాటి కెఱ్ఱాప్రెగ్గడ పుణ్యలోకము కరిగియుండును. బాలసరస్వతియను కవీశ్వరు డీయన యాస్థానమున విద్యాధికారిగా నుండెను. "అన్న పోతనరేంద్రస్య విద్వాన్ బాలిసరస్వతిః" అని యాతడు శాసనకృతులందు జెప్పికొనెను. వెన్నెలకంటి యింటిపేరు గల కవీశ్వరు లీయన్నపోతభూపతి పేర నేవో గ్రంథములు రచించిరట. అవి యేవో దొరకలేదు "వేమయ యన్నపోతభూజానికి సత్ప్రబంధము లొసంగిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెన్నెలగంటివారిలోన" అని విష్ణుపురాణకర్త వెన్నెలకంటి సూర్యకవియు, "వెన్నెలకంటి సూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసంపన్నుఁడు రెడ్డివేమ నరపాలకుచేత మహాగ్రహారముల్ । గొన్నకవీంద్రకుంజరుఁడు" అని జక్కనయు నీవిషయమును ప్రశంసించిరి. ఈమహారాజు రెడ్డిరాజ్యమును జాల బెంపొందించినవాఁడు; చాల యుద్ధములు జరిపి జయములందినవాఁడు.

అనవేమారెడ్డిగారు.

అనపోతారెడ్డిగారి యనంతర మీయన రాజ్యమునకు వచ్చెను. ఈయన చాల ధర్మాత్ముఁడు. ఈశ్వరభక్తుడు; షట్కాలశివపూజాధురంధరుఁడు.

"అరుణోదయ తపనోదయ
సంగవ మధ్యాహ్న సాయ మర్ధనిశాః;
శివపూజా సమయాష్షట్
ప్రతిదిన మనవేమ పార్థివేంద్రస్య"

అని వర్ణనగలదు. ఈయన యాస్థానమునఁ గొన్నాళ్ళు బాలసరస్వతికవియే విద్యాధికారిగా నుండెను. పిదప, త్రిలోచనార్యుఁడను నుద్దండకవి విద్యాధికారిగా నుండెను.

"మహానట జటాచ్ఛటానట దమంద మందాకినీ
కలక్వణితకంకణ ప్రజవిజృంభి వాగ్గుంభనః;
కవిః కవికులోద్భవో భువనభవ్య దివ్యోదయ
శ్శివాగమ విశారదో జయతి శారదావల్లభః

ఈ త్రిలోచనార్యుఁడు గొప్పకవియగు టేకాక శైవాగమ విశారదుఁడునట! 'ప్రకాశభారతియోగి' యని పేరుగలవాఁడు ఆంధ్రకవీశ్వరుఁడింకొక్కఁడుగూడ నీయన యాస్థానమున నుండెను. దాక్షారామ భీమేశ్వరాలయమున ననవేమభూపాలుఁడు కట్టించిన గొప్పకట్టడములఁగూర్చి యీ ప్రకాశభారతియోగి మంచి సీసపద్యములతో శాసన కావ్యము రచించినాఁడు. ఈయన కైలాసవాసికాఁగా నొకవిద్వాంసుడిట్లు విలపించినాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భువిసత్యన వేమభూపతీంద్రే విదుషాంజీవన మేవజీవనమ్
దివిసత్యన వేమభూపతీంద్రే విదుషాంజీవన మేవజీవనమ్.

కొమరగిరి రెడ్డిగారు.

అనవేమారెడ్డిగారికి పిదప నాయన యన్నకుమారుఁడు కొమరగిరిరెడ్డి రాజయ్యెను. ఈయన చాల అదృష్టవంతుఁడు. ఏలనఁగా, ఈయనకు మను తుల్యుఁడని పొగడ్త గాంచిన ప్రాజ్ఞుఁడు కాటయవేమారెడ్డి మంత్రిగా నుండెను.

"ఆసీదమాత్య రత్నం కాటయవేమ ప్రభుస్తస్య,
అతి సురగురు భార్గవమతి రతిభార్గవ విజయవిజయ విఖ్యాతః"
"సింహాసనే నిధాయాసౌ కుమారగిరి భూవరమ్
అతేజయన్మహా తేజాశ్శ్రీకృష్ణ ఇవధర్మజమ్."

—తొత్తరమూడి శాసనము.

శ్రీకృష్ణదేవుఁడు ధర్మరాజును బోలె కాటయవేమారెడ్డి కొమరగిరిరెడ్డిని సింహాసనమున గూర్చుండబెట్టి సర్వాభ్యుదయములను సమకూర్చుచుండు వాడు. రాజ్యపరిపాలనతంత్ర మెల్ల కాటయవేమారెడ్డిగారు నిర్వర్తించు చుండగా, భోగభాగ్యముల కొమారగిరిరెడ్డిగారు వసంతోత్సవములతోను, వారాంగనాభినయములతోను కాలము గడుపుచుండువారు. వీరికాలమున గొండవీటిరెడ్డి రాజ్యము గొప్పదశలో నుండెను.

"భాగ్యం నామసమగ్ర మీదృశ మతిస్నేహైక పాత్రంబుతో
వీరం కాటయవేమ ముద్ధతరిపు ధ్వంసేని యుజ్యన్వయమ్;
నిత్యం నందతి నర్తనైరభినవైః కాంతైర్వ సంతోత్సవైః
సంతానాభ్యుదయైః కుమారగిరి భూపాలోన్నృపాలోత్తమః"

ఇచట 'సంతానాభ్యుదయైః' అనుటకు సప్తసంతానముల యభ్యుదయములని అర్థము చెప్పుకొనవలెను.

కొమరగిరిరెడ్డిగారికి ధర్మపత్నీ నిర్విశేషరాలు 'లకుమా దేవి' యను ప్రియురాలుండెడిది. ఆమె కొమరగిరిరెడ్డిగారి కొల్వున వేల తెఱఁగుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సవనవాభినయములు వెలయించుచుండెడిది. అర్థివ్రజమును వేలకొలందిగా ధనమొసఁగి యాదరించుచుండెడిది. ఈ లకుమాదేవి వేశ్యకాబోలును.

"జయతి మహిమా లోకాతీతః కుమారగిరిప్రభో
స్పదసిలకుమాదేవీ యస్య ప్రియాసదృశీప్రియా;
నవ మభినయా నాట్యార్థానాం తనోతిసహస్రధా
వితరతి బహూనర్థా నర్థివ్రజాయ సహస్రశః."

కొమరగిరిరెడ్డిగారి కాలముననే కొండవీట 'గృహరాజసౌధ' మను గొప్ప ప్రాసాదము నిర్మింపఁబడెను. ఇంతదాఁక నీసౌధము, పెదకోమటి వేమారెడ్డి కాలమున వెలయింపఁబడినట్లు తలఁపబడుచుండెను. ఈనడుమ క్రొత్తగా దొరకిన తామ్రశాసనములు (ఇవి శ్రీ భావరాజు వెంకటకృష్ణరావు గారిచే ఆంధ్ర హిస్టారికల్ రీసర్చి సొసైటీ జర్నల్‌లో ప్రకటింపఁబడినవి.) ఈసౌధమును కుమారగిరిరెడ్డిగారే కట్టించిరని తెలుపుచున్నవి. మఱియుఁ గుమారగిరిరెడ్డిగారు 'వసంతరాజీయ' మనుపేర నాట్యశాస్త్ర గ్రంథము నొకదానిని రచించిరట. అది యిప్పుడు కానరాదు.

"మునీనాం భరతాదీనాం భోజాదీనాం చభూభుజామ్,
శాస్త్రాణి సమ్యగాలోచ్య నాట్యవేదార్థ వేదినామ్
ప్రోక్తం వసంతరాజేన కుమారగిరి భూభుజా
నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం యదుత్తమమ్."

శ్రీనాథుని హరవిలాసమును కృతినందిన యవచి తిప్పయశెట్టి తన చిన్ననాట నీ కుమారగిరిరెడ్డిగారి ప్రతివర్ష వసంతోత్సవములకు తరుణాసీరి, తవాయి, గోవ, రమణ, పంజార, జలనోగి, హురుమంజి, యాంప, బోట ఇత్యాది ద్వీపాంతరములనుండి తెప్పించిన సుగంధ ద్రవ్యములను కొండవీటికి గొనివచ్చి సుగంధద్రవ్య భాండారము నెలకొల్పియమ్మిపోవుచుండెడివాడు.

కాటయవేమారెడ్డిగారు

ఈయన కుమారగిరిరెడ్డిగారి సోదరికిభర్త. కాళిదాసీయమయిన నాటకత్రయమునకు కుమారగిరీయములు అను వ్యాఖ్యానములు రచియించిన వాడు. ఈవ్యాఖ్యానములు చాల ప్రసిద్ధములయినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుమారగిరి భూనాథో యస్మై విక్రమతోషితః
ప్రాదాత్ప్రాచీం భువం రాజమహేంద్రనగరీముఖామ్.

రాజమహేంద్రవర రాజ్యమును కాటయవేమారెడ్డియు, కుమారగిరిరెడ్డి కుమారుడు అనపోతారెడ్డియు, కాటయవేమారెడ్డియల్లుడు వీరభద్రారెడ్డియు, నాయన యన్నదమ్ములగు వేమారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డి అనువారును గలసి చీకటి చిల్కానముద్రముదాక వ్యాపింపజేసి పాలించిరి. కొమరగిరిరెడ్డి గారి తుదికాలముననే కొండవీటిరెడ్డిరాజ్యము, రాజమహేంద్రవరరెడ్డిరాజ్యము వేఱువడెను. కొండవీటిరెడ్డిరాజ్యమునకు పెదకోమటివేమారెడ్డి రాజయ్యెను.

పెదకోమటి వేమారెడ్డిగారు.

ఈ రెడ్డిరాజ్యమునకు దొలిపురుషుడగు కాటయవేమారెడ్డిగా రెట్టిజగ ద్గేయకీర్తులో ఇంచుమించుగా కొండవీటి రెడ్డిరాజ్యమునకు దుదివాడనదగిన యీ పెదకోమటి వేమారెడ్డిగారుకూడ నట్టివారు. ఇంచుమించుగా క్రీ 1404 నుండి 1420 దాక నీమహనీయుడు కొండవీటిరెడ్డిరాజ్యము నేలెను. ఈయనకు రాజమహేంద్రవర రెడ్డిరాజ్యము ప్రబలవిరోధిగా నుండెను. కాటయ వేమారెడ్డిగారివలె నీయన స్వయము గొప్పవిద్వాంసుడు. కవిసార్వ భౌముడయిన శ్రీనాథుని నాస్థానమున విద్యాధికారినిగా జేసికొని పోషించిన మహాభాగ్యశాలి. ప్రబంధ పరమేశ్వరుని, కవిసార్వభౌముని నాస్థానకవులుగా నాదరించి పోషించు మహాభాగ్యము ప్రోలయవేమారెడ్డిగారికిని, నీ పెదకోమటి వేమారెడ్డిగారికిని చిరకాలము లభించినది. ఈ వేమారెడ్డిగారికి 'సర్వజ్ఞచక్రవర్తి' యనిబిరుదు.

"చూడమణీర్నృపాణాం దుర్మద పరిపంథిశిఖరి దంభోళిః;
సర్వజ్ఞ చక్రవర్తీ పెదకోమటివేమభూపతిర్జయతి"

ఈ శ్లోకము శ్రీనాథుని శాసనకృతులందేకాక వామనభట్టబాణుని వేమ భూపాలచరితమునఁగూడ గలదు. రాచకొండ దేవరకొండలు రాజధానులుగా పశ్చిమాంధ్ర దేశము నేలిన రేచెర్ల వెలమరాజులకును, కొండవీడు, రాజమహేంద్రవరము రాజధానులుగా రాజ్యమేలిన వంటదేనటి రెడ్డిరాజు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లకును ప్రబలవిరోధము. వారు ఒండొరులమీఱి కీర్తిప్రతాపయశస్సుల నార్జింపయత్నించిరి. రేచెర్ల సింగభూపాలుఁడు సర్వజ్ఞ బిరుదమందగా కొండవీటి రెడ్డిరాజు, మన పెదకోమటివేమారెడ్డి సర్వజ్ఞ చక్రవర్తి బిరుదమందెను. అక్కడ నొక సింగభూపాలుడు సంగీతరత్నాకర వ్యాఖ్యానమును రసార్ణవసుధాకరమును రత్న పాంచాలికను, రచింపగా మనరెడ్డిగారు సంగీతచింతామణిని, సాహిత్య చింతామణిని అమరువ్యాఖ్యను సప్తశతీసార వ్యాఖ్యను నింకగొన్ని నాటకకృతులను రచియించిరి. విశ్వేశ్వర కవిచంద్రాదులు వెలమరాజుల యాస్థానమున కవులుగానుండగా వామనభట్టబాణాదులిక్కడ నుండిరి. మహనీయుడు బమ్మెరపోతనవారి యాస్థానమున నుండెనుగాని యానిస్పృహుడు నరస్తుతివిముఖుడై వారిగౌరవాదరముల నపేక్షింపడయ్యెను. మన రెడ్డిగారి యాస్థానమున పోతరాజుగారికి దీసిపోని విఖ్యాత కవీశ్వరుడు శ్రీనాథుడు విద్యాధికారిపదమున వెలుగొందెను. ఇక్కడ నించుక శాఖాచంక్రమణము. వెటగోటివారి వంశమున సింగభూపాలురు పలువురున్నారు. అందు కవితాప్రసక్తులు పదునాల్గవ శతాబ్ది తుదను, పదునైదవశతాబ్ది మొదటను వర్తిల్లిన వారిర్వురు సింగభూపాలురు. అందు తొలి సింగభూపాలుఁడు రసార్ణవసుధాకరము, రత్నపాంచాలిక మొదలగు గ్రంథములకుఁ గర్త. చమత్కారచంద్రికాకారుఁడగు విశ్వేశ్వరకవి చంద్రు నాస్థానకవిగా నాదరించినవాఁడు.

ఈతని మనుమఁడు వేఱొక సింగభూపాలుఁడున్నాడు. ఈతనికే సర్వజ్ఞుఁడని బిరుదు. శ్రీనాథ కవిసార్వభౌముఁడు, బమ్మెరపోతరాజు, నీ సర్వజ్ఞ సింగభూపాలునితో సంబంధము గలవారు. ఈతని తల్లిదండ్రులు పోచమాన్నపోత భూపాలకులు. వసంతావనీనాథుఁడీతని తమ్ముఁడు. బమ్మెర పోతరాజు భోగినీదండకము నీతనిపేరనే రచించెను. శ్రీనాథుఁడీతనినే దర్శించెను. ఈతఁడు పదునైదవశతాబ్ది మొదటికాలమువాఁడు.

ఈతని తాత సింగభూపాలుడే, రసార్ణవసుధాకరాది గ్రంథకర్త. అతనికి శ్రీనాథ పోతనలతో సంబంధముగలదనుట యప్రామాణికము. ఆతఁ డన్నమాంబా పోతభూపతుల కొడుకు. అతని సోదరుల పేళ్ళు వేఱు ఇంత విస్పష్టచరిత్ర విషయము నెందుకో కొందఱిప్పుడు తారుమారుచేయుచున్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెదకోమటి వేమారెడ్డిగారి మంత్రియు, శ్రీనాథుని శృంగారనైషధ కృతిపతియునగు మామిడి సింగనమంత్రి సోమసిద్ధాంతమను జ్యోతిష గ్రంథమునకు వ్యాఖ్య రచించెను. పెదకోమటి వేమారెడ్డిగారు అనేకులకు జ్యోతిష విద్వాంసులకు, గొప్ప వైద్య విద్వాంసులకు, యజ్ఞములు చేసిన శ్రౌతులకు, శైవాచార్యులకు, అనేకాగ్రహారములు దానము చేసెను. ఆ దానముల కన్నింటికిని, శ్రీనాథకవీశ్వరుఁడు శాసనకావ్యకర్త. వారి వైదుష్యములను శ్రీనాథుఁడే పరీక్షించువాఁడు.

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణ విద్యాగమములు
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణ వేళలందు
వెదచల్లినాడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష.

ఇవియెల్ల పెదకోమటివేమారెడ్డిగారి యాస్థానిలో శ్రీనాథుఁడు జరిపిన విద్యాధికారి కృత్యములు. 'విద్యాధికారీ శ్రీనాథోవీర శ్రీ వేమభూపతేః' అని శాసనకృతులలో నాతఁడు చెప్పుకొన్నాడు.

పెదకోమటివేమారెడ్డిగారి కృతులు: (1) శృంగారదీపిక— ఇది అమరుశతకమునకు వాఖ్యానము. అమరుశతకవ్యాఖ్య లన్నిటికంటె దీనికే గౌరవము హెచ్చు. రసభావాలంకార నాయికానాయక లక్షణాదివిషయ విచారముతో నీవ్యాఖ్యానము చాల విపులముగా నున్నది. ఇది ముద్రితమయి యున్నది. (2) సప్తశతీసారటీక:-- రెండువే లేళ్ళకుముందు హాలుడను ఆంధ్రశాతవాహనచక్రవర్తి సంధానించిన 'గాథాసప్తశతి' యను నేడ్నూరు ప్రాకృతగాథలనుండి సారతరములగు - నూఱుగాథలను - పెదకోమటి వేమారెడ్డిగారు సంగ్రహించి వానికి వ్యాఖ్య రచించిరి. ఈగ్రంథ మింకను ముద్రితముకాలేదు. దీని కొక్కప్రతిమాత్రమే దొరకినది. అది ఓరియంటల్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లైబ్రరి (ప్రాచ్యలిఖిత పుస్తకశాల) లోఁ గలదు. నూనూగు మీసాల నూత్న యౌవనమున శ్రీనాథుఁ డీగాథాసప్తశతిని దెలిఁగించినాఁడు. శ్రీనాథుని యాబాలగ్రంథ మిపుడు గానరాదు. అది మనరెడ్డిగారి కంకితమయి యుండును. (3) సాహిత్యచింతామణి-- ఇది యలంకారశాస్త్రగ్రంథము లలోఁ బేర్కొనఁదగిన యుత్కృష్టగ్రంథము. కావ్యప్రకాశమువంటిది. ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత కుమారస్వామి సోమపీథి దీని నుదాహరించి నాఁడు. మహిమభట్టు వ్యక్తివివేకము నిది ఖండించును. ధ్వనికారుని మతమును పరిపోషించును ఇకదనేక గ్రంథములలోని శ్లోకము లుదాహరింపఁ బడినవి. "యథామమైవబాణే" అనియు, "యథామమైవకావ్యే వీరనారాయణ చరితే" యనియుఁ బెక్కు శ్లోకము లుదాహరింపబడినవి. కోమటి వేమారెడ్డిగారి కృతులగు నాగ్రంథము లిప్పుడు తెలియరావు. (4) సంగీత చింతామణి:-- ఈ గ్రంథము తిరువనంతపురముననున్నది. కవీశ్వరు లీసర్వజ్ఞ చక్రవర్తి నిట్లు పొగడిరి :

"జ్ఞాతా యది నహిదాతా, దాతాచేత్కోఽపి భువినచజ్ఞాతా;
జ్ఞాతా దాతా చాభూః పెదకోమటి వేమభూపతే చిత్రమ్."
"అర్థిజనచింతితార్థా, దధికంచేత స్తతోఽ పితేవాణీ,
ఆస్యా అపి దిశతికరః, పెదకోమటి వేమభూపతే చిత్రమ్."
"శిత్రపోషణ రిపు శోషణ, బుధతోషణ సత్యభాషణాది గుణాన్,
ధత్తే దశరథరామః, ప్రాగద్యకలౌతు కోమటి విభువేమః"

* * *

వామనభట్టబాణుఁడను కవీశ్వరుఁడు పెదకోమటి వేమారెడ్డిగారి చరిత్రమునే 'వేమభూపాలచరిత్ర' మనుపేర సంస్కృతమున గద్యకావ్యముగా రచించిరి. శ్రీనాథుడే కాబోలును పెదకోమటి వేమారెడ్డిగారిమీద రచించిన చాటుధారలు పెక్కులు చాటుపద్యమణిమంజరిలో జూడదగును.

ఈ కాలముననే కందుకూరు రాజధానిగా రాజ్యమేలుచున్న పిన్న కోమటిరెడ్డి గారి కుమారుడు శివలింగభూపతి హరదత్తాచార్యుడు "చతుర్వేద ...్య సంగ్రాహ" మనుపేర రచించిన ప్రౌఢసంస్కృత గ్రంథమునకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాఖ్య రచియించెను. ఆయన యాస్థానమున నీశ్వరభట్టు అను గొప్ప విద్వాంసుడుండెను. ఆయన తోడ్పాటుతో రెడ్డిగారా గ్రంథమును రచించిరి.

పెదకోమటి వేమారెడ్డిగారి తర్వాత తత్పుత్రుడు రాచవేమన మూడేండ్లు మాత్రమే రాజ్యమేలెను. అంతటితో కొండవీటిరెడ్డిరాజ్య మంత మందెను. కాని, పెదకోమటి వేమారెడ్డిగారు తాము జీవించియుండగానే తన తమ్ముడగు మాచారెడ్డిగారికి కొండపల్లె దుర్గము రాజధానిగాఁ దత్ప్రాంత దేశమును గొంత రాజ్యమేలుకొనఁ బంచియిచ్చి పంపిరి.

"పెదకోమటి మాచేంద్రో వేధసా నిర్మితో నృపః
ఇతరేతునృపా స్సర్వే విశ్వామిత్రేణ నిర్మితాః"

అని యీయన పొగడ్తఁ గనెను. ఈ రెడ్డిగారు క్రీ. 1414 స॥రమునను, తత్పుత్రుఁడు తిప్పయరెడ్డిగారు క్రీ. 1415 స॥రమునను చేసిన యగ్రహార దానశాసనము లున్నవి.

పెదకోమటి మాచారెడ్డిగారు కొండపల్లిలో రాజ్యమేలుచు
"అకలంక సకలభాషా కవితా మూర్ధాభిషిక్తాయ,
విద్వన్నిరూఢ రాజాస్థాన సుధాంభోధిపూర్ణచంద్రమసే."
"గద్యశ్రీ బాణకవేః పద్యేఽపి తథైవ కాళిదాసకవేః,

* * * *

ఉజ్జ్వలత రాష్ట్రభాషా కవితాసామ్రాజ్య పట్టబంధస్య,
పుత్రాయాన్నయ సుకవేః శ్రీభారద్వాజగోత్రాయ"
"అనుజేనపాణి బదరీకృతపాణిని ఫణితిమార్గేణ,
త్రిపురారి సుకవిమణినా సంస్మరయిత్రేస లక్ష్మణం రామమ్"
పాల్గుమి శ్రీకంఠగురోః పంచాక్షరమంత్ర పౌనరుక్తస్య,
శిష్యాయ .... "

బల్జేపల్లిగ్రామము నగ్రహారముగా నొసఁగెను. తర్వాతివత్సరమున మాచారెడ్డిగారి కుమారుఁడు తిప్పయరెడ్డిగారు గుడివాడతాలూకాలో పాముఱ్ఱుదగ్గర గల యేకమూరు గ్రామమును ప్రతాపరుద్రదేవుని భాండాగారాధిపుఁ డగు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మల్లనకు మనుమఁడగు బంకమల్లయయను బ్రాహ్మణునికి దానముచేసెను. తండ్రికొడుకు లిద్దఱదగ్గరను నరహరియను విద్వాంసుఁ డాస్థానకవిగా నుండెను.

కొండవీటిరెడ్డి రాజ్యముతోపాటి కొండపల్లి రాజ్య విభాగమును జెడిపోయినది. వెలుగోటి వెలమరాజులు కొంతభాగమును విజయనగరరాజ్యము కొంతభాగమును వేమ వీరభద్రారెడ్లు కొంతభాగమును గొనియుందురు.

వేమ వీరభద్రారెడ్లు.

క్రీ. 1425 సం. ప్రాంతములఁ గొండవీటి రెడ్డిరాజ్యము కూలిపోఁగా శ్రీనాథు డటుపయి సమధికాభ్యుదయముతో నున్న రాజమహేంద్రవర రెడ్డి రాజ్యమునకుఁ జేరినాఁడు. అంతదాఁక శ్రీనాథున కాశ్రయమయిన పెద కోమటి వేమారెడ్డిగారికి ప్రబల శత్రువులై రాజమహేంద్రవర రాజ్యమును బెంపొందించినవారు--కుమారగిరిరెడ్డిగారి కుమారుఁడు అనపోతారెడ్డి, వేమ వీరభద్రారెడ్ల తండ్రి అల్లాడరెడ్డి, కాటయవేమారెడ్డి తత్పుత్రుడు కుమారగిరి రెడ్డి వీరెల్లరు రాజమహేంద్రవరమున క్రీ. 1900 సంవత్సరముల నడిమి కాలమునఁ జనిపోయిరి. రాజమహేంద్రవర రాజ్యము కాటయ వేమారెడ్డి గారి కుమార్తె యగు ననితల్లి మూలమున తద్భర్తయగు వీరభద్రారెడ్డి గారికి సంక్రమించెను. వీరభద్రారెడ్డి మంత్రియగు బెండపూఁడి యన్న మంత్రి శ్రీనాథునకు బంధువు. తొల్త శ్రీనాథుఁ డాతని ప్రాపుఁ బడసెను. అతని కంకితముగా క్రీ. 1390కి దరువాత భీమఖండము రచించెను. ఆకృతి యవతరణికలో వేమవీరభద్రారెడ్లను వర్ణించెను. క్రమముగా 1420 తర్వాత శ్రీనాథుఁడు 'రాజమహేంద్రవరపు' "వీరభద్రారెడ్డి విద్వాంసుఁ" డయ్యెను.

ఈ కాలమున శ్రీనాథునితోపాటు రాజమహేంద్రవరమున నిశ్శంకు కొమ్మనామాత్యుడని మఱొక యాంధ్రకవి యుండెను. అతఁడు వీరభద్రారెడ్డి తమ్ముఁడగు దొడ్డారెడ్డి కంకితముగా శివలీలావిలాసమను ప్రౌఢప్రబంధము రచించెను.

3)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీరభద్రారెడ్డిగారి కంకితముగా శ్రీనాథుఁడు కాశీఖండము రచించెను శ్రీనాథుఁడు ఆంధ్ర కవీశ్వరులలో వింతతీరువాఁడు. అతఁడు తత్పూర్వాంధ్రకవులు చేయు పురాణాంధ్రీకరణ పద్ధతికిఁ జాల మార్పు కల్గించినాఁడు. కాశీఖండభీమఖండ పురాణములను దెలిఁగించినను వానిని స్వతంత్ర ప్రబంధములు వోలెఁ దెలిగించినాఁడు. భీమఖండము గోదావరితీరదేశ దివ్య వైభవ వర్ణన మనఁదగినది. కాశీఖండము గొప్ప పురాణ గ్రంథ మయినను నీతఁడు దాన తన యిచ్చకువచ్చినతీరునఁ గొన్ని క్రొత్తవిషయములు జేర్చి కొన్ని మార్చి మూలముతో నంతగా సంబంధము లేనితీరున అతిప్రౌఢమయిన ప్రబంధశయ్యతో స్వతంత్రకృతి యనఁదగినట్లె రచించినాఁడు. తెలుఁగు కాశీఖండము నెవరుగాని కాశీ మహాత్మ్యాది పురాణకథాపరిజ్ఞానమునకయి చదువరు. అది ప్రౌఢాంధ్ర కవితాపరిజ్ఞానమునకయి చదువఁదగిన ప్రబంధమే. ఇట్లే శివరాత్రిమహాత్మ్యమని మఱియొక గ్రంథమును శ్రీనాథుఁడు రచించినాఁడు. ఈశాన సంహితలో దానిమూలము నూఱు శ్లోకములు గలది. తెలుగుగ్రంథము విచ్చలవిడిగా వర్ణనలతో, శృంగార ప్రసక్తులతోఁ బెరిగినది. పురాణాంధ్రీకరణమని పేరేగాని శ్రీనాథుని తెలిఁగింపు అయన యిష్టప్రకారము సాగినదే. శ్రీనాథునకు ప్రౌఢకవితాపాకము మీఁదఁ బ్రీతి. తదనుగుణముగా నాతఁడు గ్రంథగ్రంథిమయమయిన శ్రీ హర్షనైషధమును దెలిఁగించినాఁడు. ఆయన డెందము మెచ్చిన కవితాసందర్భ మిట్టిది.

"హరచూడా హరిణాంక వక్రతయుఁ గా
లాంత స్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధరస్ఫుటతటీ
పర్యంత కాఠిన్యమున్

మహావైభవ మనుభవించిన రెడ్డిరాజ్య మిట్లంతరించినను చాప చిరిగి చదరలయినట్లు తద్రాజ్యము చెదరులుగాఁ గొన్నిచోట్ల నేటికిని వర్ధిల్లుచున్నది. ఆంధ్రాభ్యుదయమునకు వారెంతో తోడ్పడుచున్నారు. గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దోమకొండ, మునగాల, ఇంకను గుంటూరు మండం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున రాపూరు రాజధానిగా విజయనగర రాజులక్రింద రాజ్యమేలినవాఁడు, బసవయ రాఘవరెడ్డి వెన్నెలకంటి సూరనార్యునిచే పదునాఱవ శతాబ్ది యారంభమున విష్ణుపురాణమును ఆంధ్రీకరింపించెను. ఈ విష్ణు పురాణము శ్రీనాథుని పురాణాంధ్రీకరణ ప్రౌఢిని దలఁపించుచు మూలానుసారముగాఁ జాల హృద్యముగా నున్నది.

గోదావరీతీరమున బిక్కవోలు రాజధానిగా రాజ్యమేలిన కామినేని వారు కృతికర్తలై కృతిపతులై యాంధ్రభాషకు చాల నభ్యుదయము గూర్చిరి. పట్టమెట్ట సోమనాధకవి కామినేని కామిరెడ్డిగారి కవీశ్వరుఁడై నూర సంహితాది గ్రంథముల రచించినాఁడు. ఈ మహాకవి రచనము చాల మేలయినది. కామినేని మల్లారెడ్డిగారు షట్చక్రవర్తి చరిత్రమని ప్రశస్త ప్రబంధము రచించిరి. వీరి యాస్థానిలో పెక్కుగ్రంథములు వెలసినవి. పదునేడవ శతాబ్దిలో ఆద్దంకి సీమలోని మూగచింతపల్లెలోఁ బుట్టి సర్వాంధ్ర ద్రవిడదేశ సంచారియై వేలకొలదిఁ యాఁటవెలఁదులను విజ్ఞుల జిహ్వారంగములపై నాట్యమాడించిన దొడ్డకవి వేమన. పద్యకర్త వేమారెడ్డిగారు రెడ్డి జాతి జగజ్జ్యోతి. సహజకవితాధారల యూటగడ్డ.

గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దోమకొండ, మునగాల సంస్థానులు పేర్వెలసిన కాలమునసనుండియు నాంధ్రవాఙ్మయాభ్యుదయమున కెంతేని తోడ్పడుచున్నవి. గద్వాలలో ముష్టిపల్లి సోమభూపాలుని కాలమున కాణాద పెద్దసోమయాజి మహాకవియై యధ్యాత్మరామాయణ ముకుందవిలాసాది గ్రంథములఁ బెక్కింటిని రచియించినాఁడు. సోమభూపాలుఁడును సంగీత సాహిత్య చతురుఁడై స్వయము కవియై జయదేవగీత గోవిందము పద్య గేయాత్మకముగాఁ జాల చక్కగా దెలిగించినాడు. గద్వాలసంస్థానమువలెనే ఆత్మకూరు, వనపర్తి, దోమకొండ సంస్థానములును గవిపోషణమున వాఙ్మయరక్షణమున నాటికి, నేటికి బేర్వెలయుచున్నవి. నేడును నైజాంరాష్ట్రమున, రాయలసీమలో,మధ్యాంధ్రదేశమున సుగుణగణ్యులగు రెడ్డిగృహస్థులెందఱో కలరు. అందు గవులెందఱో కలరు. ఆంధ్రాభ్యుదయమునకు నాడు, నేడునుగూడ రెడ్డిసంఘము గొప్పయాలంబమై వెలసినది, వెలయు చున్నది. నేటికిని ఆంధ్రసారస్వత భాగ్య భాండాగారములో రెడ్డికులమువా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రొక గొప్పభాగస్వాములనియు, రేపటి యాంధ్రాభ్యుదయమున వారొక ముఖ్యనిర్వాహకులై నిలువగలరనియు, వారియెడ నాకుగల పరితోషమును మరల బ్రశంసించుచు నీ యుపన్యాసము ముగించుచున్నాను.

సరసత్వంబును సంభవించె ననఁగా
 సత్కావ్యముల్ దిక్కులన్
జిరకాలంబు నటించుచుండుఁ గవిరా
 జీ గేహరంగంబులన్.

ఈయన గ్రంథములలోకెల్ల కాశీఖండము పండఁబాఱిన కవితారచన శౌండీర్యము గలది. ఇట్టి కవితావైభవమునకుఁ గారణములను శ్రీనాథుఁ డిట్లు చెప్పుకొన్నాడు.

ఆంధ్ర క్ష్మామండలా ఖండలుండైన
 వేమభూపతి కృపావీక్షణంబు
ఘోడెరాయాంక సద్గురురాజ భీమేశ్వ
 రస్వామి పదసమారాధనంబు
కమలాద్రి నిలయ మార్కండేయ శివమౌళి
 చంద్రాంశు నవసుధా సారధార
వేదాద్రి నరసింహ విపులవక్షస్స్థలి
 కల్హార మాలికానందలహరి.

కారణంబులు నుద్బోధతములుగాఁగ
సంభవించిన సాహిత్య సౌష్ఠవమున
వీరభద్రేశ్వరుఁ బ్రబంధ విభునిఁజేసి
కాశికాఖండముఁ దెనుంగుగా నొనర్తు.

ఈ సాహిత్య సౌష్ఠవకారణములెల్ల శ్రీనాథునకు రాజమహేంద్రవరమున సమకూరినవే.

ఇట్టి కవితా వైభవముల వేలయఁజేయుచు, సర్వ సౌఖ్యముల ననుభవించుచు నించుమించుగా క్రీ. 1450 సం॥ దాఁక శ్రీనాథుఁడు రాజ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మహేంద్రవరమున వర్తిల్లినాఁడు. అంతలో రాజమహేంద్రపరమున వేమ వీరభద్రారెడ్ల రాజ్యమును సంతరించినది.

రఘువంశమున దశరథుఁడు రాజ్యపట్టాభిషిక్తుఁ డగునాఁటనుండి మహామంత్రిగా నుండి దశరథమహారాజు మరణము మొదలుగాఁ దద్వంశ క్లేశములనెల్ల ననుభవించుచు సుమంత్రుఁడు చిరకాలము జీవించినట్లు, మన శ్రీనాథుఁడును పెదకోమటి వేమారెడ్డిగారి రాజ్యలాభము నాఁటినుండి తదాస్థానమున విద్యాధికార్యున్నతోద్యోగము వహించి, కొండవీటి రెడ్డిరాజ్య వైభవములు, పిదప రాజమహేంద్రవర రెడ్డిరాజ్య వైభవములు నమసిపోయినపిదపఁ గూడ జీవించి దీర్ఘజీవితమును బరువును మోపినట్లు మోపవలసిన వాడయ్యె. దాని నిఁక స్మరింపను.

రెడ్డిరాజ్య వర్ధంతి సభ
అధ్యక్షోపన్యాసము
[రాజమహేంద్రవరము.... 1939?
హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్పత్రిక
ఏప్రిల్, 1946,
రెడ్డి సంచిక : ఆగస్టు, 1947
సింహావలోకనము: 1955

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భృంగ పంచకము

కావ్యానికి గౌరవము ధ్వని రస భావాదులచే గలిగేదేకాని గ్రంథ పద బాహుళ్యంచే గలిగేది గాదు. "అమరుక కవేరేక శ్లోకః ప్రబంధ శతాయతే' అని ప్రఖ్యాతి. అమరు శతకంలోని ఒక్కొక్క శ్లోకము నాయికా నాయక కథా రసభావ ధ్వని చమత్కారములతో విడబరిచి వెల్లడిస్తే నూరు ప్రబంధాలు కాదగినంత వస్తుసామగ్రి కలది అని దీని భావము. సంస్కృతములో సాత వాహన సప్తశతి, గోవర్ధన సప్తశతి - మొదలగు గ్రంథములలో నున్న శ్లోకములు ఇట్టి యోగ్యత గలవే. రస భరితములయిన కథార్థములను గ్రహించి, అందులో మరీ కంద పట్టులనదగిన ఘట్టాలను వ్రేళ్ళ లెక్కకు కుదురుపఱిచి వాటిని పద్య రూపముగానో, చిత్ర రూపముగానో రచించడమనే సంప్రదాయము మన ప్రాచీనులలో ఉన్నది. బుద్ధ జాతక కథలలోని రసవంతములయిన కథా ఘట్టములు చిత్ర రూపముగా బౌద్ధ స్తూపములలో చిత్రితములయి యున్నవి. మఱిన్నీ కావ్య రూపంగా కూడ కొన్ని రసవంతమయిన కథార్థములు అయిదేసి శ్లోకములలో పంచకములు అను పేర సంస్కృతములో రచితములై యున్నవి.

హరిణీ పంచకము,తుక్భాపంచకము,వృశ్చికపంచకము,ఓదనపంచకము దారిద్ర్య పంచకము, తాబూల పంచకము, పానీయ పంచకము మొదలయిన కృతులు సంస్కృతంలో రసభరితములు చాలఁ గలవు. అందులో హరిణీ పంచకము, తుక్భాపంచకము గొప్ప చమత్కారము, కథా సందర్భము కలవి. హరిణీ పంచకము కరుణాద్భుత సమయము. తుక్భా పంచకము శృంగార రసాత్మకము. పై రెండింటికి అసాధారణ మయిన కావ్య గౌరవమున్నది. తుక్భా పంచకపు టయిదు శ్లోకముల కథను గొని నేటి కవి వర్యుడొకడొక ప్రబంధమునే రచించినాడు. హరిణీ పంచకపు శ్లోకములను వర్తమానాంధ్ర కవులు పలువురు ప్రపంచించి తెలిగించినారు. ఇప్పుడు మనము పరిశీలింపబోయే భృంగ పంచక మన్నది పైగ్రంథములను బోలిన కవితా గౌరవముగల ఆంధ్ర కావ్యము. కవి సార్వభౌముడు శ్రీనాథుడు దీనిని రచించినాడని ప్రతీతి. దీని కథ శృంగార రసాత్మకము. సంస్కృత భాషలో కూడా శ్లోకరూపముగ ఈ భృంగ పంచకమును జూచితిని గాని ఆశ్లోకములీ యాంధ్రపద్యములకు సంస్కృతీకరణ మనదగినట్లున్నవి. ఆంధ్రకృతియే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రథమ కృతియని నా నమ్మకము. ఈ భృంగ పంచకపుటయిదు పద్యములును, వాటి చమత్కార కథార్థములును కొంత చూద్దాము.

అనగా అనగా ఒక రాజు. ఆయనకు విలాసినీమణి అయిన దేవేరి యొకర్తె; రసిక శిఖామణియైన మంత్రియొకడు. ఆ రాణిగారికి ఆమంత్రి మీద మక్కువ. ఒకానొకప్పుడు రాజుగారూరు విడిచి పనిమీద గ్రామాంతరం వెళ్ళినారు. ఆ యదను చూచుకొని మంత్రి శిఖామణి అంతఃపురంలోకి గంతు వేసినాడు. కాని, ఆనాటి రాత్రికే రాజుగారు అచింతితంగా ఊరికి తిరిగి వచ్చి అంతఃపురంలో ప్రవేశించినారు. అంతఃపురద్వారాలన్నీ బందయినవి. ఆపద గుర్తింపజాలని స్థితిలో ఉన్న మంత్రిని హెచ్చరిస్తూ తదాప్తురాలయిన అంతఃపుర పరిచారిక యొకర్తె భృంగాపదేశంతో ఈ పద్యం చదివింది.

మ. మాయురె, భృంగమా, వికచ మల్లికలన్ విడనాడి తమ్మిలో
నీయెడఁ బూవుఁదేనియల నింపు జనింపగఁ గ్రోలి సౌక్కియన్
పోయెద నన్న తృప్తినిను బొందదు రాజుదయించె నిప్పుడీ
తోయజ పత్రముల్ వరుసతో ముకుళించెఁ జలింపకుండుమా.

భృంగమా-ఓయి మంత్రీ, రాత్రి అంతా సుఖంగా అనుభవించదగిన మల్లెపూలను-ఇతర స్త్రీలను-విడనాడి తామర పూవు-రాజాంతఃపురం దగ్గరికి, సంధ్యావేళ-రాజు రాదగిన వేళ, వచ్చి తనివితీరా స్వారస్య మాస్వాదించి కూడా వెడలిపోదామనే పరితృప్తి నీకు కలుగదాయెను. చిక్కులో పడ్డావు. రాజుదయించె-రాజుగారు వచ్చినారు.తామర తోపుఅంతాముకుళించుకు పోయింది- అంతఃపురపు తలుపులన్నీ మూసివేశారు. మళ్ళీ తామర పూవు విరిసేదాకా- తలుపులు తెరపి అయ్యేదాకా ఏ మూలనో ఒదిగి అవస్థపడుతూ ఉండుమా అని మంత్రికి హెచ్చరిక యీ పద్య భావము.

రాజు అంతఃపురంలో ఉన్నాడు. ఎంతో కొంత రాత్రి గడచింది. మంత్రిచాటున, మాటున ఉడిగి ఉండలేకుండా ఉన్నాడు. తన ఆప్తులెవరైనా నెమ్మదిగా తలుపులు తెరుస్తారేమోనని ద్వారాలదగ్గరకు వచ్చి తలుపులూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గించి చూస్తూ ఉన్నాడు. చప్పుడయింది. వెలుపలనున్న దూతిక దానిని గుర్తించింది. మళ్ళీ మంత్రిని ఇట్లా హెచ్చరించింది.

అళికుల వర్య, పద్మముకుళాంతరమందు వసింపనేరమిన్
చలనము చెందెదేమి? నవసారసమిత్రుఁడు రాకయుండునా?
తొలఁగక యందె యుండు మిఁకఁ దోయజవైరి తిరంబె రాత్రి యీ
కలవరమేల తమ్మి తుద గానక యూరక తూరకుండుమా.

ఇందులో నవసారసమిత్రుడు అనగా వీరి కనిష్టుడయి తలుపులు బిగించిన ద్వారపాలకుడు గాక వీరి సారస్యమున కనుకూలుడయిన వాడు వేత్రాక ద్వార పాలకుడని భావము. వాడు వేకువను తలుపులు తెరవగలడనీ రాజు రాత్రి అంతా అంతఃపురంలో ఉండడనీ, నీ వడుగడుగుకు తలుపుం దగ్గరికి వచ్చి గజిబిజి చేయవద్దనీ పద్య భావము.

మంత్రి భార్య పరమ సాధ్వీమణి. తన మగని ప్రవర్తన మంతయు తానెరుగును. తన భర్తకెన్నిమారులో హితముపదేశించినది. కాని అతడా హితము వినక పోయినాడు. ఈ ప్రవర్తనమువల్ల తన మగని కెప్పుడేమి కీడు వాటిల్లగలదో అని ఆవిడ దిగులు పడుతూ ఉండేది. నాడు మంత్రి అంతఃపురంలో ఉండడం, ఆ స్థితిలో రాజుగారు ఊరికి రావడం, మగడు ఇంటికి రాకపోవడం తెలుసుకొని, అతనికి అశుభం ఏదయిన జరిగిందేమో నన్న ఆదుర్దా ఆపుకోలేక గగ్గోలుగా రాజ ద్వారం దగ్గరకు వచ్చింది. ఆమెను హెచ్చరిస్తూ దూతిక ఈ పద్యం చదివింది.

అలినీ, తత్తర మేలనేఁడు నిట నీ యాత్మేశుఁడౌ భృంగమున్
జలజానక మరందపానవశతన్ సానందుడై యున్నవాఁ
డులుకింతేనియు లేక నీవరుగుమా యొప్పార నిప్పాట నీ
చెలువుండుం బరతెంచు వేకువను రాజీవంబు పుష్పించినన్.

మంత్రి భార్య గుండె కుదురు పరుచుకొని యింటికి వెళ్ళినది. వేకువ జామయింది. రాజుగారు. గాఢనిద్ర చెందినారు. ద్వారపాలకులు సన్నగా తలుపులు తెరచినారు. తమరింక వెలుపలికి దయచేయ వచ్చునని మంత్రి గారిని హెచ్చరిస్తూ దూతి చదివిన పద్యము.

పతినిద్రించినవేళ రాఁదగునయో పద్మాళి, యీ కేళికా
యతనంబందు రతి శ్రమన్ విభుఁడు నిద్రాసక్తుడై యుండె నీ
శతపత్రేక్షణ మోము విచ్చినది నీ సామర్థ్యముం జూప కిం
కతివేగంబుననేఁగు మా తొలఁగి మాయాత్మల్ సుఖంబందగాన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఓయి భృంగమా-మంత్రీ రాజుగారంతఃపురములోకి రాదగిన వేళలో నీవు రావచ్చునా? ఏదో అయింది. రాజుగారు గాఢనిద్రలో ఉన్నారు. వేకువ అయింది. అంతఃపురపు తలుపులు తెరిచారు. మళ్ళీ వికారపు చేష్టలు చేయక వడివడిగ వెడలిపో. మా తంటాలు తీరుతవి అని మంత్రికి హెచ్చరిక యీ పద్యభావము.

మంత్రి అంతఃపురము విడిచి యింటికి వెళ్ళాడు. కడచిన రాత్రి రాజమహిషి కంఠహారమొక్కటి మంత్రి కంఠమున పడింది. మంత్రి దానిని గుర్తింపనేలేదు. దానిని తీసివేయకుండా మరునాడు దానితోనే రాజసభ నలంకరించాడు. దూతి దీనిని గుర్తించింది. రాజుగారిది గుర్తిస్తారేమో కొంప మునిగిపోతుందని భయపడి భట్రాజువేషం వేసుకొని రాజసభకు వచ్చి సభ్యులకు జోహారు చేయడం మొదలుపెట్టింది. ఆ జోహారులు చేసేటప్పుడు తన రెండు చేతులు మంత్రి గుండెకేసి చూపిస్తూ 'మాన పరిపాల' అనే విశేషణంతో జరిగిన అసందర్భాన్ని హెచ్చరిస్తూ పద్యం చదివింది ఇలాగా-

అతుల సభాంతరస్థిత బుధావళికెల్ల జోహారు వీర రా
హుతులకు మేల్ జోహారు సతతోజ్జ్వల విక్రమ సార్వభౌమ సం
తతికి జోహారు వైభవ వితాన పురందరుడైనయట్టి భూ
పతికి జోహారు మాన పరిపాల జోహారు ప్రధానశేఖరా.

మంత్రి ఈ హెచ్చరికను గుర్తించాడు; నాలుకను కఱుచుకొన్నాడు. రాజుగారి కెరుకపడకుండా తనమెడలోని రాజమహిషి కంఠహార మునుపై పచ్చడములో పొదిపి వందివేషముతోనున్న దూతికి పారితోషికముగా ఇచ్చి వేసినాడు. కథ ముగిసినది.

ఇటువంటి చిత్ర కథా కలితములయిన చిటిపొటి కృతులలో కథాసారమున కంటె, సారస్వత రచనా చమత్కృతికే విలువ యివ్వవలెను. కథ యిందు ప్రధానము గాదు.

[రేడియో ప్రసంగము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్నమయ్య

ప్రజలలో హృదయపరిపాకము చాలగా నేర్పడినప్పుడే కవిత్వము, సంగీతము, శిల్పము, మొదలయినసుకుమారకళల సారస్యమును గుర్తించుట జరుగును. క్రూరహృదయులు సుకుమారకళల గుర్తింపలేరు. వానిని రక్షింపను లేరు. జాతిద్వేషము మతద్వేషము మొదలయినవి చెలరేగినపుడు వీనికి వినాశము తప్ప అభ్యుదయము ఉండదు. పయికారణములవలన క్రీ. ౧౫౬౫ నాడు ఆంధ్రదేశమున సంగీతకళ విధ్వస్తప్రాయమయినను, అంతకు నూతేండ్లకుపూర్వ మాకళకు ప్రాణము పోసినమహనీయులను గూర్చి యించుక ముచ్చటింతము. అది యాంధ్రదేశమున శ్రీనాథుడు, పోతరాజు, భవ్యకవితలు వెలయించినబంగారుకాలము. ఆకాలమున ననఁగా క్రీ. ౧౫ శతాబ్ది ప్రథమపాదమున తాళ్ళపాక అన్నమయ్య యను భక్తశిఖామణి కడపమండలము తాళ్ళపాక గ్రామములో నందవరీక స్మార్తబ్రాహ్మణకుటుంబమున నవతరించినాఁడు. అతనికిఁ బదునారవయేట శ్రీవెంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై వరకవితావైభవమునుబ్రసాదించినాడట. అనాటినుండియు నాతఁడు దినమున కొక్కసంకీర్తనకుఁ దక్కువకానట్లు డెబ్బదితొమ్మిదేండ్లదాక సంకీర్తనములు గావించుచుండెను.

తాను జన్మచే స్మార్తబ్రాహ్మణుడైనను విశిష్టాద్వైతమతసామర్థ్యమునకు, సర్చావతారవైభవమునకు, శరణాగతి మాధుర్యమునకు శ్రీవెంకటేశ్వర మాహాత్మ్యమునకు, లోబడి అహోబలమఠాధీశ్వరుడయిన ఆదివన్ శఠకోపయతి శిష్యుడై వైష్ణవమతమును స్వీకరించినాఁడు. పరాంకుశయతిప్రభృతులుద్రవిడవేదాంతమునువెలయించినట్లుగాఆళ్వార్ల సంప్రదాయమును జక్కగా ననువర్తించి యుపనిషదర్థప్రతిపాదనములతో స్వానుభవనివేదనములతో సరససంగీతకలావిలాసములతో సర్వసులభముగా సంకీర్తనాత్మకముగా సంధ్రవేదాంతము నవతరింపజేసినాడు. ఇప్పుడవి యన్నియు దొరకుటలేదు గాని, యాతడు ముప్పది రెండు వేల సంకీర్తనములు గావించినాడట. స్వామి నొక సంకీర్తనలో "నే నొకండ లేకుండితే నీ కృపకు పాత్ర మేది హుని నావల్లనే కీర్తి హొందేవు నీవు".

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని హెచ్చరించినాఁడు. ఈతని శృంగారసంకీర్తనాంశ మిన్నూటేండ్ల తర్వాత క్షేత్రయగాను, అధ్యాత్మసంకీర్తనాంశ మటు తర్వాత నూఱేండ్లకు త్యాగయ్యగాను నవతరించె నన జెల్లును.

అన్నమయ్య బాల్యమున విద్యానగరసామ్రాజ్యమును సాళ్వనరసింహ రాయ డాక్రమించుకొను ప్రయత్నమున నుండినాడు. అన్నమయ సహాయము గాని వెంకటేశ్వరస్వామిదయతో కొన్నియేండ్లప్రయత్నముమీఁద నాతడు కృతార్థు డైనాడు. అన్నమయ్య నందలా లెక్కించి యసాధారణవైభవము ననుభవింపజేసినాడు. రాయ డొకనా డన్నమాచార్యుని స్వామిమీద శృంగార సంకీర్తనములు పాడగోరెను. అన్నమయ్య పాడెను.

నాదనామక్రియ

-పల్లవి-

ఏమొకో చిగురుటధరమున యెడనెడ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసినపత్రిక కాదు గదా
కలికి చకోరాక్షికి గడకన్నులు గెంపై తోచిన చెలువం బిప్పు డిదేమో
చింతింపరె చెలులు.
నలువునఁ బ్రాణేశ్వరువై నాటివయాకొనచూపులు నిలువునఁ బెరుకు
నలదిన నెత్తురు కాదు గదా.

-అన్నమాచార్యచరిత్రపీఠిక ౫౧ పుట.

ఇట్టి కీర్తనలు తనపై గూడ జెప్పగోరెను. అన్నమయ యసహ్యపడెను. కోపించి రాయ డన్నమయకు సంకెళ్ళు వేయించెను. పాటలు పాడి యన్నమయు సంకెళ్ళు విడగొట్టుకొనెను. రాయడన్నమయమాహాత్మ్యమున కచ్చెరువడి శరణాగతు డయ్యెను. అన్నమయ క్రీ. ౧౫౦౩, దుందుభి ఫాల్గునబహుళ ద్వాదశినాడు దివ్యధామ మందినాడు. ఆనాడు తండ్రిని గూర్చి పెదతిరుమలాచార్యుడు చెప్పినసంకీర్తనము-(ఇక్కడ అన్నమాచార్య చరిత్ర పీఠిక పాటచేర్పములోని ౭౩వపుటలోని : అటిమురిచూడబోతేనజ్ఞాని నేను" గాని ౭౫వపుటలోని "వారియవతారమితండు" అన్నపాటనుగాని పాడవచ్చును. అన్నమాచార్య చరిత్రపీఠిక ౧౩౦పుట-) మరి తర్వాతవత్స రములలో నాతని. తీర్థదినమునాడు చెప్పినసంకీర్తనములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీరాగము

దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు
జనకుండ అన్నమాచార్య విచ్చేయవే - ఆపీఠిక ౧౩౦వ పుట

అన్నమయసంకీర్తనములు రాగిరేకులపై చెక్కి దేవస్థానమున దాచినారు. క్రీ. ౧౫౬౫ విద్యానగర వినాశనముచే తిరుపతిదేవస్థాన వైభవము, తికమకలై తాళ్ళపాకవారి ప్రాభవము తార్మారై వారిసంకీర్తనప్రఖ్యాతి నమసిపోయినది. కొంతకాలము చెల్లిపోగా మట్లరాజులు మరల స్వామి వైభవము సంరక్షింపగా క్రీ ౧౭౦౦ ప్రాంతములయందు మరల రేకెత్తసాగినది. అది యిప్పుడిప్పుడే గొప్పగా గుర్తింపనగుచున్నది. అన్నమాచార్యులయు, తత్పుత్రు డగుపెదతిరుమలాచార్యులయు విగ్రహములు రాగిలో, రాళ్ళలో మలచినవి దొరికినవి. అన్నమాచార్య చరిత్ర మని యన్నమయమనుమడే రచించినగ్రంథము దొరికినది. సంకీర్తనముల ముద్రణము సాగుచున్నది. అన్నమయ సంకీర్తనముల ప్రఖ్యాతికిఁ దాళ్ళపాకవారివంశ కవితా గౌరవములకుఁ దగినట్టు అన్నమాచార్యోత్సవమును దేవస్థానమువారు గొప్పయుత్సాహముతో సాగించుచున్నారు. గొప్పయాంధ్ర గాయకు లందు పాల్గొనుచున్నారు. త్యాగరాయసంకీర్తనలకంటె నన్నూఱేండ్లపూర్వకాలమునాటివి యగునన్నమాచార్యసంకీర్తనముల నాంధ్రులే జగత్ప్రఖ్యాతికి దేవలసియున్నారు.

పల్లవి, అనుపల్లవి, చరణములు అనువిభాగములతో నేడు వ్యవహరింపబడు సంకీర్తనముల కన్నమాచార్యుడే సృష్టికర్త యట. యతిప్రాసలు గలిగి, సమము, అర్ధసమము విషమము, అని ముత్తెఱగుల పాదములు గలిగి, ప్రతిపదముతుదను అన్నిపదములకు నేకవాక్యత కల్పించు పల్లవి యను పేరు గల తొలిపదము గలిగి. అభోగ మను పేరు గల తుది ముద్రాపదము గలిగి ఉద్గ్రాహమేళాపకధ్రువాఖ్య లగు నడిమి పదములు గలిగి యొప్పారు గేయమునకు నింబధ మనుపే రని యన్నమాచార్యుడు పేర్కొన్నాడు. రెండు చరణము లున్నచో దొలిపదము పేరు పల్లవి యనియు నది యొక్కచరణమే కలదైనచో శిఖాపద మనియు, పల్లవి యున్నచో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శిఖాపద మక్కరలే దనియు, శిఖాపద మున్నచో పల్లవి యక్కరలే దనియు నన్నమయ చెప్పినాడు. అతని సంకీర్తనము లనేక రాగములలో నున్నవి. వేళ్ళొక్కతీరుననే యున్నను గొన్నిరాగముల లక్షణములు చాల మారినవట. అన్నమయ పేర్కొన్నరాగములు గొన్ని యిప్పుడు వాడుకలోలేవట. ఆయా రాగములను సరిగా గుర్తించి ఆసంకీర్తనములను రాగములను శక్యము లగునంత వరకు సంప్రదాయప్రకారము సంరక్షించుటకును ఆంధ్రగాయక వర్యు లభిలషింతురుగాక.

[రేడియో ప్రసంగము
విజయవాడ? 15-5-1948?
సింహావలోకనము : 1955]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృష్ణరాయల విద్యా గోష్ఠులు

కృష్ణరాయలయాస్థానమున నెనమండ్రు తెలుఁగుకవీశ్వరులష్టదిగ్గజము లనుపేర వెలసియుండి రనులోకప్రతీతిని వీరేశలింగము పంతులుగారు విశ్వసింపకపోయిరి. కృష్ణరాయఁడు కవితాప్రియుఁడుగాన యాయనయాస్థానమందు లేకున్నను బలువురుకవీశ్వరుల నప్పటివారినిగా భావించి పామరలోకము కట్టుకథలు కల్పించె నని వారు తలంచిరి. వీరేశలింగముపంతులుగారితలఁపు యుక్తమయినది కాదని యిప్పుడు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది.

చాటుపద్యమణిమంజరి ద్వితీయభాగమునఁ గందుకూరి రుద్రకవి చరిత్రమును నేను రుద్రకవివంశ్యులకడనుండియే కైకొని ప్రకటించితిని. రాయలయాస్థానమునం దష్టదిగ్గజము లనఁబడు నెనమండ్రుకవులలో రుద్రకవియొకఁడనియు, నాతఁడీశాన్య సింహాసనాసీనుఁడై యుండువాఁడనియు నందుఁ గలదు. అనఁగా రాయలసభాస్థాన మగుభువనవిజయమున నెనిమిది దిక్కుల నెనిమిది సింహాసనము లుండెడి వనియు, వానిపై దిగ్గజము లనఁబడు నెనమండ్రు కవులు నాసీనులై యుండెడివా రనియు నర్థమగుచున్నది. రుద్రకవిచరిత్రమే కాక యీక్రింది శాసనశ్లోకముగూడ రాయల యాస్థానమం దష్టదిగ్గజము లనుకవు లుండెడివా రని తెల్పుచున్నది.

శ్లో॥ యత్కీర్తి ర్భువనైకభూషణ మభూ ద్యస్య ప్రసాదా న్నరా
స్సర్వే రాజసమానతా ముపగతా స్సంప్రాప్య విత్తం బహు
యస్యాష్టౌ కవిదిగ్గజాః పృథుయశోభారాజగచ్ఛోభవా
యద్దానోదకసామ్య మేవ సరితా మాసేతుశీతాచలమ్.

ఈ శ్లోకము రాయలు నందిదుర్గమున సోమశంకరస్వామికి నాలయము కట్టించినప్పుడు చెక్కించినశాసనమందున్నది. ఆ శాసనమువ్రాఁతప్రతి ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నున్నది. కృష్ణదేవరాయఁడు రచించినదిగా జాంబవతీకల్యాణ మని సంస్కృతనాటక మొకటి కలదు. తంజావూరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లైబ్రరి నుండి దాని ప్రతినిగొనివచ్చి శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు చెన్నపురిలైబ్రరికొసంగిరి. దానిలోఁ బ్రస్తావన కొంత గ్రంథపాతములు గలిగి యున్నది. గ్రంథకర్త కృష్ణరాయఁడనియే యం దున్నది. కాని గ్రంథాంతమందీశ్లోక మున్నది:—

శ్లో॥ ....
శేషక్ష్మాధరనాయకస్య కృపయా సప్తార్ణవీమధ్య గాం
రక్షన్ గామిహ కృష్ణరాయనృపతి ర్జీయా త్సహస్రం సమాః.

ఈనాటకము ప్రాకృతబహుళమై సంస్కృతచ్ఛాయ లేక గ్రంథపాతములతో నున్నది. కాన నసిగా ముద్రించుట దుష్కరము. దీని నేనుజదివితిని. కృష్ణుఁడు జాంబవతిని బెండ్లాడుట యిందలికథావస్తువు. కథానాయకుడగుకృష్ణుఁడు కృష్ణదేవరాయఁడుగాను, నాయిక యగుజాంబవతి ప్రతాపరుద్రగజపతి కుమార్తె యగుభద్రాదేవిగాను నాకు స్ఫురించినది. ఈదృష్టితోఁ జూడఁగా నాటక మెల్ల శ్రీకృష్ణదేవరాయలకథను జెప్పునదిగా సమన్వయింపదగినట్లు నాకు గోచరించినది. అయినను నీవిషయమింకను పరిశోధింపఁదగినది.

కృష్ణదేవరాయలు సాహిత్యమందేకాక సంగీతమందును మిక్కిలి యభిరుచి గలవాఁడు. ఈయన యాస్థానమున బండారు లక్ష్మీనారాయణుఁడని యొక సంగీతవిద్వాంసుఁ డుండెను. రాయల యంతఃపురస్థానమున నాయన నాట్యరసాధిపత్యము వహించి యుండెడివాఁడు. అతఁడు రచించినది సంగీతసూర్యోదయమని యొకసంస్కృతగ్రంథ మిప్పుడు దొరకినది. దాని పీఠికలో విద్యానగరము, కృష్ణరాయల దిగ్విజయములు వర్ణితములయినవి. రాయల దిగ్విజయవర్ణనములలో నపూర్వవిషయములొండు రెండు గానవచ్చుచున్నవి. సంగీతసూర్యోదయకారునకు నభినవభరతాచార్య, రాయబయకార, తోడరమల్ల, సూక్ష్మభరతాచార్య బిరుదములు గలవు. కృష్ణరాయలీయనకు బంగారుపల్లకీ, ముత్తెసరులజల్లులు గలవి రెండు ముక్తాతపత్రములు, మదపుటేనుఁగులు, మలహరీవాద్యమునొసంఁగెను. ఈయన విష్ణుభట్టారకులయొద్ద దత్తిల కోహలాది భరతమతగ్రంథములను సవ్యాఖ్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముగా నధ్యయనము చేసినాఁడు. తాళాధ్యాయము, నృత్తాధ్యాయము, స్వరగీతాధ్యాయము, జాత్యధ్యాయము, ప్రబంధాధ్యాయము నని యయిదధ్యాయములతో నీతఁడు సంగీతసూర్యోదయము రచించినాఁడు. ఈయన గ్రంథావతరణిక నుండి కొన్ని శ్లోకములు.

శ్లో॥ కర్ణాటాహ్వయదేశసౌఖ్యజననీ శ్రీతుంగభద్రావృతా
మాతంగోన్నతమాల్యవత్ క్షితిధరశ్రీ హేమకూటాన్వితా
పంపాధీశ్వరవిట్ఠలేశ్వరకృపాదృష్టిప్రభామండితా
శ్రీవిద్యానగరీ విభాతి ధరణీధమ్మిల్లమాణిక్యవత్.

*   *   *

శ్లో॥ బాల్యే ఽసౌ సకలకలాకలాపయుక్త
స్స్వప్రా[త్రా?]ణం సపది విజిత్య గంగరాజం
భఙ్క్త్వా తచ్ఛివనసముద్ర ముత్కటంద్రా
గావాసం వ్యతనుత నిర్భరం శివానామ్.

శ్లో॥ దుర్గం జిత్వాథ సోఽసా వుదయగిరివరం తత్ర రాహుత్తరాజం
బందీకృత్వాశు హృత్వా యుధి నగరవరే కొండవీడ్కొండపల్లౌ
జీవగ్రాహం గృహీత్వా గజపతితనయం పొట్టునూర్పట్టణాగ్రే
విశ్వశ్లాఘ్యప్రతాపో బిరుదయుతజయస్తంభ ముచ్చైర్న్యఖానీత్.

శ్లో॥ సోఽయం కృష్ణనరేశ్వరో గజపతిం జిత్వా తదీయశ్రియా
సాకం తన్య సుతా ముదూహ్య యవనక్ష్మాపం సపాదం తతః
గొబ్బూరుస్థలవాసినం సరభసం జిత్వాను విద్రావ్య తం
హస్త్యశ్వా స్స తదీయదుర్గ మతులం .....మారు మాదత్తవాన్.

శ్లో॥ కృష్ణా ముత్తీర్య సోఽయం యవనజనపదం వహ్ని సాత్కృత్యసర్వం
పేరోజాంబాదసించాద్వరు [?] నగరసమాఖ్యాని దుర్గాణి జిత్వా
భఙ్క్త్వోచ్చైః పారసీకం కలుబరగపురీం ద్రాక్సపాదార్ధమానః?
కాంతా [క్రాంత్వా?] వ్యాకృష్టవాన్ దోర్బలఘనత్రీన్ సురత్రాణపుత్రాన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రంథకర్తః

శ్లో॥ తస్య శ్రీకృష్ణరాయస్య కృపాక్షీ రాబ్ధిచంద్రమాః
లక్ష్మీనారాయణో నామ వర్తతే నరసాగ్రణీః
సదాఽభినవశబ్దాదిభరతాచార్యనామకమ్
బిరుదం ధరణీచక్రే ధత్తే చక్ర మి వాచ్యుతః

శ్లో॥ శ్రీమత్కృష్ణనరేశ్వరస్య దయయా స్వర్ణాంచితాం పాలకీం
ముక్తాగుచ్ఛకృతాను బద్ధవలయం ముక్తాతపత్రద్వయమ్
శశ్వన్మత్తమతంగజా న్మలహరీవాద్యం నిజాంతఃపుర
స్థానే నాట్యరసాధిపత్య మనకృల్లక్ష్మీపతిః ప్రాప్తవాన్.

శ్లో॥ సంగీతాగమలక్ష్యలక్ష్మనిపుణై శ్శ్రీవిష్ణుభట్టారకైః
జ్ఞాత్వా దత్తిలకోహలాదిభరతగ్రంథాన్ సుటీకాన్వితాన్
భూమౌ కీర్తిశరీరరక్షణధియా గ్రంథః కృతోఽయం మయా
.... యోగ్యతాధికతర స్సంగీతసూర్యోదయః

గద్యము

ఇతి శ్రీమద్విప్రకులవర్య భండారువిట్టలేశ్వరనందన సూక్ష్మభరతా [లిఖితా?] చార్య రాయబయకార తోడరమల్లాభినవభరతాచార్య శ్రీలక్ష్మీనారాయణవిరచితే సంగీత సూర్యోదయే.

ఇంకొక విశేషము

ఈ భండారులక్ష్మీనారాయణుఁ డిట్లు కృతికర్త యగుటేకాక మఱి కృతిభర్తయు నయినట్లెఱుఁగఁబడుచున్నాఁడు. భానుకవి యని యొక తెనుఁగు కవి యితని కంకితముగాఁ బంచతంత్రిని దెనిఁగించినాఁడు. చిట్టయమంత్రి [చిట్టమరసు?] ప్రేరణచే నరసింహభట్టు, నరసమంత్రి, అవధానము కృష్ణ ఘనుఁడు, భరతము విష్ణుభట్టు [ఈతఁడే లక్ష్మీనారాయణునకు సంగీతాగమము నుపదేశించినవాఁడు] అనువారు సమ్మతించి ప్రోత్సాహపఱుపఁగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్ష్మీనారాయణుఁడీభానుకవిని దనపేరఁ బంచతంత్రిని దెలిఁగింపఁ గోరినాఁడఁట! భానుకవి తనకృతిపతి సంగీతసూర్యోదయము రచించె నని చెప్ప లేదు గాని యాతనిబిరుదములను, నభినవభరతాచార్యాదులను దఱచుగా గ్రంథమునఁ బేర్కొన్నాఁడు.

క॥ పతికంటె మంత్రి బలిసిన క్షితి యాతని దైతనర్చు సిద్ధము సతి దాఁ
బతికంటె ఠవరయైనను బతికార్యము చెడును నూత్నభరతాచార్యా!

విద్యానగరము నీతఁ డిట్లు ప్రశంసించినాఁడు.

సీ॥ పంపావిరూపాక్ష భైరవవిట్ఠలేశ్వరముఖ్యదేవతావ్రజముచేత
పరిపంథిగర్వవిభాళనశ్రీకృష్ణరాయభూధవభుజారక్ష చేత
భటనటజ్యౌతిష పౌరాణికభిషగ్విచక్షణ సత్కవీశ్వరులచేత
సంతతమదవాహి చారుశుండాలస్ఫుటాజవప్రకటఘోటములచేత

గీ॥ రమ్యమై యుండువిద్యాపురంబునందు
నిమ్మహాకృతి భానుకవీశ్వరుండు
తెనుఁగుబాస నొనర్చెను వినుతి కెక్క
నవని నాచంద్రతారార్క మగుచుఁ దనర.

ఈ పంచతంత్రిలోని కథలోఁ గూడ నీతిపద్యములు కృతిపతిసంబోధనముతో నున్నవి. "కరణికలక్ష్మీ, సూక్ష్మలిఖితాచార్య, విట్ఠయలక్ష్మధీమణీ" ఇత్యాదులు. ఇట్టి సంబోధనములవలన నీతఁడు సంగీతాచార్యుఁడే కాకమంత్రియు నని యెఱుఁగ నగుచున్నది.

మాదిరి కొకపద్యము:—

సీ॥ విద్య కవులయందు విశ్రాణ నందును
ప్రత్యర్థివిభులందు బాహుబలము
శరణాగతులయందుఁ గరుణాకటాక్షంబు
నృపకార్యములయందు నీతిగరిమ
బంధుసంతతియందుఁ బరమసంతోషంబు
నాశ్రితులందుఁ బాయనితలంపు
ధర్మమార్గమునందుఁ దగిలిన చిత్తంబు
సత్యవాక్యములందుఁ జతురతయును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ॥ గలిగి యెవ్వాఁడు మెలఁగు జగత్త్రియమున
నతనికీర్తులు లుబ్ధమోహాంధతమస
పటల మణఁగించుఁ జంద్రికాప్రభలయట్లు
లలితగుణధుర్య ! విట్ఠయలక్షణార్య !

కృష్ణరాయలు రాజ్య మేలుచుండఁగా నీశ్వరదీక్షితుఁడనుసంస్కృత విద్వాంసుఁ డొకఁడు వాల్మీకిరామాయణమునకు బృహద్వివరణ మని లఘు వివరణ మని రెండు వ్యాఖ్యలు రచించినాఁడు. శ్రీకృష్ణరాయల కఱువది గడియలలో రామాయణ మేడుకాండలు వినిపించి యాయనప్రోపునఁ జిత్ర కూటమున [హంపి] నుండి రామాయణవ్యాఖ్యలు తాను రచించినట్లాతఁడు చెప్పుకొన్నాఁడు.

శ్లో॥ బృహద్వివరణం చైవ తథా వివరణం లఘు
వ్యధాద్రామాయణే వ్యాఖ్యాద్వయ మీశ్వరదీక్షితః

శ్లో॥ కర్ణాటాధీశ్వరే రాజ్యం కృష్ణరాయే ప్రశాసతి
రామాయణం చిత్రకూటే వ్యాఖ్యాదీశ్వరదీక్షితః

నగరు, తగరు, తొగరు, పగరు అని చరణాద్యక్షరములుండునట్లు రామాయణ, భారత, భాగవతపరములుగా మూఁడు పద్యములు చెప్పుమని పెద్దన సమస్య యడుగగానట్లే చెప్పి సత్కృతుఁ డయినచింతలపూఁడి యెల్లయకవికి శ్రీకృష్ణరాయలు రాధామాధవుఁడని బిరుదనామ మిడెను.

శా॥ రాధామాధవ మచ్యుతాంకితముగాఁ బ్రౌఢక్రియం జెప్పిత
న్మాధుర్యంబునఁ గృష్ణరాయవిభుఁ గర్ణాటేశు మెప్పించి నా
నాధాతృప్రతిమానత్కవులలోనన్ భూషణశ్రేణితో
రాధామాధవనామ మందినజగత్ప్రఖ్యాతచారిత్రుఁడన్.

ఈ రాధామాధవకవికృతులు రాధామాధవము, విష్ణుమాయావిలాస నాటకప్రబంధము, తారకబ్రహ్మరాజీయము నను నవి దొరకియున్నవి.

అముక్తమాల్యద కృష్ణదేవరాయవిరచిత మని గ్రంథమందున్నను పెద్దన రచించిన దని లోకమునఁ బ్రతీతికలదు. వ్యాఖ్యాతలు లాక్షణికులు కొందఱట్లే గ్రంథములందును జెప్పినారు. అముక్తమాల్యదావ్యాఖ్యాత శ్రీనివాసకవి--

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ॥ ఉరు వగు విష్ణుచిత్తతనయోద్వహనంబును సంస్కృతాంధ్రవా
గ్గరిమ నలంక్రియారసనఖం బగునట్లుగఁ బెద్దవార్యుఁ డు
ద్ధురభణితిన్ రచించె నది దుర్ఘటబోధము గావునన్ ధరన్
స్థిర మగుచుండునట్లుగను జేసెదఁ డీక సవిస్తరంబుగాన్.

గుడిపాటి వెంకటకవి—

గీ॥ ప్రేమ నల్లసాని పెద్దన యాముక్త
మాల్యదాఖ్యకృతి సముంచితముగఁ
జేసె నీవు టీక చేయుము చెఱకునఁ
బండు పండినట్టు లుండుఁ గాన.

సీ॥ కర మర్థిఁ గవిరాయగండపెండేరంబు చెల్లించుకొన్నట్టిబల్లిదుండు
కవులలోపల నాంధ్రకవితాపితామహబిరుదాంకుఁ డైనగంభీరమూర్తి
మనుచరిత్రాదిసమ్యక్కావ్యరచనలఁ జల్పినవైష్ణవచక్రవర్తి
కృష్ణరాయలు తన కేల్దమ్మిచే నెత్తఁ బల్లకి యెక్కినభాగ్యశాలి

గీ॥ యలఘుఁ డలసాని పెద్దన యాఘనుండు
మహిమఁ జేసినయాముక్తమాల్యదాప్ర
బంధ మెచటఁ దదీయధీపటిమ యెచట?
నాకు శక్యంబె దానికిఁ డీక నేయ?

రంగరాట్ఛందస్సులోఁ గూడఁ బెద్దన చెప్పినయాముక్తమాల్యద యని యున్నది.

విశాఖపట్టణమండలమున 'ప్రపంచదర్పణ' మని యొక సంస్కృత గ్రంథము ప్రాచ్యలిఖితపుస్తకశాలవారికి దొరికినది. అది సంధానగ్రంథము. ప్రాచీనగ్రంథములనుండి యనేకవిషయములందు సంకలనము చేయబడి నవి. అం దీక్రింది శ్లోకములున్నవి. అల్లసాని పెద్దనార్యేణ సత్యావధూ పరిణయే-

శ్లో॥ అంగుళీషు కురంగాక్ష్యా శ్శోభతే ముద్రికావళీ
ప్రోతేవ బాణైః పుష్పేషో ర్న్యస్తలక్ష్యపరంపరా.

అల్లసానిపెద్దనాఖ్యే నాప్యేవ ముక్తం రసమంజర్యామ్--

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్లో॥ ఉడురాజముఖీ మృగరాజకటి ర్గజరాజగతిః కుచభారనతా
యది సా రమణీ హృదయే రమతేక్వ జపః క్వ తపః క్వసమాధిమతిః-

మొదటిశ్లోకము గలగ్రంథముపేరు సత్యావధూప్రీణనమయి యుండునేమో! ఆముక్తమాల్యదలోఁ గృష్ణరాయల కృతులుగా నీగ్రంథములు గలవు గదా!

"సీ॥ పలికి తుత్ప్రేక్షోపమల"--

ఇత్యాది పద్యమున-

"భావధ్వనివ్యంగ్య సేవధి గాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు". మఱియు--

"రసమంజరీ ముఖ్యమధుర కావ్య, రచన మెప్పించుకొంటి
గీర్వాణభాష"

ఈ సంధానగ్రంథమున నీపేళ్ళతోఁ బెద్దనార్యకృతులను బేర్కొనుట వింత గదా! కృష్ణరాయకృతులలోనివిగాఁ గూడనందు శ్లోకములున్నవి.

కృష్ణరాయ స్యాలంకారసారసంగ్రహే--

సిందూరం రవి మిందు మానవ మసౌ ధమ్మిల్ల రాహో ర్గ్రహో
దృగ్గాఢం గ్రసతీతి తచ్చ విబుధై ర్నిర్ణీత మౌత్పాతికమ్
జ్యోశే చంచలతా భవిష్యతి హఠా త్స్యాత్కుంతలే కర్షణమ్
కాం .... హే............ అంగే మహా న్సంగరః

ఇందుఁ జూపఁబడినశ్లోకములు సుభాషితరత్న భాండాగారమునఁ గూడ నున్నవి, "అంగుళీషు" ఇత్యాదిశ్లోకమ బిల్హణునిదిగా నందుఁ జెప్పఁబడినది. తక్కినవి యెవ్వరు రచించినవో యందు లేదు.

ఆగ్రంథసంధాత యోగ్యుఁడు. ప్రసిద్ధగ్రంథముల పేళ్ళతో నెక్కడివో తెలియరానిమంచిశ్లోకములఁ గూడ నాతఁడు గూర్చియుండునని సందేహించుట కందుఁ గొన్నిచోట్ల నెడము గలుగుచున్నది. ఈ శ్లోకము లట్టి వయి యుండవచ్చునేమో!

భారతి (1-4-65)
ఏప్రిల్ 1925
మీగడ తఱకలు 1951]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్ర ప్రబంధ కవితా ప్రశంస.*

ఆంధ్ర కవితాకలా కాల రత్న హారమున శ్రీకృష్ణదేవరాయల కాల మొక తరళ రత్నము. ఆమహారాజుసుకృత విశేష మెట్టిదో కాని, యాంధ్ర కవిత, యతని పాలన కాలమున దివ్యవైభవ మనుభవించినది. దివ్య సౌందర్యము తీర్చుకొనినది. తిన్నని తీరుల దిద్దుకొనినది. ఔచితీ నిర్వాహ మలవఱచుకొనినది. సంస్కృతమునందుఁగాని, సాటిభాషలగు కర్ణాట ద్రవిడములందుఁ గాని కానరాని కావ్యవస్తుకల్పనపు మెల్పులను గల్పించుకొనినది. విక్రమార్కుని యాస్థానిలో నవరత్నము లున్నట్లు శ్రీకృష్ణదేవరాయని యాస్థానియం దష్టదిగ్గజము లనఁబడెడు కవులు వెలసి, 'నభూతో నభవిష్యతి' యనఁదగినట్లు వింతతీరున మహాప్రబంధములు విరచించిరి. అనాఁటి కృష్ణరాయఁ డాంధ్ర కవిరత్న రత్నాకరుఁడు. ఆ మహారాజు దక్షిణ హిందూదేశమునకెల్ల నేకచ్ఛత్రాధిపత్యము వహించి యటు కటకముననుండి, యిటు కన్యాకుమారిదాఁకఁగల దేశమెల్ల విజయ యాత్రలోఁ దిరిగి చూచినవాఁడు. కాన తన తిరిగిన దేశములలోఁ గానవచ్చు కవిరత్నములనెల్ల 'రత్నహారీతుపార్థివ' యన్నన్యాయము చొప్పునఁ గొని తెచ్చికొనెను కృష్ణాతీరమున నద్దంకినుండి మాదయగారి మల్లనను, కడప మండలమునుండి పెద్దనామాత్యుని, నెల్లూరి మండలమునుండి నంది తిమ్మనను, గుంటూరి మండలమునుండి పింగళిసూరన్నను, దెనాలి రామలింగని, నింక ననేక మండలములనుండి యనేక కవులను, నార్జించి తన సాహితీ సభాంగణము నలంకరించుకొనెను. 'సాహితీ సమరాంగణ సార్వభౌముఁ'డ నఁబరగెను.

దశమశతాబ్దిలో నారంభమయి యిర్వదవశతాబ్దిలో నేఁడు సాగుచున్న యాంధ్రకవితకుఁ బదునాఱవ శతాబ్ది ప్రథమపాదము సరిగా మధ్యస్థమేకదా! అది యంధ్ర కవితా దివ్యస్రవఁతికి, గాంభీర్యము, లోతుచాలఁగాఁ గం

*మద్రాసు ఆల్ఇండియా రేడియో ప్రసంగమునకు విస్తరము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నట్ట నడియేటిపట్టు! చాళుక్యరాజ రాజు, తెలుఁగు చోళరాజు మనుమసిద్ధి, కాకతీయప్రతాపరుద్రుఁడు రెడ్డిరాజ సముచ్చయము ననునాశ్రయానుక్రమమున సాగివచ్చిన యాంధ్రకవితకు శ్రీకృష్ణరాయని యాశ్రయము పైవిధమున ననిదంపూర్వమయిన యభ్యుదయముఁ జేకూర్చిన గట్టి పట్టుగొమ్మ.

ఎడనెడ నన్నయాదుల పురాణరచనలలోను, నన్నిచోడని కుమార సంభవము, ఎఱ్ఱన నృసింహపురాణము, మంచన కేయూరబాహు చరిత్రము, దొరకలేదుకాని తిక్కన విజయసేనము, శ్రీనాథుని శృంగార నైషధము, దుగ్గన నాచికేతోపాఖ్యానము మొదలగు కృతులలో రాయలనాఁటి ప్రబంధరచనావ్యాప్తి యించించుకగా మొలకెత్తినది. శ్రీకృష్ణరాయని కాలమునఁ బర్యాప్త వైభవముతో నిండారి వెలసిన ప్రబంధరచనా సంప్రదాయ వాహినికిఁ దత్పూర్వరచన లెట్లె ట్లూటకాల్వలయినవో యించుక వివరింతును.

పదునైదవ శతాబ్ది దాఁక నాంధ్ర కవితా రచన పురాణ పరివర్తన ప్రాయమైయున్నది. కాని దానిలోఁ గవికి స్వైరవిహారమును గావింప నవకాశము తక్కువ. సంస్కృత పురాణములు ప్రాయికముగా సత్యార్థ రచనాపరము లగుటచేత నందుఁ గవికల్పిత కథలలోవలె నౌచితీ నిర్వాహ మంతగా నుండదు. మఱియు నాపురాణకర్తలేవో పరమార్థముల నిరూపించుటే ముఖ్యముగాఁ గొన్నవారగుటచేతను. నౌచితి నంతగాఁ బాటింపకయుఁబోయిరి. యుద్ధరంగమున గీతోపదేశము నారణ్య శాంత్యానుశాసనిక పర్వములలోని కథాకల్పనములుఁ గావ్య శిల్పదృష్టితోఁ జూడఁగా నౌచితీ దూరము లగును. కాశీఖండమున నొకచోటఁ బతివ్రతాధర్మములు చెప్పుట పరమార్థముగాఁ గొనుటచే లోపాముద్రతో వ్యాసుఁ డుపన్యసించుటలో నౌచితీభంగము వాటిల్లినది. ఇట్టివానిని బురాణములఁ దెలిఁగించువారు తొలఁగించుకొన వీలుకాదయ్యెను. కావ్యమున కౌచితి జీవగఱ్ఱ! కావ్యమునకే యేమి? లౌకికమయిన సర్వవాగ్వ్యవహారమునకును నౌచితి ముఖ్యమేకదా! దీనిని బాటించుటకుఁ గవికి స్వాతంత్ర్యముండవలెను- అందుకే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాకుంతలాది నాటకముల యందుఁ బురాణకథలకు మార్పులును దద్రక్షకై 'అన్యథా వా ప్రకల్పయేత్' అన్న శాస్త్రమును నేర్పడినవి. ఆంధ్రకవితా సంప్రదాయము ప్రాయికముగా సంస్కృతపుఁదీరు ననుసరించి పుట్టినది గాన సంస్కృతమునఁ బురాణములకుఁ దర్వాత వెలసిన కావ్యనాటకముల యవతార మాంధ్రమునకును నావశ్యకముగాఁ గవులకుఁ దోఁచెను. ఆ తలఁపు చొప్పుననే నన్నిచోడ కమారసంభవ, కేయూరబాహుచరిత్ర, క్రీడాభిరామ. హరవిలాస, శృంగారనైషధ, శృంగారశాకుంతల, ప్రబోధ చంద్రోదయాదు లాంధ్రమున వెలసినవి. మహాకావ్యపద్ధతిని వెలసిన కుమారసంభవ, శృంగారనైషధాదులుగాక నాటక పరివర్తనము లనఁదగిన కేయూరబాహుచరిత్ర, క్రీడాభిరామ, శృంగార శాకుంతలాదులుగూడ శ్రవ్యములుగానే, చంపూకావ్యములుగానే తెలుఁగున రచితములైనవి. నాటకములయందు వచనభాగ మెక్కువగా సంభాషణాత్మకముగానుండును. సరిగా వానిని దెలిఁగించుటలో బొడిపొడి వచనము లట్లే తెలిఁగింపవలసి యుండును. ప్రాచీన కాలమున దేశభాషా రచనలలో వచనరచనమీఁద నాదరము లేకుండెను. అందు రచనా శిల్పమంతగానుండదని యప్పటివారి తలఁపు గాఁబోలును! నియమబద్ధములుగాని పొడివచన రచనలు తాళపత్రాది లిపులలో వికృతిఁ జెందకుండ సంరక్షించుట యసాధ్యముగాఁ గూడ వారు తలఁచియుండవచ్చును. ఇవియో కారణమింక నేదో కాని నాటకాంధ్రీ కరణమున వారట్టి పొడిసంభాషణపు వచనములఁగూడ పద్యరచనంలోనే జరపి యా నాటకములనుగూడ శ్రవ్యకావ్యములుగానే కావించిరి. కాని శ్రవ్యకావ్యములకుఁగల నానా రసాలంకార వర్ణనాది మహాకావ్య పరికరపౌష్కల్యము నాటకాంధ్రీకరణమునఁ జూపం బూనుట వైరస్యహేతువయ్యెను. కావ్యములలోని యలంకారవర్ణనాది పౌష్కల్య పరిగ్రహముతో, నాటకములలోని శుభాంతతా వస్త్వైక్య నానారసోక్తి ప్రత్యుక్తి చాతురీ గ్రహణముతోఁ, బురాణ రచనములలోని రసైక పరములుగాని విపులాతివిపులమైన కథాఘట్టముల పరిత్యాగముతో, మిశ్ర కల్పితేతివృత్తములతోఁ బొందుపడి కావ్యములు లేని నాటకములు లేని కొఱఁతను దీర్పఁగల రచనా విశేషమొకటి తెలుఁగున నావశ్యకమగుట నాంధ్రకవులు గుర్తించి యాయాగుణవిశేషములెల్ల కుదురుపడున ట్లీప్రబంధ రచనమును గావింపఁ దొడఁగిరి. ప్రబంధశయ్య యను పేరును జక్కన పేర్కొన్నాఁడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శృంగార నైషధశాకుంతలాదులందు సంస్కృత మూలానుసరణ పారతంత్ర్యముతో సమకూడిన ప్రబంధరచనా సౌభాగ్య మీవిధముగా మనుచరిత్ర, పారిజాతాపహరణాముక్త మాల్యదాదులయందు స్వతంత్రమయి సర్వ హృద్యముగా విజృంభించినది. ఈ ప్రబంధములలోఁ, బురాణములలో లేని యాచితీ నిర్వాహ కథావస్తు సంగ్రహణములున్నవి. మహాకావ్యము లలోఁగల నానారసాలంకారాష్టాదశవర్ణనా పౌష్కల్యమున్నది. నాటక ములలోఁగల సంభాషణాది చమత్కారము, వస్త్వైక్యము, కథా నిర్వా హములో స్వాతంత్ర్యము, నంకాది విభాగములంబట్టి యాశ్వాసాది విభాగ ములు నున్నవి. ఇట్టి ప్రబంధములు వెలయుటచే నానాఁడింక రఘువంశాదు లవంటి మహాకావ్యములయుఁ, గాదంబర్యాదులవంటి గద్యకావ్యములయు, నావశ్యకత లేకేపోయినది.

ప్రబంధములలో విరివిసెందిన ప్రాచీన రచనాంకురములను గొన్నింటిని, బ్రబంధములలో నాటకకావ్యానుకరణములను గొన్నింటిని మచ్చున కుదాహరింతును. మార్కండేయ పురాణకథ, ప్రబంధమార్గమున విరివిసెంది మనుచరిత్ర మయినది. అందు మృగవర్ణనచమత్కార మెల్లఁ బినవీరన్న శృంగారశాకుంతలములోని మృగయావర్ణనమును బట్టి పుట్టి పెరిగినది. వర్ణనలెల్లఁ గావ్యసంప్రదాయము ననుసరించి విపులముగా సాగినవి. వరూధినీప్రవరసంవాదము మేలయిన నాటక సంభాషణచ్ఛాయను బొందుపడినది. శ్రీనాథుని కాశీఖండములోని 'గుణనిధికథ' పాండురంగకవి నిగమశర్మోపాఖ్యానముగాఁ బెరిగినది. అంతేకాక యాకథ కందుకూరి- రుద్రకవి నిరంకుశోపాఖ్యాన ప్రబంధముగానే విరివిసెందినది. పారిజాతా పహరణ ప్రభావతీ ప్రద్యుమ్నములు మహాకావ్య నాటక ధర్మముల కలయికతో వెలసినవి.

శ్రీనాథుని కాశీఖండ పద్యమిది.

సీ॥ ముడువంగ నేర్తురు మూల దాపటికి రాఁ
 చికుర బంధము లీఁగ జీరువాఱఁ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బొన్న పువ్వులఁబోలు పొక్కిళ్ళు బయలుగాఁ
గట్టనేర్తురు చీర కటిభరమునఁ
దొడువంగ నేర్తురు నిడుప్రేలుఁ జెవులందు
నవతంసకంబుగా నల్లిపువ్వు
పచరింపనేర్తురు పదియాఱువన్నియ
పసిఁడి పాదంబులఁ బట్టువెంప

పయ్యెదయు సిగ్గుఁ బాలిండ్లఁ బ్రాకనీరు
తఱచు పూయుదు రోలగందంబుపసుపు
బందిక త్తెలు సురత ప్రపంచవేళఁ
గంచియఱవత లనమాస్త్రి ఖడ్గలతలు.

శ్రీకృష్ణరాయని యాముక్తమాల్యదలో.

సీ॥ "వీడెంపుఁ బలుకెంపు విరిసి వెన్నెల గాయ
వరిగింజ నొకటఁ బల్వరునఁ దోమ
నొరసి యొత్తిన మణుం గొందక మైనెని
గ్గులుదేరఁ బనుపిడ జలకమాడ
ముదుక గాకుండఁ బయ్యెద లోనె గేలార్చి
కలయఁ జంటను వెంటఁ గలప మలఁద
రతిరయచ్ఛిన్న సూత్రమునఁ జిక్కక ముత్తె
ములురాల గరగరికలు వహింపఁ

తే॥ బొలసిననె యెట్టి నరునైనఁ గులముఁ దెలియఁ
బ్రభుత సెడి పల్లవుఁడు వేదవడిన నేద
నృపతివెలియంతి పురముగా నెన్న మెలఁగ
బానఁగృతి సెప్ప వలఁతు లప్పద్మముఖులు."- అన్న పద్యముగా
మాఱినది.

ఇట్లు పొడిపొడిగాఁ బ్రాచీనాంధ్ర గ్రంథచ్ఛాయలు కృష్ణరాయల
నాఁటి ప్రబంధములలో నెన్నింటినేని గుర్తింపవచ్చును. సర్వ ప్రబంధ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచనా సౌభాగ్యములు పొసఁగియున్న 'పారిజాతాపహరణము'ను బురస్కరించుకొని ప్రబంధ కవితా విశేషములఁ గొన్నింటిని బేర్కొందును. పారిజాతాపహరణ కథాకల్పన మొకప్రశస్త నాటక కథాకల్పనము! ఎట్లనఁగా ?

శచీదేవి నగరిలో దేవేంద్రుఁడుండఁగా శ్రీకృష్ణుని దర్శించుటకై భూలోకమునకుఁ బోఁగోరి దేవర్షియగు నారదుఁడు ప్రభువగు దేవేంద్రుని యనుజ్ఞ వడయుటకై యచటికి వెళ్ళెను. అప్పుడు శచీదేవి కల్పవృక్షపు దివ్య కుసుమములను గోయించి తెప్పించి పార్వతీ సరస్వతీ రతి దిక్పాలక పత్నీ ప్రముఖ దివ్యాంగనల కాపుష్పములను పంపకములు వెట్టి పంపుచుండెను. అపుడు సన్నిహితుఁడై యున్న నారదునికిఁగూడ దేవేంద్రుని ప్రేరణమున శచీదేవి యొకపుష్పము నొసంగెను. ఆపుష్పము నతఁడు 'శ్రీకృష్ణార్పణ మస్తు' అనిగ్రహించి భూలోకమునకుఁ బోవుచుంటినని విన్నవించుకొనెను. దేవేంద్రుఁడదివిని శ్రీకృష్ణునకును, నాతని దేవేరులకును జాలినన్ని పుష్పముల నీయ శచీదేవిని గోరెను. శచీదేవి యివి దివ్యకుసుమములనియు వీని ధరింప దివ్యలేకాని భూలోకవాసు లనర్హులనియు నీ పుష్పముల గౌరవము నిల్పు టావశ్యకమనియు భూలోకవాసుల కివి నాచేతి మీఁదుగా నొసఁగ ననియు నీసడించి పలికెను. నారదుఁడు సత్యభామ పేరెత్తి యేమో సణుగు కొనుచు హజారమును వీడి భూలోకమునకు విచ్చేసెను. ఇది విష్కంభరూప ప్రథమాంక పూర్వ కథ.

పారిజాతాపహరణమునఁ బ్రథమాశ్వాసము ప్రథమాంకము. అందు శ్రీకృష్ణుఁడు రుక్మిణి యింట వినోదించుచుండుట, యపుడు సత్యభామ చెలికత్తెకూడ నచట నుండుట, నారదుని ప్రవేశము, పారిజాత పుష్ప సౌభాగ్యవర్ణనము, శ్రీకృష్ణున కాపుష్పము నొసఁగుట, శ్రీకృష్ణుడు నారద సూచనలఁబట్టి కథా రహస్యమెల్లఁగనుగొనుట, నరదుని కనుసైగచొప్పున రుక్మిణి కాపుష్పము నిచ్చుట-యిత్యాదికము కథావస్తువు. ద్వితీయాంక కథావస్తువుఁగూడ నిందుగొంత గలసియున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెలికత్తె సత్యభామతో జరిగినవిషయముఁ జెప్పుటచేత సత్యభామ కోపము, శ్రీకృష్ణుని యనునయము, భూలోకమునకుఁ గల్ప వృక్షమును బెఱికికొనివచ్చునట్లు ప్రతిజ్ఞ సేయుట, స్వర్గగమనము, ద్వితీయాశ్వాసేతి వృత్తము.

తృతీయాశ్వాసమే, తృతీయాంకము-స్వర్గవీధులలో శ్రీకృష్ణుని పయనము, ఇంద్రసత్కారము, ఇంద్రుని హజారమునఁ గాక శ్రీకృష్ణుఁ డదితి హజారమున విడియుట, శ్రీకృష్ణ సత్కారాదికము, సత్యా శ్రీకృష్ణుం వనవిహారాదికము.

చతుర్థాశ్వాసమే చతుర్థాంకము-పారిజాతోత్పాటనము. ఇంద్ర శ్రీకృష్ణ సంగరము.

పంచమాశ్వాసమే పంచమాంకము-సత్యభామ తన విభునిచే పారిజాతమును భూలోకమునకుఁ గొనితెప్పించి ద్వారకానగరమునఁ బ్రతిష్ఠించుట. సత్యభామ పుణ్యకవ్రతము చేయుట-సత్యభామ శ్రీకృష్ణుని నారదునకు దానమిచ్చుట-పారిజాతపుష్పములను శ్రీకృష్ణుని పత్నులకు ద్వారకావాసుల కెల్లరకునుగూడ బంచిపెట్టుట-శ్రీకృష్ణుడు భూలోకమున నుండునంత దాఁక కల్పవృక్షము భూలోకము నుండున ట్లేర్పాటగుట-భూలోకవాసులకు సర్వ సౌక్యములు సమకూడుట.

దీనిని నాటకముగా 'నారదవిజయ' మని కాని 'శచీగర్వభంగ' మని కాని పేర్కొనఁదగును. నారదవిజయమనుటయే యెక్కువసంగతము. విష్కంభాదిగా నేను జెప్పిన యీకథామాత్రమెల్ల నంది తిమ్మనార్యుఁ డీ ప్రబంధమున గుర్తింపఁ దగినట్లు సూచించియే యున్నాఁడు. నరకాసురు నోడించి స్వర్గమును దనవల్లభునకుఁ గైవస మొనర్చిన సత్యభామ మహోప కృతిని మఱచిన శచీదేవికి నారదుఁడు కల్పించిన గర్వభంగమిది! కథా మధ్యమున,

సీ॥ వినుఁడు సురేశ్వరు వనపాలకులు వార్ధిఁ
బొడమిన యీదివ్యభూరుహమున

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కింద్రాణి యెవ్వతె ? యింద్రుండు నెవ్వండు ?
తోడియిందిరను గౌస్తుభము నెవ్వఁ
దధిపుఁడై ధరయించె నతఁడె చేకొనుఁగాక
తెక తేర యిదియేమి యొకరిసొమ్మె ?
ఇదె నాదు విభునిచే నీవదాన్యనగంబు
నాడియించుకొని యేఁగుచున్నదాన

బలుకు లేటికిఁ దా వీరపత్నియేని
మీశచీదేవి తనదు ప్రాణేశుఁడయిన
మఘవు నిటఁబంపి సత్యభామావిధేయు
వలన మరలంగఁ గొనుట పో వాసితనము- అని సత్యభామయనును.

ఈవిధముగా పారిజాతాపహరణము నాటక ధర్మమెంతో సంతనగా నవరించుకొన్న రుచిరప్రబంధము. ఇందు వాచ్యమయిన యీకథేతివృత్త మేగాక వ్యంగ్యముగా నింకొక కథేతివృత్తముగూడ నున్నది. వాచ్యకథలో శ్రీకృష్ణుఁడే వ్యంగ్యకథలో శ్రీకృష్ణదేవరాయఁడు. రుక్మిణీ సత్యభామలే తిరుమల దేవీ చిన్నాదేవులు. కవియే నారదుఁడు. ప్రియుఁడగు కృష్ణరాయని యాదరతారతమ్యముచే సతులలోఁబొర పేర్పడుట ఆ పొరపును దీర్చి యానుకూల్యముగల్గించి నంది తిమ్మనకవి శ్రీకృష్ణరాయని తన చెప్పు చేఁతలకు దిద్దికొనుటయే పుణ్యకవ్రతవిధానము,

ఇట్టి మహాప్రబంధము వాచ్యేతివృత్తమునకుఁ జాటున ధ్వనిగా నింకొక యితివృత్తమును వెలయించుచున్న ధ్వనిప్రధానమైన యుత్తమకావ్యము. ఇందు మహాకావ్యమునకుండవలసిన ప్రయాణోద్యాన వనవిహార జలక్రీడా దౌత్య యుద్ధాది వర్ణనలు బలవంతముగాఁ గావ్యత్వసిద్ధికై కల్పించిన వర్ణనలుగాఁ గాకనాటకకథలో నత్యావశ్యకముగా నపేక్షితములయిననాటకాంగములుగానే పొసఁగుట గొప్ప చమత్కారము! కవి స్వతంత్రుఁడై యీకథలోఁ దననాఁటి శ్రీకృష్ణదేవరాయలమహారాజ్య వైభవములను శ్రీకృష్ణదేవుని వైభవములతో జోడించి వర్ణించినాఁడు. ఇవి చదువుఁడు;-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అమరవిభుండు దూరమున నంబుజనాభునిఁ గాంచి సంభ్రమో
ద్గమమునఁ జేతి యంకుశముఖంబునఁ గుంభము లూఁది కుంచితా
గ్రిమచరణంబున న్మదరికన్ డిగి యంసవిలంబి కల్పచే
లము నడుమ న్బిగించుచు నిలా నిహితాత్త శిరః కిరీటుఁడై.

ఈ పద్యము "ఎదురైనచోఁదనమదకరీంద్రమున్డిగ్గినిల్పి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె"

నన్నట్లు, పెద్దనకుఁ దనకు నింక నితరగవులకు శ్రీకృష్ణరాయఁడు గజారూఢుఁడై యేఁగునప్పుడు జరుగుచు వచ్చిన సత్కారములను బట్టిపుట్టినది.

జలరుహనేత్రుఁ గాంచి సరసత్వము మీఱఁగ నొక్కవేలుపుం
జిలుకలకొల్కి రాచిలుకచేఁ బలికించిన సత్యభామకా
కలికి తెఱంగు శౌరి కడకన్నుల సన్నలఁ జూపెఁ గోపకం
దళకలుషాయితాక్షి వలనంబుల నానతి దన్నదల్పఁగన్ .

ఈ పద్యము శ్రీకృష్ణరాయఁడు గజారూఢుఁడై దేవోత్సవాదులం దూరేఁగునప్పుడను భవించిన యనుభవ విశేషములకు జ్ఞాపకముగాఁ బుట్టినది.

కలికి నిడువాలుఁ గన్నుల
తళుకులు మణిదీపశిఖలుఁ దడఁబడ లక్ష్మి
నిలయున కిచ్చిరి కొందఱు
నెలఁతలు మౌక్తిక విచిత్ర నీరాజనముల్.

శ్రీకృష్ణరాయని యంతఃపురానుభవముల కిది జ్ఞాపకము !

దరమీలన్నయనంబులై గృహబహిర్ద్వారంబుల న్యామకుం
జరము ల్గండమదభ్రమద్భ్రమరికా ఝుంకార సంగీత వి
స్ఫురణల్ మాపుచుఁ గర్ణతాళనినదంబు ల్మించ నీమాగధో
త్కరముం బోలుచుఁ జూడనొప్పె నివె హస్త న్యాసము ల్మిఱఁగన్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాయులవారి మొగసాలలో జరుగు ననుభూతులకిది జ్ఞాపకము.

తామరలప్రేటు లాడుచోఁ, దరుణులెత్తు
కరరుహాంకిత బాహువల్లరులు వొలిచె
బిరుదవర్ణావళీ పరిస్ఫురితమైన
పల్లవాగ్ర జయస్తంభ పటలి యనఁగ.

పొట్నూరు మొదలగు స్థలములందు రాయలవారు శాసనములతోడి విజయ స్తంభముల నెత్తించుటకు జ్ఞాపకముగా నీపద్యము పుట్టినది, ఇట్టి పద్యముల నింక నెన్నింటినేని యెత్తి చూపవచ్చును.

నిరుపహతి స్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చుక
ప్పురవిడె మాత్మ కింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరకినఁగాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే.

యని పెద్దనాదులనఁ దగినట్లు శ్రీకృష్ణదేవరాయఁడు తన యాస్థానకవులకు రాజస మలవఱచి వారిని బోషించినాఁడు గాన వారును నప్పటిరాజులయుఁ బ్రజలయు సుఖానుభూతుల కనుగుణముగాఁ బ్రబంధములను రజోవృత్తి ప్రధానములుగానే రచించినారు. పురాణకృతులలోని స్వాత్త్వికత యిందు నన్నగిల్లినది.

కాలక్రమమున నీప్రబంధముల రాజసత విపరీతమై, వెఱ్ఱితలలు వేయఁ జొచ్చినది. ప్రబంధకవితారచనపు మహావైభవమును గూర్చియే దిఙ్మాత్రముగా నీ ప్రశంస.

[రేడియో ప్రసంగము
మదరాసు !
విస్తృత పాఠము
J.S.V.O.I. July-Dec 1945
తెలుఁగు మెఱుఁగులు ! 1948 ప్ర.ము
విస్తృత పాఠము 1960 తృ. ము]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెద్దన మనుచరిత్ర కథా రసౌచిత్యము

ఏవైనా అధ్యాత్మిక విషయాలను గూర్చి ప్రసంగించదగిన వయసులో ఉన్నవాళ్ళను నావంటివాళ్ళను, మనుచరిత్ర వంటి శృంగారప్రబంధాలను గూర్చి ప్రసంగించవలసినదిగా విజయవాడ రేడియోవారు కోరడం ఎలా ఉన్నదంటే, ఆనాడెన్నడో-అంటే నన్నూట యేభైయేళ్ళనాడు - శఠకోపయతి శిష్యుడై వైష్ణవమతం పుచ్చుకొని వార్ధక్యంలో ఉన్న పెద్దనామాత్యుణ్ణి క్రొత్తగా సామ్రాజ్యాధిపతియైన కృష్ణదేవరాయలవారు శృంగారరస ప్రచుర మైనమ నుచరిత్రను రచించగోరడం వలెఉన్నది.

నాడు రాయలమాట తప్పించుకోలేక ఆయనదానికి ఒప్పుకున్నాడు. నేడు నేనూ ఒప్పుకున్నాను. దిగ్విజయ యాత్రలో కృష్ణదేవరాయలవారు విజయవాడలో విడిసి ఉన్నప్పుడు పెద్దన్నకూడా వెంటఉన్నాడట. అప్పుడు విజయవాడ విద్వాంసులకు తన మనుచరిత్రను వినిపించికూడా ఉంటాడను కుంటాను.

కం. మనువులలో స్వారోచిన
మనుసంభవ మరయ రసనమంచిత కథలన్
విననింపు కలిధ్వంసక
మనఘ భవచ్చతుర రచన కనుకూలంబున్....

కావున మార్కండేయ పురాణోక్తప్రకారంబున దనకంకితముగా చెప్ప మన్నారు కృష్ణరాయలవారు. ఇప్పుడు దొరకడంలేదుగాని శఠకోపయతి కర్పితముగా "హరికథాసార" మని మఱొక గ్రంథమునుకూడా పెద్దన రచించినాడు. షట్చక్రవర్తుల, అష్టవసువుల, చతుర్దశమనువుల, షోడశమహా రాజుల చరిత్రలు కలిధ్వంసకములని పురాణోక్తి ఉన్నది.

ఈ మనుచరిత్రలో కడపటి పట్టున స్వారోచిష మనవు పుట్టుక ఉన్నది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గనుక దానితో అనుబంధంగల ప్రబంధమంతా కూడా కలిధ్వంసకమే అని మనస్సును సమాధాన పఱచుకొని ఉంటాడు.... పెద్దన.

కాని నిజానికి ఈ కథ కలిఅనే గంధర్వుణ్ణి ధ్వంసం చేసింది గనుక కలిధ్వంసకమని చెప్పుకోవడం యుక్తంగా ఉంటుంది. మనుచరిత్రలో వరూథినికై తలమార్చుకొని దొంగ వేషంవేసుకొన్న గంధర్వుడి పేరు కలి.

మేఘసందేశంలో కాళిదాసు యక్షుణ్ణి అనామధేణ్ణి చేసినట్లే, ఈ మను చరిత్రలో పెద్దన్నకూడా గంధర్వుణ్ణి అనామధేయుణ్ణి చేసినాడు, కలి పేరు పేర్కొలేదు. ప్రధానంగా వరూధినీప్రవరుల సమాగమ కథను హృదయంలో పెట్టుకొనే రాయలవారు పైవిధంగా మనుచరిత్రము రన సమంచిత కథలతో ఉన్నదనీ-కలిధ్వంసకమనీ- పెద్దన్న చతుర రచన కనుకూలమనీ అని ఉంటారు. రాయలవారి కోరిక కనుకనే పెద్దనామాత్యుడు సార్వోచిష మను సంభవ కథను గ్రంథము కట్టకడపట నెక్కడో రెండు ముక్కలలో నెత్తుకొని ముగించి నప్పటికీ వారి అవ్వా తాతల కథను అంటే-వరూధినీ ప్రవరుం ఇంకా వరూధినీ గంధర్వుల కథను మూడాశ్వాసాలపై చిలుకుదాకా పెంచి ప్రబంధీకరించారు.

నేడు మనుచరిత్ర మనబడే ఈ ప్రబంధంలో తొలినాలుగాశ్వాసాల పైచిలుకు రచనను స్వరోచిస్సంభవమనీ-రెండు ప్రబంధాలనుగా వేర్పఱచి నేను పేర్కొంటూ ఉంటాను. పెద్దన్న రెండు ప్రబంధాలనూ రాయలవారి కంకితంగా ఒక కృత్యపతరణికతో ఒక సంపుటంగా సంధానించినాడు గనుక ఆ మొత్తం ప్రబంధ సంపుటాన్ని మనుచరిత్ర మని పేర్కొంటూ ఉంటాను. రెండు ప్రబంధముల తీరులూ పరిశీలనార్హములే అయినా ఇప్పుడు నేను తొలిప్రబంధముగా పరిగణిస్తున్న సర్వోచిస్సంభవాన్ని గూర్చే అందు లోనూ కథౌచిత్యాన్ని గూర్చే ప్రసంగిస్తున్నాను.

ఈ కథలో నాయిక వరూధిని. దేవయోని జాతులలో-అనగా గంధర్వ విద్యాధర యక్ష, కిన్నర, కింపురుషాదులలో ఒకటయిన అప్సరోజాతివడచు.

17)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అప్సరసలు దేవవేశ్యలు. వారికి పద్మ సంభవ, వైకుంఠ భర్గ దేవేంద్ర సభలు సంగీత నాట్యవిద్యల సాముగరిడీలు-కామకలా విలాసములు వారికి వెన్నతో నేర్పిన విన్నాణములు. గంధర్వ విద్యాధరాదులతోనేకాక భువినుండి దివికి విచ్చేసే జ్యోతిష్టోమాది యాజులతో కూడా శృంగార విహారములు వీరికులాచార ధర్మములు.

ఎవరైనా భూలోకములో తీవ్రతపస్సు చేస్తూ ఇంద్రపదవికే అడ్డంకి కలిగించేటట్టుండేవారి తపస్సు చెడచడానికి ఇంద్రుడు వీరిని ప్రయోగిస్తూ కూడా ఉంటాడు. వీరునిత్య యౌవనులు. ఎప్పుడూ ముప్పదేండ్ల వయోవిలాసంతోనే ఉండేవారే. వ్యాధులు జరామరణాదులు వీరికి ఉండవు. ఇటువంటి అప్సరససు వరూధినిని వీరితో కలసి మెలసి విహరిస్తూ ఉండేజాతిలోని వారే అయిన గంధర్వుడు కలి వలచి తత్కాలానికి వలపించుకోలేక ఉపాయాలు వెతుకుతూ వెంటాడుతూ తంటాలు పడుతూ ఉన్నాడు.

ఉ. ఒక్కొకవేళ(బద్మముఖులొల్లమి సేయుదురొక్కవేళ(చె
న్మకుక్కవ నాదరింతురు, క్షణక్షణముల్ జపరాంగ్ర చిత్తముల్
పక్కన వేసఅన్ జనదుపాయములన్ దగునిచ్చకంబులన్
జిక్కగ(జేసి డాసినతి చిత్తము(బట్టి సుఖింప(గా(దగున్....

అనుకొంటాడు.

వరూధిని పురుషముఖ మెఱు(గని వివాహితకాని భారతీయార్యకుల కన్యకారత్నము కాదన్న విషయం మరవరాదు. ఆమె సదాముప్పదేండ్ల వయస్సుదే కనుక ప్రస్తుత కథా సందర్భానికి ముంచెందరినో గంధర్వ విద్యాధరాది దివ్యపురుషులనూ, భువినుండి దివికి వచ్చిన శ్రోత్రియులనూ వినోదపఱచి వారితో వినోదించినదే. మర్త్యలోకపుమర్త్యవేషపు శ్రోత్రీయులమీద మక్కువ రేగినదోయేమో. హిమవత్పర్వతాగ్రమున తేవిణీవేసి ఉన్నది. హిమాలయము భూలోక స్వర్గలోకముల సంధానస్థలము. దేవయోనులకక్కడ దేవభూములెన్నోయున్నవి. వేడ్కపుట్టినప్పుడల్లా దివ్యులక్కడ విరిసి ఉంటారు. మన పెద్దలకు సిమ్లా, ఊటీ, కోడైకెనాలులకు వెడితే ఏలాటి సౌఖ్యపరికరాలు ఉండునో వీరికికూడా అక్కడ అట్టి సౌఖ్యపరికరాలు అన్నీ వున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ పర్వతాగ్రములకు సిద్ధపురుషులు మహాయోగులు మొదలగువారు, భూలోకవాసులుకూడా అప్పుడప్పుడు వెళ్ళకలుగుతూఉంటారు. గ్రహచారం చాలో చాలకో ఆర్యావర్తంలో ఏక్కడో ఉన్న అరుణాస్పదపురవాస్తవ్యుడొక శ్రోత్రియబ్రాహ్మణ కుమారుడు ప్రవరాఖ్యుఁడు పాదలేపం లభించగా వెనక ముందులు చూచుకోకుండా ఫ్రీటిక్కట్టు దొరికితే, దొరికిందే తొందరగా రైలు ప్రయాణానికి తయ్యారయ్యే అత్రగాడివలె హిమాలయ పుణ్యభూము లను దర్శించ వెళ్ళినాడు. పాదలేపం కరగి పోగా అప్రయోజకుడై దిగుల్ప డుతూ వరూధిని ఉన్నకోనలోకి వెళ్ళినాడు. ఆకలిగొన్న మాంసాహారి పంటిం టిలోకివచ్చిన కుందేలిని విడువనట్లే వరూధిని ప్రవరుణ్ణి వలపుజూపులవలలో చిక్కించుకొని దక్కించుకో తంటాలుపడ్డది. తన వలపుపొలుపులుదులపరిం చింది, తుటారించింది. మిటారించింది, ఆనందించింది, ఆదరించింది,బెదిరిం చింది,ప్రార్థించింది,పైబడ్డది,కౌగిలిపట్టుగా పట్టుకుంది- వెన్నతో తిన్నవిద్యనంతా కక్కింది.- వెక్కి వెక్కి యేడ్చింది. ఏమిచేసినా ఎంత యేడ్చినా లాభంలేక పోయింది. ప్రవరుడు గురువులొద్ద నేర్చిన సదాచారసంపదను నింద్రొక్కు కొన్నాడు. ఆమె చేష్టలకు చీదరించుకొన్నాడు. ప్రశంసార్హంగా బదుళ్ళు చెప్పినాడు. కౌగలించుకొంటే శ్రీహరి అంటూ ఓరమోమిడి తదీయాం సద్వయంబటి పోపొమ్మంచుం దొలగ ద్రోచినాడు. పెండ్లినాడు అనయా- యావజ్జీవం హూష్యామి అన్నమాట తనసోమిదమ్మవిషయంలో దక్కించు కొన్నాడు.

తన బ్రహ్మవర్చసమును ప్రజ్వలింపించుకొన్నాడు. యజ్ఞేశ్వరుడి అను గ్రహంతో ఆకాశమార్గాన యెగసి అరుణాస్పదపురానికి వెళ్ళిపోయినాడు. గంధర్వుడికి తనవల్ల కలిగిన అవమానమే ప్రవరుడివల్ల తనకు దాపరించడం చేత వరూధిని బలే పరాభవం పాలయింది. కుంగికుమిలిపోజొచ్చింది కామా గ్నికి, పొంచి పొంచి చూస్తూఉన్న గంధర్వుడు ఇదే అదననుకొని ప్రవర వేషంతో తయారయి వరూధినిని దక్కగొన్నాడు. ఇటువంటిచోట్ల ఈ వేశ్యావిషయికరతిలోని చమత్కార విశేషమును గుర్తింపకపోతే మనము కథాసారస్యమును తెలుసుకోలేము. వేశ్యలు తదాసక్తులు. ఒకరికొకరు వశులు కానప్పుడు దబ్బఱలు తాటోటులు-తబ్బిబ్బులుజరిపి, మోసాలుచేసి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేషాలు వేసీ కార్యం సాధించుకొంటూ ఉంటారు ... నాయికానాయకులు పొంది పొసగడం జరిగిన తర్వాత, తొల్లిటి దుష్కృత్యాలన్నీ రసాభాసలన్నీ ప్రజ్ఞాప్రయోగాలుగానూ, రసోత్కర్షాధాయకములుగానూ మాఱిపోయి సామాజికులలో రససిద్ధిని కలిగిస్తవి. ఈ పద్ధతితోనే గంధర్వుని నడవడి యిక్కడ సమర్థనీయమవుతుంది. కాని, ఇట్లా సమర్థించడానికి గంధర్వుడు తన ప్రజ్ఞాప్రయోగాన్ని వరూధినికి తెల్పి మెప్పుపొందడం ఆవశ్యకము. అది జరగకపోతే రసాభాసే, కథావిధానమంతా రోతే అవుతుంది. గంధర్వుడిట్లా తన మాయాకృత్యం వరూధిని ముందర వెల్లడించడం సంభవిస్తే దానికామె మెచ్చుకోవడం తటస్థించదేమోగదా అని సందేహం తోచడం న్యాయమే.

ఇక్కడ వరూధిని ప్రవరుని ప్రేమించినవాళ్ళలో తదేకానురక్తగా, గుణానురక్తగా వసంతసేనవలె పతివ్రతగా వర్తిల్లినదిగాని ధనానురక్తగా అనేకానురక్తగా వర్తిల్లలేదు. అయినా ఆమె మాయాప్రవరుడు మాయమైన తర్వాత ధర్మశాస్త్ర ప్రకారం పండ్రెండేండ్లు ప్రతీక్షించి ఆపైభర్తకు శ్రాద్ధము చేసి కలకాలం విధవగానే ఉండిపోయిందనుకోగూడదు. ఆమె నిత్యయౌవనగాన కొన్నాళ్ళకు మఱొకని ప్రేమించి తీరేదే. నిన్నటిదాకా ఆమెతో మాయావేషంతో విహరించిన గంధర్వుడున్నూ రత్నంవంటి కొడుకుపుట్టిన తర్వాత ఆ కొడుకును చేరదీయడనీ, వరూధినికి తన వలపువలవిసరును, అందులో ఆమె చిక్కుపడుటను తెల్పిఉండదనీ, అనుకోగూడదు.

ప్రవరుణ్ణి ప్రేమించినవాళ్ళలో శుచిగానేఉన్నా వరూధిని గంధర్వునింతకు ముందెఱుగనిదికాదు. ఇట్టివారి నెందఱినో యింతకుముందు బుట్టను బెట్టినదే. గంధర్వుడుకూడా యిట్టికుచోద్యాలనెన్నోచేసి యెందఱినో దక్కగొన్నవాడే. ఇటువంటి వారికి సంబంధించి ఉంటుంది గనుకనే కొందఱాలంకారికులు వేశ్య సామాన్యవనిత అనీ ఆమెకు సంబంధించిన శృంగారము రసాభాసమేకాని శృంగారము కాదనీ అన్నారు. అదికాదనీ వేశ్యలను విడనాడితే శృంగారరసానికి పరిపోషమే ఉండదనీ వారు శృంగారరససర్వస్వమనీ వారిలో గుణానురక్తలూ ఉంటారనీ, పై వాదాన్ని మఱికొందఱాలంకారికులు ప్రతిఘటించినారు. నేనిట్లా అంటాను.-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాయా ప్రవరుడుగా మాయమైనా గంధర్వుడు వరూధినినంటిపట్టే ఉన్నాడనీ ఆమె ప్రసవించి సర్వోచి కొన్నినెలలో యేండ్లో పెరిగిన తర్వాత ప్రవరుడు మళ్ళీవస్తాడని యెదురుచూచి చూచి చీకాకుపడే స్థితికి వచ్చిన తర్వాత తన తంత్రాన్ని చెలికత్తెలకుచెప్పి వరూధినికి చెప్పించి-సన్నగాతా నూచెప్పి ఛీ.ఛీ.ఛీ.ఫొ. నాతో కూడినవాడు నిజప్రవరుడే యనియామె తిరస్కరింపగా తాను మాయావేషంతో కలసియున్న నాళ్ళలోనే ముందు జాగ్రత్త కనిర్వాని ఉంచుకొన్న యేకాంత శృంగారవిహారతంత్రముల దినడై రీని వెల్లడించి, ఇంకా వీలయితే అసలు ప్రవరుడే అబద్ధమని అదికూడా తనవేష మేనని చెప్పి తమ పరస్పర ప్రేమసాక్ష్యమయిన కుమారుని స్వరోచిని కౌగలించుకొని-అకొడుకు శృంగారలోలుడై గంధర్వుడి కొడుకే అనిపించుకొన్నాడేగానీ, ప్రవరుడి కొడుకనిపించుకోలేదు.

వరూధినిని అబ్బురపుచ్చి, తననేర్మికి మెప్పించి ద్విగుణీత ప్రేమతో మరల వరూధినీ సన్మానమునవర్తిల్లినాడని భావించవలసినదే.అట్లాభావిస్తేనే కథకు సొగసు కలుగుతుంది. పెద్దన ఈ సందర్భము నీవిధముగా నిర్వహించకపోయినా నూచనగానైనా యిట్టితీరుసు తెల్పిఉండవచ్చును. తెల్పకపోయినా మనం ఇట్టికథను కట్టుకోవడానికైనా అడ్డురాకుండా ఉండిఉండవచ్చును. కానీ మాయమైపోయేటప్పటి మాయాప్రవరుడి తలపులేవో ఏతద్విధంగా తానేవిప్పి చెప్పి తంటాలు తెచ్చినాడు.

కం. అంత వియచ్చరుఁ డభిమత
మంతయు సమకూరుటయును సచ్చర గర్భ
శ్రాంత యగుటయును గనుఁగొని
యింతటనిచ్చోటు వదలలేనిక నున్నన్....

కం. వంచన యెఱిగిన మఱి శపి
యించునొ సురకాంత చెప్పకేఁగినఁ బ్రేమం
బంచశర శరపరంపర
బంచత్రాపించి మీఁద-బాపం బిడునో....

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని వితర్కించి యక్కపట విప్రుండెఱింగించి యనిపించుకొనియ పోవు వాడై....ఏవేవో అన్నట్లు రచనచేసినాడు. ఆ అన్నవన్నీ వట్టి అబద్ధాలే. అబద్ధాలేకాక మోసపు నీతివాదాలుకూడా. అమరుడైన గంధర్వుడు అమరకాంతయైన వరూథిని "పంచత" ప్రాపించునేమో అనుకోవడం శుద్ధవిరుద్ధం. ఈ విధంగా ప్రవరవేషధారియైన గంధర్వుని యంతరంగపు దలపులను తాను తెఱచి వెల్లడించడం శ్రోతల హృదయాలలో సజావుగా నిష్పన్నమయ్యే శృంగార రసమును చెఱచడం అనిపించింది. వియచ్చరుఁడని వాక్యంలో కర్తృపదం ఉండగా మళ్ళీ కపటవిప్రుడనడం అనన్వితంగా ఉంది.

ఈ పట్టుపెద్దనరచనకాక ప్రక్షిప్తమేమో అనుకొంటాను. గంధర్వునికి వరూథిని మీదనే ప్రేమ అనురాగము. వరూథినికి ప్రవరుని మీదనే అనురాగముకాని గంధర్వుని మీదలేదు. నిజప్రవరునికి తనసోమిదమ్మమీదనే అనురాగం కాని వరూథినిమీదలేదు.

యాంచింతయామిసతతం మయిసావిరక్తా
సాచాన్యమిచ్ఛతిజనం సజనోన్యరక్తః
అస్మత్కృతేచపరితస్యకాతిచిదన్యా
ధిక్తాంచతంచమదనంచ ఇమాంచమాంచ.

అన్న భర్తృహరి సుభాషితం ఇక్కడ సరిపడుతుంది. ప్రేమలేని వరూథినిని దొంగవేషపు గంధర్వుడు కలసినట్లు-కాదు చెఱిచినట్లువర్ణించడంరోతకాదా?

అయితే కొందరు సహృదయులిట్లా అనవచ్చు. ప్రవరుని మర్యాద దక్కింది. వరూథినికి ఏవలేకుండా కోరికాసిద్ధించింది. గంధర్వుడి బు బాటమూనెఱవేరింది. ఈ ముగ్గురుకీ కలగనిరోతమీకెందుకు కలుగవలెనంటే అని; రసానుభూతి శ్రోతలకూ ప్రేక్షకులకూ సంబంధించిందిగాని కథా పాత్రలకు, అభినేతలకూ సంబంధించింది కాదు. వరూథినికి గంధర్వుడి మోసగింపు తెలియదుగాని మనకు తెలుసును. పెద్దన్నకు తెలుసును. ఇది రసాభాసమేకాదు. నేటిశిక్షాస్మృతి ప్రకారం కొన్ని ఏండ్లశిక్షకు తగ్గక్రిమినల్ కేసుకూడాను. పెద్దన్న ఎట్లా చెప్పినా మన గంధర్వుడు కొన్నాళ్ళ తర్వా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రహస్యం వెల్లడించి, వరూధిని మెప్పుపొందినాడని అనుకోవలసిందే. రస నిర్వహణవిషయం ఈవిధంగా ఉన్నప్పటికీ ఈ స్వారోచిస్సంభవ ప్రబంధం నాల్గాశ్వాసాల పైచిల్కులో, అదిని ప్రవరుని యోగ్యతను వర్ణించడం లోనూ, తర్వాత వరూధినీ ప్రవర సమావేశ వర్ణనలోనూ, ఆపై వరూధినీ ప్రవర సంవాదంలోనూ, శృంగార శాంతరసముల కనండి, శృంగారధర్మవీరరసములకనండి ఎట్లా అన్నా స్పర్థపెంచి, వరూధినీకామాగ్నిలో మైనమై కరగిపోక వజ్రహృదయుడై నిలిచి శీలరక్షణచేసుకొన్న ప్రవరుని మహనీయతను ప్రజ్వరిల్ల జేయడంలోనూ, పెద్దన నిర్వహించిన నెఱజాణతనపు కవనము ఆంధ్రసారస్వతం అంతటా వెదికినా మఱి అన్యత్ర దొరకనిది. అద్భుతమైనది. ఆనాటి కృష్ణరాయల సాహిత్యాంగణంనుండి నేటి సహృదయగోష్ఠిదాకా, అందఱు ఈకథాఘట్టం చదివేటప్పుడూ వినేటప్పుడూ ముగ్ధులయిపోతూ ఉన్నారు.

వరూధినీ ప్రవర సమావేశంలోని రసపారవశ్యంచేత, వరూధినీ గంధర్వ సమాగమ నిర్వాహణలోని రసాభాసం గుర్తించలేకపోతున్నారు. ఈ కథాఘట్టమే రాయలసభలో పెద్దనకు అష్టదిగ్గజాలలో తూర్పు దిగ్గజాన్ని గావించింది. అగ్రహారాలిప్పించింది. రాయల .రాజ్యంలో కడలూరిప్రాంతమునకు గవర్నర్షీనిప్పించింది. మనుచరిత్రచదవనితెల్గు రసికుండుండడు. ఆ చదివేది నాల్గాశ్వాసాలే. పైకథ బలవంతాన ఎవరైనా తొలుతూరి చదివితే గంధర్వ కథాశేషం ఎక్కడైనవస్తుందేమో అన్న ఆశతో చదువుతారు. మను చరిత్ర వేకటిదాకాను, వసుచరిత్ర చీకటిదాకాను అని ప్రాచీనకాలపు ప్రాజ్ఞుల ప్రశంస.

సంస్కృతం నేర్చుకొనేవారు పంచకావ్యాలు చదివినట్టే తెలుగు నేర్చుకొనేవారు కూడా తెలుగు పంచకావ్యాలు చదవడం నా బాల్యందాకా ఉండేది. మను వసుచరిత్రలూరాఘవపాండవీయము,ఆముక్తమాల్యద,శృంగారనైషధము అన్నవి ఆ పంచకావ్యాలు. పాండురంగమాహాత్మ్యము, పారిజాతాపహరణము చేర్చి అముక్తనైషధములను విడిచి కొందరు పరిగణిస్తారు. మనుచరిత్ర అందరిమతంలో ఉన్నది. భాషా పాండిత్యానికీగ్రంథము ముఖ్యపఠనీయము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెద్దన్న యిందులో రుచిరములయిన పలుకుబళ్ళను సామెతలను చాలా చేర్చినాఁడు. అందులో, అచటఁబుట్టినఁజిగురుగొమ్మైనఁజేవ, నందునుడి మాయలు, మీసాలపై తేనియలు, ఇత్యాదులెన్నో తాళ్ళపాకవారి తిరుపతి సంకీర్తన రచనలలో ఉన్నవి. నన్నయ శ్రీనాథులు పెద్దనకు కవితామార్గ దర్శకులు.

పెద్దన మనుచరిత్రవలెనే పెద్దన చాటువులుకూడా చాలాచమత్కార పూరితములు. అందులో. మఠీకవితా రచనను గూర్చి చెప్పిన ఉత్పలమాలిక, కృష్ణరాయ నిర్యాణానంతరం చెప్పిన సీసపద్యమూ, ఆంధ్ర సహృదయులం దరికీ కంఠపాఠమై ఉండవలసినది.

సీసపద్యం మాత్రం :-

సీ. ఎదురైనచోఁ దనమదకరీంద్రమునిల్పి
కేలూఁతయొసఁగి యెక్కించుకొనియె,
బిరుదైన కవిగండ పెండేరమునకీవె
తగుదని తానె పాదమునఁ దొడిగె,
మనుచరిత్రం బందుకొను వేళఁ బురమేఁగఁ
బల్లకితన కేలఁ బట్టియె త్తె
కోకటగ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగిన సీమల యందు నిచ్చె
ఆంధ్రకవితా పితామహ అల్లసాని
పెద్దనకవీంద్రయని నన్నుఁబిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక
బ్రదికి యున్నాఁడ జీవచ్ఛవంబనగుచు ...

ఆనాడట్లా అన్నాడుగాని, తెలుగుభాష ఉన్నంతదాకా పెద్దన్న కీర్తి శరీరుఁడయి ఆంధ్రకవిలోకానికి మార్గదర్శకుడై వెల్గుతూ ఉంటాడు.

[రేడియో ప్రసంగము :
విజయవాడ : 1948
మీగడతఱకలు : 1951.]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రాచీనాంధ్రవచన కావ్యములు

"దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" నాఁ బరగిన మన యాంధ్రభాష యందు నన్నయభట్టారకుఁ డాదిగాఁ గల తొల్లింటి కవులెల్లరును జంపూ ప్రబంధములను, మిక్కిలి తక్కువగా నిర్వచన పద్యకావ్యములను మాత్రమే రచించిన ట్లెఱుకపడుచున్నది గాని శుద్ధవచన కావ్యములను, మఱియు దృశ్య కావ్యములను రచించినట్లు కన్పట్టదు. అద్యప్రకృతి యగుగీర్వాణభాషయందు సుబంధుని వాసవదత్తయు, బాణుని కాదంబరీ హర్షచరిత్రములును, దండి దశకుమారచరిత్రమును మొదలుగాఁ గొన్ని ప్రౌఢతమములగు గద్యకావ్య ములు గలవు. కాళిదాస భవభూతి ప్రముఖుల రసోత్తరము లగుదృశ్యకావ్య ములును గలవు. మన యాంధ్రవాఙ్మయము సంస్కృతవాఙ్మయమును బట్టి పుట్టి పెరుగుటయు, దొలుదొలుతఁ బ్రాయికముగా నాంధ్రకావ్యకర్తలు సంస్కృతగ్రంథములనే యనువదించుచు వచ్చుటయు విస్పష్టము కదా. పురాణాదులతో బాటు మున్నే కొన్ని గద్యకావ్యములును, దృశ్యకావ్యము లును, సంస్కృతమునుండి మన వారిచేఁ దెనుఁగున ననువదింపఁబడెను గాని యా యనువాదములును జంపూరూపములే యయ్యెను. వచన కవిత్వ మొక కవిత్వ మనిపించుకొనదని తలఁచి నన్నయభట్టారకాదులు రచింప మానిరని కొందఱనియెదరు గాని యది సమంజసమయినట్టు కన్పట్టదు. సంస్కృతమున వాసవదత్తాకాదంబర్యాదులకున్న గౌరవమసామాన్యమైనది గదా! కవిత్వమునకు ఛందఃపరిశ్రమమే ముఖ్యమనుట కెవ్వరంగీకరిం చెదరు? పద్యకవిత్వముకంటె గద్యకవిత్వమే కవియొక్క సంపూర్ణశక్తి నపేక్షించునని సంస్కృత భాషయందు "గద్యం కవీనాం నికషం వదంతి" యనునానుడి కలదు. నన్నయాదులు వచనకావ్యరచన మీ కారణము చేతనే మానిరన్నచో దృశ్యకావ్యములు రచింపమికి వేఱొకకారణము వెదకవలసి యుండును. వారు వీనిని రచింపమికిఁ గారణమిదియని నిరూపింపవలను పడదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పదపడి యిటీవల పదునాఱవశతాబ్ది తుదనుండియు వచన కావ్యములును యక్షగానము లనునొకవిధమగు రూపవికారములును రచింపఁబడుచు వచ్చినవి. యక్షగానము లంతకుఁ బూర్వము నయిత ముండిన నుండి యుండును గాని వచనకావ్యములు లేవనవచ్చును. ఆంధ్రభోజుఁ డనఁబడు కృష్ణదేవరాయల నాఁట నుండియుఁ జోళపాండ్యాది రాజ్యములందుఁ దెలుఁగు రాజ భాషగా వ్యవహరింపఁబడుచు వచ్చెను. ఆరాజ్యములను విజయనగర రాజసంబంధులు పరిపాలించుచు వచ్చిరి. పదునాఱవ శతాబ్ది నుండి యాంధ్రదేశమున రచింపఁబడిన వానికంటె నక్కడ రచింపఁ బడిన తెనుఁగుఁగబ్బములు మెండు. మఱియు నవి రసోత్తమములునయి యున్నవి. విజయవిలాసాది ప్రబంధము లయ్యెడ నప్పుడుప్పతిల్లినవే. నాఁ డక్కడ రచింపఁబడిన కబ్బము లింకను మనకుఁ గొన్ని చేకుఱలేదు. మన యాంధ్రభాషావధూటి శుద్ధ ద్రావిడదేశమున నయితముఁ దన నుడికారవుఁ బొంకమున సంపూర్ణాదరము వడసి పోషింపఁ బడినదిగదా! తొలుదొలుత నాంధ్రవచన కావ్యరచన దక్షిణదేశముననే యారంభింపఁ బడినది. దక్షిణ దేశమందు రచింపఁబడిన యీ వచనకావ్యములఁ గూర్చి ప్రశంసింపఁ బోవునప్పుడు ముందు నన్నయభట్టారకాదులు తమ గ్రంథములం దందందుఁ బొందుపఱుచుచు వచ్చిన వచనములఁ గూర్చియుఁ గొంత చర్చించుట యావశ్యకము కాకపోదు. నన్నయభట్టారకునికవనమునం దెడనెడఁ గల్లుగద్యములు మన యచ్చుకూర్పునఁ బదిపదునైదు బంతులకంటె హెచ్చుగాక ముచ్చట లిచ్చుచుండును. తొంటికవుల రచనలలో నన్నయ భట్టారకుని గద్యములే పద్యములట్లు ధారాచమత్కృతి గల్గి చదువ నింపై యుండును. తిక్కనామాత్యుని గద్యములు మిక్కిలి మెలపు మీఱినతెలుఁగుఁ బలుకుబళ్ళతో నించుక జిలుగులై బిగువుగల్గి రసమెల్కుచుండును. ఈతని కృతులందు గద్యములు నన్నయార్యుని కృతులందువలెఁగాక, కొండొకమెండై నిడుదలునై పొడకట్టుచున్నవి. ఎఱ్ఱనార్యుని కృతులందలి గద్యము లొక్కొకయెడఁ బ్రౌఢ మగుసంస్కృత రచనమును, గొండొకయెడ నినుపారు తెలుఁగు గూర్పును గల్గి నిబిడములై ప్రాయికముగా వర్ణనాంశము గల్గి యుండును. ఈ మువ్వుర గద్యములును ననుప్రాసప్రయాసరహితములై యెల్లవిధముల మేల్మి కూర్పు గల్గియున్నవి. కవిత్రయమునకుఁ దర్వాతివారు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచించిన గ్రంథములందు గద్యములు మిక్కిలి మాఱుపాటును జెందినవి. నాచన సోమనాథుని గద్యము చదువువారికి గుండియ తల్లడమును గల్గించుచుఁ గొండవీటిచేఁ ద్రాళ్ళవలె బొడుగువాటి దేశి తెలుఁగుఁ బలుకులతో నిండారి యనుప్రాస విన్యాసములచే నతికఠినములై యుండును. ఈతని గ్రంథమున వచనము లచ్చునఁ బోసి ముద్రకొట్టఁబడినట్లు నెలకొని యున్నవి. యుద్ధాదికమును వర్ణించుపట్టులం దీతఁ డిట్టివచనములఁ బెట్టుచుండును. కథాంశమును జెప్పునప్పు డీతని కృతియందు గద్యములే యంతగాఁ గాన్పింపవు. శ్రీనాథుఁడు సంస్కృత ప్రాయముగా నుద్ధత శైలితో నతిప్రౌఢ మగువచనముల రచించెను. ఒక్కొక్కయెడ నీతని గద్యములు నన్నయార్యుని గద్యములతో సయితము సాటివచ్చుచుండును. తెలుఁగుఁగూర్పులఁగూడఁ గొండొక కలయఁ గూర్చినను బోతనామాత్యుఁడు వచనములను గడునిడుదలుగను గఠినములుగను నెలకొల్పెను. పెద్దనాదుల కృతులందు వచనములు మిక్కిలి తక్కువ. ఉన్నను వర్ణనాత్మకములై యతిప్రౌఢములై యుండును. పెద్ద నాదులకుఁ దర్వాతికవులు కొందఱు పద్యములందు వలెయు గణయతిప్రాసనిర్బంధములేమిచేఁ దమకుఁ గల్గెడు సౌకర్యమును వీడనాడి యిబ్బడిగా నిర్బంధములను దెచ్చిపెట్టుకొని, తమ గ్రంథములందు బహుక్లిష్టముగను, అనుప్రాస నిరంతరముగను, దురవబోధముగను వచనములఁ గూర్చుచు వచ్చిరి. ఇట్టి వచనములను బ్రాయికముగాఁ దద్గ్రంథములఁ బఠించువారు వదలి వేయుచుందురు.

నన్నయభట్టారకాదులు పద్యములం దింపుగాఁ గూర్పవలను పడని వంశక్రమాది వృత్తాంతమును దెలుపవలసినపుడును మిక్కిలి విరివిగా నున్న కథ నల్లంతలో సంగ్రహింపవలసినపుడును బఠించువారికి నిరంతరపద్య సంఘటనమువలనఁ గల్గువిసువునపనయింపవలసినపుడును నెడనెడ సంస్కృత గ్రంథమును మీఱక హృద్యము లగుగద్యములఁ గల్పించిరి. నాచనసోమనాథుఁడుత్తరహరివంశమును దెల్గించె నన్నపేరేగాని యందుండి తన యిచ్చకు వచ్చిన మూఁడునాల్గుకథలఁ గైకొని విచ్చలవిడిగాఁ గ్రంథము రచించినవాఁ డగుటచే, బద్యములందును గద్యములందును గూడఁ దనగడుసరితనమును విశృంఖలముగఁ జూపుకొనఁ గల్గెను. పోతనామాత్యునకు భాగవతమందలి యాధ్యాత్మికవిషయములు కొన్ని పద్యములందుఁ గూర్పఁ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గుదురని వగుటచే గొప్ప గొప్ప గద్యములఁ జెప్పక తప్పదయ్యె. ఆధ్యాత్మిక విషయములఁ దెల్పునపుడే కాక మఱికొన్ని యెడలను గూడనీతఁడు నెక్కువగా వర్ణనలఁ బెట్టుకొని కఠినము లగుగద్యములను గూర్చెను. తర్వాతఁ బెద్దనాదులు తాము విశృంఖలముగాఁ గల్పింప దొరఁకొన్నమనుచరిత్రాది ప్రబంధములందుఁ జంద్రికాదులను వర్ణింపమొదలిడి యనల్పము లగుకల్పనలఁ గల్పించుకొని యవి పద్యములం దిముడ్పఁ గుదురకపోఁగా శబ్దాడంబరమందాదరము మెండుకొనుకతన నంతంత లేసి ప్రౌఢ గద్యములఁ గూర్చిరి. అప్పటి నుండియుఁ బ్రబంధ మనుచుఁ గూర్ప మొదలిడిన తర్వాత నట్టిగద్యములఁ గూర్చుట కవులకుఁ దప్పని పనివలె నయ్యెను. మన తెల్గుదేశమున శుద్ధవచనకావ్యము లుత్పత్తిల్లమియ కాక చంపూప్రబంధములందలి గద్యములస్థితియు నీ విధమున నుండుకాలమున దక్షిణదేశమునం దాంధ్రవచన కావ్యరచన మారంభింపఁబడినది. అప్పుడక్కడ రచింపఁ బడిన గద్యకావ్యములందుఁ గేవల కల్పితములు లేవు. అన్నియును బురాణములును దదుపాఖ్యానములునుగనే కన్పట్టుచున్నవి. నన్నయాదులచే రచింపఁబడిన భారతాది ప్రబంధములు ప్రౌఢతమము లగుకతనఁ దదర్థగ్రహణము సామాన్యజనసులభము గాకపోవుటయే యక్కడ తొలుత నీ వచనకావ్యరచనోపక్రమమునకుఁ గారణమయినట్టు చూపట్టుచున్నది. తఱచుగా నీ కావ్యములందు వాక్యములు క్లిష్టాన్వయములై యంతును బొంతును లేక యుండును. వీనియందు గిరిసరిదాదివర్ణన మంతగాఁ గన్పట్టదు. సంస్కృత మూలమునఁ గలప్రధానకథననుసరించి పరిమితము లగు వర్ణనలతో నీ వచనరచన కావింపఁబడినది. ప్రౌఢదీర్ఘ సమాసములును, ననుప్రాసప్రయాసములును వీనియందుఁ గానరావు.

సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః
నిత్యాసమాసే వాక్యేతు సా వివక్షా మపేక్షతే.

సంస్కృతభాషయం దీ కారిక వాక్యమున సయి తము సంహిత వివక్షాయత్త మని తెలుపుచున్నది. కాని యీపద్ధతి తెలుఁగుఁభాషయందుఁ దొల్లింటికవు లవలంబించినవారు కారు. గద్యమున నేకవాక్యమందు సంహి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తను దప్పకపాటించుటయేకాక, రెండువాక్యములు కలయునప్పుడు నయితము విడువరైరి. ఈ కారణముచేఁ బ్రాచీనాంధ్రగ్రంథములం దెక్కడను సంధి విడువఁబడిన గద్యము కాన్పింపదు. దక్షిణదేశపుటాంధ్రవచనకావ్యము లందుఁ గొన్నింట నట్లుగాక, యుచ్చారణసౌలభ్యముకొఱకై క్వాచిత్కముగాఁ బయికారిక ప్రకారము సంహిత యవివక్షితమై సంధి విడనాడఁబడియున్నది.

కొందఱు లోకవ్యవహారానుగుణముగానా బాలసుగ్రహమగు తెఱఁగున వచనము రచింపవలయు ననునభినివేశముతోఁ గావలయు శబ్దలక్షణాదికమును సైత మంతగాఁ బాటింపరైరి. ఎంతయేని సలక్షణమును బ్రౌఢమును నగుపద్యకవిత్వమున నాఱితేరిన పుష్పగిరి తిమ్మన్న రచించినవచనమును గొండొకపట్టుల వ్యాకరణమును నిరాకరించుచున్నది. ఇప్పటికి నాకుఁ జేకుఱిన వచనగ్రంథములలోఁ దొల్తటిది

వచనభారతము

ఈ గ్రథమునుగూర్చి తెలిసికొనవలసినయంశ మెక్కువ కలదు గావున మునుమున్న యిందలి యాశ్వాసాంత గద్యముఁ జదువుదము.

'ఇది శ్రీరామచంద్ర చరణారవింద సేవాభినందన పవననందన వర ప్రసాదాసాదిత గీర్వాణాంధ్ర కర్ణాటకాది నానాభాషా కావ్యరచనాచతుర, శ్రీమన్మహా రాజధిరాజ రాజపరమేశ్వర రాజమార్తాండ ప్రౌఢ ప్రతాపాప్రతిమ వీరనరపతిబిరుద తెంబరగండబిరుదాంకిత శంఖచక్ర మకర మత్స్య హనూమద్గరుడ గండభేరుండ సింహశరభసాల్వాది నానావిధదేవార్హ ధ్వజాంకిత యాదవవంశతిలక, అంగ వంగ కళింగ కాశ్మీరలాటాంధ్ర ద్రవిడ ద్రావిడాది నానాదేశాధీశ్వర కిరీటకోటి సంఘట్టనత్రస్త నిస్తులనవరత్న పరాగ పరాగిత నిజభవన ద్వారాసక్తానేక జనపాలఫాలతల ఘటితాంజలిపుంజ రంజితారవిందక (ప) రాయమాణ సభాస్థానస్థ సింహాసనాధిరూఢ నానావిద్వదభీష్ట వరప్రసాద దేవరాజచిక్క దేవరాజకరుణాప్రాప్తకర్ణాటరాజ్యలక్ష్మీనృత్యరంగాయమాణశ్రీరంగపట్టణ పరిపాలనాథా దృత 'సైన్యాధిపత్య నిర్వాహక' మహారాష్ట్ర మదేభ పంచానన, కేళాది పంశాటవీదావదహన, మధురానాథమదవిమర్దన, జయాఘాటశిరః కందుక క్రీడన, యన మంతరాయ నాసికాకృంతన,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నింమోజిసమూలోన్మూలన, దాదోజిప్రాణహరణ, దండధర ప్రతాప శిల విశల ఫాలేరాయ ఫాలాక్షరవిదలన, నానావిధానేకాంతర్బాహ్యాదిశాత్రవ మేఘౌఘ జంఝానిల, పరరాజగర్వాంధకారవిదళన నిరాజదళవాయి 'దొడ్డరాజతనూజ' యాచకసురభూజ భుజబలాటోప పరాజితారిరాజన్య సమర్పితానేక రత్నరాశియుత ధనకనక వస్తు వాహనాది సువస్తువిస్తారిత సంతోషితాఖిల భూసురాశీర్వాదానువర్ధిత పుత్రపౌత్రాది వంశాభివృద్ధి విరాజమాన, 'కళవేకుల వంశాంబుధి రాకానిశాకర' అశ్వలాయనసూత్ర, పరమ పవిత్ర భారద్వాజగోత్రప్రదీప కాసేతు శీతాచల మధ్యవర్తి కాశీ ప్రభృతి పుణ్యక్షేత్ర నిత్యాన్నదానా ద్యనేకధర్మశాస్త్రోక్త దానదీక్షావిచక్షణ, క్షాత్రాధీశ్వర కార్యఖడ్గప్రవీణ అనవధికాగ్రహారగృహారామక్షేత్రాది సంతోషితాఖిల కవిరాజ, శ్రీ వీరరాజ ప్రణీతంబైనమహాభారత వచనకావ్యమునందుఁ బ్రథమాశ్వాసము.

ఈ చదువఁబడిన గద్యమువలన నీ గ్రంథమును రచించిన యాతఁడు మైసూరుప్రభు వగుచిక్కదేవరాయలయొద్ద దళవాయి యయిన దొడ్డరాజు కుమారుఁ డగువీరరాజని తెలియుచున్నది. మైసూరు ప్రభువులలోఁ జిక్క దేవరాయలు మిక్కిలి ప్రఖ్యాతుఁడు. ఈతనిఁ గూర్చి సంస్కృతాంధ్ర కర్ణాట భాషలలోఁ గొన్ని గ్రంథములు రచింపఁబడెను. తెలుఁగునఁ జిక్కదేవరాయ విలాసమును నింక ననేకచాటు పద్యములును గలవు. ఈతఁడు 1650 తర్వాత 1700 లోఁగా రాజ్య మేలెను. ఇంచు మించుగా మనగ్రంథ కర్తయు నాకాలముననే యుండును. ఈకవి తాను అశ్వలాయన సూత్రమును భారద్వాజగోత్రమును గల క్షత్రియుఁ డయినట్లు చెప్పుకొనెను. ఈతని దాతృత్వాదికమును, ఈతని జనకుని ప్రతాపాదికమును గద్యమువలనఁ దెలిసికొననగును. ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున నప్పకవీయమునకు రూపాంతరమై వీర భూపాలీయ మనునొక లక్షణగ్రంథము గలదు కూర్చిన గ్రంథకర్తపే రందుఁ దెలియుట లేదు గాని యది యీవీరరాజు నుద్దేశించి చెప్పఁబడినదే. ఈభారతసంగ్రహమును ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారముననే కలదు గాని యసమగ్రమై యాదిపర్వము మాత్రమే చూపట్టుచున్నది. ఇయ్యది శ్రీకృష్ణాంకితముగాఁ దేనియ తేటవోలె సారస్యము గల తెలుఁగు వచనమున రచింపఁబడినది. నన్నయాదుల భారతమున కిది దండా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వయము గాదు. సంస్కృతభారతపు మక్కికి మక్కికాదు. కథాంశమును జక్కగా(దేటపఱుచు స్వతంత్రరచనము. ఈకవి తనగ్రంథ ముద్ధతశైలి నుండవలయునని యపేక్షింపక సర్వసామాన్యముగా నర్థమగునట్లుండవల యునని తలంచి తలంచినట్లే నిర్వర్తించెను. ఈ గ్రంథమున నెక్కడను బిగువుదక్క నీరసముగా నుండుకూర్పు కాన్పింపదు. కొంత వచనభాగ మును మచ్చు చూపుచున్నా(డను.

“కుమారకా! యేను జాత్యంధుండ నయినను బాండు భూపాలుండు నన్ను మిగులం బూజించె. అది యెట్లంటేని, లోచనంబులు లేమింజేసి పర దళంబుల మొగ్గరంబులు పన్ని యగ్గలిక మెఱయ గెలువంజాల; స్వరాష్ట్ర పరిపాలనంబున కసమర్థుండ. సాంగంబులుగ వేదంబులను రాజనీతి శాస్త్రం బులు నధికరించితి. ఎంత యధికరించిన నేమి ప్రయోజనంబు, క్షత్రియుం డగువా(డు ధర్మమార్గంబుదప్పక సమరంబుగావించి హతుండయ్యేనేని స్వర్గంబున కరుగు. జయించిన(గీర్తియును భూమియుంబడయుంగావున నాయుధోపజీవుల కాయోధనం బవశ్యకర్తవ్యంబు. అట్లు గెలిచి పుత్త్రుల యెడ నైశ్వర్యంబు నిలిపి వనవాసంబున కరుగవలయు, నిట్టి కర్మంబున కే నసమర్థుండనయినను బాండునృపాలుండు నన్నురాజ్యంబున నిలిపి తాను దిగ్విజయంబు సేసి సకలధనంబులు నా యధీనంబులు గావించె. అతండు నన్ను రాజ్యంబున నిలుపుటకు ధర్మంబు కారణంబగుంగాని వేఱొండు నిమిత్తంబు లేదు. క్షత్రియులకు(బుత్త్రు లెందఱున్నను, దేజోధికుండ జ్యేష్ఠుం డగుంగాని వయోధికుండు జ్యేష్ఠుండు కానేరండు. అట్లు గావున(దేజోధి కుం డగుపాండునృపాలుండు వయఃక్రమంబున(గనిష్ఠుండయ్యు జ్యేష్ఠుం డనంబడు, నతనికుమారులు వేదశాస్త్రంబులు చదివి సకలార్థంబులు(దెలిసి గుణంబులం బ్రసిద్ధులగుచు నస్త్రాభ్యాసంబు సేసి లోకద్వయంబునం బూజ్యులగుచు జనులు తమయెడ ననురాగంబు సేయ మెలగుచున్నవారు. ధర్మపౌరుషప్రభావంబుల వార లధికులై యున్నయెడ వారల నెట్లు నగరంబు వెలుపరింపించి వారణావతంబునకుం బనుపువా(డ, నట్లు పనిచినను లోకం బునం గలజనులు నిందింపకుందురె ?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

(ఆదిపర్వము-నూటముప్పది తొమ్మిదవ యధ్యాయము.)

ఈ వచనము సంస్కృతభారతమునఁ గల్గు విషయము లన్నియును గల్గి యాంధ్రభారతము కంటె మిక్కిలి విపులముగా నున్నది. ఈచదువఁ బడిన భాగము నన్నయార్యుని రచనమున నత్యల్పమగునట్లు సంకుచింపఁ బడినది. విస్తరభీతిచే దానిని గూడనిం దుదాహరింప మానితిని. సంస్కృత భారతప్రకార మధ్యాయ విభాగముతో నీయాదిపర్వము మూఁడాశ్వాస ములుగా విభజింపఁ బడినది. ఆశ్వాసాద్యంతములందుఁ బద్యములు కలవు.

ఈ గ్రంథమునందుఁ గొంత ప్రాచీనప్రయోగసరళి కన్పట్టుచున్నది. (1) అమ్మహాసంగ్రామంబునకుం గూడిన పదునెనిమిది యక్షౌహిణుల రాజులును గాలవశంబునం జని రందులకు సుయోధనుండు హేతువై నిల్చు టలజేసి యజ్ఞానంబునం దనకేమియుఁ దోఁచదయ్యె నెంత తెలిసెద నన్నం దెలివి సెందఁజాలక యున్నవాడ. (2) సూతనందనా! యింతకార్యంబు నడచిన పిమ్మటఁ దాను బ్రతికియుండుటకు ఫలంబు లేశంబునుం గాన (ధృతరాష్ట్రునిపల్కులు) (3) ఓ డుండుభంబ! తొల్లి యొక దుష్టభుజం గంబు తనకుఁ బ్రాణపదంబయినప్రమద్వరకుఁ గీడాచరించె(రురునిపల్కు)

ఇట్టి వాక్యములందు 'నేను' శబ్దము ప్రయోగింపఁబడుపట్టులందుఁ 'దాను' శబ్దము ప్రయోగింపఁ బడినది. పూర్వకవుల రచనలం దిట్టి ప్రయో గములు కలవు.

(1) ఈప్రబంధముం-దన కిపు డంకితంబుప్రమదంబునఁ జేయుము.
(ప్రౌఢకవిమల్లన)

(2) అత్యుగ్రబాణశక్తిఁ దన్నుఁ బంపు దేవ (మన్మథుని పల్కు)
(నన్నిచోడదేవుఁడు)

ఇట్లు కొంత ప్రాచీన ప్రయోగసరణి కలదు.
మఱియు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

(1) శంతనునరపాలుం డేకాంతంబున నేకాంతంగనుఁగొని మరులు కొనియె యథార్థంబునఁబలుకరింపుమన సూతుండిట్లను. (2) నే నిక్కన్ని యకు జనకుండ నగుటం జేసి పలుకరించెద నాకర్ణింపుము-- ఇట్లు పెక్కు వాక్యములందు 'పలుకు' ధాతువు ప్రయోగింపఁ బడునెడ 'బలుకరించు' ధాతువు ప్రయోగింపఁ బడినది. ప్రాచీన గ్రంథములం దిట్టి ప్రయోగములు కలవో యని సందియ మగుచున్నది. ప్రయోగ వైచిత్ర్యము లిట్టివి కొన్ని గలవు.

మఱియు నిందుఁ దత్సమక్రియలకు శత్రర్థమున నింపుగాగమము తఱచుగాఁ గావింపఁబడినది. దక్షిణ దేశపుఁ బ్రబంధములం దెల్ల నిట్టిప్రయోగములు కుప్పతెప్పలుగాఁ గలవు. ఆంధ్ర దేశమందు రచింపఁబడిన వసుచరిత్రాది ప్రబంధములందును గలవు. పెద్దనామాత్యుఁడు కూడ 'ఇంపు మీఱంగ ధాత్రి పాలింపుచుండ' అని ప్రయోగించెను. ఇది ప్రాచీనకవి సమ్మతము కాదు.

అమహదర్థక మగుతచ్ఛబ్దమునకు 'వాటిని' మొదలగు రూపములు గూడ వాడఁబడినవి. అయ్యవి యసాధువులు. ఇంక నెందేనిఁ జిన్ని చిన్ని దోషము లిట్టివి మఱికొన్నియు నుండిన నుండఁబోలును. బహుస్థలము లందుఁ జూపట్టు చుండుటచేఁ బై ప్రయోగములు గ్రంథకర్తృకృతములే యని చెప్పవలసియున్నది. ప్రాయికముగాఁ దాళపత్త్రిసంపుటములు లేఖక దోషభూయిష్ఠములై యుండును. అట్టి దోషములనుగూడఁ దద్గ్రంథకర్త లకుఁదగిలింపరాదు.

ఈ వచనభారతము నీవీరరాజును మఱికొందఱును గలసి పూరించి నట్లున్నది. తంజాపురపు సరస్వతీభాండాగారమున వచనాత్మకములగు శాంత్యానుశాసనికపర్వములు క్రమముగా నారాయణ తుపాకుల యనంత భూపాలక కర్తృకములయినవి కలవు. ఇక్కడి యీయాదిపర్వమునందుఁ గూడ వీరరాజు నాశ్వాసాంత గద్యమునం దొక్కచో నడుమఁ దుపాకుల యనంత భూపాలకు గద్యమును వ్రాయబడియున్నది. ఈ తుపాకుల యనంత భూపాలకుఁడు మధురరాజుల యొద్ద దళవాయి యని తెలియుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈతడును వీరరాజు సమకాలపువాఁడే కాఁదగును. అనంతభూపాలక కర్తృకములయిన వచనకావ్యములు మఱికొన్ని గలవు. అందు విష్ణుపురాణము, భగవద్గీత యనుగ్రంథములు ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునందున్నవి. విష్ణుపురాణ మాఱాశ్వాసముల గ్రంథముగా రచింపఁబడినది. వెన్నెలకంటి సూరనార్యుని విష్ణుపురాణముకంటె నియ్యది కడు విపులమై సంస్కృత మూలము ననుసరించుచున్నది. ఈ కృతియును శ్రీకష్ణునకే సమర్పింపఁబడెను. ఉ విష్ణుపురాణవచనము ధారాళ మగురచన గల్గి యించుక ప్రౌఢమై మిక్కిలి చక్కఁగనున్నది. వచనభారత మందువలెఁగాక యిందు సంస్కృత సమాసములు కొండొక మెండుగాఁ జూపట్టుచున్నవి.

ఇంచుక మచ్చు చూపుచున్నాఁడను.

"అంత శ్రీకృష్ణుండు విమలతర చంద్రికా సాంద్రంబును, హృదయానంద కరంబునై, వికసితనీలోత్పల కుముద సౌరభంబులచే దిగంతంబులఁ బరిమళింపఁ జేయునట్టిశరత్కాలంబున నుత్ఫల్ల కుసుమవాసనాసక్తంబులై ఝుంకారం బొనర్చునట్టి తుమ్మెదలమొత్తంబుచే నలంకృతంబును విహార యోగ్యంబును నగుబృందావనంబుం గనుంగొని, యచ్చట గోపవనితానికరంబుల తోడఁ గూడి రమియించి వారల మనోరథంబులు నెఱవేర్పఁదలంచి, యొక్కనాఁటి రాత్రియందు నొక్కరుఁడ, నవరత్నఖచిత దివ్యాభరణభూషితుండును, దివ్యంచందనచర్చిత గాత్రుండును, మనోజ్ఞకుసుమమాలికాధరుండును నైవనంబునకుం జని, జగన్మోహనంబును, నవ్యక్తమధురంబును, నమృతోపమానంబును, మాత్రాలయసమన్వితంబునునగు వేణుగానం బొనర్చుటయు, సర్వభూతమనోహరంబగున యమ్మురళీనాదం బాలకించి గోపాంగనలు మదనబాణవిదళితహృదయలై యవ్వసుదేవనందను సమీపంబున కరుదెంచిరి. అందొక్కసుందరి నిజగృహంబునంద యుండి శ్రీకృష్ణుని వేణునాదంబున కనురూపమును, నవ్యక్తమధురంబును గా మెల్ల మెల్లన గానంబు గావించె.

(అయిదవయాశ్వాసము 13వ అధ్యాయము)

ఈతని గద్య మిట్లున్నది.

"ఇది శ్రీనందనందన చరణారవింద మత్తమధుకరాయమాణచిత్త

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చతుర్విధకవితాసామ్రాజ్యభోజ చంద్రగిరి కృష్ణ భూపాలకతనూజ భాగమాంబాగర్భశుక్తిముక్తాఫల తుపాకుల యనంతభూపాలక ప్రణీతం బైనవిష్ణుపురాణంబునందుఁ బ్రథమాశ్వాసము"

వచనభారత కర్తయయినవీరరాజు కుమారుఁ డగునంజరాజుచే సయితము పెక్కులు వచనకావ్యములు రచింపఁబడెను. నంజరాజు మైసూరు రాజునొద్ద మంత్రియై మిక్కిలి యెన్నిక కెక్కినవాఁడు. ఈతని నుద్దేశించి సంస్కృతమున నభినవకాళిదాసబిరుదాంకుఁ డగునృసింహకవిచే నంజరాజ యశోభూషణమను పేరఁ బ్రతాపరుద్రీయమునకుఁ బ్రతిబింబముగా నొక యలంకార శాస్త్రగ్రంథము రచియింపఁబడెను. తద్గ్రంథకర్త గ్రంథావసానమున నిట్లు చెప్పుకొన్నాఁడు.

శ్లో॥ ఆలూరితిర్మలకవే రభినవభవభూతినామబిరుదస్య
సుహృదా నృసింహకవినా కృతి రకృత నవీనకాళిదాసేన.

ఈ యభినవకాళిదాసు దైనందినప్రబంధ నిర్మాణసాహసికుఁ డఁట! నంజరాజయశోభూషణము ప్రౌఢరచన గల గ్రంథము. నంజరాజుచే రచింపబడిన వచనకావ్యములందు హాలాస్యమాహాత్మ్యము, విష్ణుభక్తవిలాసము. హరభక్తవిలాసము, కాశీమహిమార్థదర్పణము ననునవి నాకుఁ జేకుఱినవి, హాలాస్య మాహాత్మ్యమున నీనంజరాజు తనతండ్రిని

ఉ॥ ఆదళవాయి దొడ్డవసుధాధిపమౌళికిఁ గల్గె సజ్జనా
హ్లాదకరుండు షోడశమహాద్భుతదానధురంధరుండు తే
జోదిననాథుఁ డంచితయశోధవళీకృతసర్వదిక్తటుం
డాదినృపాలసన్నిభుఁ డుదారుఁడు వీరనరేంద్రుఁ డున్నతిన్.

అని వర్ణించెను. ఈతనికబ్బములలో హాలాస్యమాహాత్మ్యము స్కాందపురాణమందలి దక్షిణమధురాపురీమహిమమును దెలుపు హాలాస్యఖండమునకు సరిగాఁదెలుఁగున రచియింపఁబడిన డెబ్బదిరెండధ్యాయముల వచనకావ్యము. నంజరాజకవి వచనరచన మించుక ప్రౌఢమై మిక్కిలి చక్కఁగనేయున్నను వచనభారతశైలికిఁ గొండొక వెన్నడుచున్నది. అందందువ్యాకరణాపాకరణము లేకపోలేదు. ఈకవినిగూర్చి శ్రీవీరేశలింగముపంతులుగారు కొంత వ్రాసి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యున్నారు గ్రంథవిస్తరభీతిచేఁ దక్కినగ్రంథముల వదలి హాలాస్యమాహాత్మ్య మునుండియే మచ్చున కించుక వచనభాగమును జదివెదను.

"అసిద్ధుండు భయభక్తియుక్తుం డగురాజుం గనుంగొని వాంఛితార్థమ్ము వేఁడుకొ మ్మనుచుఁ బలుక నమ్మహిపాలుండతనికిం బ్రణమిల్లి యంజలి గావించి సద్గుణవంతుఁ డగుపుత్రుం గరుణింపు మని యభ్యర్థింప సిద్ధవేషధరుండును సచ్చిదానందస్వరూపుండును భగవంతుండు నగుహాలాస్యనాథుండు 'ఓయి పాండ్యభూపాలకా! నీకత్యంతైశ్వర్యసమేతుం డగుత్రుండును గీర్తియు దీర్ఘాయుష్యంబును గడపట శాశ్వతం బగుముక్తియు గలుగుంగాక యని వచియించి గజముఖంబువలన నేకావళియుం దీసియిచ్చి యాశీర్వాదంబులచేత నతనిం బ్రమోదంబు నొందించి కరమ్ములఁ దదీయశరీరమ్ము నివిరి ముహూర్తమాత్రమునం దదృశ్యుఁ డగుటయు భూపాలుం డాసిద్ధుని విచిత్రం బవలోకించి యిది సుందరేశ్వరువినోదం బని మనబునం దలంచినవాఁడై లింగమూర్తిధరుం డగునమ్మహాదేవుసాన్నిధ్యంబున కరిగి భక్తిచేత నమస్కరించి యిట్లని వినుతించె."

(ఇరువదియేడవ యధ్యాయము)

ఈ నంజరాజు కర్ణాటభాషయందు భారతేతిహాసమును వచనకావ్యముగా రచించెను. అదియును బ్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునఁగలదు.

ఈకాలముననే మధురాపురీనాథుడైన విజయరంగచొక్క భూపాలకు నాదరమునఁ బెక్కులు వచనకావ్యములును బద్యకావ్యములును రచింపఁబడినవి.

రాజరాజనరేంద్ర, కృష్ణరాయ, రఘునాథరాయాదులవలె నీప్రభు రత్నమును నాంధ్రకవీశ్వరుల కాలంబమై 1704 మొదలు 1731 వఱకు రాజ్య మేలెను. శేషము వెంకటపతి మొదలగువా రీతని యాస్థాన కవులుగా నుండిరి. అహల్యాసంక్రందనవిలాసమును రచించిన సముఖము వెంకటకృష్ణప్పనాయకుఁ డీతనికొల్వున నున్నవాఁడు. అహల్యాసంక్రదనవిలాసమున

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీ॥ 'సముఖమీనాక్షినృపగర్భవిమలజలధి
చంద్ర! వేంకటకృష్ణేంద్ర! శౌర్యసాంద్ర!
మునుపు జైమినిభారత మనఘ! వచన
కావ్య మొనరించినట్టిసత్కవివి కావె.'

అని తారాశశాంకవిజయ మొనర్చిన శేషమువేంకటపతి మెచ్చినట్లు వెంకటకృష్ణప్పనాయకుఁడు చెప్పుకొన్నజైమినిభారత వచన మిప్పు డీయాంధ్రసాహిత్యపరిషత్తువారిచే దక్షిణదేశము నుండి సంపాదింపఁబడిన తాళపత్రగ్రంథములందుఁ గలదు. ఈతనిచే రాధికాసాంత్వన మనునేకాశ్వాసక్షుద్రప్రబంధము రచింపఁబడినది. కొంతకాలముక్రింద నాతాళపత్రగ్రంథమును విక్రయించుటకై యొకరు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునకుఁగొనివచ్చిరి దానిని నేను జూచితిని. ముద్దుపళని రాధికాసాంత్వనమం దిందలి పద్యము లన్నియుఁ గలవు. మఱికొన్ని పద్యము లెక్కువగాఁ జేర్పఁపడి నాల్గాశ్వాసములుగా ముద్దుపళని గ్రంథము విభక్తమయి కన్పట్టుచున్నది.

విజయరంగచొక్కభూపాలకు నాస్థానముననే కవీశ్వరుఁడుగా నున్న వెలగపూడికృష్ణకవిచే వేదాంతసారసంగ్రహ మను వచనకావ్య మొకటి రచింపఁబడెను. అది నాకుఁ జేకుఱలేదు. ఈవిజయరంగచొక్కభూపాలకుఁడు సయితము శ్రీరంగమహాత్మ్యమను వచనకావ్యమును రచించెను. ఈవచన మంతగా నిర్దిష్ట మన వలనుపడదు.

సులువుగా నర్థ మగునట్లు వ్యావహారికశైలిని రచింపఁబడినది. ఇంచుక యుదాహరించెదను.

"అంత నవి యన్నియు దేవేంద్రుఁడు విని కోపము చేసికొని ఐరావతము నెక్కి వజ్రాయుధమును దూసికొని దేవతల నెల్ల సహాయముగాఁ గూర్చుకొని ఆరాజుండు తస్థలంబునకుంజనె. అప్పుడు ఇక్ష్వాకుమహారాజు పూజ్యాద్రవ్యముల నెత్తుకొని దేవేంద్రునికి నెదురుగాఁ బూజ చేసెను. అప్పు డాదేవేంద్రుఁడు ఏకకాలంబుగాఁగొండలు కొట్టే వజ్రాయుధమును జేతఁ దీసికొని కొట్టెను. ఆదెబ్బశబ్దమునకు రాజైనతాను ఇనుమంత్రైన మనస్సు చలించక శ్రీమన్నారాయణమూర్తియం దుండెడు చక్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మును ధ్యానము చేసెను." ఈగ్రంథము లేఖకదోషములతో నిండియున్నది. ఇంచుక సంస్కరించి యీభాగమును మచ్చు చూపితిని.

ఈ విజయరంగచొక్కభూపాలుకాలమున నింక ననేక వచనకావ్యములు రచింపఁబడినవి. మిత్రవిందాపరిణయమును రచించినకుందుర్తి వెంకటాచలకవియు నీతని యాస్థానమం దున్న వాఁడే. ఈతఁడు

సీ॥ "చదివినా వేమేమి చదువ యోగ్యంబులో
యవి యెల్ల నిస్సంశయంబు గాఁగ,
వచనకావ్యములుగా రచియించినావు భా
రతభాగవతములు రామకథయు."

అని విజయరంగ చొక్కభూపాలుఁడు తన్ను మెచ్చినట్లు చెప్పుకొనెను. ఈతని భారత, భాగవత, రామాయణ వచనములు మనకు లభింపవలసియున్నవి.

పదపడి సమీరకుమారవిజయ మనుప్రౌఢప్రబంధ మొనర్చినపుష్పగిరి తిమ్మనార్యుఁడు భాగవతసార మను వచనకావ్య మొనర్చెను. ఉత్తరరామాయణము నొనర్చిన కంకంటిపాపరాజకవి కీతఁడు మిత్రము. ఈతని భాగవతసారము సాంస్కృతాంధ్రభాగవతములకు మిక్కిలిసంగ్రహముగా నున్నది. ఇందలి వచనశైలి మిక్కిలి తేలికగాఁ దేటగా నింపుగూర్చుచున్నది. రచనాప్రౌఢిమ నీగ్రంథమందు తిమ్మకవి చూపలేదు. వ్యాకరణమును మీఱిన ప్రయోగము లందం దిందుఁ గన్పట్టుచున్నవి. ఇంచుక మచ్చు చూపుచున్నాఁడను.

భాగవతసారము.

షష్ఠస్కంధము

"ఆలో యమకింకరులు అఘోరయమపాశమున నతనిని గట్టిగాఁ గట్టి, కొంపోవ నుద్యోగించఁగా' నంతలో అజానుచతుర్బాహులు, నీలమేఘశ్యాములు, సుగుణాభిరాములు, అమిత దయాళురు, విష్ణుదూతలు వచ్చి, ఆపాశము త్రెంచి పాఱవైచి, యమదూతలఁ బాఱఁద్రోలి, యాతనాశరీరధారి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యైన అయజా మీకుని వెఱవకుమని అభయమిచ్చి, యాదరించి పలికిరి. యమభటులును దిట్టలుగనుక, వెనుకకుఁబోయి మఱలివచ్చి, ఆ మకర కుండల, కిరీట, హార, కేయూర, వైజయంతీ, వనమాలికా భరణులైన విష్ణుదాసులఁ జేరవచ్చి 'అయ్యా మీరెవ్వరివారలు? మమ్మెఱుంగరా పాపకర్మునిఁబట్టి మేము కొంచుకుపోవఁగా అడ్డగించ మీకుఁ బని యేమి యున్నది. యమునిశాసనము మీకు నవ్వులాయెనా?" అనఁగా శ్రీమన్నారాయణుని కింకరులు పలికిరి. "రారోయి యమభటులారా! మీరు ధర్మరాజు దూతలుగనుక గుణవంతులు. మీపలుకులయందుఁ గతినత్వము లేదు. ఈ బ్రాహ్మణుండు దురాచారి యగును. ఇతండు దండింపఁదగియుండియు దండనకుఁ దగనవాఁ డైనాఁడు దండార్హుం డెవ్వండు? దండింపఁదగనివాడెవ్వండు? ఆత్మకు కర్మానుభవము ఎటువలె కలుగును? వినిపింపుడనిన కేలుపుఱుకుచున్న యమదూతలు పలికిరి. వినరయ్యా మహాత్ములారా! శ్రీభగవంతునియొక్క వాక్యములు వేదములు. అందు చెప్పఁబడ్డది ధర్మ మన బడును. వేదమార్గము తప్పిననే అధర్మమగును. ధర్మమున సుఖమును అధర్మమున దుఃఖమును ప్రాణులు పొందుదురు. ప్రాణి చేసిన పాపపుణ్యములకు సాక్షులు సేనా యున్నారు. కర్మ మేవేళ జీవుఁడు సేయునో అకాలమే కర్మమునకు సాక్షియై యుండును. కాఁబట్టి తప్పించుక పోఁగూడదు."

ఈ కవియే రచించిన సమీరకుమారవిజయ మందున్న వచనమును గూడ నించుక చదివినచో నాతనికి భాగవతసార మెంత తేలికగా నర్థమగు నట్లు రచింపవలయు నను నభినివేశము కలదో తేటపడఁగలదు.

సమీరకుమారవిజయమందలి వచనము

''ఇప్పగిది నప్పరమపావనుం డప్పు డుప్పరంబునఁ గప్పు జిగిగప్పిన నాయొప్పిదంబు విప్పగుమెప్పునం దప్పక చూచి ముప్పిరి గొను భక్త్యనురాగ సంభ్రమంబుల మత్పరాయణుం డగుటంజేసి యచ్చోటు వాసి మదీయసన్నిధిఁ బెన్నిధిఁ గన్న పేదచందంబున డెందంబు గందళింపఁ దనమనోవృత్తి నను సరించు శరీరంబు సభృత్యపరివారంబుగా మఱచి దూరంబున నున్ననన్నుఁ జేరంబూని కూర్చున్న యటుల తద్గగనంబున కుద్గమించునయ్యంచితాత్మ సంచరణంబున."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనుచరిత్రమునకుఁ దర్వాత రచింపఁబడుచు వచ్చిన ప్రబంధము లందలి గద్యములు తఱచుగా నీ తెఱఁగుననే యుండును.

ఈ తిమ్మకవియు దక్షిణదేశపువాఁడో యని సందియము కలుగు చున్నది.

ఎరశూర్ యమ్మావాద్యార్ చిన్నయ యనునతఁ డీతని భాగవతసార మును ద్రావిడభాషలోని కనువదించెను. ఆ ద్రావిడానువాదమున నిట్లు కలదు. "ఇందె పన్ని రెండు కందంగళుం, శ్రీ కృష్ణప్రీతియాయ్, తెలింగి లెయుం పుష్పగిరి తిమ్మయ్యర్ పణ్ణినది పార్త్తురశూర్ యమ్మానాద్యార్ శిన్నయ్య తమిళ్ వచన మాహ పణ్ణినదు."

ఈ పుష్పగిరి తిమ్మకవి 18-వ శతాబ్ది మధ్యమున నున్నవాఁ డని శ్రీ వీరేశలింగము పంతులవారు వ్రాసియున్నారు. కంకంటి పాపరాజు నుత్తర రామాయణమునకు, విష్ణుమాయావిలాసమునకు, నీకవి సమీరకు మారవిజయమునకు నూఱు సం॥పై బడినకాలమున వ్రాయఁబడిన భిన్న దేశపుఁదాళపత్రి ప్రతులు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁ గలవు. 200 సం॥ పూర్వము వ్రాయఁబడినతాళపత్త్రిపుఁబ్రతులు నైజాం దేశము నందు బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు సంపాదించినట్లు చెప్పు చున్నారు. భాగవతసారపు ద్రావిడభాషానువాదమునకే ప్రాఁబడిన తాళపత్త్రి ప్రతులు చూపట్టుచున్నవి. కావునఁ గంకంటి పాపరాజకవియు, పుష్పగిరి తిమ్మకవియు, నంతకంటెఁ బూర్వులై యుందురు. తిమ్మకవి భాగవతసారము ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నసమగ్రముగాఁ గలదు.

మీఁదఁ బేర్కొనఁబడినవిగాక తంజాపురపు సరస్వతీ భాండాగార మునఁ గొన్ని వచనకావ్యములు గలవు. త్రికామకవి ధేనుమాహాత్మ్యము, ఆచార్యవిజయము, సోమకవి బలభద్ర విజయము, పరమానందతీర్థుల బ్రహ్మ విద్యాసుధార్ణవము, మఱియు, మైరావణచరిత్రము, వివేకచింతామణి, వివేకసారము మొదలగువచనగ్రంథము లచ్చటి పుస్తకసూచియందుఁ గనుపట్టుచున్నవి. ఆగ్రంథములఁ గూర్చియుఁ, దత్కర్తలగూర్చియు దద్గ్రం థములఁ బరిశీలించిన పదపడిగాని తెలుప వలనుపడదు. 17, 18-వ శతాబ్దు లం దింకను గొన్ని వచనకావ్యములు దక్షిణదేశమున నుప్పతిల్లి యుండును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భారతసావిత్రి, గోవ్యాఘ్రచరిత్రము మొదలగు కొన్ని చిన్నిచిన్ని వచనగ్రంథములను, మనకుటుంబములందు వృద్ధపరంపరగా స్త్రీపురుషులు కంఠపాఠము చేసి భగవద్గీతవోలెఁ బ్రతిదినమును బారాయణము సేయుచుందురు. ఏనాఁ డెవ్వరిచే రచింపఁబడెనో తెలియరాదు గాని యావచనములు చక్కనికూర్పు గల్గిమధురములై యొప్పు లొలుకుచున్నవి. భారతసావిత్రి నుండి యించుక యుదాహరించుచున్నాఁడను.

"సుయోధనా! ఆదరంబుమీఁద నొసంగినశాకమాత్రంబేనియు మనంబున కమృతోపమానంబై చను. భక్తి లేక యిచ్చిన నమృతం బయినను నిస్సారంబై చను. నాపలుకులు వినఁ గలవాఁడ వైతేని నీదురభిమానంబు విడిచి పాండునందనులకు రాజ్యంబు సమభాగంబుగాఁ బంచి యిచ్చి మీరు నూర్వురు వారేవురుఁ గలసి యేకీభవించి యుండుట కార్యంబు."

ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున నొండు రెండు శతాబ్దులకు మున్ను దక్షిణదేశమునఁ గేవలవ్యావహారిక భాషలో రచింపఁబడిన వచన గ్రంథములు కొన్ని సేకరింపఁబడియున్నవి. విస్తరభీతిచే వానినిగూర్చి యిచ్చుట ముచ్చటింప మానితిని.

తొంటికాలమున సర్వలోకసామాన్యముగా నర్థ మగుటకై యెంత పండితు లయినను వ్యాఖ్యానాది గ్రంథముల రచియించునప్పుడు కేవలవ్యావహారికభాషనే యుపయోగించుచుండెడివారు. సర్వలక్షణసారసంగ్రహ మొనర్చి ప్రసిద్ధికెక్కిన చిత్రకవిపెద్దన్న (హరిశ్చంద్రనలోపాఖ్యాన వ్యాఖ్యాత) తాళ్ళపాక తిరువేంగళనాథుఁడు (అమరకోశవ్యాఖ్యాత) మొదలగు లాక్షణికులగు ప్రాచీనవ్యాఖ్యాత లెల్లరును దమగ్రంథములందు సంస్కారశూన్యమయిన యాభాషనే యుపయోగించుచు వచ్చిరి. అప్పటి యావచనరచనలందును గొంతవఱకు వ్యాకరణ నిరాకరణ మీకారణము చేతనే నమకుఁజియుండు నని యావఱకే వాకొనియుంటిని గదా.

19-వ శతాబ్దినుండి మనదేశమున వచన రచన యుపక్రమింపఁబడినది. చిన్నయసూరిగారు 19-వ శతాబ్ది ప్రారంభమునఁ జెన్నపురమునఁ ప్రఖ్యాతపండితులుగా నుండిరి. వీరినాఁటనుండియుఁ గల్పితవచనగ్రంథములు మిక్కిలి వెలువడఁజొచ్చినవి. వారివచనరచన మిక్కిలి సరసమై

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రౌఢమై సర్వాతిశాయియై తర్వాతివారి రచనలకు మార్గదర్శక మైనది. ఇంత కంటె సుప్రసిద్ధ మగు వీరిరచనను గూర్చి చెప్పఁబని యుండదు.

చిన్నయసూరిగారి కాలమునఁ జెన్నపురముననే కోలాశేషాచలకవి యను నాతఁడు గోడే వెంకట జగ్గారాయలవారికిఁ గృతిగా నీలగిరియాత్రాచరిత్ర మనునొకహృద్య మగు గద్యప్రబంధమును గల్పించెను. ఈకవి రచన చిన్నయ సూరిగారి త్రోవను వెన్నాడుచు మిక్కిలి చక్కగానున్నది. అతిశయోక్త్యాది కావ్యాలంకారంబులం దొఱంగి కలరూ పెఱింగించువేడ్క నిఖిలజన సుబోధంబగునట్లుగా రచించిన ట్లాతఁడు చెప్పికొనియెను.

- ఇంచుక చవిపెదను

"నావిడిదల యగునిలు సొచ్చినయనంతరంబ యెచ్చటఁ గూర్చుండిన నెచ్చటఁ గ్రుమ్మరిన నెద్ది యంటిన నాసర్వం బతిశీతలం బయి గోచరించె నంతఁ గొంతతడవునకె చలి మొలతెంచె. మార్గశ్రమంబున న్విడిదల ప్రవేశించు సమకాలంబునన శీతంబు గోచరింప దయ్యెనని తోఁచెను. మఱునాఁడె నాకును నాబాసటయయి వచ్చిన శ్రీనివాసమొదలారికిని స్వదేశంబునుండి కొంపోయిన చలితొడుగు లొడళ్ళం దొడిగికొన వలసివచ్చె. అచ్చట నగ్నియె కండు దక్క నెల్లపదార్థంబులు నతిశీతలంబు లయి యున్నయవి. కొన్ని పదార్థంబులు మంచుగడ్డలంబోలి శీతంబుచే దుస్స్పర్శంబు లయి యున్నయవి. టెంకాయనూనియ నేతితెఱంగునం బేరుచున్నది. వార్చినతోడన పుళియ యందు వడ్డించిన యన్నంబు కొంత ఘృతవ్యంజనాదులతోడ మొదలభుజించి యెడఁ గలుగఁ ద్రోచి యుంచిన యవశిష్టాన్నంబు భుజియింపఁ బోయిన నొకానొకప్పుడు పర్యుషితకల్పం బయి కానంబడియెడు. మఱియు నచ్చటిచలి రేవగల్లు హూహూకారంబుఁ బుట్టించుచున్నయది."

స్కాందపురాణాంతర్గతమగు శివరహస్యఖండము ముదిగొండబ్రహ్మయ లింగారాధ్యకవిచే వచనకావ్యముగా రచింపఁబడెను. ఈ రచనమించు మించుగాఁ జిన్నయ్యసూరిగారికాలముననే యాంధ్రదేశమున రచింపఁబడి యుండును. కవివిషయ మంతగాఁ దెలిసినది గాదు. ఈరచన మనుప్రాసశ్లేశము గల్గి తత్సమపద బహుళ మై యించుక క్లిష్టముగనే యున్నను నిర్దుష్ట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మైనట్లు కన్పట్టుచున్నది. ముద్రితమై విక్రయింపఁబడుచున్న యీగ్రంథము నుండి యుదాహరణము గైకొనలేదు.

చిన్నయ్యసూరిగారితర్వాత ప్రెసిడెన్సీకాలేజీయం దాంధ్రోపాధ్యాయులుగా నున్న చెదలువాడ సీతారామశాస్త్రిగారు కొన్ని సంస్కృతనాటకాదులను కథలుగా వచనమున రచించిరి. తేలికపలుకులతోఁ జక్కఁగా నర్థ మగుచు నీవచనరచన యింపు గూర్చుచున్నది. చిన్నయ్యసూరిగారికిఁ దర్వాతివచనగ్రంథకర్తలందు సంహితను బాటింపక సంధి విడఁగొట్టి వాక్యములఁ గూర్చినవారిలో వీరు తొల్తటివా రని చెప్పఁ జెల్లును. వీరి గ్రంథములును ముద్రితము లై యున్నవి గావున రచన నుదాహరింపలేదు. పదపడి నాఁడునాఁటికి నాంధ్రవచనరచన క్రొత్తక్రొత్తయై పలుదెఱఁగుల వెలయుచున్నది.

[ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక
....
మీగడతఱకలు 1951]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రాచీన సంస్కృత రూపకములు

వరరుచి, శూద్రకుఁడు, ఈశ్వరదత్తుఁడు, శ్యామలకుఁడునని నలుగురు ప్రాచీనసంస్కృత మహాకవులు, ఉభయాభిసారిక, పద్మప్రాభృతకము, ధూర్తవిట సంవాదము, పాదతాడితమునని రచియించిన నాలుగురూపకము లపురూపమయినవి యీనడుమఁగ్రొత్తగా బయల్పడినవి. ఇవి నాల్గును భాణములు. మళయాళదేశమున దొరకిన యీ నాల్గుగ్రంథములను మామిత్రులు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు, రామనాథశాస్త్రిగారును సుపరిష్కృతములు గావించి లఘుపీఠకతో ముద్రణమున కొనఁగి సంస్కృతకవితారసాస్వాదనతత్పరులకు అతిరుచ్య మయిన యమృతరసాయనము నారగింపఁ బెట్టినారు నాగరాక్షరములతోఁ బయినాలుగుగ్రంథములను నొక్క సంపుటముగా ముద్రించి పాట్నా (పాటలిపుత్రము) లో డి.జి. శర్మ, కృష్ణ అనువారు ప్రకటించిరి. నాల్గు భాణములు కలసియున్న సంపుటము వెల రెండు రూపాయలు మాత్రమే. మద్రాసులో 124 నెం. ఆదియప్పనాయకన్ వీధిలో యమ్. దొరసామయ్య యనువారు కూడ దీనిని విక్రయింతురు సంస్కృతభాషప్రియు లీగ్రంథములను దప్పక చదువుదురుగాక యని కోరుచున్నాఁడను. ఈ గ్రంథములను విమర్శించుటకు ముందు మళయాళదేశమునుగూర్చి యించుకంత పేర్కొనెదను.

మళయాళ దేశము

భారతదేశమునకు దక్షిణపుటంచుననున్న యీదేశమున నంబూద్రీలను, బ్రాహ్మణులును, నాయరులను శూద్రులును, నేటికిఁ గూడ సంస్కృతభాషను, బ్రధానముగా నభ్యసించుచున్నారు. సంస్కృతవిద్య నేర్చి విద్వాంసురాండ్రుగా నున్నస్త్రీ లిప్పు డక్కడఁ బెక్కురున్నారు. ఆదేశ మిప్పటికిని బ్రాచీనార్య విద్యలకుఁ బట్టుఁగొమ్మగా నున్నది. పూర్వమీమాంస, ఆయుర్వేదము, జ్యోతిషము మొదలగు శాస్త్రము లిప్పుడితర దేశములం దుత్పన్న ప్రాయములుగా నున్నను, నాదేశమునఁ బారంపర్యముగా బకనపాఠనప్రచారము గల్గి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యున్నవి. అక్కడిబ్రాహ్మణులు బహుసంపన్నులు. వారిలో నాంగ్లభాష, నభ్యసించువారి నిప్పుడు వెదకుద మన్న వ్రేళ్ళలెక్క కయినఁ జిక్కరు. వారు ప్రాచీనాచారవిద్యాపరాయణులు. ఆదేశ మితరదేశ ములవలెఁ బూర్వము రాజ్యవిప్లవములకుఁ బాల్పడకపోవుటచేతను, శ్రీతాళ వృక్ష సమృద్ధమై సంవత్సరముపొడుగునను వర్షములు గలిగి చల్లఁగా నుండుటచేతను, బహు సంపన్నులై ప్రాచీనవిద్యలనే ప్రధానముగా నభ్యసించు బ్రాహ్మణులు గల దగుటచేతను, నక్కడకుఁ జేరినప్రాచీనగ్రంథములు సురక్షితములయి నేఁటికిని జెదరకున్నవి. దారిద్ర్యము రాజ్యవిప్లవములు మొదలగు కారణము లచేఁ బ్రాచీనవిద్యలం దనాదర మేర్పడుట, ఎండలు మెండగుటచేతను, గ్రామము లగ్నిదగ్ధము లగుటచేతను, తాళపత్త్రగ్రంథములు వెంట వెంటనే నశించుచుండుట, వ్రాఁతకు సరిపడు శ్రీతాళములు లేకుండుట, మొదలగు కారణములచేఁ బెక్కుమహాగ్రంథములు తక్కినదేశములందు రూపుమాసినవి. పూర్వోత్తరమీమాంసలలో, నితరశాస్త్రములలో నపురూపములయిన గ్రంథము లెన్నో యక్కడనిప్పుడు చిక్కుచున్నవి. మాపలాలవిప్లవమువలన నిన్న మొన్న కొన్నిగ్రంథము లక్కడఁ గూడ పోయియుండవచ్చును. నాటకాలంకార విష యములందు మలయాళదేశమున ననేక మహాగ్రంథములు దొరికినవి అందిప్పుడు మనకుఁ బ్రస్తుతములయిన భాణములు నాలుగు నున్నవి. ఇవి నాలుగును నొక్కసంపుటముననే వ్రాయఁబడియుండెను. వాని కడపట నీక్రిందిశ్లోకము కలదు.

శ్లో॥ వరరుచిరీశ్వరదత్తశ్శ్యామిలకశ్శూద్రకశ్చచత్వారః

ఏతేభాణాన్ బభణుః కాశక్తిః కాళిదాసస్య॥

ఈశ్లోక మాదేశమున దొరకిన పయిభాణములప్రతులన్నింటిలోను గలదు. పూర్వకాలముననే యీశ్లోక మెవ్వనిచేతనో గ్రంథపఠనపరితుష్టుఁ డయిన విలేఖకునిచే రచితమయి గ్రంథాంతమునఁ జేర్పఁ బడి యుండ వచ్చును. తర్వాత నది దానిప్రతి పత్త్రిక లన్నింటను జేరినది. ఈనాలుగు భాణము లును శృంగారరసప్లుతములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్యామిలకుఁడు

అనల్గురు గ్రంథకర్తలలో శ్యామిలకుఁడు పాదతాడితకకారుఁడు కడపడి కాలమువాఁడు. ఇతని విషయము ముందు పేర్కొనెదను. క్రీ 920 లో నున్న యభినవగుప్తపాదుఁడును, ఆతనిశిష్యుఁ డగుక్షేమేంద్రుడును శ్యామిలకుని పాదతాడితకమును దమగ్రంథములం దుదాహరించిరి. కాబట్టి యాతఁ డంతకుఁ బూర్వుఁడు కావలెను. కాదంబరీ హర్షచరిత్రములను రచించిన ప్రఖ్యాతుఁడు బాణభట్టు క్రీ॥ 7 వ శతాబ్దిలో నున్నవాఁడు ఆతనికి పిన్నతండ్రికుమారుఁడు శ్యామలుఁ డను కవీశ్వరుఁ డున్నట్లు హర్షచరిత్రమునఁ గలదు:- "(బాణస్య) గణపతిః అధిపతిః తారాపతిః శ్యామల ఇతి పితృవ్యపుత్రాభ్రాతరః ప్రసన్నవృత్తయః గృహీతవాక్యాః......విదితవక లేతిహాసాః మహావిద్వాంసః మహాకవయః మహాపురుషవృత్తాంతకుతూహలినః సుభాషితశ్రవణక సరసాయనా తేషాం కనీయాన్ శ్యామలోనామ బాణస్యప్రేయాన్" మనపాదతాడితకకర్త యీశ్యామలుఁడు కావచ్చును. ధ్వని కారమతమును ఖండించుచు వ్యక్తివివేకమనుగ్రంథమును రచించిన మహిమభట్టుగురు వొకఁడు శ్యామలుఁడున్నాడు:- శ్రీధైర్యస్యాంగభువా మహాకవేశ్శ్యామలన్యశిష్యేణ వ్యక్తివివేకోవిదధే రాజానకమ హిమకేనాయమ్! అని యందుఁ గలదు. మహిమభట్టు అభినవగుప్తపాదునిసమకాలమువాఁడుగా గుర్తింపఁబడుచున్నాఁడు. పాదతాడితకకర్త మహిమభట్టుగురు వయినను గావచ్చును. కాని గ్రంథమును జదివిచూడఁగా నాతఁ డంతకును బూర్వుఁడు గాఁగలఁడని తోఁచుచున్నది.

గ్రంథవిషయము :-

భాణము దశవిధరూపకములలో నొకటి. ఇది యేకపాత్రప్రవేశము గలిగి శృంగారరసభరితముగా నుండవలెను. ఈపాదతాడితక మట్లే యున్నది. ఇందలకథావస్తువు శృంగారభరితమై నవ్వుపుట్టించుచున్నది. కవితాపరిశ్రమమునుగూర్చి యీకవి స్థాపన (ప్రస్తావన) లో నిట్లు చెప్పుకొన్నాఁడు.

శ్లో. ఇదమిహపదంమాభూదేవంభవత్విదమన్యథా
కృతమిదమయంగ్రంథేనార్థో మహానువపాదితః
ఇతిదునసియఃకావ్యారంభే కవేర్భవతిశ్రమః
వనయవజలోరోమోడ్భేదస్పృతాంతమహోహతి॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మఱియు హాస్యానంద మందఱకు నుండఁదగినదే యని యిట్లు చెప్పి నాఁడు:- శ్లో. నప్రాప్నువంతియతయోరుదితేనమోక్షం స్వర్గాయతింనపరిహానకథారుణద్ధి తస్మాత్ప్రతీతమనసాహసితవ్యమేవ వృత్తింబుధేనఖలు కౌరుకుచీంవిహాయ!

కథావస్తువు

విష్ణునాగుఁ డని పేరుగల బ్రాహ్మణుని మదనసేన యని పేరు గల సౌరాష్ట్రిదేశపువారవధూమణి వారుణీమదవికారవిలాసముచే మదనవిహారమునందుఁ దలపైఁ దన్నెను. కామిజన సంప్రార్థ్యమయిన యా సమ్మానము నాతఁ డవమానముగాఁ దలఁచి కన్ను లెఱ్ఱజేసి చీఁదరించుకొని తల విదిలించుకొనుచు పెదవి కఱచుకొనుచుఁ జేతులు తట్టుకొనుచు నిట్టూర్పుచు, ఓసి! పుంశ్చలీ! నన్నుఁ జెఱిచితివే! యని గగ్గోలుపెట్టెను. ఆ సందర్భమున శ్లోకము:

శ్లో. ప్రయతకరయామాత్రాయత్నాత్ప్రిబద్ధశిఖండకే
చరణవిపతేపిత్రాఘ్రాతశిశుర్గుణవానితి
నకుసుమలవైశ్శ్యాంత్యంభోభిర్ద్విజాతిభిరుక్షితే
శిరసిచరణోన్యస్తోగర్వాన్న గౌరవమీక్షితమ్!

అంత నావేశ్య మొగము వెలవెలపోఁగా వారుణీరసాస్వాదవిలాసము వమ్మయిపోఁగా, నిదేమిరోఁతరా యని యొడ లెల్లఁ జెమర్పఁగా బుద్ధి తక్కువపనిచేసితిని క్షమింపుఁడు ఇఁక నెన్నఁడు ఇట్లు వర్తింప ననుచుఁ బాదములపైఁ బడెను. అతఁడు "ఓసి చండీ! నన్నుఁ దాఁకకు మరల నాజోలికిరాకు" మని గోలపెట్టెను. గ్రుడ్లగూబను గోకిల వెంటాడిన విధము కాఁగా నాపురుషబేతాళునిఁ బొందినందు కావారవధూమణి సిగ్గిలి తల వాంచి పుటపుట కన్నీరు కార్చుచుఁదనలోఁ దాను క్రుళ్ళి కుమిలెను. ఈవిధము నొకవిటుఁడు (ఈతఁడే రంగప్రవిష్టుఁడు) చూచి "ఓయి ! వైయాకరణఖసూచీ! పుష్పములను రోఁకటఁ జిదుకఁగొట్టకుము. కాఁబవితో వీణను వాయింపకు" మని యాతనిఁ జీవాట్లు పెట్టెను. అక్కడినుండి యాబ్రాహ్మణుడు లేచిపోయెను ఆవేశ్య యాయవమానమునకుఁ దాళలేక చెక్కిటఁ జేయి చేర్చి రోదనముచేసెను. విటుఁడు ఓదార్చెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్లు "సుందరి నవానరోవేష్ట నమర్హాతి గర్దభోవా వర ప్రవహణంవోఢుం అలమలం రుదితేన, హాస్యఃఖల్వేషతపస్వీ నైవంమహాంతం శివస్సత్కార మర్హాతి.

శ్లో. కింకామీనకచగ్రహైర్యమబలాః క్లిశ్యంతిమత్తాబలాత్
యంబధ్నంతిన మేఖలాభిరథవా నఘ్నంతికర్ణోత్పలైః
పక్షేతస్యతుమన్మధుసుకృతిన స్తస్యోత్సవోయౌవనం
దాసేనేవరహస్యపేతవినయాః క్రీడంతియేనాంగ నాః॥

ఆవేశ్య స్మితపురస్సరముగా నపాంగముచే నాయోదార్పునుగొని యాపాదమస్తకము ముసుఁగు వైచికొని శయన మలంకరించెను. తెల్లవాఱినది. ఆవిఘ్నునాగుఁ డార్తవేషముతోఁ దల విరియఁబోసికొని ప్రాతఃకాలమున బ్రాహ్మణపీఠమునకుఁ బోయి సభ్యులముౌల "నే నయ్యా! నా కిట్టియ మాంగల్యము జరిగినదయ్యా! అతొత్తుకాలిచేఁ దలమొత్తుపడిననాకుఁ బ్రాయశ్చిత్తము చెప్పుఁడయ్యా! త్రైవిద్యవృద్ధులారా" యని మొఱపెట్టసాగెను. రాత్రి చీవాట్లు పెట్టినవిటుఁడు కూడ నక్కడకు వచ్చియుండెను. ఆబ్రాహ్మణ పీఠమం దున్నబ్రాహ్మణు లందఱునవ్వుచు నొకరి నొకరు చూచుకొని కొంచె మాలోచించి "ఏమయ్యా! మేము మన్వాదిస్మృతుల నన్నిఁటిఁ జూచితిమి ఇటువంటిమహాపాతకమునకు మా కెక్కడను బ్రాయశ్చిత్తము గానరాలేదు" అనిరి. అది విని యతఁడు "అయ్యో నాగతి! నన్ను శూద్రులలోఁ గలుప కుఁడు నన్ను రక్షింపుఁడు భూదేవులారా!" యని రెండుచేతులెత్తి యావురు మని యేడ్చెను :—

శ్లో* ఆర్యోస్మిశుద్ధచరితోస్మికులోద్గతోస్మి । శబ్దేచ హేతుసమయేచకృతశ్రమోస్మి । రాజ్ఞోస్మిశాసనకరోనపృథగ్జనోస్మి । త్రాయధ్వమార్తమగతింశరణాగతోస్మి'

* ఆర్యుఁడను, శుద్ధచరితుఁడను, సత్కులసంజాతుఁడను, తర్కవ్యాకరణము లందు పరిశ్రమించినవాఁడను రాజుగారి శాసనకరుఁడను వేఱువాఁడను గాను ఆర్తుఁడను అగతికుఁడను శరణాగతుఁడను రక్షింపుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అప్పుడు బ్రాహ్మణసభలోఁ గొందఱు వీఁడు పశు వనిరి. కొందఱు వెఱ్ఱివాఁ డనిరి. కొందఱూరక చూచిరి. కొందఱు కామపిశాచ మనిరి. కొందఱు వేశ్య చెడ్డపని చేసిన దనిరి —

శ్లో. కైశ్చిద్ఘోరయమిత్యరత్నిచపలైరన్యోన్యమాఘాటితం । స్యాదున్మ
త్తఇతిస్థితంస్మితముఖైఃకైశ్చిచ్చిరంవీక్షితమ్ । కైశ్చితామ్యకపిశాచ
ఇత్యపితృణందత్వాంతరేధికృతం । కైశ్చిద్దుష్కృతకారిణీతిచవున
స్సైవాంగనాశోచితా ।

వీ రిట్లుండఁగా నాతఁ డేడ్చుచుండెను. అది చూచి యందొక డాచార్యపుత్త్రిడు స్వయము నాచార్యుఁడు సర్వవిద్యావిశారదుఁడు పరిహాస ప్రకృతియునగు భవస్వామి యనుబ్రాహ్మణుఁడు చేయెత్తి నవ్వుచుఁ బరిషదనుజ్ఞాతుఁడై యిట్లు చెప్పెను. ''అయ్యా! విష్ణునాగయ్యా! భయపడకు ఏడవకు చాలు నిఁక చాలును ధర్మవచన మున్నది. "ఆమ్నాయములకు నవిరుద్ధము లయిన జాతికుల తీర్థసమయధర్మములు ప్రమాణము" అని. కాఁబట్టె విటసభ కూర్పించి యక్కడ బ్రాయశ్చిత్తము తెలిసికొనుము. దీనికిఁ బ్రాయశ్చిత్తము వారు విధింపఁగలరు. ని న్నీకిల్బిషమునుండి వారు తప్పింపఁగలరు అనెను. సభ్యులు సరి సరి యని సాధువాదము చేసిరి. విష్ణునాగు డనుఁగృహీతుఁడ నని యక్కడనుండి వెడలెను. అక్కడనున్న విటుఁడు విటసభకుఁ బోవలసినవాఁడే. అతఁ డక్కడనుండి బయల్వెడలి మధ్యేమార్గ మనేక విట పురుషలను హెచ్చరించుచుఁ బోవును. అతఁ డొకని నీవుకూడ విటసభకు రమ్మని పిలువఁగా నాతఁడు సభవారు నన్నుఁగూడ విటునిగా ననుగ్రహింతురా యనఁగా సందేహ మేమి యని యీతఁ డిట్లు పల్కెను.

"శ్లో* దివసమఖిలంకృత్వావాదంనహవ్యవహారిభి । ర్దివనవిగమేభుక్త్వా
భోజంసుహృద్భవనేక్వచిత్ । నిశిచరమసేవేశస్త్రీభిఃక్షిపస్యపిచాయు
షం । జలమపిచతేనాస్త్యావాసేతథాపిచకత్థ్వనే ।

మఱియు విట లక్షణము లివి చెప్పినాఁడు :—

* పగలెల్ల జూజగాండ్రతో తగవులాడి, ప్రొద్దుగ్రుంకగానే యెక్కడనేని స్నేహితునియింట సుఖభోజనముచేసి, రాత్రి యంతయు వేశ్య స్త్రీ వినోదములతో వెళ్ళించుచు జీవితము పుచ్చుచుందువు. నీయింట ద్రవ్యయిమనసులేదు. అయినను ఆర్భాటములు చేయుచుందువు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్లో. ‡ 'స్వైఃప్రాణై రపివిద్విషఃప్రణయినామాపత్సుయోరక్షితా ।
యస్యార్తౌభవతిస్వఏవశరణ ఖడ్గద్వితీయోభుజః । సంఘర్షాన్మదనా
తురోమృగయతేయంవారముఖ్యోజనః । సజ్ఞేయోవిటఇత్యపావృ
తధనోయోనిత్యమేవార్థిషు.

విటసభ కీక్రిందివారికి బిలుపు పంపినాఁడు :—

"తత్రభవాన్ కామచారోభానుః లోమశోగుప్తః అమాత్యోవిష్ణుదాసః శైబ్యఆర్యరక్షితో దాశేరకోరుద్రవర్మా ఆవంతికస్స్కందస్వామీ హరిశ్చంద్రో భిషక్ ఆభీరకఃకుమారో మయూరదత్తో మార్దంగికః స్థాణుర్గాంధర్వ సేనక ఉపాయనిరింతకథః పార్వతీయః ప్రథమోపరాంతాధిపతిరింద్రవర్మా ఆనంద పురతఃకుమారోమఖవర్మా, సౌరాష్ట్రికో జయనందకో మౌద్గల్యకో దయిత విష్ణు రిత్యేవమాదయో యథాసంభవం సన్నిపాత్యాః"

సార్వభౌమనరేంద్రపాలితమై సార్వభౌమపుర మని పేరుగల యా నగరమురాజవీధి కావిటుఁడు చేరెను. పురమువర్ణనము విపణివర్ణనము మొదలగునవి కలవు. అక్కలవాడ కరిగెను. అనేకవిధములగు శృంగార కథల నభివర్ణించెను. కడకు విటసభకుఁ జేరెను. సభికుల నందఱను జేరెన్ఁ విష్ణునాగుని విజ్ఞాపనమును దెలిపెను. సభలో నధర్మము పలికినవారికి బెట్టినయొ ట్లీవిధమున నున్నవి :—

శ్లో.* పరిచరతుగురూనపైతుగోష్ఠ్యా । భవతుచవృద్ధసమోయువావినీతః ।
పలితమభినమీక్ష్యయాతుశాంతిం । యఇదమయుక్తముదాహరే
న్నిషణ్ణః॥

‡ తన ప్రాణములనయినను ఇచ్చి మిత్రులను ఆపత్తులనుండి రక్షింపవలెను. తనకు చిక్కు వచ్చినప్పుడు ఖడ్గద్వితీయమయినభుజమే శరణముగా నుండ వలెను. తన్ను వారముఖ్యలు వెదకులాడవలెను. ధన మంతయు గోల్పోయి నిత్యము అర్థిజనులలో నుండవలెను. ఇట్టివాఁడు విటుఁడు.

* ఈ సభలోఁ గూర్చుండి యిది యయుక్తమని యాడినవాఁడు తల్లిదండ్రులకు శుశ్రూష చేయవలసినది. గోష్ఠినుండి తొలఁగి పోవలసినది. పడుచువాఁడయి నను వినీతుఁడై వృద్ధసముడుగా నుండవలసినది. ఫలితమును జూచి ప్రశాం తుఁడు గావలసినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒకరొకరుగాఁ బ్రాయశ్చిత్తములఁ జెప్పిరి. ఒకఁడిట్లనెను. 'ప్రణయ మెఱుఁగక ప్రవర్తించినందుకు బాతకము మదనసేనదికాని నీదికాదు. వినుము :—

శ్లో. ‡ అశోకంస్పర్శేనద్రుమమసమయేపుష్పయతియః । స్వయంయస్మి న్కామోవితతశరచాపోనివసతి । సపాదోవిన్యస్తఃపశుశిరసిమోహా దివమయా । నను ప్రాయశ్చిత్తంచరతుసుచిరంసైవచపలా ॥

మఱొకఁడిట్లు చెప్పెను :—

శ్లో. ‡ బధ్యతాంమేఖలాదామ్నా సమాకృష్యకచగ్రహైః అథతస్యాఃప్ర సుప్తాయాఃపాదౌసంవాహయత్వయమ్ ॥ వేఱొకఁడు :—

శ్లో. * పాదప్రక్షాళనేనాస్యాఃశిరఃప్రక్షాళ్యతామితి॥

అది తగదని యింకొకఁడు :—

పాదప్రక్షాళనంతస్యాఃపాతుమస్యేషనార్హతిః

ఇట్టివి కొన్ని విని కవియగుదాశేరకుఁడు రుద్రవర్మ యిట్లనెను :—

శ్లో. ‡ విద్వానయంమహతికోకికులేప్రమాతో । మంత్రాధికారసచివో నృపసత్తమస్య । వేశ్యాంగనాచరణపాతరజోవధూతాన్ । కేశా న్నధారయితుమర్హతిముండ్యతాంసః ।

ఆ బ్రాహ్మణుఁడు విష్ణునాగుఁడు వెండ్రుకలేమి శిరస్సేయిత్తునా? యనెను. ఒకఁడు వారించి యిట్లనెను :—

• అశోకవృక్షమును అకాలమునఁగూడాఁ బుష్పింపజేయునది. మన్మధుఁడు శర చాపసన్నద్ధుఁడై కాపుంచయుండునది, అగుపాదము పశుశిరస్సుమీఁద అనివేక ముచే నాయువిద యుంచినది - కాఁబట్టి పెద్దకాలము తానే యాయువిద ప్రాయ శ్చిత్త మనుభవింపవలెను.

• పిగ బట్టుకొని యొడ్డాణపు గొలుసుచే నీతని బంధింపవలసినది. పిదప నిద్రించు చున్న యాయువిదపాదముల నీతఁడు పట్టవలసినది.

* ఆయావిద పాదప్రక్షళనోదకముచే నీతని శిరఃక్షాళనము చేయవలసినది. ఆ వ నితపాద ప్రక్షళనోకదము నీతడు పానము చేయుటకుఁ గూడ దగఁడు.

‡ ఈతఁడు విద్వాంసుఁడు. గొప్పవంశమున బుట్టినవాఁడు. రాజుగారి మంత్రాధికారి ఇట్టివాడు వేశ్యాంగనతన్నుదగిలి దాని పాదధూళి గలిసిన వెండ్రుకలను ధరింపఁదగఁడు. కావ తల గొఱిగింపవలసినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్లో. † స్ఖలితవలయశబ్దైరంచితభ్రూలతానాం । స్ఖలితనఖమయూఖైరంశీగుయప్రభాభిః । కేవలయసుకుమారైః పాణిభిస్సుందరీణాం । సుచిరమనభిమృష్టా-ధారయత్వేష కేశాః ।

కడకీక్రిందిది ప్రాయశ్చిత్తముగా నందఱచే నంగీకరింపఁ బడెను.

శ్లో. † తస్యామదాలసవిఘూర్ణితలోచనాయాః । శ్రోణ్యర్పితైకకరసంహతమేఖలాయాః । సాలక్తకేనచరణేంసనూపురేణ । పశ్యత్వయం శిరసి మామనుగృహ్యమాణమ్ ।

అని సభాపతియగు భట్టిజీమూతుఁడు తానావేశ్యచేఁ దలపైఁ దన్నించుకొనుటను చూచుటే విష్ణునాగునకుఁ బ్రాయశ్చిత్తమని చెప్పెను. కథ ముగిసినది.

గ్రంథకర్త శ్యామిలకుఁడు (శ్యామల శ్యామలక శ్యామిలక పదము లొకని పేళ్లే) విశ్వేశ్వరదత్తుని పుత్త్రుఁడు నుదీచ్యుఁడు నఁట! గ్రంథమున వర్ణింపఁబడిన విషయములఁబట్టి చూఁడగా నీతఁడు పశ్చిమసముద్రతీరవాసిగాఁ దోఁచుచున్నాఁడు వరరుచి శృంగారకావ్యము నీతఁడు పేర్కొన్నాఁడు. దత్తకుని వైశిక సూత్రమునుదాహరించినాఁడు. ఆయుర్వేదమం దీతనికిఁ బరిచయమున్నది శ్లోక రచనకంటే వచనరచన రంజకముగా నున్నది. అకాలము దేశాచారవ్యవహారము లనేకము లీగ్రంథమునఁ దెలియ వచ్చుచున్నవి తక్కిన భాణములఁ గూర్చి కూడఁ గొంత ప్రశంసించిసపిదప మొత్తముమీఁద నప్పటి సాంఘిక స్థితి నీగ్రంథములెట్లు తెలుపుచున్నవో వ్రాయుదును.

[సరస్వతి (ముక్త్యాల)
మార్చి, ఏప్రిల్ (1-1; 1-2)
1923]

† కంకణములు గలుగలురనఁగా, గోళ్ళకాంతులు నుంగరములకాంతులు గలసి తొట్రుపడుచుండగాఁ గిసలయసుకుమారము లయినహస్తలముచేఁ జిగురుబోండ్ల చేయు సంస్కారములకు దూరమయి చీకాకయిన వెంట్రుకల నీతఁడు చిరకాలము ధరింపవలసినదే.

† మదాలసవిఘూర్ణితములయిన కన్నులుగలదై యొకచేయి యొడ్డాణమునఁదుమునఁ బెట్టుకొని యాసుందరి లాక్షరంజితమయిన చరణముచే నాతలపైఁ దన్ని నన్ను గ్రహించును. అది యీతఁడు చూడవలసినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భాగవతము

అష్టాదశపురాణములలో భాగవత మొకటిగాఁ బేర్కొనఁబడినది. విష్ణుభాగవత మష్టాదశపురాణములలోనిది గాదనియు బోపదేవుఁడు దానిని గల్పించె ననియుఁ గొంద అందురు. పదుమూఁడవశతాబ్దిలోఁ బ్రఖ్యాతాంధ్రకవీశ్వరుఁడుగా నుండిన పాల్కురికిసోమనాథుఁడు విష్ణుభాగవతము కల్పిత మన్నాఁడు. ఎవ్వరేమన్నను విషుభాగవతము మిక్కిలి ప్రఖ్యాతిని గడించినది. అష్టా దశపురాణములలోను దాని కున్నంతగౌరవము మఱియే పురాణమునకును లేదు. సంస్కృతమున దాదాపుగా నలువదివ్యాఖ్యానములు దానికున్నవి. సర్వభాషలలోను నది పరివర్తితమయినది. తెలుఁగుపరివర్తనములఁగూర్చినే నిక్కడఁ గొంత పేర్కొందును.

పోతన–సింగన

పదునైదవశతాబ్దిపూర్వార్ధమున భాగవతము నిర్వురు కవీశ్వరులు తెలిఁగించిరి. అందొకఁడు బమ్మెర పోతరాజుగారు. ఈయన కృతి జగత్ప్రసిద్ధమేకదా! రెండవవాఁడు మడికి సింగనార్యుఁడు. ఈతఁడు దశమస్కంధము మాత్రమే ద్విపదకృతిగాఁ దెనిఁగించినాఁడు. అది తంజావూరుపుస్తకశాలలో నున్నది. అది యింకను నాంధ్రలోకమునఁ బ్రకటితము గాకుండుట శోచనీయము.

పోతరాజుగారిభాగవతము సమగ్రముగా లభించినట్లీనడుమ నొక ప్రవాదము పుట్టినది. ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తక భాండాగారమున కది చేరినదఁట! కాని యాపుస్తకభాండాగారమున నది కానరాదు. అట్టిది దొరకియుండ దనుకొనెదను. ఏల యనఁగా పోతరాజుగారికిఁ దర్వాత నించుమించుగా నలువదియేఁబది యేండ్లకె యాయన గ్రంథమందలి లుప్తభాగములు నితరులు పూరించిరి. పోతరాజుగారికిఁ దర్వాత నలువదియేఁబది యేండ్లకే లభింపనియాభాగము లిప్పుడు లభించిన వనుటను బ్రత్యక్షముగా నాగ్రంథమును జూచినప్పుడు కాని విశ్వసింపరాదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోతరాజుగా రేకశిలానగర (ఓరుఁగల్లు) వాస్తవ్యులు. ఆకాలమున నానగరము విప్లవములపాలయి యుండెను విద్యావినోదముల కప్పుడక్కడ వెరవులేదు. ఈ కారణమునఁ గొన్నాళ్ళదాఁక నాగ్రంథము నెవరుఁ దాఁకర యిరి. పరిశీలనము లేకపోవుటచేఁ గాఁబోలునది కొంతశిథిల మయినది. రాజున కంకిత మిచ్చినచో నాతఁడు పదిప్రతులు వ్రాయించి పదువురచేఁ జదివించి వ్యాప్తికిఁ దెచ్చియుండెడివాఁడు. పోతరాజుగా రట్టు చేయరైరి సరిగదా మఱియు నట్టివారిని దిట్టిరి. సర్వజ్ఞసింగభూపతి కుపితుఁడై యాగ్రంథమును బూడ్పించినాఁడని కూడఁ బ్రతీతికలదు. కాని దాన్ని మనము విశ్వసింపరాదు. ఆయన దాని వ్యాప్తికిఁ దోడు పడకుండవచ్చును. పోతరాజుగారు క్రీ॥ 1420 ప్రాంతములందుండిరి. క్రీ॥ 1490 ప్రాంతములందుఁ గల హరిభట్టు పోతరాజుగారిభాగవతమున లోపించిన భాగములను (షష్ఠ స్కంధము ఏకాదశద్వాదశస్కంధములు) పూరించినాఁడు. పోతరాజుగారి గ్రంథము సమగ్రముగా నాకాలమున లభించుచుండినచో నాతఁ డాస్కంధములఁ బూరింపఁ బూనఁడు. హరిభట్టుకాలమిప్పుడు మనకుఁ దెలిసినది గానయిట్లు చెప్పఁగలిగితిమి. వెలిగందలనారయ, ఏర్చూరిసింగన మొదలగు వారికాలములు మన కెఱుఁగ రాలేదు. వారు హరిభట్టుకంటెఁ గూడఁ బూర్వులుగా నుండవచ్చునేమో ! అప్పుడే లభింపని పోతరాజుగారి రచన మిప్పుడు లభించెననుట విశ్వాస్యముగా నాకుఁ దోఁపదు అయిననుదొరకిన పుస్తక మేదో నలుగురకన్నులకుఁ గానవచ్చు నేని యెట్లేని నిర్ణయ మేర్పడును. అదియుఁ గానరాకున్నది. వ్రాఁతప్రతులలో సామాన్యముగా నన్ని రచనములకుఁ గూడఁ బోతరాజుగారి పేరే కానవచ్చును. అది భ్రాంతి జనకమైయుండవచ్చును.

లుప్తభాగములు బూరించినవారు.

హరిభట్టు

పోతరాజుగారు భాగవతము నద్వైతసిద్ధాంతానుగుణ ముగా శ్రీధర వ్యాఖ్యననుసరించి రచించిరి. హరిభట్టువిశిష్టాద్వైత సిద్ధాంతానుగుణముగా షష్ఠైకాదశద్వాదశస్కంధములఁ బూరించెను. హరిభట్టురచన మంత హృద్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మయినదిగాఁ దోఁపదు. తెలుఁగుభాగవతము వ్రాఁతప్రతులు పెక్కులు ఏర్చూరిసింగన షష్ఠస్కంధముతోను వెలిగందలనారయయేకాదశద్వాదశ స్కంధములతోను నుండును. కాని యక్కడక్కడఁ గొన్నిప్రతులలో హరి భట్టురచనములు కూడ గలసియున్నవి. అమృతప్రవాహము వంటి పోతరాజు గారిరచనము నశించుటచేతఁ దత్తుల్యముగా లుప్త భాగములను బూరింపఁ గోరి హరిభట్టువలెనే మఱికొందఱుకూడ రచనముల నెఱపిరి. కాని యెవ్వరి కిని దత్తుల్యరచనము పొసఁగలేదు. అట్టిభాగ్యము భారతకవులకే లభించినది. రామాయణమునఁ గూడ నొక్కయయ్యలార్యరచనము మాత్రమే భాస్కర రచనముతో సరితూఁగఁ గల్గినది కాని తక్కినవి కొఱవడినవే.

ఏర్చూరి సింగన

భాగవతపూరణములలో నేర్చూరిసింగన షష్ఠస్కంధరచనము ప్రశస్త మయినది. అది కొంతవఱకుఁ బోతరాజుగారిరచనమును బోలుచున్నది. హరిభట్టుషష్ఠస్కంధరచనముకంటె నిది యెంతేని మేలితరముగా నున్నది. సింగనకాల మెఱుఁగరాదు. అతఁడుకూడఁ గృష్ణరాయలకుఁ బూర్వుఁడే కావ చ్చును. కువలయాశ్వచరిత్రమను గ్రథమునుగూడ నాతఁడు రచించెను. అది దొరకలేదు.

నర్వన

ఈతఁడుకూడ షష్ఠస్కంధమును రచించె నఁట! ఈతని గ్రంథము దొరకలేదు. ఈతఁ డెప్పటివాఁడో యెఱుఁగరాదు. ప్రబంధరత్నావళిలో నీతనిగ్రంథమునుండి పద్యము లుద్ధరింపఁబడినవి.

రాచమల్లువారు

ఇద్దఱో ముగ్గురో వీరిపేళ్ళేమో యెఱుఁగరాదు. వీరు గూడ షష్ఠ స్కంధమును దెనిఁగించిరి. లక్షణగ్రంథములందు వీరి గ్రంథమునుండి యుద్ధరింపఁబడినపద్యములు పెక్కులు గాన వచ్చును. శృంగారషష్ఠమని వీరిగ్రంథమునకుఁ బేరు. షష్ఠస్కంధము నిందఱు పూరించుటకుఁ గలవిశేష మేమో!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెలిగందల నారయ

ఏకాదశద్వాదశస్కంధములు వెలిగందలనారయ రచితములు ఇప్పుడు ముద్రిత మయియే యున్నవిగదా! ప్రాఁతవ్రాఁత ప్రతులలోఁ, బెక్కింట 11, 12 స్కంధములు పోతిరాజుగద్యముతోనే కానవచ్చుచున్నవి. ప్రతివిలేఖకుల ప్రమాదము కావచ్చును. ఏల యనఁగా నారెండుస్కంధములును మిక్కిలి సంగ్రహమై ఏరసరచనము గలిగియున్నవి. అది పోతరాజుగారి రచనము కానేరదు. కాని యొకవిశేషమున్నది. పోతరాజుగారియితరస్కంధములందలి పద్యము లిందుఁ గొన్ని కలవు. హరిభట్టురచనమున నారయ రచనమును గొన్ని పద్యభాగములందును వచనభాగములందును నైక్యమందుచున్నవి. పోతరాజుగారి రచనము శిథిలమై యందదుకులుగాఁ, గొన్నికొన్ని పద్యభాగములు వచనభాగములు గలిగియుండఁగా హరిభట్టును నారయయును వేర్వేఱుగా నాతనుకల నదికించి పూరించి యుందురేమో! ఇట్లగునేని వారిర్వురు రచనములలోఁ గొంతయైక్య ముండుటకుఁ గారణము గుదురును.

సంజీవరాయకవి

ఈతఁడు నందవరవంశ్యుఁడు. ఎప్పటివాఁడో యెఱుఁగరాదు. ఏకాదశద్వాదశస్కంధముల నీతఁడుగూడఁ దెలిఁగించెను ఈతని రచనము ప్రశస్తమైనది. హరిభట్టు నారయరచనములకంటె మేలయినది. కాని సమగ్రముగా లభింపలేదు.

గంగన

పంచమస్కంధము నీతఁ డొక్కఁడే తెలిఁగించినాఁడు ఇది యిప్పుడు భాగవతములో ముద్రితమయియే యున్నది. ఈతనిరచనము నీరస మయినది.

ఇతర రచనములు

ఇంతవఱకుఁ బోతరాజుగారి భాగవతమునలుప్తభాగముల బూరించినవారిఁ గూర్చి పేర్కొంటిని, ఇఁక స్వతంత్రముగా భాగవతమును మరల రచించినవారిఁ బేర్కొందును. ద్వైతవిశిష్టాద్వైతమతముల మూలమునను జైతన్యమతము మూలముననను భాగవతపురాణమునకు గౌరవము మఱి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మఱి హెచ్చుఁజొచ్చెను. పోతరాజుగారి భాగవతము బహుప్రచారము గలది యది యద్వైతసిద్ధాంత ప్రతిపాదక మగుటఁ గొందఱ కతృప్తిని గొల్పి యుండవచ్చును. ఈ కారణమునఁ గూడ మఱికొందఱు పరల భాగవతమును దెలిఁగించి యుందురు.

కోనేరునాథుఁడు

ఈతఁడు కృష్ణరాయలయవసానకాలమందుఁ గలఁడు. బాలభాగవత మను పేరఁ బద్యరూపముగాను ద్విపదరూపముగాను నీతఁడు రెండుగ్రంథ ముల రచియించినాఁడు. ఈతని రచనము రసోత్తర మయినది. విశిష్టాద్వై తసిద్ధాంతానుగుణముగా నీతఁడు గ్రంథము రచించెను గాని యనేకస్థలము లందుఁ బోతరాజుగారిరచనమును బుడికిపుచ్చుకొన్నాఁడు. ఈతని పద్యగ్రంథ మింతవఱకు ముద్రితము గాకుండుట శోచనీయము. ఈతనిద్విపదరచనము కొంత యిటీవల ముద్రితమయినది. కాని యది కూడ సమగ్రముగాఁ బ్రకటి తము కావలెను.

తేకుమళ్ల రంగశాయికవి

ఈతఁడుకూడ భాగవతమును ద్విపదరూపమునఁ దెనిఁగించినాఁడు. కోనేరునాథునిద్విపద సంగ్రహముగా నున్నది గాని యీతని ద్విపద విస్తృత ముగా నున్నది. పుష్పగిరితిమ్మకవి సాహాయ్యమునఁ దా నాగ్రంథము రచించి నట్టు కవి చెప్పుకొన్నాఁడు. వాణీవిలాసవనమాలికాది బహుగ్రంథముల నీతఁడు రచించినాఁడు.

పుష్పగిరితిమ్మకవి

ఈతఁడు ద్విపదభాగవత రచనమున రంగశాయికవికిఁ దోడుపడుటే కాక తెనుగున వచనభాగవతమును గూడ రచించినాఁడు. అది తేటగానున్నది. దానిఁ జూచి తదనుసారముగా నరవమున నొకకవి వచనభాగవతమును రచించినాఁడు.

21)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తరిగొండవెంకమాంబ

ఈమెకూడ భాగవతమును ద్విపదరూపమున రచించెను. ఈమె గ్రంథము ఓరియంటల్ లైబ్రరిలో నున్నది. వేఱొకప్రతి క్రొత్తగా చిత్రాడలో నాంధ్రపరిశోధకమండలివారికి దొరికినది. అది యింతవఱకుఁబ్రఖ్యాతమయినది గాదు. మహనీయురాలగు స్త్రీ రచించిన దగుటచేతను సుకుమారకవిత యగుటచేతను నిది ప్రకటింపఁదగినది.

యక్షగానములు

ఇప్పుడు పేర్కొనఁబడిన రచనములు గాక యక్షగానరూపముగా నున్న భాగవతరచనము లనేకము లున్నవి. అందుఁగొన్ని రసోత్తరము లయినవి. సిద్ధేంద్రుఁడనుయోగి రచించినగ్రంథము వానిలోఁ బ్రఖ్యాతము. కూచిపూఁడి (కృష్ణామండలము) బ్రాహ్మణులు పారంపర్యముగా నాయతీంద్రుని కృతిని బ్రదర్శింతురు. ఇంక నెందఱో రచించినయక్షగానకృతులు నున్నవి. అన్నింటిలోను నసామాన్యముగాఁ బేర్కొనఁదగిన దింకొకటి కలదు. సంస్కృతమునఁ గృష్ణలీలాతరంగిణి యనుపేర భాగవతదశమస్కంధమును గేయరూపమున రచించినమహనీయులు నారాయణతీర్థులవారు తెలుఁగున రచించిన పారిజాతకథ. ఇది భాగవతమందలి పారిజాతాపహరణ కథమాత్రమే.

మీఁదఁ బేర్కొనబడిన కవీశ్వరుల రచనములలోనఁ బ్రఖ్యాతములయినవానినుండి మచ్చుతునుకలఁ జూపుదును.

భాగవతము

హరిభట్టు—షష్ఠస్కంధము

గీ. శ్రీసమేత! మిమ్ము సేవింప నొల్లక
మీఱి శుభము లొందఁ గోరువాఁడు
చెంగలించి శునకలాంగూలముఖమున
నదిని దాఁటఁ గోరునట్టివాఁడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చ॥ అరయఁగఁ బద్మసంభవుఁడు నాత్మనివాససరోజకర్ణికాం
తరమున నుండి తీవ్రపవనప్రహితాధిక వీచిమాలికా
పరిమిత ఘోషభీషితవిభావ్యమహార్ణవమందు మగ్నుఁడై
పరువడితో మిముం దలఁచి పారము నొందఁడె భక్తవత్సలా!

శా॥ ఓ రాజీవదళాభిరామనయనా ! యోసత్యసన్మంగళా!
యోరాంతించరకంఠనాళదళనా! యోసర్వలోకాధిపా!
యోరత్నాకరమేఖలాపరివృఢా! యోభక్తకల్పద్రుమా!
యోరాకాహరిణేందురమ్యవదనా ! యోపద్మనాభాచ్యుతా!

శా॥ శ్రీవత్సాంకితమూర్తయే విమలరాజీవాక్షయుగ్మాయ ల
క్ష్మీవక్త్రాంబుజషట్పదాయ వసుధామిత్రాయ సర్వాత్మనే
భావజ్ఞాయ కృపాకరాయ హరయే భక్తార్థసంధాయినే
గోవిందాయ సమస్తదైత్యనివహక్రూరాయ తుభ్యం నమః.

శా॥ ప్రస్కన్నామరరాక్షసుల.... భూభారావహర్తన్ మహే
శస్కందాదినుతప్రభావుఁ గమలాసంవాసరాజన్మహో
రస్కున్ విష్ణుఁ దలంచి భాగవతపౌరాణీయ మైనట్టి ష
ష్ఠస్కంధంబుఁ దెనుఁగుఁ జేసెదను గృష్ణప్రీతిగా వేడుకన్

సంజీవరాయకవి–ఏకాదశస్కంధము.

క॥ ఒకనాఁడచ్చోటికిఁ గొం
కక కృష్ణకుమారు లేఁగి గర్వితులై కృ
ష్ణకుమారుఁ డైనసాంబుని
సెగనక్కెము మీఱఁ జేసి రింతిగ నధిపా.

వ॥ ఇట్లతనియుదరంబు వస్త్రగ్రంథి నున్నతంబై యుండునట్లుగా నంగనా వేషధారిఁ గావించి మునులకడకుం దోడ్కొని చని ప్రణతులై యిట్లనిరి.

తరల॥ పరమ సంయములార యిచ్చెలి బాల గర్భిణి దీనియం
దరయఁ బుట్టెడుపట్టి సూనుఁడొ యాడుబిడ్డయొ సిబ్బితిం
బెరసి మి మ్మడుగంగ జాలఁడు పేర్మిఁ జెప్పఁగ నొప్పు నీ
తరుణి మెచ్చఁగ మీకు హస్తగతంబు కాదె యశేషమున్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మ॥ అనుడుం జుట్టని చిచ్చుఁ ద్రొక్కిన విధంబై యాత్మఁ గ్రోధంబు పె
ల్లునఁ గన్నుల్ దొగరూన వీరి పెనుత్రుళ్లన్ బాపకున్న న్మహా
జనులం గేరెద రంచు నెంచి యదువంశం బెల్లఁ బోకార్పఁగా
ఘనమై పుట్టెడు నిన్పరోఁకలి వధూగర్భంబునం బొండనన్

గీ॥ యదుకుమారులు భయమున నవయవములు
వడవడ వడంక సాంబగర్భభవమునల
మపుడ కన్గొని యద్భుత మంది యెద్ది
గతియయో యని వగచిరి కౌరవేంద్ర.

వ॥ మఱియు.

చ॥ కటకట మందభాగ్యులము కాలగతిం గడవంగవచ్చునే
యిటు చనుదెంచి సాధుజనహేళన మే మొనరించుటంగదా
పటుతర మైనశాపమున భంగము వచ్చెఁ గులంబు కెల్ల నా
రట మెద సంభవిల్లె మనరా జిఁక నే మనువాఁడొ దీనికిన్.

ఉ॥ ఆఁకటి కోర్చి దప్పికి భయంపడ కార్తిని శీతికాదులన్
గైకొన కింద్రియంబుల నఖండధృతిం గుదియించియుం దుదిం
జీకులువోలెఁ గ్రోధమునఁ జేసియె గోష్పదమగ్నులై కటా
వ్యాకులతన్ వహింతురుగదా! భువిఁ గొందఱు నిష్ఠ డిందఁగన్.

చ॥ తరుగుమదంబున న్నిజపదంబులకుం బ్రణమిల్లుదేవులం
జిఱునగ వొప్పఁ జూచి మునిశేఖరుఁ డిట్లను వీరిలోపలం
దెఱవ నొకర్తుఁ గైకొనుఁడు దివ్యసభాభరణంబు గాఁగ న
క్కఱ గలదేని భీతిపడఁగా దగ దాత్మల మీ కొకింతయున్.

చ॥ వినుము విగాఢతర్షత వివేకము మాని సుఖం బటంచు గొ
బ్బునఁ బశుహింస సేయుదురు భూమి దయారహితాత్ములై కటా
వెనుకను బంచతం బెరసి వేదన బొందుదురయ్య మున్ను జ
చ్చినపశుసంఘముల్ దము గ్రసింపఁగ దెక్కఱి ఘోరభంగులన్.

చ॥ ప్రియతమవస్తు వెద్దియుఁ బరిగ్రహయోగ్యము గాదు దానఁ గ
స్తియ సమకూడు సౌఖ్యముల దెచ్చు నకించనభావ మెప్పుడున్
రయమున మింట నొక్కకురరం బెఱచిం గొనిపోవు చన్యముల్
పయిఁబడ దానిఁ బోవిడిచి పార్థివముఖ్య వహించె నిర్వృతిన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మ॥ సరసావార్యవగాహశీతలములై సంఫుల్లమానచ్ఛటాం
తరరేణూత్కరపశ్యతోహరములై నానాలతాలాసికా
చరణన్యాసవిధానదేశికములై సంచారమున్ సల్పె మం
థరవాతంబులు సంయమీంద్ర తనువై దాఘాంబువుల్ డిందఁగన్.

కోనేరునాథుఁడు-బాలభాగవతము

ఉ॥ విశ్వముఁ గల్గజేసియును విశ్వములోనన యుండియున్ గృపా
శాశ్వతలీల విశ్వ మనిశంబును బ్రోచియు నొక్కవేళ న
వ్విశ్వము లీలకై పరిభవించియుఁ దా వెలుగొందు నెవ్వఁ డా
విశ్వము దాన యైనకృతి వేడుక నిప్పుడు నన్నుఁ గాచుతన్.

మ॥ బిసినీపత్రములందుఁ గానఁబడునబ్బిందుచ్ఛటల్ సాటిగా
ననుపుల్ సంచలనంబు నొందెడి సమోహం బయ్యెడిన్ మేను స
వ్యసనం బయ్యెడు నింద్రియవ్రజము దిక్కైక్క, బ్రోవ నన్యుండు లేఁ
డసమానప్రతిభావ నాదఋనకుయ్యాలింపు వేగంబునన్.

మ॥ అమితబ్రహ్మరహస్యమార్గగమనాయాసక్తిమచ్చేతసే
విమలాచారజుషే పదత్రయమితోర్వీం విష్ణురూపాయ తు
భ్యం మహం సంప్రదదే నమో నమమ నిత్యప్రీతిర స్త్తంచు ని
స్త్తముడై గ్రక్కున ధారవోసె బలి యుత్సాహంబు సంధిల్లఁగన్.

మ॥ మమతాహంకృతు లుజ్జగించి మదిఁ గామశ్రేణినిశ్రేణికా
క్రమణభ్రాంతిఁ బరిత్యజించి శమసామ్రాజ్యస్థుఁడై యిందిరా
రమణున్ విష్ణు నశేష శేషిఁ గరుణారాశిందదీయైక శే
షమతిన్ మర్త్యుఁడు గొల్పు టెంతయునభీష్టం బార్యనా కెప్పుడున్.

శా॥ లోకప్రస్తుతశాస్త్రజాలముల నాలోకించియున్ లీప్సచేఁ
బెకొన్నట్టివిచారమార్గమున నొప్పం జూడఁగా నిశ్చితం
బేకం బయ్యె బహుప్రకారముల లక్ష్మీశుండు నారాయణుం
డేకాలంబున నెల్లవారల కనుధ్యేయుండు సంసేవ్యుఁడున్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ॥ ఎడ్డెకుఁ జేయుసత్కృతము వెంగలి కిచ్చినయట్టికన్నియల్ (?)
గ్రుడ్డికిఁ జూపునద్దములు కుత్సితవృత్తికిఁ జేయుదానముల్
గొడ్డగునట్టిమాని కొనగూర్చినప్రోదులు చక్రహస్తుపై
నొడ్డినభక్తి లేనిగతయుక్తికిఁ జెప్పినశాస్త్రజాలముల్.

రాచమల్లువారి శృంగారషష్ఠము.

మ॥ అని యీవిద్య గురుప్రసన్నుఁడు దృఢస్వాంతుండు నౌచిత్రకే
తునృపాలాగ్రణి కిచ్చి నారదమునీంద్రుం డంగిరోయుక్తుఁడై
చనియెన్ బంకజగర్భగేహమున కాసర్వంసహాభర్త దా
ని నుపాసించి భజించె నేడహములన్ విద్యాధరాధ్యక్షతన్.

క॥ అనుటయుఁ గృష్ణద్వైపా
యనతనయుం డిట్టు లనియె నవహితమతివై
విను మతిగుహ్యము నారా
యణకవచము భక్తవాంఛితార్థప్రదమున్.

గీ॥ తత్తరమున నాపోశన మెత్తఁబోయి
భూసురుం డెత్తు నుత్తరాపోశనంబు

సీ.గీతి॥ వలవదు భయంబు వా రెంతవార లైన
నట్టివారలు మన కగ్గ మైనవారు
వారు నిరయంబునకుఁ గాపు వచ్చువార
లనుచు బుద్ధిగఁ జెప్పె మార్తాండసుతుఁడు.

గీ॥ తల్లియును దండ్రి దైవంబు తలఁప గురుఁడ
కాఁడె యితఁ డేమి చేసినఁ గనలఁ దగునె
నాస్తికాధమ! యోరి! యన్యాయవృత్తి
నాస్తి తత్త్వం గురోః పర మనఁగ వినవె?

చ॥ పెరిగినయీసువ న్నెమలిపింఛములం బురివిప్పఁ దోలునీ
నరసిరుహాక్షి వేనలికి సాటిగ నిల్వఁగ నోడి చొచ్చె నిం
దిర శరణంబు తేఁటగమి నీలము లింద్రునిపేరు గాంచెఁ బె
న్నిరులు గుహాశ్రయంబు గనియెన్ నెఱి గల్గినవారి కోర్తు రే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క॥ నెరసె నెఱసంజ చక్రక
సరసీరుహవిరహవేదసంసూచకమై....

క॥ అరిగి సమిత్ప్రసవకుశాం
కురపక్వఫలోత్కరంబు గొని గృహమునకున్
మరల యిట వచ్చునప్పుడు
ధరణీసురనందనుండు దనకట్టెదుటఁ.

[సరస్వతి (ముక్త్యాల)
2, (1,2,3) 1924
మీగడ తఱకలు 1951]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నారాయణ తీర్థులు

ఈ రూపచిత్రము నారాయణతీర్థులవారిది.* తంజావూరుసంస్థానమున నారాయణతీర్థుల వారికాలముననే వ్రాయించి యుంచఁబడిన రూపచిత్రమును బట్టి తంజావూరుజిల్లా వరాహూరువాస్తవ్యులగు గోపాలభాగవతులనువారిప్పటికి నెనుబదియేండ్లకు ముందు దీనిమూలమును వ్రాయించుకొనిరి. వారు చిత్రప్రతి రూపము వ్రాయించుకొనునాఁటి కించుమించుగాఁ దొంబదియేండ్లకు బూర్వము తంజావూరు రాచనగరిలో నా మాతృక వ్రాయింపఁబడినదట! గోపాలభాగవతుల మనుమలగు లక్ష్మణశాస్త్రులుగారి మూలమున మాకీ చిత్రము లభించినది.

నారాయణతీర్థులవారు

ఆంధ్రులలో, దైవభక్తిగల ప్రాజ్ఞులలో తరంగములను పేరి గేయముల విననివారు, విని యానందింపని వారు, ఉండరు. శ్రీ నారాయణతీర్థులవారి కృష్ణలీలా తరంగిణిలోని తరంగములు నిజముగా నమృతతరంగములే. భక్తిమాధుర్యమునందు తీర్థులవారి తరంగములముందు జయదేవుని యష్టపదులాఁగఁజాల వని నానమ్మకము. నారాయణతీర్థు లాంధ్రులు. కృష్ణాతీరమువారయి యుందురు. ముక్త్యాలసంస్థానమునఁ గృష్ణానదియొడ్డున వెలసియున్న వేదాద్రి నరసింహస్వామిని, చల్లపల్లి సంస్థానమున శ్రీకాకుళమున వెలసియున్న యాంధ్రనాయకస్వామిని, నూజివీటి సంస్థానమున అగిరిపల్లె దగ్గఱ వెలసియున్న (శోభనాద్రి) నృసింహస్వామిని, కృష్ణలీలా తరంగిణిలో తీర్థులవారు నుతించుట యీ యూహకు సాధకము. తీర్థులవారు కడపటి కాలమున దక్షిణదేశమున తంజావూరుజిల్లా వరాహూరిలో వసించిరి. దక్షిణదేశమున నిప్పటికిని వారిశిష్యపరంపర గలదు. ఆపరంపరవా రీ యైతిహ్యమును జెప్పుచున్నారు. తీర్థులవారికి గర్భమున శూలవ్యాధి గలదఁట. దానిచే బాధపడుచు వారు సేతుస్నానార్థము దక్షిణదేశయాత్ర వెడలిరట. ఆయాత్రలో తిరుపతిలో నొకనాఁడు వేంకటేశ్వరస్వామి స్వప్న దర్శనమొసఁగి "దక్షిణదేశమున నీకు నేను వరాహరూపమున దర్శనమిచ్చి యొక

* వరహూరు గోపాలస్వామిగారి, నారాయణతీర్థులవారి చిత్రపటములు జూన్ జూలై భారతి 1925లో ప్రకటింపఁబడినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రామమునకుఁ ద్రోవ చూపుదును. ఆగ్రామము చేరుము. అక్కడ నేనే వెలసియున్నాను. నీవ్యాధి యాపుణ్యక్షేత్రమునఁ దొలఁగి పోఁగలదు." అని చెప్పెనఁట! అది యట్లే జరిగెనఁట! ఆగ్రామమే వరాహూర్. భూపతి రాజపురమని దానిపూర్వనామము. ఆ గ్రామమువారి యభ్యర్థనముచే తీర్థులవారు జీవిత శేషమెల్ల నక్కడనే గడపిరఁట. ఆగ్రామముచేరువనే వారి సమాధి యిప్పటికిని గలదఁట. కృష్ణలీలాతరంగిణిలో వరాహూరు వేంకటేశ్వరస్వామి ప్రస్తుతి కూడఁ గలదు ఆంధ్రదేశమున దేవాలయములలో జరుగువిధమున వరాహూ వేంకటాచలపతిస్వామి దేవాలయమున పవళింపుసేవ మొదలగు నుత్సవముల నీ స్వాములవారు నెలకొల్పిరఁట. అయుత్సవములందుఁ బాడుటకై తెలుఁగు కీర్తనల నెన్నిటినో వారు రచించిరఁట! నేఁటికి నక్కడ నాకీర్తనములఁ బాడుచుందురఁట! తీర్థులవారికి శిష్యులై వారిచేఁదరంగములఁ జెప్పించుకొన్న భాగవతు లెందఱో దక్షిణ దేశమందుండెడివారఁట. వంజు భాగవతులనువారు వారిలో విఖ్యాతులు. వారి ప్రపౌత్త్రులిప్పుడున్నారు. కృష్ణ లలాతరంగిణిగాక సంస్కృతమున హరిభక్తిసుధోదయమని గొప్ప కావ్యమును, బ్రహ్మసూత్రములకు వృత్తిని, యోగసూత్రములకు వృత్తిని నారాయణతీర్థులవారు రచించిరి ఆగ్రంథములు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నున్నవి. మఱియు వారు తెలుఁగున "పారిజాత కథ" అని యొక యక్ష గానమునుగూడ రచించిరి. అది వరాహూరు వాస్తవ్యులయిన లక్ష్మణశాస్త్రిగారి యింట గ్రంథలిపితో దొరకొను. దానిని తెలుఁగు లిపిలో వ్రాయించి భారతీ కార్యాలయమునఁ గూడ నుంచితిమి. వారింక నెన్ని గ్రంథముల రచించిరో యెఱుఁగరాదు. కృష్ణాతీరమున నిప్పుడు తరంగముల నద్భుతముగాఁ బాడువా రనేకులు గలరు. "బాలగోపాల మా ముద్ధర" అను తరంగమును నెల్లటూరు (కృష్ణాతీరము) వాస్తవ్యులు ఏలేశ్వరపు ఆంజనేయులుగారు బహురంజకముగా నిప్పుడు పాడుచున్నారు. పారిజాతకథలోని యొక పద్యము:—

క. భవభయతిమిరదివాకర
శివరామానందతీర్థ శిష్యోత్తములౌ
శివనారాయణతీర్థులు
సవరణతోఁ బారిజాతచరిత రచించెన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నారాయణతీర్థులవారి శిష్యు లెవరో రచించిన స్తుతిశ్లోకము లివి:

శ్లో. య దంఘ్రి పంకే రుహరేణులగ్నం
నిపీయ నీరం విమలాంతరంగః;
జానామి తత్త్వం నిజ మాత్మరూపం
తం నౌమి నారాయణతీర్థ మార్యమ్.

శ్లో. బోధాగాధ సునిర్మలాతివిమలే
యన్మానసాబ్ధౌ హరిః
క్రీడ త్యుజ్ఝితదుగ్ధసింధు రనిశం
శాంత్యాది దూతీజనైః;
భక్తిజ్ఞప్తి విరక్తిసంజ్ఞ మతులం
కన్యాత్రయప్రాపకం (?)
శ్రీనారాయణతీర్థ సద్గురు మహం
తం నౌమి ముక్తిశ్రియై.

హరిభక్తిసుధోదయములోని రెండు శ్లోకములు :—

శ్లో. సమీహితార్థా౯ స్మరతాం దదాతియ
త్కథాసుధావాగ్లహరీ సుధాపగా;
మహాకవీనా మపి కావ్యనాయకం
వినాకమన్యం స్పృహయే న్మదీయవాక్.

శ్లో. అనంతలీలామృతపూర్ణ వారిధే
రగణ్యవిద్యాగుణరత్న సంపదః;
కథంను కేనాస్యతు కర్మ వర్ణ్యతే
పరంతు భక్త్యా కిమపీహ వర్ణ్య తే.

శ్లో. అనన్యసాధారణలక్షణః పుమా
నశేషలోకస్థితి హేతు రవ్యయః;
అనాద్యనిర్వాచ్యవిచిత్రశక్తి మ
త్స్వమాయయా క్రీడతి గోపబాలవత్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గోపాలభాగవతులు

వీరు దక్షిణదేశమున భాగవతకాలక్షేపము చేయు వారిలోఁ బ్రఖ్యాతులుగా నేఁబదియేండ్లక్రిందటి దాఁకనుండిరి. నారాయణతీర్థులవారికి వీరు ప్రశిష్యులు. ఈ రూపచిత్రమును మా కొసఁగినలక్ష్మణశాస్త్రులుగారికి వీరు తాతగారు.

[భారతి
జూన్, జులై, 1925]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

త్యాగరాజు

ఆంధ్రదేశము కర్మఠప్రచుర మయినది. ఆంధ్రబ్రాహ్మణులు శ్రౌత స్మార్తకర్మపరాయణులు. తక్కిన వర్ణములవారును వీరి ననువర్తించినవారే. పాశుపతకాలాముఖ శైవములు, జైన బౌద్ధములు గూడ నాంధ్రులలో సురూఢము లయినవి. శంకరుల తర్వాత పైమతముల యెగుపునుతగ్గించి యధికముగా నద్వైతమతమును, రామానుజులతర్వాత రెండుమూడుశతాబ్దులకుఁ గొలఁదికొలఁదిగా వైష్ణవమును దెలుఁగుదేశమున నభివ్యాపించినవి. ఆంధ్రదేశమునందు ద్వైతమత ప్రచారము చాలసర్వాచీనము. ఇన్నిమతములు వ్యాపించి సాగుచున్నను నాంధ్రులలో బ్రాహ్మణులు, నితరవర్ణములవారు యోగ ప్రభేదములగు మంత్ర, భక్తి, లయ, హఠ, తారకరాజాది యోగ ప్రభేదముల యోగవిద్య నధికముగా నభ్యసించుచు వచ్చిరి. శైవులు, శాక్తులు వైష్ణవులు నధికముగా మంత్రయోగము నభ్యసించిరి. వేమన, పోతులూరి వీరబ్రహ్మేంద్రులు హఠయొగమును సాధించిరి. పోతన, రామదాసు, ప్రకాశరాసు మొదలగువారు భక్తిలయ యోగపరాయణు లయిరి, దక్షిణ దేశమున నెలకొన్నను, త్యాగరాజుకూడ నక్కడి యాంధ్రులయిననారాయణ తీర్థులవలె భక్తిలయయోగముల ద్వారమున సంగీతరూప మగునాదబ్రహ్మానందరసము ననుభవించిరి. బాహ్యమయినమూర్త్యారాధనముకంటె త్యాగరాజుగారధికముగా నంతర్యామ్యర్చనమునే కావించిరి. త్యాగరాజుగారి కీర్తనలలోఁ బెక్కింట నీవిషయము ప్రవ్యక్తమగును. బాహ్యము లయిన తీర్థములను గంగాధనుష్కోట్యాదులను దిరిగి యారాధించుటకంటె నంతరంగమునఁ గలగంగాధనుష్కోట్యాదుల నర్చించుటలో బాహ్యము లయినకోటితీర్థముల నర్చించుఫలము లభించు నని యీ క్రిందికీర్తనమున త్యాగరాజుగారు వెల్లడించిరి. ధను వనఁగా వెన్నుముక. దాని కోటి-యగ్రము నాసాగ్రము గాని మూలాధారకుండలినీస్థానము గాని యగును. ఈ కీర్తన మీ యర్థమును నిరూపించుచున్నది.

తోడి—ఆది

కోటినదులు ధనుష్కోటిలో నుండఁగా
ఏటికి తిరిగేవే ఓ మనసా ! ॥కోటి॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నూటిగ శ్యామసుందరమూర్తిని
మాటిమాటికిఁ జూచేమహారాజులకు ॥కోటి॥

గంగ నూపురంబుననను జనించను
రంగనిఁ గావేరి గని రాజిల్లను
బొంగుచు శ్రీరఘునాథుని ప్రేమతోఁ
బొగడేత్యాగరాజు మనవి వినవే ॥కోటి॥

వెన్నెముక నడిమి దగుసుషుమ్నకు రెండు పార్శ్వములను ఇడాపింగళానాడులు సాగుచున్నవి. మూఁడు నాడులును ధనుష్కోటిలో నాసాగ్రము గాని, కుండలిని గాని, రెండింటిలో నేస్థల మయినను, నక్కడ నేకీభవించుచున్నవి. శ్రుతితాళగేయములు సంగీతారంభమునను నవసానముననను నట్లే ముక్తాయింపులో నేకీభవించుచున్నవి. ఈ యేకీభావమునకే లయ మని నామాంతరము. త్యాగరాజుగారీ లయ బ్రహ్మానందరసమును సర్వదా యనుభవించుచు ధనుష్కోటిలో నానందసాగరమున నోలలాడుచుండిరి.

పై యర్థమునే త్యాగరాజుగా రీసంకీర్తనమున మఱియు వివరించిరి.

గరుడధ్వని-దేశాది

ఆనందసాగర మీదనిదేహము భూభారమె రామ
శ్రీనాయకాఖిలనైగమాశ్రితసంగీతజ్ఞాన మను బ్రహ్మ
శ్రీవిశ్వనాథ శ్రీకాంతవిధులు పావనమూర్తు లుపాసించలేదా
భావించి రాగలయాదుల భజియించే శ్రీత్యాగరాజనుత ॥ఆ॥
ఈవిషయమునే నారాయణతీర్థులవా రిట్లు ప్రస్తుతించిరి.

భైరవి ఆది

రామకృష్ణగోవిందేతి నామసంప్రయోగే
కామ మిహ స్నాతవ్యం సర్వోత్తమప్రయాగే
రామనామగంగాసమ్మిశ్రితకృష్ణనామ
యామునే గోవిందనామసరస్వతీప్రథితే
యోగిమానసపరమహంసకులకలితే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాగీశవిష్ణురుద్రాదివాగ్గహరీలలితే
స్నానసంధ్యాజపహోమతర్పణాన పేక్షితే
హానివృద్ధ్యాదిరహితాఖండసుఖఫలదే
యాగయోగ రాజభోగత్యాగసంబంధం వినా
భక్తివిరక్తివిజ్ఞానద్వారాముక్తిఫలదే
సర్వపాపౌఘతిమిరదండసూర్యమండలే
సాధునారాయణతీర్థతీర్థరాజవిమలే.

యోగప్రభేదమగు నాదోపాసనమహిమను త్యాగరాజుగా రిట్లు వర్ణించిరి.

బ్యాగడ - దేశాది

నాదోపాసనచే శంకర
నారాయణవిధులు వెలసిరి యోమనసా ॥నా॥

వేదోద్ధరులు వేదాతీతులు
విశ్వ మెల్ల నిండి యుండేవారలు ॥నా॥
మంత్రాత్ములు యంత్రతంత్రాత్ములు మఱి మ
న్వంత్రము లెన్నో గలవారలు
తంత్రీలయస్వర గానవిలోలురు
త్యాగరాజవంద్యులు స్వతంత్రులు ॥నా॥

లయవియోగములలో నాదానుసంధానమే యుత్తమోత్తమ మైనదని యోగీశ్వరు డైనగోరక్షనాథుఁ డిట్లు ప్రశంసించినాడు.

శ్రీయాదినాథేవ సపాదిలక్ష
లయప్రకారాః కథితాః పురావై
నాదానుసంధానక మేక మేవ
మన్యామహే ముఖ్యతమం లయానామ్॥

శ్రీ త్యాగరాజస్వామివారి భక్తియోగవరాకాష్ఠ నీ సంకీర్తనమున గుర్తింపవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముఖారి-రూపకం

ఎంతని నే వర్ణింతును శబరీభాగ్య ॥ఎం॥

దాంతులు పరకాంతలు జగమంత నిండియుండగ ॥ఎం॥

కనులార సేవించి కమ్మనిఫలముల నొసఁగి

తనువు పులకరించఁ బాదయుగములకు మ్రొక్కి

ఇనకులపతిసముఖంబున పునరావృత్తిరహితపద

మును పొందినత్యాగరాజనుతురాలి పుణ్యమున్మ ॥ఎం॥

త్యాగరాజుగారు మనోలయయోగము లేనిబాహ్యతంత్ర పరాయణుల నిట్లు పరిహసించిరి.

ఆభోగి - ఆది

మనసు నిల్ప శక్తి లేకపోతే

మధురఘంటవిరువుల పూజేమి జేయును ॥మ॥

ఘనదుర్మదుఁడై తా మునిఁగితే

కావేరి మందాకిని యెటు బ్రోచును ॥మ॥

సోమిదమ్మ సొగసుగాండ్రఁ గోరితే

సోమయాజి స్వర్గార్హుఁడౌనో

కామక్రోధుఁడు తపం బొనర్చితే

గాచి రక్షించునే త్యాగరాజనుత ॥మ॥

త్యాగరాజుగారు మంత్రజపయోగపరాయణుల నిట్లు మహనీయులనుగా స్తుతించిరి.

శ్రీరాగం-దేశాది

నామకుసుమములచేఁ బూజించే

నరజన్మమే జన్మము మనసా ॥నా॥

శ్రీమన్మానసకనకపీఠమున

చెలఁగఁ జేసికొని పరశివరామ ॥నా॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాదస్వర మనేవరనవరత్నపు
వేదికపై నకలలీలావి
నోదుని పరమాత్ముని శ్రీరాముని
పాదములను త్యాగరాజహృద్భూషణుని ॥నా॥

భగవత్ప్రాప్తికి సూటి యైనదగ్గతిమార్గ మగుహఠేతర యోగప్రభేద ప్రకారము ఆంధ్రదేశమున సర్వదా అభ్యుదయము నందుచుండును గాక. త్యాగరాజుగారి వంటి మహనీయులు ఆంధ్రదేశమున తనరారుచుందురుగాక!

త్యాగరాజస్వామీ! మీయద్వైతానుభూతి మాకానందము గొల్పుచున్నది. మీరు శివ దేవీ రామకృష్ణ లక్ష్మీ సరస్వత్యాదిదేవతలను నాయా పుణ్యస్థలముల యర్చామూర్తులను స్తుతించుచుఁ గృతులను రచించితిరి గాని, యన్నింటను నీశ్వరాద్వైతానుభూతినే భగవంతుని సచ్చిదానందాత్మకనే వ్యక్తపఱచితిరి!

మీకృతులంలో భావరాగతాళములు పరస్పరము సమేళమై యానుకూల్యముతో నైక్యముతోఁ బ్రస్తారము చెంది చెంది యాహ్లాదవినోదము లలరార్చి ముక్తాయింపు ముగింపులో మూఁడును చరమానందమున సమన్వితము లగు తీరులు మామ ననుతలఁపును, నోటిపలుకును, మేనిచెయిదమును నైక్యపరిపాకమునకుఁ దార్చి, మాజీవితములనే దివ్యసంగీతములఁ గావించి మమ్ముఁ గూడ సుకృతులఁగా వెలయించుఁ గాక!

బండుదుండగము లాడువాఁడు "పలుకు తేనెలతల్లి" పాటలఁ బాడఁ జాలడు. కట్టెలు గొట్టువాఁడు వీణ మీఁట జాలఁడు. సంగీతము సుకుమార కళ! ఇది భక్తిజ్ఞానపర మగుచో సుకుమారాతిసుకుమారము, మధురాతిమధురమునయిన యాత్మానుభూతికిఁ ద్రోవఁద్రొక్కించుననుట మీ యనుభవము. శ్రుతిస్థాయి తప్పనిగానము నేర్చినట్టె మీరు భగవత్పరమే యయినరచనను గూడనేర్చితిరి. మీ గేయరచనాగానవిధానములు మానవలోకోద్ధారకములు. దివ్యప్రజ్ఞాస్ఫోరకములు.

భగవంతుని కభిముఖముగా మనజీవ యాత్ర సాగించుచు నాయనతో నన్వయము చెందునట్లు చేయుట గానమునకుఁ బరమార్థము. ఈ జీవశ్రుతి స్థాయిని సదా హృదయమునఁ గుదుర్చుకొని మనము గానానందము ననుభవింతము గాక!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ యర్థమునకుఁ దార్కాణగా త్యాగరాజప్రసక్తమగు నొక కథ నిక్కడ వివరింతును.

త్యాగరాజుగారి తాతలకాలమునఁ దెల్గుదేశమున భయంకర క్షామపీడ కల్గెనఁట. ఒకపల్లెటూర వీరితాతలతాతగారు భగవత్సంకీర్తనము జరుపుకొనుచుఁ బలువుర నాకట్టుకొని పూజ్యులుగా నుండెడివారఁట. ఆయన యా యూర నాహారపదార్థములఁ గొందఱిండ్లనున్నవాని నందరకుఁ బంచిపెట్టించి నేఁటి రేషన్ విధానమునఁ గొన్నాళ్ళు తక్కువతిండితో నూతివారి ప్రాణములు నిలిపెనఁట. ఏ యింటను జిట్టెడుగింజలుకూడ లేని దుస్థితి వచ్చెను. ఎండలు మండుచున్నవి. మరణయాతన వచ్చినది. ఈ ముసలి బాపఁడీశ్వరుఁడున్నాఁడు. రక్షించును అని సంకీర్తనము చేయుచుండెను. ఆ యూరి కై దారుమైళ్ళదూరమున నీరు లేని యిసుకయెడారి యేఱును, దాని కావలిగట్టున నొక గ్రామమును, నాయూరి రెడ్డియింటఁ జాల నిలువధాన్యమును నుండుట వినవచ్చెను. వానలు లేకున్నను నాయేటిచలువకు బావులలో నీళ్లుండుటచే నాయూరఁ గొంతపంట పండెను. ఈ భక్తబ్రాహ్మణుని ననుసరించి యూరివారయిదుగురు రారెడ్డిని యాచింపబయనమైరి. ఈ బ్రాహ్మణుఁడును బయన మయ్యెను గాని రక్షకుఁడు భగవంతుఁడనుచు బాటలోఁ బాటలు సాగించెను. ఇసుకయేటిలో నడక-మట్టమధ్యాహ్నము మండుటెండ-ప్రాణాపాయస్థితితో నందరు నుండిరి, చింపిరిబట్టలు కాళ్ళకుఁ జుట్టుకొనికూడ నిలువను నడుగు సాగింపను జాలకుండిరి. నోళ్ళు పిడుచ కట్టుకొని పోవుచుండెను. ఇట్టిచోఁ గొన్ని గజముల దూరమున, జీబుకొన్న చిగురాకు జొంపములతో నిండారిననీడతో నొక గొప్ప వృక్షము గానవచ్చెను. భక్తబ్రాహ్మణుఁడు దానిన జూచి తనని యటు చేరఁబోవుద మనెను. అందొకఁడు మనకనులు తిరిగి మతిచెడి యట్టు చెట్టుగానవచ్చినది. నేనెఱుఁగుదును. ఇక్కడ చెట్టెన్నఁడును లేదు. చావో బ్రదుకో నేను మీఁదియూరికే యడుగు సాగించెద నని బండతనముతో నడువసాగెను. కడమవారు కళవళపడసాగిరి. భక్తుఁడు నేను ముందు చేరఁబోయి నిజమయినచో మిమ్ముఁ గేకవేసి పిలుతును రండని చెట్టును జేర నడచెను. చల్లనినీడచెట్టాతని కుల్లాసము గొల్పెను. కడమవారు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముగ్గురు నాయన పిలుపునఁ జేరఁజనిరి. అందొకఁడు మాయో నిజమో చల్లని నీడ దొరికినది. నోరు పిడుచ కట్టుకొని పోవుచున్నది. స్వామీ! చెట్టునీడ నిప్పించినట్టు నీరు కూడ నిప్పింపుఁడు అనెను. భక్తుఁడు ప్రార్థించెను. అంత నా చెట్టు చిగురుజొంపములనుండి చల్లని తియ్యనరు చెంబులతోఁ బోసినట్లు ధారలుగా జారసాగెను. కనులు మొగము కడుగుకొని కడుపార వాచాలతో నీరు ద్రావి తల యొడలు కాళ్ళు కడిగికొని హాయిహాయి మని యందరు నానందించిరి. ఇదేమివింతో అనిరి! ఒకడిట్లనెను. "మండుటెండలలోను, బాడుగుళ్ళలోను, నీరు లేని పాడునదులలోను దేవతలో పిశాచములో విహరించుచుందు రందురు. వారెన్న వింతలైనఁ గొంతకాలము చేయఁగలరు. ఇదేదో అట్టివారి పని. ఏదైనఁ గానిండు. ఇది మాయము కాకముందే మన మంచి జరుపుకోవలెను. ఆయ్యా! మీరు ప్రార్థింపుడు. వచ్చినది తిండిగింరిలకై-ఇంట, ఊర, అందరు చచ్చుచున్నారు. వారికి నేటిఁకి వలసినబియ్యము, పప్పు వగైరా పదార్థములు కావలెను" అనెను. పండ్లు రాలినట్లు బియ్యపు మూటలు, పప్పులు వగైరాలు మూటలు రావలెను. తనవంతు గైకొని యూజ వారిని బంపుదనని కాళ్ళు కాలకుండుటకుఁ గూడఁ బ్రార్థింపుఁడని భక్తుని వేఁడి యాతఁ డింటికిఁ బర్వెత్తెను.

ముగ్గురున్నారు. ఇదేదో ముసలిబ్రాహ్మణుని మంత్రమహిమ. మంత్రాలకుఁ జింతకాయలు రాలునా యన్నమాట తలక్రిందైనది. ఉచ్ఛిష్ట గణపతి మంత్రమో యట్టి దింకేదో యాతఁడు జపించుచున్నాఁడు. అట్టి క్షుద్రదేవత లిట్టి ఫలములు కూర్పఁ గలవు. మహామంత్రములు పరదేవతలు పరలోకమున ఫలప్రాప్తిని కలిగించునే కాని తుచ్ఛమైనయిహసుఖముల నీయవు. ఏమైనఁ గానిమ్ము. ఇప్పుడు చచ్చుచున్నాము గాల కోరిక తప్పదు. అయ్యా! మాయూరి కరవు తీరుదాఁక నూరనందటికిఁ గావలసినయాహార మా యిండ్లనే వేయునట్లు మీ దేవతనో, దయ్యమునో ప్రార్థింపుఁడు అనెను. భక్తుఁడు ప్రార్థించెను. అతఁడు మరల ననెను. ఏమో! యిండ్లకడ లభించి యుండవచ్చును. నా కిక్కడఁ గడుపార మంచి పండ్లు పాలు తిండ్లు దొరకవలెను. అవి తిని నే నింటికి వెళ్లుదు ననెను. వాని కోరిక లభించెను. అరగించి వాఁ డింటికరిగెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇద్దఱున్నారు! ఒకఁడు మీ భక్తికి మెచ్చి కల్పవృక్ష మిక్కడ వెలసి నట్లున్నది. ఏమి కోరవలెనో తెలియఁజాలకున్నాను. నా కేమి కావలెనో వాని నన్నిటిని మీరే యీ కల్పవృక్షముచే నిప్పింపుఁడు అనెను. భక్తుఁడు ప్రార్థించెను. కాని చెట్టునుండి యేవియు రాలవయ్యెను. ఏల రాలకున్నవో బదులు చెప్పుమని భక్తుఁ డావృక్షమును వేఁడెను. చెట్టు గజగజ వణఁక సాగెను. కొంత కిట్లు చెట్టునుండి బదులువచ్చెను. ఇంతదాఁక నేను నన్నుఁ గోరిన వారికి వలసినవస్తువులనే యియ్యగల్గుచుంటిని గాని ప్రశ్నములకు బదులెఱుఁగుట పలుకుట యెఱుఁగను. మీ ప్రార్థనవల్ల నా కొఱఁత తెలిసికొని, నా యంతర్యామిని బరమాత్మని వేఁడి నేఁ డాప్రజ్ఞను బడసి మీకు బదులు చెప్పఁగల్గుచున్నాను. ఇది నాకు గావలె నని యడుగనేరనివానికి, దానిలేవడివలని యిబ్బందిని గుర్తింపవానికి నేది గాని లభింపదు. అట్టివాని కేది యిచ్చినను దానిని వాఁడు సరిగా ననుభవింపఁజాలఁడు. కాన యీతని కేఁయు నీయవీలు లేదు. తనకొఱఁతల నాతఁడు గుర్తించి యర్థించుఁగాక యనెను ఆతఁడు యోచించుచుండెను. భక్తుఁడు ప్రార్థించెను. నీ వెవరవమ్మా! కల్పవృక్షము నీవేనా? నేను కల్పవృక్షమునే. నీ ప్రార్థన లాలకించి, నాయంతర్యామిని సర్వాంతర్యామి యీశ్వరుడు కోరికలు దీర్పఁబంపెను. కోరుము అనెను ఆనందపరవశుఁడై "అమ్మా! ఇఁక నిన్ను విడువజాలను. మును ముందుగా ఈపని గావింపుము. నన్ను నమ్మక మీఁది గ్రామమునకు దూకినవాఁడేమి సంకటములో నున్నాఁడో, వాని నిటకు దెప్పింపుము" కల్పవృక్షము మీఁదియూరు చేరలేక స్మృతిదప్పి త్రోవలోఁ బడియున్నవానిని రాల్చెను. స్మృతిలేదు. వానికిఁ బ్రాణము పోయు మని భక్తుడు వేఁడెను. అయ్యా ఇది నావల్లఁగాదే యని వణఁకుచు నంతర్యామినర్థించి దానినిగొనితెచ్చి వానికిచ్చెను పాలలోఁ బంచదార కలసిపోయినట్లు నీవు నాలోఁ గలసిపోయి నా రూపముననే నెలకొనుము. కల్పవృక్షము అన్ని కోరికలను దీర్చినది యన్న ప్రసిద్ధి నిలుపుకొనుమా యని భక్తుఁడనెను. ఎన్నఁడు నెవ్వరును గోరనిగోరికలు కోరుట జరుగుచున్ననే యని యచ్చెరువు చెంది యది యంతర్యామి నడిగి యిట్లు బదులు చెప్పెను. "నేను నీలో నైక్య మందుదును గాని నీవు ప్రపంచ ప్రాణికోటితో నైక్య మందవలెను, మానవతలో నేఁప్రాణిని గాని నీవు వేఱువఱువ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాదు. ఏ భాగమున నీవు వేర్పాటు పాటింతువో ఆ భాగమున నే సుండ వీలుండదు" సర్వపరిపూర్ణత గోచరించి భక్తుఁడు వల్లె యని పరమానంద భరితుఁడై చెట్టును గౌఁగిలించుకొనెను. చెట్టు మాయ మయ్యెను. చెట్టు మాయ మగుట చూచి చావు దప్పించుకొన్న తొల్లిటివాఁడిది యంతయు మాయయని నే నన్నట్టై యయ్యెనన్నెను. కడమవారు కూడ వారు తొలుత నన్నుకొన్నట్లే యనుకొనిరి గాఁబోలును! భక్తుని తర్వాతి తీరెట్లుండఁబోలునో మీరే పర్యాలోచించి నిర్ణయించుకొందురుగాక! ఈకథనో, ఆచెట్టునో కడుపునఁ బెట్టుకొని త్యాగరాజుగారీపాట పాడిరి!

తరము గాని యెండవేళా కల్ప
తరునీడ దొరికిన,ట్టాయె యీవేళ
నన్ను విడిచి కదలకురా, రామ!
ని న్నెడబాసి యరనిమిష మోర్వనురా!
నన్ను విడిచి కదలకురా!

త్యాగరాజుగారి కీర్తన లన్నియు లోఁతు తఱచి చూచినచో నిట్టి యనుభవముల నాదబ్రహ్మావతారములే!

[రేడియో ప్రసంగము
మదరాసు
మీగడ తఱకలు : 1951
శ్రీత్యాగబ్రహ్మోత్సవమండప ప్రవేశోపన్యాసము 13-4-1949
మణిమంజరి: ఫిబ్రవరి, 1981]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శతావధాని వెంకటశాస్త్రి.

సీ॥ మోహనమ్మున జగన్మోహనంబుగఁ బద్య
పఠనంబు నిచ్చోటఁ బాడుకొల్పె
మాదృశాంతేవాసిమండలంబున కెల్ల
వేడ్కమై నిచ్చోట విద్య నేర్పెఁ
దేట తేటగఁ దియ్య దియ్యఁగా సత్కావ్య
నిర్మాణ మిచ్చోట నిర్వహించె
నుల్లాసవారాశి నోలార్చు నల్లారు
బెల్లంబు నిచ్చోటఁ బేర్మిఁ గనియె

తే॥ నెన్నఁటికి వీడరానట్టి యిట్టి యిట్టి
శాశ్వతానుబంధంబు లెసంగి యుండ
నెట్టు నిబ్బరించెనొ కదే యిట్టిపురపు
వీడనాడంగ మాకవివీరవరుడు?

నేను వెంకటశాస్త్రిగారిదగ్గఱఁ జదువుకొన నరిగిననాఁడు "అల పతంజలికృతం బయిన భాష్యమునకే పరిఢవిల్లును మహాభాష్యపదము" ఇత్యాది పద్యమును మోహనరాగరసమును బద్యభావము జీర్ణింపఁ జేసి వారు చదువఁగాఁదన్మయత చెందితిని. అంతకుఁబూర్వము భైరవ్యాది రాగములను దీగవార్చి పద్యముల నీడిగిలఁ బఱచి పౌరాణికులు చదువు చదువుతీరే నే నెఱిఁగినది.

రసస్ఫూర్తితోఁ దెలుఁగుబద్యములు చదువుచాతురికినే డాంధ్రదేశమున శ్రీశాస్త్రిలుగారే యాచార్యపీఠము. ఆనాఁటినుండి ప్రతివిద్యార్థియు శ్రీ శాస్త్రిలుగారింబోలి పద్యములు చదువుటకుఁ బ్రయత్నించువాఁడే ఎందఱో వారిపద్యపఠనానుకరణద్వారమున నాంధ్రభాషాపండితులయిరి. వెంకట శాస్త్రిగారి శిష్యులలో వారిపద్యపఠనచాతుర్య మావంతైన నంటనివాఁడను నే నెఱిఁగి నంతవఱకు నే నొక్కఁడనే కానవచ్చుచున్నాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ॥ కొంకులు వోని సత్కవన
　　గుంభన మంతకు మించి బింకమున్
బొంకము గల్గఁగాఁ జవులు
　　పొంపిరివోఁ, బఱియించు నేర్పు మా
వెంకటశాస్త్రి పండితక
　　విప్రభుచక్కటిఁ దక్కఁ దక్కువి
ద్యాకులమందు నెందుఁ గల
　　దా సకలాంధ్రమహామహీస్థలిన్.

అనాఁడు బందరులో శ్రీ శాస్త్రిగారి యుపన్యాస సంపర్కము లేని పౌరసభ లుండెడివి గావు. వారి యుపన్యాస మన్ననే శ్రోతలు సభలోఁ గ్రిక్కిరియ నిండెడివారు. వారి యుపన్యాసమునకు ముందు సందర్భము చక్కఁ జూచుకొనుట మొదలయిన జాగ్రత్త లక్కఱ లేదు. ఐనను జాగ్రత్తపడి వచ్చి చెప్పినవారి యుపన్యాసముకంటె శ్రీశాస్త్రులవారి యుపన్యాసమునకే సంగతులు చమత్కారములు హెచ్చుగ నుండెడివి. సభానంతరము సభ్యులు వెంకటశాస్త్రిగారి వాక్చమత్కృతినే సంస్తుతించుకొనుచు నిండ్ల కేఁగెడివారు. ఆనాఁడు సభలకు పద్యములు, శుభలేఖలకు పద్యములు, స్వాగతములకు పద్యములు, సంగీతములకు పద్యములు, బంతులాటలకు పద్యములు, ప్రకటనములకు పద్యములు ఆనాఁటినుండియే పద్యరచనాబిభీషికకు బరువు తగ్గినది. వెంకటశాస్త్రిగారికిఁ దీఱిక లేనపుడు వారివిద్యార్థులో, బడిబాలురో కూడఁ బద్యము లల్లి యిచ్చుచుండెడివారు. అంతకుఁ బూర్వము బందరు ప్రాంతములకు బ్రహ్మశ్రీ నాదెళ్ళ పురుషోత్తమకవిగారే పద్యరచనా విషయమున నద్వితీయులు.

పూర్వము భోజరాజు ముఖదర్శనమాత్రముననే పలువురు విద్వాంసులైరని ప్రతీతి. నేఁడు శ్రీ శాస్త్రులవారి ముఖదర్శనమున నది ప్రత్యక్షమయినది. స్కూలులో శ్రీ శాస్త్రులవారు పాఠములు చెప్పకుండనే, తాము పాఠములు చదువకుండనే పరీక్షలలో నెందఱో బాలకులు కృతార్థు లగుచుండిరి. అంతేకాదు. కవుల గుచుండిరి. మనలక్ష్మీకాంతకవిప్రభృతు లట్టి స్కూలు విద్యార్థులలో నాటితేటిన జగజెట్టులే. ఇది వింతగాదు. శ్రీ శాస్త్రుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వారిచే నెన్నఁడును జూడఁబడని వారును గూడ వారి శిష్యులై యెందఱో నేఁడు సరస కవితారచనము నేర్చి సర్వాంధ్రదేశమునఁ బ్రఖ్యాతి గనుచున్న వారున్నారు. ఈవిధముగా శ్రీశాస్త్రులవారు విద్యావంశవృక్షమును దొలుత బందరుపురముననే యానాఁడంటు ద్రొక్కిరి. అది యిప్పు డాంధ్రదేశమున సర్వత్ర ప్రబలి చెట్లు గట్టుచున్నది. దీనికి శ్రీ శాస్త్రుల వారి కాకమంచిప్రతి ఫలము గూడ లభించినది సుమండీ! గోదావరీతీరముననుండి కొనివచ్చి శ్రీ శాస్త్రులవారు బందరున విద్యావంశవృక్షము నంటు నాఁటినందులకు సరిగాఁ దాము బందరునుండి యపురూపము నసాధారణమునైన జహంగీరుమామిడియంటును గోదావరీతీరమునకుఁ గొనిపోయి తమతోఁటలో నాఁటికొనిరి. వారిమూలముననే జహంగీరుమామిడి కూడ నక్కడనుండి సర్వాంధ్ర దేశమునను వ్యాప్తినొందుచున్నది.

శ్రీ శాస్త్రిగారు నివసించిబహువర్షములు కవితామృతప్రపను సాగించిన భైరవప్రెస్సు ప్రక్క యింటిపట్టు ధనాద్యుపపత్తు లనుకూలించెనేని వారి పేర విద్యాస్థానముగా వెలయించుట యుక్తమని నాయెన్నిక.

శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవీశ్వరుల శతావధాన సత్ప్రబంధచాటుధారాకవితాచమత్కారములఁ గూర్చి ప్రశంసాలేశము జరుప నారంభింపనున్న నాకీ సందర్భమున

చ॥ పరిణత పాండితీబలము
భంగుర ధారణమాధురీ పరి
స్ఫురితకవిత్వముఁ న్గలిగి
శుభ్రయశంబు గణించుకొన్న మా
తిరుపతిశాస్త్రి సత్కవి గ
తించెనె యాంధ్రవచోవధూటికిన్
స్థిరతరకావ్యభూషణవి
శేషపరిష్క్రియ తీరిపోయెనే!

అన్న విచారము కొంత తొట్రు గల్గించినది. కాని తిరుపతి వెంకటేశ్వరులు భిన్నశరీరులైనను గవితావిషయమున నొక్కరే. శ్రీ వెంకటశాస్త్రి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గారు కవిత రచించుచున్నంతవఱకును శ్రీ తిరుపతి శాస్త్రిగారును నున్నవారే. వెంకటశాస్త్రిగారి కవితాగంగ స్రవంతిలో తిరుపతిశాస్త్రిగారి కవితాసర్వతి యంతర్వాహినిగా నున్నది.

క॥ నుతకవితామృతవాహిని
నతిలోకయశశ్శరీర మగపడుచుండన్
మృతి యటె తిరుపతికవికిఁ
జత యగు వెంకటకవీంద్రు చాటయి యుండెఁ.

అని యూరడిల్లితిని. తిరుపతివెంకటకవు లెక్కడేని యవధానము చేసి రనఁగా నా చుట్టుపట్టులవారనేకులు ప్రతిభాసౌధమున పదిమెట్లు లెక్కి రన్నమాటే. మెదడు కమలిపోవునో, నరముల బరువు సడలి శరీరము నక నకలాడునో యని సాధారణబుద్ధిమంతులు సందేహించునట్లు పగలు శతావ ధానతంత్రము జరపి, రాత్రి పదిగంటలదాఁక బరిపరివినోదములఁ బొల్గొని తరువాత నిమ్మకు నీరెత్తినటుల నిశ్చలముగా నిద్రపోయి మఱునాఁటి ప్రొద్దుట మఱల మందహాసవదనముతో నల్పాహారములనైన నారగింపక యవధానశేషమును బూరింపనారంభించు నీ జంటకవుల యంతఃకరణములు శ్రుతి కలసి యొకే 'మనము' అయ్యెడివి. అదియొక వింతతీరు. ఆసమయ ములందు వెంకటశాస్త్రిగారు విశ్వమూర్తులు!

తిరుపతివెంకటేశ్వరుల కవితాధార ప్రాచీనసంప్రదాయ ఘట్టములఁ ద్రవ్వి త్రవ్వి యూట యూరించి చేది చేది పాఱించినది కాదు; స్వయము ఉద్బుద్ధమైన బుగ్గధార! వారు ప్రాచీనగ్రంథములకంటె హెచ్చుగాఁ బ్రస్తుత పరిసర పరికరములనే చదివిరి. కావుననే సంప్రదాయమాత్రపరిజ్ఞాతలు కొందఱు వారికవితను సంప్రదాయదూర మైనదానిగాఁ గ్రొత్తతీరు గల దానిగాఁ దలఁతురు. నేఁటి యువకవులు వారికవితను నవకవితామార్గోప దేశకమును గా నారాధింతురు.

తిరుపతివెంకటకవులు ప్రౌఢపండిత ప్రభుసభలలోనే కాదు. బాల పామర జారచోరాదుల గోష్ఠులలో గూడఁ గవితాచమత్కారములను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గల్పించి సత్కారములను బడయఁగలరు. వెంకటశాస్త్రిగారికి లల్లాయి పదములు పాడవేడుక; కొల్లాయిగుడ్డలు వాడ వేడుక. వారికి భాషాడంబరము దిట్టదు. అట్టె వేషాడంబరమును గిట్టదు. కనుకనే వారి కవితాకన్య 'జనముద్దు'గా వెలసినది. వారిచనవు అల్లారుబెల్లముగ నందఱికి నాస్వాద్యమైనది సమయస్ఫూర్తి, హాస్యయుక్తి, ప్రయుక్తి చమత్కారము వెంకటశాస్త్రిగారికి నాజానజమగు నలవాటు. ఇట్టివారు నూఱేండ్లకుముందు నడిమింటి మంగళేశ్వరశాస్త్రిగా రొక రని వింటిని. బ్రహ్మశ్రీ వేదము వెంకటరాయశాస్త్రిగారిని నింకొకరిని గంటిని. మంగళేశ్వరశాస్త్రిగారు బొబ్బిలిరాజసభలో నకకుడిప్రక్క నుండి యెడమప్రక్కకు పాఱినమేలా, యెడమప్రక్క నుండి కుడి ప్రక్కకు పాఱినమేలా, యని ప్రశ్నరాఁగా, అది కఱవనిచో నెటు పాఱినను మేలే యని రఁట! వెంకటశాస్త్రిగారు బందరు హైస్కూలు పండితపదమునఁ బ్రవేశింపఁ గ్రొత్తగావచ్చినప్పుడు నైష్ఠికశ్రేష్ఠులయిన బ్రహ్మశ్రీ జంధ్యాల గౌరీనాథశాస్త్రిగారియింట పట్టుబట్ట మడి గట్టుగొని భోజనముఁ జేయుచుండగా "పట్టుబట్ట యంతకాలముదాఁక మడి యండీ" యని గౌరీనాథశాస్త్రిగారు ప్రశ్నింపఁగా వెంకటశాస్త్రిగారు "చెమటకంపు గొట్టకున్నచో నెన్నాళ్ళకైనను మడియే" యనిరఁట! ఇది యొక చమత్కారలేశము. ఇట్టివి వెంకటశాస్త్రిగారి చమత్కారము లనేకములు.

ప్రాచీనాంధ్రకవులలోఁ బ్రబంధములకంటె శాశ్వతము లగునట్లు చాటురచనలను సాగించినవాఁడు శ్రీనాథుఁడు. అతని చాటురచనలను నేఁటికిని నాంధ్రరసికుల నాలుకలపై నాట్య మాడుచున్నవి. వర్తమానాంధ్రకవులలో నట్టివారు మనతిరుపతి వెంకటేశ్వరకవీశ్వరులు.

పదునైదేండ్లకుఁ బూర్వము విశాఖపట్టణమండలమున శృంగవరపుకోటనుండి యేదో యొకయూరికి రాత్రివేళ బండిమీఁద బ్రయాణమై నే నేఁగుచుంటిని. ప్రక్కబండిలో నొక పట్నాయకుడు "ఇంజరం బొక సాక్షియే నాము దా సాక్షి-పల్లెపాలెంబు దా నెల్ల సాక్షి— ఇత్యాది పద్యమును బాడుచు నడుమ-"శంకరుండాతనిసాని సాక్షి" యనుపట్టున నాఁగి యొక నవ్వునవ్వి మరల నారంభించి పద్యము ముగియఁ జదువుట వింటిని. తిరు

23)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పతి వెంకటకవుల చాటుధారలు మలయమారుతపుఁ బింజెలు. అవి యాహ్లా దజనకములై సర్వాంధ్రప్రపంచము నలముకొన్నవి. లక్షలకొలఁది గ్రంథ సంఖ్య ముండునట్లు (ముప్పదిరెం డక్షరముల రచనమునకు గ్రంథ మని పేరు) బహుగ్రంథముల రచించు కవీశ్వరులు పలువు రిప్పు డున్నారు గాని వారి పద్యములు ఏన్నియేని హాయి మని పండితులుగాని, పామరులుగాని గాని పలువురు పలుమాఱులు పఠించునవిగా నున్న వాయన్న ప్రశ్నకు సమా ధానము చదువరులే సమాలోచింపఁదగుదురు.

శ్రీ వెంకటశాస్త్రిగారికిఁ బ్రాయపుఁబ్రొద్దు కొంత పడమటికిఁ దిరుగ నారంభించెను. విద్యావివాదసంజ్వరము గొంత చల్లనాఱెను. అన్నవస్త్రము లకుఁ గొఱంత లేని స్థితి యేర్పడెను. ఇట్టిస్థితిలోఁ దమ కప్పటికి సంతానము కలుగకున్నను సంతానవంతుఁడై వంశవృద్ధి కల్గింపఁ గల్గెననుకొనుచున్న చిన్న వెంకటశాస్త్రిగారు పుత్రసంతాన రహితులుగానే కీర్తిశేషు లయిరి. ఆనాఁడు శ్రీ వెంకటశాస్త్రిగారు వస్త్యైకాశ్రయమై యున్న చెళ్ళపిళ్ళ వంశ వృద్ధిని దలపోసి యస్మదాది శిష్యగోష్ఠిలో నొకనాఁడాపరాని విధమున దుఃఖార్తు లయిరి. అల్పకాలమునకే భగవంతుఁ డనుగ్రహించెను. వెంకట శాస్త్రిగారు గృహారామ ధనకనక వస్తువాహన సమృద్ధితోపాటు సత్సంతాన లాభమును గూడఁ బడసిరి. ఆనందమయముగా జీవయాత్రను గడప నసువు పడెను. ఆకాలమున నట్టి యానందసందర్భమున నే నొక జాబులో శ్రీ శాస్త్రిలుగారికి వ్రాసినపద్యమిది:

సీ॥ గాటంపుఁదమిఁ దోఁట నాఁటుకొన్నారు నిం
డారఁ బండెనె జహంగీరుమావి?
యవధానములుసూడ నభ్యర్థితులు వేఁడ
నేఁగుచుందురె యిప్పు డెచటికేని?
సత్కవితారహస్యము లభ్యసింపఁగా
వచ్చుచున్నదె శిష్యవర్గ మిపుడు?
భగవత్పరము లైనపరమార్థరచనముల్
క్రొత్తవి యేవేనిఁ గూర్చినారె?
కులుకఁగుజ్జుల నునుదొక్కుఁ బలుకులందుఁ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రౌఢి మీఱినసుకవితాఫణితులందుఁ
బరువుగల యంటుమామిడి పండులందుఁ
జక్క గుఱుతించుచుందురే చవులవాసి?

శ్రీ వెంకటశాస్త్రిగారు నెలలబాలురై యుండఁ వారి తండ్రిగారు కడి యమునుండి వారినివిజయనగరపు పేటగ్రామమునకుఁ గొనిపోయి యక్కడ వారింగూర్చి పక్షిప్రశ్నమడిగిరఁట! ఆ ప్రశ్నగ్రంథమున వారిని గూర్చి కొన్ని శ్లోకములున్నవి. అందు స్వసమాన వయశ్శక్తిమంతుఁడగునొకసుకవితోఁ గూడి బహు గ్రంథములు రచించుకవి యగుట, రాజపూజితు లగుట మొదలగు విషయము లేవో కొన్ని తర్వాత వాస్తవములయినవి గలవు. తుద నందు "షష్టివత్సర కీర్తిమాన్" అని కలదు. ఆ తుదిపలుకునకు షష్టిపూర్త్యుత్సవ వైభవసందర్భమున గొప్పకీర్తి గల్గునని యర్థము చెప్పవలెనని నేను నిశ్చయించుకొన్నాను.

వెంకటశాస్త్రిగారు విద్వద్రాజగోష్ఠులయందు వివిధ సత్కారములఁ బడసిరి; విద్యావివాదములందు విజయము లందిరి; రసంకావ్యములఁ బెక్కింటి రచియించిరి; చాలమంది శిష్యులకుఁ జదువు చెప్పిరి. సంతాన సమృద్ధిని బడసిరి; సకలసంపదలఁ బడసిరి; సమానులలో నుత్తమశ్లోకు లయిరి. ధర్మార్థకామములందుఁ బరిపూర్ణ మయిన పరితృప్తి వారికి దొరకిన దనియే నా విశ్వాసము,

[భారతి
1-8-1933]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవితాపారమ్యము

శ్రీ వేంకటపార్వతీశ్వరకవుల 'యేకాంత సేవను', దాని యనుకార్య మగు 'గీతాంజలిని'ని బురస్కరించుకొని 'కవితాపారమ్య' మనువిషయముగూర్చి నేను తల పోయుచుండువిషయముల నిక్కడ నించుక ప్రస్తావింతును.

శ్రీ వేంకటపార్వతీశ్వరులు రచియించిన యేకాంత సేవాకావ్యము రవీంద్రనాథటాగూరుగారి 'గీతాంజలి' చ్ఛాయగలదిగా విఖ్యాతి గాంచినది. 'గీతాంజలి'యు, 'నేకాంత సేవ'యు వ్యంగ్య ప్రధానకావ్యము లనియు, అవాఙ్మనసగోచరమైన యీశ్వరతత్వమునుగూర్చియన్వేషము జరుపువారి నవి యొకానొక యవ్యక్తానుభూతికిఁ దార్పఁగలిగియున్న వనియు వాకొనుట సహృదయులకు ననుభవపునరుక్తి.

వ్యంగ్యప్రధాన మైనకావ్య మత్తమకావ్య మని యాలంకారికుల నిశ్చితనిర్వచనము. విరిసినపూవు సువాసనను, పుప్పొడిని, మకరందబిందువులను తన నెలవునకు బైపడి యివి యింతవరకే యని గీటుగీయ నలవి కానంత వింతగా చుట్టుపట్టుల కెంతదాఁకనో ప్రసరింపఁజేసి వేడుక గొల్పినట్లు, వ్యంగ్యవైభవముగూడ నిది యింతే యని గ్రుద్ది హద్దుగీటు గీయరానంతవింతగా వాచ్యలక్షణములకంటె మించిన యర్థవిశేషముల నెన్నింటినేని జలజల రాల్చుచు నానందము గొల్పును. వ్యంగ్యవైభవము వాచ్యాతిశాయి గనుక వాచ్యమున నిర్వహింపఁదగని వియుఁ, దరము గానివియు నగునర్థముల ననుమితపఱచు నదె సామాజికులను విశాలయోచనమునఁకు బాల్పఱచి యనిర్వచనీయానందమునకుఁ దార్చును.

లోకానుభూయమానములగు సామాన్యవిషయముల లోనే వ్యంగ్య వైభవ మింతచమత్కారజనక మగు ననఁగా, నిఁక నవాఙ్మనసగోచరము: సర్వజగద్వ్యాపారమూలాధారము నగు నీశ్వరత్వమును నిర్వచించుటకో, నిరూపించుటకో పూనినపుడు దాని చిద్విలాస మిఁక నెంతేని వింత గొల్పు నదై యుండి తీఱును గదా. క్రాంతదర్శియైన సుకవి తనలో దృశ్యాదృశ్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముగా వెలుఁగులు గొలుపుచున్న తత్త్వమును వ్యక్తావ్యక్త వాక్కులతో వ్యంగ్యమర్యాదతోనే సామాజికులకు పరిస్ఫురింపఁజేయవలసినవాఁ డగును. ఉత్తమ గాయకుండుగూడ నొక్కొకపు డంతరంగమున గానామృతము పొర్లు వాఱుచుండఁగా నుచ్చస్థాయికిఁ బోయిపోయి కంఠశక్తి వెనుబడఁగా శిరఃకంపహస్తచాలనభ్రూభంగాదులచే గేయావశేషము నవగతపరుచువాఁ డగును.

కవి తనలో నెక్కడో యనభివ్యక్తముగా నెప్పుడో గోచరించినపర తత్త్వము నాలంబముగాఁ గొని దాని యనుభూతివాసనచొప్పనఁ దన నేర్పు కొలఁది భాషతో నొక ప్రతి కృతిని గల్పించి, సామాజిపలుకులకు దానిని ప్రదర్శించి పరమార్థానందచ్ఛాయ ననుభవింపఁజేయును. కవీశ్వరునట్లు సామాన్యజనుఁ డట్లు దాని దర్శింపనేని, ప్రదర్శింపనేని చాలఁడు. అట్లే చిత్ర కారుఁడును తన కెక్కడో-లోపలనో వెలుపలనో గోచరించినదృశ్యమును దేశకాలాంతరములందు తన భావవాసనాసంస్కారమువలనఁ గొనివచ్చి తన నేర్పున కనుణముగా వన్నెచిన్నెలతో రూపు గల్పించి చూపి సామాజికుల నానందపఱచును.

ప్రకృతిపుష్పము వెలార్చుసౌందర్యసౌరభ్యాదులు చిత్రపుష్పమున లేవు. అయినను సామాన్యమానవు లీ చిత్రకారుని పుష్పము నధికానంద ముతో నాలోకింతురు. ప్రకృతి కంటె సాదృశ్యవస్తు వధికహృద్యము కావల యుట విస్పష్టవిషయమే కాన, చిత్రపుష్పముకంటె మూలపుష్ప మధిక హృద్యమే కావలెనుగదా? అయినను మూలపుష్పమున నెప్పుడో యెక్కడో కొంతసేపే దృశ్య మగుట, దాని రచయితయు, రచనాప్రణాళియు నదృ శ్యము లగుట యన్న కొఱఁత లుండుటవలనను, చిత్రపుష్పమున సదాసర్వత్ర దృశ్య మగుట, చిత్రకారుఁడును దద్రచనాప్రణాళికయు ప్రత్యక్ష మగుట' యన్నగుణము లుండుటవలనను; అంతేకాక, మానవత ప్రాయికముగా మాయాజ్ఞానావృతమై సత్యానుభూతికి దూరమై తానే సత్యప్రతిబింబభూతమై యుండుటవలనను, సులభమగు సత్యప్రకృతికే మానవ ప్రకృతి ముచ్చట పడును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సామాజికాభిరంజనమునకై కవియు తాను కల్పించిన సత్యప్రకృతికి వస్త్వలంకారశిల్పము, భాషాపరివేషము, శయ్యావైయాత్యము. ఛందస్సందర్భము పొసగించి స్వారస్యాతిశయము సంపాదింపఁజూచును.

సృష్టివ్యాపారకార్యమును స్పష్టముగా, సర్వదృశ్యముగా సాధించుచుఁ గూడఁ దత్కర్త యీశ్వరుఁడు తన్ను దాచుకొని తన కార్యములచేతనే తన్నను మానిపించుచున్నట్లు ఉత్తమకవియు సత్యప్రకృతియగు తన కవితా కల్పనలోఁ దత్పరమార్థమును గర్భితపఱిచి వ్యంగ్యగోచరము గావించును. కల్పిత కవితలో నేదో పరమార్థ మంతర్లీనమై వ్యక్తముగా ధ్వన్యర్థవేద్యము కాలేక పోయినచో నట్టి కవి వట్టి యబద్ధాలకోరుగానే గర్హితుఁ డగును.

అనఁగా, కవిత యొకవిధముగా నసత్యకల్పనమే యైనను, కవితలో ననభివ్యక్తముగా సత్యానందము వ్యంజనావృత్తిగోచరమై సందర్భిత మయి యుండఁబట్టియే యది హృద్య మగుచున్న దన్నమాట.

ఈశ్వరతత్త్వము అవాఙ్మనసగోచర మగుట తథ్యము. అట్లయ్యు దాని నాకళించుటకై లోకమెల్ల నటతటపడుచు ముందు కడుగువేయుచున్న దనుటయుఁ దథ్యము. అది యనివార్య మగుటయుఁ దథ్యము. మానవయత్నము లెల్ల సత్యార్థములు, జ్ఞానార్థములు నానందార్థములు నగుటను బట్టియు, నీశ్వరుఁడు నిరతిశయసత్యజ్ఞానానందాత్మకుఁడగుటను బట్టియు నిది యిట్లే యనవలెను ఉపనిషత్తు "అసతో మా సద్గమయ, తమసో మా జ్యోతిర్గమయ, మృత్యోర్మామృతం గమయ" అని భగవత్ప్రాప్తిని ప్రతిపాదించుచున్నది.

కాఁగా, ఎఱిఁగియో, యెఱుఁగకయో యెటుపోయినను ఘట్టకుటీప్రభాత న్యాయమున సర్వమానవగతియు, అంతే యేమి-సర్వప్రాణిగతియు నీశ్వరాభిముఖమే యగుచున్నది. కాన ఈశ్వరప్రాప్తి ప్రాణికోటి కెల్ల ననివార్యమేకదా!

సదసత్తులతో, జ్ఞానాజ్ఞానములతో, ఆనందదుఃఖములతో, అపాయతన్నివృత్తులతో కలగలుపయి గజిబిజిగా నున్న ప్రపంచవృత్తిలో తా ముప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ద్రష్టలై లోకసామాన్యమున కీ యీశ్వరప్రాప్తియత్నమున తాత్త్వికులు, శాస్త్రకారులు, చిత్రకారులు, కవులు పురోగాములై యుందురు.

తాత్త్వికులు, శాస్త్రకారులు ఘోరదీక్షతో నంతరంగసముద్రమును మథించియు, బాహ్యమాయావరణారణ్యమును జీల్చికొని బాటలు ద్రొక్కియు గుర్తించి తెచ్చిన దివ్యవిజ్ఞానపదార్థములను పరికరములుగాఁ గొనియే వారి వెనుక నడుచువాఁ డగుకవీశ్వరుఁడు వానిలో మే లేర్చి వారు గుర్తించిన మార్గములలోనే చలువపందిళులను, రసామృత ప్రపలను గల్పించుచు, నింకను వెనుక నడచు మానవ సామాన్యమునకు వేడ్కగొల్పుచు వారి పయి నము సుఖమయము గావించుచు.

తాత్త్వికునిలోఁ బరమార్థసాక్షాత్కార ముండును కవిలోఁ దదను సారిగా ప్రసన్నమధురాంశచ్ఛాయాకల్పనము లుండును.

తాత్త్వికునిలో కవితాంశములను, కవిలో తాత్త్విక తాంశములును గూడ ననుగతములై యుండవచ్చును.

తాత్త్వికుల తత్త్వజ్ఞానము పెరుగఁగా పెరుగఁగా తన్మూలమున కవితలో తాత్త్వికతాంశములు పెరుగఁగా పెరుగఁగా సంఘమున తాత్త్విక తాశ్రద్ధ పెచ్చు పెరుగును అప్పుడు కవిత తేటదేరి క్రమపరిణామముతో! బరమార్థపరాయణ మగును. కృత్రిమకవితావిడబనముల కపుడు తా వుండదు. కవి కపుడు సత్యప్రతికృతికల్పన మనావశ్యకమగును. సౌందర్యసముచితమ యిన యా పరమార్థమే. అనఁగా సత్యమే యప్పుడు వాఙ్మయాకృతిఁ దాల్చును పదునాఱువన్నెబంగారమును మించినమేనిసొరు గల శుద్ధ సాత్త్వికతేజోవి రాజితునకు బంగారపుటలంకారములతోఁ బనియేమి?

శాస్త్రకారుల శారీరకపదార్థవిజ్ఞానరసాయనాది శాస్త్రప్రజ్ఞాతిశయమున గులాబిపువ్వును సువాసనతో, సౌకుమార్యముతో, పూవుదేనెతో, పుప్పొడితో సర్వసులభముగా శాస్త్రప్రక్రియచొప్పునఁ గల్పింపఁగల్గినపుడు గులాబిచిత్ర కల్పన ప్రయోజనము సమసిపోవును. శాస్త్రజ్ఞులు శబ్దస్పర్శరూపరసగంధము లను జ్ఞానేంద్రియ వ్యాపారములతో నిప్పటికి శబ్దరూపములను సర్వత్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సర్వదా సులభములు చేయఁగల్గినట్లు తక్కిన మూడింటినిగూడ చేయఁగల్గ వచ్చును. అనఁగా మదరాసు రేడియోలో పాడఁగానపుడే గ్రామఫోనులో నెక్కించిన పాట, యెక్కడఁబట్టిన నక్కడ, ఎప్పుడు పట్టిన నప్పుడు వినఁద గినట్లు, చెన్నపురిలోనే రేడియోస్థానమునఁ బెట్టిన భక్ష్యభోజ్యముల చవియు, పూల వాసనయు, వస్తువుల స్పర్శయు సదా సర్వత్ర యాస్వాదింపఁదగినది. యాఘ్రాణింపఁ దగినది, స్పృశింపఁదగినది కావచ్చును గదా!

ఇట్టివి జరిగినచో ఇఁక ననుకరణములయు. ప్రతికృతి కల్పనము లయు, కవితాకల్పనములయు ప్రయోజన మేముండును? సత్యజగదానందమే కాని కవికల్పితజగదానందమప్పు డక్కఱలేక పోవును. కవి యపుడు దన కనుకార్యుఁడగు నీశ్వరునికిఁ దాను బ్రతిబింబతను గాక తాదాత్మ్యమునే పొందును. ఇట్లు మానవతలో నీశ్వరతాదాత్మ్యము గోచరింపను వాఙ్మయము కూడ నకృత్రిమమయి తాత్త్వికమగును. తాత్త్వికులయు, సాత్త్వికులయు దివ్యవిజ్ఞానము లిందుకు తార్కాణము. "తత్త్వమసి" యిందుకు ప్రమాణము,

[ఆంధ్రపత్రిక
26-12-1943
తెలుఁగు మెఱుఁగులు
1948 : ప్ర. ము
1960 : తృ. ము]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రెండవ అధ్యాయము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రకవిత - పురాణయుగము

నన్నయ్య తిక్కనలు

1.0 పురాణముల రచనము, ఆ రచనముల చెల్లుబడి ప్రబలముగా సాగిన కాలఖండమును పురాణయుగమని వర్తమానులు వ్యవహరించు చున్నారు. అటువంటి కాలఖండములను యుగము అనుటకంటె శకము అనుట వ్యవహారార్థానుగుణ మనుకొందును. ఇట్లు మార్చిన పురాణశకము, ప్రబంధశకము అని కాని, మఱొకవిధమున కవులనుబట్టి పేర్కొన్న నన్నయ శకము, తిక్కనశకము అని కాని అనుట యవును. అందఱును ఇప్పుడు 'యుగ'మనియే వ్యవహరించుచున్నారు గాన నేనును అలాగే అనుచున్నాను. ఆంధ్రపురాణరచన సంస్కృతపురాణరచనానుసారిగా సాగినది గాన ఆంధ్ర రచనా పద్ధతిగ వివరించుటకు ముందు సంస్కృత సంప్రదాయానుస్మరణము కొంత అవశ్యకమే అవును. సంస్కృతపురాణములు తద్రచనాకాలమునాఁటి విద్వద్విజ్ఞానమునకు సర్వస్వములు. వేదములలో సర్వవిద్యలును అంకుర ప్రాయములుగా ఉండఁగా పురాణములలో అవి కొంత కొంత విరివిగా వెలసె ననవచ్చును. "సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ, వంశానుచరితం చేతిపురాణం పంచలక్షణమ్" అని సృష్టివిధము, ప్రళయముల తీరు, రాజ వంశముల చరిత్రలు, మన్వంతరకథలు, మహర్షుల చరిత్రలు మొదలగు వానితో పురాణము లుండునని లక్షణము ఉన్నను, పురాణములలో ఇంకను ఎన్నో దేశచరిత్రలు, వైద్యము, జ్యోతిషము, నీతి, ధర్మ కామశాస్త్రములు, వ్యాకరణాలం కారసాహిత్యాదిశాస్త్ర సంప్రదాయములు మొదలయినవి కొంత కొంత సంగ్రహము గాను, కొన్నిచోట్ల విరివిగాను కూడ వర్ణితములై ఉన్నవి. అగ్ని పురాణములో వ్యాకరణము, వైద్యము, జ్యోతిషము మొద లయిన వెన్నియో ఉన్నవి.

1.1 ఇట్టి పురాణములు సంస్కృతభాషామాత్ర పరిజ్ఞానము గల జన సామాన్యమునకు కూడ అర్థము కాఁదగినట్లు సులభభాషలో, ప్రాయికముగా సులభమైన అనుష్టుప్ఛందస్సులో తేలిక వాక్యాన్వయములతో తేటగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉండును. వ్యాసులవారి రచనలలో తఱచుగా 'చ, వై, తు, హి' అని పాద పూరణపు పొల్లుపదము లున్నవి అనికూడ పండిత పరిహాసమున్నది. పురాణ సామాన్యరచన ఇట్లు వుండు ననుట సంగతమే కాని, కొన్నిపట్లు పురాణముల లోనివే, సంప్రదాయపరిజ్ఞానము లేనిచో ప్రౌఢ పండితులకు కూడ కొఱుక రానికొయ్యలు, ఉక్కుసెనగలు అనఁదగినవిగా ఉన్నవి. పురాణములలోని కెల్ల భారత భాగవతములు, రామాయణము ప్రధానమయినవి. రామాయణ భారతములు కావ్యేతిహాసము లనఁబడినను, పురాణములనికూడ సామాన్య వ్యవహారమున్నది. తెలుఁగున అన్ని పురాణములే అనుచున్నాము. ఉక్కు సెనగలు పై మూఁడు గ్రంథములలోను, అందులో మఱీ భారతమున ఉన్నవి. భారతములోని ఉక్కు సెనగలకు వ్యాసఘట్టములని పేరు. మచ్చు చూపుచున్నాను:

పశ్యః పశ్యతి పశ్యన్త మపశ్యన్తంచ పశ్యతి,
అపశ్యస్తావఁ (త్వాద?) చక్షుష్ట్వాత్ పశ్యాపశ్యాన పశ్యతః.
చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవచ,
హూయతేచ పునర్ద్వాభ్యాం స మే విష్ణుః ప్రసీదతు.

1.2 ఈ విధముగా పురాణములు వివిధవిషయములతో, వివిధ రచనలతో అరణ్యములవంటివై ఉండును. అర్వాచీనము లయిన కావ్యనాటక ప్రబంధాదిరచనలు పురాణారణ్యముల నుండి ఉద్ధరించి సేకరించి తీర్చి దిద్ది నాటిన యుద్యానములవంటి వనఁదగును. పురాణములలో కావ్య నాటక ప్రబంధాదిరచనల పొలుపులు సుకుమారదృశ్యములై ఉండునుగాని, కావ్య నాటకాదులలో పురాణ రచనలములలోని శాస్త్రాంశ భీకర దృశ్యము లుండవు. ఇటువంటి సంస్కృత పురాణ ఫక్కి ననుసరించి తెలుఁగు పురాణ రచన వెలసినది. నన్నయ మొదలుకొని శ్రీనాథునిదాఁకఁగల కవుల యాంధ్రగ్రంథరచన పురాణయుగ రచన యనఁదగినది. ఆ కాలమున ప్రాయికముగా ఆంధ్రమున పురాణరచనలే వెలసినవి. కవిత్రయము, మారన, పాల్కురికి సోమనాథుఁడు, భాస్కరాదులు, నాచనసోమన, శ్రీనాథుఁడు, పోతన, సింగన పురాణకవులలో ప్రధానులు పురాణకవిరచనలను గూర్చి ప్రసంగించినప్పుడీ యందఱవిషయమును రావలసినదే అయినను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముందు ముఖ్యులయిన భారత కవిత్రయము వారినిగూర్చి మాత్రమే యిప్పటి నా ప్రశంస.

కవిత్రయమువారు దైవభక్తులు, సదాచారులు, వుత్తమ పండితులు. కవితాతపస్సు చేసి వారు కాంక్షితార్థములను అంతర్వాణియుద్బోధములతో నందుకొని కావ్యరచన కావించినారు. తర్వాతి సర్వాంధ్ర కవి కుటుంబములకు వారి పవిత్ర వాక్కులు నిక్షేపములయి దొరకిన బంగారునక్కులు. ఆ ముగ్గుర రచనములతో తెలుఁగున వెలసిన మహాగ్రంథము భారతము. దాని మూలగ్రంథము అయిదువేలయేండ్ల నాఁటి భారతీయ చరిత్రాంశములు గల పాత గ్రంథమే అయినను సర్వప్రపంచమునను దాని పలుకుబడి చెల్లుబడి అగుచునే యున్నది.

వ్యాసకృతిని మహాభారతమును నన్నయ యిన్ని లక్షణములుగలదానినిగా వర్ణించినాఁడు:

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
పరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిఁ గొనియాడుచుండ

వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు."

ఇట్టి సంస్కృత భారతమును,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకవితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగున౯ మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగాన్."

నన్నయ పై తీరున సర్వశాస్త్రార్థకలితముగానే కాక భారతమును ప్రసన్నరచనతో మహాకావ్యలక్ష్యముగాఁ కూడ తెనిఁగించిన ట్లేర్పడును. కనుకనే యాతనికి వాగనుశాసన బిరుదము కల్గెను. సంస్కృతమున పురాణములు, కావ్యనాటకాదులు అన్నియు వెలసినపిదప ఉపక్రమించిన దగుటచేత తెలుఁగుపురాణరచన తనలోనే సంస్కృత సర్వకావ్యరచనా చమత్కారములను ఇముడ్చుకోవలెనను యత్నముతో సాగినది. ప్రాచీనుఁడు. గణపతిదేవుఁడనుకవి "ఆంధ్రకావ్యపథము దీర్చిన నన్నయభట్టుఁ గొలుతు" నన్నాఁడు. నన్నయభారతము చదివినచో అందులో భాషాకవితాలక్షణ పరిష్కారములను ప్రయత్నపూర్వకముగా నన్నయ లక్ష్యీకరించినట్లు కాననగును.

"పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణు నట్లు వాసిగధరామరవంశ విభూషణంబు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁ డీ కృతి కిష్టుఁడున్ సహా
ధ్యాయుఁడునై నవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగాన్."

ఈ పద్యము ద్వితీయ తృతీయ చరణములందు నారాయణ పదము "ర" యతి ఖండాఖండములగా స్వరవ్యంజనములతో రెండు దెఱఁగుల నుంచుట లక్షణ విశేష నిరూపణార్థముగదా! ఇట్టి వెన్నేని విశేషాంశములను నన్నయ రచనలో చూపవచ్చును.

శరత్సమయమున సరళముగా సమప్రదేశమున ప్రవహించు తెలినీటి తేటవాకవలె నన్నయరచన సుప్రసన్నమై, చాటుమాటులు లేనిదై, కరతలామలకముగా తనలోఁగల సర్వార్థములను ప్రవ్యక్తముగా గుర్తింపనిచ్చునదై, సుఖప్రవేశమై, సుస్వాద్యమై నిర్వక్రగతితో నెగడుచుండును. వ్యాస భారత రచనలో 'చ, వై, తు, హ' లున్నట్లు అక్కడక్కడ నన్నయ రచనలో 'మానుగ, పాయక, పర్వగ, ఇమ్ముల' మొదలగు పాదపూరణపు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొల్లు పదములుండును. గ్రంథగ్రంథులు నన్నయరచనలో నుండవు. నన్నయ్యశయ్యవంటి పురాణశయ్య - కావ్యగౌరవముకలది - భాగవతకర్త కొక్కనికేతక్క మఱి యితర పురాణయుగాంధ్రకవుల కెవ్వరికి దక్కలేదు. నన్నయ్య పురాణశయ్యాసౌభాగ్యమునకు లక్ష్యము నొక్క గీతపద్యమున గుర్తింపవచ్చును:

"ఎల్లవారు నెఱుఁగ నొల్లని ధర్మువు
బేల నీకుఁ దెలుప నేల వలసె?
చిఱుతవాని కింత దఱుసంటి పలుకులు
నన్నె వృద్ధజనము లున్నచోట ?"

రాజసూయమహాధ్వరము జరుగునపుడు భీష్ముఁడు ధర్మరాజుతో 'నఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు' మనఁగా శిశుపాలుఁ డుపాలంభన పరుండయి యధోక్షజు నాక్షేపించుచు ధర్మరాజు కిట్లనుచున్నాఁడు:

"అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టాచార్యులార్యుల్ మహీదివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయ దుర్వ్యవసాయంబునఁ గృష్ణు గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీయవివేకం బెరిఁగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే?"

ఈ పద్యమున ననుప్రాసము, నక్షరసౌభాగ్యము, శయ్యయొయ్యార మునుమాత్రమే కాక దాశార్హుఁడు = పల్లెలు బోయలు మొదలగువారికిఁ దగినవాఁడు, వారిలో విహరింపఁదగినవాఁడు, లేక భృత్యతకు, నౌకరీకి తగినవాఁడు శ్రీకృష్ణుఁడు పూజార్హుఁడగునా యనియు నాక్షేపము. దాశార్హ పదమునకు రెండర్థము లున్నవి. పల్లెకారీలకుఁ దగినవాఁడనియు. నౌకరీకి దగినవాఁడనియుఁ జెడ్డయర్థము. దశార్ణదేశభవుఁడని మంచి యర్థము.

"ఇతనికిఁ గూర్తురేని ధన మిత్తు రభీష్టములైన కార్యముల్ మతి నొనరింతురిష్టుఁడని మంతురు గాక మహాత్ములైనభూపతులయు విప్ర ముఖ్యుల నభన్ విధిదృష్టవిశిష్టపూజనాయతికి ననర్హునర్హుఁడని యచ్యుతు నర్చితుఁజేయఁ బాడియే?"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక్కడ ధర్మరాజుతో భీష్ముఁడు అచ్యుతుఁ బూజింపుమనునప్పు డుపయోగించిన యచ్యుతపదమునే శిశుపాలుఁడు వెక్కిరింపుగా నర్థాంతరమునఁ బునఃప్రయోగము చేసినట్లు నన్నయభట్టు రచించి గంభీరభావము గల్పించినాఁడు. అతఁడు విధిదృష్టవిశిష్టపూజనాయతికి ననర్హుఁడు. ఇట్టి యాయ చ్యుతుని నర్చితునిఁజేయుట పాడిగాదు అని శిశుపాలుని భావము. భీష్ముని పలుకులలోని యచ్యుతపదమునకు ఆ చ్యుతుఁడు అని యర్థాంతరము గలుగుట ప్రాచీన వ్యాకరణసంప్రదాయ సమ్మతము. ఈ పద్యమునఁగూడ నక్షరరమ్యత, యనుప్రాస చమత్కృతి దైవారియున్నవి. ఈ శిశుపాలకథా ఘట్టమెల్ల శబ్దార్థగాంభీర్య కలితమై రసోత్తరమై యున్నది.

"అవమాన్యున్ సభలోన మాన్యుఁడని సౌహార్దంబునం గౌరవస్థవిర ప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి రయ్యవివేకాస్పదులైన పాండవులు మోహాంధుండు భీష్ముండుఁగేశవఁ నీవుం గడగుండు నాకు నెదురై సంగ్రామరంగంబునన్.'

ఇందు నాల్గవచరణమున 'కే' యనికేక, 'శవ నీవుంగడగుండు' అని నింద. ఇట్టిచోట్లనెల్లఁ బలుకుబడిలోనె యర్థవిశేషములు పదచ్ఛేదభేదము చేఁగల్పించి గంభీర భావభేదములకు ఝుడితిస్ఫూర్తి గూర్చుట నన్నయ నైపుణ్యము. కారకాన్వయ కౌటిల్యముతో నర్థవిశేషములను సాధించుట నన్నయ తీరు కాదు.

భారతకథోపాఖ్యానాదులలోని పాత్రముల భావములు, సంభాషణములు చాల ప్రాఁతకాలపువి గావునఁ గొన్ని చోట్ల వ్యంగ్యవక్రోక్త్యాదికవితా కౌటిల్యములు లేనివిగా, నమాయికములుగా నున్నవి. అట్టివానిని తెలిఁగించుటలో నన్నయ తిక్కనలు విభిన్నరీతుల నాశ్రయించిరి. నన్నయ తననాఁటికే వెల్లివిరిసియున్న వయినను కావ్యాలంకారశాస్త్ర సంప్రదాయముల నంతగాఁ జొప్పింపక మూలగ్రంథము గ్ధతామాధుర్యములఁ గాపాడినాఁడు. తిక్కన యాయాపాత్రములఁ దననాఁటి వానినిగా గొన్నిచోట్లఁ గావ్యౌచితీనిర్వహణార్థమై మార్చుకొని తన నాఁటి కావ్యాలంకారశాస్త్ర సంప్రదాయముల కనుగుణముగాఁ గథానిర్వహణము కావించినాఁడు. నన్నయ రచన మూలాను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సారియై, మౌగ్ధ్యమాధుర్యమనోజ్ఞమై, యార్షమై యున్నదనుట కొకటి రెండు దాహరణములు:

నన్నయ శకుంతలోపాఖ్యానరచన కావ్యాలంకారౌచితీరీతిని(జూడ(గా గ్రామ్యతాదోషజుష్ట మన(దగియుండును. వ్యాసు(డే దాని నిట్లు రచియించినా(డు. అమాయికములైన సత్యకాలపు మునిపల్లెల పిల్లల ముగ్ధమధుర సంభాషణములను మూలానుసారముగా తెలి(గించుటే లగ్గని నన్నయభావించి యట్లు రచించియుండును. తిక్కన యగుచో నాపట్టుల వ్యంగ్యవక్రోక్తి కల్పనాశిల్పముల నెట్టుకొల్పి నవ్యకాలికరీతిని కావ్యశయ్యతో కల్పించి యుండెడివా(డేమో! నాటక రూపమున నా కథనట్లే కాళిదాసు మార్చివేసి నా(డు కదా!

"ఏను కచుం డనువా(డ మహనీయమనమన్వితు(డ బృహస్పతిసుతు(డన్" అని చెప్పుకొని శుక్రుని శుశ్రూషించిన కచుని శుక్రపుత్రియైన దేవయాని ప్రేమించి యిట్లు కోరినది: "నీవును బ్రహ్మచారివి వినీతు(డ వేనును గన్యకన్ మహిదేవకులావతంస రవితేజ వివాహము నీకు నాకు మున్ భావజశక్తినైనయది పన్నుగ నన్నుబరిగ్రహింపు సంజీవనితోడ శుక్రు దయ జేయుము నాకు(బ్రియంబునావుడున్."

అని కోరి కచునిచే నిరాకృతయై దేవయాని దైవకృతముగా(బిదప యయాతిమహారాజుపాణి గ్రహణము కావింప(గా నన్న తీరు మౌగ్ధ్యమాధుర్య భాసురమేకాని నవ్యకావ్యౌచితీరీతిని రోతగొల్పునదే. ఇట్టి సందర్భముననే, అన(గా మాయావటు(డు పార్వతిని భార్యవు గమ్మని కోరు సందర్భమున శృంగారరసభావశ్లేషచమత్కార గర్భితముగా-

"కియచ్చిరం శ్రామ్యసి గౌరి, విద్యతే
మమాపి పూర్వాశ్రమ సంచితం తపః,
తదర్ధభాగేన లభస్వ కాంక్షితం
వరం త మిచ్ఛామి చ సాధు వేదితుమ్"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని కాళిదాసు రచన కావించినాఁడు. శ్రీనాథుఁడు దానిని దెలిఁగించుటలో కాళిదాసుమార్గమును వీడనాడి అలంకారశాస్త్ర సంప్రదాయవాసనల నెఱుఁగనివారినిగానే పార్వతీవటులను భావించి నన్నయచ్ఛాయనే అనుగమించినాఁడు.

"ఏనును బ్రహ్మచారిఁ దరళేక్షణ నీవును గన్య వింతకా
లానకు నీకుఁ బెండ్లియె ఫలంబగునేని విచారమేల స
మ్మానముతోడ నన్ను మునిమాన్యవివాహముగమ్ము లెమ్ముకా
దేని తపంబులోని సగమిచ్చెద మాను తపోభిమానమానమున్."

నన్నయ భారతభాష నాగమసూత్రస్మృతి భాషనుగా భావించుచోఁ దిక్కనభాషను గాళిదాసకావ్యభాషనుగాఁ బరిగణింపవచ్చును. నన్నయ దొకఋషిమార్గము. తిక్కన దొక రసమార్గము.

"విలువిద్య నొరులు నీక
గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు నని మున్
బలికితిరి నాక కా దీ
త్రిలోకముల కధికుఁ జూచితిమి యొకయెఱుకన్."

ఈ పద్యమున నాల్గవ చరణము తొల్తి జగణపు టుయ్యాల యూపులో తర్వాతికవు లనేకులు హాయిగా ఊగసాగినారు. ఈ యూపులో పింగళి సూరన్న ఎట్లూఁగినాఁడో గుర్తింపుడు:

"అపు డించుక తడ వన్యో
న్యపాణి సంస్పర్శ సంభృ తానంద స్తం
భపరీతాత్మత నుండిరి;
ప్రపంచమంతయును మఱచి పతియుఁ సతియున్."

శ్రీనాథ పెద్దనాది కవీశ్వరులు చంపకోత్పలాది పద్యములలో మూఁడు నాల్గు చరణముల నొక సంస్కృత సమాసపు జాడింపున జాడించి హాయి హాయి మనిపింతురు. ఈ హృద్య పద్యవిద్యకు నన్నయ ఆద్యగురువు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అలయకధర్మశాస్త్రములయందుఁ బురాణములందుఁ జెప్పను
త్పలదళనేత్ర విందుమ యపత్యము మేలని కావునన్ యశో
నిలయులఁ బుత్రులం బడయు నీ కొనరించెద సంగతాంగుళీ
దళవిలసన్మదీయ కరతామరసద్వయయోజితాంజలిన్."

"అనుపమ కార్ముకాది వివిధాయుధ విద్యలయందు గోవిదుం
డనఁగ నజయ్యుఁడై పరగు నర్జునుఁ బోలఁగ నన్యు లెందు లే
రను జనఘోష ముచ్చరితమయ్యె మరుచ్చలితోచ్చవీచి ని
స్వనముఖరాబ్ధివేష్టితవిశాలమహీవలయాంతరంబునన్."

"అతులవిభూతితో మణిమయాభరణద్యుతు లొప్పఁగా శత
క్రతుఁడు శచీసమేతుఁడయి కాంచనచారువిమానమాలికా
గతదివిజోత్తముల్ గొలువఁగా గొలువుండు వరాప్సరోంగనా
యతవిలసత్కటాక్షకుసుమార్చిత సుందరవక్త్రి చంద్రుఁడై."

రసము, భావము, రీతి అనునవి మూఁడును ముప్పిరిగొని, జిగిబిగు
లతో ముచ్చట్లుగొల్పు పద్యములు ఇవి మూఁడును చూఁడుడు:

"ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా
నకతరలీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖమై
భ్రుకుటిలలాటదేశమునఁ బొల్చె ద్రికూట తటి త్రిమార్గగా
నుకృతి బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్."

"ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు నిజోరు దేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాత భ
గ్నోరుతరోరుఁజేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్."

"పిలువంగఁబడక సభలకు,
బలిమిం జని పలుకు పాపభాగుల లోకం
బులకు జనవేడి పలికెదు;
పలువా ! యెఱుఁగవు పరాత్మపరిమాణంబుల్."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ క్రింది పద్యపు కడపటిచరణములో విశేషణములు విశేష్యమునకు తర్వాత నుండి ఒకదానికంటె నొకటిగా గుణోత్తరములై అవిమృష్టవిధేయాంశమనియు, పతత్ప్రకర్షమనియు నెన్నికగన్న కావ్యదోషములకు వ్యతిరేకముగా కావ్యగుణోదాహరణతను కల్పించుచున్నవి.

"సుతజననోత్సవంబున విశుద్ధయశుండు యుధిష్ఠిరుండు సం
భృతహృదయప్రమోదుఁడయి పెంపున నిచ్చె సువర్ణభూషణ
ప్రతతులు గోధనాయుతము బ్రాహ్మణముఖ్యులకున్ నిరంతర
వ్రతులకు వేదవేదులకు వారిజసంభవునట్టి వారికిన్."

ఈ విధముగా నన్నయరచనలో పలుపోకల గుణవిశేషములను పరిగణింపవచ్చును. ఆయనరచన రసధారల యూటపట్టు. ఆంధ్రకవుల కాతఁడు "మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః!"

నన్నిచోడాది కవీశ్వరు లాయన రచనల నెన్నిటినో పుడికి పుచ్చుకొన్నారు నన్నయ నన్నిచోడుల పద్యము లివి రెండు చదువుఁడు,

"తడఁబడఁబడియెడు రవమును
బడి కాలెడు రవము గాలిపలుదెఱగుల వ్రి
స్సెడురవమును దిగ్వలయము
గడుకొని మ్రోయించె నురగకాయోత్థితమై."

"గిరిసుతమై కామాగ్నియు;
హరుమై రోషాగ్నియుం దదంగజుమైను
ద్ధురకాలాగ్నియు రతిమై
నురుశోకాగ్నియును దగిలి యొక్కట నెగసెన్"

తిక్కన, శ్రీనాథుఁడు, పోతన, పెద్దన మొదలగు మహాకవులు నన్నయరచనములలోని పలుకు పొలుపులను పెక్కింటిని బరిగ్రహించినారు. నన్నయరచన ధర్మోదాత్తము. కర్ణాటకములోని జైనభారతపుటలజడి తెలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సినవాఁడు గనుక తెలుఁగునాఁటిలో వ్యాసభారత ధర్మవిశేషములను వెలయిం పఁగోరి అతఁడు కావ్యరచనకు కడఁగినాఁడు.

భారతము నీతి శాస్త్ర గ్రంథమని ప్రఖ్యాతి గన్నది. నన్నయ భారత భాగములోని నీతిపద్యములు రీతిహృద్యములు; సౌలభ్యసుందరములు. తెలుఁగు కవులందరిలో వచన రచన నన్నయ చేసినట్లు మరియే కవియు చేయలేకపోయినాఁడు. ఆ వచనరచనలో పలుకుబడి బహుమనోహరము. వాక్యములు సులభమయినవి. అనుప్రాసపు ధట్టింపు లందుండవు. వచన ఖండముల పరిమాణము మితమై పులకండములఁ బోలియుండును. ప్రపంచ భాషలలో ఆంధ్రభాషకు, ప్రపంచ కవితలలో ఆంధ్రకవితకు ఏదేని అర్హ స్థానము అబ్బఁదగిన యోగ్యత కలదేని ఆ యోగ్యతావిస్తర భార మెల్ల నన్నయ భారతభాగమే మోయవలసినదగును. ఆ పుణ్య మూర్తికివందనము. ఆయన కాశ్రియమిచ్చి పోషించిన చాళుక్యరాజరాజు కీర్తిపతాక చిరస్థాయి!

"మదమాతంగతురంగముఖ్యపదసంపన్నుండు నన్నయ్య తొ
మ్మిదినూరేండ్లకు ముందుజూపెకవితోన్మేషంబు సర్వాంధ్రిసం
పద పెంపొంద చళుక్యవల్లభుఁడు సామ్రాజ్యాభిషిక్తుండుగా
నది నాబోటికినేఁటికబ్బునటె వ్యాఖ్యానింప నాఖ్యానమున్."

నన్నయ్యతర్వాత భారత రచనమును బూరించిన తిక్కన సోమయాజి నన్నయరచనమును దిన్నగా నెఱిఁగిన వాఁడే అయినను నన్నయ్య శయ్యా సౌభాగ్యమును, ప్రసన్నతను పాటింపక, సంస్కృతభారతపు వ్యాసఘట్టము లను బోలిన గ్రంథగ్రంథుల నధికముగాఁగూర్చి కవితామర్మముల నధిక ముగాఁ జొప్పించి పురాణరచనాసౌలభ్యమును గోల్పడినాఁడు. వర్షానమయ మున నొడుదుడుకు నేలలనుండి సుడులు దిరుగుచు మడుగులు మాటులు గలిగి లోఁతు తేలియనీయని కలకనీటి పోటుతో ప్రతిపదమును జాగ్రత్త వహించినఁ గాని దాఁట వీలుగొల్పని వక్రగతులతో సాగు గంభీరనదీ ప్రవా హముపలె తిక్కనరచన మప్రసన్నమై వెనుకను ముందుకుఁ దిరుగు వాక్యావ వాక్యములయు. కారకాన్వయములయు కౌటిల్యముతో ఇఁక నిందేమి విశే షము గలదో యని సహృదయులు ప్రతి పదము సందేహముతో ఆచియాచి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చూచిచూచి మఱి చదువవలసిన తీరున చిక్కులుగొల్పుచు జిగిబిగితో నుండును. అది పురాణ ఫక్కికాదు. మఱి దివ్యకావ్యఫక్కి. కవితామర్మ మిందెక్కువ. వక్రోక్తులు, అర్థా లంకారములు, వ్యంగ్యము నిందధికముగా నుండును. ఇందుకు లక్ష్యము నొక్క గీతపద్యము నుదాహరించుచున్నాను. విరాటపర్వ ద్వితీయాశ్వాసమున కీచకుఁడు ద్రౌపదిపై తమక మాఁపుకొనలేక నీచవాంఛను వావిడిచి వెల్లడించినాఁడు. అప్పు "డబ్బోటి కలుషించియు దుర్వారంబైన పరిభవవికారంబు దోఁపనీయక వెరవుతోడన తప్పించుకొన వలయునని" యిట్లన్నది

"చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడుఁ
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ
వట్లుఁ గాకయు హీనవంశాభిజాత
నైన పతివత్ని నగు నన్ను నడుగఁదగునె?"

—"అన్నా! కీచకా! సత్పురుషులు పరస్త్రీల నిట్లు కోరవచ్చునా? అంతేకాక ఆఁడుతోడుగలవాఁడు మఱీ జాగ్రత్తగా నుండవలెనుగదా! నీవు సజ్జనుఁడవు, సుదేష్ణవంటి యాఁడుతోడుగలవాఁడవు, నీవిట్టి చెట్టపలుకులు పలుకరాదే! ఇట్లు కోరఁగూడమికి నీ యోగ్యతాంశము లివి రెండే కాదు. మఱి నా యయోగ్యతాంశములును రెం డున్నవి. నేను హీనవంశసంజాతను, మగనాలను; ఉన్నత వంశము గర్వించు ననియు, ఆఁడుతోడు చెడనాడు ననియు, అక్కకు కూడ నీగతి పట్టవచ్చుననియు, నీ విషయమున నీవు వెఱవవలెను. నావిషయమునఁగూడ, నీచజాతిదని, మగఁ డెఱిఁగిన దండించు నని నీవు వెఱవవలెను" అని సామాన్యముగాతోఁచు బాహ్యార్థము. ఇక్కడ లోఁతయిన యర్థాంతరము నున్నది.

"సజ్జనుఁడు, ఆఁడుతోడుగలవాఁడు ఇట్టి మాటలాడఁడు. ఇట్టి చెట్టలాడు చున్నావు గాక నీవట్లుగాక దుర్జనుఁడవు, ఆఁడుతోడులేనివాఁడవు నయితివి! 'నాకు సజ్జనతా పేక్షలేదు, ఆఁడుతోడుకలిమి నేను పాటించువాఁడను గాను!' అందువేమో! (సుదేష్ణ వీనికి తగిన యాఁడుతోడే: తన పాడునడత కామెను గూడ తోడుపఱుచుకొన్నాఁడుగదా!) అయితే నీవట్లగుదువుగాక! హీన! ఓరి నీచుఁడా! వంశాభిజాతను! పవిత్ర క్షత్రియవంశజాతను! యజ్ఞాగ్ని సంభూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తను! అయిన పతివత్నిని, అఖండపరాక్రములయిన భర్తలుగలదానను! నన్ను నటరా నీవు కోరునది! నా వంశపు యోగ్యతను, భర్తల యోగ్యతను దెలియక వదరుచున్నావు. ఈ రెండు యోగ్యతలు నిన్ను నాశపఱుపఁగలవురా" అని యర్థాంతరము!

పాఠకులు పై రెండర్థములలో కీచక సైరంధ్రీ పాత్రములను జూచి సాధారణముగా తొలి సువ్యక్తార్థమును సైరంధ్రిలో డాఁగియున్న ద్రౌపదీ పాత్రను గుర్తించి లోఁతుగా రెండవ యంతరార్థమును గ్రహింపఁ గల్గుదురు. లోఁతుగా యోచింపఁ జాలనివారు తొలియర్థమునే గ్రహింతురు. కీచకుఁడు మదనపిశాచగ్రస్తుఁడై యాత్రపాటుతో నున్నాఁడు గాన తొలియర్థమునే. గ్రహింపగల్గెను. ద్రౌపది తాను భావించునది రెండవ గంభీరార్థమునే! తిక్కన యీ రెండర్థముల ననుగత పఱిచి శ్లేష ధ్వన్యర్థచమత్కారముతో పద్యమును గూర్చినాఁడు. పయి పద్యమున 'అయిన పతివత్ని' ననుచోటను, 'అడుగఁదగునె' అనుచోటను అర్థ విశేషములున్నవి ('అయిన యింటివారు' ఇత్యాదులు చూచునది) అయిన=చెల్లివచ్చిన, ప్రఖ్యాతిగాంచిన - భర్తలు గలదాననని (అటువంటివారి విషయమై అడిగేదేమిటి-ఇత్యాదులు చూచునది.), ప్రశ్నస్మరణమే చేయరానిదాననని అర్థవిశేషములు ముద్రణములం దీపద్యమిట్లున్నదిగాని యిందు తిక్కనకూర్పు కొంత మార్పుచెంది ఉండునను కొనుచున్నాను. 'అట్లుఁగాకయు, అనుచోట అట్లు తర్వాతి సమచ్చయవు టరసున్న- 'కాకయు' అనుచోటి 'యు' స్వారస్యమును సంపాదింపఁగల్గియే యున్నది. ఇఁక 'యు' వ్యర్థము. తిక్కన్న "అట్లుఁగాకయో హీన" అని రచన చేసియుండును. తొలి యర్థమున "అట్లుఁగాక-అయో-హీనవంశాభి జాతను అనియు, రెండవ యర్థమున అట్లుఁగాక- ఓహీనఅనియు భేదము నసిపడును.

"అని వీడఁగఁ బల్కిన న
మ్మనుజాధముఁ డంతఁ బోక మదనోన్మాదం
బునఁ దన్ను నెదిరి నెఱుఁగక
వనితకు నిట్లనియెఁ గారవంపుఁ బలుకులఁ."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తర్వాతి యీ పద్యములోఁ దన్ను నెదిరిని—పాద ప్రహారముచేయు దానిని ద్రౌపదిని అనియు కవి పొసగించినాఁడు. ఇట్లు తిక్కన భారతపురాణ రచనమున ప్రబంధ ఫక్కితో వక్రోక్తిచమత్కృతులు, శ్లేషభంగులు, అనన్వయాభాసములు, గడుసు పొసగింపు కూర్పుతీర్పులు లెక్కకు మిక్కిలి యయియున్నవి. అత్యంత శ్రద్ధతో పరిశీలింపఁగా ఒక్క విరాటపర్వ ద్వితీయాశ్వాసముననే ఎన్నో శబ్దార్థ చమత్కారములు ప్రస్తుతపు ముద్రణములలో, వ్రాఁతలలో అపరిశీలితములుగా చెడిపోయినవి, చక్కఁబఱుపవలసినవి, గాన వచ్చినవి.

తిక్కన దేసిపలుకుల మెలపులతోఁ గవితామర్మములతో సంస్కృతమున వ్యాసుఁడు చొప్పించినట్లు పెక్కుచోట్ల గ్రంథ గ్రంథులను చేర్చినాఁడు.

"గురుని మాట సరకుగొనమి దుశ్శీలత
పిట్టఁ బుడుక గోరుఁ బిసుకఁ ద్రుంపఁ
గరవ మరుగు టుదయకాలాస్తమయ సమ
యముల భానుఁ జూచు టాయువడఁచు."

ఈ పద్యమునఁ గవితామర్మమున్నది. క్రొత్త వారీపద్యమునర్థమును గుర్తింపఁజాలరు. వృద్ధ విద్వాంసుల మూలముననో, సంస్కృతమూలము మూలముననో గుర్తింపవలసినది దీనియర్థము. 'లోష్టమర్దీ తృణచ్ఛేదీ నఖఖాదీ చయోనరః' అను మూలమున కిది తెనుఁగు. పిట్ట, పుడుక, గోరుఅనఁగాలోష్టము తృణము నఖము అనువానిని పిసుకుటకును, త్రుంపుటకును, కఱచుటకును అలవాటుపడుట ఆయువును హరించునని యర్థము. తిక్కన దీనిని 'బెడ్డ చిదుప. పుడుక విరువ, గోరు గరవ, మరుగుటుదయ' అని సులువుగాఁ గూర్పవచ్చును. అయినను నిందు యథాసంఖ్యాలంకారము చేర్చి పిట్టపుడుక గోరు అనుచోఁ బిట్టను బట్టుకొనఁగోరునట్టి యని యనన్వితారాభాసచిత్రమును గల్పించి పాఠకులను లోఁతుయోచనకుఁ బాల్పఱచినాఁడు. మఱియు,

"అనిన నలు గాలివాన గోవును నశేష
శబ్దముల మంత్రమును లోహజాతిఁ గాంచ
నమును మనుజుల విప్రుండు సమధికత్వ
భాజనము లంద్రు వేదప్రపంచవిదులు."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుఁగుకూర్పు మఱుఁగు తెలుఁగనివారైనచోఁ, ప్రౌఢ సంస్కృత పండితులు సైతము ఈ పద్యమున నలుఁడేమిటి, గాలివాన యేమిటి అనన్విత ముగా నున్నవేయని యంగలార్తురు. తిక్కన యిక్కడఁ జతుష్పాత్తులనికాని, నాలుగుకాళ్ళ జంతువులని కాని సులువుగా ననలేఁడా? అనఁగలఁడు. కాని నలుఁడు, గాలివాన అన్న ప్రసిద్ధ పదముల ఝడితిస్ఫూర్తి కలిగి పాఠకుల కన్వయము తోఁచి లోఁతైన యోచనతో తదాభాసచిత్రము గోచరించునట్లు కవితామర్మ మిక్కడఁ గల్పించినాఁడు.

సంస్కృత భాగవతమును బలుతూరులు పురాణము చెప్పిన యొక ప్రౌఢ సంస్కృత పండితుఁడు ఆంధ్రభాగవతమును గూడఁ బురాణము చెప్పుచు 'ఓదముత్రవ్వి జీవనపు టోలమునంబడి' అన్న పోతన్న పద్యమున కర్థము చెప్పఁగుదురక "యిక్కడఁ బుటోల శబ్దమున కర్థము తెలియలేదు. సంస్కృతాంధ్ర నిఘంటువులలోఁ బటోలపద మున్నదికాని పుటోల పదము లేదు. ఇఁదేదో తప్పున్నది" అని చెప్పెనఁట! తెలుఁగు మఱుఁగులెరిఁగిన సహృదయుఁ డొకఁడు "మదపుటేనుఁగు వంటి దీపదము. మదము, ఏనుఁగు సమసించినట్లు జీవనము, ఓలము అను పదములు సమసించినవి. ఓల మనఁగా నర్థ మిది" యని చెప్పి యా సంస్కృత పండితునకు సహాయపడెనఁట! ఇది యెనుబది యేండ్ల క్రిందట నిజముగా జరిగినకథ! మా నాయనగారు చెప్పఁగా విన్నాను.

"నీతల పేను గంటి నొకనేర్పున శౌరికి లంచమిచ్చి సం
ప్రీతుని జేసి కార్యగతి భేదము సేయఁగఁ జూచె, దింత బే
లైతిగదే సుమేరు సదృశార్థముఁజూచియు బార్థుఁ బాయునే
యాతఁడు క్రీడిభక్తియును నచ్యుతు పెంపును నీ వెఱుంగవే?"

శ్రీకృష్ణుఁడు రాయబారము వచ్చినపుడు విదురుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించు సందర్భములోని పద్యమిది. ఇచ్చట నీతలఁపును నేనెఱుఁగుదును అని ముఖ్యార్థమే కాక అది నీ తలలోని పేనువంటిదిసుమా అను నర్థాంతరముకూడ నున్నది. ఇక్కడఁ దిక్కన యెఱిఁగియే తలపేను శబ్ద చిత్రమును గూర్చినాఁడు. ఇటువంటి శబ్దార్థ చిత్రములను దిక్కన్న రచన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున నెన్నింటినేని లెక్కింపవచ్చును. ఆమధ్య నెల్లూరు తిక్కన వర్ధంతి సభలోఁ దిక్కన రచనా విశేషములను గూర్చి చర్చ జరిగినట్లు పత్రికలలోఁ జదివితిని. విరాట ద్వితీయాశ్వాసమున సైరంధ్రిని గూర్చికీచకుని ప్రలాపములలోఁ దిక్కన యశ్లీలార్థభూషితముగా 'దీనిఁ బొందఁగాంచు తెఱఁగు నా కెయ్యది యొక్కొ' అని కూర్చెననియు నది కీచక పాత్రోచితమని యొకరును 'దీనిఁబొంద' యనుచో నశ్లీలార్థము పరిగణింప నక్కరలేదని మరికొందఱు ననిరఁట! ఇప్పుడు ప్రచారములో నున్న తిక్కన విరాటపర్వముద్రణములా నడింటలోఁ బాఠ మిట్లే ముద్రితమైయుండుటచే నీయనర్థము వచ్చినది. తిక్కనతే రచన మిట్లుండదు. ఈపద్యము పైనాలుగు సీసచరణములందును దీని జన్మంబున, దీనివల్లభుఁడు, దీనినామాకృతి, దీని వసించుటయని సైరంధ్రీవాచకసర్వనామపుష్ఠీసమానగతమైయుండఁగూర్పి గీతిలో మాత్రము 'దీనిఁ బొంద' అని వ్యస్తముగా, నపక్రమముగా, నశ్లీలస్ఫోరకముగాఁ దిక్కన కూర్పఁడు. కాని ఇక్కడఁ గూడ "దీనిపొందుఁ గాంచు తెఱఁగు నా కెయ్యది యొక్కొ" అనియే యుండవలెను. విరాట పర్వ ముద్రాపకులెల్లరును "దీనిఁబొంద" యనియే గ్రహించుట యనుశోచనీయము. తిక్కన బొందను ప్రయోగింపలేదు. లేఖకులు, ముద్రాపకులు ప్రమాదపుబొందఁబడిరి. విరాటపర్వ ద్వితీయాశ్వాసముననే తిక్కనకవితా మర్మములును, బదలాలిత్యములును, గడుసరికూర్పు నేర్పులును నెన్నో యప్రౌఢులైన లేఖకపాఠకముద్రాపకుల మూలమునఁ దార్మారై కానవచ్చినవి. దేసి తెలుఁగు మఱుఁగులెఱింగిన ప్రౌఢాంధ్ర పండితులుగాని గుర్తింపరానివగుటచే ననేక పాఠములు తిక్కన రచనలో నట్లు తార్మారైనవి.

"తన్వంగి మవ్వంపుఁ దనులత నెసగెడు
నునుగాంతి వెల్లువ మునుఁగఁబాఱఁ
గినలయాహస్తకెంగేల నేపారు క్రా
మ్మిం చను లేయెండ మిగులఁ బర్వఁ
గమలాస్య ముద్దుమొగంబు లేమెఱుఁగుల
మొత్తంబుపరి చుట్టు ముట్టికొనఁగ
ధవళాక్షితొంగలి తఱచుఱెప్పల చెన్ను
కప్పను చీకటి గవియు దేర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బెగ్గలం బంతకంతకు నగ్గలించి,
యొదవి చెమ్మట, చిత్తంబు సెదరి, యెందు
మెలగఁ దలఁ పేది. యా సింహబలుఁ డనంగు
పట్టి యాడెడు జంత్రంబువగిది నుండె."

ఈ పద్యమునెత్తుగీతియందుఁగల యసమాపక క్రియల నాల్గింటిని సీసపు నాలుగు పాదములకు యథాసంఖ్యముగాఁ గూర్చుకొని యర్థమెఱుఁగఁదగును. కాంతి వెల్లువ కీచకుఁడు మునుఁగునట్లు ప్రవహింపఁగా వానికి బెగ్గల మంతకంతకు నగ్గలమైనది. లేయెండ మిగులఁ బర్వఁగా వానికిఁ జెమ్మట యొదవినది. లేమెఱుఁగుల మొత్తమను సైన్యము చుట్టు ముట్టు కొనఁగా జిత్తము సెదరినది. కనుఱెప్పల కప్పను చీఁకటి క్రమ్ముకొనగాఁ నెందును మెలఁగలేక పోయినాఁడు. ఇందు ఎత్తుగీతిపై యర్థమున కనుగుణముగా ముద్రణములందుఁ గానరాదు. మఱియు నింకొక పద్యమున, "కేలిమై నొక్కట లీలఁ గ్రేఖ్ళుటికెడు వాలుగుసోగల నేలుదెంచి" అని యున్నది, 'ఏలుదెంచి' యనుట తిక్కన ప్రయోగముకాదు. ఏఁగుదెంచు, జనుదెంచు, పుత్తెంచు, తోతెంచు ఇత్యాదిగా గత్యర్థసంబంధము లగు ధాతుఫలమీఁదనే 'తెంచు' ధాతువనుప్రయుక్తమగుట భాషలోఁ గానవచ్చును. తక్కిన మూఁడు చరణములలోను తెగడి, తూలంద్రోలి, ఉక్కడంచి యున్నవి గనుక యిక్కడఁ గూడఁ దదనుగుణముగా 'నేలిదించి' యని యుండఁదగును. 'ఎల్లిదించు' రూపాంతరము 'ఏలిదించు'. అవహేళనము చేసియని యర్థము. ఇంకొకటి-

"సమదవారణము జంగమలత వెనుకొని
    సరభసంబునఁ బట్ట జనువిధమునఁ
గ్రూరదానవుఁడు భూచారి నిర్జర కాంతఁ
    బొదువ రయమ్మునఁ బోవుభంగి
ఘోరగృధ్రము సుకుమార నాగాంగనఁ
    బటుగతి నొడియంగఁ బాఱుకరణిఁ
బ్రదలబిడాలంబు బాలశారికమీఁద
    నడరి సత్వరమున నరుగుమాడ్కి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సింహబలుఁ డత్యుదగ్రతఁ జిగురుబోఁడి
పజ్జఁ గడువడి దగిలి కోపంబు గదుర
నొడిచి తలవట్టి తిగిచి మహోగ్రవృత్తిఁ
గొంకు కొనరించుకయు లేక కూలదాఁచె."

ఈ పద్యమున ద్రౌపది కుపమానములుగా మూఁడు చరణములలో జంగమలత, భూచారి నిర్జరకాంత, సుకుమార నాగాంగన యనునవి భూలోకదుర్లభము లున్నవి. నాల్గవ చరణమునఁగూడ నట్లే కదా యుండ వలెను. మఱియు మూఁడు చరణములలోను ద్రౌపద్యుపమాన పదములు ద్వితీయాంతములుగా నున్నవి. నాల్గవచరణమునఁగూడ నట్లేకదా యుండ వలెను. ఈ తీరునఁజూడఁగా- "ప్రబలబిడాలంబు భారతీశారిక నడఁప సత్వరమున నరుగుమాడ్కి" అని యుండుట బాగు, ఈ 'భారతీ శారిక' పదము భారతీదేవిముంజేతి పలుకుఁజిలుక' వంటిది.

కీచకుఁడు ద్రౌపదిఁగూర్చి చేయు నసందర్భాలాపములలో నీక్రిందిది యొకటి :

"చిత్తము మెచ్చి నావలనఁ జిక్కఁగ వెండియు నాలతాంగి య
చ్చొత్తినయట్లు నాకుఁ దన యుల్లము తెల్లము సేయకున్కి దా
నత్తఱిఁ గ్రొత్త కాన్పుగుట నడ్డము సొచ్చిన సిగ్గు పెంపు న
న్నుత్తలమందఁజేయుటకునో తలపోసి యెఱుంగనయ్యెడున్."

ముద్రణములో నీపద్యమిట్లున్నది. తిక్కన పలుకుబడిగాని, యర్థపు సొంపుగాని యిందుఁ బొందుపడకున్నది. ఇది యిట్లుండగాఁదగునని నాతలంపు :

"చిత్తము మెచ్చి నావలనఁ జక్కఁగ వెండియు నాలతాంగి య
చ్చొత్తినయట్లు నాకుఁ దన యుల్లము తెల్లము సేయకున్కి దా
నత్తఱి గ్రొత్త కాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గు పెంపొ? న
న్నుత్తలమందఁ జేయుటగునో? తలపోసి యెఱుంగనయ్యెదన్."

రాయబార మరుగునప్పుడు కృష్ణునితో ద్రౌపది తన భంగపాటును జెప్పు పలుకులలో-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అంతలు సేసి పోనడిచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె? యిట్టియూఱటమదింప్రియమంచె యుధిష్ఠిరుండుదా
నంతన యూఱలేవురకునైదు సుయోధనుఁడిచ్చునాక్కొ? ఈ
కంత కృపావిహీనమతి నాతఁడు నేచునె యన్నదమ్ములన్."

ఇందు 'ఈకంత' అనుచోఁ గొందఱు వికటార్థములను గూడఁ జెప్పుదురు. ఇక్కడ 'ఒక్కంత కృపావిహీనమతి నాతడు నేచునె యన్నదమ్ములన్' అన్న పాఠము సుందరము. ఇంతవఱకు నేనిప్పుడు వెల్లడించిన సంస్కరణములలో నిదియొక్కటి తక్కఁదక్కిన వెల్లను తిక్కన హృదయము నూహించి నేనే చేసినవికాని వ్రాఁతప్రతులఁజూచి చేసినవికావు. ఈ తీరునఁ జూడఁగా దేసి తెలుగు మఱుఁగులలో సాటిలేని నేర్పుతో మెలఁగ నేర్చిన తిక్కన సారస్వత భాండారమగు భారతభాగమును నసిగా నుపయోగించుకొనుటకు సమర్థమైన సహృదయ పండితగోష్ఠి జరగవలెను. ఇట్టి పరిశీలనము జరుగనిచోఁ దిక్కన పద ప్రయోగ లాలిత్యము సరిగాఁ బరిజ్ఞాతము కాఁజాలదు.

తిక్కన రచనలో సింకొక వింతతీరు కూర్పును వివరించుచున్నాను. ఆంధ్ర కవితారచనమున వాక్యముల నసమాపకములుగా పద్యముననుండి పద్యమునకు సాగునట్లు కూర్చుటకలదు. అనఁగా నొక వాక్యము రెండు భిన్న పద్యములలో ననుగతమై యుండు నన్నమాట. పద్యావసానమునకుఁ, బద్యోపక్రమమునకు నడుమఁ గొంతవిశ్రాంతి యుండును. ఒక వాక్యముచ్చరించునపుడుగూడ నడుమ విశ్రాంతి యుండఁదగును గనుక కూరు| అసందర్భముగాఁదోఁపదు. కాని రెండు భిన్నజాతివియగు పద్యములలో నొకసమాస పదమునే సంధించి కూర్చుట చాల విడ్డూరముగా నుండును ద్విపదములు, రగడలు మొదలగువానిలోను, మాలికావృత్తములలోను నాల్గుచరణములకుఁ బద్యము ముగియదు కాన వానిలోనట్లుండవచ్చునుగాక, భిన్నజాతి పద్యముల యవసానారంభములలోనే ప్రధానముగా నంహిత పాటింపవలసినసమానపదము తిక్కన రచనలో నున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్ప
వలయు మీరు మాయింటికి వచ్చి యొక్క
ప్రక్క క్రిందుగ నిరువదియెక్క దినము
లనఘ! నిద్రించి తదిమొదలైన నీదు-

చరితం బద్భుతము మునీ
శ్వర ! దీనికిఁ గారణము విచారమున కగో
చర మెఱిఁగింపు మనుడు నా
ధరణీవల్లభునితో నతండిట్లనియెన్."

'నీదు-చరితము' అన్న సమాసపదము రెండు భిన్నజాతిపద్యముల యంతాదులలో నున్నది. నన్నిచోడమహాకవి కూడ నిట్లొకచోఁ బ్రయోగించినాఁడు.

"వ......... అనేక పురుషరత్నాకీర్ణంబై వెలుంగుచున్న—
సభలో దానవదూత గాంచె విలసజ్జాజ్వల్యమానంబులై ...."
(కుమార సం. ౧౦ ఆశ్వా.)

'వెలుంగుచున్న సభలో' అన్న సమాసపదము-సంహిత గలిగియుండవలసినది- వచనావసానమునఁ గొంతగాను (వెలుంగుచున్న), ఉత్పలమాలా పద్యారంభమునఁ గొంతగాను (సభలో) విడఁబడియున్నది.

"రవిపదాహతిఁ జెడియుండు రాజువోలె
నని సరోజములొందఁ జక్రాహ్వయములఁ
జెట్ట లాడుటకని వికసిల్లుటకును
వెల్లనైనట్లు చుక్కలు వెలరువాఱె." (కుమా ౮ ఆ.)

దిద్దవలెను. అర్థము కుదరక గ్రుడ్లుమిటకరించి కొట్టుకొని యెట్టకేలకిట్టు కవిపాఠము కనిపెట్టఁగలిగినాను:

"రవిపదాహతిఁ జెడి యుడు రాజు వోయె
నని సరోజములొద్దఁ జక్రాహ్వయములు
చెట్టలాడుట, కవి వికసిల్లుటకును,
వెల్లనైనట్లు చుక్కలు వెలరువాఱె."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉడురాజు = నక్షత్రాధిపతి, చంద్రుడు, ఉడిగిపోవు, ముగిసిపోవు రాజు అనికూడ ; ఉడుఁబోతపిందె వంటిది. విరోధియైన యుడురాజు పడిపోవుట నాకసమున కెగసి చక్రవాక పక్షులు చూచి యా సంతోషవార్తను మిత్రములైన సరోజముల యొద్దకి వచ్చి, చెట్టలాడుటకును = పడిపోయిన జంద్రుని నిందించుటకును, మఱియు నుత్సాహముతో జెక్కలల్లాడు(ర్చు)టకును ననియు. అవి = మిత్రములయిన యా సరోజములు, వికసిల్లుటకును = వాని చెట్టలాట కుప్పొంగుటకును, వికాసము చెందుటకును, నవమానము చెంది తెల్లపోయినట్లు చంద్రుని మిత్రములైన నక్షత్రములు కాంతిహీనములై వెలవెలఁ బోయినవి.

కవిహృదయముపైయట్లు గోచరింపఁగా నాకవి నాకుఁ గనకాభిషేకము చేసినాఁడన్నంత సంతోషముతోఁ దోఁగినాఁడను. మఱికొన్ని :

"ఆయవనీరుహోద్గతలతాంతవినిర్గత సౌరభప్రవా
హాయతసాంద్రమై ఫలితమై యొగిఁబర్విన డాయఁబోవనుం
బాయను రాకచుట్ట మధుపవ్రజమాలిక లుండె నొప్పిపు
ష్పాయుధు కాలఁజుట్టు మరుఁడాయసవప్రము వెట్టినట్టిదై."

(నవమాశ్వాసము ౨౯౮ ప.)

దీనికి నా సంస్కరణము :

"ఆయవనీరుహోద్గతలతాంతవినిర్గతసౌరభప్రవా
హాయతిసాంద్రమై ఫలితమై మొగిఁబర్విన డాయఁబోవనుం
బాయను రాకచుట్టి మధుపవ్రజమాలిక లుండె నొప్పిపు
ష్పాయుధుశాలచుట్టు మధుఁడాయసవప్రము వెట్టినట్టులై."

పుష్పాయుధశాల కధికారియైన వసంతుఁడాయాయుధ శాలలోని కెవరికిని రాకపోకల వీలు లేకుండుటకు చుట్టును నినుపకోట పెట్టినట్లు భృంగమాలికలు పూలచెట్లను జుట్టి యున్నవి. పూచినచెట్లు పుష్పాయుధశాలలు. మధుఁడు తదధినేత. ఇందులోఁ బుష్పాయుధుకాల, మరుఁడు ఉండుట యసంగతము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"సుజనజ నైకభూషణము శూరత దుర్జనదూషణంబు స
ద్ద్విజ విబుధాశ్రితప్రతతి వేడుకఁబ్రోవును రాజ్యచిహ్నగా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులక కాక యిన్నియును బుంటికినైనను లేవె చూడగఁన్."

దీనికి నా సంస్కరణము :

సుజనజనైక భూషణము శూరత దుర్జనదూషణంబు స
ద్ద్విజ విబుధాశ్రితప్రతతి వేడుకఁ బ్రోవును రాజ్యచిహ్న గా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులకఁకాక యిన్నియును బుంటికినైనను లేవె చూడగన్?"

"వనధి నీ రెల్లఁ గొనిపోవఁ గని సహింప
కబ్ధతటి గిట్టపట్టిన నరుగ నోప
కోలి దొంతులు గొనిపడియున్న కారు
మొగుళులనఁ జూచి తటభూమి మొగళు లమరె."

(౧ ఆ ౧౨౦ ప.)

దీనికి నా సంస్కరణము :

వనధినీ రల్లఁ గొనిపోవఁ గని సహింప
కబ్ధితటి గిట్ట పట్టిన నరుగనోప
కోలి దొంతులు గొనిపడియున్న కారు
మొగుళులనఁ బూచి తటభూమి మొగళు లమరె."

అబ్ధికిఁ జుట్టు నబ్ధితటి కాపలా కాయుచున్నట్లును, సముద్రములోని నీటిని మెల్లగాఁ బైపైకి మేఘము లెత్తుకొని పోవుటకుఁ జూచి యా యబ్ధితటి యా మేఘముల గిట్టలను(వానకాళ్ళను)బట్టి యీడ్చి క్రిందఁబడవేయఁగా నవి దొంతులు గొని పడియున్న వన్నట్లు సముద్రతటమున మొగలిచెట్లున్నవి. ఆ మేఘములలోని మెఱుపులా యనునట్లు మొగలి పూవులున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"తను వసితాంబుదంబు సితదంతయుగం బచిరాంశు లాత్మగ
ర్జన మురుగర్జనంబు గరసద్రుచి శక్రశరాసనంబు నై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రివేల నా,
జను గణనాథు, గొల్తు ననిశంబు నభీష్టఫల ప్రిదాతగాన్."

(౧ ఆ ౭ ప.)

దీనికి నా సంస్కరణము :

"తను వసితాంబుదంబు సితదంతముఖం బచిరాంశు వాత్మగ
ర్జన మురుగర్జనంబు గరసద్రుచి శక్రశరాసనంబు నై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రవేళ నా,
జను గణనాథు, గొల్తు ననిశంబు నభీష్ట ఫలప్రదాతగాన్."

విఘ్నేశ్వరు, డేకదంతు,డు కాన సితదంతయుగంబని యుండరాదు. అచిరాంశువు = మెఱుపు. అది ఉపమానము కాన అప్పుడప్పుడు మాత్రమే కన్పడునదిగా నుండవలెను. సితదంతముఖంబనుటలో నోరు తెఱచినప్పు డగపడుట, మూసినప్పు డగపడకుండుట దంతాగ్రమునకు కలిగి యచిరాంశుసామ్యము సిద్ధించును.

"ముదమున సత్కవి కావ్యము
నదర,గ విలుకానిపట్టినమ్మును బరహృ
ద్భిదమై తలయూ,పింపని
యది కావ్యమె మఱి పట్టినదియును శరమే?"

(౧ ఆ. ౪౧)

(వ్రా,తప)తిలో నీపద్యమిట్లునది:

"మదమున.........కావ్యము
నదరంగ విలుకాని పట్టినమ్మునుం బరహృ
ద్భిదమై తలయూపింప్పని
యది గావ్యమె మరి పట్టినదియుఃన్ శరమే."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దీనికి నా సంస్కరణము:

"ముదమునఁ గవికృతి కావ్యము
నదరున విలు కాని పట్టినమ్ము‌ను బరహృ
ద్భిదమై తలయూపును, బెఱ
యది కావ్యమె చెప్పఁ, బట్టనదియున్ శరమే?"

ముదముతోఁ గవి రచించిన కావ్యమును, అదరుతో విలుకానిపట్టిన యమ్ము‌ను ఒరునిహృదయభేదనము గావించి తలయూపించును. అట్లుకానిచోఁ, రచించినంతమాత్రముచే నది కావ్యము కాదు. చేతఁబట్టినంత మాత్రముచే నది శరమును గాదు. కావ్యమును, శరమును రెండును బరహృదయ భేదనము చేసి తల యూపించునవే కాని కావ్యము దానిని ముదముతోఁ జేయును; బాణ మదరుతోఁ జేయును. ముద్రితప్రతిలోని, వ్రాఁతప్రతి లోని పాఠములకు సరసాన్వయము కుదురలేదు.

"జానటి పశుపతి నుఱకవి
ధానమహారంభుఁడైన దక్షుండను న
జ్ఞానికి మునుకొని వచ్చున
మానంబున నమరసతివిమానము వచ్చెన్."

(2 ఆ. 150 ప,)

దీనికి నా సంస్కరణము

"జానటి పశుపతి నుఱకవి
తానమహారంభుడై దక్షుండను న
జ్ఞానికి మునుకొని వచ్చు వి
మానంబున నమరసతి విమానము వచ్చెన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రకవిత - ప్రబంధయుగము

ఆంధ్ర కవితాకలా కాల రత్నహారమున శ్రీ కృష్ణదేవరాయల కాల మొక తరళరత్నము. ఆ మహారాజు సుకృతవిశేష మెట్టిదో కాని, యాంధ్రకవిత యతని పాలన కాలమున దివ్యవైభవ మనుభవించినది. దివ్య సౌందర్యము తీర్చుకొనినది. తిన్నని తీరుల దిద్దుకొనినది. ఔచితీ నిర్వాహమలవఱచు కొనినది. సంస్కృతమునందుఁగాని, సాటి భాషలగు కర్ణాట ద్రవిడ ములందుఁ గాని కానరాని కావ్యవస్తు కల్పనపు మెల్పులను గల్పించుకొనినది. విక్రమార్కుని యాస్థానిలో నవరత్నము లున్నట్లు శ్రీ కృష్ణదేవరాయని యాస్థానియం దష్టదిగ్గజము లనఁబడెడు కవులు వెలసి, 'నభూతో నభ విష్యతి' యనఁదగినట్లు వింతతీరున మహా ప్రబంధములు విరచించిరి. ఆనాఁటి కృష్ణరాయఁ డాంధ్ర కవిరత్నరత్నాకరుఁడు. ఆ మహారాజు దక్షిణ హిందూ దేశమునకెల్ల నేకచ్ఛత్రాధిపత్యము వహించి యటు కటకమున నుండి యిటు కన్యాకుమారిదాఁకఁగల దేశమెల్ల విజయయాత్రలోఁ దిరిగి చూచినవాఁడు. కాన తన తిరిగిన దేశములలోఁ గానవచ్చు కవిరత్నముల నెల్ల 'రత్నహారీతుపార్థివ' యన్న న్యాయము చొప్పునఁ గొనితెచ్చికొనెను. కృష్ణాతీరమున నద్దంకినుండి మాదయ గారి మల్లనను, కడప మండలము నుండి పెద్దనామాత్యుని, నెల్లూరి మండలమున నుండి నంది తిమ్మనను, గుంటూరి మండలముననుండి పింగళి సూరన్నను, తెనాలి రామలింగని, నింక ననేక మండలములనుండి యనేక కవులను నార్జించి తన సాహితీ సభాంగణము నలంకరించుకొనెను. 'సాహితీ సమరాంగణ సార్వభౌముఁ' డనఁబరగెను.

దశమ శతాబ్దిలో నారంభమయి యిర్వదవ శతాబ్దిలో నేఁడు సాగు చున్న యాంధ్రకవితకుఁబదునాఱవ శతాబ్ది ప్రథమపాదము సరిగా మధ్యస్థమేకదా ! అది యాంధ్రకవితా దివ్యస్రవంతికి గాంభీర్యము, లోఁతు చాలఁగాఁగల నట్టనడి యేటిపట్టు! చాళుక్యరాజరాజు, తెలుఁగు చోళరాజు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనుమసిద్ధి, కాకతీయ ప్రతాపరుద్రుఁడు, రెడ్డిరాజ సముచ్చయమునను నాశ్రయాను క్రమమున సాగివచ్చిన యాంధ్రకవితకు శ్రీ కృష్ణరాయని యాశ్రయము పై విధమున ననిదంపూర్వమయిన యభ్యుదయముఁ జేకూర్చిన గట్టి పట్టుగొమ్మ.

ఎడనెడ నన్నయాదుల పురాణ రచనలలోను, నన్నిచోడని కుమార సంభవము. ఎఱ్ఱన నృసింహ పురాణము, మంచన కేయూరబాహు చరిత్రము, దొరకలేదు కాని తిక్కన విజయసేనము శ్రీనాథుని శృంగార నైషధము, దుగ్గన నాచికేతోపాఖ్యానము మొదలగు కృతులలో రాయలనాఁటి ప్రబంధ రచనావ్యాప్తి యించించుకగా మొలకెత్తినది. శ్రీ కృష్ణరాయని కాలమునఁ బర్యాప్త వైభముతో నిండారి వెలసిన ప్రబంధరచనా సంప్రదాయ వాహినికిఁ దత్పూర్వరచన లెట్లెట్లూటకాల్వలయినవో యించుక వివరింతును.

పదునైదవ శతాబ్దిదాఁక నాంధ్రకవితా రచన పురాణ పరివర్తనప్రాయమై యున్నది. కాని దానిలోఁ గవికి స్వైరవిహారమును గావింప నవకాశము తక్కువ. సంస్కృత పురాణములు ప్రాయికముగా సత్యార్థ రచనాపరము లగుటచేత నందుఁ గవికల్పిత కథలలోవలె నౌచితీ నిర్వాహమంతగా నుండదు. మఱియు నా పురాణకర్తలేవో పరమార్థముం నిరూపించుటే ముఖ్యముగాఁ గొన్న వారగుటచేతను, నౌచితి నంతగాఁ బాటింపకయుఁ బోయిరి. యుద్ధరంగమున గీతోపదేశము, నారణ్య శాంత్యానుశాసనిక పర్వములలోని కథాకల్పనములుఁ గావ్య శిల్పదృష్టితో జూడఁగా నౌచితీదూరము లగును. కాశీఖండమున నొకచోటఁ బతివ్రతా ధర్మములు చెప్పుట పరమార్థముగాఁ గొనుటచే లోపాముద్రతో వ్యాసుఁ డుపన్యసించుటలో నౌచితీ భంగము వాటిల్లినది. ఇట్టివానిని బురాణములఁ దెలిఁగించువారు తొలఁగించుకొన వీలు కాదయ్యెను. కావ్యమున కౌచితి జీవగఱ్ఱ! కావ్యమునకే యేమి ? లౌకికమయిన సర్వవాగ్వ్యవహారమునకును నౌచితి ముఖ్యమేకదా! దీనిని బాటించుటకుఁ గవికి స్వాతంత్ర్య ముండవలెను. అందుకే శాకుంతలాది నాటకములయందుఁ బురాణకథలకు మార్పులును, దద్రక్షకై 'అన్యథా వా ప్రకల్పయేత్' అన్న శాస్త్రమును నేర్పడినవి. ఆంధ్ర కవితాసంప్రదాయము ప్రాయికముగా సంస్కృతపుఁ దీరు ననుసరించి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పుట్టినది గాన సంస్కృతమునఁ బురాఁటములకుఁ దర్వాత వెలసిన కావ్యనాటకముల యవతార మాంధ్రమునకును నావశ్యకముగాఁ గవులకుఁ దోఁచెను. ఆ తలఁపు చొప్పుననే నన్నిచోడ కుమారసంభవ, కేయూరబాహుచరిత్ర, క్రీడాభిరామ, హరవిలాస, శృంగారనైషధ, శృంగారశాకుంతల, ప్రబోధచంద్రోదయాదు లాంధ్రమున వెలసినవి. మహాకావ్యపద్ధతిని వెలసిన కుమారసంభవ, శృంగారనైషధాదులుగాక నాటకపరివర్తనము లనఁదగిన కేయూరబాహుచరిత్ర, క్రీడాభిరామ, శృంగారశాకుంతలాదులు గూడ శ్రవ్యములు గానే, చంపూకావ్యములుగానే తెలుఁగున రచితములైనవి. నాటకములయందు వచనభాగమెక్కువగా సంభాషణాత్మకముగా నుండును. సరిగా వానిని దెలిఁగించుటలోఁ బొడిపొడి వచనముల్లే తెలిఁగింపవలసియుండును. ప్రాచీనకాలమున దేశభాషారచనలలో వచన రచన మీఁద నాదరము లేకుండెను. అందు రచనాశిల్ప మంతగా నుండదని యప్పటివారి తలఁపు గాబోఁలును! నియమబద్ధములుగాని పొడి వచనరచనలు తాళపత్రాది లిపులలో వికృతిఁ జెందకుండ సంరక్షించుటయసాధ్యముగాఁ గూడ వారు తలఁచియుండవచ్చును, ఇవియో, కారణ మింక నేదో కాని నాటకాంధ్రీకరణమున వా రట్టి పొడి భాషణపు వచనములఁ గూడ పద్య రచనలోనే జరపి యా నాటకములనుగూడ శ్రవ్యకావ్యములుగానే కావించిరి. కాని శ్రవ్యకావ్యములకుఁ గల నానారసాలంకార వర్ణనాది మహాకావ్య పరికర పౌష్కల్యము నాటకాంధ్రీకరణమునఁ జూపఁబూనుట వైరస్యహేతువయ్యెను. కావ్యములలోని యలంకారవర్ణనాది పౌష్కల్య పరిగ్రహముతో, నాటకములలోరి శుభాంతతా వస్త్వైక్య నానా రసోక్తి ప్రత్యుక్తి చాతురీ గ్రహణముతోఁ, బురాణ రచనములలోని రసైక పరములుగాని విపులాతివిపులమైన కథాఘట్టముల పరిత్యాగముతో, మిశ్ర కల్పితేతివృత్తములతోఁ బొందుపడి కావ్యములులేని, నాటకములు లేని కొఱతను దీర్పఁగల రచనావిశేష మొకటి తెలుఁగున నావశ్యకమగుట నాంధ్రకవులు గుర్తించి యా యా గుణవిశేషములెల్ల గుదురుపడున ట్లీప్రబంధ రచనమును గావింపఁ దొడఁగిరి. ప్రబంధశయ్యయను పేరును జక్కన పేర్కొన్నాఁడు.

శృంగార నైషధ శాకుంతలాదులందు సంస్కృత మూలానుసరణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పారతంత్ర్యముతో సమకూడిన ప్రబంధ రచనా సౌభాగ్య మీ విధముగా మనుచరిత్ర పారిజాతాపహరణా ముక్తమాల్యదాదులయందు స్వతంత్రమయి సర్వహృద్యముగా విజృంభించినది. ఈ ప్రబంధములలోఁ బురాణములలో లేని యౌచితీనిర్వాహ కథావస్తు సంగ్రహణములున్నవి. మహాకావ్యములలోఁ గల నానా రసాలంకా రాష్టాదశవర్ణనా పౌష్కల్యమున్నది. నాటకములలోఁ గల సంభాషణాది చమత్కారము, వస్త్వైక్యము, కథానిర్వాహములో స్వాతంత్ర్యము, నంకాది విభాగములంబట్టి యాశ్వాసాదివిభాగములు నున్నవి. ఇట్టి ప్రబంధములు వెలయుటచే నానాఁ డింక రఘువంశాదులవంటి మహా కావ్యములయు, గాదంబర్యాదులవంటి గద్యకావ్యములయు, శాకుంత లాదులవంటి నాటకములయు నావశ్యకత తెల్గునకు లేకపోయినది.

ప్రబంధములలో విరివిసెందిన ప్రాచీన రచనాంకురములను గొన్నిం టిని, ప్రబంధములలో నాటక కావ్యానుకరణములను గొన్నింటిని మచ్చున కుదాహరింతును. మార్కండేయ పురాణకథ ప్రబంధమార్గమున విరివిసెంది మనుచరిత్ర మయినది. అందు మృగవర్ణనచమత్కారమెల్ల బినవీరన్న శృంగార శాకుంతలములోని మృగయావర్ణనమును బట్టి పుట్టిపెరిగినది. వర్ణనలెల్లఁ గావ్యసంప్రదాయము ననుసరించి విపులముగా సాగినవి. వరూ థినీ ప్రవరసంవాదము మేలయిన నాటక సంభాషణచ్ఛాయను బొందుపడినది. శ్రీనాథుని కాశీఖండములోని 'గుణనిధి కథ' పాండురంగకవి నిగమశర్మో పాఖ్యానముగాఁ బెరిగినది. అంతేకాక యా కథ కందుకూరి రుద్రకవినోర నిరంకుశోపాఖ్యాన ప్రబంధముగానే విరివిసెందినది. పారిజాతాపహరణ ప్రభావతీ ప్రద్యుమ్నములు మహాకావ్య నాటక ధర్మముల కలయికతో వెలసి నవి.

శ్రీనాథుని కాశీఖండ పద్యమిది—

"ముడువంగ నేర్తురు మూల దాపటికి రాఁ
జికురబంధము లీఁగ జీరువాఱఁ
బొన్న పువ్వులఁబోలు పొక్కిళ్లు బయలుగాఁ
గట్టనేర్తురు చీర కటిభరమునఁ
దొడువంగ నేర్తురు నిడుప్రేలుఁ జెవులందు

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నవతంసకంబుగా నల్లిపువ్వ
పచరింపనేర్తురు పదియాఱువన్నియ
పసిఁడి పాదంబులఁ బట్టువెంప
పయ్యెదయు సిగ్గుఁ బాలిండ్లఁ బ్రాకనీరు
తఱచు పూయుదు రోలగందంబు పసుపు
బందికత్తెలు సురతప్రపంచవేళఁ
గంచియఱవత లసమాస్త్రి ఖడ్గలతలు."

శ్రీ కృష్ణరాయని యాముక్తమాల్యదలో—
"వీడెంపుఁ బలుకెంపు విరిసి వెన్నెలగాయ
వరిగింజ నొకటఁ బల్వరుసఁ దోమ
నొరసి యొత్తిన మణుం గొందక మైనెని
గ్గులుదేరఁ బసుపిడి జలకమాడ
ముదుక గాకుండఁ బయ్యెద లోనఁ గేలార్చి
కలయఁ జంటను వెంటఁ గలప మలఁద
రతిరయచ్ఛిన్న సూత్రమునఁ జిక్కక ముత్తె
ములు రాల గరగరికలు వహింపఁ

బొలసిననె యెట్టి నరునైనఁ గులము దెలియఁ
బ్రభుత సెడి పల్లవుఁడు వేదవడిన నేద
నృపతి వెలియంతిపురముగా నెన్న మెలఁగ
బానఁ గృతి సెప్పవలఁతు లప్పద్మముఖులు."
అన్న పద్యముగా మాఱినది.

ఇట్లు పొడిపొడిగాఁ బ్రాచీనాంధ్ర గ్రంథచ్ఛాయలు, కృష్ణరాయలనాఁటి ప్రబంధములలో నెన్నింటినేని గుర్తింప వచ్చును.

సర్వ ప్రబంధరచనా సౌభాగ్యములు పొనఁగియున్న 'పారిజాతాపహరణము'ను బురస్కరించుకొని ప్రబంధ కవితా విశేషములఁ గొన్నింటిని బేర్కొందును. పారిజాతాపహరణ కథాకల్పన మొక ప్రశస్త నాటకకథా కల్పనము. ఎట్లనఁగా—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శచీదేవినగరిలో దేవేంద్రుఁ డుండఁగా శ్రీ కృష్ణుని దర్శించుటకై భూలోకమునకుఁ బోఁగోరి దేవర్షియగు నారదుఁడు ప్రభువగు దేవేంద్రుని యనుజ్ఞ వడయుటకై యచటికి వెళ్ళెను. అప్పుడు శచీదేవి కల్పవృక్షపు దివ్యకుసుమములను గోయించి తెప్పించి పార్వతీ సరస్వతీ రతి దిక్పాలక పత్నీ ప్రముఖ దివ్యాంగనల కా పుష్పములను పంపకములు వెట్టి పంపు చుండెను. కడమ పుష్పములను దేవేంద్రుని హజారమునశయ్యకు నలంకారముగాఁ బెట్టించుచుండెను. అపుడు సన్నిహితుఁడై యున్న నారదునికిఁగూడ దేవేంద్రుని ప్రేరణమున శచీదేవి యెకపుష్పము నొసంగెను. ఆ పుష్పము నతఁడు 'శ్రీ కృష్ణార్పణ మస్తు' అని గ్రహించి భూలోకమునకుఁ బోవుచుంటి నని విన్నవించుకొనెను. దేవేంద్రుఁడది విని శ్రీ కృష్ణునకును, నాతని దేవేరులకును జాలినన్ని పుష్పముల నీయ శచీదేవిని గోరెను. శచీదేవి యివి దివ్యకుసుమములనియు, వీని ధరింప దివ్యులేకాని భూలోకవాసు లనర్హులనియు నీ పుష్పముల గౌరవము నిల్పు టావశ్యకమనియు, భూలోకవానుల కివి నాచేతి మీఁదుగా నొసఁగననియు నిసడించి పలికెను. నారదుఁడు సత్యభామ పేరెత్తియేమో సణుగుకొనుచు హజారమును వీడి భూలోకమునకు విచ్చేసెను. ఇది విష్కంభ రూప ప్రథమాంక పూర్వకథ.

పారిజాతాపహరణమునఁబ్రథమాశ్వాసము ప్రథమాంకము. శ్రీకృష్ణుఁడు రుక్మిణియింట వినోదించుచుండుట. యపుడు సత్యభామ చెలికత్తెగూడ నచట నుండుట, నారదుని ప్రవేశము, పారిజాత పుష్ప సౌభాగ్యవర్ణనము, శ్రీ కృష్ణున కాపుష్పము నొసఁగుట, శ్రీ కషుఁడు నారదసూచనలఁబట్టి కథా రహస్య మెల్లఁ గనుగొనుట, నారదుని కనుసైగ చొప్పున రుక్మిణి కా పుష్పము నిచ్చుట- యిత్యాదికము కథావస్తువు. ద్వితీయాంక కథావస్తువు గూడ నిందుఁ గొంత గలసియున్నది.

చెలికత్తె సత్యభామతో జరిగిన విషయము జెప్పుటచేత సత్యభామ కోపము, శ్రీకృష్ణుని యనునయము, భూలోకమునకుఁ గల్పవృక్షమును బెటికికొని వచ్చునట్లు ప్రతిజ్ఞ సేయుట, స్వర్గగమనము ద్వితీయాశ్వాసేతి వృత్తము.

తృతీయాశ్వాసమే తృతీయాంకము. స్వర్గవీథులలో శ్రీ కృషుని పయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నము, ఇంద్ర సత్కారము, ఇంద్రుని హజారమునఁగాక శ్రీకృష్ణుఁ డదితి హజారమున విడియుట, శ్రీకృష్ణ సత్కారాదికము. సత్యా శ్రీకృష్ణుల వన విహారాదికము నిందలి కథాంశము.

చతుర్థాశ్వాసమే చతుర్థాంకము. పారిజాతోత్పాటనము, ఇంద్ర శ్రీకృష్ణ సంగరము నిందలి కథాంశము.

పంచమాశ్వాసమే పంచమాంకము. సత్యభామ తన విభునిచే పారిజాతమును భూలోకమునకుఁ గొని తెప్పించి ద్వారకానగరమునఁ బ్రతిష్ఠించుట-సత్యభామ పుణ్యకవ్రతము చేయుట-సత్యభామ శ్రీకృష్ణుని నారదునకు దానమిచ్చుట-పారిజాత పుష్పములను శ్రీకృష్ణుని పత్నులకు ద్వారకావాసుల కెల్ల రకునుగూడఁ బంచిపెట్టుట - శ్రీకృష్ణుఁడు భూలోకమున నుండు నంత దాఁక కల్పవృక్షము భూలోకమున నుండు నట్లేర్పాటగుట భూలోక వాసులకు సర్వ సౌఖ్యములు సమకూడుట యిందలి కథాంశము.

దీనిని నాటకముగా 'నారద విజయ' మని కాని, 'శచీగర్వభంగ'మని కాని పేర్కొనఁదగును. నారద విజయమనుటయే యెక్కువ సంగతము. విష్కంభాదిగా నేను జెప్పిన యీ కథాసూత్రమెల్ల నంది తిమ్మనార్యుఁడీ ప్రబంధమున గుర్తింపఁదగినట్లు సూచించియే యున్నాఁడు. నరకాసురు నోడించి స్వర్గమును దనవల్లభునకుఁ గైవస మొనర్చిన సత్యభామమహోప కృతిని మఱచిన శచీదేవికి నారదుఁడు కల్పించిన గర్వభంగమిది! కథామధ్య మున-

"వినుఁడు సురేశ్వరు వనపాలకులు వార్థిఁ
బొడమిన యీ దివ్యభూరుహమున
కింద్రాణి యెవ్వతె? యింద్రుండు నెవ్వండు?
తోడి యిందిరను గౌస్తుభము నెవ్వఁ
డధిపుఁడై ధరియించె నతఁడె చేగొనుఁగాక
తెకతేర యిది యేమి యొకరి సొమ్మె?
ఇదె నాదు విభునిచే నీ వదాన్యనగంబు
నొడియించుకొని యేఁగుచున్నదాన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బలుకు లేటికిఁ దా వీరపత్నియేని
మీ శచీదేవి తనదు ప్రాణేశుఁడయిన
మఘవు నిటఁబంపి సత్యభామావిధేయు
వలన మరలంగఁ గొనుట పో వాసితనము."

అని సత్యభామ యనును.

ఈ విధముగాఁ బారిజాతాపహరణము నాటక ధర్మమెంతో నంతసగా నవరించుకొన్న రుచిరప్రబంధము. ఇందు వాచ్యమయిన యీ కథేతివృత్తమే గాక వ్యంగ్యముగా నింకొక కథేతివృత్తము గూడ నున్నది. వాచ్యకథలో శ్రీకృష్ణుడే వ్యంగ్య కథలో శ్రీకృష్ణదేవరాయఁడు. రుక్మిణీ సత్యభామలే తిరుమలదేవీ చిన్నాదేవులు. కవియే నారదుఁడు. ప్రియుఁడగు కృష్ణరాయని యాదర తారతమ్యముచే సతులలోఁ బొర పేర్పడుట, ఆ పొరపును దీరి యానుకూల్యముఁ గల్గించి నంది తిమ్మనకవి శ్రీకృష్ణరాయని తన చెప్పుచేఁత లకు దిద్దుకొనుటయే పుణ్యకవ్రత విధానము.

ఇట్టి మహాప్రబంధము వాచ్యేతివృత్తమునకుఁ జాటున ధ్వనిగా నింకొక యితివృత్తమును వెలయించుచున్న ధ్వనిప్రధానమైన యుత్తమ కావ్యము. ఇందు మహాకావ్యమున కుండవలసిన ప్రయాణోద్యాన వనవిహార జలక్రీడా దౌత్య యుద్ధాది వర్ణనలు బలవంతముగాఁ గావ్యత్వసిద్ధికై కల్పించిన వర్ణన లుగాఁ గాక నాటకకథలో నత్యావశ్యకముగా నపేక్షితము లయిన నాటకాంగ ములుగానే పొసఁగుట గొప్ప చమత్కారము! కవిస్వతంత్రుడై యీ కథలోఁ దననాఁటి శ్రీకృష్ణదేవరాయల మహా రాజ్యవైభవములను శ్రీకృష్ణదేవుని వైభవములతో జోడించి వర్ణించినాడు. ఇవి చదువుడు:

"అమరవిభుండు దూరమున నంబుజనాభునిఁగాంచి సంభ్రమో
ద్గమమునఁజేతియంకుశముఖంబునఁగుంభములూఁది కుంచితా
గ్రిమచరణంబున న్మదకరిన్ డిగి యంసవిలంబి కల్పచే
లము నడుమ న్బిగించుచు నిలానిహితాత్మశిరఃకిరీటుఁడై."

ఈ పద్యము "ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె" నన్నట్టు పెద్దనకుఁ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దనకు, నింక నితరకవులకు శ్రీకృష్ణరాయఁడు గజా రూఢుడై యేఁగునప్పుడు జరుగుచు వచ్చిన సత్కారములనుబట్టి పుట్టినది.

"జలరుహనేత్రుఁగాంచి సరసత్వము మీఱఁగనొక్క వేలుపుం
జిలుకలకొల్కి రాచిలుకచేఁ బిలిపించిన సత్యభామకా
కలికి తెఱంగు శౌరి కడకన్నుల సన్నలఁ జూపెఁ గోపకం
దళకలుషాయితాక్షి వలనంబుల నా సతి దన్నదల్పఁగన్."

ఈ పద్యము శ్రీ కృష్ణరాయఁడు గజారూఢుఁడై దేవోత్సవాదులం దూరేఁగునప్పు డనుభవించిన యనుభవ విశేషములకు జ్ఞాపకముగాఁ బుట్టినది.

"కలికి నిడువాలుఁ గన్నుల
తళుకులు మణిదీపశిఖలుఁ దడఁబడ లక్ష్మీ
నిలయున కిచ్చిరి కొందఱు
నెలఁతలు మౌక్తిక విచిత్ర నీరాజనముల్."

శ్రీకష్ణరాయని యంతఃపురానుభవముల కిది జ్ఞాపకము—

"దరమీలన్నయనంబులై గృహబహిర్ద్వారంబుల న్యామకుం
జరము ల్గండమదభ్రమద్భ్రమరికా ఝుంకార సంగీత వి
స్ఫురణల్ సూపుచుఁ గర్ణతాళనినదంబు ల్మించ నీమాగధో
త్కరముంబోలుచుఁజూడనొప్పెనివె హస్తన్యాసముల్మిఱఁగన్."

రాయలవారి మొగసాలలో జరుగు ననుభూతుల కిది జ్ఞాపకము—

"తామరలవ్రేటు లాడుచోఁ దరుణు లెత్తు
కరరుహాంకిత బాహువల్లరులు వొలిచె
బిరుదవర్ణావళీ పరిస్ఫురితమైన
పల్లవాస్త్ర జయస్తంభ పటలి యనఁగ."

పొట్నూరు మొదలగు స్థలములందు రాయలవారు శాసనములతోడి విజయస్తంభముల నెత్తించుటకు జ్ఞాపకముగా నీ పద్యము పుట్టినది. ఇట్టి పద్యముల నింక నెన్నిఁటినేని యెత్తి చూపవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నిరుపహతి స్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క
ప్పురవిడెమాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకిన(గాకయూరక కృతుల్ రచింయింపు మటన్నశక్యమే?"

అని పెద్దనాదు లన(దగినట్లు శ్రీకృష్ణదేవరాయ(డు తన యాస్థాన కవులకు రాజస మలవఱిచి వారిని బోషించినా(డుగాన వారును నప్పటి రాజులయు(, బ్రజలయు సుఖానుభూతుల కనుగుణముగా(బ్రబంధములను రజోవృత్తి ప్రధానములుగానే రచించినారు. పురాణకృతులలోని సాత్వికత యిందు సన్నగిల్లినది.

కాలక్రమమున నీ ప్రబంధముల రాజసత విపరీతమై వెఱ్ఱితలలు వేయ(జొచ్చినది. ప్రబంధకవితారచనపు మహా వైభవమును గూర్చియే దిఙ్మాత్రముగా నీ ప్రశంస.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేములవాడ భీమకవి

వేములవాడ భీమకవి శాపానుగ్రహశక్తిమంతుఁ డనీ, ఉద్దండకవి యనీ ప్రాచీనకవులు ప్రశంసించినారు, శ్రీనాథుఁడు 'వచియింతు వేములవాడ భీమనభంగి నుద్దండలీల నొక్కొక్క మాటు' అన్నాడు.

క॥ భీమకవి రామలింగని
శ్రీమన్మథుఁడై చెలంగు శ్రీనాథకవిన్
రామకవిముఖ్యులను బ్రో
ద్దామగతిన్ భక్తిమీఱఁ దలఁచి కడంకన్

అన్నాడు కూచిమంచి జగ్గన.

క॥ లేములవాడక సుఖి యై
లేములవాడన్ జనించి లేమలవాఁడన్
నామంబునఁ బరగిన నుత
భీమున్ గవిభీము సుకవిభీముఁ దలఁతున్

అన్నాడు గోపరాజు.

ఈ భీమకవి గోదావరీమండల దాక్షారామపు లేములవాడ వాస్తవ్యుడని కొందఱును, నైజాం రాష్ట్రమందలి వేములవాడ వాస్తవ్యుఁ డని కొందఱును తలచుచున్నారు. ఉభయ వాదములకును సాధనము లున్నవి. ఈ భీమకవికూడ శ్రీనాథుని వలెఁ దెలుంగాధీశునిఁ గస్తూరీ ఘనసారాది సుగంధ వస్తువులు యాచించినట్లీచాటుపద్యము చెప్పుచున్నది.

మ॥ ఘనుఁడన్ వేములవాడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుడన్ దివ్యవిషామృత ప్రకటనానాకావ్యధుర్యుండ భీ
మన నా పేరు నెఱుంగఁ జెప్పితిఁ దెలుంగాధీశ! కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగం దెచ్చి లాలింపురా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వృద్ధపారంపర్యమున నీపద్య మీవిధముగా వినికిడి కలదు గాని వ్రాతప్రాఁత లలో 'తెలుంగాధీశ' యని కాక "కళింగాధీశ" యని పాఠము కానవచ్చు చున్నది. మనభీమకవి కళింగాధీశుఁ డయిన యనంతవర్మచోడగంగదేవుని దర్శించిన ట్లింకనుగొన్ని చాటుపద్యములు చాటుచున్నవి గాన యీ పద్యమున "కళింగాధీశ' యను పాఠమే పరిగ్రాహ్య మనవచ్చును.

పయిపద్యమున భీమకవి 'విషామృతము' మొదలగు గ్రంథముల రచించినట్లున్నది. కాని యాగ్రంథము లేవియు నిప్పుడు కానరాకుండుట శోచనీయము. 'విషామృత' మని జ్యోతిష్యగ్రంథ మొకటి కలదు గాని యది యితనిదై యుండదు. (ప్రసిద్ధమైన కవిజనాశ్రయ మీభీమకవి రచించినదిగా లోకప్రతీతి. గ్రంథమున 'రేచన' రచించినట్లున్నది. అతఁడు కోమటి యట. అనంతవర్మచోడగంగదేవుని సంధివిగ్రహి 'రేచన' యొకడు కలడు. ఆతని శాసనము గోదావరీమండల దాక్షారామభీమేశ్వరస్వామి యాలయములో నున్నది. మనభీమకవి యారేచనపేర కవిజనాశ్రయము రచించి యుండు నేమో! కవిజనాశ్రయ మిప్పుడు చాలా అపపాఠములతో సంక్షిప్తగ్రంథ ములతో నిండియున్నది. దానిని జాగ్రత్తగా సంస్కరించి యుద్ధరింపవలసి యున్నది. చిత్రపుభీమన యనుకవి రచించినచ్ఛందస్సు "ఉత్తమగండచ్ఛం దస్సు" అను పేరిది వేఱొకటి గలదు. అదియు కవిజనాశ్రయము నొకటే యని కొందఱు భ్రమపడిరి. అది యట్లు గాదు. ఉత్తమగండచ్ఛందస్సు వేఱు; కవిజనాశ్రయము వేఱు ఉత్తమగండచ్ఛందస్సు చిత్రపు భీమన రచించినది. కవిజనాశ్రయచ్ఛందస్సు వేములవాడ భీమకవి రచించిన దని ప్రతీతి గలది. రెండును ప్రాచీనతర చ్ఛందోగ్రంథములే! వేములవాడభీమ కవి గ్రంథములేవియు దొరకక పోయినను లక్షణగ్రంథాదులం దాతని చాటు పద్యము లుదాహృతములై చాలా దొరకుచున్నవి. మఱియు ఆంధ్రప్రయోగ రత్నాకరమున వేములవాడ భీమకవికృతి నృసింహపురాణ మను పేరితో కొన్ని పద్యము లుదాహృతము లయి యున్నవి. సాహిణిమారన, చాళుక్య చొక్కభూపతి, సాగిపోతరాజు, (అనంతవర్మ) కళింగగంగ దేవుడు, చోడ గంగడు, మైలమభీముడు,నల్లసిద్ధి, లేటివరపు పోతరాజు, రణతిక్కన యను వారిమీఁద నీతఁడు చాటుపద్యములఁ జెప్పినాడు.) ఇందుఁ గొన్ని కల్పితము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లును గావచ్చుదు. పై వారిలో మైలభీమనికే ఏఱువభీముఁడనిచిక్కభీముఁడని నామాంతరములు. ఈతనిపై భీమకవి ప్రశస్తమయిన ప్రశంసాపద్యములు చెప్పినాడు. అవి యెల్ల చాటుపద్య మణిమంజరిలోఁ జూడనగును. మచ్చునకు రెండు పద్యములు.

క॥ అరినరు లేఱువభీమని
పౌరువున మనలేరు చిచ్చుపొంతను వెన్నై
తెరువునఁ బెసరై జూదరి
సిరియై రేన్చెట్టుక్రింద జిల్లేడు చెట్టై.

ఉ॥ యాచకఖేచరుండు సుగుణాంబుధి మైలమభీమఁ డీల్గినన్
జూచి వరించె రంభ, యెడఁజొచ్చెఁ దిలోత్తమ, దారినిద్దఱన్
దోచె ఘృతాచి, ముగ్గుఱకు దొడ్డడికయ్యము పుట్టె-నంతలో
నాఁచుకుపోయె ముక్తిసతి నవ్విరి యద్దశఁ జూచి నిర్జరుల్
నోఁచినవారి సొమ్ము లవి నోమనివారికి వచ్చునే ధరన్.

ఈ పద్యవుఁ దుదిచరణము గలపద్యము నాచనసోమనాథుని యుత్తర హరివంశమునను గలదు.

ఉ॥ ఏఁచు నుపేంద్రునిం బదక మిమ్మని రుక్మిణి మున్నె; దేవుఁడుం
బూఁచినపూఁవు దప్పటకుఁ బోకులఁబోవుచు నుండు నిమ్మెయిన్
డాఁచినసొమ్ము చేరె నిచటన్ మదిఁ గోరనిసత్యభామకున్
నోఁచినవారి సొమ్ము లవి నోమనివారికి వచ్చు నే ధరన్.

—ఉ. హ. 168 ప్రథమశ్వాసము

భీమకవిచాటుపద్యముల పోలికపద్యములు నాచన సోమనాథుని యుత్తరహరివంశమున నింకను కలవు. భారతిలో శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు ప్రకటించిన తాళ్ళప్రొద్దుటూరి శాసనము వేములవాడ భీమకవిరచనము కావచ్చు నని నాతలఁపు. ఏలనఁగా నందులో వేములవాడ భీమకవి పేరఁ బ్రసిద్ధి గన్న చాటుపద్య మిదికూడ గలదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉ॥ పన్నిదు తురంగమంబునకుఁ బక్కెర వెట్టినవార్త చారుచే
విన్నభయంబునం గలఁగి వేసటవాఁటనె చక్ర (?) గోట్టముల్
మన్నియపట్టణంబులును మక్కిన వేంగి కళింగ లాది గా
నిన్నియు నొక్క పెట్టెగసె నేఁబువభీమనృపాలుధాటికిన్.

మఱిన్ని అ శాసనపుఁబద్యముల యనుకరణములు కూడ నాచన సోమన గ్రంథములో నున్నవి. పయిచాటుపద్యము లన్నింటిని బర్యాలోచింపఁగా భీమకవి క్రీ॥ 12-వ శతాబ్దిపూర్వార్ధమున ననఁగా నిప్పటి కెన్మిది వందలయేండ్లకు పూర్వ మున్నవాఁడగును.

వేములవాడభీమకవి శాపానుగ్రహశక్తి మంతుఁ డనుటకుఁ దార్కాణముగాఁ బెక్కు చాటు ధార లున్నవి. భీమకవి యొక్కప్పుడు గుడిమెట్ట యను గ్రామమున కరిగె నట! సాగి పోతురాజను రాజాతని గుఱ్ఱము నక్కడ దనసాహిణమునఁగట్టి పెట్టించి యాఁతడు వేడినను విడిపింపఁ డయ్యె నట. దానిపైఁ గోపించి భీమకవి చెప్పినపద్యము.

చ॥ హయ మది సీత పోతవసుధాధిపుఁ డారయ రావణుండు ని
శ్చయముగ నేనురాఘవుఁడ సహ్యజ వారిధి మారుఁ డంజనా
ప్రియతనయుండు లచ్చన విభీషణుఁ డాగుడిమెట్ట లంక నా
జయమును బోతరక్కసునిచావును నేడవనాఁడు చూడుఁడీ!

కోమటివారిని నిందించినట్లు భీమకవి పద్యములు కొన్ని లక్షణగ్రంథములం దుదాహరింపఁ బడియున్నవి. కవిజనాశ్రయమును కోమటిరేచన పేర రచించిన కవియే యిట్లు కోమటి వారిని గర్హించునా యని సంశయము.

చ॥ గొనకొని మర్త్యలోకమునఁ గోమటి పుట్టఁగ బుట్టెఁ దోన బొం
కును గపటంబు లాలనయుఁ గుచ్చితబుద్ధియు రిత్తభక్తియున్
ననువరిమాటలున్ బరధనంబును గ్రక్కున మెక్కఁ జూచుటల్
కొనుటలు నమ్ముటల్ మిగులఁ గొంటుఁదనంబును మూర్ఖవాదమున్

ఉ॥ కోమటి కొక్క టిచ్చి పది గొన్నను దోసము లేద; యింటికిన్
సేమ మెఱింగి చిచ్చిడినఁ జెందద పాపము; వాని నెప్పుడే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేమరుపాటున న్మతియు నేమి యొనర్చిన లేద దోస మా
భీమనిలింగ మాన! కవిభీమని పల్కులు నమ్మియుండు(డీ!

ఉ॥ వేములవాడభీమ! భళిరే! కవిశేఖరసార్వభౌమ! నీ
వేమని యాన తిచ్చితివి యిమ్ముల(గోమటి పక్షపాతి వై
కోమటి కొక్క టిచ్చి పది గొన్నను దోసము లే దటంటి వా
కోమటి కొక్క టీక పది గొన్నను ధర్మము ధర్మపద్ధతిన్.

సాహిణిమారు(డనుదండనాథు(డు చాళుక్యచొక్క భూపతి నెదిరించె నట. భీమకవి యామారుని శపించి చొక్కభూపతికే జయము చేకూర్చెనట.

ఉ॥ చక్క(దనంబుదీవి యగుసాహిణిమారు(డు మారుకై వడిన్
బొక్కిపడంగలండు చలమున్ బలమున్ గలయాచళుక్యపుం
జొక్కనృపాలు(డుగ్రు(డయి చూడ్కుల మంటలు రాల(జూచినన్
మిక్కిలి రాజశేఖరునిమీ(దికి వచ్చిన రిత్త వోవునే!

కళింగగంగు నాస్థానమునకు భీమకవి యరుగ(గా నాత(డనాదరమున నిది సమయము కాదు పొమ్మనె న(ట! దానిపై భీమన కోపించి శాప మిట్లొసగెను.

ఉ॥ వేములవాడభీమకవి వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున సందడి దీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోస మి(క ముప్పదిరెండుదినంబు లావలన్
జామున కర్ధమం దతనిసంపద శత్రులపాలు గావుతన్

శాపము ఫలించెను. రాజకళింగగంగు గర్భదరిద్రు(డై పరుల కెఱుక పడకుండ, ప్రచ్ఛన్నవేషము దాల్చి తిరిపమెత్తుచు(బొట్ట గడపుకొనుచుండెను. భీమకవి యొకనా(డు రాత్రి పల్లకి నెక్కి దివిటీలతో నెక్క(డకో పోవు చుండ(గా నా(తడు త్రోవ నే(గుచు జీకటిలో నొకగోత(గూలి 'అయ్యో! కాలిదివిటీయైన లేదయ్యె(గదా!' యనుకొని చింతిల్లెనట! అది భీమకవి విని నీ వెవ్వండ వని యడుగ "భీమకవిగారిచే జోగి చేయ(బడిన వా(డ" ననె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నట! భీమకవి 'రాజకళింగగంగవా' యనఁగా నాఁతడు కేల్మోడ్చి 'రక్షింపుఁ' డనె నట! అంతట

ఉ॥ వేయుగజంబు లుండఁ బదివేలు తురంగము లుండ నాజిలో
రాయలఁ గెల్చి సజ్జనగరంబునఁ బట్టము గట్టుకో వడిన్
రాయకళింగగంగు కవిరాజభయంకరమూర్తిఁ జూడఁగాఁ
బోయెను మీనమాసమునఁ, బున్నమ వోయినషష్ఠి నాటికిన్.

అని యాశీర్వదించి తిరిగి లబ్ధరాజ్యునిఁ జేసె నట.

ఒక బ్రాహ్మణుని దొడ్డిలోని పేరాముదపాకులు భీమకవి తాలూకు నౌక రొకఁడు మందు కని కోసికొనఁ బోగా నాయింటి బ్రాహ్మణుఁడా నౌకరును బారతో గొట్టెనఁట! ఆ బ్రాహ్మణుఁడడఁగారునట్లు భీమకవి శపించెను.

క॥ కూరడుగము కాయడుగము
నారయఁగా నుల్లి బచ్చలల్ల మడుగ మా
పేరాముదపా కడిగినఁ
బారమ్మునఁ గొట్టె నట్టె బాపడు ద్రెళ్లన్.

అనుగ్రహించి భీమకవి జన్నమాంబ యనునామెకు గండమాలా వ్యాధిని పద్యరచనచేఁ గుదిర్చెనట.

క॥ ఘనరోగంబులబలమా
కనుఁగొనఁగా జన్నమాంబ కర్మపుఫలమా
నినుఁ బ్రార్థించెద వినుమా
మునుకొని యోగండమాల! మునుగకుఁ జనుమా!

కొన్నాళ్ళ కామెమీఁద మరలఁ గోపించి శాపించి మరల నావ్యాధి నామెకే వచ్చునట్లు చేసెనట.

భీమకవి తనశాపానుగ్రహశక్తిమత్త్వమును ప్రశంసించు కొన్న పద్య మిది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీ॥ గడియలోపలఁ దాడి కడఁగి ముత్తునియగాఁ
దిట్టిన మేధావి భట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండిముం డ్లన్నియు
డుల్లఁ దిట్టినకవి మల్లుకంటె
మూఁడుగడెలకుఁ దా మొనసి యతినగండి
పగులఁ దిట్టినకవిభానుకంటె
అఱజాములోపలఁ జెరువునీ ళ్ళింకంగఁ
దిట్టిన బడబాగ్నిభట్టుకంటె

గీ॥ ఉగ్రకోపి నేను నోపుదు శపియింపఁ
గ్రమ్మఱింప శక్తి గలదు నాకు
వట్టిమ్రానఁ జిగురు పుట్టింప గిట్టింప
బిరుదు వేములాడ భీమకవిని.

ఉ॥ రాముని మోఘబాణమును రాజశిఖామణికంటిమంటయున్
భీముగదావిజృంభణ ముపేంద్రునివజ్రముఁ జక్రిచక్రమున్
దామర చూలివ్రాఁతయును దారకవిద్విషు ఘోరశక్తియున్
లేములవాడ భీమకవి లేశము తిట్టును రిత్త వోవునే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనుచరిత్ర

అనాఁడు దిగ్విజయయాత్రలో కృష్ణదేవరాయల వారు విజయవాడలో విడిసి యున్నప్పుడు పెద్దనకూడ వెంట నుండెనఁట. అప్పుడు విజయవాడ విద్వాంసులకు తన మనుచరిత్రమును వినిపించిఁకూడ నుండవచ్చును. కృష్ణదేవరాయలవారు;

కం॥ మనువులలో స్వారోచిష
మనుసంభవ మరయ రసమంచితకథలఁ
విననింపు కలిధ్వంసక
మనఘ! భవచ్చతురరచన కనుకూలంబుఁ.

కావున మార్కండేయ పురాణోక్తప్రకారంబునఁ దానిఁదన కంకితముగా, జేయుఁ డనిరఁట!

ప్రపత్తిపరుఁ డయినపెద్దన కలిధ్వంసకము కానికథను చెప్పఁడుకదా!

ఇప్పుడు దొరకుట లేదు గాని శఠకోపయతి కర్పితముగ 'హరికథాసార' మని మఱియొక గ్రంథమును పెద్దన రచించినాఁడు. షట్చక్రవర్తుల, అష్టవసువుల, చతుర్దశమనువుల, షోడశమహారాజుల చరిత్రలు కలిధ్వంసకము లని పురాణోక్తి.

ఈ మనుచరిత్రలో కడపటిపట్టున స్వారోచిషమనువు పుట్టుక గలదు. గనుక దానితో ననుబంధము గల ప్రబంధ మంతయు కలిధ్వంసకమే యగును గదా యని పెద్దన తన మనమును సమాధానపఱచుకొని యుండును.

కాని యథార్థమున కీకథ కలి యనెడి గంధర్వుని ధ్వంసము చేసినది గనుక కలిధ్వంసక మని చెప్పుకొనుట యుక్తము.

మనుచరిత్రలో వరూధినికై తలమార్చుకొని, దొంగ వేషము వేసికొనినగంధర్వునిపేరు కలి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మేఘసందేశము కాళిదాసు యక్ష ననామధేయునిగాఁ జేసినట్లే మను చరిత్రమునఁ బెద్దన్న కూడ గంధర్వు ననామధేయునిఁ జేసినాడు. 'కలి' యన్న పేరు పేర్కొనలేదు.

ప్రధానముగ వరూధినీప్రవరుల సమాగమ కథను హృదయమున నుంచుకొనియే రాయలవారు పయి విధముగ మను చరిత్రము రససమంచిత కథలలో నున్న దనియు, కలిధ్వంసకమనియు, పెద్దన్న చతురరచన కను కూల మయిన దనియు పలికి యుందురు.

రాయలవారి కోర్కి గావుననే పెద్దనామాత్యుఁడు, స్వారోచిషమను సంభవకథను గ్రంథము కట్టకడపట నెక్కడనో రెండు ముక్కలలో నెత్తు కొని ముగించినప్పటికిని, వారి యవ్వా తాతల కథను మాత్రము-అనఁగా వరూధినీప్రవరుల, వరూధినీ గంధర్వుల కథను-మూఁడాశ్వాసముల పైదాఁకఁ బెంచి ప్రబంధీకరించినాడు.

నేఁడు మనుచరిత్ర మనఁబడునీప్రబంధమునఁ దొలి నాలుగయి దాశ్వాసముల రచనను స్వరోచిస్సంభవ మనియు, నా తరువాత నాఱవ యశ్వాసము తుదిదాఁకఁ గల, రచనను స్వారోచిష సంభవ మనియు వేర్ప ఱచి రెండు ప్రబంధములుగా నేను పేర్కొందును. రెండుప్రబంధములను రాయల కంకితముగా నొక కృత్యవతరణికతో నొక సంపుటముగా సంధా నించినాడు గనుక మొత్తము సంపుటమును మనుచరిత్రమని పేర్కొను చుందును.

పయిరెండు ప్రబంధముల తీరులు పరిశీలనార్హములే యయినను ప్రస్తుతము నేను తొలి ప్రబంధముగ పరిగణించుచున్న స్వరోచిస్సంభవము గూర్చియు, నందులోని కథారసౌచిత్యమును గూర్చియు మాత్రమే యించుక ప్రపంచింతును.

ఈ కథలో నాయిక వరూధిని, దేవయోని జాతులలో, ననఁగా- గంధర్వ, విద్యాధర, యక్ష కిన్నర, కింపురుషాదులలో నొక టయిన యప్సరోజాతిపడుచు, అప్సరసలు దేవ వేశ్యలు, వారికిఁ బద్మసంభవ, వైకుంఠ భర్గ, దేవేంద్ర సభలు సంగీత నాట్య విద్యల సాముగరిడీలు. కామకలావిలాసములు వెన్నతో నేర్పిన విన్నాణములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గంధర్వ విద్యాధరాదులతోడనే కాక భువినుండి దివికి విచ్చేసెడి జ్యోతిష్టోమాది యాజులతోఁ గూడ శృంగారవిహారములు వీరి కులాచార ధర్మములు. వారు వీ రనుహద్దు లేక అందఱితోడను వినోదించెడివారు గనుక నీ వేశ్యలు సామాన్య వనితలు.

భూలోకమున నెవ్వరైనఁ దీవ్రతపము చేయుచు నింద్ర పదవికే ముప్పు దెచ్చునట్లుండుచో వారి తపమును జెఱుచుటకు దేవేంద్రుఁడు వీరినే ప్రయోగించుచుండును. వీరు నిత్య యౌవనులు. ఎప్పుడును ముప్పదేండ్ల వయోవిలాసముతో నుండువారు. వ్యాధులు, జరామరణాదులు వీరి కుండవు.

ఇట్టి యప్సరసను, వరూధినిని, వీరితోఁ గలసి మెలసి విహరించు జాతిలోనివాఁడే యయినగంధర్వుఁ డొకఁడు కలియనువాఁడు వలచి, తాత్కాలమునకు వలపించుకొన లేక ఉపాయములు వెదుకుచు వెంటా డుచుఁ దంటాలు పడుచుండినాఁడు

ఉ॥ ఒక్కొక్కవేళఁ బద్మముఖి లొల్లమి సేయుదు రొక్కవేళఁ బె
న్మక్కువ నాదరింతురు క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్
పక్కన వేసరం జన దుపాయములం దగు నిచ్చకంబులన్
జక్కగఁ జేసి డాసి సతిచిత్తముఁ బట్టి సుఖింపగాఁ దగున్.

అనుకొనుచుండును.

వరూధిని పురుషముఖ మెఱుగని, వివాహితగాని భారతీయార్యకుల నారీరత్నము కాదు సుమండీ! ఆమె సదా ముప్పదేండ్ల వయస్సదే! కనుక ప్రస్తుత కథాసందర్భమునకు ముందెందఱినో గంధర్వ విద్యాధరాది దివ్య పురుషులను, భువినుండి దివికి విచ్చేసిన శ్రోత్రియులను, వినోదపఱచి వారితో వినోదించినదే! మర్త్యలోకపు, మర్త్యవేషపు శ్రోత్రియులమీఁద మక్కువ రేగినదో యేమో! హిమాలయ పర్వతాగ్రమున దేవిణి వేసియున్నది. హిమాలయము భూలోక స్వర్గలోకముల సంధానస్థలము. దేవయోనుల కక్కడ దేవభూములెన్నియో యున్నవి. వేడ్క పుట్టినప్పు డెల్ల దివ్యు లచట విడిసి విహరించుచుందురు. మన పెద్దలకు కొడైకానల్ ఊటీ సిమ్లాలలో నెట్టి సౌఖ్యపరికరము లుండునో యట్టివే వీరికిని అచట గలవు. ఆ పర్వతాగ్రముల కప్పడప్పుడు సిద్ధపురుషులు, మహాయోగులు మొదలగువారు, భూలోకవాసులును వెళ్లఁగలుగుచుందురు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రహచారము చాలియో చాలకయో యార్యావర్తమున నెచ్చటనో యున్నయరుణాస్పదపుర వాస్తవ్యుఁ డొకడు శ్రోత్రియ బ్రాహ్మణ కుమారుఁడు ప్రవరాఖ్యుడు పాదలేపము లభింపఁగనే వెనుకముందులు చూచుకొనక, ఫ్రీ టిక్కట్టు దొఱికినదే తడవుగా రైలు ప్రయాణమునకు సిద్ధపడు నాత్రగానివలె, హిమాలయమును దర్శింపఁ బోయినాడు! పాదలేపము కరఁగిపోగా నప్రయోజకుఁడై దిగులుపడుచు వరూధిని యుండిన కోనలోనికేగినాఁడు.

వరూధినికి వంటయింటిలోఁ గుందేలు చిక్కినట్లైనది. ఆకలి గొన్న మాంసాహారి వంటయింటి కుందేటిని విడువనట్లే వరూధిని ప్రవరునివలపు జూపులవలలోఁ జిక్కించుకొని దక్కించుకో దంటాలు పడినది. తన వలపు పొలుపులు దులపరించినది. తుటారించినది. మిటారించినది. అదరించినది. బెదిరించినది. ప్రార్థించినది. పైఁబడినది. కౌగిలిపట్టుగఁ బట్టుకొనినది. వెన్నతోఁదినిన విద్యనంతయు గ్రక్కినది. వెక్కి వెక్కి యేడ్చినది. ఏమిచేసినను నెంత యేడ్చినను లాభము లేకపోయెను.

ప్రవరుఁడు గురువులయొద్ద నేర్చినసదాచార సంపదను నిలువఁ ద్రొక్కుకొనినాఁడు. ఆమె చేష్టలను చీదరించుకొనినాఁడు, బదుళ్లు చెప్పినాఁడు. కౌగలింపగా శ్రీహరీ యని యోరమోమిడి తదీయాంసద్వయం బంటి పో పొమ్మంచుం దొలఁగఁ ద్రోచినాఁడు "అనయా యావజ్జీవం హోష్యామి" అను మాటదక్కించుకొనినాఁడు. తన బ్రహ్మవర్చసమును ప్రజ్వలింపించుకొనినాఁడు. అగ్నిదేవుని నారాధించి, ప్రార్థించి, యాయజ్ఞేశ్వరుని యనుగ్రహముతో నాకాశ మార్గమున నెగసి యరుణాస్పద పురమునకు వెళ్ళిపోయినాఁడు.

వరూధినికిఁ దగినపరాభవ మయినది. గంధర్వునికిఁ దనవలనఁ గలిగినయవమానమే ప్రవరునివలనఁ దనకు దాపురించినది. పొంచి గుర్తించుచుండినగంధర్వుఁ డిదేయదననుకొని ప్రవరవేషమునఁదయారయి వరూధినిని దక్కఁగొన్నాడు. ఈ వేశ్యావిషయికరతిలోని చమత్కారవిశేషమును గుర్తింప జాలనిచో వరూధినీ కథాసారస్యముఁ దెలియఁజాలము. వేశ్యలును దదాసక్తులు నయిననాయికానాయకులు పరస్పర మొకరి కొకరు వశులు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కానిచో దబ్బఱలు, తాటోటులు తబ్బిబ్బులు జరిపి, మోసాలుచేసి, వేషాలు వేసి కార్యము సాధించుకొనుచుందురు. నాయకానాయకులు పొంది పొసఁగుట జరిగిన పిదప తొల్లిటి దుష్కృత్యములు. రసాభాసములు ప్రజ్ఞా ప్రయోగములుగను, రసోత్కర్షాదాయకములుగను మారి సామాజికులలో రససిద్ధిని గల్గించును. ఈ పద్ధతినే గంధర్వుని నడవడి యిచట సమర్థనీయము కాఁగలదు, కాని యిట్లు సమర్థించుటకు గంధర్వుఁడు తన ప్రజ్ఞాప్రయోగములను వరూధినికిఁ దెలియఁ జెప్పి మెప్పుపొందు టత్యావశ్యకము.

ప్రేమ లేనివరూధినిని దొంగవేషము వేసుకొని గంధర్వుఁడు కలసినట్లు కాదు-చెఱచినట్లు వర్ణించుట రోఁత! కాని కొందఱు సహృదయు లీ విషయమున ని ట్లనవచ్చును.

ప్రవరుని మర్యాద, వరూధిని కోరిక, గంధర్వుని బులుపాటము దక్కినది గదా ! ఆ ముప్పురి హృదయములలో నెవ్వరి హృదయములలోను కలుగని రోఁత మీకేల కలుగవలెనండీ! అని.

రసానుభూతి కథాశ్రోతలకుఁ బ్రేక్షకులకు సంబంధించినది గాని కథాపాత్రలకు సంబంధించినది గాదు.

వరూధినికి వాఁడు వేషధారి యయినగంధర్వుఁ డను సంగతి తెలియదు గాని మనకుఁ దెలియును. కనుక యిది రసాభాసమే. రసాభాసమే కాదు- నేటి శిక్షాస్మృతి ప్రకారము కొన్ని యేండ్ల శిక్షకుఁ దగిన క్రిమినల్ కేసు కూడ !

గంధర్వుఁడు కొన్నాళ్ల తరువాత రహస్యము వెల్లడించి వరూధినిచే మెప్పు పొంది సత్కృతుఁడయినాఁ డనియే సరి పుచ్చుకోవలెను. లేనిచో రసాభాసమే ! కథావిధాన మంతయు రోఁతయే!

గంధర్వుఁ డిట్లు తన మాయాకృత్యము వరూధిని ముందఱ వెల్లడించుట సంభవించుచో దాని కామె మెచ్చుకొనుట తటస్థింప దేమో యనెడి సందియము పొడముట సహజమే! ఆమె నిజమునకు ప్రవరునే ప్రేమించినది గాని, యా నాళ్లలో గంధర్వునిఁ బ్రేమింపలేదు. ఆమె మృచ్ఛకటికలోని వసంతసేన వలె గుణానురక్తగఁ బ్రేమించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇచ్చట వరూధిని ప్రవరుఁని బ్రేమించినాళ్లలో దదేకానురక్తగాఁ బతి వ్రతగానే వర్ధిల్లినది. అయినను నామె మాయా ప్రవరుఁడు మాయమైన తరువాత ధర్మశాస్త్రముప్రకారము పండ్రెండేండ్లు ప్రతీక్షించి యాపై భర్తకు శ్రాద్ధము చేసి కల కాలము విధవగానే యుండిపోయిన దనుకొనుట సరికాదు.

ఆమె నిత్యయౌవన గాన కొన్నాళ్ళకు మఱియొకనిఁ బ్రేమించితీరెడిదే అనుకొనక తప్పదుఁ, నిన్నటివఱకు నామెతో మాయావేషమున విహరించిన గంధర్వుఁడు రత్నమువంటి బిడ్డ పుట్టినతరువాత వానినిఁ జేందీయఁ డనియు, వరూధినిపైన తన వలపులవిసురును-నందామె చిక్కుపడుటను దెలిపియుండఁ డనియుఁ దలఁచుట సరికాదు.

నే నిట్లందును. వరూధిని యా గంధర్వుని ముం దెన్నడెఱుగనిది గాదు. ఇట్టి వారి నెందఱినో యింతకుముందు బుట్టను బెట్టినదే! గంధర్వుఁడుకూడ నిట్టి కుచోద్యము లెన్నియో చేసి యెందఱినో దక్కఁగొనినవాఁడే! ఇట్టి వారికి సంబంధించి యుండును గనుకనే యాలంకారికులు కొందఱు వేశ్య సామాన్యవనిత యనియు, నామెకు సంబంధించిన శృంగారము రసాభాసమే కాని శృంగారము కా దనియు నందురు. అది కాదని వేశ్యలను విడనాడిన శృంగారరసమునకుఁ బరిపోషమే కలుగ దనియు, వారు శృంగారసర్వస్వ మనియు మఱి కొంద ఱాలంకారికులు దానిని ప్రతిఘటింతురు.

గంధర్వుఁడు మాయాప్రవరుఁడుగా మాయమైనను వరూధిని వంటి పట్టి యున్నాఁడనియు, నామె ప్రసవించి స్వరోచి కొన్ని నెలలో యేండ్లో పెరిగిన తరువాత ప్రవరుని రాక కెదురు చూచి చూచి చీకాకుపడుస్థితికి వరూధినిని రప్పించి తన పంతమును చెలికత్తెలకుఁ జెప్పి, వరూధినికి! జెప్పించి, ప్రవరునిపై సన్నగఁ దాసు జెప్పి, ఛీ! ఛీ! పో నాతో! గూడినవాఁడు నిజప్రవరుఁడే యనీ యామె తిరస్కరింపఁగా తిరస్క రింపగా, తాను మాయావేషమునఁ గలసి యున్ననాళ్లలోనే ముందు జాగ్రత్త పఱచి వ్రాసి యుంచుకొనినయేకాంత రహస్యముల డైరీని వెల్లడించి, వీల గుచో ననలు ప్రవరుఁడే యబద్ధమనియు నది యంతయుఁ దన వేషమే ననియుఁ జెప్పి తమ పరస్పర ప్రేమ సాక్ష్య మయినకుమారుని స్వరోచిని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గౌగలించుకొని (ఆ కుమారుడును శృంగారలోలుడై, గంధర్వుని సంతానమే సుమా యనిపించుకొనినా(డు గాని ప్రవరుని బిడ్డ(డనిపించుకొనలేదు.) వరూధిని నబ్బురపుచ్చి, తన నేర్మిని మెప్పించి ద్విగుణీకృతప్రేమతో మరల వరూధినీసన్మానమున వర్ధిల్లినా(డనుకొనినచో వరూధినీప్రవరకథ రసాభాసాత్మకమై రో(త గొల్పును.

పెద్దనగా రీసందర్భము నీవిధముగ నిర్వహింపక పోయినను సూచనగా నైన నిట్టితీరున దెల్పియుండవచ్చును. తెల్పకపోయినను మన మట్టి కథను గట్టుకొనుట కవకాశ మేని(గల్పించియుండవచ్చును.

కాని, మాయమై పోవుసమయమున మాయాప్రవరుని తల(పుల నీవిధముగ(దానే విప్పి చెప్పి తంటా తెచ్చినా(డు !

క॥ అంత వియచ్చరు డభిమత
మంతయు నమకూఱుటయును నచ్చర గర్భ
శ్రాంత యగుటయును కను(గొని
యింతట నిచ్చోటు వదల కే ని(క నున్నన్.

క॥ వంచన యెఱిగిన సుఱి శపి
యించునొ సురకాంత చెప్ప కే(గిన(బ్రేమం
బంచశర శరపరంపర(
బంచత ప్రాపించి మీ(ద(బాపంబిడునో.

వ. అని వితర్కించి యక్కపటవిప్రుం డెఱింగించి యనిపించుకొనియ పోవువా(డై ....

ఏవేవో ప్రలాపించినాడు. ఆ యనినవన్నియు వట్టి యబద్ధములే! అబద్ధములే కాక మోసపునీతివాదములు కూడ ! అమరు(డై గంధర్వు(డమరకాంత యైనవరూధినికి, 'బంచత' ప్రాపించునేమో యనుకొనుట విరుద్ధము. (వియచ్చరు(డని వాక్యమున(గర్తృపద ముండగా మరల 'కపటవిప్రు(' డనుట యనిన్వతముగనున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ విధమున ప్రవరవేషధారి యయినగంధర్వుని యంతరంగపుఁ దలపులను వెల్లడించుట శ్రోతల హృదయములలో నిష్పన్న మయ్యెడి శృంగారరసమును జెఱుచుట యనిపించినది.

వరూధినికిఁ బ్రవరునియందే గాని గంధర్వునియం దను రాగము లేదు. నిజప్రవరునికిఁ దన సోమిదమ్మయందే గాని వరూధినియం దనురాగము లేదు.

"యాం చింతయామి సతతం మయి సా విరక్తా
సా చాన్య మిచ్ఛతి జనం సజనో న్యరక్తః
అస్మత్కృతే చ పరితప్యతి కాచి దన్యా
ధిక్తాంచ తం చ మదనం చ ఇమాం చ మాంచ."

అనినభర్తృహరి సుభాషిత మిచ్చట సరిపోవును.

ఈ విషయ మిట్లుండినప్పటికిని వరూధినీ ప్రవర సంవాద ఘట్టమునఁ బెద్దన నిర్వహించిన నెఱజాణతనపుఁగవన మాంధ్ర సారస్వతమంతకు నద్వితీయ మయినది.

పెద్దనగారు శృంగారధర్మవీరముల కనుఁడు శృంగార శాంతముల కనుఁడు, ఎట్లన్నను నిక్కడ నడిపించినపోరాటము, యుక్తిప్రయుక్తులు, రచనాచమత్కారము, శయ్యాసౌభాగ్యము, భాషాసౌందర్యము నిస్సామాన్యమయినవి. కృష్ణ రాయలవంటి మహారాజు దగ్గఱనుండి, నేఁటి తెలుగు సహృదయు లందఱిదాఁక నీ రచనాఘట్టము పెద్దన్నగారిపై నఖండ గౌరవమును, మనుచరిత్రకు నఖండప్రఖ్యాతిని గల్పించినది.

ఈ కథ కల్పించిన రసపారవశ్యమున, నాఁటినుండి నేఁటి దాక సహృదయ ప్రపంచము దానిలోని లోపములను వేనిని వెదకి పట్టుప్రయత్నము సేయలేని దయినది.

వరూధినీ కామాగ్నిలో మైనమై కరఁగి పోక వజ్రహృదయుఁడై నిలిచి శీలరక్షణ చేసికొన్నప్రవరుని మహనీయతను ప్రజ్వరిల్లఁ జేయుటలో పెద్దన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిర్వహించిననెఱజాణతను మాంధ్ర సారస్వతమున మఱి యన్యత్ర దొరక నిడి. అద్భుతమైనది.

ఈ కథా ఘట్టమే రాయలసభలోఁ, బెద్దన నష్టదిగ్గజములలోఁ, దూర్పు దిగ్గజముగాఁ గావించినది. అగ్రహారము లిప్పించినది. రాయలరాజ్యములోఁ గడలూరి గవర్నరుగాఁ జేసినది.

మనుచరిత్రను దెలుఁగురసికు లందఱుఁ జదువుచునే యుందురు. నాల్గశ్వాసముల దాఁకనే; నూటికిఁ బదిమందియైనను దరువాత కథను జదువరు చదివినను వరూథినీ గంధర్వ సమాగమము మరల నెక్కడనయినను రాఁగల దేమోచూత మనునాశతోఁ జదువుచుందురు.

పయి విషయములే గాక, పెద్దన్న కవిత్వరచననుగూర్చి చెప్పిన యుత్పలమాలిక, కృష్ణరాయ నిర్యాణానంతరము చెప్పిన సీసపద్యములు రెండు, మఱికొన్ని పెద్దన చాటుపద్యములు నాంధ్రసారస్వత మున్నంతదాఁక నిలిచి యుండఁగలవు.

పెద్దన్న సీసపద్యము నొకటిమాత్ర మిచ్చుటఁ జదివి యాయన ఘనతను స్మరింపుఁడు:-

సీ॥ ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూత యొసఁగి యెక్కించుకొనియె
బిరు దైనకవిగండ పెండేరమునఁ గీవె
తగు దని తానె పాదమునఁ దొడిగె.
మనుచరిత్రం బందుకొనువేళఁ బుర మేఁగఁ
బల్లకిఁ దన కేలఁ బట్టి యెత్తె
కోకటగ్రామా ద్య నేకాగ్రహారంబు
లడిగినసీమలయందు నిచ్చె

గీ॥ నాంధ్రకవితాపితామహ యల్లసాని
పెద్దనకవీంద్ర యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగఁ లేక
బ్రతికి యున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్నమయ్య

ప్రజలలో హృదయపరిపాకము చాలఁగా నేర్పడినప్పుడే కవిత్వము, సంగీతము, శిల్పము మొదలయిన సుకుమారకళల సారస్యమును గుర్తించుట జరుగును. క్రూరహృదయులు సుకుమారకళల గుర్తింపలేరు. వానిని రక్షింపను లేరు. జాతిద్వేషము మతద్వేషము మొదలయినవి చెలరేగినపుడు వీనికి వినాశము తప్ప నభ్యుదయ ముండదు. పయికారణములవలన క్రీ. 1565 నాఁడు ఆంధ్రదేశమున సంగీతకళ విధ్వస్త ప్రాయ మయినను నంతకు నూఱేండ్లకుఁ బూర్వ మా కళకుఁ బ్రాణము పోసినమహనీయులఁగూర్చి యించుక ముచ్చటింతము.

అది యాంధ్రదేశమున శ్రీనాథుడు, పోతరాజు భవ్యకవితలు వెలయించిన బంగారుకాలము. ఆకాలమున నఁగా క్రీ. 15 శతాబ్ది ప్రథమపాదమున తాళ్ళపాక అన్నమయ్య యను భక్తశిఖామణి కడప మండలము తాళ్ళపాక గ్రామములో నందవరీకస్మార్త బ్రాహ్మణకుటుంబమున నవతరించినాఁడు. అతనికిఁ బదునాఱవయేట శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై వరకవితావైభవముఁ బ్రసాదించినాఁడఁట! ఆనాటినుండియు నాతఁడు దినమున కొక్కసంకీర్తనకుఁ దక్కువ కానట్లు డెబ్బది తొమ్మిదేండ్లదాఁక సంకీర్తనములు గావించుచుండెను.

తాను జన్మచే స్మార్తబ్రాహ్మణుఁడైనను విశిష్టాద్వైతమతసామర్థ్యమునకు, వర్చావతారవైభవమునకు, శరణాగతిమాధుర్యమునకు, శ్రీ వేంకటేశ్వరమాహాత్మ్యమునకు లోపడి యహోబలమఠాధీశ్వరు డయిన ఆదివన్ శఠకోపయతిశిష్యుఁడై వైష్ణవమతమును స్వీకరించినాఁడు పరాంకుశయతి ప్రభృతులు ద్రవిడ వేదాంతమును వెలయించినట్లుగానాళ్వార్ల సంప్రదాయమును జక్కగా ననువర్తించి యుపనిషదర్థప్రతిపాదనములతో స్వానుభవ నివేదనములతో, నవరనిభాషతో, నరసనంగీతకలావిలానములతో నర్వసులభముగా సంకీర్తనాత్మకముగా సంధ్రవేదాంతము నవతరింపఁజేసినాఁడు. ఇప్పుడవి యన్నియు దొరకుట లేదుగాని యాతఁడు ముప్పదిరెండు వేల సంకీర్తనములు గావించినాఁడఁట. స్వామి నొక సంకీర్తనలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నే నొకండ లేకుండితే నీ కృపకు పాత్ర మేది
పూని నావల్ల నే కీర్తి పొందేవు నీవు"

అని హెచ్చరించినాఁడు. ఈతని శృంగారసంకీర్తనాంశ మిన్నూరేండ్ల తర్వాత క్షేత్రయగాను, అధ్యాత్మ సంకీర్తనాంశ మటుతర్వాత నూఱేండ్లకు త్యాగయ్య గాను నవతరించె ననఁ జెల్లును.

అన్నమయ్య బాల్యమున విద్యానగరసామ్రాజ్యమును సాళ్వనరసింగ రాయఁ డాక్రమించుకొను ప్రయత్నమున నుండినాఁడు. అన్నమయ సహాయము గొని వేంకటేశ్వరస్వామిదయతోఁ గొన్నియేండ్ల ప్రయత్నముమీఁద నాతఁడు కృతార్థుఁ డైనాఁడు. అన్నమయ్య నందలా లెక్కించి యసాధారణ వైభవము ననుభవింపఁ జేసినాఁడు. రాయఁ డొకనాఁ డన్నమాచార్యుని స్వామి మీఁద శృంగార సంకీర్తనములు పాడఁగోరెను. అన్నమయ పాడెను.

నాద నామ క్రియ

పల్లవి

ఏమొకో చిగురుటధరమున యెడనెడ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసినపత్రిక కాదు గదా
కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటినయాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా॥ ఏమొ॥

అన్నమాచార్య చరిత్ర పీఠిక 51 పుట

ఇట్టి కీర్తనలు తనపైఁ గూడఁ జెప్పఁగోరెను. అన్నమయ యసహ్యపడెను. కోపించి రాయఁ డన్నమయకు సంకెళ్ల వేయించెను. పాటలు పాడి యన్నమయ సంకెళ్ళు విడఁగొట్టుకొనెను. రాయఁ డన్నమయ మహాత్మ్యమున కచ్చెరువడి శరణాగతుఁ డయ్యెను. అన్నమయ క్రీ. 1507 దుందుభి ఫాల్గున బహుళ ద్వాదశినాఁడు దివ్యధామ మందినాఁడు. ఆనాఁడు తండ్రినిగూర్చి పెదతిరుమలాచార్యుఁడు చెప్పిన సంకీర్తనము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీరాగము

హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురుం డితం డన్నమయ్య ॥పల్లవి॥
వైకుంఠనాథునివద్ద వడిఁ బాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య
ఆకసపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥
క్షీరాబ్ధిశాయి నిట్టె సేవింపుచున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు
ఆ రీతులఁ దాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥
ఈవల సంసారలీల నిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య
భావింప శ్రీ వేంకటేశు పాదములందె వున్నవాఁడు
హావభావమై తాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥

అన్నమాచార్య చరిత్ర పీఠిక 75 పుట

మఱి తర్వాతవత్సరములలో నాతని తీర్థదినమునాఁడు చెప్పిన సంకీర్తనము.

శ్రీరాగము

దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు
జనకుండ! అన్నమాచార్య! విచ్చేయవే ॥పల్లవి॥

అనంతగరుడముఖ్యు లయిన సూరిజనులతో
ఘన నారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే ॥దిన॥
వైకుంఠాననుండి యాళువారలలోపలనుండి
లోకపునిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుఁ గూడి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈకడ నారగించ నింటికి విచ్చేయవే ॥దిన॥

సంకీర్తనము తోడ సనకాదు లెల్లఁ బాడ

పొంకపు శ్రీ వెంకటాద్రిభూమి నుండి

లంకె శ్రీ వెంకటగిరి లక్ష్మీవిభుఁడ నీవు

అంకెల మాయింట విందు లారగించలే ॥దిన॥

అన్నమాచార్యచరిత్ర పీఠిక 130 పుట

అన్నమయసంకీర్తనములు రాగిరేకులపైఁ జెక్కి దేవస్థానమున దాఁచినారు. క్రీ. 1565 లో విద్యానగర వినాశముచేఁ దిరుపతి దేవస్థానవైభవము తికమకలై తాళ్ళపాకవారి ప్రాభవము తార్మారై వారిసంకీర్తన ప్రఖ్యాతి సమసిపోయినది. కొంతకాలము చెల్లిపోఁగా మట్లరాజులు మరల స్వామివైభవము సంరక్షింపఁగా క్రీ. 1700 ప్రాంతములయందు మరల రేకెత్తసాఁగినది. అది యిప్పుడిప్పుడే గొప్పగా గుర్తింపనగుచున్నది. అన్నమాచార్యులయు, తత్పుత్రుఁడగు పెదతిరుమలాచార్యులయు విగ్రహములు రాగిలో, రాళ్ళలో మలఁచినవి దొరికినవి. అన్నమాచార్యచరిత్ర మని యన్నమయ పనుమఁడే రచించినగ్రంథము దొరికినది. సంకీర్తనముల ముద్రణము సాగుచున్నది. అన్నమయసంకీర్తనముల ప్రఖ్యాతికిఁ దాళ్ళపాకవారి వంశకవితాగౌరవములకుఁ దగినట్టు లన్నమాచార్యోత్సవమును దేవస్థానము వారు గొప్ప యుత్సాహముతో సాగించుచున్నారు. గొప్పయాంధ్రగాయకు లందుఁ బాల్గొనుచున్నారు. త్యాగరాజసంకీర్తనలకంటె నన్నూటేండ్ల పూర్వ కాలమునాఁటివి యగు నన్నమాచార్య సంకీర్తనముల నాంధ్రులే జగత్ప్రఖ్యాతికిఁ దేవలసియున్నారు.

పల్లవి, అనుపల్లవి, చరణములు ననువిభాగములతో నేఁడు వ్యవహరింపఁబడు సంకీర్తనముల కన్నమాచార్యుఁడే సృష్టికర్తయఁట ! యతిప్రాసలు గలిగి సమము, అర్థసమము, విషమము ననిము తెఱఁగులపాదములు గలిగి, ప్రతిపదముతుదను నన్నిపదములకు నేకవాక్యత కల్పించు పల్లవి యనుపేరు గల తొలిపదము గలిగి, యాభోగమనుపేరు గలతుదిముద్రాపదము గలిగి, యుద్గ్రాహిహ మేళా పక ధ్రువాక్యలగు నడిమిపదములు గలిగి యొప్పారుగేయమునకు నిబంధమను పే రని యన్నమాచార్యుఁడు పేర్కొన్నాఁడు. రెండుచరణము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లున్నచో, దొలిపదముపేరు పల్లవియనియు, నది యొక్కచరణమే కలదైనచో శిఖాపదమనియు, బల్లవియున్నచో శిఖాపద మక్కరలేదనియు, శిఖాపద మున్నచో బల్లవి యక్కరలేదనియు నన్నమయ చెప్పినాడు. అతని సంకీర్త నము లనేకరాగములలో నున్నవి. పేళ్ళొక్కతీరుననే యున్నను గొన్నిరాగ ముల లక్షణములు చాలమారినవట! అన్నమయ్య పేర్కొన్న రాగములు గొన్ని యిప్పుడు వాడుకలోనే లేవట! ఆయారాగములను సరిగాగుర్తించి యా సంకీర్తనములనుబాడుటకును రాగములను శక్యమయినంత వఱకు సంప్రదాయ ప్రకారము సంరక్షించుటకును నాంధ్రగాయకవర్యులభిలషింతురుగాక!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రెడ్డి రాజులు-ఆంధ్రభాషాసేవ

మ. మహనీయంబుగ నంధ్రభూవలయముం బాలించుచుం బ్రాజ్ఞులై
బహుకావ్యంబులు చెప్పుచున్ మఱియుఁ జెప్పంజేయు చాముష్మిక
స్పృహతో ధర్మము లాచరించుచు జగజ్జేగీయమానంబుగా
నహముల్ పుచ్చినరెడ్డిరాజుల సముద్యత్కీర్తిఁ గీర్తించెదన్.

ఆదికాలమునుండియు నంధ్రవాఙ్మయ భాగ్య భాండాగారమున రెడ్డిఱేండ్లు గొప్ప భాగస్వాము లయి ప్రఖ్యాతి గాంచుచున్నారు. వారి మహనీయతను బదింబదిగా నేను ప్రశంసించుచునేయున్నాను.

ఇప్పటికి ముప్పదియైదేండ్లకు ముందు నే నిర్వదియేండ్ల ప్రాయము వాఁడనయి యుండఁగా చెన్నపురి కరిగితిని. నాఁడు ప్రాచ్యలిఖిత పుస్తక శాలలో గ్రంథసామగ్రిని బరిశీలింపఁ జొచ్చినప్పు డందు 'మెకంజీ లోకల్ రికార్డ్సు' అనుపేర మున్నూటిదాఁకఁ గల దేశచరిత్ర సంపుటములలో నెక్కడఁ బట్టినను రెడ్డిరాజుల దానధర్మములయు, శాసనములయు ప్రశంసలు పుష్కలముగాఁ గానవచ్చెను. మధ్యాంధ్రదేశము-అనఁగా నేఁటి గోదావరి కృష్ణ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప మండలములు-ఆనాఁడు వేదవేదాంగాది విద్యలు నేర్చిన బ్రాహ్మణులతో నిండియుండుటకును; నం దనేకు లగ్రహారికులై సంపత్సమృద్ధు లగుటకును; దుర్గములు, చెఱువులు, కాలువలు, ధర్మవనములు, పాడిపంటలు గలిగి దేశము సుభిక్షమగుటకును: దేవాలయములు నిత్యోత్సవములతోఁ దేజరిల్లుటకును వేయేల నేఁటి తెలుఁగునాటివారి తెలివితేటలకు, నాగరికతకుగూడఁ బదునాలుగు పదునైదు శతాబ్దులలో నూటయేఁబది యేండ్లేయయినను బెంపొందియున్న రెడ్డిమహారాజ్యమొక ప్రధానకారణ మన్న చరిత్రాంశ మా చరిత్రాంశపు సంపుటములలోఁ గరతలామలకముగా గోచరించెను. నేఁడు మధ్యాంధ్ర దేశమున బ్రాహ్మణులు. అన్నవస్త్రములు గలిగి, విద్యావిభవములు గలిగి పలువు రున్నా రనఁగా దీనికి గొప్పకారణ మానాఁడు రెడ్డిరాజులు వీరిపూర్వుల, విద్యావిశేషముల నాదరించి చేసినయగ్రహారాదిసత్కారము అగు ననుట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యథార్థకథనము ! కొండవీటిరెడ్డిరాజులయు, రాజమహేంద్రవర రెడ్డిరాజులయు శాసనములఁ గొన్నింటినేనిఁ జూచినను నీ విషయము వెల్లడి కాఁగలదు. శ్రీనాథుఁ డిట్లు చెప్పినాఁడు.

సీ. ధరయింప నేర్చిరి దర్భవెట్టెడు వ్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీఁదఁ
గస్తూరికాపుండ్రకములు నొసల
నవరింప నేర్చిరి జన్నిదంబుల మ్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చెఱువంగ నేర్చిరి శిఖల నెన్నడుములఁ
గమ్మనిక్రొత్త చెంగల్వవిరులు

గీ. ధామముల వెండియును బైడిఁ దడబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములలోన
వేమభూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీతటమునందు.

—భీమఖండము

శ్రీశైలము, అహోబలము, పంచారామములు మొదలగుపుణ్యస్థలముల వైభవమును రెడ్డిరాజు లెంతో పెంపొందించిరి. మధ్యాంధ్రదేశమున వేద, శ్రౌత, స్మార్తోభయమీమాంసా, తర్క, వ్యాకరణ, సంగీత, సాహిత్య, వైద్య, జ్యోతిషాదిశాస్త్రములకు వారు చాల నభ్యుదయముఁ గూర్చిరి. వారు షట్కాలశివపూజాధురంధరు లయి యాముష్మికవరాయణులయి వెలసిరి. నేఁడును రెడ్డికులమువారిలోఁ బలువురు భాగ్యభరితులు. శీలశోభితులు, త్యాగులు, భోగులు, ప్రతిభాశాలులు, విద్వాంసులు, కవులు వెలయుచున్నారనఁగా దానికి నానాఁటి రెడ్డిరాజేంద్రుల వంశపారంపర్యపు సంస్కారమే ప్రధానకారణ మనుట యసంగతము గాదు. ముప్పదియేండ్లనుండియు నాకీ రెడ్డిరాజ్య వైభవానుస్మరణమున నభిమానము మెండు. ఇట్టి యభిమానము నానాఁడే 'శ్రీనాథ చరిత్ర' రచనా సందర్భమునఁ గొంత దీర్చుకొంటిని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇప్పుడిక్కడ రెడ్డిరాజుల విద్యావిలాసములగూర్చి మాత్రమే కొంత వివరింతును.

గోనబుద్ధారెడ్డిగారు-తత్పుత్రులు

పాల్కురికి సోమనాథునిమూలమున, దెలుఁగున ద్విపదరచనకు విలువ హెచ్చెను. ద్విపదరామాయణమునఁ దత్కర్తలు బుద్ధయ, తత్పుత్రులు కాచయ విఠలు లనియే కలదు. కాని వారి కుల మేదో యందుఁ దెలియ రాదు. వారియింటిపేరు మాత్రము 'గోన' యని యనేక ప్రతులలోను, 'కోన' యని కొలఁది ప్రతులలోను గలదు. వారు రాజ్యము నేలిన యేలిక లగుట గ్రంథమున స్పష్టముగానున్నది. పశ్చిమాంధ్రదేశమున 13,14 శతాబ్దులలో రాచూరుదుర్గ నిర్మాతలై రాజ్య మేలినవారు 'గోన' వంశమువారు రెడ్లు సుప్రఖ్యాతులు. వారి యింటిపేరు 'కోన' యనుట సరికాదు. ఆ నాటి శాసనములం దెల్లవారి యింటిపేరు 'గోన' యనియే కలదు. అనాఁడు "కోన" యింటి పేరువారు క్షత్రియులు కోనసీమ (గోదావరీమండలము) పాలకులు వేఱుగా నున్నారు. గోనపదసంగతి, బుద్ధ కాట విఠ్ఠనామసంగతి *రాచూరుదుర్గనిర్మాత లగు రెడ్డిరాజులకే కలదు. కావున రంగనాథ రామాయణ ప్రసక్తులు రెడ్లే కాని క్షత్రియులు గారని నిశ్చయింప వలెను. ఐతిహ్యమును, నాప్తవాక్యమున్ప్రమాణముగాఁ గొనకున్నచోఁ బ్రాచీన చరిత్ర నిర్మాణము దుష్కరమగును. రంగనాథుఁ డనుకవియే లేఁడని, యతడు కల్పిత పురుషుఁ డని నే ననఁజాలను. బుద్ధారెడ్డిగారును, దత్పుత్రులును వాల్మీకిరామాయణమును దెలుఁగున ద్విపదరచనలో వెలయించి రంటిని. గ్రంథమున గ్రంథకర్తలు బుద్ధభూవిభుఁడును, దత్పుత్రులును ననియే కలదు. కాని దానిని రంగనాథుఁ డనుకవి రచించినట్లు ప్రతీతి. తదనుగుణగాథలు ప్రాచీనములగు వెలుగోటివారివంశచరిత్రైతిహాసిక శిలానగర చరిత్రాదులలో, గూడ నున్నవి. రంగనాథుఁడు కల్పితుఁడు కాకున్నను నాతనితోడ్పాటు గ్రంథ రచనము నందున్నను గ్రంథోత్పత్తికిఁ బై ప్రభువులు కారణమగుట స్పష్టముగదా! పూర్వోత్తరరామాయణములు వేర్వేఱు పురుషుల రచనములుగా

---

*రాచూరుదుర్గనిర్మాణము రెడ్డిరాజులు కావించినదనుట శాసనములఁబట్టియే కాక వింటగా "గోన" కాటారెడ్డిగారికథ" యన్న పదకవితారచనవల్లను దెలియనగును. ఆ కథను రేడియో ప్రసంగమున నేను వెల్లడించితిని.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాకుఁ దోఁపవు తెలుగుననీఁ రెడ్డిరాజులు వెలయించిన ద్విపదరామాయణము ప్రౌఢకవితా రసికులకేగాక పామరజనులకు గూడఁ సాహిత్యానందము సమకూర్చుచు నత్యధికప్రచారము కలదిగా నున్నది. ఆంధ్రరామాయణ ములలో రసపారవశ్యమును గలిగించు రచన మిట్టిది వేఱొకటి లేదు. ప్రాచీనలాక్షణిక కవులందఱును నీ రామాయణప్రయోగములను బరమ ప్రమాణముగాఁ బరిగ్రహించిరి ఆంధ్రప్రజాసామాన్యమును రామాయణ కథామాధురిని నాస్వాదింపఁజేసిన రామాయణ మిదియే.

ప్రోలయ వేమారెడ్డిగారు

వీరు కృష్ణ. గోదావరి, పినాకిని అను నదీత్రయముచే రక్షిత మయిన మధ్యాంధ్రదేశము నేలిన రెడ్డిరాజవంశమునకు మూలపురుషులు. కవిత్రయ ములోని యెఱ్ఱాప్రెగ్గడకవీశ్వరుని నాస్థానకవిగా నాదరించి పోషించిన మహనీయులు, కవిత్రయములోని యెఱ్ఱాప్రెగ్గడ భారతారణ్యపర్వశేషమున' గొన్ని పట్టుల నన్నయరచనకు మెఱుఁగుఁ గూర్చియు, హరివంశమునఁ గొన్నిపట్టులఁ దిక్కనరచనకుఁ జక్కనఁ గూర్చియు నిర్వహించినాఁడు. ఆరణ్యపర్వశేషపూరణమున షష్ఠాశ్వాసమున సైంధవావమాన ఘట్టమును, హరివంశమున శ్రీకృష్ణ బాల్యవిలాసఘట్టమును నా కభిమాన గ్రంథ భాగములు. అనాగరికు లయిన వ్రేపల్లె గొల్లవారియిండ్లలో జగన్మోహన మూర్తి శ్రీకృష్ణమూర్తి యవతరించి బాలక్రీడలును, దివ్యానుభూతులును వెలయించుట, యక్కడి పామరజనుల కందుచేఁ గలిగిన యానందాశ్చర్య సంరంభములు ఎఱ్ఱాప్రెగ్గడవారు చాలఁ జక్కనిత్రీరున దేసితెలుఁగుమఱుఁ గులు వెలయఁగా వ్రేతలయిండ్లలో శ్రీకృష్ణుఁ డారగించినవెన్న మీఁగడ రుచులఁ దలపించుమించురచనతో వెలయించినారు. ఆంధ్రప్రబంధవాఙ్మ యమున నిట్టి రసవద్ఘట్టము మఱియన్యత్ర కానరాదని నానమ్మకము. ప్రోలయ వేమారెడ్డిగారు రామాయణమును నత్యాదరముతో నాలకించు వారఁట!

క. రామాయణహరివంశ
శ్రీ మన్మథురప్రబంధ సేవ ! చిరయశ
స్సామర్థ్య ! నిత్యనిపుణ !
శ్రీమల్లచమూవరేణ్య సేవితహృదయా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందుఁ బేర్కొనఁబడినరామాయణహరివంశములు ఎఱ్ఱాప్రెగ్గడగారు రచియించిన యాంధ్రప్రబంధములే కావచ్చును.

హరివంశరచనకుఁ బూర్వము ప్రోలయవేమారెడ్డిగారికే యంకితముగా మన ప్రబంధపరమేశ్వరుఁడు రచియించిన రామాయణమహాప్రబంధ మీనాఁడు గానరాకుండుట శోచనీయ విషయము.

ప్రోలయ వేమారెడ్డిగారు సాహిత్యముననే గాక సంగీతమునను జాల రసికులు. హరివంశమున నిట్లున్నది.

క. కేళాదిరాయ వితరణ
కేళీనిరపాయ నృత్యగీతకథాలీ
లాలలితోత్సవ నిరతిశ
యాలంకృతభాగ్య సుస్థిరాయుర్భాగ్యా !

వారి యాస్థానమున లొల్లమహాదేవకవి యనియొక విద్వాంసుఁ డుండెను. ఆయననుగూర్చి యావంశమున నేడవ తరమువాఁడు లొల్లలక్ష్మీధరుఁ డిట్లు చెప్పెను.

'యః కరాటవసుంధ ధిప మహాస్థానే సువర్ణాయితో
యో విద్వన్నికషాయితో నృపగృహే వేమాఖ్యపృధ్వీశితుః
శ్రీమల్లొల్ల టభట్టశిష్య ఇతి యో లొల్లాఖ్యయా శ్రూయతే
శ్రీశేషాన్వయశేఖర స్సహి మహాదేవో విపశ్చి న్మహాన్.'

ఈ మహాదేవకవికి లొల్లవా రని యింటిపేరు. భరత మహాముని రచించిన నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానము రచియించిన లొలటభట్టునకు శిష్యుఁడగుటచే వచ్చినదట ! ఇది నిజమేని నాట్యశాస్త్రవ్యాఖ్యాతలొల్లటభట్టు ఆంధ్రుడగుట, అతఁడు గూడ రెడ్డిగారి ప్రాపు గలవాఁ డగుట యనుమానింపఁదగిన దగును. ఈ లొల్లమహాదేవకవివంశమునఁ దర్వాతివా రెల్లరుఁ గూడ మహావిద్వాంసులు. వీరు క్రమముగా రెడ్డిరాజుల యాస్థానమున విద్వాంసులుగా నుండి, తర్వాత వచ్చిన గజపతుల యాస్థానమునను విద్వాంసులుగా నుండి, వారితర్వాత వచ్చిన కృష్ణదేవరాయలవారి యాస్థానమునను విద్వాం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సులుగా నుండిరి. ఈ గజపతులయు కృష్ణరాయలయు నా స్థానమున నున్న లొల్ల లక్ష్మీధరపండితునకును, మహాదేవకవికిని నడుమ నున్న విద్వాంసులు మహాదేవాచార్యుఁడు, లక్ష్మీధరార్యుఁడు, విరించిమిశ్రుఁడు, పురుషోత్తమ మహోపాధ్యాయుఁడు, లక్ష్మణార్యుఁడు, విశ్వనాథ భట్టుఅనువారు రెడ్డి రాజుల యాస్థానముననే యున్నవారగుదురు. వారు సంగీతసాహిత్య పూర్వోత్తర మీమాంసాశాస్త్రములందు గొప్పగ్రంథములు రచియించిరి. వాని పేళ్లివి: భట్టలొల్లట గ్రంథవివరణము, సాహిత్య పారిజాతము, స్మృతి కల్పతరువు, భరతార్ణవపోతము, సాహిత్యమీమాంస, మీమాంసాజీవాతువు, ప్రాభాకరామృత వాహిని, ప్రాభావళీఖండనము, నయవివేకదీపిక యనునవి. ఈవంశమువా రిప్పటికిని సంపన్మహితులై కొల్లూర వెలయుచున్నారు.

హరివంశమున నీప్రోలయవేమారెడ్డిగారిని ఎఱ్ఱాప్రెగడ యిట్లు ప్రస్తుతించినాఁడు.

సీ. అగ్రహారములు విద్యాతపోవృద్ధ వి
ప్రులం కిచ్చి యజ్ఞకర్తలుగ మనిచెఁ
గొమరారఁ జెఱువులు గుళ్ళు ప్రతిష్ఠించి
లోకసంభావ్యంబులుగ నొనర్చె
నిధులు నల్లిండ్లును నిలిపెఁ దోఁటలు సత్ర
ములు చల్వపందిరుల్ వెలయఁబెట్టె
హేమాద్రిపరికీర్తి తామిత వ్రతదాన
నివహంబు లన్నియు నిర్వహించెఁ
జేసెఁ జేయుచు నున్నాఁడు సేయ నున్న
వాఁడు పునరుక్తకృతి శుభావలుల నెల్ల
ననఁగ శ్రీ వేమవిభున కయ్యలరు పేర్మి
వశమె వర్ణింపఁ దద్భాగ్యవైభవంబు.

సీ. కేయూరకంకణాకృతిఁ బరాక్రమవిత
రణములు బహుభూషణతల నొంద
ననుకూలగృహిణిచాడ్పున నృపశ్రీ యొద్దఁ
గదలక సకల సౌఖ్యముల నొసగ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నమృత సేవసముచందమునను సద్ధర్మ
తాత్పర్య మధిక మోదంబుఁ బెనుపఁ
గరతలామలక విఖ్యాతి నాతతనీతి
గరిమంబునిజవివేకమున వెలయ

జాహ్నవీప్రవాహముభంగిఁ జరిత మఖిల
భువనపావనపరిపూర్తిఁ బోలువు మిగులఁ
బరఁగు వేమక్ష్మానాథుసాటినృపులు
గలరె యెవ్వారు ధారుణీతలమునందు.

ఎఱ్ఱాప్రెగ్గడగారి దిట యీ క్రిందిపద్యము. చాటువు కాఁబోలును.

ఉ. వీపున మోసెఁ గచ్ఛపము, వెండి భుజంగమరాజు మస్తక
స్థాపితఁ జేసె, నీవు వసుధారమణిన్ బెదకోమటీంద్ర! బా
హాపరిరంభగుంభనముదంచితఁ జేసితి వింత యొప్పు నే
మోపరు లే మెఱుంగుదురు ముగ్ధలతోడివిహారసౌఖ్యముల్.

ఈయన కాలమున మోటుపల్లి యను ప్రాక్సముద్రతీర గ్రామము రేవుపట్టణముగా నుండెడిది. అక్కడి సముద్రపు టవలియొడ్డుననుండి తవాయి (నేఁడు తవాయియే) తరుణాసీరి (నేఁడు తెన్నాసిరమ్) మొదలగు ద్వీపాంతరప్రదేశములనుండి యోడవ్యాపారములు చాల జరుగుచుండెడివి. ఎఱ్ఱాప్రెగడ యిట్లు చెప్పినాఁడు.

శా. "బాహాదర్పమునన్ బ్రతీపధరణీపాలావలిం దోలి యు
త్సాహోదగ్రుఁడు మోటుపల్లి గొని సప్తద్వీపసద్వస్తుసం
దోహంబున్ దనకిచ్చు నెచ్చెలిసముద్రుం బ్రీతిఁ గావించుచున్
మాహాత్మ్యంబు వహించె మల్లరథినీనాథుండు గాఢోద్ధతిన్."

ఈ ప్రోలయవేమారెడ్డిగారు బంధుసముద్రులు. ఎనుబదినాలుగు స్థలములలో దుర్గములను నిర్మించి తన బంధువుల నా యాదుర్గములందు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నెలకొల్పిరి. ముప్పదియాఱగ్రహారముల దానము చేసిరి శ్రీశైలమునకు నహోబల...నకు మెట్లుకట్టించిరి.

అన్నపోతారెడ్డిగారు

ఈయన తండ్రికాలమున రాజధానిగా నున్నయద్దంకిని విడిచి కొండ వీటిని రాధాజానిగా జేసికొని దానిని జాలఁ బెంపొందించినాఁడు.

'కొండవీడుం రాజధానీం సవిచిత్రా మకల్పయత్
దృష్ట్వా త్వ ష్టాపి వైచిత్ర్య మభూ ద్యస్యా స్స విస్మయః'

* * * *

'సోఽన్నపోత నృప స్స్వేన నిర్మితాయాం పురిస్థితః
కుర్వన్ హేమాద్రిదానాని చిరం భువ మపాలయత్.'

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశమును రచించుకాలమున ననపోతారెడ్డిగారు యువ రాజుగా నుండిరి. ఈయన రాజ్యమునకు వచ్చునాఁటి కెఱ్ఱాప్రెగ్గడపుణ్య లోకముల కరిగియుండును. బాలసరస్వతి యనుకవీశ్వరుఁ డీయన యాస్థాన మున విద్యాధికారిగా నుండెను. "అన్నపోతనరేంద్రస్య విద్వాన్ బాలసర స్వతిః" అని యాతఁడు శాసనకృతులందుఁ జెప్పికొనెను. వెన్నెలకంటి యింటి పేరు గలకవీశ్వరు లీయన్నపోతభూపతిపేర నేవో గ్రంథములు రచించిరఁట అవి యేవో దొరకలేదు. "వేమయ యన్నపోతభూజానికి సత్రుబంధము లొసంగిన వెన్నె...కంటి...రిలోన్" అని విష్ణుపురాణకర్త వెన్నెలకంటి సూర్య కవియు, "వెన్నెలకంటి సూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసంపన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్ గొన్న కవీంద్రకుంజరుఁడు" అని జక్కనయు నీవిషయమును బ్రశంసించిరి. ఈ మహారాజు రెడ్డిరాజ్య మును జాలఁబెంపొందించినవాఁడు; చాల యుద్ధములు జరిపి జయము లందిన వాఁడు.

అనవేమారెడ్డిగారు

అనపోతారెడ్డిగారి యనంతర మీయన రాజ్యమునకు వచ్చెను. ఈయన చాల ధర్మాత్ముఁడు. ఈశ్వర భక్తుఁడు. షట్కాలశివపూజాధురంధరుఁడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'అరుణోదయ తపనోదయ
సంగవ మధ్యాహ్న సాయ మర్ధనిశాః
శివపూజా సమయా షట్
ప్రతిదిన మన వేమపార్థి వేంద్రస్య"

అని వర్ణన గలదు. ఈయన యాస్థానమునఁ గొన్నాళ్ళు బాలసరస్వతికవియే విద్యాధికారిగా నుండెను. పిదప త్రిలోచనార్యుఁడను నుద్దండకవి విద్యాధికారిగానుండెను.

"మహానటజటాచ్ఛటానటదమందమందాకినీ
కలక్వణితకంకణవ్రజవిజృంభి వాగుంభనః
కవిః కవికులోద్భవో భువనభవ్యదివ్యోదయ
శ్శివాగమవిశారదో జయతి శారదావల్లభః"

ఈ త్రిలోచనాచార్యుఁడు గొప్ప కవియగుటే కాక శైవాగమవిశారదుఁడు నఁటఁ 'ప్రకాశభారతియోగి' యని పేరు గలవాఁడు ఆంధ్రకవీశ్వరుఁడింకొక్కఁడు గూడ నీయనయాస్థానమున నుండెను. దాక్షారామ భీమేశ్వరాలయమున ననవేమభూపాలుఁడు కట్టించిన గొప్పకట్టడములఁగూర్చి యీ ప్రకాశభారతియోగి మంచి సీసపద్యములతో శాసనకావ్యము రచించినాఁడు. ఈయన కైలాసవాసికాఁగాఁ నొకవిద్వాంసుఁ డిట్లు విలపించినాఁడు.

'భువిసత్యనవేమభూపతీంద్రే విదుషాం జీవన మేవ జీవనమ్
దివిసత్యనవేమ భూపతీంద్రే విదుషాం జీవన మేవ జీవనమ్.'

కొమరగిరిరెడ్డిగారు

అనవేమారెడ్డిగారికిఁ బిదప నాయన యన్న కుమారుఁడు కొమరగిరి రెడ్డి రాజయ్యెను. ఈయన చాల నదృష్టవంతుఁడు. ఏలనఁగా, ఈయనకు మనుతుల్యుండని పొగడ్తగాంచిన ప్రాజ్ఞుఁడు కాటయ వేమారెడ్డి మంత్రిగా నుండెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఆసీ దమాత్యరత్నం కాటయవేమప్రభు సస్య
అతిసురగురుభార్గవమతి రతిభార్గవవిజయవిజయవిఖ్యాతః"
"సింహాసనే నిధాయాసౌ కుమారగిరిభూవరమ్
అతేజయ న్మహాతేజా శ్రీకృష్ణ ఇవ ధర్మజమ్."

—తొత్తరమూడి శాసనము.

శ్రీకృష్ణదేవుఁడు ధర్మరాజునుబోలె కాటయవేమారెడ్డి కొమరగిరిరెడ్డిని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి సర్వాభ్యుదయములను సమకూర్చుచుండువాఁడు. రాజ్యపరిపాలనాతంత్ర మెల్ల కాటయవేమారెడ్డిగారు నిర్వర్తించుచుండఁగా భోగభాగ్యపరాయణులై కొమారగిరిరెడ్డిగారు వసంతోత్సవములతోను, వారాంగనాభినయములతోను గాలము గడపుచుండువారు. వీరికాలమునఁ గొండవీటి రెడ్డిరాజ్యము గొప్పదశలోనుండెను.

"భాగ్యం నామసమగ్ర మీదృశ మతిస్నేహైకపాత్రం మహా
వీరం కాటయవేమ ముద్ధతరిపుధ్వంసే నియుజ్య స్వయమ్
నిత్యం నందతి నర్తనై రభినవైః కాంతై ర్వసంతోత్సవైః
సంతానాభ్యుదయైః కుమారగిరిభూపాలో నృపాలోత్తమః"

ఇచట 'సంతానాభ్యుదయైః, అనుటకు సప్తసంతానముల యభ్యుదయము లని యర్థము చెప్పుకొనవలెను.

కొమరగిరిరెడ్డిగారికి ధర్మపత్నీనిర్విశేషరాలు 'లకుమాదేవి' యను ప్రియురాలుండెడిది. ఆమె కొమరగిరిరెడ్డిగారి కొల్వున వేలతెలుఁగుల నవనవాభినయములు వెలయించుచుండెడిది. అర్థివ్రజమును వేలకొలఁదిగా ధన మొసఁగి యాదరించుచుండెడిది. ఈ లకుమాదేవి వేశ్య కాఁబోలును

"జయతి మహిమా లోకాతీతః కుమారగిరిప్రభో
స్సదసి లకుమాదేవీ యస్య ప్రియాసదృశీ ప్రియా
నవ మభినయా నాట్యార్థానాం తనోతి సహస్రధా
వితరతి బహూ నర్థా నర్థివ్రజాయ సహస్రశః."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొమరగిరిరెడ్డిగారి కాలముననే కొండవీట 'గహరాజసౌధ' మను గొప్పప్రాసాదము నిర్మింపఁబడెను. ఇంతదాఁక నీ సౌధము పెదకోమటి వేమారెడ్డికాలమున వెలయింపఁబడినట్లు తలఁపఁబడుచుండెను. ఈ నడుమఁ గ్రొత్తగా దొరకిన తామ్రశాసనము (ఇవి శ్రీ భావరాజు వెంకటకృష్ణరావు గారిచే ఆంధ్రహిస్టారికల్ రీసర్చి సొసైటీ జర్నల్ లోఁ బ్రకటింపఁబడినవి.) లీ సౌధమును కుమారగిరిరెడ్డిగారే కట్టించి రని తెలుపుచున్నవి. మఱియుఁ, గుమారగిరి రెడ్డిగారు 'వసంతరాజీయ' మనుపేర నాట్యశాస్త్ర గ్రంథము నొకదానిని రచించి రఁట. అది యిప్పుడు కానరాదు.

> "మునీనాం భరతాదీనాం భోజాదీనాం చ భూభుజామ్
> శాస్త్రాణి సమ్య గాలోచ్య నాట్యవేదార్థ వేదినామ్
> ప్రోక్తం వసంతరాజేన కుమారగిరిభూభుజా
> నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం యదుత్తమమ్."

శ్రీనాథుని హరవిలాసమును గృతి నందిన యవచితిప్పయశెట్టి తన చిన్ననాఁట నీకుమారగిరిరెడ్డిగారి ప్రతివర్ష వసంతోత్సవములకు తరుణాసీరి, తవాయి, గోవ, రమణ, పంజార, జలనోగి, హురుమంజి, యాంప, బోట ఇత్యాది ద్వీపాంతరములనుండి తెప్పించిన సుగంధద్రవ్యములను గొండవీటికిఁ గొని వచ్చి సుగంధద్రవ్య భాండారము నెలకొల్పి యమ్మి పోవుచుండెడివాఁడు.

కాటయవేమారెడ్డిగారు

ఈయన కుమారగిరిరెడ్డిగారి సోదరికి భర్త. కాళిదాసీయ మయిన నాటకత్రయమునకుఁ గుమార గిరీయములు అను వ్యాఖ్యానములు రచియించినవాఁడు. ఈ వ్యాఖ్యానములు చాలఁ బ్రసిద్ధము లయినవి.

> 'కుమారగిరిభూనాథో యస్మై విక్రమతోషితః
> ప్రాదా త్ప్రాచీం భువం రాజమహేంద్రనగరీముఖామ్.'

రాజమహేంద్రవరరాజ్యమును కాటయవేమారెడ్డియు, కుమారగిరిరెడ్డికుమారుఁడు అనపోతారెడ్డియు, కాటయవేమారెడ్డియల్లుఁడు వీరభద్రారెడ్డియు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాయన యన్నదమ్ములగు వేమారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డియనువారును గలసి చీకటి చిల్కసముద్రముదాఁక వ్యాపింపఁజేసి పాలించిరి. కొమరగిరి రెడ్డిగారి తుది కాలముననే కొండవీటిరెడ్డిరాజ్యము, రాజమహేంద్రవరరెడ్డి రాజ్యము వేఱుపడెను. కొండవీటిరెడ్డిరాజ్యమునకుఁ బెదకోమటి వేమారెడ్డి రాజయ్యెను.

పెదకోమటి వేమారెడ్డిగారు

ఈ రాజ్యమునకుఁ దొలిపురుషుఁడగు కాజయ వేమారెడ్డిగా రెట్టి జగ ద్గేయకీర్తులో యించుమించుగా కొండవీటిరెడ్డి రాజ్యమునకుఁ దుదివాఁడనఁ దగిన యీ పెదకోమటివేమారెడ్డిగారు కూడ నట్టివారు. ఇంచుమించుగా క్రీ 1404 నుండి 1420 దాఁక నీ మహనీయుఁడు కొండవీటిరెడ్డి రాజ్యము నేలెను. ఈయనకు రాజమహేంద్రవరరెడ్డిరాజ్యము ప్రబలవిరోధిగానుండెను. కాటయవేమారెడ్డివలె నీయన స్వయము గొప్ప విద్వాంసుఁడు కవిసార్వ భౌముఁడయిన శ్రీనాథుని నాస్థానమున విద్యాధికారినిగాఁ జేసికొని పోషిం చిన మహాభాగ్యశాలి ప్రబంధపరమేశ్వరుని, గవిసార్వభౌముని నాస్థాన కవులఁగా నాదరించి పోషించు మహాభాగ్యము ప్రోలయ వేమరెడ్డిగారికిని, నీ పెదకోమటి మారెడ్డిగారికిని జిరకాలము లభించినది. ఈ వేమారెడ్డిగారికి 'సర్వజ్ఞచక్రవర్తి' యని బిరుదు.

"చూడామణి ర్నృపాణాం దుర్మదపరిపంథిశిఖరిదంభోళిః
సర్వజ్ఞ చక్రవర్తీ పెదకోమటి వేమభూపతి ర్జయతి"

ఈ శ్లోకము శ్రీనాథుని శాసనకృతులందే కాక వామన భట్టబాణుని వేమ భూపాలచరితమునఁ గూడఁ గలదు. రాచకొండ దేవరకొండలు రాజధాను లుగాఁ బశ్చిమాంధ్ర దేశము నేలిన రేచర్ల వెలమరాజులకును, గొండవీడు రాజమహేంద్రవరము రాజధానులుగా రాజ్యమేలిన పంటదేనటి రెడ్డి రాజు, లకును ప్రబలవిరోధము. వారొండొరుల మీఱి కీర్తి ప్రతాపయశస్సుల నార్జింప యత్నించిరి. రేచర్ల సింగభూపాలుఁడు సర్వజ్ఞబిరుద మందఁగాఁ గొండవీటిరెడ్డిరాజు మన పెదకోమటివేమారెడ్డి సర్వజ్ఞ చక్రవర్తి బిరుద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మండెను. అక్కడ నొకసింగ భూపాలుఁడు సంగీతరత్నాకర వ్యాఖ్యానమును, రసార్ణవసుధాకరమును, రత్నపాంచాలికను రచింపఁగా మన రెడ్డిగారు సంగీతచింతామణిని, సాహిత్యచింతామణిని, అమరువ్యాఖ్యను, సప్తశతీసారవ్యాఖ్యను, నింకఁ గొన్ని నాటకకృతులను రచియించిరి. విశ్వేశ్వరకవిచంద్రాదులు వెలమరాజులయాస్థానమునఁ గవులుగా నుండఁగా వామనభట్టబాణాదు లిక్కడ నుండిరి. మహనీయుఁడు బమ్మెరపోతన వారియాస్థానమున నుండెను గాని యానిస్పృహుడు నరస్తుతివిముఖుఁడై వారిగౌరవాదరముల నపేక్షింపఁడయ్యెను. మన రెడ్డిగారి యాస్థానమునఁ బోతరాజుగారికిఁ దీసిపోని విఖ్యాతకవీశ్వరుఁడు శ్రీనాథుఁడు విద్యాధికారిపదమున వెలుఁగొందెను. ఇక్కడ నించుక శాఖాచంక్రమణము. వెలుగోటివారివంశమున సింగ భూపాలురు పలువు రున్నారు. అందుఁ గవితాప్రసక్తులు పదునాల్గవశతాబ్ది తుదను, బదునైదవశతాబ్ది మొదలును వర్తిల్లినవా రిర్వురు సింగభూపాలురు. అందుఁ దొలిసింగభూపాలుఁడు రసార్ణవసుధాకరము, రత్నపాంచాలిక మొదలగు గ్రంథములకుఁ గర్త. చమత్కార చంద్రికాకారుఁ డగు విశ్వేశ్వరకవిచంద్రు నాస్థానకవిగా నాదరించినవాఁడు.

ఈతనిఁ మనుమఁడు వేఱొకసింగభూపాలుఁ డున్నాడు. ఈతనికే సర్వజ్ఞుఁ డని బిరుదు. శ్రీనాథకవి సార్వభౌముఁడు, బమ్మెరపోతరాజు నీ సర్వజ్ఞసంగభూపాలునితో సంబంధము గలవారు. ఈ తల్లిదండ్రులు పోచమాన్న పోతభూపాలకులు. వసంతాననీనాథుఁ డీతని తమ్ముఁడు. బమ్మెంపోతరాజు భోగినీదండకము నీతని పేరనే రచించెను, శ్రీనాథుఁడీతనినే దర్శించెను. ఈతఁడు పదునైదవశతాబ్ది మొదటి కాలమువాఁడు.

ఈతని తాత సింగభూపాలుఁడే రసార్ణవసుధాకరాది గ్రంథకర్త. ఆతనికి శ్రీనాథపోతనలతో సంబంధముగల దనుట యప్రామాణికము అతఁ డన్నమాంబాపోతభూపతుల కొడుకు. అతని సోదరుల పేళ్ళు వేఱు. ఇంత విస్పష్టచరిత్రవిషయము నెందుకో కొందఱిప్పుడు తార్మాఱు చేయుచున్నారు.

పెదకోమటివేమారెడ్డిగారి మంత్రియు, శ్రీనాథుని శృంగారనైషధకృతిపతియు నగు మామిడి సింగనమంత్రి సోమసిద్ధాంత మను జ్యోతిషగ్రంథమునకు వ్యాఖ్య రచించెను. పెదకోమటివేమారెడ్డిగా రనేకులకు, జ్యోతిష

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విద్వాంసులకు, గొప్పవైద్యవిద్వాంసులకు యజ్ఞములు చేసిన శ్రోత్రియులకు, శైవాచార్యులకు ననేకగ్రహారములు దానము చేసెను. ఆదానముల కన్నింటి కిని శ్రీనాథకవీశ్వరుఁడు శాసనకావ్యకర్త. వారి వైదుష్యములను శ్రీనాథుఁడే పరీక్షించువాఁడు.

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
వెదఁజల్లినాఁడవు విశదకీర్తి స్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందుఁ
గల్పించినాఁడవు గాఢపాకం బైన
హర్ష నైషధకావ్య మాంధ్రభాష.

ఇవి యెల్ల బెదకోమటివేమారెడ్డిగారి యాస్థానిలో శ్రీనాథుఁడు జరి పిన విద్యాధికారికృత్యములు. 'విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః' అని శాసనకృతులలో నాతఁడు చెప్పుకొన్నాఁడు.

పెదకోమటి వేమారెడ్డి కృతులు : (I) శృంగారదీపిక — ఇది యమ రుశతకమునకు వ్యాఖ్యానము. అమరుశతక వ్యాఖ్యలన్నింటికంటె దీనికే గౌరవము హెచ్చు. రసభావాలంకార నాయికానాయక లక్షణాది విషయ విచారముతో నీ వ్యాఖ్యానము చాల విపులముగా నున్నది. ఇది ముద్రిత మైయి యున్నది. (2) సప్తశతీసారటీక:— రెండు వేలేళ్ళకుముందు హాలుఁ డను నాంధ్రశాతవాహనచక్రవర్తి సంధానించిన "గాథాసప్తశతి" యను నేణ్ణూరు ప్రాకృతగాథలనుండి సారతరము లగునూఱుగాథలను పెదకోమటి వేమారెడ్డిగారు సంగ్రహించి వానికి వ్యాఖ్య రచించిరి. ఈ గ్రంథమింకను ముద్రితము కాలేదు. దీనికొక్క ప్రతిమాత్రమే దొరికినది. అది ఓరియంటల్ లైబ్రరి (ప్రాచ్యలిఖిత పుస్తకశాల)లోఁ గలదు. నూనూగుమీసాల నూత యౌవనమున శ్రీనాథుఁ డీగాథాసప్తశతిని దెనిఁగించినాఁడు. శ్రీనాథున్ని యా బాలగ్రంథ మిపుడు గానరాదు. అది మనరెడ్డిగారి కంకిత మయి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యుండును. (3) సాహిత్యచింతామణి :- ఇది యలంకార శాస్త్రగ్రంథము లలోఁ బేర్కొనఁదగిన యుత్కృష్టగ్రంథము, కావ్య ప్రకాశమువంటిది. ప్రతాపరుద్రీయవ్యాఖ్యాత కుమార స్వామిసోమపీథి దీని నుదాహరించినాఁడు. మహిమభట్టు వ్యక్తివివేకము నిది ఖండించును. ధ్వనికారుని మతమును బరి పోషించును. ఇం దనేకగ్రంథములలోని శ్లోకము లుదాహరింపఁబడినవి. "యథా మమైవ భాణే" యనియు, "యథా మమైవ కావ్యే వీరనారాయణ చరితే" యనియుఁ బెక్కుశ్లోకము లుదాహరింపఁబడినవి. కోమటి వేమా రెడ్డిగారి కృతు లగునాగ్రంథము లిప్పుడు తెలియరావు. (4) సంగీత చింతామణి :— ఈ గ్రంథము తిరువనంతపురమున నున్నది. కవీశ్వరు లీసర్వజ్ఞచక్రవర్తినిట్లు పొగడిరి:

"జ్ఞాతా యది న హి దాతా దాతాచేత్కోఽపి భువి న చ జ్ఞాతా
జ్ఞాతా దాతా చాభూః పెదకోమటి వేమభూపతే చిత్రమ్."
"అర్థిజనచింతితార్థా, దధికం చేత స్తోఽపి తే వాణీ
అస్యా అపి విశతికరః పెదకోమటి వేమభూపతే చిత్రమ్."
"శ్రితపోషణ రిపుశోషణ బుధతోషణ సత్యభాషణాదిగుణాన్
ధత్తే దశరథరామః ప్రా గద్య కలౌ తు కోమటి విభు వేమః"

వామనభట్ట బాణుఁ డను కవీశ్వరుఁడు పెదకోమటి వేమారెడ్డిగారి చరిత్రమునే "వేమభూపాలచరిత్ర" మనుపేర సంస్కృతమున గద్యకావ్య ముగా రచించిరి. శ్రీనాథుఁడేకాఁబోలును పెదకోమటి వేమారెడ్డిగారి మీఁద రచించిన చాటుధారలు పెక్కులు చాటుపద్యమణిమంజరిలోఁ జూడఁదగును.

ఈ కాలముననే కందుకూరు రాజధానిగా రాజ్యమేలుచున్న పిన్న కోమటిరెడ్డిగారి కుమాఁరుడు శివలింగభూపతి హరదత్తాచార్యుఁడు "చతుర్వేద తాత్పర్య సంగ్రహ" మను పేర రచించిన ప్రౌఢ సంస్కృతగ్రంథమునకు వ్యాఖ్య రచియించెను; ఆయన యాస్థానమున నీశ్వరభట్టు అనుగొప్ప విద్వాంసు, డుండెను. ఆయన తోడ్పాటుతో రెడ్డిగా రా గ్రంథమును రచించిరి.

పెదకోమటి వేమారెడ్డిగారితర్వాతఁ ద త్పుత్త్రుఁడు రాచ వేమన మూఁడేండ్లుమాత్రమే రాజ్యమేలెను. అంతటితోఁ గొండవీటిరెడ్డిరాజ్య మంత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మందెను. కాని పెదకోమటి వేమారెడ్డిగారు తాము జీవించియుండఁగానే తమ్ముఁడగు మాచారెడ్డిగారికిఁ గొండపల్లె దుర్గము రాజధానిగాఁ దత్ప్రాంత దేశమును గొంత రాజ్యమేలు కొనఁ బంచి యిచ్చి పంపిరి.

"పెదకోమటిమాచేంద్రో వేధసా నిర్మితో నృపః
ఇతరే తు నృపా స్సర్వే విశ్వామిత్రేణ నిర్మితాః"

అని యీయన పొగడ్త గనెను. ఈ రెడ్డిగారు క్రీ. 1415 సం॥రమునను, దత్పుత్రుఁడు తిప్పయ్యరెడ్డిగారు క్రీ. 1415 సం॥రమునను జేసిన యగ్రహార దానశాసనములున్నవి.

పెదకోమటి మాచారెడ్డిగారు కొండవల్లిలో రాజ్య మేలుచు
"అకలంక సకలభాషా కవితామూర్ధాభిషిక్తాయ
విద్వన్నిరూఢరాజాస్థానసుధాంబోధిపూర్ణచంద్రమసే"
"గద్యశ్రీ బాణకవేః పద్యేఽపి తథైవ కాళిదాసకవేః
....
ఉజ్జ్వలతరాష్ట్రభాషాకవితాసామ్రాజ్యపట్టబంధస్య
పుత్రా యాన్నయసుకవేః శ్రీభారద్వాజగోత్రాయ"
"అనుజేన పాణిబదరీకృతపాణిని ఫణితమార్గేణ
త్రిపురారి సుకవిమణినా సంస్మరయిత్రే న లక్షణం రామమ్"
"పాల్గుమి శ్రీకంఠగురోః పంచాక్షరమంత్రపౌనరుక్తస్య
శిష్యాయ.... ...."

బల్జేపల్లిగ్రామము నగ్రహారముగా నొసఁగెను. తర్వాతి వత్సరమున మాచారెడ్డిగారి కుమారుఁడు తిప్పయ్యడ్డిరెగారు గుడివాడతాలూకాలోఁ బామర్రుదగ్గఱఁ గలయేకమూరు గ్రామమును ప్రతాపరుద్రదేవుని భాండాగారాధిపుఁడగు మల్లనకు మన్మఁడగు బంకమల్లయ యనుబ్రాహ్మణునికి దానము చేసెను. తండ్రికొడుకు లిద్దఱదగ్గఱను నరహరి యనువిద్వాంసుఁ డాస్థాన కవిగానుండెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొండవీటిరెడ్డి రాజ్యముతో పా టీకొండపల్లి రాజ్య విభాగమును జెడిపోయినది. వెలుగోటివెలమరాజులు కొంతభాగమును, విజయనగరరాజ్యము కొంతభాగమును, వేమవీరభద్రా రెడ్లుకొంతభాగమును గొనియుండురు.

వేమవీరభద్రా రెడ్లు

క్రీ 1425 సం. ప్రాంతములఁ గొండవీటిరెడ్డి రాజ్యము కూలిపోఁగా శ్రీనాథుఁ డటుపయి సమృధికాభ్యుదయముతో నున్నరాజమహేంద్రవరరెడ్డి రాజ్యమునకుఁ జేరినాడు. అంతదాఁక శ్రీనాథున కాశ్రయ మయిన పెదకోమటివేమారెడ్డిగారికిఁ ప్రబలశత్రువులై రాజమహేంద్రవరరాజ్యమును బెంపొందించినవారు-కుమారగిరి రెడ్డిగారి కుమారుఁడు అనపోతారెడ్డి, వేమవీరభద్రా రెడ్లతండ్రి అల్లాడరెడ్డి, కాటయవేమరెడ్డి, తత్పుత్రుఁడు కుమారగిరిరెడ్డి-వీ రెల్లరు రాజమహేంద్రవరమున క్రీ. 1390-1420 సంవత్సరముల నడిమికాలమునఁ జనిపోయిరి. రాజమహేంద్రవరరాజ్యము కాటయ వేమారెడ్డిగారి కుమార్తె యగునని తల్లిమూలమునఁ దద్భర్త యగు వీరభద్రా రెడ్డిగారి సంక్రమించెను వీరభద్రారెడ్డిమంత్రి యగు బెండపూఁడి యన్నమంత్రి శ్రీనాథునకు బంధువు. తొల్త శ్రీనాథుఁ డాతని ప్రాపుఁ బడసెను. ఆతని కంకితముగా క్రీ.. 1420 కిఁ దరువాత భీమఖండము రచించెను. ఆకృతియవతరణికలో వేమవీభదారెడ్లను వర్ణించెను. క్రమముగా 1430 తర్వాత శ్రీనాథుడు 'రాజమహేంద్రవరపు' "వీరభద్రారెడ్డి విద్యాంసుఁ" డయ్యెను.

ఈ కాలమున శ్రీనాథునితోపాటు రాజమహేంద్రవరమున నిశ్శంకు కొమ్మనామాత్యుఁ డని మఱొక యాంధ్రకవి యుండెను. అతఁడు వీరభద్రా రెడ్డి తమ్ముఁడగు దొడ్డారెడ్డి కంకితముగా శివలీలావిలాస మను ప్రౌఢప్రబంధము రచించెను.

వీరభద్రారెడ్డిగారి కంకితముగా శ్రీనాథుఁడు కాశీఖండము రచించెను. శ్రీనాథుఁ డాంధ్రకవీశ్వరులలో వింత తీరువాఁడు. అతఁడు తత్పూర్వాంధ్ర కవులుచేయుపురాణాంధ్రీకరణపద్ధతికిఁ జాల మార్పు కల్గించినాఁడు. కాశీ ఖండ భీమఖండపురాణములను దెలిఁగించినను వానిని స్వతంత్ర ప్రబంధ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ములువోలెఁ దెలిఁగించినాఁడు. భీమఖండము గోదావరీతీర దేశ దివ్యవైభవ వర్ణన మనఁదగినది. కాశీఖండము గొప్పపురాణగ్రంథ మయిన నీతఁడు దానఁ దనయిచ్ఛ వచ్చినతీరునఁ గొన్ని క్రొత్తవిషయములఁ జేర్చి కొన్ని మార్చి మూలముతో నంతగా సంబంధము లేనితీరున నతిప్రౌఢ మయినను ప్రబంధ శయ్యతో స్వతంత్ర కృతి యనఁదగినట్టె రచించినాఁడు. తెలుఁగు కాశీఖండము నెవరుగాని కాశీమహాత్మ్య పురాణకథా పరిజ్ఞానమున కయి చదువరు. అది ప్రౌఢాంధ్రకవితాపరిజ్ఞానమున కయి చదువదగిన ప్రబంధమే. ఇట్లే శివరాత్రి మహాత్మ్యమని మఱియొక గ్రంథమును శ్రీనాథుఁడు రచించినాఁడు. ఈశానసంహితలో దానిమూలము నూఱు శ్లోకములు గలది. తెలుఁగుగ్రంథము విచ్చలవిడిగా వర్ణనలతో, శృంగారప్రసక్తులతోఁ బెరిఁగినది. పురాణాంధ్రీకరణమని పేరే గాని శ్రీనాథుని తెలిఁగింపు లాయన యిష్ట ప్రకారము సాగినవే. శ్రీనాథునకుఁ బ్రౌఢకవితాపాకముమీఁదఁ బ్రీతి. తదనుగుణముగా నాఁతడు గ్రంథ గ్రంథిమయ మయినశ్రీ హర్షనైషధమును దెలిగించినాఁడు. ఆయనడెందము మెచ్చిన కవితాసందర్భ మిట్టిది.

"హరచూడాహరిణాంకవక్రతయుఁ గా
లాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢపయోధరస్ఫుటతటీ
పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా
సత్కావ్యముల్ దిక్కులన్
జిరకాలంబు నటించుచుండుఁ గవిరా
జీగేహరంగంబులన్."

ఈయన గ్రంథములలో నెల్లఁ గాశీఖండము పండఁ బాఱిన కవితా రచనాశౌండీర్యము గలది. ఇట్టికవితా వైభవమునకుఁ గారణములను శ్రీనాథుఁ డిట్లు చెప్పుకొన్నాఁడు.

సీ. ఆంధ్రక్షమామండలాఖండలుం డైన
వేమభూపతి కృపావీక్షణంబు
ఘోడెరాయాంక సద్గురురాయభీమేశ్వ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ర స్వామిపద సమారాధనంబు
కమలాద్రినిలయమార్కండేయశివమౌళి
చంద్రాంశునవసుధాసారధార
వేదాద్రినరసింహవిపులవక్షస్స్థలీ
కల్హారమాలికా గంధలహరి
కారణంబులు నుద్బోధకములు గాఁగ
సంభవించినసాహిత్యసౌష్ఠవమున
వీరభద్రేశ్వరుఁ బ్రబంధప్రభునిఁ జేసి
కాశికాఖండముఁ దెనుంగుగా నొనర్తు.

ఈ సాహిత్య సౌష్ఠవకారణములెల్ల శ్రీనాథునకు రాజ మహేంద్రవరమున సమకూరినవే.

ఇట్టి కవితా వైభవముల వెలయఁజేయుచు, సర్వసౌఖ్యముల ననుభవించుచు నించుమించుగా క్రీ 1450 సం॥ దాఁక శ్రీనాథుఁడు రాజమహేంద్రవరమున వర్తిల్లినాఁడు. అంతలో రాజమహేంద్రవరమున వేమ వీరభద్రారెడ్ల రాజ్యమును నంతరించినది.

రఘువంశమున దశరథుఁడు రాజ్యపట్టాభిషిక్తుఁ డగునాఁటనుండి మహామంత్రిగా నుండి దశరథమహారాజుమరణము మొదలుగాఁ దద్వంశ క్లేశముల నెల్ల ననుభవించుచు సుమంత్రుఁడు చిరకాలము జీవించినట్లు, మన శ్రీనాథుఁడును బెదకోమటివేమారెడ్డిగారి రాజ్యలాభమునాఁటినుండి తదాస్థానమున విద్యాధికార్యున్నతోద్యోగము వహించి, కొండవీటిరెడ్డి రాజ్య వైభవములు నమసిపోయినపిదపఁ గూడ జీవించి దీర్ఘ జీవితమును బరువును మోపినట్లు మోపవలసినవాఁ డయ్యె. దాని నిఁక స్మరింపను.

మహావైభవ మనుభవించిన రెడ్డిరాజ్య మిట్లంతరించినను చాఁప చిరిగి చదర లయినట్లు తద్రాజ్యము చెదరులుగాఁ గొన్నిచోట్ల నేఁటికిని వర్ధిల్లుచున్నది. ఆంధ్రాభ్యుదయమునకు వా రెంతో తోడ్పడుచున్నారు. గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దోమకొండ, మునగాల, ఇంకను గుంటూరుమండలమున రావూరు రాజధానిగా విజయనగరరాజులక్రింద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

6836

రాజ్య మేలినవాఁడు, బసవయ రాఘవరెడ్డి వెన్నెలకంటి సూర్యనార్యునిచే, బదునాఱవ శతాబ్ది యారంభమున విష్ణుపురాణమును నాంధ్రీకరింపించెను. ఈ విష్ణుపురాణము శ్రీనాథుని పురాణాంధ్రీకరణ ప్రౌఢిని దలఁపించుచు మూలానుసారముగాఁజాల హృద్యముగా నున్నది.

గోదావరీతీరమున బిక్కవోలు రాజధానిగా రాజ్య మేలిన కామినేని వారు కృతికర్తలై కృతిపతులై యాంధ్రభాషకుఁ జాల నభ్యుదయముఁ గూర్చిరి. పట్టమెట్టసోమనాథకవి కామినేనికామిరెడ్డిగారి కవీశ్వరుఁడై నూతన సంహితాదిగ్రంథముల రచించినాఁడు. ఈమహాకవి రచనము చాల మేలయినది. కామినేని మల్లారెడ్డిగారు షట్చక్రవర్తిచరిత్ర మను ప్రశస్తప్రబంధము రచించిరి. వీరియాస్థానిలోఁ బెక్కుగ్రంథములు వెలసినవి. పదునేడవశతాబ్దిలో నద్దంకిసీమకోని మూగచింతపల్లెలోఁ బుట్టి సర్వాంధ్ర ద్రవిడదేశసంచారియై వేలకొలది యాటవెలఁదులను విజ్ఞుల జిహ్వారంగములపై నాట్యమాడించినపెద్దకవి వేమనపద్యకర్త వేమారెడ్డిగారు రెడ్డిజాతి జగజ్జ్యోతి! సహజ కవితాధారల యూటగడ్డ!

पुस्तकालय
कांगड़ी विश्व

గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దోమకొండ, మునగాలసంస్థానములు పేర్వెలసినకాలమునుండియు నాంధ్రవాఙ్మయాభ్యుదయమునకెంతేని తోడ్పడుచున్నవి. గద్వాలలో ముష్టిపల్లి సోమభూపాలుని కాలమున కాణాద పెద్దసోమయాజి మహాకవియై యధ్యాత్మరామాయణ ముకుందవిలాసాది గ్రంథములఁ బెక్కింటిని రచియించినాఁడు. సోమభూపాలుఁడును సంగీత సాహిత్యచతురుఁడై స్వయము కవియై జయదేవగీత గోవిందము పద్యగేయాత్మకముగాఁ జాలఁజక్కగాఁ దెలిఁగించినాఁడు. గద్వాలసంస్థానమువలెనే ఆత్మకూరు, వనపర్తి, దోమకొండసంస్థానములును గవిపోషణమున, వాఙ్మయరక్షణమున నాఁటికి, నేఁటికిఁ బేర్వెలయుచున్నవి. నేఁడును నైజాం రాష్ట్రమున, రాయలసీమలో, మధ్యాంధ్రదేశమున సుగుణగణ్యు లగు రెడ్డి గృహస్థు లెందఱో గలరు. అందుఁ గవు లెందఱో కలరు. ఆంధ్రాభ్యుదయమునకు నాఁడు నేఁడునుగూడ రెడ్డిసంఘము గొప్పయాలంబమై వెలసినది, వెలయుచున్నది నేఁటికిని నాంధ్రసారస్వతభాగ్యభాండాగారములో రెడ్డికులమువా రొకగొప్ప భాగస్వాము లనియు, రేపటి యాంధ్రాభ్యుదయమునవా రొకముఖ్యనిర్వాహకులై నిలువఁగల రనియు వారియెడ నాకుఁ గల పరితోషమును మరలఁ బ్రశంసించుచున్నాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
Accos on 15.2.71
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar